శ్రీః

శ్రీరామావతారతత్త్వము

మూఁడవప్రకరణము.

ఇయ్యది

కడప మ్యునిసిపల్ హైస్కూలునందుఁ బ్రధానాంధ్రపండితుఁడగు

కావ్యస్మృతితీర్థ

జనమంచి శేషాద్రిశర్మ విరచితము.

SECUNDERABAD. (DN)

చెన్నపురి:

“వావిళ్ల” ముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1932

సర్వస్వామ్యములు గ్రంథకర్తవి.

PRINTED BY
V. RAMASWAMY SASTRULU & SONS,
AT THE 'VAVILLA' PRESS,
MADRAS.—9-1932.—1000.

సువిహితవార్త.

పుణ్యపురుషులారా! పరమేశ్వరానుగ్రహమున శ్రీరామావతారతత్త్వమున మూఁడవప్రకరణము మీసన్నిధిం జేర్పఁగల్గితిని. సాధుజనులయాశీర్వాదఫలమే యిది యని విన్నవించువాఁడను. అయోధ్యాకాండమునఁ బందొమ్మిది సర్గములే యీప్రకరణమునఁ గలవు. అయోధ్యాకాండమే శ్రీరామాయణహృదయమనుట యెల్లరంగీకరించినవిషయము. నాకుంగల యల్పజ్ఞానమునకుం దగినయట్లు విమర్శించితిని. ఆయాయితావులం బరిశీలించునపుడు పెద్దలు నాభావమేమి యని తొలుతం బరికించి పిదపఁ దప్పొప్పుల నెమకందగుదురు. ప్రకృతిపూరుషులు సీతారాములను నాసిద్ధాంతము ననుసరించి యాయాయితావులఁ దదనుగుణముగా నర్థము వ్రాసితి. ఆశబ్దముల కాయర్థము కలదని నే నెఱుంగుదు. నాసిద్ధాంతమనఁగా నాకల్పించినక్రొత్తసిద్ధాంతము కాదు. పెద్దల పాదసేవ చేసి యెఱింగినవిషయమని యర్థము. హరిహరపరమేష్ఠులు తక్కుం గలయింద్రాదులగునిర్జరోత్తములు వారువీరననేల? సృష్టియంతయుఁ బ్రకృతికల్పితము.

"మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరం,
హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే." ౧౦

అన్నగీతావాక్యమే యిందులకుం బ్రమాణము. ఈవాదము నంగీకరింపనివారుండరని నమ్మువాఁడనుగాను. కాని సమస్తము భగవంతుఁడే నడుముకట్టుకొని చేయుచున్నాఁడన్నసిద్ధాంతము ననుసరించి నిర్లిప్తుఁడు, సర్వసాక్షి యనగు నామము లాపరమేశ్వరునకు నిలువఁజాలక యెగిరిపోవును. ప్రకృతి యనఁగా శంకరపత్నియగుపార్వతి యనుభ్రాంతిచేఁ గొందఱు ప్రకృతి యనఁగానే యీసడింతురు. భగవంతునకుఁ బ్రకృతికి నవినాభావసంబంధము కలదు. వారల వేఱుచేయ సాధ్యమే కాదు.

"దైవీహ్యేషాగుణమయీ మమ మాయాదురత్యయా"

అన్నగీతావాక్యము.

"శివశ్శక్త్యాయుక్తోయది భవతి శక్తః ప్రభవితుం,
న చేదేవం దేవో నఖలుకుశలస్స్పందితు మపి."

అన్న శ్రీశంకరభగవత్పాదోక్తియుఁ బైవిషయమును దృఢపఱచుచున్నవి. కావున నావిశ్వాసము ననుసరించి వ్రాసినయర్థములను బెద్దలు విమర్శింప

వలయుం. "అణూనపిగురూకృత్యాలాలయంతి విపశ్చితః" అన్నయట్లు గుణ మేమాత్రముండినను బెద్దలు బహూకరింతు రన్ననమ్మకము నాకుఁ గలదు.

ఈపద్ధతిననుసరించి వ్రాసిన నీయయోధ్యాకాండము నాల్గు ప్రకరణము లగునని తోఁచెడు. పెద్దలయాశీర్వాదము భగవంతు ననుగ్రహము బాగుగా యట్లు కార్యముసాగును. ఈ నాప్రయత్నము నాదరించి కొందరు పోషకులైరి. వారి కెంతయుఁ గృతజ్ఞుఁడను. కడపనగరవాసులు వైశ్యకులాలంకారభూతులగు మ॥ రా॥ శ్రీ, పత్తి రాఘవులుశ్రేష్ఠిగారు పోషకద్రవ్యమునకంటె నెక్కుడు ధనమిచ్చి తోడ్పడిరి. వారికిం గృతజ్ఞుఁడను. అనంతపురమండలమున హిందూపురముచెంతనుండు బేవినహళ్లి యనుగ్రామవాసులు సరసగుణులునగు మ॥ రా॥ శ్రీ, కరణము కృష్ణరావుగారును గుత్తినగరవాసులు సుపాధ్యాయులునగు మ॥ రా॥ శ్రీ, వై. కొండలరావుగారును దమరు పోషకులగుటయేగాక పెక్కండ్రఁ బోషకులఁగాఁ బ్రోత్సహించి యీసత్కార్యమునకు సాయపడిరి. వారలకు శ్రీరామచంద్రమూర్తి యాయురారోగ్యభాగ్యములను బ్రసాదించుఁగాక. నాప్రయత్నమునెల్ల బహూకరించుచు నాకుఁ జేయూఁత నొసంగుచు నాకష్టసుఖములు తమవిగనే భావించుచు నుండువారు మ॥ రా॥ శ్రీ, వావిళ్ల వేంకటేశ్వరశాస్త్రులుగారు. వారుచేయుభాషాసేవ వచింప నలవికానిది. వారికి తన్ముఖమున నాకృతజ్ఞతం దెలుపుకొనుచున్నాఁడను. పరమేశ్వరియుఁ బరమేశ్వరుఁడునగు సీతారామచంద్రులు నామూలమున నీసత్కార్యమును బూర్తిచేయించి భక్తరక్షణపరత్వమును మఱింత ప్రకటింతురుగాక యని త్రికరణశుద్ధిగాఁ బ్రార్థించుచున్నాఁడను. నాయాశయములకుం గినియక సావధానముగాఁ బరిశీలించి నాలక్ష్యమేదియని యెఱింగి నాకుఁ దెలుపఁదగువిషయములఁ దెలిపి శిష్యవాత్సల్యము నెఱపఁ బండితులఁ బ్రార్థించువాఁడను. ఇంతకంటెఁ దెలుపఁదగువిశేషాంశములు లేవు. ప్రమాదములు క్షమింపఁ బ్రార్థింపకయు పండితు లప్పనియందు బద్ధకంకణులుఁగదా.

ఇట్లు, విన్నవించు భక్తపాదసేవకుఁడను

జనమంచి శేషాద్రిశర్మ.

శ్రీ. శ్రీ. శ్రీ.

ఉద్ధారకులు

ఆనరబుల్ దివాన్‌బహాదూర్ బి. మునుస్వామినాయుడుగారు,
బి. ఏ. బి. యల్., ప్రధానమంత్రిగారు, మదరాసు.

మ-రా-శ్రీ, ముదిపల్లి సూర్యనారాయణమూర్తిగారు, ఆరవిల్లి, ప॥ గోదావరి.

,, అయ్యగారిబుస్సెట్టిగారు, కణేకల్లు, బళ్లారి.

పోషకులు.

మ-రా-శ్రీ, బొగ్యనప్రగడ లక్ష్మీనారాయణరావుగారు, బి. ఏ., బి. ఇ.,
ఇంజనీయర్‌గారు, గుంటూరు.

,, దేవిరాజు రామారావుగారు, ప్రాతగుంటూరు.

,, ఏ. టి. బి. ఆర్. నరసింహస్వామిగారు, ఉపాధ్యాయులు,

,, నోరి శ్రీరామమూర్తిగారు. [దొమ్మేరు, ప॥ గోదావరి.

,, సుంకర సుబ్బయ్యగారు.

,, కలగ నరసింహముగారు, కొవ్వూరు.

,, నరసింహదేవర వేంకటశాస్త్రులుగారు, దొమ్మేరు.

,, పైడా రామకృష్ణయ్యగారు, జమీందారులు కాకినాడ.

,, బొమ్మిసెట్టి లక్ష్మీనరసింహస్వామిగారు, నెల్లూరు.

,, వెలంపల్లి రామకృష్ణమ్మశాస్త్రిగారు.

,, పత్తి గురుమూర్తిశాస్త్రిగారు, నెల్లూరు.

,, దరిమడుగు వెలమయ్యగారు.

,, కోట వేంకటరామయ్యసెట్టిగారు.

,, బచ్చుచంద్రశాలిగారు, ముసునూరువారిపాలెము.

,, అల్లాడి జగన్నాథశాస్త్రులుగారు బి. ఏ, ఎల్. టి. హెడ్‌మాష్టరుగారు, బి. ఆర్. హైస్కూలు, వేంకటగిరి.

,, పత్తి రాఘవులుశాస్త్రిగారు, కడప.

,, జంగా లక్ష్మీనరసింహశాస్త్రులుగారు, ఉపాధ్యాయులు.

,, గుమ్మలపల్లి శేషప్పగారు.

,, శాస్త్రిపాటి చలపతిరావుగారు, సిద్ధవటము.

,, దేవరకొండ సుబ్రహ్మణ్యముగారు, ఉపాధ్యాయులు, పాటూరు.

,, షణ్ముఖము శ్రీనివాసులునాయరుగారు, ఇంగ్లీషు హెడ్ అకౌంటెంటు, కడప.

మ-రా-శ్రీ, పుట్టంరెడ్డి చెలమారెడ్డిగారు, పంచాయతిప్రెసిడెంటు, మండపంపల్లి

,, ఆకేపాటి తిరుమలరెడ్డిగారు తా॥ బో॥ మెంబర్, గ్రామమునిసిఫ్, పెందలూరు.

,, పులిగండ్ల చెంగయ్యగారు, నాజర్, మునిసిఫ్ కోర్టు, పెందలూరు.

,, యాదాళ్ల బాలసుబ్బయ్యశ్రేష్ఠిగారు, బెనుసుపల్లి.

,, నిట్టూరు లక్ష్మీనారాయణరావుగారు, బి. ఏ., ప్లీడరు, గుత్తి.

,, సిద్ధవరము వేంకటసుబ్బయ్యగారు, బి. ఏ., ప్లీడర్.

,, వి॥ కొప్రేశాచార్యులుగారు, బి. ఏ. బి. ఇ. డి, ఉపాధ్యాయులు.

,, ఆర్కాటు వెంకోబరావుగారు, పెన్షనర్.

,, యన్. సుబ్బరావుగారు, బి. ఏ., ప్లీడర్.

,, ఉప్పర్లపల్లె రంగాచార్యులుగారు, పండితులు.

,, వై. కొండలరావుగారు, ఉపాధ్యాయులు.

,, ఓ. ఐ. శౌరిరెడ్డిగారు, ఎమ్. ఏ. బి. యల్, వకీలు.

,, కే॥ వేంకటరావుగారు, అనుముపల్లి.

,, కరణము కృష్ణరావుగారు, చేవినహళ్లి.

,, కట్టా ఆత్మారామయ్యశ్రేష్ఠిగారు, హిందూపురము.

,, కట్టా మాధవయ్యగారి నారప్పశ్రేష్ఠిగారు.

,, మాళ మునీనయ్యగారి నారాయణయ్యశ్రేష్ఠిగారు.

,, బి. రంగాచార్యులుగారు, ఉపాధ్యాయులు, కిరికెర.

,, కే. లింగప్పగారు, కరణము, కిరికెర.

,, రాచర్ల తిప్పయ్యగారు, బెళుగుప్ప.

,, మొలకతాళ్ల చిన్నపుల్లయ్యగారు, గాండ్లపాడు.

,, నిట్టా శేషప్పశ్రేష్ఠిగారు, బళ్లారి.

,, రావుసాహేబు జే॥ పాపయ్యశ్రేష్ఠిగారు.

,, శ్రీమతి వై. ఛాయాంబగారు. [బందరు.

,, జిడ్డులింగయ్యగారు, బి.ఏ.,బి. యల్., డిస్ట్రిక్టుకోర్టు శిరస్తాదారు,

,, కే. జోగయ్యగారు, మదరాసు.

,, పుల్లెల వేంకటరమణయ్యగారు, ఇచ్ఛాపురము

విషయసూచిక.

	పుట.
పరమేశ్వరధ్యానము ...	1
ధర్మరక్షణము ...	13
కథారంభము ...	25
దశరథుఁడు రామాభిషేకవార్తను ప్రజలకు దెల్పుట ...	55
ప్రజలు రామగుణములను ప్రశంసించుట ...	59
అప్పటియాచారములు ...	62
పట్టాభిషేకప్రయత్నములు ...	75
అభిషిక్తుఁడవు కమ్మని రాజు రాముని బురికొలుపుట ...	95
సీతారాములు ఉపవాసవ్రతము నడపుట ...	116
శ్రీరామాభిషేకప్రయత్నము ...	121
కైకను మంథర దుర్బోధము చేయుట ...	130
కైక దుర్బోధములకు లొంగిపోవుట ...	161
దశరథుఁడు కైకను జూడ నరుదెంచుట ...	185
కైక దశరథుని వరముల నడుగుట ...	194
దశరథుఁడు దుఃఖించుట ...	206
దశరథుఁడు కైకను మరల వేఁడుట ...	269
దశరథునిఁ జూడ సుమంత్రుఁడు వచ్చుట ...	292
పట్టాభిషేకోత్సవవర్ణనము ...	339
శ్రీరాముఁడు దశరథునికడ కరుగుట ...	345
రామచంద్రుఁడు తండ్రిని దర్శించుట ...	371
కైక రామునకుఁ దానడిగినవరములఁ దెల్పుట ...	382
శ్రీరాముఁ డడవికింబోవ నంగీకరించుట ...	401

శ్రీః.

శ్రీరామావతారతత్త్వము

అ యో ధ్యా కాం డ ము

తృతీయప్రకరణము.

పరమేశ్వరధ్యానము.

శ్లో. శ్రీరామో రఘునాయకో రఘువరో రాజీవనేత్రాంచితో
రాజేంద్రో రఘుపుంగవో రఘుకులోత్తంసో రఘూణాం పతిః
రామో రాక్షసనాశకోఽమితబలో రాకేందుపూర్ణాననో
రాజత్కింకిణికంకణాంకితకరో రామస్సదా పాతు నః. ౧
శ్రీరామం సరసీరుహాక్షమమలం దూర్వాంకురశ్యామలం
విద్యుత్కోటినిభప్రభాంబరధరం వీరాసనాధిష్ఠితం
వామాంకోపరిసంస్థితాం జనకజామాలింగ్య తాం బాహునా
తత్త్వం చాపరపాణినా మునిగణానాజ్ఞాపయంతం భజే. ౨
శ్రీరామామలపుండరీకనయన శ్రీరామ సీతాపతే
గోవిందాచ్యుత నందనందన ముకుందానంద దామోదర
విష్ణో రాఘవ వాసుదేవ నృహరే దేవౌఘచూడామణే
సంసారార్ణవకర్ణధారక హరే కృష్ణాయ తుభ్యం నమః. ౩
రామం రత్నకిరీటకుండలధరం కేయూరహారాన్వితం
సీతాలంకృతవామభాగమతులం సింహాసనస్థం ప్రభుం
సుగ్రీవాది సమస్తవానరవరైస్సంసేవ్యమానం సదా
విశ్వామిత్రపరాశరాదిమునిభిస్సంస్తూయమానం భజే. ౪

రామస్సీతాసమేతో నివసతు హృదయే సానుజం రామమీశే
రామేణ క్షీణపాపస్త్రివిధమపి కృతం కర్మ రామాయ దద్యాం
రామాదన్యం న జానే న హి కిమపి మహారామనామ్నస్సమానం
రామే పశ్యామి విశ్వం భువనమనుదినం పాహి మాం రామచంద్ర.

(శ్రీరామకర్ణామృతము.)

మహాశయులారా! సత్యాన్వేషణతత్పరులారా! శ్రీరామావతారతత్త్వమున ద్వితీయప్రకరణమును బఠించితిరి. ఆప్రకరణమున సగరచక్రవర్తిచరిత్రము, గంగావతరణము, అహల్యాశాపవిమోచనము, విశ్వామిత్రచరిత్రము, శివధనుర్భంగము, శ్రీసీతాకల్యాణము, పరశురాము ననుగ్రహించుట, అయోధ్యానగరమును బ్రవేశించుట లోనగువిషయములు గలవు. పరమపావనములగు నాగాథలం బఠించుటం జేసి శ్రీరామచంద్రునియపారమహత్త్వము, అతఁడు మునీంద్రవాంఛానిచయమును ఫలింపఁజేయుటయు, నాప్రకరణమున నా పరాత్పరునకుంగల యాదృతియుం జక్కఁగా గ్రహించియే యుందురు. శ్రీరామచంద్రమూర్తి ధర్మసంస్థాపనము చేయుటకొఱకే యవతరించెనన్నవిషయ మీయయోధ్యాకాండమున స్పష్టము చేయుభారము నాపై నున్నది. పెద్దలే యీవిషయమును దెలిపిరి. వానినెల్ల నొక్కచోటం జేర్చుటయే నాపని. ఇపుడు పరాత్పరుఁడు ప్రకృతివిశిష్టుఁడయ్యెను. ప్రకృతిపురుషుల కవినాభావసంబంధము కలదుకదా. ఇపు డెట్లు ప్రకృతివిశిష్టుఁడయ్యెనని ప్రశ్నించువారు గలరు. భగవంతున కిది యొకవిహారము. వివాహపద్ధతిని సీతాదేవింగూడినట్లు నటించెను. దానిచే లోకులకు వివాహపద్ధతి నేర్పెనని గ్రహించు

టుచితము. చంద్రచంద్రికలకుంబోలె భగవతికిని భగవంతునకు నభేదము సిద్ధము అట్టులయ్యుఁ బ్రకృతిని లోఁగొని కొంత కాల ముండును. ఆకాలముననే మనసు మహాప్రళయమందుము మరల జగన్నిర్మితియందు వాంఛఁగొను. దానినే సృష్టి యందును. ఆయిచ్ఛయే ప్రకృతి. ప్రకృతిదూషకులు కొందఱు గలరు వారు వాస్తవముగ నాలోచింప భగవద్దూషకులే యగుదురని తోఁచు. ప్రకృతి గుణమయియని భగవంతుఁడు నిర్గుణుఁడని యందురు. మహామాయ దురత్యయయని భగవంతుఁడే గీతాశాస్త్రమున బోధించెను.

"దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా. ౧౪. అ. ౭
ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి,
వికారాంశ్చ గుణాంశ్చైవ విద్ధి ప్రకృతిసంభవాన్. ౧౯
కార్యకారణకర్తృత్వే హేతుః ప్రకృతిరుచ్యతే,
పురుషస్సుఖదుఃఖానాం భోక్తృత్వే హేతురుచ్యతే." ౨౦. అ ౧౩.

అను సిగీతావాక్యములు పైవిషయమును దెలుపుచున్నవి. గుణవిశిష్టుఁడయ్యెనేని భగవంతునిసగుణబ్రహ్మ మందుము. ప్రకృతివిశిష్టుఁడు కానిచో నిర్గుణుఁడై స్థాణువువలె నుండును. నిరీహుఁడని యర్థము. ఇచ్ఛయేకదా యాయమహాత్మునిమార్చెను. అనఁగాఁ బ్రకృతిని స్మరించెనని సారము. అంతకుముందుఁ గదలకయుండి యపుడు రూపవంతుఁడై జగన్నిర్మాణమునఁ గుతూహలము కలవాఁడయ్యెననియేకదా యిందుఁగలసారము. ఈవిషయముననే శ్రీశంకరభగవత్పాదులు

"శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చేదేవం దేవో న ఖలు కుశలస్స్పందితుమపి,

అతస్త్వామారాధ్యాం హరిహరవిరించాదిభిరపి
ప్రణంతుం స్తోతుం వా కథమకృతపుణ్యః ప్రభవతి."

అని సౌందర్యలహరియందుఁ దేటపఱచిరి. భగవద్గీతార్థమించుమించుగా నిదియేకదా. శ్రీహరివాక్యమును విశ్వసించువారు దీనిని విశ్వసింపక తప్పదు. శంకరాచార్యోక్తిమాత్ర మంగీకరింపమనువారు శ్రీకృష్ణోక్తియందు విశ్వాసములేనివారే యన వలయును.

"జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వన్నేతత్స్వమపి వపురీశ స్తిరయతి,
సదా పూర్వస్సర్వం తదిదమనుగృహ్ణాతి చ శివ
స్తవాజ్ఞామాలంబ్య క్షణచలితయోర్భ్రూలతికయోః. ౨౪
త్రయాణాం దేవానాం త్రిగుణజనితానాం తవ శివే
భవేత్పూజా పూజా తవ చరణయోర్యా విరచితా,
తథాహి త్వత్పాదోద్వహనమణిపీఠస్య నికటే
స్థితా హ్యేతే శశ్వన్ముకుళితకరోత్తంసమకుటాః. ౨౫
విరించిః పంచత్వం వ్రజతి హరిరాప్నోతి విరతిం
వినాశం కీనాశో భవతి ధనదో యాతి నిధనం
వితంద్రీ మాహేంద్రీ వితతిరపి సమ్మీలితదృశా
మహాసంహారేఽస్మిన్ విహరతి సతి త్వత్పతిరసౌ." ౨౬ (సౌందర్యలహరి.)

అనువీనింబట్టి యాలోచింపఁగా నాపరాత్పరునియిచ్ఛాశక్తి యనఁబడుమహాప్రకృతిమహత్త్వము స్పష్టమగును. ఇందుఁ ద్రిమూర్తులు మహాప్రళయమున నశింతురనియుఁ బరమేశ్వరుఁ డొక్కఁడుమాత్రము సకలబ్రహ్మాండభంగసమయమున విహరించుననియుఁ దేలెడిని. ఇందచ్చెరువొందఁదగిన విషయమే

లేదు. పరమాత్మయొక్కఁడే శాశ్వతుఁడని యెల్లరంగీకరింతురు కదా. ఆమహనీయునియిచ్ఛాశక్తి యగు ప్రకృతికింగూడ శాశ్వతత్వ మంగీకరింపవలయును. "ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి" అన్న శ్రీకృష్ణమూర్తియుపదేశముకూడ నిదియేకదా. ఒక్కభగవంతుఁడు శాశ్వతుఁడనియంగీకరించుచో నిఁకఁ ద్రిమూర్తులలోనగువారు శాశ్వతు లెట్టులగుదురు? త్రిమూర్తులలో నొక్కఁడుగఁ బరిగణింపఁబడువిష్ణువు శాశ్వతుఁడన్నచో నిరువురు శాశ్వతులుకలరని యంగీకరింపవలసివచ్చును. విష్ణువే భగవంతుఁడన్నయెడల నొక్కయధికారమే కలిగియుండు టసంగతమగును. విష్ణునామ మాపరాత్పరునకుం గలదనుచో శంకరాదినామము లేలయుండవు? అవి లేనిచో సర్వేశ్వరుం డతఁ డెట్లగును? సర్వాంతర్యామియై సర్వకారణకారణుఁడై సర్వశబ్దవాచ్యుఁడై యుండు పరమేశ్వరుఁడుతక్కఁ దక్కినవా రెల్ల నశ్వరులనుట నిర్వివాదము ప్రకృతిపూరుషుల కభేదమనుటయు సిద్ధాంతము.

కొందఱు ప్రపంచపరిపాలకుఁ డగువిష్ణుమూర్తియే పరమేశ్వరుఁడనియు శంకరాదులు తత్పాదభక్తులనియు వాదింతురు. వారిభావ మట్లుండునే నా క్షేపింప నితరులకు నవసరముండదు. శంకరుఁడే పరమాత్మయనియు విష్ణ్వాదులు తత్పాదసేవకులనియు వాదించువారిని నీ రేల యాక్షేపింపవలయునో తెలియఁజాలకయున్నాఁడను. విష్ణురూప మాభగవంతునకుఁ గలిగినట్లే శంకరాద్యాకృతులు నాపరమాత్మకుంగలవు.

"న తే రూపం న చాకారో నాయుధాని న చాస్పదం,
తథాపి పురుషాకారో భక్తానాం త్వం ప్రకాశసే.

ఉపాసకానాం కార్యార్థం బ్రహ్మణో రూపకల్పనా”

అను నీసూక్తులు పైభావమునే తెల్పుచున్నవి.

“త్వం యజ్ఞస్త్వం వషట్కారస్త్వమింద్రస్త్వగ్ం రుద్రస్త్వం విష్ణుస్త్వం బ్రహ్మ త్వం ప్రజాపతిః.”

అను నీశ్రుతియు పైనవ్రాసినవిషయమునే సిద్ధాంతము చేయుచున్నది.

“సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః,
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే.” ౩౧. ౬ ౬.

అను నీగీతావాక్యము పైవిషయమునే దృఢపఱచుచున్నది.

“సత్యం విధాతుం నిజభృత్యభాషితం
వ్యాప్తించ భూతేష్వఖిలేషు చాత్మనః,
అదృశ్యతాత్యద్భుతరూపముద్వహన్
స్తంభే సభాయాం నమృగం నమానుషమ్.” ౧౮. స్కం. ౭. ౮ ౮.

అను నీశ్రీభాగవతవాక్యముకూడ నుదాహృతాభిప్రాయమునే తెల్పెడిని. ఇట్లొక్కొక్కగ్రంథముకూడఁ దెల్పుచుండఁగా దుర్వాదములకుంబూని సభలలో ఘోషించువారిప్రాద్ధుష్కర్మమునుగుఱించి మనము చింతింపవలయును.

“అహం త్వం సర్వగో దేవ త్వమేవాహం జనార్దన
ఆవయోరంతరం నాస్తి శబ్దైరర్థైర్జగత్పతే,
నామాని తవ గోవింద యాని లోకే మహాంతి చ
తాన్యేవ మమ నామాని నాత్ర కార్యా విచారణా.” (హరివంశము.)

అనుశంకరోక్తియు,

"యోఽహం సత్వం జగచ్చేదం సదేవాసురమానుషం,
మత్తో నాన్యదశేషం యత్తత్త్వం జ్ఞాతుమిహార్హసి. ౪౭
అవిద్యామోహితాత్మానః పురుషా భిన్నదర్శినః,
వదంతి భేదం పశ్యంతి చావయోరంతరం హర. ౪౮
ప్రసన్నోఽహం గమిష్యామి త్వం గచ్ఛ వృషభధ్వజ." ౫అం. ౩౩అధ్యా.

అను నీవిష్ణుపురాణమునఁగల శ్రీకృష్ణోక్తియు శివకేశవుల కభేదమునే సిద్ధాంతము చేయుచున్నది. ఉపలక్షణవిధిచే నీవిషయమే త్రిమూర్తుల కభేద మనుదానిని దృఢపఱచును.

ఇట్లు శ్రుతిస్మృతిపురాణేతిహాసములు భగవన్మహిమమును దెలుపుచుండఁగా నొకకొందఱు మధ్యవైష్ణవులు దుర్మతాభిమానమున శంకరాదులదూషించుట వారలప్రాగ్దుష్కర్మమూలముననే యగును గాని వేఱుకారణమేమియుండును? తమవంటివారిని గలుపుకొని యొకసంఘముగ నిరంతరము దేవతాంతరదూషణము చేయుచుండువారినిగూర్చి మన మక్కటా! యనవలయును గాని యింకేమనఁగలము? అట్లు దూషించినఁగాని వారలకు ధనము దొరకదు కాఁబోలు. తుచ్ఛమగు ధనముకొఱకుఁ బరమసుగతిని బాడుచేసికొనుట యెంతటిదుష్కార్యము? "అజ్ఞానమోహితులై పురుషులు కొందఱు భేదముగఁ గనుఁగొనుచు మనకిరువురకు భేదమును గల్పింతురు. భేదదృష్టిం జూతురు!" అని శ్రీకృష్ణమూర్తియే శంకరుంగూర్చి పలికినట్లు విష్ణుపురాణమే చాటుచుండఁగా శివకేశవులకు చాలభేదము గలదను వైష్ణవు లెంతటిభక్తులో వర్ణింపఁదరమా! తమకంటె నజ్ఞానులగువారలం జేర్చుకొని వారికి వేదోమంత్ర ముపదేశించి భగవద్భక్తిని బోధించునెపమున ధనము నాకర్షించుచు దానిని

వ్యయించుచున్నయట్లు నటించుచు మున్ను చేరదీసిన స్త్రీపురు షుల కొసంగుచు గడియ కొకవేషమువేయుచు భాగస్వాము లకుఁ గొంతయొసంగుచునుండు వేషధారులే దేవతారాధూష ణము చేయువారని యూహింపవచ్చును.

భగవదారాధనమునకు భక్తియొక్కఁడే చాలును. ధన మక్కఱలేదు. ఇతరులసాయ మక్కఱలేదు. వేసారివేసారి ధన మడుగనక్కఱలేదు. ఇదియే ఋషులమతము. అదియే భగవంతు నకు సమ్మతము. కొందఱు యాచించి ధనముకూర్చి యన్నదాన మున నెందఱినో సంతృప్తులను జేయుచు నుందురు. అదియు భగవదారాధనమే యగును. కాని యది యుత్తమము కాదు. మధ్యమమనవలయును. వారికర్మమట్టిదియే. ధనమునుమాత్రము కూర్చి దాని వ్యయింపక యేదో కొంతమాత్రము వ్యయించి యెంతయో వ్యయించినట్లు డంబములు పలుకుచుఁ బరుల వంచించువా రెందఱో యుందురు. వారధములు. ఆయారా ధనము భగవంతుని సంతృప్తునిగాఁ జేయఁజాలదనుట నిక్కము. పామరు లట్టివారి నెఱుంగఁజాలక వారు నిక్కముగా యోగు లనియు, దాసులనియు, సన్న్యాసులనియు, భక్తులనియుఁ, బరో పకారపరాయణులనియుఁ, బామరులను మార్గదర్శకులనియుఁ దలంచి శ్రమములకుఁ బాలగుచుండియు ధన మొసంగుదురు.

"సత్పాత్రే విహితం దానం సఫలం పాండునందన"

అన్నసూక్తింబట్టి యాదానము వ్యర్థమే యగుననవలయును.

భక్తియొక్కఁడుండినఁ బరమేశ్వరు నారాధింపవచ్చును. తత్కథల నాలకింపవచ్చును. తన్నామసహస్రములఁ బఠింప వచ్చును. తద్దివ్యమంగళవిగ్రహమును ధ్యానింపవచ్చును. తీర్థ

యాత్రలు చేయవచ్చును. సాధువులను సందర్శింపవచ్చును. ఇవన్నియు భగవత్కరుణఁబడయుటకు మంచిత్రోవలు. ఇన్ని సులభమార్గములుండఁగా నీనిని లెక్కసేయక వంచకులై వేష ధారులై తిరుగు దురాత్ములమాటలనమ్మి ధనముఁబోఁగొట్టు కొని దాన ముక్తివచ్చునని యెదురుచూచుటకంటె నజ్ఞానము వేఱుగ నేమియుండును?

భగవంతు నారాధించుమార్గములలో విగ్రహారాధన మధమము. అది భగవంతు నలరింపఁజాలదు. ప్రతిమానవునకు నయ్యది తొలుత నుండవలసినదియే. తరువాత దానిని వదలి భగవంతునకు నిచ్ఛానుసారముగా నొకరూపమును గల్పించి దాని మదినిలుపుకొని సకలోపచారముల నారాధించినట్లు భావించుచు ధ్యానముచేయు టుత్తమమార్గము. ఆవిధమున నారాధించుటకు ధన మక్కఱలేదు. ఏపరికరము లక్కఱలేదు. భక్తిమాత్రము కలిగియున్నం జాలును. దాన నాపరమేశ్వరుఁడు సంతుష్టాంతరంగుండగును. పలుకష్టములకు లోనై ధన మార్జించి యెన్నియోదుఃఖములకుఁ బాలై విగ్రహముల నలంకరించి తన్మూలమున ముక్తిఁబడయ నెంచుట యెండ మావుల నుదకములని నమ్మి పరుగెత్తుట యెట్టిదో యట్టిది. విగ్రహారాధన మత్యల్పఫలదమే యనక తప్పదు. పామరులే యద్దానియం దాదరముకలవార లగుదురనుట నిస్సంశయము.

భక్తుఁడు తాఁగాంచువస్తువులనెల్ల భగవన్మయము లనుగా భావింపవలయును. ఆస్థితియం దాతఁడు సమదర్శనుఁ డనఁబడును. అట్టివాని దృష్టికి భేదమనునది గగనకుసుమము గనేయుండును.

"యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి,
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి." ౩౦. గీత ౬ అ.

అను నీ కృష్ణోపదేశమే యీయాశయమును స్పష్టీకరించుచున్నది. ఇట్టులుండఁగాఁ గొందఱు దేవానాంప్రియులు ప్రకృతిపూరుషులకు భేదముకలదందురు. విష్ణుమాయ నారాధించుట తుచ్ఛమందురు. తద్భిన్నమగువ్యక్తి బ్రహ్మాండజాలముల లేదని వారెఱుంగరు. తన్నిర్మితులగు త్రిమూర్తులనే ప్రకృత్యతీతులందురు. ఏమి వారియజ్ఞానము?

"మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరం,
హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే." ౧౦. గీ ౯. అ.

అన్న భగవదుక్తిని వా రంగీకరింపరు. ఈవాక్యముంబట్టి త్రిమూర్తులకు జనని మూలప్రకృతియని స్పష్టము కాలేదా. ఈ యాశయమునే

"తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా
నవాత్మానం మన్యే నవరసమహాతాండవనటమ్,
ఉభాభ్యామేతాభ్యాముదయవిధిముద్దిశ్య దయయా
సనాథాభ్యాం జజ్ఞే జనకజననీ మజ్జగదిదమ్." ౪౧

అని సౌందర్యలహరియందు శ్రీశంకరభగవత్పాదాచార్యులు తేటపఱచిరి. కావున మతిమంతులు రూపవంతిమగునది ప్రకృతి వశంగతమని నమ్మి పూజింపవలయును. ప్రకృత్యతీతు నారాధించుట కొకధ్యానమే మార్గము. అదియు మూలప్రకృతి కగుణకుం బాత్రులగువారలకే దొరకును.

మహాత్ములారా! ఈవిషయ మిట నేటికి వ్రాయఁబడినదని ప్రశ్నింపకుఁడు ఇంకఁ బ్రకృతియుఁ బరమపురుషుఁడు లోక

మున ధర్మరక్షణమునకై యెట్లు విహరించిరో యావిధమే వ్రాయఁబడును. కావునఁ బ్రకృతిపురుషులమహాత్త్వచరిత్రములు చర్చింపఁబడియెను. శ్రీరామచంద్రుఁడు భగవంతుఁడని సీతాదేవి విష్ణుమాయయనంబడు మహాప్రకృతియని తలంపుఁడు. ఈవిషయమును మఱువక రామాయణమును బఠించినచో ననేకవిషయములు బయల్పడును. దాన భగవతీమహాత్త్వము భగవంతునిప్రవర్తనము బోధపడును. శ్రీరామమూర్తి ప్రకృత్యతీతుఁడని తేటపడును. సీతాదేవి మూలప్రకృతియని స్పష్టమగును. ఎవరెవరెట్లు ప్రవర్తింతురో విశదమగును. వారిప్రవర్తనము లోకమున కెట్లుదాహరణభూతమగునో విస్పష్టమగును. దానఁ బాఠకుల మనోమాలిన్యము వదలి యాచోట భక్తిరసము వెల్లివిరియును. అపుడు దుష్కర్మవాసనలు నశించును. పరమేశ్వరారాధనపద్ధతి బోధపడును. అదియే యుత్తమమార్గమని తోఁచును. కావున నిన్నింటికి మూలకారణమనందగు ప్రకృతిచరిత్రమును సుంత వ్రాసితినని మీరెఱుంగవలయును. మతభేదములనూని దేవతాంతరదూషణము మహాపాపకార్యమగుట నద్దానిఁ బోలంగఁద్రోసి కపటయోగుల మోసపుమాటలఁ దుచ్ఛములనియు ధనాకర్షణమూలములనియు నమ్మి వాని నాలకింపక వంచకులు చేయు మంత్రోపదేశముల కాసింపక పరాత్పరుని పాదారవిందముల ధ్యానింపఁ బ్రయత్నింపుఁడు. వాల్మీకరామాయణము శ్రీరామచరిత్రము నెట్లు తెలిపెనో అధ్యాత్మరామాయణ మేరీతి శ్రీరామతత్త్వమును బోధించెనో పరిశీలింపుఁడు. కథాభేదమును బాటింపక యాగ్రంథ మేపద్ధతి భగవన్మహాత్త్వమును దెలిపె

ననువిషయమును గ్రహింపుఁడు. కొన్నితావుల నొకదానికి వేఱొకటి విరుద్ధముగఁ గథాభాగములం దోఁచును. ఆభేదము బాహ్యదృష్టింబరిశీలింప నసంగతముగనే తోఁచును. సూక్ష్మదృష్టినిబరిశీలింపుఁడు. భేదముకానరాకపోవును. మార్గభేదమే కాని లక్ష్యమొక్కటియేయని తేటపడును. ప్రతివిషయము నిట్లు పరికింపవలయు ననుభావము స్పష్టమగును. ఆభావము దృఢపడినపుడు మతములను దత్కర్తలను దదాచారములను దూషింప నవకాశముండదు. భగవంతున కొక్కరూపము,ఒక్కనామము, ఒక్కలోకము లేదనియు, సర్వరూపములు సర్వనామధేయములు, సర్వస్థలములు కలవనియు, నేభక్తుఁ డేరీతి ధ్యానించినను నిర్మలభక్తి యుండెనేని పరమాత్మ యాతని ననుగ్రహించు ననియుఁ దోఁచును. ఆస్థితియందే మీరు పరమభాగవతు లనంబడుదురు.

లోకమున నొకమతమును వదలి వేఱొకమతము నెవ్వారు స్వీకరింతురో వారు తమరు వదలినమతమును దదాచారములను దత్కర్తను విశేషించి దూషింతురు. అట్టివారు మతధర్మములను జక్కనిదృష్టిచేఁ బరిశీలింపలేదనియు రజోగుణప్రధానులై తమోగుణము దానికి సాయపడఁగా నట్లు దూషించిరనియు మన మూహింపవలయును. అంతియగాని వారిని మనము దూషింపరాదు. అట్లు దూషించినచో మనయందుఁ గలసత్త్వగుణమును మించి రజస్తమస్సులు ప్రకాశించుననియు నవ్వి రెండును మనపురోవృద్ధికి నెంతయు భంగకరములనియు నిశ్చయించుకొనవలయును. పురోవృద్ధికై నను భంగము కల్గించుకొని పరమతముల దూషింపనేల? అది మూర్ఖపద్ధతి.

"శిరశ్శార్వం స్వర్గాత్పతతి శిరస స్తత్క్షితిధరం
మహీధ్రాదుత్తుంగాదవనిమవనేశ్చాపి జలధిం,
అధోఽధో గంగేయం పదముపగతా స్తోకమథవా
వివేకభ్రష్టానాం భవతి వినిపాతశ్శతముఖః. ౧౦
వరం పర్వతదుర్గేషు భ్రాంతం వనచరైస్సహ,
న మూర్ఖజనసంపర్కస్సురేంద్రభవనేష్వపి." ౧౮

అన్న భర్తృహరివాక్యము లిట స్మర్తవ్యములు. ఇఁకనైన మన మూఁదారినఁ బ్రయాణముచేయకయుండు టత్యుత్తమము.

ధర్మరక్షణము.

ఇఁక శ్రీరామమూర్తి ధర్మము నెట్లు సంరక్షించెనో యనుదానిఁ బరికింతము. ఇదియే ప్రధానము. "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే." అనునది భగవంతుని ప్రతినకదా. దానిని శ్రీరామాకృతిం దాల్చినభగవంతుఁడెట్లు నిర్వహించెనో విమర్శింతము. విశ్వామిత్రునిమూలమునఁ దాటకాదులమర్దించినట్లునటించి తనమహత్త్వమును సామాన్యమానవు లెఱుంగకయుండ నమ్మునిపంపుననే గౌతమాశ్రమమును బ్రవేశించి యతఁడు పురికొలుప నహల్యకు శాపవిముక్తి ననుగ్రహించినచందము నభినయించి గంగామాహాత్మ్యము నెఱుంగనియట్లు ప్రశ్నించి దానిని సేవించి యది పరమపవిత్రకార్యమని లోకులకు బోధించి శివధనుర్భంగమూలమునఁ దన యపారశక్తిని లోకులకుం దెలిపి తన్నెడఁబాయకయుండు ప్రకృతిని సీతారూపమున వేఱుగా నున్నయట్లు నటించుమహామాయను బెండ్లియాడి వివాహపద్ధతి యిట్టిదని లోకములకు నెఱింగించి నూతనదంపతిత్వమును గనఁబఱచుచుఁ బయనము

సాగించి పరశురామాగమనమునఁ దనయవిక్రమత్వమును వెల్ల
డించుచు నాతనినుండి స్వాంశమును సంగ్రహించి సాధుదూష
ణము నాత్మప్రశంసము మంచివికావనునీతిని బరశురామార్జిత
పుణ్యలోకభంజనరూపమున నెల్లరకుఁ దేటపఱచుచు నయో
ధ్యానగరమును బ్రవేశించినగాథ బాలకాండమునఁ గలదు.

ఆశ్రమములు నాలుగు. అందు రెండవదగు గార్హస్థ్యాశ్రమ
ముత్తమమని యెఱుంగందగు. గృహస్థాశ్రమమును స్వీకరించినఁ
గాని లోకమున నుపకారము చక్కఁగా నెవ్వాఁడును జేయఁ
జాలఁడు. ఎల్లయాశ్రమవాసులకు నుపకరించునది గృహస్థా
శ్రమమే.

"యథా వాయుం సమాశ్రిత్య వర్తంతే సర్వజంతవః,
తథా గృహస్థమాశ్రిత్య వర్తంతే సర్వ ఆశ్రమాః. ౭౭
యస్మాత్త్రయోఽప్యాశ్రమిణో జ్ఞానేనాన్నేన చాన్వహం,
గృహస్థేనైవ వర్తంతే తస్మాజ్జ్యేష్ఠాశ్రమో గృహీ. ౭౮
స సంధార్యః ప్రయత్నేన స్వర్గమక్షయమిచ్ఛతా,
సుఖం చేహేచ్ఛతా నిత్యం యోఽధార్యో దుర్బలేంద్రియైః. ౭౯
ఋషయః పితరో దేవా భూతాన్యతిథయస్తథా,
ఆశాసతే కుటుంబిభ్యస్తేభ్యః కార్యం విజానతా. ౮౦
స్వాధ్యాయేనార్చయేతర్షీన్ హోమైర్దేవాన్ యథావిధి,
పితౄన్ శ్రాద్ధైశ్చ నౄనన్నైర్భూతాని బలికర్మణా." ౮౧

మనుస్మృతి. 3 అధ్యాయము.

ఈస్మృతివాక్యముల నెట్లు శ్రీరామమూర్తి స్వప్రవృత్తిని
సిద్ధాంతములుగ నొనరించెనో మన మెఱుంగుటయే మంచి
తెఱంగు. సర్వాశ్రమములవారు గృహస్థు నాశ్రయింపవలయు.

సకలాశ్రమోపకారక్షమము గృహస్థాశ్రమము. అందైహికా ముష్మికసుఖములు గలవు. ప్రపంచమునకుఁ దఱచుగా నీరెండు నావశ్యకములే. కావున శ్రీరామమూర్తి ప్రకృతింగూడి యయోధ్యానగరమును బ్రవేశించెను. అందు నుత్తమగృహస్థు వెట్లు ప్రవర్తింపఁదగునో యట్లు ప్రవర్తించెను. నిర్లిప్తుఁడై యుండియు సంసారివలె నటించెను. మహామాయ సద్గృహిణి యెట్లు వర్తింపఁదగునని మన్వాదిస్మృతులు తెలిపెనో యట్లు వర్తించెను. తన్నుం గాంచి యుత్తమకాంతలెల్లఁ బ్రవర్తింప నుత్సాహపడునట్లుండెను. ఎంతకాల మాపురవాసులకుఁ బ్రవర్తనము నేర్పఁదగునో యంతకాల మాయిరువురు నందుండిరి.

మహామాయ భగవంతు నాజ్ఞఁ దలందాల్చి దుష్టసంహారము చేయఁదలంచెను. శ్రీరామమూర్తి ప్రకృతింగూడి నిర్లిప్తుఁడయ్యు నెల్లకార్యములఁ దానాదృతిం గన్నయట్లుండెను. సర్వజ్ఞుఁడయ్యుఁ బెద్దలు చెప్పునట్లు నడువసాగెను. పెద్దల మాటల నాదరించుసద్గుణశాలియన్న విఖ్యాతిం గాంచెను. ఎవ రెవరిని గర్మ మెట్లెట్లు త్రిప్పుచున్నదో యాచందముం గాంచి వేడుకపడుచుండెను. తనయానందమునే ప్రకృతియు ననుభవించుచుంటఁ దానెఱుఁగును. ఉత్తమగృహస్థు లెల్ల రా శ్రీరాముని నడవడిక ననుసరింపఁ బ్రయత్నపడుచుండిరి. కాని యద్ది సాధింపశక్యమా. అనన్యసాధ్యముకదా భగవద్వర్తనము. యథాశక్తి నద్దాని నభ్యసింప నెల్లరుఁ గోరవలసినదే నగరవాసులనేగాక ప్రపంచవాసులనెల్ల నాపరాత్పరుని తత్త్వ మెఱుంగకయుండ మహామాయ తనయద్భుతశక్తి మోహింపఁజేసి రాజకుమారుఁ డనుభావము కలవారిగా నొన

రించెను. అహల్యాశాపమోక్షము శివధనుర్భంగము పరశురాము ననుగ్రహించుటయు లోనగుమహాద్భుతకృత్యములం గన్నులారఁ గాంచినదశరథాదులుగూడ నీవ్యక్తి యెట్టిదని యూహింపక పుత్త్రప్రీతిచే భగవంతుని గనునట్లు లాప్రకృతి యొనరించెనన నిఁక నామహాకార్యములఁ జూడనివారలమాట యిటఁ బ్రస్తావింపనేటికి?

"అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితం,
పరం భావమజానంతో మమ భూతమహేశ్వరమ్. ౧౧
మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః,
రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః. ౧౨
మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః,
భజంత్యనన్యమనసో జ్ఞాత్వా భూతాదిమవ్యయం. ౧౩
సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః,
నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే. ౧౪
జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే,
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్." ౧౫. గీత ౯ అధ్యా.

అను నీశ్రీకృష్ణపరమాత్మయుపదేశవాక్యములు పైనుదాహరించినభావమునే సూచించుచున్నవి. జ్ఞానయజ్ఞమునఁ బరాత్పరు నారాధించువసిష్ఠాదిమహర్షులే యించుక యెఱింగిరి. అంతటి మోహింపఁజేయఁజాలుశక్తి యాజగదంబకుఁ గలదు. బ్రహ్మవిష్ణ్వాదు లాపరదేవి ముందు బాలకులవలె నాడుచుందురు.

"కరాంగుళినఖోత్పన్ననారాయణదశాకృతిః"

అన్ననామ మాజగజ్జననికిం జెల్లు. శ్రీభాగవతమునఁ బరాత్పరుఁడే

"అర్చిష్యంతి మనుష్యాస్త్వాం సర్వకామవరేశ్వరీం,
నానోపహారబలిభిస్సర్వకామవరప్రదాం. ౧౧
నామధేయాని కుర్వంతి స్థానాని చ నరా భువి,
దుర్గేతి భద్రకాళీతి విజయా వైష్ణవీతి చ. ౧౨
కుముదా చండికా కృష్ణా మాధవీ కన్యకేతి చ,
మాయా నారాయణీశానా శారదేత్యంబికేతి చ." ౧౩

అను నీవాక్యములు శ్రీకృష్ణమూర్తి యోగమాయనుగుఱించి చెప్పినవి. ఇపు డీయోగమాయ యెవతుక? శివపత్నియా? విష్ణుపత్నియా? బ్రహ్మపత్నియా?

"దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా."

అని శ్రీకృష్ణమూర్తి భగవద్గీతలయందుఁ జెప్పినది యీయోగమాయయేనా? వేఱొకతుకయా? ఈదేవీపూజనము నింద్యమనువారు భగవద్దాసులా? ధనదాసులా? క్షుద్రజనదాసులా? అంబికా, దుర్గా, భద్రకాళీప్రభృతినామములా యోగమాయకుంగలవని శ్రీభాగవతమే చాటుచున్నదికదా. మధ్వవైష్ణవులద్దానిఁ బ్రమాణముగా నంగీకరింపకుండుట కేమి హేతువు? అంగీకరించుచో భగవంతునితోడ నవినాభావసంబంధముగలశక్తి నెట్లు దూషింతురు? శక్తినుపాసించువారే శాక్తులు. ఆశక్తియే భగవదిచ్ఛ. ఆమెను గూడినపుడే భగవంతుఁడు దేహధారి యగును. ఉపాసించువారు సగుణునే ధ్యానింతురు. ఇపు డాధ్యాన మీమధ్వవైష్ణవుల యభిప్రాయానుసారము నీచమనవలయు. కావున నట్టిదాసులదుర్వాదములకుఁ జెవియొగ్గక యీ మాయ నారాధించి తదనుగ్రహమునకుఁ బాత్రులు కావలయును. ఆమహాప్రకృతి బ్రహ్మవిష్ణుమహేశ్వరులసృజించి

[library stamp]

యొక్కొక్క బ్రహ్మాండమున నధికారపురుషులనుగా నియమించును. భద్రకాళియన్న మధ్యవైష్ణవులకుఁ దలనొప్పి. వైష్ణవి యను పేరుకూడఁ గలదు. అద్దాని విన్న నేమందురు? ఈ రెండు నామము లొక్క యోగమాయకే కలవు. ఇట్లే శివ శంకర మధుసూదనాదినామము లాపరమాత్మకుం గలవు. ఒక్క నామమును దూషించి వేఱొక్క నామమును బ్రశంసించిన నది యాపరమాత్మను దూషించినట్లే యగును. విష్ణుభక్తులు, శివభక్తులు, దేవీభక్తులు, సూర్యభక్తులు, గణనాథభక్తులు, భైరవభక్తులు భగవద్భక్తులే. వీరలకందఱకు లక్ష్య మాపరమేశ్వరుఁడే. ఇందొక్కరొక్కరు ఇతరులదూషింప నవకాశ మేది? లేనియవకాశ మున్నదనుకొని నోటికివచ్చినట్టు లాభగవత్స్వరూపులగు శంకరాదుల దూషించుట మధ్యవైష్ణవులకు, నట్టివారగు విష్ణ్వాదుల దూషించుట మధ్యశైవులకు నయుక్తమనక యుండ నవకాశముకలదా? వీరే పాషండులు ఆస్తికులగువార లిట్టి దుష్కార్యముల నాచరింపక మనోవాంఛానుగుణరూపమున నాభగవంతు నారాధించు టుత్తమమార్గము. ఆ యీశ్వరారాధనము మానసికంబైన నుత్తమము. బాహ్యమ్మున నల్పఫలదము. విగ్రహారాధన మధమఫలదము. ప్రతివ్యక్తిని భగవత్స్వరూపముగా భావించు టుత్తమోత్తమము. ఆస్థితియందుండువారే సమదర్శను లనంబడుదురు. వారినే పరాత్పరుఁడు విశేషించి ప్రేమించును.

అయోధ్యానగరమునఁ బ్రకృతియుఁ బరమపురుషుఁడును ధర్మసంస్థాపనము చేయఁబూని స్వప్రవృత్తియే యెల్లరకు నుదాహరణమగునట్లు చేయుచుఁ జేయఁగలకార్యముల నాలో

చించుచుండిరి. శ్రీరామమూర్తి తన సర్వసాక్షిత్వమును వెల్లడించుచు మహానందసాగరమున నోలలాడుచు నిర్లిప్తుఁడై యుండెను మహామాయ సీతారూపమునఁ బరాత్పరుని శ్రీరాము ననుకరించుచు నపారస్వీయశక్తిని దాఁచి పురంధ్రులు తన్నుఁజూచి సదాచారముల నేర్చుకొనఁ బ్రయత్నపడఁ జేయుచు నెప్పుడెప్పు డెట్లెట్లు దుష్టనిగ్రహశిష్టపరిపాలనములను జేయవలయునో యూహించుచుఁ గర్మగతులఁ బరిశీలించుచు నుండెను. దేవతలు దుష్టరాక్షసులవలనిబాధ లెప్పుడడంగునా యని యువ్విళ్లూరుచుండిరి. మహర్షులు భగవంతు నాశయ మిట్టిదని యెఱుంగఁజాలక యేక్షణమున నేమికార్య మాపరమాత్మ చేయునో కనుఁగొనఁగోరుచు నాప్రకృతిపురుషుల ధ్యానించుచు లోకాచారములఁ బాటించి యాదంపతుల యపారశక్తిని వెల్లడింపఁ బూనక యంతఱవలెఁ దమును బ్రవర్తించుచుండిరి.

భగవంతుఁడు సూడఁ గర్మగతుల నరయుచుఁ దనసుగుణముగాఁ దాను బ్రవర్తించును. ఏపనిగ్గైనను జేయుటకుఁ జేయకుండుటను వేఱొకవిధముగాఁ జేయుటను(కర్తుమకర్తుమన్యథాకర్తుఁను) సమర్థుఁడయ్యును గర్మసిద్ధాంతము గహనమనుతన యుపదేశమును

"కర్మణో హ్యపి బోద్ధవ్యం బోద్ధవ్యం చ వికర్మణః,
అకర్మణశ్చ బోద్ధవ్యం గహనా కర్మణో గతిః."

అన్న దానిని సార్థకము చేయుపట్టుదలతో నుండును. అంతియ గాని దాని నించుకంతయు మీఱఁడు. అట్లు మీఱిన లోకాచారములు తాఱుమాఱగునని యాపరమాత్మ యెఱుంగును.

"యది హ్యహం న వర్తేయం జాతు కర్మణ్యతంద్రితః,
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ సర్వశః. ౨౩
ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహం,
సంకరస్య చ కర్తా స్యాముపహన్యామిమాః ప్రజాః." ౨౪ గీత. 3 అధ్యా.

అను శ్రీకృష్ణోక్తులు పైభావమును సిద్ధాంతము చేయుచున్నవి. కనుకనే బ్రహ్మాదులందఱు కర్మసూత్రబద్ధులై యుందురు. ఆ కారణముననే

"కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః,
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి." ౨౦ గీ. 3 అ.

అని భగవంతుఁడు శాసించెను. మహాయోగులు కూడ లోకసంగ్రహార్థము ఫలాభిసంధిరహితకర్మముల నాచరింతురు. భగవంతుఁడు కూడఁ గర్మబద్ధునిరీతి నటించునని యెఱుంగవలయును. ఆపద్ధతియే యీయయోధ్యాకాండమున స్పష్టమగును. కొందఱు కర్మముల నాచరింపరాదనియు నయ్యవి సంసారబంధమునకే హేతువులగుననియు వానిని వదలి

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,
అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః."

అను నీశ్రీకృష్ణోపదేశముచొప్పున భగవంతునే యాశ్రయింపవలయుననియు నియ్యది చరమశ్లోకమనియుఁ బలుకుదురు. ఇట్టివారే మధ్యవైష్ణవులని యిందుఁ జెప్పఁబడువారని యెఱుంగవలయును. ఈయొక్కయభిప్రాయమే భగవంతునకు సమ్మతమైనదగుచో

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్త్వకర్మణి. ౪౭

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వా ధనంజయ,
సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే. ౪౮
దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ,
బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః. ౪౯
బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే,
తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్. ౫౦
కర్మజం బుద్ధియుక్తా హి ఫలం త్యక్త్వా మనీషిణః,
జన్మబంధవినిర్ముక్తాః పదం గచ్ఛంత్యనామయం. ౫౧ గీత. ౨ అధ్యా.
నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః,
శరీరయాత్రాపి చ తే న ప్రసిద్ధ్యేదకర్మణః. ౮
యజ్ఞార్థాత్కర్మణోఽన్యత్ర లోకోఽయం కర్మబంధనః,
తదర్థం కర్మ కౌంతేయ ముక్తసంగస్సమాచర." ౯ గీత. 3 అధ్యా.

అను నీ శ్రీకృష్ణోక్తులు వ్యర్థములగును.

"మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,
మామేవైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోఽసి మే." ౬౫ గీ. ౧౮అ.

మద్యాజీ అనునది కర్మము కాదా. చరమశ్లోకానంతరమునందు

"ఇదం తే నాతపస్కాయ నాభక్తాయ కదాచన,
న చాశుశ్రూషవే వాచ్యం న చ మాం యోఽభ్యసూయతి."

అను శ్రీకృష్ణవాక్యమే కలదు. 'అతపస్కాయ' అనఁగా నర్థమేమి? తపస్సు సత్కర్మము కాదా. అగునన్నచో సకలకర్మములు వదలమనుదాని కర్థమేమి? ఇందు సారమేమనఁగా "ఫలము నింముకయే నాశించి కర్మముల నాచరింపక సత్కర్మముల నాచరించి భగవదర్పణము చేయుచు దాన లోకులు

సత్కర్మాచరణపరాయణు లగుదురుగాక యని యాశించుచుం బెక్కండ్రు దేవతల ననఁగా భాగ్యమునకుఁ గుబేరుని, మృత్యు బాధతొలఁగుటకు యముని, సుఖానుభవమునకు నింద్రుని, సంతానమునకు శ్రీకృష్ణుని ఇట్లే యెన్ని యోవాంఛల కంన అనో దేవతల నాశ్రయింపక సర్వమునకు భగవంతు నొక్క నినే నమ్మియుండవలయుననియు భక్తుఁ డేరూపనామములఁ దన్నుఁ గొలుచునో దాన సంతుష్టినొంది పరమేశ్వరుఁ డును గ్రహించుననియు" నెఱుంగంచగు. అంతియగాని నిత్యనై మిత్తికకర్మములను వదలి పాషాణాదినిగ్రహములు ముక్తిఁ బ్రసాదించునని నైవేద్యము లర్పించి వాని దినుచునుండునోము రులకు భగవదనుగ్రహము శశవిషాణమే యగును కొంద తీచరమశ్లోకార్థమును విచ్చలవిడి బోధించుచు సంధ్యావంద నాదులను మాని భగవత్కైంకర్యమని భుక్తికిఁ బ్రయత్నిం తురు. వారిదుర్బోధములకు లోఁబడక మనము చేయుసత్కర్మ ముల నాపరాత్పరున కర్పించుచునుండిన నామహాత్మునియను గ్రహమునకుఁ బాత్రులమగుదుము. కావున వంచకులవాహా పన్యాసములకు లోఁబడక సద్గ్రంథములఁ బఠించి తదుక్త ప్రకారము ప్రవర్తించుచు భగవద్రూపములను దదాగంధన భేదములను దదాచరణపరాయణులను దూషింపక చక్కఁగా భగవంతుని సేవించు టుత్తమము.

ఇఁకఁ బ్రకృతిపురుషులగు సీతారామచంద్రుల ప్రవృత్తిని బరికింతము. దాన నాదంపతులు ధర్మరక్షణమున కెట్లు పాటు పడిరో స్పష్టమగును. కథ తెలిసినదని యానందించి సంతృప్తి నొందరాదు. వారివలెఁ బ్రవర్తింప శక్తికలిగినంతదనుకఁ

బ్రయత్నింపవలయును. ఈభాగము పఠించునపుడు కర్మసిద్ధాంత మెంత బలవత్తరమమో పరికింపుఁడు. దాననే మేలు చేకూరును. పేరునకు భక్తులమని తెల్పుకొనుచు దాసులమని విఱ్ఱవీఁగుచు సన్న్యాసులమని ధనము నార్జించుచు యోగులమని శిష్యుల వంచించుచు నుండుదురాత్ములమాటలకు లోఁబడిన నధఃపతనమే ఫలముగాని వేఱుఫలము రాఁబోదు. గురువులమని యుపదేశింతుమని బోధించువారు గురువులు కారు. ఉపదేశకులును గారు. ఎవరిని గాంచినంతనే యితరులకు భక్తివినయములు పొడముునో వారిని గురువులుగా భావింపవలయును. వారి మనశ్శక్తి మనలను మార్చివేసెనని యెఱుంగవలయును మేము గురువులమని మిమ్ముద్ధరింతు మనువా రహంకారపూరితస్వాంతులుగాన వారు దురాత్ములగుదురు. ధనకాంక్షు లగుదురు. వారిపొంతకుఁ బోవరాదు.

"అనేకగురవస్సంతి శిష్యవిత్తాపహారకాః."

అన్నసూక్తి స్పష్టమే కదా. ఎవరిమోమున నానందరసము వెల్లివిరియుచు నిత్యసంతుష్టులనుభావము తోఁపఁజేయునో వారు భగవద్దాసులు. వారిని సేవించిన లాభము కలుగును. వారికి ధన మక్కఱలేదు. స్తోత్రపాఠము లక్కఱలేదు. శిష్యులం గూర్చుకొను ప్రయత్న మక్కఱలేదు. తగినపాత్రము దొరకినఁ బన్నిధిం గాంచినయట్లానందించి తమరనుభవించు మహానందమునకుఁ గారణమగుమార్గము నుపదేశించి యాశీర్వదింతురు. అంతియగాని మాతోడఁ గూడియుండి ఛాయాపటములను దీయింపుఁడని వారు కోరరు. శిష్యునభివృద్ధియే వారికి దక్షిణ. అట్టివారే సద్గురువులు;మహాభక్తులు. వారిదర్శనము మనపూర్వ

సత్కర్మఫలముగాఁ గలుగును. ఇఁకఁ గథవంకకు దృష్టిని మరలింతము.

మహాశయులారా! బాలకాండము తుదిభాగమునందు శ్రీరామమూర్తి యుత్తమరాజకన్యయై తన్ను విశేషించి ప్రేమించుచు నున్న సీతాపురంధ్రీమణింగూడి లక్ష్మీదేవితోఁడ మహావిష్ణువు ప్రకాశించినట్లు ప్రకాశించెనని పఠించితిరి.

"అతీవ రామశ్శుశుభేఽతికామయా విభుశ్శ్రియా విష్ణురివామరేశ్వరః."

అనుమూలముం బఠించితిరికదా. "అమరేశ్వరః విష్ణుః శ్రియా" అనఁగా దేవతలకుఁ బ్రభువగువిష్ణువు లక్ష్మింగూడి ప్రకాశించినట్లు. అనుటచే నిటఁ బేర్కొనఁబడినవిష్ణువు త్రిమూర్తులలో నొక్కఁడని యెఱుంగందగు.

"ఆదిత్యానామహం విష్ణుః."

అన్న గీతావాక్య మీయర్థమునకుఁ బ్రమాణము. త్రిమూర్తులు ప్రకృతిచే సృజింపఁబడినవారలనియు బ్రహ్మాండముల కధికారపూరుషులనియుఁ దేలెడిని. వీరిమాటయేల? ప్రకృతికింగూడఁ బరుఁడగువాఁడే భగవంతుఁడు. తదంశసంభూతులే యెల్లరు. అందు నీమూవురు భగవదంశము విశేషించికలిగిన యుత్తమోత్తమపూరుషులనియు, మనము వారిని భగవంతునిగా భావించుట వాంఛాప్రదానమునకే యనియు నెఱుంగవలయును. కనుకనే మహర్షులు

"స్వాత్మానందలవీభూతబ్రహ్మాద్యానందసంతతిః."

అని ప్రకృతిం బ్రశంసించిరి. ప్రకృతిపూరుషుల కనాదిత్వము సిద్ధము. "ప్రకృతిం పురుషం చైవ విద్ధ్యనాదీ ఉభావపి" అన్న

గీతోక్తిని మనము మఱువ రాదు. వైకుంఠవాసుఁడే రామరూప మున నవతరించె నన్నవాక్యమున కర్థమేమని ప్రశ్నింతురేని వైకుంఠ మనుశబ్దమునకు సత్యమగునర్థమును గ్రహించిన భగవంతుఁడే వైకుంఠవాసి యగునని తోఁచుననియు, విష్ణ్వాది నామములకు రూఢ్యర్థము గ్రహింప రాదనియు,యౌగికార్థము గ్రహింపవలయుననియు,నపు డీప్రశ్నమున కవకాశమే లేదనియు సమాధానమగును అనఁగా విష్ణు వెట్లు బ్రహ్మాండరక్షణమున కధికారిగాఁ బ్రకృతిచే నిర్మింపఁబడియెనో యట్లే శ్రీరామ మూర్తి మనుష్యలోకరక్షణకార్యమును జక్కనొనరించి ధర్మ సంస్థాపనము చేయ నవతరించెననియు, భగవంతుఁడు మహా మాయంగూడినట్లు శ్రీరామమూర్తి సీతాదేవింగూడియుండు ననియు గ్రహింపందగు. సీతారాములే ప్రకృతిపురుషులని మనము భావించిన వారే వీరగుదురుకదా. "భావనామాత్ర సంతుష్టహృదయః పరమేశ్వరః" అన్నసూక్తియే యిందులకుఁ బ్రమాణమనియు నెఱుంగవలయు. జానకీదాశరథుల ప్రవర్త నమే స్మృతిసమ్మతమనియుఁ దదనుసారముగాఁ బ్రవర్తించు వారలకు సుస్థనుపురుషార్థము లభించుననియు మనము దృఢ ముగ నమ్మవలయును. ఆచరిత్రమే శ్రద్ధాభక్తులు గలిగి పఠిం చుచుఁ గర్మగతులనైకరి పరికించుచుండవలయును.

కథారంభము.

*అయోధ్యాపురప్రవేశానంతరము దశరథుఁడు నల్వురు కుమారులు కోడండ్రును దన్ను సేవించుచుండఁగాఁ గొంతకా

* ఈయది యయోధ్యకాండాదిసర్గమునుండి యధ్యాత్మరామాయణ విషయములం గలుపుచు గ్రహింపఁబడియెనని యెఱుంగఁదగు.

లము సుఖముగా నుండెను. భగవతిసంకల్పించిన ప్రకారము భగవత్కార్యము నెఱవేఱునట్లెల్లరమనస్సులం దూహాలు జనించెను. మాయామహాసంకల్పమే కర్మరూపమున నెల్లర నాడించునని మన మెఱుంగందగు. తొలుదొలుత భరతశత్రుఘ్నుల కా కర్మమే గమనమును గల్పించెను. ఆకార్యము నెఱవేఱినంగాని రామావతారఫలము లోకములకుం గలుగునవకాశము లేదు. నిరాతంకముగా భగవత్సంకల్పము ఫలింపవలయునుగదా.

మిథిలానగరమునకు శ్రీరామాదులవివాహసమయమున యుధాజిత్తు వచ్చియుండెనుగదా. అతండు భరతుని మాతం డ్రి చూడఁగోరుచున్నాండని తెల్పియుండెను. వివాహానంతర మా యుధాజిత్తు భరతునిం దోడ్కొనిపోవ నయోధ్యకు వచ్చెను. కొంతకాల మావేడుకలం గాంచుచు నందే యుండెను. ప్రకృతి సంకల్పించినవెంటనే దశరథుఁడు భరతుని శత్రుఘ్నుని తోడ యుధాజిత్తుంగూడి పొమ్మని సాగనంపెను. భరతశత్రుఘ్నులయోధ్యానగరమును వదలిపోయిరి. ఈయిరువురిలో నెవ్వరున్నను దేవకార్యము నెఱవేఱదు. కనుకనే జన్మమునుండియు భరతశత్రుఘ్నులొక్కరీతిగా నుండిరి. శ్రీరామలక్ష్మణు లొక్క జట్టుగా నుండిరి. కర్మగతి గహనము కదా తొలుదొలుత నీ నలువురన్నదమ్ములు రెండుతెగ లగుటకుఁ గారణ మేమని యెవ్వరు నాలోచింపరైరి. ఏల? ఆయూహాయైన వారికిఁ గలుగకయుండఁజేసినది యాకర్మమే యని తలంపుఁడు. భరత శత్రుఘ్నులకు రామలక్ష్మణులపైఁ బ్రీతిలేదని యభిప్రాయము నొందరాదు. కాని యట్లుండినఁగాని దేవతాకార్యములు ఫలింపవు. మర్త్యలోకమున ధర్మము నెలకొని మానవులకు కొంత

కుదురునవకాశము లేదు. కావుననే కర్మమాయాపద్ధతుల ముందే నిరూపించెను. దాని నాపరాత్పరుఁడే మీఱఁబూనఁ డన నితరులమాట ప్రస్తావింపనేటికి?

భరతశత్రుఘ్నులు కేకయపట్టం జూడఁ బోవఁగా శ్రీరామలక్ష్మణులు దశరథసేవాకార్యమున జాగరూకులై కొడుకులగుటచేఁబోటువలసి పరితాపము తోఁపకయుండ సేవించుచుండిరి. కేకయనగరమున నాసోదరులిరువురు నెమ్మదిగా నుండిరి. చిరకాలమునకు వచ్చిరన్న ప్రేమమున రాజు వారల విశేషించి యాదరించుచుండెను. ఎన్నివిధముల నాదరించుచున్నను వారలు తండ్రిని స్మరించుచు వృద్ధత్వమును దలంచి పరితపించుచు శుశ్రూష చేయక వచ్చితిమి కదా యనుకొనుచు నుండిరి. అయోధ్యానగరమున నున్న దశరథుఁడును నాఁడఁ బరదేశమునకుం బోయియున్న యాత్మజులనిరువురను దలంచుకొని పరితపించుచుండెను. ఏలయనఁగా నానల్వురు నాలుగుబాహువుల వంటివారు. తనకుఁగల నాలుగుబాహువులపై నెట్టిప్రీతి యుండునో యానలువురుకొడుకులపై నట్టిసమానప్రీతి దశరథునకు నుండెను. ఐనను జ్యేష్ఠపుత్త్రుఁడగు శ్రీరామమూర్తి తండ్రికి మిక్కిలి ప్రీతిపాత్రుఁ డయ్యెను. ఏలయనఁగా భగవంతుఁడు దేవతలచేఁ బ్రార్థింపఁబడి రావణవధముఁగోరిన సురలప్రార్థనము నంగీకరించి మానవలోకమున దేహమును ధరించెను గదా.

తాను సనాతనుఁడయ్యు నరూపుఁడయ్యు నిర్గుణుఁడయ్యు, భక్తానుగ్రహార్థము ప్రకృతికల్పితరూపుఁ డయ్యెను. కనుకఁ దన్మాయామోహితుండగు దశరథుఁడు రామునియందు మిక్కిలి ప్రీతికలవాఁడగుట వింత కాదు. కౌసల్యయు నాకుమార

రత్నముం గాంచి పరమానందసాగరమున నోలలాడుచుం డును. సుందరాకారుఁడు, శూరుఁడు, అసూయారహితుఁడు, ఉపమానశూన్యుఁడు, గుణములచేఁ దండ్రివంటివాఁడు నగు కుమారుని గన్న తల్లియానంద మిట్టిదని వచింప నేరితరము?

శ్రీరామమూర్తి మిక్కిలి మనస్సున శాంతో మల రారఁగా నెదుటివారిమనస్సులకు నొప్పియే కలుగకయుండ మాటలాడుచు నెవరైనఁ గఠినముగ మాటలాడినను దాను నట్లే బదులు పలుకక, ఇతరు లేకారణమున నెంతేని యుపకారము చేసినను దానికే నిరంతరము సంతోషించుచు, నాత్మ జ్ఞానసంపన్నుఁడు కావునఁ దనకొరులు చేసిన యపకారపరం పరల నొక్కసారియైనఁ దలంపక, సదాచారనిరతులను సదా చారవిశేషములంగూర్చి ప్రశ్నించుచు, జ్ఞానవృద్ధులను మోక్ష విషయముల నడుగుచు, వయోవృద్ధులను గులక్రమాగతము లగుసంప్రదాయముల నడుగుచు, శస్త్రవిద్య నభ్యసించునపుడు కూడ నవకాశము దొరకిన వృథచేయక సాధువులతో భాషించు చుచు, మిగుల బుద్ధిమంతుఁడై మధురముగనే మాటలాడుచు, నీచునితోఁగూడఁ దానే తొలుత మాటలాడుచు నెల్లర కానం దముగలుగ సంభాషించుచు నుండువాఁడు. ఎన్నఁడుగాని తన వీర్యమున కచ్చెరువందఁడు విద్వాంసుఁడు కాఁబట్టి యసత్యము పలుకఁడు. పెద్దలు కనఁబడినచో నెదురేగి పూజించును. ఖేదములేక ప్రజలనెల్ల రంజిల్లఁజేయును. ఇట్టిసద్గుణము లెల్లను శ్రీరామునియందే నెలకొనియుండును. వేదశాస్త్రములయందు ధనుర్వేదమునందును బండితుఁడై శ్రీరామచంద్రుఁడు సర్వజన ప్రియుఁడయ్యెను. రాజోచితములగు న్యాయవ్యయాదులయందు

నిపుణుఁడయ్యెను. కాలవంశగతుఁడు కాఁడయ్యెను. విశేషించి సమయాచారమున నిరతుఁడయ్యెను. ఇట్లు లోకోత్తరగుణములు విరాజిల్లు నాశ్రీరామమూర్తిని భూదేవి తనకుఁ బాలకునిగాఁ గోరెను.

* ఒక్కనాఁడు శ్రీరామమూర్తి యోగమాయాస్వరూపిణి యగుసీతాదేవి చామరము వీచుచుఁ బ్రక్కన నిలుచుండఁగా నేకాంతముననున్న శ్రీరామచంద్రునికడకు నారదముని దేవలోకమునుండి యరుదెంచెను. అత్తరి దాశరథి తాంబూల చర్వణముచేయుచు దేవితో మందమందమధురోక్తులు పలుకుచుండెను. శుద్ధస్ఫటికసంకాశుఁడై యంబరమునుండి యవతరించు నాదేవమునిపతిం గాంచి శ్రీరామమూర్తి త్వరపడి లేచి యెదురేగి శిరస్సు భూమి సోఁక భక్తిపూర్వకముగా నమస్కరించి మహాత్మా! మావంటి సంసారులకుఁ బవుమీవ్యదర్శనము దుర్లభమని తలంతు. మేము విషయాసక్తచేతసులముకదా. పూర్వజన్మకృతసత్కర్మఫలముగా మీదర్శనము లభించెను. సంసారులకు మీవంటి సాధువులదర్శనము పూర్వపుణ్యమువలననే కలుగును. కృతార్థుఁడనైతిని ఏపని నామూలమునఁ జేయింపఁగోరి యరుదెంచితిరి? అని పరమానందమునఁ బలుకు శ్రీరామభద్రునిం గాంచి నారదముని యిట్లు పలికెను.

† శ్రీరామచంద్రా! లోకాచారమును బాటించుచు నిట్టి మాటలచే నన్నేల మోసపుచ్చఁబూనితివి? నేను సంసారినంటివి

* ఈభాగ మధ్యాత్మరామాయణమునుండి సంగ్రహింపఁబడినది.

† జగతామాదిభూతా త్వం సా మాయా గృహిణీ తవ. ౧౦. త్వత్సన్నికర్షాజ్జాయంతే తస్యాం బ్రహ్మాదయః ప్రజాః, త్వదాశ్రయా సదా భాతి మాయా

కదా. అది సత్యమే. నీవు యోగమాయ గ్రహించితివి. ఆమె జగదాదిభూతురాలు. నీయిచ్ఛ పొందమినమాత్రమున నామాయ మాయనుండి బ్రహ్మాదిప్రజలు పుట్టుచున్నారు. సత్త్వరజస్తమోగుణాత్మికయగు నామాయ నీయాజ్ఞచేఁ బ్రవర్తిల్లును. నీవు లోకత్రయరూపమగుగృహమున గృహస్థుఁడవై యున్నావు. నీవే త్రిమూర్తులుగ నుందువు. యోగమాయ తత్పత్నులుగ నుండును. ఇట్లే సకలదిక్పాలకులుగ నీవుండునప్పుడు మాయ తత్పత్నులుగ నలరు కావున మిమ్ము విడిచి యీలోకమందు భిన్నమగునదేదియు నెందును గానరాదు. మీరిరువురును దంపతు లనఁబడుదురు. నిర్లిప్తుఁడవగు నీవు తలంచినంతనె ప్రకృతి సకలమును సృజించును. ప్రపంచమెల్లఁ దుదకు నీయందే లీనమగు. మరల నీవలననే కలుగు. వృద్ధిఁబొందుటయు నీమహిమవలననే. కావున నీపాదపద్మములను భజించువారలకు కష్టములు కలుగవు. ముక్తినొందువారు వారలే. నేను నీభక్తజనములకుఁ గింకరుఁడను. కాన నన్ను భక్తులలో నొకనిఁగఁ జేసికొని రక్షించి

యా త్రిగుణాత్మికా. ౧౧. సూతేఽజస్రం శుక్లకృష్ణలోహితాస్సర్వదా ప్రజాః, లోకత్రయమహాగేహే గృహస్థస్త్వముదాహృతః. ౧౨. త్వం విష్ణుర్జానకీ లక్ష్మీశ్శివస్త్వం జానకీ శివా, బ్రహ్మా త్వం జానకీ వాణీ సూర్యస్త్వం జానకీ ప్రభా. ౧౩. భవాన్ శశాంకస్సీతా తు రోహిణీ శుభలక్షణా, శక్రస్త్వమేవ పౌలోమీ సీతాస్వాహాఽనలో భవాన్. ౧౪. యమస్త్వం కాలరూపశ్చ సీతాసంయమనీ ప్రభో, నిరృతిస్త్వం జగన్నాథ తామసీ జానకీ శుభా. ౧౫. రామ త్వమేవ వరుణో భార్గవీ జానకీ శుభా, వాయుస్త్వం రామ సీతా తు సదాగతిరితీరితా. ౧౬. కుబేరస్త్వం రామ సీతా సర్వసంపత్ప్రకీర్తితా, రుద్రాణీ జానకీ ప్రోక్తా రుద్రస్త్వం లోకనాశకృత్.

కాపాడుము. నీమాయచే నన్ను భ్రాంతుఁడనుగా నొనరింపకుము. బ్రహ్మ నీనాభికమలమునుండి పుట్టినవాఁడు. నే నా బ్రహ్మపుత్రుఁడను. కాన నీకుఁ బౌత్రుఁడను. నన్ను రక్షింపుమని పలికి భగవంతుని ధ్యానించుచుఁ బరమానందమున మేనుగగుర్పాటొంద నానందబాష్పధారలఁ దనువు తడుపఁబడుచుండఁగా రాజ్యరక్షార్థము దశరథుఁడు నిన్నభిషేకించును. ఈసందడిలో రావణవధమును మఱచివేసి నీప్రతిజ్ఞయే వ్యర్థమగునని పలికి యూరకుండెను.

నారదముని యిట్లు పలుకఁగ నాలకించి శ్రీరామమూర్తి మునిచంద్రా! నే నెఱుంగని దేదియు లేదు. మున్ను చేసిన ప్రతిజ్ఞను నెఱవేర్చెదను. సంశయింపకుము. కాలము ననుసరించి పూర్వకర్మమున కనుకూలముగా నాయాదుర్మార్గుల సంహరింతును. భూభారము నడంతును రేపే. దండకారణ్యమునకుఁ బ్రయాణము సాగింతును. పదునాల్గువత్సరము లందుందును. మునివేషమును ధరింతును. సీతావ్యాజమున దుర్మార్గుఁడగు రావణుం బొలియింతును. నా సంకల్పమున దుష్టదేహము లేక

౧౬. లోకే స్త్రీవాచకం యావత్తత్సర్వం జానకీ శుభా, పున్నామవాచకం యావత్తత్సర్వం త్వం హి రాఘవ. ౧౭. తస్మాల్లోకత్రయే దేవ యువాభ్యాం నాస్తి కించన, త్వదాభాసం హి చాజ్ఞానమవ్యాకృతమితీర్యతే. ౧౮. తస్మాజ్జాతం మహత్సూత్రం లింగం సర్వాత్మకం తతః. ౨౦. అహంకారశ్చ బుద్ధిశ్చ పంచ ప్రాణేంద్రియాణి చ, లింగమిత్యుచ్యతే ప్రాజ్ఞైర్జన్మమృత్యుసుఖాదిమత్. ౨౧. స ఏవ జీవసంజ్ఞశ్చ లోకే భాతి జగన్మయః, అవాచ్యానాద్యవిద్యైవ కారణోపాధిరుచ్యతే. ౨౨. స్థూలం సూక్ష్మం కారణాఖ్యముపాధిత్రితయం చితేః, ఏతైర్విశిష్టో జీవస్స్యాద్వియుక్తః పరమేశ్వరః.

యుండఁజేయుదు. అని రామమూర్తి ప్రతిన చేయఁగా నారద మునియానందించి తదనుజ్ఞాతుఁడై సురలోకమునకుం బోయెను.

అంత నొక్కనాఁడు శత్రువులనడంచు దశరథుఁడు సకలగుణాభిరాముఁడగు శ్రీరామునిం గాంచి తాఁజేయఁదగు పని యిదికదా యని యాలోచించెను. నేను జీవించియుండఁగా నీ రాముఁడు రాజగు టెప్పుడు? ఆమహోత్సవమును జూడవలయునన్న నాకోరిక యెప్పుడు ఫలించును? నాకు నత్యంత ప్రియుఁడగు రాము నభిషేకించి యాస్థితియందున్న నీకుమారు నెపుడు చూడఁగల్గుదును? సర్వభూతములపయి దయగలుగు నీ రామమూర్తి లోకులకు నాకంటెఁ బ్రియుండే యగును? వర్షించు మేఘుఁడు కర్షకుల కిష్టుఁడగును గదా. దిక్పతులంబోలు నీ రామచంద్రునకుఁ బట్టముగట్టి కన్నులారఁ గాంచి స్వర్గము నొందుభాగ్యము నాకుఁ గలుగునా? అని పెక్కుభంగుల నాలోచించి సకలకల్యాణగుణాభిరాముఁడగు పుత్త్రునిం గాంచి యామహామహీపతి మంత్రులతోఁ జక్కనాలోచించి రాముని యువరాజుగా నొనరింప నిశ్చయించెను. మఱియును మేధావి యగు నారాజు గ్రహనక్షత్రాదివైకృతమగు దివోత్పాతము

౨౩. జాగ్రత్స్వప్నసుషుప్త్యాఖ్యా సంవృతిర్యా ప్రవర్తతే, తస్యా విలక్షణ స్సాక్షీ చిన్మాత్రస్త్వం రఘూత్తమ. ౨౪. త్వత్త ఏవ జగజ్జాతం త్వయి సర్వం ప్రతిష్ఠితమ్, త్వయ్యేవ లీయతే కృత్స్నం తస్మాత్త్వం సర్వకారణమ్. ౨౫. రజ్జావహిమివాత్మానం జీవం జ్ఞాత్వా భయం వహేత్, పరాత్మాహమితి జ్ఞాత్వా భయదుఃఖైర్విముచ్యతే. ౨౬. చిన్మాత్రజ్యోతిషా సర్వాస్సర్వదేహేషు బుద్ధయః, త్వయా యస్మాత్ప్రకాశ్యంతే సర్వస్యాత్మా తతో భవాన్. ౨౭. అజ్ఞానాన్న్యస్యతే సర్వం త్వయి రజ్జౌ భుజంగవత్, త్వజ్జ్ఞానాల్లీయతే సర్వం

లను, మహావాతము, పరివేషము, సంధ్యాకాలదిగ్దాహాది రూపమగు నంతరిక్షోత్పాతములను, భూకంపము, శిలాపాతము, ప్రతిరక్తస్రావము లోనగు భౌమోత్పాతములను గిలకించి, తన తనువునందలి వార్ధకమును బరిశీలించి మంత్రులతో నీయుత్పాతము లెల్ల నాకు గాఁగలకీడును బోధించెడిని. కాన రామునిఁ ద్వరగా యువరాజుగాఁ జేయవలయుననియుఁ దెలిపెను. అంతియకాక రామమూర్తి సర్వజనప్రియుఁడౌట నెఱింగి పున్నమచందురునిబోలు మోముగల రాముఁడు తనశోకమును దొలఁగించువాఁడని నిశ్చయించెను. కావున నీకారణముల నన్నింటిని బరిశీలింపఁగా శ్రీరాముని యువరాజుగాఁ జేయుటయే తగినకార్యమను తనయభిప్రాయమును మంత్రులకు సంశయింపక బోధించెను. తనకుఁ బ్రజలకు శ్రేయస్సునుగోరి యాకార్యము సవరింపఁ ద్వరపడెను.

మంత్రులందఱును తనపూన్కికి సమ్మతింజూపఁగా నపుడే నానానగరవాసులను జానపదులను బిలిపించెను. రాజశ్రేష్ఠులను రాజసామాన్యులను వేలువేలఁ బిలిపించెను. కేకయరాజును జనకమహారాజును దూతలుపోయి పిలుచుకొనివచ్చునంతటి యవకాశములేమింజేసి యనంతర మీశుభవార్తను వారాల

తస్మాత్ జ్ఞానం సదాభ్యసేత్. ౨౮. త్వత్పాదభక్తియుక్తానాం విజ్ఞానం భవతి క్రమాత్, తస్మాత్త్వద్భక్తియుక్తా యే ముక్తిభాజస్త ఏవ హి. ౨౯. అహం త్వద్భక్తభక్తానాం త్వద్భక్తానాం చ కింకరః, అతో మామనుగృహ్ణీష్వ మోహయస్వ న మాం ప్రభో. ౩౦. త్వన్నాభికమలోత్పన్నో బ్రహ్మా మే జనకః ప్రభో, అతస్తవాహం పౌత్రోఽస్మి భక్తం మాం పాహి రాఘవ. ౩౧
అయోధ్యాకాండము. ప్రథమసర్గము.

కింతురుగాక యని యూహించి పిలువనంపక వచ్చెను. అయోధ్యకు వచ్చినవారలకెల్ల నివాసగృహముల నేర్పఱచి సకలవిధ మర్యాదలందనుపఁ దగినవారి నియమించెను. వారెల్లరు సకలాభరణభూషితులై యరుదెంచి తన్ను దర్శింప నానందించెను. కొలువుకూటమునఁ దా నాసీనుఁడై తనయానతిచొప్పున వచ్చినరాజులను బ్రజలను గాంచి యుచితాసనముల వారు కూరుచుండఁగాఁ దనపలుకులను వినఁగోరి చెంతఁగూరుచున్న వారినెల్లఁ దిలకించి సంతసించెను. ఆసభ దేవేంద్రునిసభవలె నుండెను.

మహాశయులారా! ఈభాగ మనేకసంశయములతోఁ గూడినది. విమర్శించి గ్రహింపఁదగినవిషయము లింక నేకములు గలవు. వానినెల్ల నెఱింగినఁగాని శ్రీరామచరిత్రము, దశరథునిప్రవృత్తి పరమపావనమని తేటపడదు. కనుక శ్రద్ధగా నాలకింపుఁడు. కొండవీటి చేదుడుత్రాడుగా నింతయేల వ్రాయవలయునని విసుగునొందకుఁడు. తొలుత సర్వశాస్త్ర రామాయణకథాభాగమును విమర్శించి యవ్వల వాల్మీకిరామాయణభాగమును బరిశీలింతము. శ్రీరామావతారము దేవతల యాపదలఁ దొలఁగించుటకని యంద ఱెఱింగినవిషయము. తన్మూలమున ధర్మసంస్థాపనమునకనియు స్పష్టమే. శ్రీరాముని వర్తనము మానవమాత్రుని బోలియుండుట సాధారణము. ఇప్పుడు మహామాయయే కార్యధురంధరురాలు. రామమూర్తి సాక్షిమాత్రుఁడు. రామసాన్నిధ్యమునఁగదా ప్రకృతి చరించు నని ప్రశ్నింపరాదు. వారల కుభయులకు నవినాభావసంబంధము కలదు. రామునినుండి సీతను వేఱుచేయ నెవ్వారికిని సాధ్యము

కాదు. ఉష్ణమునకు నగ్నికి నెట్టిసంబంధమో దానిని వేఱుచేయ నెట్లు సాధ్యముకాదో యిదియు నట్టిదే యని యెఱుంగనగును. ఇపుడు రెండుగా నున్నారే యనియు ననుమానింపరాదు. లోకులదృష్టి కట్లే యగపడును. అట్లు నటించినఁగాని లోక మునకు సీతబోధింప శక్యముకాదు. శ్రీరామమూర్తి మాయా మానుషవిగ్రహుఁడు. తన సర్వసాక్షిత్వమును, నిర్లిప్తతను వదలఁడు. మహామాయ పరమేశ్వరునిచ్ఛ నెఱింగి సకలకార్య ములను స్వతంత్రించి నిర్వహించును. భగవంతుఁడు ప్రకృతికి లోఁబడినట్లుండును. సర్వ మాతనికి లోఁబడునుగదా! లోక దృష్టి కట్లు కనఁబడునని గ్రహింపవలయు. ఈసిద్ధాంత మీ యధ్యాత్మ రామాయణభాగము బోధించును. మూలముం బరికింపుఁడు. తేటతెల్లముగఁ దెలియఁగలదు.

ఈవిషయము శ్రీమద్రామాయణమున నేల లేదని ప్రశ్నింపరాదు. ఒకొక్కరొకొక్కవిషయమును బ్రధాన ముగాఁ జేసికొని వ్రాసిరి. భగవత్తత్త్వమునే విశేషించి యధ్యాత్మరామాయణము బోధించును. భగవచ్చరిత్రమునే విశేషించి వాల్మీకిరామాయణము తెలుపును. లోకప్రవృత్తికి రెండవదియు, ముక్తికి మొదటిదియుఁ దోడుపడును. కావున నిందేది యుత్కృష్టము? ఏది యపకృష్టము? అని సంశయపడ రాదు. ఈ రెండును లోకోపకారకక్షమములే. లోకులంద ఱొక్కరీతిఁ గర్మముల నాచరించినవారు కారు. ఎవ్వరెవ్వరి కేదియేది హితమో వారువారు దానిదాని గ్రహింతురు. శర్కరయు గుడము మధురపదార్థములు. ఇందేది శ్రేష్ఠమన రాదు. కొందఱకు నొకటి, మఱికొందఱకు నింకొక్కటి

యిష్టములు. వారి కదియే శ్రేష్ఠముగఁదోఁచు. ముక్తికాము లగుమానవులు భగవత్తత్త్వము నెఱుంగఁగోరుదురు. త్రివర్గ కాములు (ధర్మార్థకామములఁ గోరువారు) భగవత్ప్రీత్యర్థన మును బఠింపఁగోరుదురు. ఈరెండును మానవులకు మిక్కిలి యుపయుక్తములే. ఈస్థితియందు హెచ్చుతగ్గులఁ బరిశీలింపఁ బ్రయత్నింపరాదు.

దేవతలు పురికొలుప నారదముని యరుదెంచినసుట యచ్చెరువుకొలుపదు. దేవకార్యమునకుఁ దాసై వచ్చుటయు నమ్మునికి సహజము. లోకులకు సదాచారము నేర్పుటకై రామ మూర్తి యెదురేగి నమస్కరించెను.

"ఊర్ధ్వం ప్రాణా హ్యుత్క్రామంతి యూనస్థ్సవిర ఆయతి,
ప్రత్యుత్థానాభివాదాభ్యాం పునస్తాన్ ప్రతిపద్యతే. ౧౨౦
అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః,
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యాయశోబలమ్." ౧౨౧

మను. ౨ అధ్యా.

పెద్దలకు విధిగా నమస్కరించిన నాయుర్విద్యాయశోబలములు వృద్ధియగునని స్మృతులు తెలుపుచున్నవి.

"సంప్రాప్తాయ త్వతిథయే ప్రదద్యాదాసనోదకే,
అన్నం చైవ యథాశక్తి సత్కృత్య విధిపూర్వకం. ౯౯
ఏకరాత్రం తు నివసన్నతిథిర్బ్రాహ్మణః స్మృతః,
అనిత్యం హి స్థితో యస్మాత్తస్మాదతిథిరుచ్యతే." మను. 3 అ. ౧౦౨.

ఒక్కరాత్రి నివసించువాఁ డతిథి యనంబడును. అట్టి యతిథిని సత్కరింపవలయునని స్మృత్యభిప్రాయము

"అతిథిత్వేన వర్ణానాం దేయం శక్త్యానుపూర్వశః,
అప్రణోద్యోఽతిథిస్సాయమపి వాగ్భూతృణోదకైః." ౧౦౭
యాజ్ఞవల్క్యస్మృతి. ఆచారకాండము.

అతిథి యింటికి రాఁగా సత్కరించుట కేమియు నింటలేదేని మంచిమాటల నాదరించి యాసన మర్పించి కూరుచుండఁ బ్రార్థించి జలము నొసఁగవలయును. అంతియకాని నాయింట నేమియు లేదు పొమ్మని కసరరాదని స్మృతి తెలుపుచున్నది.

"తృణాని భూమిరుదకం వాక్చతుర్థీ చ సూనృతా,
ఏతాన్యపి సతాం గేహే నోచ్ఛిద్యంతే కదాచన." ౧౦౨ మను. 3 అ.

"తృణగ్రహణం శయనీయోపలక్షణార్థమ్."

అని కుల్లూకభట్టు. శయనించుటకు వలయుపరికరమును, పండు కొనుస్థలము, మంచిమాటలు, జలము ననునీనాలుగు సాధు గృహముల నెల్లప్పుడుండును. అనఁగా దరిద్రుఁడైనను అతిథి యరుదెంచినఁ బండుకొనస్థలమును జూపి శయ్య నర్పించి మంచి నీరిచ్చి ఉపచారవాక్యములు పలికి సత్కరింపవలయునని స్మృతి తాత్పర్యము. దీనింబట్టి శ్రీరామమూర్తి భగవంతుఁ డయ్యు, సకలమునీంద్రసమర్చిత పాదారవిందుఁ డయ్యు, నతిథిపూజ ప్రధానమనున్యాయమును లోకులకుఁ దెలుపుటకై యీస దాచారము నాచరించెనని యెఱుంగవలయు.

"యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః,
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే."

అన్నగీతావాక్యము శ్రీరామచంద్రునభిప్రాయమునే వెల్లడించె నని యెఱుంగందగు. శ్రీరామమూర్తి యాచరించినదానినే శ్రీకృష్ణమూర్తి బోధించెనని మన మెఱుంగవలయును.

"సంసారిణా హి మునే లభ్యతే సత్సమాగమః,
అతస్త్వద్దర్శనాదేవ కృతార్థోఽస్మి మునీశ్వర."

అనునదియే "వాక్చతుర్థీ చ సూనృతా" అనునదియే యీ వాక్యము. నీదర్శనమువలన సఫలజన్ముఁడనైతిని. అనుభావము కలుగవలయునని శ్రీరాముఁడు మనకు బోధించెను. ఈయభిప్రాయమునే శ్రీకృష్ణమూర్తి శ్రీభాగవతమునందు నక్రూరునితో భాషించునపుడు

"న హ్యమ్మయాని తీర్థాని న దేవా మృచ్ఛిలామయాః,
తే పునంత్యురుకాలేన దర్శనాదేవ సాధవః."

అని తెల్పెను. ఇట్లు శ్రీరామమూర్తిచర్యను బరికింతుమేని స్మృతిసమ్మతముకాని దేదియే నుండదని తేటపడును.

దేవానాంప్రియులు కొందఱు మహామాయను దూఱుచు నామె నారాధించువారిని దూషింతురు. తఱచుగా నట్టివారు మతాంతరప్రవిష్టులుగ నుందురు. మతాంతరము స్వీకరింపఁగనే పూర్వమతమున వారికి ద్వేషము మెండుగ నుండును. వారలే తన్మతాచారముల దూఱువారు. మతభ్రష్టులు దూషించినచో మనకేలనని యుండరాదు. సమాధానము చెప్పకయున్నఁ బామరులాయాక్షేపములు సత్యములే యనుకొందురు. కానఁ బామరులమేలుకొఱకే సమాధానము.

"జగతామాదిభూతా యా సా మాయా గృహిణీ తవ,
త్వత్సన్నికర్షాజ్జాయంతే తస్యాం బ్రహ్మాదయస్సురాః."

అన్నమూలము నించుక పరిశీలించినచో సీత యెవతుకయో తెలియును. జగత్తులకు నాదిభూతురాలు. అనఁగా సర్వకర్త్రి

అనికదా యర్థము. నారదునభిప్రాయమున శ్రీరామమూర్తి పరమపూరుషుఁ డనియేకాని త్రిమూర్తులలో నొకఁడగువిష్ణు వని కాదు.

"త్వం విష్ణుర్జానకీ లక్ష్మీశ్శివ స్త్వం జానకీ శివా,
బ్రహ్మా త్వం జానకీ వాణీ సూర్య స్త్వం జానకీ ప్రభా."

అనునీమూలము పై భావమును దృఢపఱచుచున్నది. శ్రీరామమూర్తి పరబ్రహ్మమనియు సీత యోగమాయ యనంబడు మూలప్రకృతి యనియు నారదుఁడు స్తుతించుచున్నవాఁడు. నీసాన్నిధ్యమునఁ బ్రకృతి సకలమును సృజించునని ముని తెలిపెను. ఈభావమే

"మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరం."

అని శ్రీకృష్ణమూర్తిచే గీతాశాస్త్రమునఁ జెప్పఁబడియె. దీనిం బట్టి వికారమంతయుఁ బ్రకృతిదే యనియు, భగవంతుఁడు సర్వసాక్షియై యుండుననియు స్పష్టము. అర్చాదిరూపములన్నియుఁ బ్రకృతివే యనవలయు. నిరాకారమే పరబ్రహ్మము. సావయవమే పూజార్హము. తఱచుగా మానసికపూజయందు నయ్యది యే ధ్యేయమగును. యోగులు తేజోరూపముగా నాపరతత్త్వమును ధ్యానింతురు. ఇట్టు లుండఁగా భగవన్మాయను దూషించువారలతాత్పర్యమేమో తెలియ శక్యము గాకున్నది. భగవంతుఁ డొకనగరమున మహాసౌధమునఁ గాఁపురముండి భార్యంగూడి, కొన్నియామములు జీవకోటులఁ బుట్టించుచుఁ గొన్నియామములు పాలించుచుఁ గొన్నియామములు సంహరించుచు నుండుననియు, మనవలెనే యాదంపతులకు సుఖదుఃఖములు గలుగుచుండుననియుఁ, బండుగు లుపవాసములు వారు

చేయుచుందురనియు, నపుడపుడు జ్వరాదులు వచ్చుచుండు ననియు, మందులు పుచ్చుకొనుచుందురనియు వారలభావనము యుండనోపు. కావుననే వారలకు విగ్రహారాధనము, దేవాలయోత్సవములు, ప్రసాదవిశేషములని పిలువంబడు పథ్యోదనాదికములు మహాప్రియములుగ నుండును. అట్టివారలకుఁ బ్రకృతి నారాధించుపద్ధతి యెట్లు రుచించును?

వస్త్రహీనముగనున్న స్త్రీవ్యక్తిని బూజించుట శాక్తమున నాచారమని కొందఱు తలంతురు. కంచుకోత్సవము భగవదర్చనమని కొందఱూహింతురు. ఈయిరువురు సాక్కవిధమగుకర్మము నాచరించినవారే. కావున వారిభావములను బదులీయకుండుటయే యుత్తమకార్యము. జిజ్ఞాసువులను సమాధానము చెప్పవలయును. భగవంతు నారాధించుటయట్లో ప్రకృతి నారాధించుట యట్లే. ఈరెండును ధ్యానరూపములే. బాహ్యచక్రార్చన మద్దానికంటె నెన్నియోమడుంగు లధమము. షట్చక్రసంచారిణిగా భావించి విధిమంత్రముగా నారాధించుట యంతకంటె నుత్తమము

"తటిల్లేఖాతన్వీం తపనశశివైశ్వానరమయీం
నిషణ్ణాం షణ్ణామప్యుపరి కమలానాం తవ కళాం,
మహాపద్మాటవ్యాం మృదితమలమాయేన మనసా
మహాంతః పశ్యంతో దధతి పరమానందలహరీం." ౨౧

అను నీప్రమాణము పైవ్రాసినయభిప్రాయమును దేటపఱచుచున్నది. ఇట్టి యుత్తమమార్గము మతభ్రష్టులకుఁ బ్రియముగ రుచింపదు. ఈవిషయమున నొక్కమాట చెప్పవలసియున్నది. ప్రకృతిమయమే సృష్టియంతయుననియుఁ, బ్రకృత్యతీతుఁడా

భగవంతుఁడే యనియు, నారాధనవిశేషములన్నియుఁ బ్రకృతి వికృతులకేయనియు నెఱుంగవలయును. ఈవిషయము నెఱింగినచో మతాచారములను దూషించునవకాశమే యుండదు. ఐకమత్య మొనఁగూడును. ఎంతకాల మీవిషయము నెవ్వఁ డెఱుంగఁడో వానికి నుత్తమమార్గ మగమ్యమే యన వలయు.

ఇట్లు నారదముని పలుకఁగా భగవంతుఁ డాలకించి మునీ! ఈవిషయము నెఱుంగుదును. ప్రతిన నెఱవేర్తును. భూభారము నడంతును. అంతియకాక

"సీతామిషేణ తం దుష్టం సకులం నాశయామ్యహం."

అని పలికెను. ఈవాక్యమున నొకవిశేషము కలదు. దాని మన మెఱుంగవలయును. సీతను రావణుఁడు హరింపఁజాలఁ డనియు, హరించినట్లు లోకులు తలంచునట్లుచేసి యాకారణమున వానిఁ జంపుదుననియు రామునాశయము కదా. దుష్కార్యముల నొనరించువారు సమూలముగ నశింతు రన్నన్యాయము లోకులకెల్లఁ దెలుపవలయు. దాని నెఱింగినవా రట్టిదుష్కా ర్యముల నొనరింపరు. అనునీతిని శ్రీరామమూర్తి తెలిపెను. ఈవాక్యమును మనము లెస్స పరికించితిమేని, భగవంతు నెడఁ బాయనిసీతను రావణుఁ డపహరించెనన్నవార్త యసత్య మనియు, హరిహరబ్రహ్మాదులకు నెఱుంగఁదరముకాని యోగ మాయను సీచరాక్షసుఁ డపహరించె నన్నవార్త యెంతమా త్రము విశ్వాసపాత్రముకాదనియు, నాప్రకృతియే లోకుల కిట్టిభ్రాంతిని గల్గించి వానిం బొడవడంచెననియు, భగవంతుఁ డగు శ్రీరామమూర్తి సర్వముం జూచుచు సాక్షిమాత్రుఁడుగ

నుండెననియు మనము గ్రహింపఁగలము. ఇది యధ్యాత్మ రామాయణహృదయము. ఇఁక వాల్మీకిరామాయణమునఁ గలకథను బరిశీలింతము.

"తత్రాపి నివసంతౌ తౌ తర్ప్యమాణౌ చ కామతః,
భ్రాతరౌ స్మరతాం వీరౌ వృద్ధం దశరథం నృపం." 3

అని మూలము. భరతశత్రుఘ్నులు మాతామహునియింట నివసించి వారెల్లవిషయములఁ దమ్ము సంతుష్టమానసులఁ జేయుచుండఁగా నేకొఱంతలు లేకున్నను వృద్ధుఁడగు దశరథమహారాజును స్మరించుచుండిరని యర్థము. దీనింబట్టి యాలోచింపఁగా నాకుమారులు పితృవాత్సల్యముగలవారలని తేటపడియెడు.

"దశరథో వృద్ధోఽభూన్న రాజ్యభరణే సమ్యక్ క్షమతే. అపీదానీం రామం యువరాజం కారయేదిత్యచింతయతామితి భావః." అని గోవిందరాజులు.

"శుశ్రూషాకాలోఽతీత ఇతి ధర్మలోపభియా పితరం స్మృతవంతావితి తాత్పర్యమ్." అని మహేశ్వరతీర్థులు.

ఈ రెండుభావములు న్యాయ్యములుగ నున్నవి. భరతశత్రుఘ్నులకుఁ గలపితృభక్తిని ధర్మైకశీలత్వమును వెల్లడించుచున్నవి. ఇచ్చోఁ దెలుఁగు.

చ. అలరుచు నిట్టులుండియును నాసహజన్ములు వీరు లాత్మలోఁ
దలఁచిరి వృద్ధుఁడై పరఁగు తండ్రిని బల్మఱు; నెట్లు మోయఁగాఁ, గలఁడొకో భూభరం బిఁక నికామముదంబున
రామచంద్రును, జ్జ్వలతరయౌవరాజ్యపదభారముఁబూనఁగఁ
జేయుటొప్పుగా.

క. ముదిసినతండ్రికి శుశ్రూ
షదగన్ సల్పంగఁ దగినసమయ మరిగెడిం
గద దానధర్మలోపం
బౌదవుఁగదా యనుచుఁ జింతఁ బూనిరి వారల్.

(ఆంధ్రశ్రీమద్రామాయణము.)

క. అచ్చుటనుండియు నిచ్చలు
నెచ్చినసుఖసంతతులను నెలమిం గనుచున్
నిచ్చలు స్మరించుచుండిరి
సచ్చరితులు దశరథేశు జనకున్ వృద్ధున్.

(వాల్మీకిరామాయణము.)

మహాత్ములు విమర్శకు లీపద్యముల నుదాహరించి నా పద్యము లాకాశరామన్నపంచాంగమువలె నున్నవనియు, వావిలికొలనువారిపద్యము హృద్యమనియు, మూలార్థపోషక మనియు వ్రాసిరి. వారికింగలపక్షపాత మెట్టిదో సరసాగ్రగణ్యులే గ్రహింతురుగాక. ద్రుతముపై ద్రుత మసహ్యమని వారే వేఱొకచో నాక్షేపించిరి. "సుఖసంతతులను నెలమిన్" అనువావిలికొలనువారిపద్యమున నయ్యది పొడసూపినను వదలిరి. దుష్పక్షపాతము కాదా యిది. పైనుదాహరించినవ్యాఖ్యానాభిప్రాయము చేర్పకయున్న రసమేమికలదో సరసు లూహింపఁగలరు.

భరతుఁడు రామభక్తాగ్రగణ్యుఁడని ప్రసిద్ధియే కదా. పితృభక్తుఁడగుట యొకవింత కాదు. తత్సమ్మతుఁడగుశత్రుఘ్నుఁడు నట్టివాఁడే. వారు శ్రీరాముని రాజమౌళి యువరాజుగాఁ జేయఁడా, వృద్ధుఁడౌట రాజ్యభారము మోయఁ

జాలఁడుకదా యని యాలోచించుట విచిత్రముకాదు. పితృశుశ్రూష యిట్టికాలమున నొనరింపక హాయిగా భుజించుచుండుట న్యాయ్యమా యని యూహించుటయు ధర్మమే. ఈకుమారుల ప్రవృత్తింబట్టి యాలోచింపఁగా, జననీజనకుల శుశ్రూషించుట ప్రధానకార్యమనియు, భ్రాతృప్రీతి యత్యుత్తమ మనియుఁ దేటపడియెడిని. ఆ రాజకుమారులం గాంచి పెద్దలసేవించువిధము మనము నేర్చుకొనవలయును.

"ఉపాధ్యాయాద్దశాచార్య ఆచార్యాణాం శతం పితా,
సహస్రం తు పితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే." ౧౪౫. మను. ౨ అ.

అను నీమనుస్మృతి రాజకుమారులప్రవృత్తినే యనుసరించి తెలుపుచున్నది. ఈకాలమున జననీజనకులశుశ్రూషలం దనుప్ నాచారము శూన్యమైన దనవచ్చును. శ్రీరామాయణపాఠఫల మట్టిసదాచారముల నలవరించుకొనుటయే యనవలయును. తల్లిదండ్రులఁ దిరస్కరించిన భగవంతుని దిరస్కరించుటయే యగును. శ్రీరామాదికుమారు లీవిషయమున నెట్లు ప్రవర్తించిరో యెఱింగి మనముకూడ నట్టిప్రవర్తనమున కలవాటుపడవలయునని యూహింపవలయును. లేక యున్న రామాయణపారాయణఫలము శూన్యప్రాయమగును.

"స హి దేవైరుదీర్ణస్య రావణస్య వధార్థిభిః,
అర్థితో మానుషే లోకే జజ్ఞే విష్ణుస్సనాతనః."

అనుమూలమున విశేష మొక్కండు కలదు.

వైకుంఠమనునగరము నివాసముగాఁగలిగి త్రిమూర్తులలో నొక్కఁడుగ లెక్కింపఁబడుచు జగత్పాలనాధికారము

మాత్రముగలిగిన విష్ణువనువాఁడు శ్రీరామమూర్తి కాఁడు. సనాతనుఁ డనఁగా శాశ్వతుఁడని యర్థముకాన, నిత్యవస్తువగు పరబ్రహ్మమే ప్రకృతివిశిష్టుఁడై నిర్మలజ్ఞానము మానవలోకమున వెలయింపఁజేయ నుత్సహించెను. కావుననే మాయామానుషవిగ్రహుఁడన్నవిఖ్యాతిఁ గాంచెను. వైకుంఠశబ్దమునకు రూఢ్యర్థముకాక యౌగికార్థమును గ్రహించునెడల నయ్యది శాశ్వతమనంబడును. రూఢ్యర్థమునే గ్రహించునెడల నయ్యది నశ్వరమే యగును. తదధిపతియగువిష్ణువు తక్కిన బ్రహ్మశంకరులవలె నేకాలముననో నశించువాఁడే యగును.

"యథాకాశస్థితో నిత్యం వాయుస్సర్వత్రగో మహాన్,
తథా సర్వాణి భూతాని మత్స్థానీత్యుపధారయ. ౬
సర్వభూతాని కౌంతేయ ప్రకృతిం యాంతి మామికాం,
కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహం. ౭
ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునః పునః,
భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్. ౮
న చ మాం తాని భూతాని నిబధ్నంతి ధనంజయ,
ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు." గీత. ౯ అధ్యా. ౯.

అను నీశ్రీకృష్ణవాక్యములయందుఁ బైభావ మిమిడియున్నది. విష్ణ్వాదులు శాశ్వతులను ప్రమాణములయందుఁ గనంబడుచున్నవికదా. వానికిం గతియేమని ప్రశ్నింపరాదు. అశ్వత్థామాదులు చిరకాలజీవులను ప్రమాణములు గలవు. ఒక్కభగవంతుఁడుతప్ప రూపవంతమగునదియంతయు నశ్వరమేయగును. అట్టిసమయమునకే మహాప్రళయమని పేరు. మహాప్రళయమున వటపత్త్రశాయియై విష్ణువున్నయట్లు పురాణములు ఘోషించు

చున్న వే యందు రేని, వటపత్త్రము, విష్ణువు, మార్కండే యుఁడు అనుమూఁడువ్యక్తులును స్థిరము లనవలసివచ్చును. అవి సృష్ట్యాదికాలమనుకొనిన నీసంశయమున కవకాశమే యుండదు. మార్కండేయమునికూడ మహాప్రళయమున నుండునేని యింక నెందఱో యుందురనుకొనవచ్చును. కావున శాశ్వతవస్తు వొక్కపరబ్రహ్మమే యని యెఱుంగుట మంచి మార్గము. ఈవిషయము గీతావాక్యములయం దిమిడియున్నది కదా. ఈగీతోపనిషదర్థమే

"ఉన్మేషనిమిషోత్పన్నవిపన్నభువనావళిః"

అనులలితాసహస్రనామవాక్యము తెలుపుచున్నది. ప్రసుదా హృతములగు గీతాశ్లోకములయందలి సప్తమశ్లోకార్థమే యిది యని యెఱుంగందగు.

"సహస్రశీర్షా పురుషః సహస్రాక్షస్సహస్రపాత్"

అన్న శ్రుత్యర్థమే

"సహస్రశీర్షవదనా సహస్రాక్షీ సహస్రపాత్,"

అనులలితాస్తుతి తెలుపుచున్నది.

"మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరమ్"

అనుగీతావాక్యము నర్థమే.

"ఆబ్రహ్మకీటజననీ వర్ణాశ్రమవిధాయినీ"

అనుపరమేశ్వరీస్తుతి తెలుపుచున్నది. అధ్యాత్మరామాయణము కూడ నీవిషయమును దృఢపఱచెనుగదా. ఇందొకొక్కటియు వేఱువేఱుభావములు తెలుపక యేకత్వమునే తెలిపెడిని. ఇట్లు ప్రకృతివిశిష్టమగుపరబ్రహ్మమే శాశ్వతవస్తువను

టయే సిద్ధాంతము. తద్భిన్నమగునదియెల్ల నశ్వరమే యని యెన్నవలయును. ప్రకృతి మాపరబ్రహ్మమే సీతారామరూప ముల వెలసెననియు, నందుఁ బ్రకృతియగుసీతయే సర్వకర్త్రి యనియుఁ, బరబ్రహ్మమగు శ్రీరామమూర్తి సాక్షిమాత్రుఁడై స్వాత్మానందమున నుండుననియు నిశ్చయించుకొనవలయును.

కొందఱు శ్రీరాముఁడు భగవదవతారమే కాదనియు, మానవులలో నత్యుత్తమచరిత్రుఁడనియు, నేకపత్నీవ్రతుఁడను మొదలగుసద్గుణములు కలవారెందఱో యున్నవారనియు, నుత్తమపురుషులలో గణింపఁదగినవాఁడే కాని శ్రీకృష్ణమూర్తి వలె నవతారపురుషుఁడు కాఁడనియు నందురు. వారిసంశయము లను దొలఁగించుటకే యీవిషయము వ్రాయఁబడును. శ్రీమ ద్రామాయణము ప్రమాణము కాదన్నవారితో మనకు వాదమే లేదు. ఆప్రకార మాలోచించినను భగవంతుఁడని తోఁపదన్న వారలంగూర్చియే సంభాషింపందగు. ఈఘట్టమునఁ బేర్కొనఁ బడిన శ్రీరామచంద్రునిసద్గుణము లొక్కపరమేశ్వరునకుండక్క నితరులకు నుండ నవకాశముకలదా యని యోజింతము.

"న హి రూపోపపన్నశ్చ వీర్యవాననసూయకః,

... ...

న చావమంతా భూతానాం నచ కాలవశానుగః.

... ...

సమ్మతస్త్రిషు లోకేషు వసుధాయాః క్షమాగుణైః,

... ...

లోకపాలోపమం నాథమకామయత మేదినీ."

అనునంతవఱకుఁ గలగుణము లేలోకమందుఁగాని యేకాలమున నేపురుషునియందు నుండఁజాలవు. "న చ కాలవశానుగః" అనునదియే భగవంతుఁ డనువిషయమును దేటపఱచెడు. కాలవశంవదుఁడు కానివాఁ డొక్కఁ భగవంతుఁడు తప్ప వేఱొక్కఁ డుండుననవచ్చునా. లోకోత్తరగుణగణ్యుఁడగు రామమూర్తి మానవులయం దుత్తమునిగా లెక్కించుట సాహసమని యెన్నఁదగు. భగవల్లక్షణము లెట్టివని యెఱుంగనివారే యట్లందురు. సత్యవాఙ్నిరతి, ఆశ్రితరక్షణాదృతిలోనగు లోకోత్తరగుణములు శ్రీరామమూర్తియందు మూర్తీభవించియున్నవని తెల్లమగును. ఆయాభాగములయం దావిషయమును జర్చింతును. అట్టివారియాక్షేపములకుం జోటీయక పరమపావనమగు శ్రీరామచరిత్రమును బఠింపందగును.

"శాకికే సమయాచారే కృతకల్పో విశారదః."

అనుమూలమునఁ గలవిశేషార్థమును బరిశీలింతము.

"శాకికే లోకైకప్రమాణకే సమయాచారే సాంకేతికాచారే."

అని గోవిందరాజులు,

"శాకికే లోకవిదితే సమయాచారే సాంకేతికాచారే."

అని మహేశ్వరతీర్థులు వ్రాసిరి. ఈయర్థము భగవత్తత్త్వమును బోధింపదు. ఇందలితత్త్వ మేదియని విచారించు టావశ్యకము. ఇట్టివిమర్శనములయందుఁ బక్షపాతబుద్ధి యుండరాదు. ఉండినచో నందలిసత్యము గోచరింపదు.

శ్రీరామమూర్తి లోకులకు సదాచారముల నేరుప నవతరించెను. అంతియేకాని కార్యాంతరము లేక యేమియుఁ

దోఁపక కాదు. పరమేశ్వరుఁడు ధ్యేయమగువస్తువు వేఱొకటి లేనందునఁ దన్నుఁ దానే చూచుచుండును. శ్రీరామమూర్తి తాను జేయుచుఁ దన్మూలమున నెల్లరకు సదాచారముల నేర్పు ననుట సిద్ధాంతము. ఇతరులకు బోధించునాచారము కలవాఁడు కాఁడు. లౌకికమనఁగా బాహ్యపూజ, సమయమనఁగా మానసిక పూజ అను వీనియందు నేర్పటి యని గ్రహింపవలయును. బాహ్యపూజలు చేయుచు మానసికారాధనము గావించువాఁ డని సారము. బాహ్యపూజానిరతులే పెక్కండ్రు లోకమునఁ గలరు. వారల కాయాచారము వదలకయుండఁ దానును దేవ తాంతరములఁ బూజించును. యోగులకు నిష్టమగుధ్యానమును జేయునని తాత్పర్యము. సమయమనఁగా మానసికపూజ యను నర్థము కలదా యనుశంక కొందఱకుం గలుగవచ్చును.

"అకులా సమయాంతస్థా సమయాచారతత్పరా."

అని లలితానామసహస్రవాక్యము.

"సమయాంతస్థా. దహరాకాశావకాశే చక్రం విభావ్య తత్ర పూజాదికం సమయ ఇతి రూఢ్యోచ్యతే. స చ సర్వైర్యోగిభిరైకమత్యేన నిర్ణీతోఽర్థ ఇతి సంకేతరూపత్వాదపి సమయః. తత్ప్రతిపాదకత్వాద్వసిష్ఠశుక సనకసనందనసనత్కుమారాఖ్యతంత్రపంచకమపి సమయపదేన వ్యవహ్రియతే, తదంతస్తత్ప్రతిపాద్యతయా తిష్ఠతి."

"సమయాచారతత్పరా. మహానవమ్యాం జాతే సతి పశ్చాన్మూలా ధారాదుత్థితా దేవీమణిపూరే ప్రత్యక్షా భవతి. తాం తత్రైవ పాద్యాది భూషణాంతైరుపచారైస్సంపూజ్యానాహతచక్రం నీత్వా తాంబూలాంత మభ్యర్చ్య విశుద్ధచక్రం నీత్వా తత్రత్యచంద్రకళారూపైర్మణిభిః పూజ యిత్వాఽఽజ్ఞాచక్రం నీత్వా నీరాజ్య సహస్రదళకమలే సరఘామధ్యే సదా

శివేన సంయోజ్య తిరస్కరిణీం ప్రసార్య సమీపమందిరే స్వయం స్థిత్వా యావద్భగవతీ పునర్నిర్గతా సతీ మూలాధారకుండం ప్రవిశతి తావత్తావత్ సమయం ప్రతీక్షేతేత్యాకారో గురుముఖైకవేద్యస్సమయాచారః తయో రుభయవిధయోరపి తత్పరా ఆసక్తా" అని సౌభాగ్యభాస్కరభాష్యము.

ఈవిషయమే,

"సుధాసింధోర్మధ్యే సురవిటపివాటీపరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చింతామణిగృహే,
శివాకారే మంచే పరమశివపర్యంకనిలయాం
భజంతి త్వాం ధన్యాః కతిచన చిదానందలహరీం.

అని శంకరభగవత్పాదు లుపదేశించిరి.

"భగవత్పాదాచార్యాస్సమయమతపారదృశ్వానః సమయాచారప్రవణాస్సమయరూపాం స్తువంతి. సమయాచారో నామ అంతరపూజారతిః. కులాచారోనామ బాహ్యపూజారతిరితి రహస్యం." అని లక్ష్మీధరవ్యాఖ్య.

ఈ ప్రమాణములంబట్టి సమయాచారమనఁగా మానసిక ధ్యానమనియు, నయ్యదియే యోగీంద్రులచే నాచరింపఁబడు నదియు, లౌకికమనఁగా సామాన్యమానవు లాచరించుబాహ్య పూజయనియు స్పష్టము. సమయపూజ యనఁగా

"ప్రదీపజ్వాలాభిర్దివసకరనీరాజనవిధి
స్సుధాసూతేశ్చంద్రోపలజలలవైరర్ఘ్యరచనా,
స్వకీయైరంభోభిస్సలిలనిధిసౌహిత్యకరణం
త్వదీయాభిర్వాగ్భిస్తవ జనని వాచాం స్తుతిరియం."

అన్నట్టిభావనయే

"ఆత్మా త్వం గిరిజా మతిః పరిజనాః ప్రాణాశ్శరీరం గృహం
పూజా తే విషయోపభోగరచనా నిద్రాసమాధిస్థితిః,

సంచారః పదయోః ప్రదక్షిణవిధిస్తోత్రాణి సర్వాగిరః
యద్యత్కర్మ కరోమి తత్తదఖిలం శంభో తవారాధనమ్."

అనుసూక్తి యెల్లరకు విదితమేకదా. ఈభావన నిరంతరయోగాభ్యాసబలమునఁగాని కుదురదు. అట్టివారికి బాహ్యపూజ యక్కఱలేదు. అందును విగ్రహారాధన మత్యల్పఫలప్రద మగుట వార లంగీకరింపరు. కొందఱంగీకరించి చేయుచుందురు కదా అందు రేని, పామరులకు భక్తిని గలుపుటకొఱకే యని యెఱుంగవలయు.

"సక్తాః కర్మణ్యవిద్వాంసో యథా కుర్వంతి భారత
కుర్యాద్విద్వాం స్తథాఽసక్తశ్చికీర్షుర్లోకసంగ్రహమ్. ౨౫
న బుద్ధిభేదం జనయేదజ్ఞానాం కర్మసంగినాం,
జోషయేత్సర్వకర్మాణి విద్వాన్ యుక్తస్సమాచరన్. గీత. 3 అ. ౨౬.

అను నీగీతాశాస్త్రవాక్యములు పైనుదాహరించినవిషయమును దృఢపఱచుచున్నవి. కావున శ్రీరామమూర్తియుఁ దన కక్కఱ లేకపోయినను పామరులకు సదాచారములను దెలిపి వాని నాచరించి వారుత్తమమార్గమును గనుఁగొనవలయునని బాహ్య పూజల నాసక్తిగలిగినట్లు చేయుచు వసిష్ఠాదిమహర్షులకు సమ్మత మగు మానసికధ్యానము చేయుచు నెల్లరకు సదాచారమును గలుపుచున్నవాఁడను విశేషార్థమును గ్రహింపవలయును.

"స్వయమేవ స్వమాత్మానం పశ్యంతం పరమేశ్వరం"

అనురీతిగా మనస్సునఁ దన్నుఁ దానే చూచుకొనుచుండునని రామచరిత్రవిశేషమును మనము చక్కఁగాఁ బరిశీలింపవలయును.

"అమోఘక్రోధహర్షశ్చ త్యాగసంయమకాలవిత్."

అనుమూలమునుగూడ నించుక పరిశీలింతము. దీనిచే శ్రీరామ మాహాత్మ్యము తేటపడును. క్రోధహర్షములు సార్థకములుగాఁ గలవాఁడని యర్థము. భగవదన్యులక్రోధహర్షములు సర్వదా ఫలవంతములు కావు. భగవంతునకు వాస్తవముగాఁ గ్రోధమే విషయమున నుండదు. హర్షము నట్లే. అయిన నధర్మతత్పరులయందుఁ గ్రోధమున్నయట్లు నటించును. వారిదుష్కర్మముల రూపుమాపును. ధర్మములయందు హర్షముగలవాఁడు. ఆహర్షము ధర్మతత్పరులకు వృద్ధిని గల్గించును. ఎప్పుడు కాని ఫలవంతముగాకయుండదు. అనిచెప్పుటచేత శ్రీరామమూర్తి యధర్మమును రూపుమాపుటకు ధర్మమును వృద్ధిచేయుటకు నవతరించెనని మన యెఱుంగవలయును.

"ఆయకర్మణ్యుపాయజ్ఞస్సందృష్టవ్యయకర్మవిత్."

అని మూలమున నొకనీతి కలదు. సేకరించినధనములో నెంత వ్యయముచేయవలయు ననువిషయ మిందుఁగలదు. కొందఱు సర్వము నర్థివశముచేయవలయు నందురు. కొందఱు కొంతయే వ్యయింపవలయునందురు. ఋణముచేసియైన దానము చేయ వలయు నందురు. ఎంతదానము చేయవలయుననఁగా

"కశ్చిదాయస్య చార్ధేన చతుర్భాగేన వా పునః,
పాదభాగైస్త్రిభిర్వాపి వ్యయస్సంచోద్యతే తథా."

నాల్గవ భాగముగాని సగముగాని మూఁడుభాగములు గాని సంపాదించినధనమున దానముచేయవలయు ననుప్రమాణము గలదు. అంతియగాని సర్వస్వము యాచకులకు నొసంగి

తన్ను నాశ్రయించినవారికిఁ గష్టములు గల్గించుట న్యాయము కాదని యీభాగమునుండి మన మెఱుంగవలయు. సత్థుప్రస్థుఁడు విశ్వామిత్త్రుఁడు లోనగువారియాచార మిందులకు విరుద్ధము కాదా యందురేని సామాన్యశాస్త్రమునఁగాక విశేషశాస్త్రవిధి ననుసరించి యట్టియాచారము లుండుననియు నవి సామాన్య జనాచారమునఁ బనికి రావనియు నెఱుంగవలయును. గృహస్థులందఱు కుటుంబపోషణాదులకుఁ దగినధనముంచుకొని యవ్వల మిగిలినదానిని వ్యయింపవలయు ననునీతి నెఱుంగందగును. ఇట్టు లీభాగమునుండి యనేకవిషయములు గ్రహింపఁదగియుండును.

ఇందుఁ గొందఱు దశరథుఁడు భరతశత్త్రుఘ్నులు దేశాంతరములకుంబోవఁగా నిదియే సమయమని రామాభిషేకప్రయత్నముచేయ నెంచెననియుఁ గావుననే

"న తు కేకయరాజానం జనకం వా నరాధిపః,
త్వరయా చానయామాస పశ్చాత్తౌ శ్రోష్యతః ప్రియం."

అనుమూలమునఁ జెప్పఁబడినచందమునఁ గేకయరాజున కీవార్త తెలిసిన నతఁడు మున్ను కైకవివాహకాలమునఁ దీసికొన్న మాటను నెఱవేర్పవలదా యని యడుగునన్నభయముచేతనే యాతనింబిలువంబంపలేదనియు నట్లుగావున సత్యమందాదరము కలవాఁడు కాఁడనియు నాక్షేపింతురు. కాని యిట్టు లాక్షేపంచువారు విషయమును ముందువెనుకల నెట్లు చెప్పఁబడినదని యూహించువారు కారు. ఎప్పు డెట్లు తోఁచునో యప్పు డట్టు లాక్షేపింతురు. కేకయరాజును బిలువనంపనందులకు వారు చెప్పినహేతువు సరిపడును. జనకరాజును బిలువనంపనందుల

కేమి కారణము వారు చెప్పుదురు? ఈకార్య మాజననున కత్యంత ప్రీతిపాత్రము కదా. ఈభాగమునకు సమాధాన మేమనఁగా దశరథుఁడు కేకయరాజునకు భయపడి తెలుపక పోలేదు. రామాభిషేక మింత వేగముగాఁ జేయఁదలంచుటకుఁ గారణము లనేకములు గలవు.

"దివ్యంతరిక్షే భూమౌ చ ఘోరముత్పాతజం భయం
సంచచక్షేఽథ మేధావీ శరీరే చాత్మనో రుజాం. ౪౩
పూర్ణచంద్రాననస్యాథ శోకాపనుదమాత్మనః,
లోకే రామస్య బుబుధే సంప్రియత్వం మహాత్మనః. ౪౪

అనుమూలమును బరిశీలింతము. దానఁ గొన్ని సందియములు డిందుపడు. తత్త్వ మిదియని తేలు. కర్మగతుల నెఱుంగఁ దరమ్ము కాదుకదా.

"ఆదానస్య ప్రదానస్య కర్తవ్యస్య చ కర్మణః,
క్షిప్రమక్రియమాణస్య కాలః పిబతి సంపదః."

అను నీతిశాస్త్రము ననుసరించి యోజింపఁదగియుండును. శ్రీ రామాభిషేక ప్రయత్నము సాగినఁగాని దేవతలకార్యము ఫలింపదు. దశరథున కకాలమున మరణచిహ్నము లనేకము లగపడసాగెను. శాస్త్రజ్ఞానముకలవాఁడు కాన నయ్యావి వేగమ తనకు మృతిని గల్పించునని యతఁ డెఱింగెను. ప్రతిదినము జరాభారమున బుద్ధిపాటవము తప్పుచుండెను. సర్వసమ్మతుఁడై యుక్తవయస్కుఁడై రాజలక్షణసమన్వితుఁడై రామమూర్తి చెంతనుండెను. బంధువులయాగమనమునకుఁగా నీమహాకార్యము తడవు సేయరాదని యాతఁ డెంచెను.

“కదా నామ సుతం ద్రక్ష్యామ్యభిషిక్తమహం ప్రియం.”

అనుమూలము పైని వ్రాసినయభిప్రాయమును దృఢపఱచెదు. ఏక్షణమున నీకార్యమును సాగించి యీనేత్రములతోఁ బట్టభద్రుఁడగుకొడుకును జూతునా యని రాజువ్విళ్లూరుచుండెను. ఈకారణములంబట్టి పరికింపఁగా, దశరథుఁడు భరతునకు రాజ్యము సంక్రమింపఁదగియున్నదని యెఱింగి మోసముచేసెననునాక్షేపము వ్యర్థమనియు, భరతుని మాతామహునింటికిం బంపుటకు మాతులాగమనమే కారణమనియు, వృద్ధుఁడగు కేకయరాజును జూచుట భరతునకు న్యాయ్యమని రాజూహించి పంపెననియు, భరతశత్రుఘ్నులయెడఁబాటునకు నోర్వఁజాలక పలుమాఱు వారిని స్మరించెనన్నవాక్యము ప్రమాణమనియు నెఱుంగందగును. (రాజాపి తౌ మహాతేజాః స్సస్మార ప్రోషితౌ సుతౌ) ఇట్టి లోకకార్యములు సాగుటకు దైవయత్నమే కారణముకాని దశరథునియూహ కారణముకాదని తెలియందగు. ఇదియే కర్మసిద్ధాంతమునకుఁ జక్కని యుదాహరణమనియు, “గహనా కర్మణో గతిః” అన్నభగవద్వాక్యమును మఱువరాదనియుఁ దెలియందగు. ఈవిషయము మఱొక్కచోఁ దర్కింతము. ఇఁకఁ దరువాతికథను బఠింతము.

దశరథుఁడు రామాభిషేకవార్తను బ్రజలకుఁ దెల్పుట.

* ఆమహాసభలో దశరథమహారాజు తనమాటలకొఱకు వేచియున్న పెద్దలనెల్లం గాంచి స్వాభిప్రాయ మిదియని యెఱిం

* ఇది ౨ండవసర్గమునుండి సంగ్రహీతము. అధ్యాత్మరామాయణకథయుం నిందుఁ గలుపఁబడును.

గింపఁ దలంపుకొన్నవాఁడు కనుక గంభీరకంఠధ్వనితో నిట్లు పలికెను. సభాసదులారా! నాకుఁ బూర్వులగురఘుప్రభృతులీవిశాలరాజ్యమును న్యాయ్యముగా నౌరసపుత్త్రతుల్యముగాఁ బాలించిరనుట మీ రెఱింగినవిషయమే కదా. వారివంశమున జన్మించిన నేను రాజన్వంతంబగుట సుఖములకుఁ దగిన యీ రాజ్యమున కెంతయు సుఖముఁ గూర్ప నెంచినాఁడను. మా పూర్వులమార్గమునే యనుసరించి యేమఱుపాటు లేక నా యోపినంతదనుకఁ బ్రజలను రక్షించితిని. కొఱఁతఁగాంచని పరాక్రమమున శ్వేతచ్ఛత్త్రమును ధరించి జరాభారము క్రమ్మినంతవఱకు సార్వభౌముఁడనై రాజ్యమును గాపాడి జగద్ధితము గోరుచు వచ్చితిని. కావున నా శ్వేతాతపత్త్రచ్ఛాయయందే కాలముం గడపిన యీనాశరీరము జరాక్రాంతమయ్యెను. మనుష్యాయుర్మానము నుల్లంఘించి పెక్కేండ్లు జీవించుటం జేసి యీశరీరము విశేషించి సడలినది. వృద్ధుఁడనైతిని. కాన మున్నువలె శ్రమముల కోర్వఁజాలను. విశ్రాంతినే కోరుచున్నాఁడను. ధర్మపరిపాలనము సామాన్యమైనపని కాదు. శౌర్యాదులుగలిగినవారే యప్పనికిఁ బూనవలయును. ఇంద్రియనిగ్రహము లేమిచే నట్టిశౌర్యాదిప్రభావములు లేనివారల కప్పని యశక్యము. అప్పని మిగుల భారము. అట్టి భూభారమును వహించి విశేషించి యలసితిని. ఈరీతిగా నలసి ప్రజారక్షణమున శక్తిచాలని నేను రాజ్యభారమును వహింపఁ గుమారుని శ్రీరామచంద్రుని నియమించి నాయందు విశేషప్రీతిగల యీ విప్రప్రవరులను సమ్మతింపఁజేసి విశ్రాంతినొందవలయునని వాంఛించుచున్నాఁడను.

జ్యేష్ఠకుమారుఁడగు రామచంద్రుఁడు పరాక్రమాది గుణముల దిక్పతులం బోలినవాఁడు. మత్సమానుఁడే యగు. ధర్మవిదులయం దుత్తముఁడు. పురుషోత్తముఁడై పుష్యనక్షత్రయుతచంద్రునిం బోలి ప్రకాశించుచున్నవాఁడు. అట్టిరామచంద్రుని యౌవరాజ్యమున నభిషేకింపఁ గోరెదను. జగత్త్రయము బహులనాథులుగలిగినదయ్యు నేమహాత్ముని బ్రభువుగాఁ బడసి నాథవంతమగునో యట్టితేజశ్శాలియు లక్ష్మీవర్ధనుఁడు నగులక్ష్మణునకు నన్నయు నయినరామమూర్తి మీకుం దగిన ప్రభువు. పెక్కేండ్లు నేను భరించిన యీరాజ్యభారమును జ్యేష్ఠకుమారునందునిచి గొప్పలాభము భూమికిఁ గల్పించి విశ్రాంతినొందువాఁడ.

రాజ్యధురంధరత్వమున మిక్కిలి యలసి వృద్ధునకు నాకు రామమూర్తి నభిషిక్తునిగఁ జేయఁబూనిన యీశుభకార్యము తగినప్రయోజనమును గల్గించునదియే యగునేని, నాచేయఁబూనిన యీకార్యము చక్కఁగా యోజించి చేయఁబూనినదే యని మీకుఁ దోఁచునేని, నాకీకార్యమునకు సమ్మతినిండు. మీయనుమతి లేక యేమిచేయఁగలను? శ్రీరామాభిషేకమున నాకుం బ్రీతి యుండినను, ఇంతకంటె హితమగుకార్యము వేఱొకఁడు గలదేని దాని నాలోచింపుఁడు. పక్షపాతముగల యొకఁడు చేయుకార్యమునకన్నఁ బక్షపాతవిరహితులగుమధ్యస్థులయాశయము వేఱుగ నద్దాని నతిశయించియే యుండును. అయ్యది ప్రశ్నప్రతివచనములచేఁ జక్కఁగా విచారముచేసి యెంతయో మేలుగూర్చును.

అని యిట్లు దశరథమహారాజు పలుకఁగా నందుఁగల

రాజులందఱు విని పరమానందమున నాతని మిక్కిలి కొనియా డిరి. జనులందఱు సంతోషముప్పొంగఁగా మేలుమేలనిరి. ఆధ్వని మిన్నుముట్టి వారలయంగీకారమును సూచించెను. వసిష్ఠాదిమహర్షులు దశరథుఁడు న్యాయ్యముగాఁ బలికిన యామాటలు కుల నాలకించి రాజులు ప్రజలు తన్ననుసరింపఁగా నంగీకరించి ముందు మునుపటి మాటలాడఁ దలంచి రాజేంద్రా! పెక్కేండ్లు జీవించి వృద్ధుఁడవై తివి. కాన నీ వాశ్రీరామచంద్రుని యువరాజుగా నభిషేకింపుము. మహాభుజుఁడు బలాధికుఁడు రఘువంశాభర ణమునగు శ్రీరామమూర్తి పట్టపుటేనుంగునెక్కి శ్వేతాత పత్రము నీడయందు ముఖసౌందర్యమక్కజమై వెలుంగ వచ్చు చుండఁగా మే మెల్లఁ గన్నులారఁ జూడఁ గోరుచున్నారము.

అనుమాట లాలకించి వారిసంతోషము నెఱింగినవాఁ డయ్యుఁ దెలియనట్లు నటించి వారినుండియే యెఱుంగఁదలంచి మహీపతులారా! నేను రామాభిషేకవార్తను దెలిపినంతనే చక్కఁగా నాలోచింపక రాముఁడు మాకుఁ బ్రభువుగా వలయు నని కోరితిరి. దీన నామనస్సున సందియ ముదయించెడిని. మీరేల రాముని బ్రభువుగా నభిలషించితిరో సత్యముగా నెఱిఁగింపుఁడు. న్యాయ్యముగా నేను జాగరూకుఁడనై రాజ్య ముం బాలించితిని. ఇట్టులుండఁగా ముగ్ధుఁడగు నాపుత్త్రుని యువరాజుగాఁ జూడఁగోరెదరు. ఏల? నాయందలి యపరాధ మేదియో యెఱుంగఁగోరుచున్నాను. అని యడుగ నందుఁగల రాజన్యులు పౌరజానపదులందఱు దశరథుని దిలకించి మహీశ శేఖరా! నీకుమారుఁడు సకలకల్యాణగుణాభిరాముఁడు. ప్రశస్తగుణవంతుఁడగుటయేగాక దేవతలతో సాటిరాయుం

డుట నా రాముని గుణములు మాకెంతయు నానందమును గలి
గించుచున్నవి. వానిని నీ ప్రశ్నము ననుసరించి చెప్పఁదగు సుసమయము గాన వచింతుము.

ప్రజలు రామగుణములను బ్రశంసించుట.

శ్రీరాముఁడు సాటిలేని శౌర్యధైర్యాదిగుణములుగలిగి యింద్రునితో సాటియగువాఁడు. ఇక్ష్వాకువులలో శ్రేష్ఠుఁడు. సత్పురుషసేవ్యుఁ డతఁడే యని చెప్పఁదగినవాఁడు సత్యధర్మాసక్తుఁడు. ధర్మము దానిఫలమగుసంపత్తియు రామునినుండియే కలిగినవి. ఇతరసహాయములేక యతఁడొక్కఁడే వానిని నిర్వహింపఁగలఁడు. ప్రజారంజనమున నమృతకరుఁడే యగు అని రామచంద్రునందుఁగల సకలగుణములను బ్రశంసించిరి. మఱియు నిట్టిగుణములుఁగలిగి దిక్పాలురతో సమానుఁ డయినందున భూదేవి ప్రభువుగా నా రాముని గోరినది. నీమహాభాగ్యవశమునఁ బ్రజలశ్రేయస్సుకొఱకు నీకు నీకుమారుఁడు జనించెను. మరీచికుమారుఁడగుకశ్యపునివలె నీ రాముఁడు నీయదృష్టమునఁ గల్గెను. దేవతలు రక్కసులు ఋషులు గంధర్వోరగప్రభృతులు నెల్లప్రజలు శ్రీరామునకు నాయురారోగ్యప్రభృతులుకలుగఁ బ్రార్థింతురు. కాలముచెల్లినపురంధ్రులు ప్రాయముగలయన్నుమిన్నలు నభీష్టదానదక్షుఁడగుభగవంతుని సమాహితచిత్తముల సాయంప్రాతఃకాలములయందు శ్రీరామాభ్యుదయమును గోరి నమస్కరించి వేఁడుదురు. వారు కోరుచున్న యీ రామాభిషేకము నీయనుగ్రహమున ఫలవంతమగుంగాక. కువలయనేత్రుఁడగు రామచంద్రుని యువరాజుగాఁ జూడఁ గోరుచున్నారము. ఆశ్రితులవాంఛితములఁ దీర్చువాఁడవు. దేవాదిదేవుఁడగువిష్ణు

మూర్తికి సమానుఁడై ప్రపంచహితము చేయువానికిఁ గలిగి యౌదార్య మలంకారము కాఁగా నలరారు శ్రీరామచంద్రుని మాకెల్లహితమగుటంబట్టి త్వరపడి యుత్సాహముతో యువ రాజుగా నభిషేకింపుమని ప్రార్థించిరి.

మహామతులారా! ఈభాగము శ్రీరామచంద్రునిమహాత్త్వమును దెలుపునదియుఁ, బూర్వకాలమునందుఁ గలరాజప్రజాసంబంధమును దెలుపునదియు నై యున్నది. కాన నించుక విమర్శింతము. తొలుత రాజలక్షణములను బ్రజాపాలనపద్ధతిని బరికింతము.

"బ్రాహ్మణేషు క్షమీ స్నిగ్ధేష్వజిహ్మః క్రోధనోఽరిషు,
స్యాద్రాజా భృత్యవర్గేషు ప్రజాసు చ యథా పితా. ౩౩౪
పుణ్యాత్షడ్భాగమాదత్తే న్యాయేన పరిపాలయన్,
సర్వదా నాధికం యస్మాత్ప్రజానాం పరిపాలనమ్. ౩౩౫
చాటతస్కరదుర్వృత్తమహాసాహసికాదిభిః,
పీడ్యమానాః ప్రజా రక్షేత్కాయస్థైశ్చ విశేషతః. ౩౩౬
అరక్ష్యమాణాః కుర్వంతి యత్కించిత్కిల్బిషం ప్రజాః,
తస్మాత్తు నృపతేరర్ధం యస్మాద్గృహ్ణాత్యసౌ కరాన్. ౩౩౭
యే రాష్ట్రాధికృతాస్తేషాం చారైః జ్ఞాత్వా విచేష్టితం,
సాధూన్ సమ్మానయేద్రాజా విపరీతాంశ్చ|ఘాతయేత్. ౩౩౮
ఉత్కోచజీవినో ద్రవ్యహీనాన్ కృత్వా వివాసయేత్,
సద్దానమానసత్కారాన్ శ్రోత్రియాన్ వాసయేత్సదా. ౩౩౯
అన్యాయేన నృపో రాష్ట్రాత్స్వకోశం యోఽభివర్ధయేత్,
సోఽచిరాద్విగతశ్రీకో నాశమేతి సబాంధవః. ౩౪౦
ప్రజాపీడనసంతాపాత్సముద్భూతో హుతాశనః,

రాజ్ఞః కులం శ్రియం ప్రాణాంశ్చాదగ్ధ్వా న నివర్తతే.” ౩౪౧

యాజ్ఞవల్క్యస్మృతి. ౧౩ అధ్యా.

అనుస్మృతివాక్యముల ననుసరించి పరికించినచో రాజధర్మము మిక్కిలి కష్టమైనదని తేలకమానదు. ఆకష్టమునుండి యుత్తీర్ణుఁడగుటచే రాజునకంటెఁ బుణ్యాత్ముఁడు లేఁడనియు స్పష్టమగును. ప్రజారంజనతత్పరుఁడై ధర్మవిధుల ననుసరించి ప్రజలఁ బాలించు రాజు ప్రజలు చేయుపుణ్యముల నాఱవపాలు గైకొనును. లేనిచో వారు చేయుపాపములనుండి యాఱవ పాలు గ్రహించుననియు నూహింపందగును. మానవసామాన్య ధర్మములు రాజున కన్వయింపవు. రాజధర్మము లితరుల కన్వ యింపవు. కాన రాజధర్మములు కొన్ని యన్యాయ్యములుగం దోఁచును. వాని నాచరించుటంజేసి రాజును దూషింపరాదు. ఆతనిలక్ష్యము ప్రజల సధర్మప్రవర్తకులుగఁ జేయరాదని యుండుట యుఱుంగందగు. వంచకులు, నమ్మించి సొమ్ము హరించు వారు, తెలియఁబడకయుండఁ బాపముల నొనరించువారు, ఐంద్ర జాలికులు, ఘాతుకులు లోనగువారిచేఁ బీడింపఁబడుచుండు ప్రజలను జక్కఁగాఁ గాపాడవలయు. లేఖకులవలనను, గణ కులవలనను బ్రజలు కష్టపడకయుండ విశేషించి కాపాడందగు. రాజపాలనము లేనిచోఁ బ్రజలు పాపముల నొనరింతురు. కావున నట్లు పాపములు చేయకయుండఁ గాపాడినరాజు పుణ్య ములనుండి యాఱవపాలు కైకొనును. కావున రాజధర్మములు మిక్కిలి జాగరూకుఁడై నఁగాని యనుష్ఠింపఁజాలినవి కావు. రాజు వినయవంతుఁడు కావలయు. అది లేనిచోఁ బ్రజలను వశంవదులఁ జేసికొనఁజాలఁడు.

"వృద్ధాంశ్చ నిత్యం సేవేత విప్రాన్ వేదవిదశ్శుచీన్,
వృద్ధసేవీ హి సతతం రక్షోభిరపి పూజ్యతే. ౩౮
తేభ్యోఽధిగచ్ఛేద్వినయం వినీతాత్మాపి నిత్యశః,
వినీతాత్మా హి నృపతిర్న వినశ్యతి కర్హిచిత్. ౩౯
బహవోఽవినయాన్నష్టా రాజానస్సపరిచ్ఛదాః,
వనస్థా అపి రాజ్యాని వినయాత్ప్రతిపేదిరే. ౪౦
వేనో వినష్టోఽవినయాన్నహుషశ్చైవ పార్థివః,
సుదాః పైజవనశ్చైవ సుముఖో నిమిరేవ చ. ౪౧
పృథుస్తు వినయాద్రాజ్యం ప్రాప్తవాన్మనురేవ చ,
కుబేరశ్చ ధనైశ్వర్యం బ్రాహ్మణ్యం చైవ గాధిజః. ౪౨
ఇంద్రియాణాం జయే యోగం సమాతిష్ఠేద్దివానిశం,
జితేంద్రియో హి శక్నోతి వశే స్థాపయితుం ప్రజాః. ౪౪

మనుస్మృతి, ౭ అధ్యా.

అను నీమనుస్మృతివచనముల ననుసరించి వినయముఁగున్ననే రాజు ప్రజల వశంవదులుగఁ జేసికొని పాలింపఁజాలు. వేనుఁడు లోనగు రాజులు వినయము లేక నశించిరి. పృథువు లోనగువారు వినయవంతులై రాజ్యమును బొంది యశఃకీర్తుల నార్జించిరి. అట్టివినయము పెద్దలనుండి నేర్చుకొనవలయును.

"అర్థశాస్త్రాదిజ్ఞానేన వినీతోఽప్యతిశయార్థం తేభ్యో వినయమభ్యసేత్."

కుల్లూకభట్టు.

పాండిత్యముచేత వినయము రాదనియు, నహంకారము వదలి పెద్దల సేవించిననే యది కలుగుననియు మనుస్మృతిభావము. ప్రభువునన్న యహంకారమును మాని ప్రజాప్రతినిధినన్న జ్ఞానముగలిగి శరీరము ప్రజాసేవకై యర్పింపఁదగునన్న భావ మల

వహించగా రాజు ప్రజారక్షణము చేయవలయును. ఇట్లు శరీరసుఖ
ముసు బాధింపక ప్రజారక్షణమే ధర్మమన్న న్యాయము నను
సరించిన రాజు భగవత్సాన్నిధ్యమున నుండును. ఇంద్రియ
జయము ప్రజావశీకరణమున కాధారమని స్మృతి ఘోషించె
డిని. దానికి యోగము నభ్యసింపవలయునని మనుస్మృతి హెచ్చ
రించుచున్నది.

"యదా వినియతం చిత్తమాత్మన్యేవావతిష్ఠతే,
నిస్పృహస్సర్వకామేభ్యో యుక్త ఇత్యుచ్యతే బుధైః."

అనుగీతావాక్యము ననుసరించి నిశ్చలచిత్తుండైనగాని నిస్పృ
హుండు కాడు. అప్పుడుగాని సర్వకామములు నశింపవు. కామ
ములు నశించినంగాని భగవద్భక్తి కుదురదు. కావున సర్వశ్రేయ
స్సులకు మూలము యోగాభ్యాసమని సిద్ధాంతము. అట్టివాఁ
డగు రాజు జగత్తును వశీకరించుకొను టబ్బురమా!

"బాలోఽపి నావమంతవ్యో మనుష్య ఇతి పార్థివః,
మహతీ దేవతా హ్యేషా నరరూపేణ తిష్ఠతి." ౮. మను. ౭. అ.

ప్రజలు రాజును సామాన్యమాత్రునిగాఁ దలంపరాదనియుఁ,
దమ్ము రక్షింపవచ్చిన దేవతనుగా భావింపవలయుననియు మను
స్మృతి తెల్పుచున్నది. బాలుఁడైనను రాజు దేవతయే యను
భావము మానవులకు నుండఁదగును. ఇట్టిభావముగల ప్రజలు,
అట్టిప్రవర్తనముగల ప్రభువు కలుగఁగా నిఁక ధర్మమునకుఁ
గొఱంతయేమి? ఈపద్ధతులు రెండును కోసలరాజ్యమునఁ గలవని
తేటపడును.

అప్పటియాచారములు.

దశరథుఁడు రాము నభిషేకింపం దలంచెను. నిరంకుశ
ప్రభుత్వ మాకాలమునఁ గలదనుట యెల్ల రెఱింగినదియే.

అందును రాజు వృద్ధుఁడై మరణచిహ్నములు కనంబడఁగా భీతుఁడై సత్వరంబ రాము నభిషేకించి కన్నులారఁ గాంచి ధన్యుఁడు కాఁగోరెను. మంత్రులతో నాలోచించుట సహజమే. ఆతోందఱలో సామంతరాజులను బౌరులను జానపదులను మహర్షులను బిలువనంపెను. తాఁజేయఁబూనినపని సర్వసమ్మతము కావలయునన్న భావ మాకాలపు రాజులకుం గలిగియుండుట యాచారమే యని మన మెఱుంగవలయును. ప్రజాసమ్మతముగాఁ బ్రభువు వర్తింపవలయుననియుఁ, బ్రభువును భగవంతునిగాఁ బ్రజలు భావింపవలయుననియు నుపదేశించుస్మృతుల ప్రకారము ప్రవర్తించునాచార మాకాలమునఁ గలదనుట స్పష్టమే. ఆరాజ్యమే రాజన్వంతమనంబడును. అట్టియాచారము లేకాలమున నున్నను బ్రజలకు సుఖముగల్గు ననుట కేమి సందియము? ప్రభుభక్తిలేని ప్రజలు ప్రజలఁ గన్నబిడ్డలవలె నోమని ప్రభువు నుండినచో నాకాలము దుఃఖప్రదమనుటయు స్పష్టమే. అన్యోన్యానురాగము సుఖహేతువనుటయే యిందుఁగల సారము.

ఈయాచారము ననుసరించియే రాజు జానపదులంగూడఁ బిలువనంపెను. జానపదులు (పల్లెలలో నివసించువారు) వివేకహీనులన్న భావము దుర్భావమని యీకథ బోధించుచున్నది. నాగరకులు వివేకులన్న నానుడికలిగినను సమష్టిదృష్టిం బరికించిన నయ్యది పొరపాటని తోఁచును. "సంఘే శక్తిః కలౌ యుగే" అన్ననీతియుఁ గ్రొత్తదికాదుకదా. ముఖ్యముగా జానపదులయనురాగమే ప్రభువునకుఁ బ్రధానము. పౌరుల యనురాగ మద్దానికి నీడుకాదని యూహించుట పొరపాటుగాదు.

ఈసిద్ధాంతము స్మృతిసమ్మతమని యిందుదహరించినవాక్యము లే బోధించును. కావునఁ గీర్తికాముఁడగు రాజు తాఁ జేయఁబూను కార్యము రాజ్యమునఁగల వయోవృద్ధులకు జ్ఞానవృద్ధులకుం దెలిపి వారిసమ్మతినొంది యొనరించిన నయ్యది చిరస్థాయి కాఁ గలదనియు, నట్లు లేనిచో రూఢమూలముగాని భూరుహము వలె క్షణకాలముననే చెడుననియు మన మీభాగమునుండి యెఱుంగవలయును.

"ఇదం శరీరం కృత్స్నస్య లోకస్య చరతా హితం,
పాండురస్యాతపత్త్రస్య చ్ఛాయాయాం జరితం మయా. ౭
రాజప్రభావజుష్టాం హి దుర్వహామజితేంద్రియైః,
పరిశ్రాంతోఽస్మి లోకస్య గుర్వీం ధర్మధురం వహన్. ౮
సోఽహం విశ్రమమిచ్ఛామి పుత్త్రం కృత్వా ప్రజాహితే,
సన్నికృష్టానిమాన్ సర్వాననుమాన్య ద్విజర్షభాన్." ౧౦

అను నీభాగము దశరథునాశయమును బోధించుచున్నది. ఇందు విశేషించి రాజత్వము ప్రజాసుఖకల్పనమునకే యేర్పడె నన్నయభిప్రాయము కలదు. రాజు స్వసుఖము నించుకంతయుం బాటింపక ప్రజాహితమునకే పాటుపడవలయు నన్ననీతి నీ భాగము తెలుపుచున్నది.

"అరాజకే హి లోకేఽస్మిన్ సర్వతో విద్రుతే భయాత్,
రక్షార్థమస్య సర్వస్య రాజానమసృజత్ప్రభుః." 3 అ. ౭

అను మనుస్మృతియుఁ బైభావమునే తెలుపుచున్నది. ప్రజా రక్షణార్థమే బ్రహ్మ రాజును సృజించెనని యీశ్లోకార్థము. కనుక వాల్మీకి స్మృతిసమ్మతముగ రామచంద్రునియు దశరథు నియుఁ బ్రవర్తనముగలదని తేటపఱిచెను. ప్రజారక్షణరూప

మగుధర్మభారమును జిరకాలము మోసితిని. ఇఁక సహింపఁ జాలను. కావునఁ బ్రజాహితకార్యమును నిర్వహింప శ్రీరాముని నియమింప నెంచితిని. ఈకార్యము సర్వసమ్మతమే నొనరింతునని దశరథుఁ డుగ్గడించెను. శూరుఁడు ధర్మరక్షణతత్పరుఁడు నగుట నాకుమారుఁడు మిమ్ము రక్షింపఁగలఁడని తేటపఱచెను. ఈ భాగమును జక్కఁగఁ బరిశీలించితిమేని యాకాలపువారికి ధర్మ రక్షణమున నెంతయాసక్తిగలదో తెలియనగును. రాజ్యపాలన మనఁగాఁ బ్రజల నధర్మమునఁ బ్రవర్తింపకయుండ నియమించి ధర్మమార్గమున నడచునట్లు చేయుటయే యని తేలెడిని. ధర్మము భగవత్స్వరూపము. ధర్మము నారాధించుట యనఁగా భగవంతు నారాధించుటయే కాని వేఱుగాదు.

"యత్ర ధర్మోఽహ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ,
హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః. ౧౪
ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః,
తస్మాద్ధర్మో న హంతవ్యో మానో ధర్మో హతోఽవధీత్. ౧౫
వృషో హి భగవాన్ ధర్మస్తస్య యః కురుతే హ్యలం,
వృషలం తం విదుర్దేవాస్తస్మాద్ధర్మం న లోపయేత్. ౧౬
ఏకఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతి యః,
శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి." ౧౭

మను. ౮ అధ్యా.

అను నీమనుస్మృతివాక్యములు పైనవ్రాసినయర్థమునే స్పష్ట పఱచుచున్నవి. ధర్మము రక్షించినచో నయ్యది వాని రక్షించును. దానిని నశింపఁజేసిన నది వాని నశింపఁజేయును. కావున రాజును, సభ్యులనఁగా రాజునకు మంచియాలోచనము చెప్పు

మంత్రులు లోనగువారలును ధర్మముననే దృష్టియునిచి ప్రజా రక్షణకార్యమునఁ బ్రవర్తించినఁగాని లోకక్షేమము కలుగదు. అధర్మ మనేకరూపములుగలదిగ నుండును. వర్ణధర్మముల నాశ్రమధర్మములరక్షించుటయు నద్దానియం దంతర్భాగములుగ నుండును. వర్ణధర్మము లుండఁదగవనువాదము దూరదృష్టిగలవార లనువదింపఁదగినది కాదు. వర్ణధర్మములు ప్రతి దేశమునందును గలవు. నామాంతరముల నవియుండును. అంతియకాని భరతఖండమునఁ దప్పఁ బ్రపంచమునఁగల యే భాగమునందును లేవన్నవాదము నిస్సారమైనది. ఆచారభేదములే యవి యున్నవనుటకు దృష్టాంతముకదా. అసవర్ణవివాహము పాశ్చాత్యదేశములయందు గర్హింపఁబడుటయేటికి? జాతిభేదములు కలుగుటచేతనేకాదా. జాతిభేదము లుండవచ్చుంగాని యం దవాంతరభేదము లుండరాదని మఱికొందఱందురు. ఒక్కజాతియందే మతభేదములుండుట పాశ్చాత్యులయందును గనంబడును. సభామండపముల నవి లేకున్నను వాడుకయందేమో యవి చెలరేఁగుచునే యున్నవి వానిం బాటింపక మనదేశమునందే కలవనియు, వానిమూలమున్నమన యభివృద్ధి నశించుచున్నదనియుఁ గొంద ఱుద్ఘోషింతురు. పాశ్చాత్యదేశములందు సాగినమహాహవము వారికి సమాధాన మొగ్గడించుచున్నది. పంక్తిభోజనమే యైకమత్యమును గల్గించునేని యిటీవలసాగిన మహాఘోరసంగ్రామ మయ్యది యసంగతమని తేటపఱచుచున్నది. కావున నేకాలమునందు నే దేశమునందును నామాంతరములచే వర్ణధర్మములు నాశ్రమధర్మము లుండు ననుట సిద్ధాంతము.

మాయ యనియు, భగవంతుఁడు సాక్షీమాత్రుఁడే యనియు సారము. ఇట్లు సారము గ్రహించుటచేత భగవత్తత్త్వమాహాత్మ్యము స్పష్టమగు. మఱియు మహామాయ సర్వమునకు నాదికారణమనియుఁ దేటపడును. త్రిమూర్తులు నింద్రాదిదిక్పాలకులు ప్రకృతినిర్మితులై తదాజ్ఞ శిరస్సులం దాల్చి తమతమ పనుల నిర్వహించువారనియు స్పష్టమగును. ఈభావమే "ఆబ్రహ్మకీటజననీ, నిజాజ్ఞారూపనిగమా, పుణ్యాపుణ్యఫలప్రదా, పురుషార్థప్రదా పూర్ణాభోగినీ భువనేశ్వరీ, నారాయణీ నాదరూపా నామరూపవివర్జితా" అను నీదేవీనామములు స్పష్టీకరించుచున్నవి. భగవద్గీతాతాత్పర్య మిదియే యని తేలకపోదు. కాదందురేని నిర్గుణత్వ నిరంజనత్వ సర్వసాక్షిత్వ నిర్లిప్తత్వాదులాపరాత్పరునకు నూడిపోవును. తలంచినంతమాత్రమునఁ బ్రకృతి బ్రహ్మాండముల నిర్మించుననఁగా భగవచ్ఛక్తి యసారమని తేలలేదా. మధ్యవైష్ణవు లేల యులికిపడి యెగిరిపడవలయునో తెలియకున్నది. వారికిం బ్రాణాధారములు దేవాలయములు నుత్సవములు ప్రసాదపరిగ్రహణాదులు మొదలగు వానికి గౌరవముతగ్గునని భయము కాఁబోలు. ఏటి కంత భయము? దానికిం బాత్రులగుపామరు లెందఱో యున్నవారు కదా. వారిం గనిపెట్టుకొని జీవింపవచ్చునే. భగవచ్ఛక్తియనునది పెక్కుభేదములుగ నుండునుగదా. అందుత్తమమార్గము వారికిం బనికిరాదు. అందీప్రసాదాదు లుండవు. అది ధ్యానరూపము. పామరుల మోసపుచ్చి ధనము నార్జించి బంధువులఁ బోషించు నవకాశ మందు లేదు. అద్దానియందుఁ బ్రీతికల వారల కీసిద్ధాంతము ప్రాణాంతముగాఁ దోఁచునేమో కాని.

నిక్కపువిష్ణుభక్తుల కిది యెంతమాత్రము విరుద్ధముకాదు. ఈ సిద్ధాంతమున భగవంతుఁడు సర్వకారణుఁడన్నభావమే స్పష్టమగును. ప్రకృతి తదిచ్ఛామాత్రమునఁ బొడసూపి తత్సంకల్పమును నెఱవేర్చుననియుఁ దోఁచును. కావున శ్రీరామమూర్తిని ప్రభువుగానుండ భూదేవి కోరెననుట సుసంగతమని తేటపడును.

"స్త్రియో వృద్ధా తరుణ్యశ్చ సాయంప్రాతస్సమాహితాః,
సర్వాన్ దేవాన్నమస్యంతి రామస్యార్థే యశస్వినః."

అన్నచోట నొకవిశేషార్థము గలదు. స్త్రీలుకూడ రామాభిషేకమును గోరుదురనుట సామాన్యార్థము. ఆసభలోనున్న విద్వజ్జను లీవిషయము నేల ప్రశంసింతురు? కావున నిం దేదో విశేషమే యుండవలయును. వసిష్ఠాదిమహర్షులు రాజులు పౌరజానపదశ్రేష్ఠు లెల్లరు నేకవాక్యముగా నీవాక్యముం దెలుపుటచే నిందుఁ గలవిశేషమును బరికింపవలసినదే. పతివ్రతియగు స్త్రీమాహాత్మ్య మపారము. అట్టివారియెడ భగవంతుఁడు సుప్రసన్నుఁడగు. ఈవిషయమున స్మృతులు లోనగువానిం బరికింతము.

"లోకానంత్యం దివః ప్రాప్తిః పుత్రపౌత్రప్రపౌత్రకైః,
యస్మాత్తస్మాత్స్త్రియస్సేవ్యాః కర్తవ్యాశ్చ సురక్షితాః." ౭౮

యాజ్ఞవల్క్యస్మృతి.

"ఉత్పాదనమపత్యస్య జాతస్య పరిపాలనం,
ప్రత్యక్షం లోకయాత్రాయాః ప్రత్యక్షం స్త్రీనిబంధనమ్. ౨౭
అపత్యం ధర్మకార్యాణి శుశ్రూషా రతిరుత్తమా,
దారాధీనస్తథా స్వర్గః పితౄణామాత్మనశ్చ హ. ౨౮

పతిం యా నాభిచరతి మనోవాగ్దేహసంయతా,
సా భర్తృలోకానాప్నోతి సద్భిస్సాధ్వీతి చోచ్యతే.” ౨౯
మను. ౯ అధ్యా.

“క్లేశేన మహతా సాధ్వీ ప్రాజాపత్యాదికాన్ క్రమాత్,
స్త్రియస్త్వేవం సమస్తస్య నరైర్దుఃఖార్జితస్య వై. ౬౦
పుణ్యస్యార్ధాపహారిణ్యః పతిశుశ్రూషయైవ హి,
నాస్తి స్త్రీణాం పృథగ్యజ్ఞో న శ్రాద్ధం నాప్యుపోషణమ్. ౬౧
భర్తృశుశ్రూషయైవైతాన్ లోకానిష్టాన్ వ్రజంతి హి,
తస్మాత్సాధ్వి మహాభాగే పతిశుశ్రూషణం ప్రతి.” ౬౨
మార్కండేయపురాణము. ౧౬ అధ్యా.

ఇత్యాద్యనేకప్రమాణములు గలవు. వీనిం బరికింపఁగా నుప వాసవ్రతాదు లాచరింపకయే పతిశుశ్రూషచేత నతఁడు సకల దుఃఖములకు లోనై సంపాదించినపుణ్యమునం దర్ధము గ్రహించును. భర్త యొనరించుపాపమునం దాపురంధ్రికి భాగము లేదు. అట్టి యుత్తమచరిత్రముకలది కనుకనే

“ప్రోవాచ వ్యథితా సూర్యో నైవోదయముపైష్యతి.” ౩౨
మార్కం. ౧౬ అధ్యా.

సూర్యుఁ డుదయింపకుండుఁగాక యని శపించెను. ఆపతివ్రత నింద్రాదులు ప్రార్థింపవలసివచ్చెను. స్వర్గప్రాప్తికి హేతుభూతురాలు. కావుననే వారిని జక్కఁగా రక్షింపవలయునని స్మృతు లుపదేశించుచున్నవి. ధర్మకార్యములు తదధీనములగుట పురుషుఁడు తత్సహాయమును బడయవలసినదై యుండును. ఇకాకారణములంబట్టి కాంతలచిత్తము దుఃఖింపకయుండఁ గాపాడుట పురుషధర్మమని మనుప్రభృతు లుపదేశించిరి. సర్వధర్మములు

భార్యాధీనములగుట నామెమనస్సు నిర్మలముగా నుండునట్లు చేయుట పురుషునకు విధియని మన మెఱుంగవలయు.

"స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః,
సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్య చ.
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదకక్రియాః."

అని యర్జునుఁడు ప్రశ్నింప విని కృష్ణుఁడు బదులిడక విషయాంతరములఁ బ్రొద్దుపుచ్చెను. ఇందేదే నసత్యమున్న నేల యాక్షేపింపఁడు? భగవంతుఁ డిది సత్యమని యెఱింగియున్నవాఁడు గాన నించుకయే బదులిడకపోయెను. సకలధర్మకార్యములకుం బ్రధానహేతుభూతురాండ్రగు పతివ్రతలు భగవంతుని బ్రార్థించుచున్నారని సభ్యులు దశరథునకుం దెల్పిరి. వృద్ధురాండ్రు, వయస్సుగలవారు భగవంతు నారాధింప ననువగుమూఁడుకాలములయందు శ్రద్ధగలవారలై యశస్వి యగురామచంద్రునకు సకలశుభములు గలుగుఁగాక యనువాంఛల సర్వదేవతలకు నమస్కరించుచున్నవారని భావము. "సర్వాన్ దేవాన్ నమస్యంతి" అనుచో నొకవిశేషము గలదు. దాని నెఱుంగవలయును. ఒక్కొక్కవాంఛను ఫలింపఁజేయ నొక్కొక్కదేవత నియమింపఁబడియెను. సుఖమునుగోరువా రింద్రుని, తేజస్సుగోరువా రగ్నిని, ఇట్లే యాయాయివాంఛల కనుగుణముగా నాయాయిదేవతల నర్థింపవలయును. ఒక్కఁడే యిన్నిఫలములను గల్పింపఁజాలఁడా యన్నఁ జాలఁడనియే సమాధానము. ఏవాఁడేకోరికకొఱకు నేదేవతను బ్రార్థించునో యపుడారూపమున నానామమున భక్తులను రక్షింపఁగోరి నెలకొన్నయాసర్వేశ్వరుఁ డనుభావముగలిగి యుండవలయు. ఆభావము పురో

వృద్ధికి హేతువగును. క్రమక్రమముగా నాభావము దృఢమగును. దాన నిష్కామత్వ మలవడును. అయ్యది సమదర్శనత్వము కుదురుట కవకాశమిచ్చును. అద్దాన యోగగమ్యుఁడగు భగవంతుని ధ్యానించుపద్ధతి కనంబడును. దాన ముక్తి యలవడును. కావునఁ దొలుదొలుత వాంఛాప్రదాతలగు దేవతల నీభావమున నారాధింపవలయు ననువిశేషవిధి యీభాగము నుండి గ్రహింపవలయును.

ఈసంభాషణములనుండి రామచంద్రుఁడు ప్రభువగుట కాబాలవృద్ధ మంగీకరించుచున్న దనియు, నీమహాకార్యమును ఫలింపఁజేయుమా యని స్త్రీలుకూడ భగవంతు నారాధించుచున్నవారనియు, రాముని ప్రవర్తనము సేవగించువా రొక్కరైన లేరనియు మనము గ్రహింపందగు. ఈవిషయ మొక్కఁడే రామమూర్తి భగవంతుఁడని తెలుపుచున్నది. ఇట్లు పలికి యంతమాత్రమునఁ దృప్తినొందక వారెల్ల

"సర్వస్య లోకస్య హితే నివిష్టం, హితాయ నః క్షిప్రముదారజుష్టం,
ముదాభిషేక్తుం వరద త్వమర్హసి."

అని స్వాభిప్రాయమును దెలిపిరి. సర్వలోకహితము గోరినవాఁడనుటచే శ్రీరామమూర్తి సకలబ్రహ్మాండనాయకుఁ డగుపరమేశ్వరుఁ డనునర్థ మిందు నిమిడియున్నదని యెఱుంగవలయు. "హితాయ నః" అనుటచేత నీరామాభిషేకము మాకు మేలు గూర్చునదియే కాని నీవిద్దానిమూలమున నిహలోకశుభము పొందఁజాలవని సారము. రావణాదిదుష్టదానవపీడితులగు మానవులకు వేవేగ మేలుచేకూర్ప నీపట్టాభిషేక ప్రయత్నము చేయు మనుభావము గలదని మన మెఱుంగందగును. ఇట్టు లీభాగ

మాకాలమునఁ గలమానవులస్వభావమును దెలుపుచు రాజు నకుఁ బ్రజలకుం గలసంబంధమును దేటపఱచుచు రాజెట్లు ప్రవర్తింపవలయునన్న ధర్మము నుపదేశించుచు శ్రీరామచంద్రుని సర్వేశ్వరత్వమును స్పష్టపఱచుచు సర్వజనరంజకుఁడుగా రాజుండఁదగునన్న న్యాయమును వెలిపుచ్చుచున్నది. దీనింబఠించునపుడీభావముల నాలోచించుచుండవలయును. అధ్యాత్మరామాయణమున దశరథుఁడు తొలుత వసిష్ఠమునితో నాలోచించెనని యుండుటయే విశేషము. ఇఁకఁ దరువాత శ్రీరామచరితమును బరికింతము.

పట్టాభిషేక ప్రయత్నములు.

* సభ్యులెల్లరు శ్రీరామపట్టాభిషేకమును గోరి దోసిలొగ్గి తన్నుఁ బ్రార్థింపఁగా దశరథుఁ డాయభ్యర్థనము నంగీకరించి మధురోక్తుల వారి కిట్లను. మీరెల్ల రేకవాక్యముగా నా పెద్దకుమారుని రామచంద్రుని యువరాజును జేయఁగోరుచుండుట సంతోషమును గల్గించెను. నాయదృష్టమే యదృష్టము. ఇట్టిదింకొక్కరి కుండదు. అని వారికి సంతోషమును గల్గించి విప్రప్రవరుల గౌరవించి వారెల్లరు నాలకించుచుండఁగా వసిష్ఠవామదేవులం గాంచి యీచైత్రమాసము మిగుల మనోహరమైనది. మనమనుకొనుశుభకార్యములకు సర్వామై పవిత్రమైనది. కాననములెల్లఁ బూచియున్నవి. శ్రీరామాభిషేకమునకు వలయువస్తువులనెల్ల నాయత్తపఱపుఁడు. అని రాజు పలుకఁగనే సభ్యులందఱు చాలకాలముగాఁ దమరు

* ఈభాగము మూఁడవసర్గమునుండి వ్రాయఁబడును. అధ్యాత్మరామాయణతాత్పర్యముకూడ నిందిమిడియుండును.

చూడఁగోరియున్న రామచంద్రాభిషేకముఁ జూచుభాగ్యము కలుగునని యొకపెట్టున ధ్వనిగావించిరి. ఆధ్వని సుంత యుప శాంతింపఁగా రాజు మరల వసిష్ఠవామదేవమునివర్యులం దిల కించి మహర్షులారా! శ్రీరామునియభిషేకమునకు మును పేయే కర్మములఁ జేయవలయునో వానికి వలయుసాధనముల నాయత్త పఱుపవలయుఁ గాన సెలవిండు. అని రాజు తమ్ముఁ బ్రశ్నింపఁగా వసిష్ఠముని వామదేవునింగూడి రాజునెదుట మర్యాదగాఁ జేతులు మొగిడ్చి నిలుచున్న నియోగులం గాంచి యందు సుమంత్రాదు లుండఁగా వారితో మీరు సువర్ణాదులను, రత్నములను, శ్వేతపుష్పమాలికలను, లాజలను, బలులను, సర్వౌషధులను గూర్పవలయును. మఱియు భిన్నభిన్నపాత్రముల యందుఁ దేనియ, నెయ్యి సమకూర్పందగు. నూతనవస్త్రములను, రథము, సర్వాయుధములను, చతురంగబలమును, సాము లక్షణలక్షితమగుగజవర్యమును, జామరద్వయమును, ధ్వజమును, శ్వేతచ్ఛత్రము, నగ్నిజ్వాలవలె వెలుంగుబంగరుకలశ శతకమును, బంగరురంగుపూసిన కొమ్ములుగల వృషభమును, సమగ్రవ్యాఘ్రచర్మమును, సూర్యోదయమగునప్పటికి దశ రథు నగ్నిశాలయందుఁ జేర్పందగు. ఇంకను వలయుగంధ పుష్పాదులగు మంగళద్రవ్యముల నెపుడెపు డేయవి వలయునో వానినెల్ల మునుపే సేకరించి యుంచుఁడు. రాజగృహద్వారము నందును, నగరద్వారములయందును సుగంధమును జల్లించి కుసుమమాలికలు వ్రేలాడవైచి దశదిశలవ్యాపించు సువాసనలు గుబులుకొనఁజేయు ధూపధూమములఁ గల్పింపుఁడు. ఎందఱువిప్రులువచ్చిన నందఱకు వారు కోరినరీతి మృష్టాన్న

మును పాలు పెరుఁగులతోఁ జేయంబడువ్యంజనములంగూర్చి రేపటనుండి కాలముతప్పింపక వారికిం బెట్టింపుఁడు. కోరిన పదార్థములఁ బెట్టించి వారలకు దక్షిణాల నొసంగుఁడు. రేపు రవి యుదయింపఁగనే స్వస్తివాచనము సాగును. అందులకై మంచిబ్రాహ్మణులను రప్పింపుఁడు. వారు కూరుచుండఁదగు నాసనములఁ గల్పింపుఁడు. ధ్వజము లెత్తింపుఁడు. రాజమార్గ ములఁ జల్లగా నుండఁజేయుఁడు. స్వస్తివాచనమునకుఁగా వరింపఁబడుబ్రాహ్మణు లంతఃకక్ష్యయందుందురు. రెండవకక్ష్య యందు నటనర్తకీజనము నివసింపఁదగు. వారెల్ల నలంకరించు కొని మనోహరవేషముల నుండందగుదురు. అన్నము పెట్టుటకుఁ బిండివంటల నిచ్చుటకు, దక్షిణాలొసంగుటకుఁ బూలహారముల నిచ్చి గౌరవించుటకు నెవరెవరు నియోగింపఁబడుదురో వా రెల్లరు దేవాలయములందును, నాల్గుబాటలు గలియుతావు లందును, రాజమార్గమందుఁగల చల్లనివృక్షముల చెంతను నిలిచి బ్రాహ్మణులు లోనగు వారలకు దక్షిణాలను భక్ష్యములు లోనగు వాని నొసంగుచుండునట్లు లేర్పఱుపుఁడు. వీరభటు లాయుధ పాణులై కవచములందాల్చి ధౌతవస్త్రములధరించి శ్రీరామాభి షేకరూపమహాభ్యుదయము సాగు రాజభవనముముందుఁ బ్రవే శించి నిలిచియుండవలయు. అని హెచ్చరించిరి.

ఇట్టు లామునివరు లిరువురు కార్యనిష్ఠ పెంపున నందుఁ జేయఁదగు కార్యమునకు వలయుపరికరముల సిద్ధముచేయ మంత్రులకుఁ దెలిపి దాసీజనులను, బరివారము లోనగువారిని రప్పించుట, యింకనుం జేయఁదగుపనులను రాజునకు విన్నవించి వానిని నెఱవేర్చి నిజకార్యనిర్వహణసంతోషమున రాజుచెంతఁ

జేరి భవదాజ్ఞను నెఱవేర్చితిమని విన్నవించిరి. అంత నాదశరథ మహారాజు కుమారునకు నభిషేకము చేయుసంతోష మువ్పొంగుచుండఁగా సుమంత్రునిం గాంచి నీ విపుడేపోయి శ్రీరాముని సత్వరమ తోడుకొనిరమ్మనఁగా నాతఁడు తదాజ్ఞ రీతింబోయి దివ్యస్యందనమున నాకుమారలలాము నెక్కించుకొని వచ్చెను.

సుమంత్రుఁడు శ్రీరామమూర్తిని దోడుకొని రాఁబోవఁగనే యాపేరోలగమున నున్న ప్రాగుత్తరపశ్చిమదక్షిణభాగములనున్న దేశాధీశులు, మ్లేచ్ఛప్రభువులును, మఱియు వనపర్వతముల నివసించునాటవికప్రభువులు నందఱు దేవేంద్రు నమరులు సేవించునట్టు లారాజలలాముని గొలుచుచుండిరి. ఇంద్రునిచందముననున్న యారాజు సౌధముపైనుండి రథము నెక్కివచ్చుచున్న శ్రీరామచంద్రునిం దిలకించెను. గంధర్వ రాజువలె భోగోచితవేషములు గలిగి జగద్విఖ్యాతశౌర్యముల రారఁ బౌరుషచిహ్నములయిన యాజానుదీర్ఘబాహువులు లోనగునవి చెలువారుచుండ మందగమనము వంతీంద్రగతిని ధిక్కరింప నెమ్మోము చందురుని దూలనాడఁ జూచువారల లోచనములకుఁ బ్రతిక్షణము విలక్షణానందముం గలిగించుచు రూపౌదార్యసౌశీల్యగుణములచే స్త్రీలకుమాత్రము కాక పురుషులకుంగూడ మనోహరుండయి తగుచుఁ బ్రజలమనస్సులను జల్లఁజేయుప్రవృత్తిగలిగి రామచంద్రుఁడు వచ్చుచుండెను. ఆరాముని సౌధోపరిభాగమునుండి యెంత చూచినను రాజు తృప్తినొందఁజాలఁడయ్యెను.

సుమంత్రుఁడారామచంద్రునిఁ జేయి దండయొసఁగి రథమునుండి దించి యతఁడు తండ్రికడ కరుగుచుండఁగా నంజలింబట్టి

కూడఁబోయెను. శ్రీరామమూర్తి కైలాసమునలెఁ దెల్లనైన యాసౌధమునెక్కి శాస్త్రవిహితముగాఁ దనపేరుచెప్పి తండ్రి పాదములకు నమస్కారముచేసెను. నమస్కరించి దోసిలొగ్గి నిలుచున్న ప్రియపుత్త్రవర్యునిం గాంచి యంజలింబట్టి చెంతకుం దిగిచికొని కౌఁగిటం జేర్చి తదర్హమగునాసనమునఁ గూరుచుండ నియోగించెను. ఆయాసన మా శ్రీరాముని తేజంబున మఱింతఁగాఁ బ్రకాశించెను ఉదయభానుఁడు మేరుపర్వతమును బ్రకాశింపఁజేయుచుండ మందుఁ గనఁబడుచుండెను. తనకంటె సర్వప్రకారములఁ దేజరిల్లుకుమారుం గాంచి రా జెంతయు హర్షించెను. అంత రాజు సుస్మితము చెలరేఁగుచుండ రామచంద్రా! యని పిలిచి తొల్లి కాశ్యపుఁడు తనకొడుకగునింద్రునితో భాషించినట్లుగా సంభాషింపఁబూని యిట్లనియె.

ప్రియకుమారా! అనుకూలవతియగు జ్యేష్ఠపత్నియందు నానోములపంటవై జన్మించితివి. గుణవంతుఁడవు. నా కెంతయుఁ బ్రియమునే చేకూర్చువాఁడవు. సద్గుణప్రవృత్తిచే నన్నుఁ బ్రజల నానందింపఁజేసితివి. ఈపేర్కొన్న కారణములచే నీవు యువరాజత్వమునకు మిక్కిలి తగుదువు. కావునఁ బుష్యనక్షత్రయుతమగుశుభదినమున యౌవరాజ్యము నొందుము. వినయము లోనగుసద్గుణములుగల నీకు వేఱుగ నే నుపదేశింపఁదగిన దేదియు నుండదు. పుత్త్రస్నేహాతిరేకమున నొక్క హితము వినిపించువాఁడ. విశేషించి వినయము వెలయఁగా నెల్లతఱులను జితేంద్రియత్వ మలవడఁగాఁ బ్రవర్తింపుము. కామజనితములగువ్యసనములను క్రోధప్రభవములగువ్యసనములను వదలిపెట్టుము. సామాన్యసేవకులకు దర్శనమీయక వారి

పరోక్షమున నధికారులమూలమున నాజ్ఞల నొసంగుచుం దన్మూలమునం గార్యముల సాగింపుము. మంత్రిప్రభృతులతో సమక్షమున మాటలాడి ముఖ్యకార్యముల వారిమూలమునం బ్రజలకు హితముగా సాగింపుము. పరోక్షముగనుండి గూఢచారుల మూలమున నన్యదేశవార్తలం బరిశీలించుచుం బ్రత్యక్షముగా స్వదేశవార్తలం దెలిసికొనుచుం బ్రవర్తింపుము. మంత్రులు లోనగువారల సంతోషింపఁజేయుచుండుము. ధాన్యగృహములయందు ధాన్యరాసులను, శస్త్రగృహములయందు బహువిధాయుధములను జక్కఁగా సమృద్ధిగా సేకరించి దానం బ్రజలెల్ల నుల్లాసముగలవారు కాఁగా నెవ్వాఁడు ప్రజాపాలనము చేయునో యారాజుం గని సామంతరాజు లమృతముగాంచిన దేవతలవలె నానందింతురు. కావున రామచంద్రా! నీవును మనోనిగ్రహముకలవాఁడవగుచు నాహితము ననుసరించి యొనరింపుమని మహాదరంబునం బలికెను.

శ్రీరామునకు యౌవరాజ్యమునుగూర్పఁదలఁచిన రాజేంద్రునియత్నము నెఱింగి శ్రీరామునకు మిక్కిలి మేలుగోరి మిత్రులు సత్వరముగాఁ గౌసల్యం గానంబోయి యాశుభవార్తలం దెలిపిరి. ఆదేవి తనకుమారు నభిషేకవృత్తాంతమును దెలిపిన యారామచంద్రస్నిగ్ధులకెల్ల సువర్ణటంకములను గోవులను రత్నరాసుల నిచ్చెను. అంత నక్కడ శ్రీరాముఁడు దశరథునకు నమస్కరించి రథమెక్కి యందందుఁ బ్రజలు గుంపుగా వచ్చి పూజలుచేయఁ గైకొనుచు నిజకాంతుల దిశలవెలిఁగించు నాత్మసౌధమునకుం బోయెను. పౌరజానపదులును సామంతరాజులును దమవాంఛల సార్థకముచేసిన దశరథునికడ సెలవు

పుచ్చుకొని తమతమనెలవుల కరిగి యీమహోత్సవము నిరంతరాయముగా సాగవలయునని యిష్టదైవములఁ బ్రార్థించుచుఁ బూజించిరి.

మహాశయులారా! ఈభాగమును విమర్శింతము. కొన్ని విశేషములు తోఁపకపోవు.

"చైత్రశ్శ్రీమానయం మాసః పుణ్యః పుష్పితకాననః,
యౌవరాజ్యాయ రామస్య సర్వమేవోపకల్ప్యతామ్."

అనుమూలమును బరిశీలింతము. ఈభావము దశరథుఁడు మునులతోఁ దెల్పునపుడు గలదు.

"మాసానాం మార్గశీర్షోఽహమృతూనాం కుసుమాకరః."

అని గీతాశాస్త్రమున భగవంతుఁడు పల్కెను. చైత్రవైశాఖమాసములు వసంతర్తువుచే గ్రహింపఁబడుచున్నవి. అందుఁ జైత్రమాసము ప్రధానమని తేలదు. మార్గశీర్షము మాసోత్తమమని శ్రీహరిభావముకదా. "వసంతవల్లోకహితం చరంతః" అన్న శంకరోక్తియుఁ గలదు. లోకహితమును వసంతర్తువవలెఁ గోరవలెనని దీనిభావము. వాల్మీకిమునివాక్యముంబట్టి యీఋతువునందుఁ జైత్రమాసము మిక్కిలి ప్రశస్తమని మన మంగీకరింపవలయును. ప్రజాసామాన్యమునకు నితరమాసములకంటెఁ జైత్రమాసము సకలసుఖావహము. సామాన్యముగాఁ బ్రజలైహికసుఖమునుగోరువారుగా నుందురు. కావునఁ బ్రజాసుఖసంపాదనమున నీమాసము ప్రధానమని తేలెడిని. భగవంతుఁడగు రామమూర్తి యట్లే యైహికమును గోరువారలకుఁ దత్సుఖమును గలిగించువాఁడు. అనఁగా రామరాజ్యము సకలప్రజాసుఖసంపాదనసమర్థమని భావము. శ్రీమాన్ అనఁగాఁ బ్రకృతి

ప్రధానుడు కావుననే రాజ్యపాలనమునకుం బూనుననిభావము. పుణ్యాః = పవిత్రమైనది. మార్గశీర్ష మాసము శ్రేష్ఠమని భగవద్వాక్యము గలదు. తద్విరుద్ధముగా నిందుండునా. అని కొందఱు ప్రశ్నింతురు. దానికి విరుద్ధముగ నిది లేదు. భగవంతుం బూజించువారలకు శరన్నవరాత్రములకంటె వాసంతనవరాత్రము లుత్కృష్టములుగఁ జెప్పఁబడినవి వాసంతనవరాత్రములు భగవతీవిహారయోగ్యములు. శరన్నవరాత్రములు రాక్షససంహారార్థములు. కావున నిందు నారాధించుట యుత్తమమని పెద్దలభావము. మహామాయ యగుసీతాదేవింగూడి సర్వసాక్షియై శ్రీరామపరబ్రహ్మ మున్నవాఁడు కావున నిపుడే యారాధనవిశేషములకుఁ బ్రధానమని రహస్యము. అనఁగా

"న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా,
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే. ౧౪
ఏవం జ్ఞాత్వా కృతం కర్మ పూర్వైరపి ముముక్షుభిః,
కురు కర్మైవ తస్మాత్త్వం పూర్వైః పూర్వతరం కృతమ్." ౧౫

గీత. ౪ అధ్యా.

అనుగీతావాక్యముల ననుసరించి భగవంతుఁడు కర్మబద్ధుఁడు కాఁడని, కర్మములవలనిఫలమును గోరునాసక్తి యతనికి లేదనియు నెవరు గ్రహించి యారాధింతురో వారు కర్మబద్ధులు కారన్న శ్రీకృష్ణతాత్పర్యమును నమ్మి యెవరు ఫలాభిసంధిరహితముగా సత్కర్మములను లోకులు నేర్చుకొందురన్న భావమున నాచరింతురో వారలు సంసారము తరింపఁగలరని పరమార్థము. సీతారాము లొక్కయయోధ్యారాజ్యవాసులకే కాక సకలలోకసుఖసంపాదనక్షములు గావున వారిమహాత్త్వ

మెఱింగి యారాధించినఁ దత్ఫల మనుపమానముగాఁ గల్గునని సారాంశము. కావుననే పుణ్యము పవిత్రమైనదని వాల్మీకి తెల్పెను. "పుష్పితకాననః" అరణ్యములు పుష్పించియున్న వనఁగా వసంతుఁ డుద్యానవనములయం దెట్టి యాదరణము కలవాఁడో యట్లే యరణ్యములయందును బ్రీతిగలవాఁడని యర్థము. అనఁగా నయోధ్యాపురవాసు లెట్లు రామాభిషేకమును గాంచఁగోరుచున్నారో యట్లే యరణ్యములనున్న మహర్షులే కాంతసేవను గోరుచున్నవారనియు వీరియం దెట్టిసద్భావమామహాత్మునకుఁ గలదో వారలయందు నట్టిసద్భావమే కలదని భావము. అరణ్యవాసముకూడ శ్రీరాములకుఁ బ్రియమైనదని రహస్యము. వనములు శ్రీరామాగమనమునుగోరి పూజింపఁ బుష్పములఁ దాల్చియున్నవనుటయే యిటఁ బరమార్థము.

ఆత్మారాముఁడు శ్రీరాముఁడు. సకలభూతాంతర్యామి యగుట సమబుద్ధియు సమదృష్టియుఁ గలవాఁడు. కావున నీ కాలము సుఖకరమగుట మనశ్శాంతి చేకూరునుగాన నెవిగలవారు పరాత్పరుని సమ్యగారాధనవిశేషముల నారాధింపఁదగు నన్నభావము దశరథునివచనములమూలమున వాల్మీకిమహర్షి మనకుఁ దెలిపెనని మన మెఱుంగవలయును. వసంతర్తువును బేర్కొన్నకతన వసంతునకెట్లు పక్షపాతము లేదో యట్లే రామచంద్రునకుఁ బక్షపాతము లేదనియు, భక్తి నారాధించువారల కెల్లఁ దనకరుణఁ జూపుననియు నిందుండి గ్రహింపవలయును. కొంద ఱూర్ధ్వపుండ్రాదిచిహ్నములుకలవారలే శ్రీరాముని బూజింప నర్హులగుదురనియు, నితరు లట్లర్హులు కారనియు నుపదేశింతురు. వారే మధ్యవైష్ణవులు, ధనదాసులు, జనవంచకు

లనంబడుదురు. భగవంతు నెవ్వఁడెవ్వఁడు తనకుఁగలశక్తి నను సరించి యారాధించును. భక్తియొక్కఁడున్న నెల్లరకు సమాన ఫలముల నొసంగును. అనఁగాఁ బూవులు సుగంధపుష్పులతోఁ బూజించువారల కధికఫలమును, అవి సంపాదించుశక్తిలేక యరణ్యమునఁగల కుందప్రముఖపుష్పములం బూజించువారల కత్యల్పఫలము నీయఁడనియు, బాహ్యచిహ్నములనఁగా బంగరు పదకములు లోనగువానిం గాంచి వీరే నాభక్తులని భావింపఁ డనియు, నట్లు భావించునని యుపదేశించువారు భక్తులు గాక ద్రవ్యాసక్తులగు నల్పమతులనియు మనము గ్రహింపఁదగిన విషయము.

"పత్త్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి,
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః. ౨౬
యత్కరోషి యదశ్నాసి యజ్జుహోషి దదాసి యత్,
యత్తపస్యసి కౌంతేయ తత్కురుష్వ మదర్పణమ్. ౨౭
సమోఽహం సర్వభూతేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహమ్. ౨౯
అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్,
సాధురేవ స మంతవ్యస్సమ్యగ్వ్యవసితో హి సః." ౩౦

గీత. ౯ అధ్యా.

అను నీగీతావాక్యములు పైసిద్ధాంతము సత్యమని బోధించు చున్నవి. కావునఁ గలిగినధనమునుబట్టి దొరకినపదార్థములను బట్టి తృప్తిచేకూరఁగా భక్తిచే సీతారాములను బ్రకృతిపురుషులనుగా భావించి ధ్యానించిన నేజాతివాఁడైనను దదనుగ్రహమునకుఁ బాత్రుఁడగునని మనము చక్కఁగా గ్రహింపవల

యును. మతభ్రష్టులై పరమభాగవతోత్తములమని దుర్మతముల బోధించుదాసులు ధనదాసులు వేషధారులు నగుదురని నమ్మి వారితుచ్ఛవాక్యములకు లోబడక చక్కనిభక్తితో సీతారాములను లోకానుగ్రహార్థ మవతరించిన ప్రకృతిపురుషులనుగా భావించి యారాధింపందగు. దాననే యాపరమపురుషుని యనుగ్రహము కల్గును.

దశరథుండు పట్టాభిషేకసంభారములంగూర్పుండని పలుక మునులు మంత్రుల కవ్విధముం జెల్పిరి. ఆవిషయమునందే

"దేవాయతనచైత్యేషు సాన్నభక్షాస్సదక్షిణాః,
ఉపస్థాపయితవ్యాస్స్యుర్మాల్యయోగ్యాః పృథక్పృథక్."

అను నీవిషయము గలదు. దేవాలయములయందు,నాల్గుత్రోవలు కలియుతావులయందుఁ గలవృక్షములయందును, అన్నము పిండివంటలు దక్షిణలు పూలహారము లిచ్చువారల నేర్పఱుపుఁడు. అని మును లాజ్ఞాపించిరి. ఒక్కచో సంఘమును జేర్చి భుజింపఁ బెట్టరాదనియు,నాయాయిపవిత్రస్థలముల నేకొఱంతలేకయుండ నన్నము భక్ష్యములతో నొసంగవలయుననియు, బీదలకు దక్షిణ లీవలయుననియుఁ, బూలదండలు చందనము తాంబూలముల నీవలయుననియు వారు తెల్పిరి. అన్నికార్యములలో భూతతృప్తి ప్రధానమని యిటఁగలసారము.

"గంధర్వరాజప్రతిమం లోకే విఖ్యాతపౌరుషం,
దీర్ఘబాహుం మహాసత్త్వం మత్తమాతంగగామినం
చంద్రకాంతాననం రామమతీవ ప్రియదర్శనం,
రూపౌదార్యగుణైః పుంసాం దృష్టిచిత్తాపహారిణం.

ఘర్మాభితప్తం పర్జన్యం హ్లాదయంతమివ ప్రజాః,
న తతర్ప సమాయాంతం పశ్యమానో నరాధిపః.”

అన్నమూలమునఁ గలప్రాతీతికార్థముగాక విశేషార్థము పరికిం చినఁగాని భగవత్తత్త్వము తెలియరాదు. శ్రీరామమూర్తి రథాధిరూఢుఁడై వచ్చుచుండఁగా దశరథుఁడు సౌధోపరిభాగమునుండి చూచెను. కాని తృప్తినొందఁడయ్యెను. ఏల? మత్స్యకూర్మాద్యవతారములలో భగవంతునిభక్తపరాధీనత్వము తేటపడియెను. అసమానసౌందర్యముకూడ భగవంతునకుఁ గల దని తేటపడలేదు. శ్రీరామావతారమునందుఁ బ్రకృతిమహాత్త్వము తేటపడుచున్నది. లోకవశీకరణమున భగవంతుఁడు స్త్రీరూపమును దాల్చెనఁట యమృతవిభాగకాలమున స్పష్టమయ్యెను. ఇపుడు స్వాభిన్నయగు ప్రకృతి ప్రాకృతులనేత్రములకు భిన్నరూపముగలదిగఁ దోఁపఁజేయ నెంచి రెండుగాఁ దన కళను విభజించి సీతారాములనఁబరఁగెను. ప్రకృతిని వేఱు చేయు టెట్లు? మనస్సునుండి యిచ్ఛను వేఱుచేయ సాధ్యమాఁ కాదుకదా. యోగులదృష్టికి నారూప మొక్కవిధముగ? దోఁచును. రామమూర్తి మాయామానుషుఁడనుట ప్రసిద్ధము కదా. సర్వజనరంజనము చేయువాఁడుకదా రామమూర్తి. సౌందర్యసౌకుమార్యాదులు ప్రకృత్యంశములు సర్వసమత్వాదులు భగవదంశములు. ఈరెండును శ్రీరామునియం దిపుడు కనఁబడుచున్నవి. కనుకనే పురుషులనేత్రములను మనస్సుల నాకర్షింపఁజాలెను. కామవికారమును బురుషులకుఁ బుట్టించెనని యర్థము గ్రహింపరాదు. “అతీవ ప్రియదర్శనమ్” ఎంత చూచినను విసుగునొందఁజేయక యింకను జూడవలెననియొడు

నాశను బుట్టించుచుండెనని భావము. దాన ఫలమేమి? అని పామరులు ప్రశ్నింతురని యెఱింగియే మహాకవి

"ఘర్మాభితప్తం పర్జన్యం హ్లాదయంతమివ ప్రజాః"

అని పలికెను. ఎండబాధల ననుభవించువారలకు వృష్టినిగురియించు మేఘాధిదేవతలఁ బ్రజలను సంతోషింపఁజేయువాఁడని సామాన్యమగునర్థము. ఆధ్యాత్మికాధిభౌతికాధిదైవతము లనఁబడు త్రివిధతాపముల నడంచి మహానందమును గల్గించువాఁడను నర్థమును గ్రహింపవలయును. పర్జన్యసామ్య మిందుఁ గలదు. మేఘాధిదేవత యెట్లు కనంబడకయున్నను సంతాపమునడంచునో భగవంతుఁడు కనఁబడకపోయినను సర్వసుఖములఁ గల్పించువాఁడని మన మెఱుంగవలయును. ఇట్లుండఁగా నా భగవంతుఁడొకమూర్తిని ధరించిన నెట్లుండవలయునో యూహింపఁదరమా? దశరథుఁ డిట్టిపరాత్పరుని నా రామచంద్రునింగాంచి యవ్యయానందమును గాంచెనని ప్రకృతార్థము. మరణచిహ్నములు తోఁచువారికి సంతృప్తియుండకుండుటయు నొకగుఱుతు. అది లేనివాఁడయ్యెనని యొకయర్థ మిందుఁగలదని కొందఱందురు. అది యసంగతమన వలనుపడదు. కాని యిట నది పొసఁగదనవచ్చును. దశరథుఁడవ్యయానంద మనుభవింపఁబోవుచున్నాఁడుకదా. రామచంద్రుని జూచి సంతోషపడుట కిదియే చివర. ఇఁకముందు రామదర్శనము విషాదహేతువు కాఁగలదు. కావున భగవంతుఁడు తాను దశరథునకుఁ బుత్త్రుఁడన్నఖ్యాతిని బొందెను. కావున నతనికిఁ దనయద్భుతానంద ప్రదరూపమును గనఁబఱచెనని మన మెఱుంగందగును.

"స ప్రాంజలిరభిప్రేత్య ప్రణతః పితురంతికే,

నామ స్వం శ్రావయన్ రామో వవందే చరణౌ పితుః."

అను నీమూలము మనకు నొకసదాచారమును బోధింపు చున్నది. తండ్రి కడ కరిగి రామమూర్తి తన పేరు వినిపించి పాద ములకు వందనము లర్పించెను.

"ఆత్మనామ గురోర్నామ నామాతికృపణస్య చ,
శ్రేయస్కామో న గృహ్ణీయాజ్జ్యేష్ఠాపత్యకళత్రయోః."

అన్న సూక్తి నుదాహరించి తన పేరు చెప్పఁదగ దనున్యాయమువిరు ద్ధముగా నెట్లు రాముఁడు తన పేరు చెప్పెనని యాక్షేపింతురు.

"అభివాదాత్పరం విప్రో జ్యాయాంసమభివాదయేత్,
అసౌ నామాహమస్మీతి స్వం నామ పరికీర్తయేత్. ౧౨౨
నామధేయస్య యే కేచిదభివాదం న జానతే,
తాన్ ప్రాజ్ఞోఽహమితి బ్రూయాత్ స్త్రియస్సర్వాస్తథైవ చ. ౧౨౩
భోశ్శబ్దం కీర్తయేదంతే స్వస్య నామ్నోఽభివాదనే,
నామ్నాం స్వరూపభావో హి భోభావఋషిభిస్స్మృతః." ౧౨౪

మను. ౨ అధ్యా.

"తతోఽభివాదయేద్వృద్ధానసావహమితి బ్రువన్." ౧౫

యాజ్ఞవల్క్యస్మృతి.

"పాదోపసంగ్రహణం గురుసమవాయేఽన్వహమ్, అభిగమ్య తు విప్రోష్య మాతృపితృతద్బంధూనాం పూర్వజానాం విద్యాగురూణాం చ సన్నిపాతే పరస్య స్వనామ ప్రోచ్యాహమిత్యభివాదోఽజ్ఞసమవాయే స్త్రీపుంయోగేఽభి వాదతోఽనియమమేకేనావిప్రోష్య." గౌతమస్మృతి. ౬ అధ్యా.

నమస్కారము చేయునపుడు తన పేరు చెప్పవలయునని స్మృతులు తెల్పుచున్నవి. కావున విశేషవిధిగా నీవిషయము గ్రహించి సామాన్యధర్మముల నుల్లంఘింపవలయును. నమస్కారలక్షణ మెట్టిదనఁగా,

"దక్షిణం బాహుం శ్రోత్రసమం ప్రసార్య బ్రాహ్మణోఽభివాదయేత్, ఉర స్సమం రాజన్యో మధ్యసమం వైశ్యో నీచైశ్శూద్రః ప్రాంజలిరితి."

ఆపస్తంబస్మృతి.

కుడిచేయి కర్ణపర్యంతము వ్యాపింపఁజేసి బ్రాహ్మణుఁడును, వక్షముదనుకఁ జాపి రాజును, నడుముదనుకఁ జాపి వైశ్యుఁడును, వంగి చేతులుజోడించి శూద్రుఁడును నమస్కరింపవలయును. ఒక్కచేతితో నమస్కారము చేయరాదు.

"జన్మప్రభృతి యత్కించిచ్చేతసా ధర్మమాచరేత్,
సర్వం తన్నిష్ఫలం యాతి ఏకహస్తాభివాదనాత్."

అని విష్ణుస్మృతి తెల్పుచున్నది. నమస్కరించుపద్ధతి యెట్లనఁగా

"వ్యత్యస్తపాణినా కార్యముపసంగ్రహణం గురోః,
సవ్యేన సవ్యస్స్పష్టవ్యో దక్షిణేన తు దక్షిణః." ౭౨

మను. ౨ అధ్యా.

"ఉత్తానాభ్యాం హస్తాభ్యాం దక్షిణేన దక్షిణం సవ్యం సవ్యేన పాదావభివాదయేత్, దక్షిణోపరిభావేన వ్యత్యాసో హ్యయం శిష్టసమాచారాత్."

పైఠీనసిః.

ఎడమచేతిపైఁ గుడిచేయి యునిచి మ్రొక్కవలయు. కుడిచేతితోఁ గుడిపాదమును, ఎడమచేతితో నెడమపాదము స్పృశింపఁదగు. పాదములను దగులవలయునని భావము. ఇట్లు సామాన్యవిధులను బాటింపక విశేషవిధుల ననుసరించి యాచారము నడుపవలయునని స్మృతులు తెలుపుచున్నవి. ఈస్మృతుల యర్థమునే శ్రీరామచంద్రమూర్తి తనయాచారమునఁ దెలియఁజేసెనని మనము తెలిసికొనవలయును. రామచంద్రప్రవర్తనమే స్మృతులభావమని మనము నిశ్చయించుకొనవలయును.

"తదాసనవరం ప్రాప్య వ్యదీపయత రాఘవః,
స్వయైవ ప్రభయా మేరుముదయే విమలో రవిః."

మేరుపర్వతమనఁగా నత్యున్నతభాగమని పెద్దలందురు. "సర్వేషాం మేరురుత్తరః" అన్నసూక్తి స్పష్టమే కదా.

"యత్రోదితోఽర్కః కిల తత్ర పూర్వా తత్రాపరా యత్ర గతః ప్రతిష్ఠాం
తన్మత్స్యతోఽన్యే చ తతోఖిలానాముదగ్గతో మేరురితి ప్రసిద్ధం."

సిద్ధాంతశిరోమణి గోలాధ్యాయము.

"అనేకరత్ననిచయో జాంబూనదమయో గిరిః,
భూగోళమధ్యగో మేరురుభయత్ర వినిర్గతః."

సూర్యసిద్ధాంతము. గోలాధ్యాయము.

"వ్యక్షోత్తరే తు సర్వేషాం సుమేరుస్సౌమ్యదిక్స్థితః,
యామ్యేప్యేవం పరో మేరుః కుసంజ్ఞో యామ్యదిక్స్థితః." ౧౩౮

సిద్ధాంతతత్త్వవివేకము మధ్యమాధికారము.

ఆర్యభట, లల్లసిద్ధాంతములయందు నిట్లే శ్లోకము లగపడీగుడిని. దక్షిణోత్తరభాగములయందు మేరుద్వయము కలదనఁగా నేమియర్థమో పెద్దలే యూహింపవలయును. ప్రాక్పశ్చిమచిహ్నములవలె దక్షిణోత్తరచిహ్నములు మేరువు లనంబడునని గ్రహించిన నేబాధయు లేదు. ఉదయాస్తాద్రులున్నట్లే దక్షిణోత్తరమేరువు లున్నవని యెఱుంగవలయు. గ్రహసంచారమునకు సీమలుగానున్న దక్షిణోత్తరప్రదేశములు మేరుసంజ్ఞకములు. ప్రకృత మనుసరింతము. శ్రీరామమూర్తి తన దేహకాంతులచే నాయాసనము నలంకరంజేసెనని కలదు. సకలవస్తువులకుఁ దేజఃప్రదాతయగుభగవంతుఁ డాయాసనము రత్నఖచితమైనదానిఁ బ్రకాశింపఁజేయుట యచ్చెరువుఁ గల్పింపఁజాలదు.

దశరథున కదియే మానవజన్మజనితసంతోషమునకుఁ దుది కాలము కావునఁ దనదివ్యమంగళానుపమానరూపమును గనఁ బఱచెనని గ్రహింపఁదగును. ఏలయనఁగా దశరథునకు శాప ఫలానుభవకాలము సమీపించుచున్నది. "గహనా కర్మణో గతిః" అన్నవాక్యము భగవంతునకుఁ గాదు. సర్వజ్ఞుఁడుకదా పరమేశ్వరుఁడు. అట్టులౌట దుఃఖఫలానుభవకాలము ముందు రానున్నదని యెఱింగి పితృతృప్తి కుమారునకు విధి యను శాస్త్రము ననుసరించి మానవులకా నీతి నెఱింగింపఁబూని తన యానందమయరూపమును దండ్రికిం గనఁబఱచెననియే యిందుఁ గలరహస్యము.

"భూయో వినయమాస్థాయ భవ నిత్యం జితేంద్రియః,
కామక్రోధసముత్థాని త్యజేథా వ్యసనాని చ."

అనునీతిని బుత్త్రప్రీతిచే రాజు రామచంద్రున కుపదేశించెను.

ఈప్రకరణమున రాజధర్మములు చెప్పఁబడినవి. కాని యందుఁ బ్రధానము లేవి? అని మన మెఱుంగవలయును.

"అతస్తు విపరీతస్య నృపతేరజితాత్మనః.
సంక్షిప్యతే యశో లోకే ఘృతబిందురివాంభసి." ౩౪

మను. ౭ అధ్యా.

అను నీస్మృతిధర్మమునే రామాయణము తెలుపుచున్నది. సర్వదా జితేంద్రియుఁడు రాజు కావలయును దాన దుష్టాలోచనములు నశించును. సత్యానురక్తి పాదుకొనును. అట్టివాని కడ దుర్వృత్తులు చేరఁజాలరు. ఇన్నిధర్మములకుఁ బ్రధానము జితేంద్రియత్వమని సారము. జితేంద్రియత్వమునకు యోగాభ్యాసము ముఖ్యముకదా.

"యదా హి నేంద్రియార్థేషు న కర్మస్వనుషజ్జతే,
సర్వసంకల్పసన్న్యాసీ యోగారూఢ స్తదోచ్యతే. ౪
ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్,
ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః." ౫

గీత. ౬ అధ్యా.

అనుగీతాశాస్త్రము పైనవ్రాసినయభిప్రాయమునే యుపదేశించి డిని. యోగము నభ్యసింపక మనస్సు స్థిరతఁగాంచదు. ఎన్ని వేదాంతవాక్యములు చదివినను మనోనిగ్రహము కుదురదు. యోగముననే యయ్యది కుదురును. కనుకనే భగవంతుఁడు శ్రీకృష్ణమూర్తి తపస్విని కమ్మా యనక యర్జునుని, "తస్మాద్యోగీ భవార్జున" అని యుపదేశించెను. భగవద్గీతలు యోగము ప్రధానమని బోధించుచున్నవి. సర్వవిజ్ఞానములకు మూలము మనోనిగ్రహము. అయ్యదియే యోగఫలము. కావున యోగాభ్యాసము మిక్కిలి ప్రధానమని తెలియుచున్నది.

కొందఱు గురువులమని పేరు పెట్టుకొని ముక్కుసెవులు మూసి చక్కఁగాఁ గూరుచుండి మహాయోగులవలె నటించి యాస్థితియందు ఛాయాపటములం దీయించుకొని వాని విక్రయించి శిష్యులకడ ధనమును సేకరింతురు. వారు కపటయోగులు, ధనదాసులునగుదురు. భగవత్పాదదాసులుమాత్రము గారు. సన్న్యాసులును గారు. వారిమాయలకుఁ బామరులు కొందఱు లోఁబడుదురు. వారికి ముక్తి ధనవిముక్తియే. యోగి విజన స్థలమునే కోరును. బాహ్యాడంబరముల నాశింపఁడు. ధన మాతని కక్కఱలేదు. విగ్రహారాధనమున కతఁడు దూరమున నుండును. తేజోరూపునిగాఁ బరాత్పరుని సమాహితాత్ముఁడై యతఁడు ధ్యానించును.

"అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియనిగ్రహః,
సర్వభూతదయా పుష్పం క్షమా పుష్పం విశేషతః."

అన్నన్యాయము ననుసరించి యాతనియారాధనవిశేష ముండును. బాహ్యపూజలందు నాతనికి నిరతి యుండదు. మానసిక ధ్యానమే యతనిపూజ యని యెఱుంగవలయును. క్రోధమాతనికడ నిలువఁజాలదు.

"యోగీ యుంజీత సతతమాత్మానం రహసి స్థితః,
ఏకాకీ యతచిత్తాత్మా నిరాశీరపరిగ్రహః." ౧౦.

గీత. ౬ అధ్యా.

అను నీ శ్రీకృష్ణవాక్యములు పైనవ్రాసినయభిప్రాయమును సిద్ధాంతము చేయుచున్నవి. సర్వదా తనమహిమమును దెలుపుకొనుచు నితరులను దూషించుచు ధనమొసంగిన భూషించుచు నది యీయకున్నను గొంచెమిచ్చినను వారిని దూషించుచుండు కపటయోగులకుఁ బామరులకుఁ గలభేదమేమి? అట్టివారు విశేషించి పామరులనియే మన కీఘట్టమున శ్రీరామాయణము "నిత్యం జితేంద్రియః" అన్నవాక్యముచేత బోధించుచున్నది.

వ్యసనములు రెండువిధములు. కామజనితములు, క్రోధజనితములు అని. ఈ రెండువిధములగు వ్యసనములను వదలవలయునని రామచంద్రునకు దశరథుఁ డుపదేశించెను. అవ్వి యెవ్వియనఁగా,

"దశ కామసముత్థాని తథాష్టౌ క్రోధజాని చ,
వ్యసనాని దురంతాని ప్రయత్నేన వివర్జయేత్. ౪౫
కామజేషు ప్రసక్తో హి వ్యసనేషు మహీపతిః,

విముచ్యతేఽర్థధర్మాభ్యాం క్రోధజేష్వాత్మనైవ తు. ౪౬
మృగయాక్షో దివా స్వాపః పరివాదః స్త్రియో మదః,
తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకో గణః. ౪౭
పైశున్యం సాహసం ద్రోహ ఈర్ష్యాసూయార్థదూషణం,
వాగ్దండజం చ పారుష్యం క్రోధజోఽపి గణోఽష్టకః. ౪౮
ద్వయోరప్యేతయోర్మూలం యం సర్వే కవయో విదుః,
తం యత్నేన జయేల్లోభం తజ్జావేతావుభౌ గణౌ. ౪౯
పానమక్షాః స్త్రియశ్చైవ మృగయా చ యథాక్రమం,
ఏతత్కష్టతమం విద్యాచ్చతుష్కం కామజే గణే. ౫౦
దండస్య పాతనం చైవ వాక్పారుష్యార్థదూషణే,
క్రోధజేఽపి గణే విద్యాత్కష్టమేవ త్రికం సదా. ౫౧
సప్తకస్యాస్య వర్గస్య సర్వత్రైవానుషంగిణః,
పూర్వం పూర్వం గురుతరం విద్యాద్వ్యసనమాత్మవాన్. ౫౨
వ్యసనస్య చ మృత్యోశ్చ వ్యసనం కష్టముచ్యతే,
వ్యసన్యధోఽధో వ్రజతి స్వర్యాత్యవ్యసనీ మృతః." ౫౩

మను. ౭ అధ్యా.

అనుమనుస్మృతిప్రోక్తవ్యసనములను రాజు వదలవలయుననియు, ఈవ్యసనములకంటె మరణము మేలనియుఁ గావునఁ గామక్రోధజనితవ్యసనముల విడనాడుమని రాజు కొడుకున కుపదేశించెను. రాజధర్మములను సంగ్రహముగఁ దెలిపి దశరథుఁడు మరల

"తస్మాత్త్వమపి చాత్మానం నియమ్యైవం సమాచర."

అని నొక్కి చెప్పెను. అనఁగా రాజధర్మములు జితేంద్రియుఁడగు రాజునకే యాచరింపననువుపడునుగాని విషయాభిలాషము గలరాజునకు దుర్లభములని భావము.

మహాశయులారా! ఈరీతిగా నీభాగము శ్రీరామచంద్రుఁడు పరమేశ్వరుండని తెలుపుచుఁ దదారాధన క్రమమును బోధించుచు జితేంద్రియత్వమాహాత్మ్యమును దెలుపుచున్నది. కావునఁ గుప్రశ్నములు చేయువారలమాటలఁ బాటింపక శ్రీరాముఁడు మానవసామాన్యుఁ డన్న భావము వదలి ప్రకృతి పురుషులు సీతారాములని భావించి వారిని సర్వదా ధ్యానింప వలయును. ఇఁకఁ దరువాతికథను బఠింతము.

అభిషిక్తుఁడవు కమ్మని రాజు రాముని బురికొలుపుట.

* ఎల్లరును దమతమయునికిపట్లకుఁ బోయినపిదప దశరథుఁడు తాఁజేయఁదగుపని నిశ్చయించువిషయమున నేర్పుగలవాఁడౌట మరల నేకాంతమున మంత్రులంగూడి యాలోచించి పుష్యనక్షత్రము రేపే. కనుక శ్రీరాము నభిషేకించుటకు రేపే సుసమయము. తప్పక యాశుభకార్యము రేపు సాగింపఁదగునని నిశ్చయించెను. వెంటనే రా జంతఃపురమునకుఁబోయి సుమంత్రునిం గని నా ప్రియపుత్త్రుని మరల వేగంబ తోడుకొనిరమ్మని పంచెను. ఆశాసనముం దలందాల్చి త్వరగాఁ బోయి తనరాకఁ దెలియఁజెప్ప ద్వారపాలకులం బంప వారి వలన నావార్త నాలకించి శ్రీరామమూర్తి మరల నింతలో నీతఁడు రాగతంబేమని సంశయించి లోపలికి రప్పింప భటుల కాజ్ఞాపింప వార లట్లుచేయ సుమంత్రా! మరల నేకార్యమున కరుదెంచితివి? దాఁపక తెల్పుమని ప్రశ్నించెను. సుమంత్రుఁడు

* ఈభాగము నాల్గవసర్గమునుండి వ్రాయఁబడినది. అధ్యాత్మరామాయణకథాసారమిం దిమిడియుండును.

దేవా! రాజు నిన్నుఁ జూడఁ గోరుచున్నవాఁడు నే నెఱింగిన దింతియే. కార్యనిశ్చయమున నీవే సమర్థుఁడవు. అనఁగానే మరలఁ దండ్రినిఁ జూడ రాముఁ డతనితో నరిగెను. ప్రియ కుమారుని జూచి మహానందమున రాజు కూరుచుండం బంచి రామభద్రా! చిరకాలము రాజ్యము నేలి వృద్ధుఁడనైతిని. చేయం దగు కార్యములన్నియుఁ జేసితిని. ఎల్లఋణములు తీఱినవి. నిన్ను రాజ్యాభిషిక్తునిగ నొనరించుపనియే మిగిలియున్నది. కాన నేనేమి చెప్పుదునో దాని నీవు చేయవలయును.

వత్సా! ఇత్తఱి జనులెల్ల రాజుగా నీవే యుండఁగోరు చున్నవారు. కాన నిన్ను యువరాజుగా నభిషేకింప నెంచితిని. నిన్నభిషేకింపఁ బూనినందులకు వేఱొక కారణము కలదు. ఇత్తఱి నాకు స్వప్నములయందు భయంకరములు నమంగళ ములు నగునుత్పాతములు కనఁబడుచున్నవి. ఆకసమునుండి పిడుగులతో మహాధ్వనితో నుల్కపడుచున్నవి. నాజన్మతారను భయంకరపాపగ్రహము లాక్రమించి యున్నవని దైవజ్ఞులు చెప్పుచున్నవారు. ఇట్టిదుర్నిమిత్తములు తోఁచిన సాధారణ ముగా రాజునకు మృతి సంభవించును. అది తప్పిన దుస్తరమగు నాపద కల్గును. కావున నిన్నికారణములం దలంచి నిన్నభిషే కింపఁదలంచు నాయూహ మార్పునొందకమునుపే యభిషిక్తుఁ డవుకమ్ము. ప్రాణులబుద్ధి మిగులఁ జంచలము కద. కావున నాల సించిన నేదే మార్పుకలుగవచ్చును. నేఁడు చంద్రుఁడు పుష్య నక్షత్రమునకుఁ బూర్వముగ నుండుపునర్వసువునం దున్నాఁడు. మనము నిశ్చయించిన పుష్యనక్షత్రము రేపు వచ్చునని దైవ జ్ఞులు తెల్పిరి. అపుడు నీవభిషిక్తుఁడవు కావలయును. నా

మనస్సే నన్నీకార్య మొనరింపుమని తొందఱించుచున్నది. శత్రుసూదనుఁడవగు నీకు రేపు పట్టముగట్టెదను.

రామభద్రా! నీవీపగటిపూట మొదలుకొని దృఢమనస్సు గలిగి దర్భశయ్యపై శయనించి పత్నితోడ నీరేయియంతయు నుపవాసనియమము జరపవలయు. శ్రేయస్కరములగు కార్యముల కనేకవిఘ్నములు గలుగును. అట్టులగుట నీమిత్రులు కడు జాగరూకతఁ గలిగి చుట్టునుండి నిన్ను సర్వప్రకారములను రక్షింతురుగాక. భరతుఁడు దేశాంతరమునకుం బోయియున్న వాఁడు. వాఁడయోధ్యకు రాకమునుపే నీయభిషేకము సాగవలయునని నాయూహ. ఇదియే సుసమయము. నీసోదరుఁడు సత్ప్రవర్తనముగలవాఁడే యగును. నిన్ననుసరించియే వర్తించును. ధర్మదయాదిసుగుణవంతుఁడు. జితేంద్రియుఁడు ననుటకు శంకలు లేవు. అయినను సామాన్యదృష్టి నూహింప మానవ చిత్తము చంచలమనియే నావిశ్వాసము. ధర్మమున నిత్యపరాయణత్వముగల సాధువులచిత్తము పరస్పరకృతోపకారమును స్మరించుచు నలరుచుండును. కాని భేదభావమునకుఁ బాల్పడదు. రఘువరుఁడవగు నీ కీవిషయము తెలియనిది కాదు. అని పలికి పోననుజ్ఞ నొసంగెను.

రామభద్రుఁడు తండ్రికి నమస్కరించి యింటికింబోయి తల్లి కామహోత్సవవార్త నెఱిఁగింప నపుడే పోయి యామె యంతిపురింజొచ్చెను. అందామె యాసమయమునఁ బట్టుపుట్టముందాల్చి దేవతాగృహమున మౌనమూని యిష్టదేవతాధ్యాననిరతయై యుండెను. కుమారునకు రాజ్యప్రాప్తింగోరియే యాధ్యానము చేయుచుండెను. రామాగమనమునకుఁ బూ

ర్వమే రామాభిషేకరూపప్రియతమవార్తను విన్నసుమిత్ర యచ్చటికి వచ్చియుండెను. అత్తరుణముననే లక్ష్మణుఁడు వచ్చెను. దాసీజనులఁ బంపి కౌసల్య రమ్మనఁగా జానకియు వచ్చియుండెను. కౌసల్యయుఁ బుష్యనక్షత్రమునఁ గుమారుని యౌవరాజ్యాభిషేకముసాగునని విని సుమిత్రయుఁ దత్సుతుఁడును సేవింపఁగాఁ గుమారునకు నభివృద్ధిఁగోరి ప్రాణాయామపూర్వకముగాఁ బాష్పముల నడంచుభగవంతుని ధ్యానించుచుఁ గన్నులుమూసి కొనియుండెను.

ఆసుసమయమున రామభద్రుఁడు తల్లికడకుం బోయి నమస్కరించి మహానందమును గల్గించుచుఁ దల్లీ! తండ్రి ప్రజా పరిపాలనకార్యమున నన్నాజ్ఞాపించెను. తదాజ్ఞాప్రకారము రేపు నాకు యౌవరాజ్యాభిషేకమహము సాగును సీతయు నాతోడ నీరాత్రి యుపవాసవ్రతము సాగింపవలయు. జనకుఁడు ఋత్విగుపాధ్యాయులు సవిధిఁ దెల్పిరి. రేపటియభిషేకమునకుఁగాఁ జేయఁదగుమంగళకృత్యముల నన్నింటిని నాకు సీతకు నిపుడే చేయింపుము. అని ప్రియపుత్త్రుఁడు పలుకఁగనే యానందబాష్పము లుప్పొంగ మధురోక్తుల వత్సా! దీర్ఘాయుష్మంతుఁడవు కమ్ము. నీశత్త్రువులు నశింతురుగాక. రాజ్యలక్ష్మిం గూడి నాబంధుమిత్త్రులను సంతోషింపఁజేయుము. ప్రియనందనా! నాయానందమునకు మేరకలదా. కల్యాణనక్షత్రమున నాకుఁ గల్గితివి. ఆకారణముననే వినయాదిసద్గుణములు గలిగి సంతోషపఱచితివి. ఇక్ష్వాకురాజ్యలక్ష్మి నిన్నినాఁటికిఁ జేరఁగల్గినది. భక్తిచే భగవంతునిగూర్చి యనేకవ్రతోపవాసములుండి శ్రమించినదంతయు నిప్పటికి ఫలించినదని పల్కెను.

ప్రియజనని యీరీతిఁ బలుకఁగా రామమూర్తి తన ప్రక్క హస్తములు జోడించి వినయమునను న్న తమ్ముని గని లక్ష్మణా! నీవు నాతోడ నీరాజ్యమును బాలింపుము. నీవు నాకు ద్వితీయప్రాణమవుకదా. కనుక నిన్నీ రాజ్యరమ పొందినది. కోరిన భోగములు రాజ్యప్రాప్తిఫలములగు నమూల్యమణిభూషణ ములు నీకు లభింపఁగలవు. వాని ననుభవింపుము. నాప్రాణమును రాజ్యమును నీనిమిత్తమే వాంఛింతును. పెంచి వచింపనేల? అని పల్కి తల్లులయుల్లములలర మ్రొక్కి సీతను బంప వారి నర్థించి కూడఁబిలుచుకొని స్వగృహమునకుఁ బోయెను.

మహామతులారా! ఇందలివిశేషముల నాలకింపుఁడు. దశ రథునిచిత్తము స్థిరతఁగాంచ నవకాశములేదు. మృతికాలము చెంతకు వచ్చుచున్నది. కనుక నే మరల మంత్రులంబిలువంబంచి యాలోచించి రేపే పుష్యనక్షత్రముకాన నభిషేకమహాము సాగవలయునని నిశ్చయించెను. ఇయ్యది యింతకుముందు నిశ్చయింపఁబడినదే. కాని యతనిచిత్తము కలవిలపాటొందు చున్నందున స్మృతితప్పి మరల నాలోచించి రామునిం బిలువ నంపించెను. సుమంత్రుఁడు రాజునానతి వచ్చెనని తెలియఁగనే రాముఁ డనుమానించెను. సుమంత్రుఁడు వచ్చిన నిజము దాఁపక తెల్పుమనియెను. పిలుచుకొనిరమ్మనియె ననిమాత్రమే చెప్పఁగల నని బదులుపల్కెను. రాముఁడు తండ్రికడ కరిగెను. రాజు రామునితో మున్ను పాడినపాటనే మరలఁ బాడెను. తుదకు నేఁజేయవలసినపని నీయభిషేక మొక్కటియే కనుక నాచెప్పి నట్లు చేయు మనెను.

"తద్యావదేవ మే చేతో న విముంచతి రాఘవ,
తావదేవాభిషించస్వ చలా హి ప్రాణినాం మతిః."

తనకుఁ దోఁచిన స్వప్నగతదుశ్చిహ్నముల నెఱిఁగించి రామున కీవార్తఁ దెలిపెను. ఇపుడు దశరథుఁడు తాజీవింపనని యెఱింగె ననియు, నొకప్పుడు మృతితప్పిన నొకయాపద తన్నలముకొను నని యెఱింగెననియు మనమూహింపవలయును. ప్రాణులచిత్తము చపలమైనదికదా. ఈయూహ నాచిత్తమున నిలిచియుండఁగనే యువరాజవు గమ్ము. ఏమేని పలికితివా నాచిత్తము మార్పు నొందునేమో యనికదా దీనియర్థము. ఇందేమో విశేషము కలదని మనము విమర్శింతము.

సాధారణముగా మానవులకు సంపదలుగాని విపత్తులు గాని రానెంచినపుడు వానికనుకూలముగా వారిచిత్తము మార్పునొందును. సూక్ష్మబుద్ధు లాచిహ్నములం గాంచి వారిగతుల నరయఁజాలుదురు. వారుమాత్రము తమప్రవృత్తి మంచిదనియే భావింతురు. అంతియగాక రాఁగలఫలములఁ బరికింపఁజాలరు. ఇదియే పెద్దలకుఁ బామరులకుఁ గలభేదము.

"ప్రాయస్సమాపన్నవిపత్తికాలే ధియోఽపి పుంసాం మలినా భవంతి."

అన్న న్యాయము తప్పునా? ఈన్యాయము దశరథునివిషయమున నన్వయింతము. సమీపమున మృతియున్నది. బుద్ధి క్షణమాత్ర మైన నొకరీతిగా నిలువలేదు. ఈస్థితియందు రాజు చిరకాలము పెద్దలసేవించినవాఁడు కావున రాఁగలదుష్ఫలము ననుమానిం చెను. ఎన్నియో దుర్నిమిత్తములు రాజుననుమానమును దృఢపఱచుచుండెను. కావున రామచంద్రునిం బిలిచి యీ యూహ మార్పునొందకమునుపే యీకార్యమున కంగీకరింపు

మనియెను. ఈభావమే గీతాశాస్త్రము విజయునిమూలమున మనకుఁ దెల్పెడిని.

"చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవద్దృఢం,
తస్యాహం నిగ్రహం మన్యే వాయోరపి సుదుష్కరమ్." అని.

శ్రీరామునియందు భిన్నభావము రాజునకు లేదని యిపుడు మన మెఱుంగవలయును. దశరథునియూహా లొకదానిపై నొకటిగఁ దోఁచుచునే యున్నవి. ఆతని దుష్కర్మమనఁగా మునికుమారుని బాణప్రయోగమునఁ జంపినది ఫలింప నున్నది. కర్మము బలవత్తరమగుటఁ జేసినదుష్కర్మములు ఫలమునీయక మానవు. ప్రాణులు కర్మవశంవదులు. కర్మగతుల నరయుశక్తి మానవులకుఁ బ్రాయికముగా లేదనవలయు. అతీంద్రియజ్ఞులగు యోగులు మాత్ర మెఱుంగుదురు. పండితమ్మన్యు లెఱింగినట్లు నటింతురు. కాని వారు పామరులకంటె నధములు. అహంకారము వారియందు నృత్యముచేయుచు నుండును. ఈవిధమునకు సమాధానము భగవంతుఁ డర్జునునకు

"యద్యహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే,
మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి."

అని యుపదేశించుచుఁ దెలిపెను. కావున మనము కర్మగతులఁ దృణీకరింపక యహంకారమును వదలి సత్కర్మములు భగవదర్పణముగా నాచరించుచుండినఁ దదనుగ్రహపాత్రులమగుదుము. అంతియగాని కర్మములను ద్యజించిన భ్రష్టులమగుదుము. ఈనీతియే యీభాగము మనకుఁ దెలుపుచున్నది.

"తస్మాత్త్వమాద్య ప్రభృతి నిశేయం నియతాత్మనా,
సహ వధ్వోపవస్తవ్యా దర్భప్రస్తరశాయినా.

సుహృదశ్చాప్రమత్తాస్త్వాం రక్షంత్వద్య సమంతతః,
భవంతి బహువిఘ్నాని కార్యాణ్యేవం విధాని హి."

అనుభాగము మన కనేకసద్విషయముల బోధించెడిని. వాని నాలకింపుఁడు. రామచంద్రుఁడు దీక్షఁబూనవలయును. దీక్ష యనఁగా సత్కార్యము నాచరింతునన్న ప్రమాణము. శరీరసుఖ మును బాటింపక రాజ్యమునఁ గల ప్రజలను న్యాయసమ్మత ముగాఁ బాలింతునన్న శపథమే దీక్ష. దీక్ష విధివిహితముగా సాగునంతదనుక బ్రహ్మచర్యము అధశ్శయ్యయుఁ బ్రధానము లుగ నుండవలయు. ఆత్మనియతి నొందందగు. అనఁగా నితర చింత లత్తఱి నుండరాదని భావము.అట్లుండినఁగాని కార్యము సాగదు. తానుమాత్రమున్నఁ జాలదు. భార్యయు నట్టిదీక్షఁ బూనవలయు. భార్యంగూడియే దర్భశయ్యపైఁ బరుండవల యును. బ్రహ్మచర్యవ్రతపరీక్ష యిదియని యెఱుంగవలయు. పార్శ్వమున భార్యయుండఁగాఁ గామము మనస్సునఁ బొడమక యుండవలయు. వాఁడే నియతాత్ముఁ డనంబడును. భోగ త్యాగము కష్టముగఁ దోఁపరాదని భావము. దీక్షాభంగము చేయఁ గొన్నిభూతములు వేచియుండును. భూతోచ్చాటనము నకు మనస్సు పవిత్రముగ నుండవలయును. కేవలమంత్రోచ్చార ణము పనికిరాదని యెఱుంగవలయు.

"అస్మిన్మహత్యర్ణవేఽంతరిక్షే భవాఅధి, నీలగ్రీవాశ్శితికంఠాశ్శర్వా అధః క్షమాచరాః, నీలగ్రీవాశ్శితికంఠాదివగ్ంరుద్రాఉపశ్రితాః."

అన్నశ్రుతి యీవిషయమును బోధించుచున్నది.

"అపసర్పంతు తే భూతా యే భూతా భూమిభారకాః,
యే భూతా విఘ్నకర్తారస్తే నశ్యంతు శివాజ్ఞయా."

అన్నసూక్తికూడ నివ్విధమునే బోధించుచున్నది. కడుంగడు జాగరూకులై నీమేలుగోరినమిత్రులు రామా! నిన్నుఁ గాపాడుదురుగాక యని రాజు తెలిపెను. శత్రువు లీయంతరము నెఱింగి యపకారముచేయుదురుగాన వారిబాధ లంటకయుండ సేవకులుమాత్రముగాక మిత్రులుకూడ జాగరూకులై నిన్నుఁ గాపాడవలయుననియెను. అగపడువారిని మిత్రులు, అదృశ్య భూతములను శాస్త్రనియమములగు నుపవాసాదులు పాఱఁదోలఁగలవని తెలిసికొనవలయును."శ్రేయాంసి బహువిఘ్నాని" అన్నసూక్తి యీరామాయణమునుండి గ్రహింపఁబడినదనియే తేలెడిని. ఉపవాసముమాత్రముండి సమాహితాత్ముఁడు కాకయున్న నయ్యది యారోగ్యమున కించుక తోడ్పడునేమో కాని ఫలము నీయఁజాలదు. ఏకాదశియుపవసించి నిత్యకర్మముల మానుటయేగాక ద్యూతాదులఁ గొందఱు కాలముం బుత్తురు. ఆయుపవాసము నిష్ఫలమే. అయినను గేవలపామరులకు భక్తిని గల్పింప నించుక తోడ్పడును. కాయక్లేశములు మనోనిగ్రహమునకుఁ దోలుతఁ దోడ్పడును. ఆవల దానికి బాధకములుకూడ నగుననుట యోగులకుఁ దెలియును. నిశ్చంచలబుద్ధిని భగవంతుని ధ్యానింపవలయు ననునదియే యిందుఁ గలసారము. ద్యూతాదులు సత్కార్యభంగకరములు. కావున నుపవాసముండి జూదము లోనగువానినాడి కాలముపుచ్చుటకంటెఁ గడుపార భుజించి భగవన్నామమును స్మరించుటయే మేలు.

"విప్రోషితశ్చ భరతో యావదేవ పురాదితః,
తావదేవాభిషేకస్తే ప్రాప్తకాలో మతో మమ.

కామం ఖలు సతాం వృత్తే భ్రాతా తే భరతస్థితః,
జ్యేష్ఠానువర్తీ ధర్మాత్మా సానుక్రోశో జితేంద్రియః.''

అనుభాగమునఁ గలవిశేషాంశములఁ బరికింతము. సంతాన హీనుఁడై దశరథుఁడు కైకను వివాహమాడెను. రాజు వృద్ధుఁ డని యెఱింగి కేకయరాజు నాదౌహిత్రునకు రాజ్యమిత్తువేని కూఁతు నిచ్చెద ననెను. కౌసల్యాసుమిత్రలందు సంతానము కల్గుననునాశ లేనివాఁడు కావున నట్లే దశరథుఁ డంగీకరించెను. ఆమెకు సంతానము కలుగలేదు. ఈశ్వరానుగ్రహమునఁ బుత్ర కామేష్టియాగమున మువ్వురు సంతానముంబడసిరి. ఇప్పుడు దశరథుఁడు తనవాగ్దానము చెల్లింపనక్కఱ లేదని యెంచెను. జ్యేష్ఠపత్ని సంతానవతియైనఁగూడ దానిమాని నీదౌహిత్రున కిత్తునన్ననియమము వాగ్దానమున లేదు. మానవప్రయత్నమున కంటె దైవయత్నము బలవత్తరము కాఁబట్టి యజ్ఞమున సంప్రీతుఁడై భగవంతుఁ డగ్నిరూపమునఁ బాయస మొసంగెను. మువ్వురుభార్యలు సంతానముంబడసిరి. కావున నిందు వాగ్దాన మునకుఁ బ్రాముఖ్యము లేదని దశరథుఁ డెంచెను. కావుననే రామాభిషేకప్రయత్నము సాగించెను. కాని మనస్సున నించుక సంశయముకలవాఁడే యయ్యెను. వసిష్ఠాదుల కీవిషయము తెలిసి యుండుననియే మన మూహింపవలయును. వారు నీప్రయత్నము వాగ్దానమునకు భంగకరముగాదనియే భావించిరి. అందులకే వారివిషయము రాజునకు స్మృతిగతముగఁ జేయకపోయిరి. దశ రథుఁడు సభలో నీవిషయముఁ దెల్పకపోయెను. ఏల? మోసము చేయఁదలఁచియా? కాదు. రామాభిషేక మావాగ్దానమును భంగముచేయునని యూహింపలేదు. పాయసప్రదానము సం

కాన హేతువయ్యెను. కాన ధర్మవిరుద్ధ మిందు లేదని దశరథుని యూహ. ఐనను రామమూర్తి కీవిషయము తెలుపక యుండ రాదని తలంచియే యీమాటలు చెప్పెను.

సాధారణముగా మానవులచిత్తము చంచలమైనదని దశరథుఁ డెఱుంగును. దాన ధనము సర్వానర్థమూలమనుమాట భరతునిచిత్త మించుక యురియాడునేమో యనుశంక పొడమఁగా రాజు రామచంద్రా! భరతుఁ డయోధ్యకు రాకమునుపే యీయుత్సవము సాగవలయునని నాయభిప్రాయ మనియెను. దీనిచేత మనమూహింపఁదగిన దేది? భరతుఁడు మరల నయోధ్య చేరినతర్వాత నేమైన నీకార్యమునకు భంగము కలుగునోకో యని తలంచెననియేకదా. ఇక్కారణమున రాజు వంచకుఁ డన రాదు. భరతునిగుణగణము లెఱింగినవాఁడుకనుక నతఁడు రాజ్యమును గాంక్షింపఁడని యూహించెను. ఈవిషయము భరతగుణగణవర్ణనమువలనఁ దెలియుచున్నది. ఈవిషయమంతయుఁ బరిశీలించిన శ్రీరామాభిషేకము దశరథశపథమునకు భంగముకల్పించునదికాదని తేలెడిని.

భరతుఁడు సుగుణవంతుఁడైనను జిన్నతనము, బంధుప్రోత్సాహము, జననిభావము కలిసి తన్ను జంచలాత్మునిగాఁ జేయఁగా నించుక మార్పునొంది వాగ్దానము చెల్లింపుమని యడుగునేమో; యతనియిష్ట మేల తీర్పరాదు? నాకేల యీ యభిషేకోత్సవము? అని రామమూర్తి యనునేమో యని యనుమానించి దానిఁ బాపనెంచి రాజిట్లు చెప్పుచున్నవాఁడు. వత్సా! సజ్జనులు ధర్మనిరతులు. వారిమనస్సులుకూడ నితరులుచేయు మిత్రభేదాద్యుపాయములకు లోఁబడుచుండును. ఒక్కప్పుడు

కార్యముసాగినవెనుక దానిని ద్వేషింపక యంగీకరించును. అంతియకాని ముందు సాగింపఁబోవు కార్యముల కంగీకరింపవు. కనుక నీయభిషేకము సాగినచో నావార్త నాలకించి భరతుఁ డంగీకరించును. కాని ద్వేషింపఁడు. వచ్చినవెనుక నితరులు పురికొలుప నంగీకరింపఁడేమో యనుసందియము. ఐనను నీ తమ్ముఁడు సత్పురుషులనడవికగలవాఁడు. నిన్ననుసరించి వర్తించు వాఁడు. ధర్మము నెఱిఁగినవాఁడు. జితేంద్రియుఁడు. భూత దయగలవాఁడు. కావున నీయభిషేకమునకుఁ దప్పక సమ్మతిం చును ఐన నింతత్వర యేలనకుము. మానవులచిత్తములు చంచ లములు. కాన నెట్లుండునో నిర్ణయింప నవకాశము లేదని నా యభిప్రాయ మనియెను.

ఇందు శ్రీరామునకు సంశయము గలుగకయుండఁజేయఁ గలమాటలు ఏవి? ధర్మాత్మా! జితేంద్రియః, జ్యేష్ఠానువర్తీ. అను నవి. జ్యేష్ఠునకేరాజ్యముకాని సహజునకుఁ గాదనుధర్మ మెఱిం గినవాఁడు. మనస్సు ప్రాయికముగాఁ జంచలమే యైనను జితేం ద్రియులు చంచలచిత్తులు గారు. సహజప్రీతి నిన్ననుసరించు వాఁడు. అను నీవాక్యములచేత భరతుఁడు నాప్రయత్నమున కంగీకరింపఁడేమో యనుశంక నూనకుమని రాజునభిప్రాయ మని మనము గ్రహింపవలయు.

ఇందుఁగలపరమార్థము నించుక పరిశీలింతము. భగ వంతునికళ నాల్గుభాగములుగ నవతరించెను. అందు సగము శ్రీరామనామమున వెలసెను. భరతుఁ డొకభాగముగలవాఁడు. సౌమిత్రు లిరువు రొకభాగముగలవారు. కావున రామోత్సవ మున కనుజన్ములు సమ్మతింప రనుశంక వసిష్ఠాదులకుఁ గలుగదు.

పరమార్థ మెఱుంగనిరాజునకు నించుక గల్గెను. మాయాతీతుఁడయ్యు రామచంద్రుఁడు మాయావశంవదుఁడుగఁ గనఁబడుచున్నవాఁడు. కావునఁ దండ్రి చెప్పిన ప్రతివిషయమునకు నంగీకరించుచుండెను. ఈయుత్సవము సాగదని యాపరాత్పరుఁడెఱుంగఁడా ? తనయవతారకారణ మెఱుంగఁడా ? తనకేల యీపెత్తనమనియుఁ బ్రకృతియగుసీత సర్వభారమును వహింపవలసినదికనుకఁ దాను నిర్లిప్తుఁడుగను సర్వసాక్షిగ నుండెనని మనము తెలిసికొనవలయును.

జననీజనకాజ్ఞల శ్రీరాముఁ డేది ప్రధానమనుకొనువాఁడు? అన్నప్రశ్నము నిచ్చో నించుక విమర్శింతము.

"ఆచార్యో బ్రహ్మణో మూర్తిః పితా మూర్తిః ప్రజాపతేః,
మాతా పృథివ్యామూర్తిస్తు భ్రాతా స్వోమూర్తిరాత్మనః. ౨౨౬
యం మాతాపితరా క్లేశం సహేతే సంభవే నృణాం,
న తస్య నిష్కృతిశ్శక్యా కర్తుం వర్షశతైరపి. ౨౨౭
తయోర్నిత్యం ప్రియం కుర్యాదాచార్యస్య చ సర్వదా,
తేష్వేవ త్రిషు తుష్టేషు తపస్సర్వం సమాప్యతే. ౨౨౮
తేషాం త్రయాణాం శుశ్రూషా పరమం తప ఉచ్యతే,
న తైరభ్యననుజ్ఞాతో ధర్మమన్యం సమాచరేత్. ౨౨౯
పితా వై గార్హపత్యోఽగ్నిర్మాతాగ్నిర్దక్షిణస్స్మృతః,
గురురాహవనీయస్తు సాగ్నిత్రేతాసమాహితా. ౨౩౧
ఇమం లోకం మాతృభక్త్యా పితృభక్త్యా తు మధ్యమం,
గురుశుశ్రూషయా త్వేవం బ్రహ్మలోకం సమశ్నుతే." ౨౩౩

మను. ౨ అధ్యా.

అను నీమనుస్మృతిప్రకారము తల్లిదండ్రులలోఁ దండ్రి యుత్కృష్టుఁడని తేలెడిని. కొన్నితావులఁ దల్లి తండ్రికంటె నెన్నియోమడుంగు లుత్కృష్టురాలని కలదు. జ్ఞానప్రదాత తండ్రికావున నతఁడే యుత్కృష్టుఁడని గ్రహింపఁదగు.

"ఉపాధ్యాయాద్దశాచార్య ఆచార్యాణాం శతం పితా,
సహస్రం తు పితౄన్మాతా గౌరవేణాతిరిచ్యతే. ౧౪౫
ఉత్పాదకబ్రహ్మదాత్రోర్గరీయాన్ బ్రహ్మదః పితా,
బ్రహ్మజన్మ హి విప్రస్య ప్రేత్య చేహ చ శాశ్వతమ్. ౧౪౬

మను. ౨ అధ్యా.

అనుస్మృతివాక్యములే యిందులకుఁ బ్రమాణములు. మర్యాద చేయుటలోఁ దల్లియే ఎక్కుడుగఁ జెప్పఁబడినది. ఇందుఁగల సారమెఱింగియే శ్రీరామమూర్తి పితృనాజ్ఞ పరమోత్కృష్టమని భావించెను. తారతమ్య మెఱుంగుటయేకదా వివేకము. సామాన్యవిశేషభేదము లెఱుంగక ప్రవర్తించుట యవివేకమూలమని భగవత్ప్రవర్తనమే మనకుఁ దెలుపుచున్నది. తల్లిదండ్రులయాజ్ఞ లొకవిషయమున విరుద్ధములుగనున్నపుడు శ్రీరామప్రవృత్తి ననుసరించి ప్రవర్తించుట మేలు.

శ్రీరామమూర్తి తల్లికడ కరిగి శుభవార్తఁ దెలిపిన ఘట్టము విమర్శింపఁదగు. అందనేకవిషయములు తెలిసికొనఁ దగినవి కలవు.

"తస్మిన్ కాలే హి కౌసల్యా తస్థావామీలితేక్షణా."

అని మూలము రాముఁడు తల్లికడకుఁ బోవకమునుపే సుమిత్ర లక్ష్మణుఁడు లోనగువారిమూలమున శ్రీరామపట్టాభిషేకమహోత్సవవార్త నాలకించి సగము కన్నులుమూసి భగవంతుని

ధ్యానించుచుండెను. పరమేశ్వరునిధ్యానించునపుడు బాహ్య
దృష్టి విరమింపవలయును. కన్నులుమూయరాదు. తెఱువ
రాదు. "అర్ధోన్మీలితలోచనః" అని యోగశాస్త్రము తెలుపు
చున్నది. బాహ్యదృష్టి విరమించినయెడల బాహ్యవస్తువు లగ
పడవు. అంతమాత్రము లాభముచాలదు. ఉపాస్యదేవతా
రూపము నెదుటనునుచుకొని దానియందే దృష్టినునిచి మనస్సు
తదేకలగ్నమగునట్లు చేయవలయును. ఇదియే తొలుతఁ జేయఁ
దగినపని. ఈయభ్యాసమునఁ గృతార్థుఁడై పిదప నుపాస్య
దేవతామూర్తి (అనఁగా స్వేచ్ఛాకల్పితమూర్తిని) మనఃపీఠ
మున నునుచుకొని దానినే యంతర్దృష్టిని దిలకించుచు దాని
నుండి దృష్టి మరలనీయకయుండ నభ్యసింపవలయును. యోగా
భ్యాసమున నిదియే. ఇట్లు చేయుచు వరుసగా వాయునిరోధము
చేయుచుండవలయును. ఇట్లుచేయక ముక్కు-చెవులుమూసి
యందేమో రహస్యమున్నయట్లు శిష్యులకుఁ బశుప్రాయులకు
బోధించి ద్రవ్యములాగుట కొందఱిమతమున యోగాభ్యా
సము. అది నిరర్థకమగుటయేగాక శరీరమునఁ గొన్నియవయవ
ముల నశింపఁజేయును. అట్టిదానికిఁ బాలుపడరాదు. పుస్తక
ములఁజూచి యారీతిగా నభ్యసింపరాదు. అదియుఁ బ్రమాద
కరము. సత్యముగా యోగాభ్యాసము నభ్యసించుసాధువుల
కడఁ గ్రమముగా నభ్యసింపవలయును. వారు ధనముంగోరరు,
శిష్యునినిర్మలమనస్సునే కోరుదురు. అట్టివారిని వెదకి కనుఁగొని
వారివైరాగ్యమును బరిశీలించి పిదప వారి నాశ్రయింపవల
యును. యోగి వైరాగ్యవంతుఁడుగానుండును. ఈషణత్రయ
మున కతఁడు లోఁబడఁడు. ఏదియో యొకపేరుపెట్టి ధనమును

లాగఁబూనఁడు. ధనముతో నతనికి సంబంధమే యుండదు. భగవంతునితో సంబంధముగలవారుగ నుండును. శిష్యులసంపాదించు నూహలు వారికిం గలుగవు. దేవతాదూషణము వారు చేయరు. పరమేశ్వరునే యెల్ల తావులం జూచుచుందురు. అట్టి గుణములుగలవార లెవరాయని పరీక్షించి క్రోధాసూయలు వారినుండి వదలినవా లేదా యనియు గట్టిగా నెఱింగి వారినే యోగులని నిశ్చయించి యాశ్రయించినచో వారు తరణోపాయమును దెల్పుదురు. లేకయున్నఁ దరణోపాయము దొరకదు. ఈవిషయ మీభాగమునుండి మన మెఱుంగవలయును.

"ప్రాణాయామేనపురుషం ధ్యాయమానాజనార్దనం"

అనుభాగమున నొకవిశేషము గలదు.

"ప్రాణాయామేన ప్రాణాయామపూర్వకం పురుషం పురుషసూక్తప్రతిపాద్యపురుషశబ్దవాచ్యమ్ జనార్దనం నారాయణమ్."

అని గోవిందరాజులు వ్రాసిరి.

"ప్రాణాయామః ప్రాణవృత్తినిరోధః. ౧. నిశ్వాసోచ్ఛ్వాసయోర్గతివిచ్ఛేదకారకవ్యాపారో వా. ౨. రేచకపూరకకుంభకలక్షణః ప్రాణనిగ్రహోపాయః"

అని సర్వతంత్రసిద్ధాంతపదార్థలక్షణసంగ్రహము.

ధ్యానమ్. "అంతరాంతరా వృత్త్యంతరవతీ ప్రత్యయైకతానతా ౧ విజాతీయప్రత్యయతిరస్కారేణ సజాతీయప్రత్యయప్రవాహీకరణమితి"

దీనింబట్టి యాలోచింపఁగా ధ్యానమునకుంగూడ యోగాభ్యాసమే ప్రధానమని తేలెడిని. పురుషసూక్తమునఁ జెప్పఁబడిన పురుషశబ్దవాచ్యుఁడగు నారాయణమూర్తినని గోవిందరాజులు

వ్రాసిరి. వారిభావము త్రిమూర్తులలో నొకరగువిష్ణువనియే. ఏలయనఁగా నందు నారాయణునివలన రుద్రాదులు జనించి రనియున్నందున విష్ణు వధికుఁడనుసిద్ధాంతము సర్వోత్కృష్ట మని వారియూహ. కాని యీవిషయమున వారు చాల పొరపడిరని నాభావము. వైకుంఠవాసి నారాయణమూర్తి వారొప్పుకొనక తప్పదు. ఆనారాయణునకు నాలుగుబాహువులుకలవని సకలపురాణములు తుదకు వారంగీకరించిన శ్రీభాగవతము కూడఁ దెలుపుచున్నది. పురుషసూక్తమున శీర్ష, వేయితలలు, వేయికన్నులు, వేయిపాదము లున్నట్టు లున్నది. వైకుంఠవాసి నారాయణున కీలక్షణములు పొసఁగవు. కావున నిందుఁ జేర్కొన్న దైవము సర్వవ్యాపకుఁడగుభగవంతుఁడేయని యెఱుంగవలయు. ఒకప్పుడు గోవిందరాజులుగారు వైకుంఠవాసి నారాయణునకు వేయితలలుండవచ్చునని యంగీకరించినను వారిసిద్ధాంతము నిలువదు.

"స బ్రహ్మ స శివస్సహరిస్సేంద్రస్సోఽక్షరః పరమస్స్వరాట్"

అన్నశ్రుతి యేమగును?

"సఏవ విష్ణుస్సప్రాణస్స కాలోఽగ్నిస్స చంద్రమాః"

అన్నయుపనిషత్తేమగును?

"ఆబ్రహ్మభువనాల్లోకాః పునరావృత్తినోఽర్జున,
మాముపేత్య తు కౌంతేయ పునర్జన్మ న విద్యతే. ౧౬ అ. ౮.

అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః,
అహమాదిశ్చ మధ్యం చ భూతానామంత ఏవ చ." ౨౦ అ. ౧౦.

అను నీగీతాశాస్త్రవాక్యము లేమగును? ఇట్టి యసంఖ్యాక ప్రమాణములంబట్టి పరిశీలింపఁగాఁ బురుషసూక్తప్రతిపాద్యుఁడు సకలశ్రుతివిశేషప్రతిపాద్యుఁడు సకలపురాణాదిప్రమాణప్రతిపాద్యుఁడు పరాత్పరుఁ డొక్కఁడే. త్రిమూర్తులు తత్ప్రతికృతులే కాని యందు భేద మేమాత్రము కానరాదు. భేదము మానవులహృదయములయందున్నది. ఆభేదమే సకలాపన్మూలము. అది వదలినఁగాని భగవత్ప్రసాదము దొరకదు. కౌసల్య హృదయమునఁ ద్రిమూర్తులబుట్టించిన ప్రకృతి కతీతుఁడగు పరమపూరుషుని ధ్యానించుచు శ్రీరామచంద్రునకు శుభము లొనఁగూడవలయునని ప్రార్థించుచుండెనని మన మెఱుంగవలయును.

"అంబ పిత్రా నియుక్తోఽస్మి ప్రజాపాలనకర్మణి,
భవితా శ్వోఽభిషేకో మే యథా మే శాసనం పితుః."

అన్నమూలమునఁ గలవిశేషము వినుఁడు. ప్రజలరక్షింపుమని తండ్రి నియోగించెను. రేపు నాకు నభిషేకము కాఁగలదు. తండ్రిశాసనముప్రకారమే సాగునని రామమూర్తి కౌసల్యకుం దెల్పెను. రేపు నాకు నభిషేకము కాఁగలదని రాముఁడు చెప్పినందున రాఁగలకష్టము నెఱుంగకపోయెను. కాన మానవసామాన్యుఁడే కాని భగవంతుఁడు కాఁడని కొందఱందురు. అట్టివారల కిందుఁగలవిశేషార్థము తెలియలేదని మన మెన్నఁదగును. ప్రజాపరిపాలనము రేపు ప్రారంభింతునని రామమూర్తి పలికెను. అదియే యవతారఫలము. తండ్రిశాసనముప్రకార మభిషేకమగును. దశరథుఁడు రేపటినుండి ప్రజాపాలనకార్యము మానును. నే నాకార్యమును జేయఁబూనుదునని పలుకుట

సత్యమే. అయోధ్యా రాజ్యప్రజలఁబాలింపుమని కాదు. ప్రపంచ మునఁగల యెల్లమానవులననియే తాత్పర్యము. ప్రజాపాలనము దుష్టనిగ్రహమునఁగాని చక్కఁగా సాగదు. కావునఁ దొలుత దుష్టుల నిగ్రహింప రేపే పూనెదనని శ్రీరామునిభావము. అదియే సత్యము. శ్రీరామవాక్య మేదియు నసత్యము కాదు. "అనృతం నోక్తపూర్వం" అనియేకదా యామహాత్మునిశపథము. అది యేనాఁడు నసార్థకము కాదు. ఇట్లర్థమును గ్రహించినఁగాని రామాయణపఠనము ఫలవంతము కాదు. దుర్మతాభిమానము మానినఁగాని పరమేశ్వరానుగ్రహము కలుగదు.

"వత్స రామ చిరం జీవ హతాస్తే పరిపంథినః,
జ్ఞాతీన్ మే త్వం శ్రియా యుక్తస్సుమిత్రాయాశ్చ నందయ."

అను నీకౌసల్యావాక్యముం బరిశీలింపఁదగు. చిరకాలము జీవింపుము. నీశత్రువులు హతులగుదురుగాక శ్రీదేవితోఁగూడి నాజ్ఞాతులను సుమిత్రజ్ఞాతులను (బంధువులను) సంతోషపెట్టుమని కౌసల్య యాశీర్వదించుచుఁ గోరెను. శ్రీదేవి యనఁగా యోగమాయ. పరమేశ్వరి యంతకంటె వేఱెవ్వ రుందురు? ఆమెయే యిపుడు సితానామమున వెలసినది. ఆమెంగూడినఁగాని యేకార్యము సాగదు. పగవారి ననఁగా భగవంతునకు శత్రువులు కలరా? ఉండరుకదా. ఉండినచో భగవంతుఁడే కాఁడనవలయు. కాన నిటనున్న "తే" అనునది సర్వనామముగా నెంచందగు. "తే పరిపంథినః" ఆశత్రువులు అనఁగా లోకమున నీవఱకే ధర్మద్వేషులై సాధువుల బాధించు రావణాదిరాక్షసులని యర్థము. వారు నీచేఁ జంపఁబడుదురుగాక. ఇదియే యాశీర్వాదము. కౌసల్య వీరమాతకదా. ఈయాశీర్వాదమే

యా మెఱుందగినది. నాబంధువులను సుమిత్రబంధువులను సంతోషపెట్టుము. అనఁగా నాకును సుమిత్రకును సంతోషము గలిగించు కాలము లేదు. మాకు వైధవ్యమే కలుగును. మా యిరువురిబంధువుల నానందింపఁజేయుము. అని కౌసల్యనోట వెడలెను. ఇది యామె తెలిసి పలుకలేదు. భగవత్ప్రేరణమున నట్టిమాటలు వెలువడెనని మన మూహింపవలయును. లేకున్న నన్ను నాబంధువుల నని యేల పలుకఁజాలకపోయెను? దీనింబట్టి రాఁగలఫలముల ననుసరించి యూహాలు కలుగుననియుఁ బ్రవృత్తియు నట్లే కుదురుననియు మన మెఱుంగవలయును.

“సౌమిత్రే భుంక్ష్వ భోగాం స్త్వమిష్టాన్ రాజ్యఫలాని చ.
జీవితం చ హి రాజ్యం చ త్వదర్థమభికామయే.”

అను నీరామవాక్యమే యతనిభగవత్తత్త్వమును వెల్లడించుచున్నది. లక్ష్మణా! కోరినభోగముల ననఁగా రాజ్యఫలములవియే కాన వాని ననుభవింపుము. ఈశరీరమునఁ బ్రాణముల ధరించుట రాజ్యము నేలఁబూనుట నీకొఱకే. అనఁగా నేఁ గోరఁదగినవియు అనుభవింపనివియు నగుసుఖములు లేవని భావము.

“న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన,
నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి.” గీ. అధ్యా. 3

అను నీగీతావాక్యము పైభావమును దృఢపఱచుచున్నది. “త్వదర్థ” మనుచో నీయొక్కనికొఱకుఁ గాదనియు నెల్లరకొఱకనియు గ్రహింపఁదగును. నిర్లిప్తుఁడను, సర్వసాక్షిని, పరిపూర్ణుఁడను, నిత్యతృప్తుఁడను. కావున నితరులకొఱకే యీశరీరమును ధరించితినని రామచంద్రునిభావమనియే. యిటఁగల సారము.

"అభ్యనుజ్ఞాప్య సీతాం చ జగామ స్వం నివేశనమ్."

తన్ను నాజ్ఞాపించినట్లే సీతనుగూడ వారిచే నాజ్ఞాపింపఁజేసి తన యింటికిం బోయెను. జానకీ! నీవు రామునకుఁ దోడ్పడుము. ఉపవాసాదివ్రతనియమములఁ బాటింపుమని వారిభావము. వివాహకాలమున జనకమహారాజు

"ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ."

అని పలికియేకదా దానము చేసెను. ధర్మరక్షణకార్యమున నీకుఁ దోడ్పడుమనికదా దానిభావము.

"ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునఃపునః,
భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్." ౯ అధ్యా. ౮.

అను నీగీతావాక్యము పైభావము సమంజసమేయని బోధించుచున్నది. ప్రకృతి వెలయింపకయున్నచో భగవంతుఁడే కార్యము చేయఁజాలఁడని సారము. చేయఁజాలఁడనఁగా నసమర్థుఁడని యర్థము కాదు. తాను సర్వసాక్షియగుట సర్వకార్యము లొనరింపఁ బ్రకృతిని అనఁగాఁ దనయిచ్ఛాశక్తిని యోగమాయ నాజ్ఞాపించుననియుఁ దానూరక చూచుచుండుననియు తాత్పర్యము.

"శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం,
న చేదేవం దేవో న ఖలు కుశలస్స్పందితుమపి."

అన్న శ్రీశంకరాచార్యోక్తియు భగవద్గీతావాక్యము నొక్కరీతిగనే యున్నవి. ఇట్టు లీభాగము మన కనేకనీతులను బోధించుచు భగవంతునిమహత్త్వమును వెల్లడించి యోగమాయాకార్యమును దేటపఱచుచున్నది. కావున నీసర్గమును బఠించి

ప్రకృతిపురుషులమహత్త్వము నెఱింగి వారే సీతారామచంద్రు లన్న విశ్వాసముగలిగి వారలను నిశ్చలచిత్తమున ధ్యానింపవల యును. శిలావిగ్రహముల నారాధించినందున సంపూర్ణమగు భగవదనుగ్రహము కలుగదనుట సత్యము. ధ్యానమే ముఖ్య మని చక్కఁగా విశ్వసింపవలయును. ఇఁకఁ దర్వాతి భగవచ్చరిత్ర మును బఠింతము.

సీతారాము లుపవాసవ్రతము నడపుట.

*దశరథుఁడు మఱునాఁటియభిషేకమునకుఁగా నుపవాస ప్రముఖనియమములు చేయునట్లు రామమూర్తికిం దెల్పి వసిష్ఠ మహర్షిం దిలకించి మహాత్మా! నీవు పోయి రామచంద్రుని సీత తోడ నిరుపమానకీర్తిని రాజ్యలక్ష్మినిబొందుటకై యుపవాసము సలుపునట్లు తెలుపుమని పంపెను. వేదవేత్తలలో శ్రేష్ఠుఁడు. దృఢవ్రతుఁడు. కావున రాముని చేత విధివిహితముగా నుప వాసవ్రతము చేయింపం దలంచి బ్రాహ్మణులకుం దగినయశ్వ శకటము నెక్కి తానే రామునివేశనమునకుంబోయి శ్వేతసర్మ మునఁ బ్రకాశించు నాసౌధముం జేరి మూఁడుకక్ష్యలు దాఁటి పోవఁగా రామమూర్తి మునిరాక నెఱింగి బయలువెడలి రథముచెంత కరిగి తానే యమ్మునివర్యుని రథమునుండి చేయూఁత యొసంగి దింపెను. ప్రియార్హుఁడగు నా రామునిం గాంచి కుశలప్రశ్నపూర్వకముగ సుప్రసన్నునిజేసి సంతోష మువొంగుచుండఁగా నాతనితో శ్రీరామా! నీయొడ సుప్ర సన్నుఁడగు నీతండ్రి యానతి యావరాజ్యము నొందెదవు. సీతాదేవితోడ నుపవాసము సలుపుము. రేపు ప్రాతఃకాలమునఁ

---

* **ఈభాగ మేనవ సర్గమునుండి గ్రహింపఁబడియె.**

బూర్వము నహుషుఁడు యయాతికింబోలె నీకు నీతండ్రి యౌవరాజ్య మీయఁదలంచియున్నవాఁడు. అని పలికి వారి నిరువురను విధి ననుసరించి యుపవాసము సలుపఁజేసెను.

అవ్వల ముని రామసత్కారముంబడసి యతఁడు సాగ నంప రాఁగా నిలువంబంచి తన నివాసమున కరిగెను. రామ మూర్తియు వేడుకఁగా మాటలాడు ప్రియమిత్రులంగూడి యానందించుచు వారిని సమ్మతింపఁజేసి వారియనుమతినొంది యంతఃపురముం బ్రవేశించెను. అందుఁగలస్త్రీపురుషు లందఱు నానందపరవశులై మాటలాడుచు మోములు వికసింపనుండఁగా నాగృహావరము కమలాకరమువలె నొప్పియుండెను. వసిష్ఠ మునియు రాజగృహమునుండి వెడలి రాజమార్గమెల్ల జనా క్రాంతముగ నుండంగాంచుచు నభిషేకదర్శనార్థ మరుదెంచి వారలం బరికించుచుఁ బోవుచుండెను. వీథులెల్ల జనులు నిండఁగా రాకపోకల కనువుగాకయుండెను. ఆజనుల కలకలము సముద్రఘోషము ననుకరించుచుండెను. వీథులెల్ల నలంకృత ములై యుండెను. ధ్వజపటము లెత్తఁబడియుండెను. పురమునఁ గల స్త్రీలు పురుషులు బాలురు ముదుసలులు శ్రీరామాభిషేక మహోత్సవమును గన్నులారఁ గాంచందలంచి వ్యాపారాంతర ములవదలి యెపుడు సూర్యోదయమగునా యని యాశించుచు నలంకరించుకొని మహానందమున మేనుల మఱచియుండిరి. వారి నెల్లం జూచుచు మెల్లగాఁ జని శ్వేతగిరిశిఖరమువలెఁ బ్రకా శించు రాజేంద్రునిప్రాసాదము సమీపించి బృహస్పతి దివస్పతిని సమీపించునట్లు దశరథునిచెంతకుఁ జనియెను. మునివర్యుని యాగమనముం గాంచి రాజు లేచి సీతారాముల నుపవసింపఁ

జేసితిరికదా యని యడుగ నట్లే యొనరించి వచ్చితినని యతఁ డనెను. సభ్యులెల్లరు లేచి యమ్ముని నారాధించిరి. ఎల్లరకు నా వార్తలం దెలిపి వారినెల్లఁ బోవంబనిచి దశరథుఁ డంతఃపుర మునకుం బోయెను.

మహాశయులారా! ఇందు విమర్శింపఁదగినవిషయ మొక్కఁడు కలదు.

> "ఇత్యుక్త్వా స తదా రామముపవాసం యతవ్రతం
> మంత్రవత్కారయామాస వైదేహ్యాసహితం మునిః"

ఉపవాసము మంత్రపూర్వకముగా ననఁగా నీధర్మకార్యమును విధి నతిక్రమింపక యోపికమెయి నొనరింతు ననుసంకల్పపూర్వకముగా నని యర్థము. మానవబుద్ధి చంచలము. ఎన్నియో ప్రమాదములకు లోనగును. కావునఁ దమకుఁ దోఁచినట్లు చేయక శాస్త్రములోఁ జెప్పినట్లే చేయవలయును. శాస్త్రములు మనవంటివారిచేఁ గల్పింపఁబడినవి. వానిని మనమేల యనుసరింపవలయును? మన మాలోచించి యేది యుక్తమని మన మదికిం దోఁచునో యట్టులే యొనరింపవలయును. శాస్త్రములతోఁ బనిలేదు. అని యుపదేశించు మహాత్ములు గలరు. ఆయభిప్రాయము న్యాయముకాదు. ఏలయనఁగా మానవు లల్పకాల జీవులు. లోకమున నేయేవిషయము లెట్లెట్లు సాగుచున్నవని స్వానుభవమునఁ దెలిసికొనఁజాలునంతకాలము జీవింపఁజాలరు. దేశములు తిరిగితిరిగి ప్రతివారియాచారములఁ బరిశీలించి యెట్టి యలవాటున నెవ్వరెట్లు కష్టపడిరి? దేనిచే నెవ్వరెట్లు సుఖపడిరి? అని కనుఁగొనినఁగాని లోకజ్ఞాన మలవడదు. అట్టి యభ్యాసమునఁగాని సదాచారదురాచారములవలని లాభనష్ట

ములు తేటపడవు. నాలుగుశుక్రవారములు బ్రదుకువారు మా యనుభవ మిదియని వచించుట తెలివితక్కువయే. లోకుల కిది యిట్లుండవలయునని బోధించుట యంతకంటె నవివేకము. చిరకాలము జీవించుటకు యోగాభ్యాసము కావలయును. ఒక్కఁ డెల్లతావులఁ దిరుగఁజాలఁడు. యోగదృష్టిగలవా రెల్లవిషయముల నెఱుంగఁగలరు. అట్టివారు రచించినవే శాస్త్రములు. వాని నాక్షేపించుట యట్టిజ్ఞానము లేకపోవుటచేతనే యని మన మెఱుంగవలయును.

"త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః,
కామః క్రోధస్తథా లోభస్తస్మాదేతత్త్రయం త్యజేత్. ౨౧
ఏతైర్విముక్తః కౌంతేయ తమోద్వారైస్త్రిభిర్నరః,
ఆచరత్యాత్మనః శ్రేయస్తతో యాతి పరాం గతిం. ౨౨
యశ్శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః,
న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిం. ౨౩
తస్మాచ్ఛాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ,
జ్ఞాత్వా శాస్త్రవిధానోక్తం కర్మ కర్తుమిహార్హసి." ౨౪

గీత. ౧౬ అధ్యా.

అన్న భగవద్గీతావాక్యము లీభావమును దృఢపఱచుచున్నవి. అతీంద్రియజ్ఞానములేనివారు సర్వజ్ఞులవలె భాషించుటయు, లోకులను వంచించుటయు నను నీరెండుకార్యములచే స్వలాభమునే పోఁగొట్టుకొందురు. ఈవిషయమును మన కీశ్రీరామచంద్రప్రవర్తనము బోధించుచున్నది. ఉపవాసము తోఁచినట్లుండిన నది ఫలవంతము కాదు. విధి నతిక్రమింపక మనోనిగ్ర

హాముగలిగి ధర్మకార్యసాధనముకొఱకుఁ జేసిననే సంపూర్ణ ఫలము గలుగును. కొందఱారోగ్యముకొఱ కుపవాసములు సల్పుదురు. దాన ఫలముగలదో లేదో తెలియరాదు. కాని యొకప్పుడద్దాన బాధకలుగుటమాత్రము సత్యము. ఏయత్నము చేసినను ధర్మముకొఱకు చేయవలయును. దాననే దేహారోగ్యము మనోనైర్మల్యము లభించునని యెఱుంగందగు. ఉపవాసము చేయునపుడు విషయాసక్తి పనికిరాదు. దీనింబట్టి యాలోచింపఁగా నుపవాసమువలన నింద్రియములు శోషిల్లు నని దాన విషయాసక్తి తగ్గునని సారము. విషయాసక్తి తగ్గిన వారల కీయుపవాసము లక్కఱలేదు. ఐనను వస్సుఁ జూచి పామరులీసదాచారము నేర్చుకొందురుగాక యను నభిప్రాయముతోఁ జేయవలయును.

"కుర్యాద్విద్వాంస్తథాసక్తశ్చికీర్షుర్లోకసంగ్రహమ్."

అనుగీతావాక్యము కలదుకదా. ఇట్టిభాగమునఁగల శ్రీరామచంద్రునిచరిత్రము మనకు సదాచారమును బోధించుచున్నది. దంపతులిరువురు నిట్టియాచరణముల నాచరింపవలయు. కొందఱు పురుషులుమాత్రమే వ్రతాంగములగు నుపవాసముల సల్పుదురు. స్త్రీలుమాత్రమే యుపవాసములు సల్పుదురు. అదియు ననాచారమే యని యూహింపవచ్చును. భార్య యనువ్రత కావలయును. ధర్మపత్ని యనఁగా నర్థ మదియేకదా. "సహధర్మ చరీ తవ" అను జనకవాక్యము మన కిట్లే బోధించును. అనువ్రత కాకయున్న నాదాంపత్యము పుణ్యప్రతఫలము కాదు. ఇఁకఁ దరువాతిభగవచ్చరిత్రమును బఠింతము.

శ్రీరామాభిషేకప్రయత్నము.

* పురోహితుఁడగు వసిష్ఠమహర్షి తనకు విధిఁదెలిపి వెళ్లి నంతట శ్రీరామచంద్రుఁడు స్నానమొనరించి నిశ్చలమనస్కుఁడై ప్రియపత్నింగూడి శ్రీమన్నారాయణమూర్తి నుపాసించెను. అంత నా రాజకుమారుఁడు హవిఃపాత్రమును శిరస్సున ధరించి ముందు నగ్నిహోత్రునియందు దేవతోత్తముఁడగు నారాయణునిగూర్చి ఘృతముతో హోమము చేసి హవిశ్శేషమును బ్రియముగా భుజించి యభీష్టమును స్మరించుచు శ్రీమన్నారాయణమూర్తిని ధ్యానించుచుఁ దానుగాఁ గల్పించుకొన్న దర్భశయ్యపై మౌనమూని నిశ్చలమనస్కుఁడై పత్నింగూడి దేవతాగృహమున శయనించెను. నాల్గవయామమున మేల్కాంచి గృహాలంకారవిధి నొనరింపఁజేసి స్తుతిపాఠకధ్వనుల నాలకించుచుఁ బ్రాక్సంధ్యాదైవతమగు సూర్యభగవంతు నారాధించి వశీకృతమనస్కుఁడగుచు గాయత్రిని జపించి మధుసూదనమూర్తిని నమస్కారపూర్వకముగా వినుతించెను.

ఇట్లు ప్రాతఃకృత్యములాచరించి యభిషేకమహాప్రయుక్తమగు స్నానము చేసి ధౌతవస్త్రములఁ దాల్చి బ్రాహ్మణులచే స్వస్తివాచనము చేయించెను. అవ్విప్రు లాపుణ్యాహము చెప్పఁగా నావేదమంత్రధ్వని మధురగంభీరమై తూర్యధ్వనులం గలిసి చెలరేఁగి నగరమందంతట వ్యాపించెను. సీతారాములుపవాసములు సలిపిరని యాకర్ణించి పౌరులెల్ల నానందించిరి. రామాభిషేకదినమని యెఱింగినవారుగాన నెల్లరు తమతమ

---

* ఇది యాఱవసర్గమునుండి గ్రహింపఁబడినది. అధ్యాత్మరామాయణ విషయము నిట నిమిడియుండును.

గృహములను ముంగిళ్ల నలంకరించిరి. దేవాలయచైత్యాదులెల్లఁ జక్కఁగా నలంకరింపంబడియె. ఎల్లతావుల రాజచిహ్నములుగల ధ్వజము లెత్తఁబడి యలరారుచుండెను. ఆటలు పాటలు నెల్లతావుల సాగుచుండెను. ఆనందపరవశులై జనులెల్లరు నాయాటలపాటల నాలకించుచుఁ జూచుచునుండిరి. ఎల్ల తావుల శ్రీరామాభిషేకవార్తలనే యందఱుఁ జెప్పుకొనుచుండిరి. బాలకులుగూడ నాడుకొనుచు నామాటలనే చెప్పుకొనుచుండుట వింతగొలుపుచుండెను. రాజమార్గము లలంకృతములై సువాసనల వెదఁజల్లుచుండెను.

పట్టాభిషేకోత్సవమున శ్రీరామచంద్రుఁడు పట్టపుటేనుంగుపై వచ్చుచుండఁగా నెత్తుగానున్న యారామమూర్తి యగపడుటకును, ఆతఁడు పయనము చేయకమునుపే రాత్రియగునచో నారాముని యితరాలంకారములను జీకటియందుఁ జక్కఁగాఁ గాంచుటకుంగోరి పౌరులు రాజవీథులయందుఁ బొడవులై వృక్షములంబోలు దీపస్తంభములను నిర్మించిరి. అభిషేకోత్సవ దర్శనార్థులై జనులు గుంపులుగాఁ జేరి దశరథుఁడు రామాభిషేకము నొనరింపఁబూను టుత్తమకార్యమనియు, మన మీ విషయమునే చిరకాలముగాఁ గోరుచున్నదే యనియు, రామమూర్తి సర్వవిధములఁ బరిపాలనమునకుఁ దగినవాఁడనియుఁ జెప్పుకొనసాగిరి. రామచంద్రుఁడు తోఁబుట్టువులయం దెట్టి భావమో మనయందు నట్టియభిమానమే కలవాఁడనియు, నా రాజచంద్రుఁడు దీర్ఘాయుష్మంతుఁడై యుండుఁగాక యనియు విశేషించి చెప్పుకొనఁజొచ్చిరి. ఆవార్తలను క్రొత్తగావచ్చి యున్నజను లెల్లరు నాలకించిరి. రామునిసద్గుణములకు నానందిం

చిరి. దశరథమహారాజుకూడ దీర్ఘాయుష్మంతుఁడై యుండవలయు ననియే యెల్లరు గోరుచుండిరి. ఆజను లా రామునిపట్టణము నెల్లెడల నిండి యుండిరి. వారలకోలాహలము దిగ్దిగంతముల నిండెను.

మహాసారజ్ఞులారా! ఇందుఁ గలవిశేషముల నరయుదము.

"గతే పురోహితే రామస్స్నాతో నియతమానసః,
సహ పత్న్యా విశాలాక్ష్యా నారాయణముపాగమత్."

అనుమూలముఁ బరిశీలించిన నొక్కసద్విషయము బయల్పడును. వ్రతాంగస్నానముచేసి మనస్సును విషయాంతరముల వ్యాపింపకయుండ నొనరించి విశాలాక్షియగు జానకింగూడి భగవంతుని నారాయణమూర్తి నుపాసించెను. అనఁగా ధ్యానించెనని యర్థము. ఈయుపవాసము పట్టాభిషేకాంగము. సకలపుణ్యనదీసరస్సముద్రోదకముల నభిషేకింతురు. కావున నారాయణుని ధ్యానించెనని చెప్పఁబడినది. నారాయణుఁ డనఁగా

"ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః"

అన్న నియమము ననుసరించి జలములనుండువాఁడని యర్థము. జలములు భగవత్స్వరూపములు గాన దద్ధారిపునిగాఁ బరాత్పరుని ధ్యానించెనని భావము. ఆధ్యేయమూర్తి యెవఁడు? తానే. తన్నుఁదానే చూచెనని సారము. ధ్యేయమగుమూర్త్యంతరము లేదు గదా. కావున నప్పటికార్యమున జలములు ప్రధానములు కాన జలములనుండుభగవంతు ననఁగా నాపస్తత్త్వాధిదేవతనుగాఁ దనను దానే మనస్సునఁ గాంచుచు నిర్వికారుండై యుండెనని మనము గ్రహింపఁదగును. దీనింబట్టి

శ్రీరాముఁడు నిర్వికారుఁడగుపరమేశ్వరుఁడని తేలెడిని. ఈయభిషేకమునఁ జేయఁదగు కార్యము లెట్లుసాగును? అన్న ప్రశ్నను వచ్చుననియే మహాకవివాల్మీకి "సహ పత్న్యా విశాలాక్ష్యా" అని ప్రయోగించెను. విశాలాక్షి యనఁగా పెద్దవిగానుండుకన్నులు గలదనుసామాన్యార్థము చాలదు. సీత మహాప్రకృతి. సర్వమును భగవదిచ్ఛానుసారము చేయుచుండుయోగమాయ. అత్తఱి భూభార మడంపఁ గన్నులు తెఱచి చూచుచున్నదని యెఱుంగవలయును. అనఁగా సకలకార్యముల నొనరింపఁబూనిన యాదిశక్తి యగుసీతంగూడి యుండెననియే యిటఁగలసారము. శ్రీరామమూర్తి నిమిత్తమాత్రము చెంతనుండఁగాఁ దానే సకలకార్యముల నాయాయిరీతులఁ జేయుచుండునని యెఱుంగుటయే చమత్కారము. దీనిచేత శ్రీరామమూర్తి సర్వసాక్షిత్వము సిద్ధాంతము. ప్రకృతి చేయుచుండు సకలకార్యములను జూచుచు నానందించుచుండునని తాత్పర్యము. భగవత్సాన్నిధ్య బలమున మహాప్రకృతి సర్వకార్యముల నొనరించు నన్నవిషయము గ్రహింపందగును. నియతమనస్సు కుదిరినఁగాని భగవద్ధ్యానము ఫలింపదనువిషయముకూడ నెఱుఁగవలయును.

"మయ్యావేశ్య మనో యే మాం నిత్యయుక్తా ఉపాసతే,
శ్రద్ధయా పరయోపేతాస్తే మే యుక్తతమా మతాః." — భ. గీ. ౧౨ అ.

అను నీశ్రీహరి యుపదేశము తప్పదుకదా.

ఈమూలమునకు గోవిందరాజులు నారాయణశబ్దమునకు శ్రీరంగనాయకుఁ డర్థమనిరి. మతాభిమానముచేత దానికనుగుణముగా శబ్దములకు నర్థము చెప్పిరి. "విశాలాక్ష్యేతి శ్యామవిగ్రహానుభవాదపి శ్రీరంగవిగ్రహస్య నిరతిశయప్రియా

స్పదత్వేన నిర్ని మేషానుభవ ఉక్తః" అని వ్రాయుటం జూడఁగా మతాభిమానపిశాచావేశము స్పష్టమగుచున్నది. శ్రీరామ విగ్రహామును జూచినంతన కలుగుసంతోషానుభవమునకంటె శ్రీరంగవిగ్రహదర్శనము నిరతిశయప్రియాస్పద మగునఁట. ఇట్లర్థము చెప్పుటంజేసి తోఁచుచున్నయనర్థపరంపరను లెక్క పెట్టకపోవుట కడుంగడు శోచ్యము. అక్కటా! మతాభిమాన మెంతపనికైనను జేయించుననుట సువ్యక్తము.

"మహాతే దైవతాయాజ్యం జుహోవ జ్వలితేఽనలే,"

అని మూలము.

"తేన మహాతే దైవతాయేతి మహాదేవభ్రాంతిర్నిరస్తా"

అని గోవిందరాజులు వ్రాసిరి.

"మహాతే దైవతాయ నారాయణాయ"

అని మహేశ్వరతీర్థులు వ్రాసిరి. ఎవరైన మహాదేవుఁడని యర్థము చెప్పుదురేమోయని యదరిపడిరని యూహింపక తప్పదు. ఇట్లు వారూహించుటచే నారాయణమూర్తి భగవంతుఁడు కాక యొకగొప్ప దేవత యగుననవలసివచ్చుచున్నది. మహాదేవశబ్దము భగవంతునకు ననువర్తింపదేని యతఁ డేటిభగవంతుఁడు? శివ కేశవులవాదమున వచ్చినయనర్థ మిది. నారాయణశబ్దము మహాదేవశబ్దము వేలువేలు దేవతలకు నుండవచ్చును. వీరందఱు భగవంతునియంశములే. మహాదేవుఁడని శైవులు, నారాయణుండని వైష్ణవులు, భైరవుఁడని కాపాలికులు, సూర్యుఁడని సౌరులు, గణనాథుఁడని గాణాపత్యులు, పరదేవియని శాక్తులు పూజించి ధ్యానించువాఁ డొక్కభగవంతుఁడే. ఇన్నిరూపముల నిన్ని

నామముల నిందఱచేఁ బూజలందు వినుతులం గాంచువాఁడు నొక్కఁపరమేశ్వరుఁడే. అట్లు కాఁడేని యతఁడు పరమేశ్వరుఁడే కాఁడు. ఒక్కలోకాధిపతియై యొక్కపేరనే పిలువంబడుచు నొక్కతెగవారిచే నారాధింపఁబడఁదగి బుజములు కాల్చు కొనినఁగాని ప్రీతినొందకయుండునే నాతఁ డొకతుచ్ఛదైవమే యగును. సర్వమతములవారును వారివారియోగ్యతానుసారము పూజింప ధ్యానింప నానందించుచు వారివారికర్మముల ననుసరించి ఫలముల నొసంగుచుఁ బ్రకృతికిం బరుఁడై యన్యక్తుఁడై యోగమాయ యెల్లకార్యములు చేయుచుండఁ దాఁ గాంచుచు సర్వసాక్షియని, నిర్లిప్తుఁడని, సర్వభూతాంతర్యామియని, నిరంజనుఁడని యింక నెన్నియోవిధములఁ గొనియాడఁబడుచు నుండువాఁ డెవ్వఁడో యాతఁడే భగవంతుఁ డగును

"న మే విదుస్సురగణాః ప్రభవం న మహర్షయః,
అహమాదిర్హి దేవానాం మహర్షీణాం చ సర్వశః. ౨
యో మామజమనాదిం చ వేత్తి లోకమహేశ్వరం,
అసమ్మూఢస్సమర్త్యేషు సర్వపాపైః ప్రముచ్యతే." 3 గీత. ౧౦ అధ్యా.

అను నీశ్రీహరియుపదేశములే పైనవ్రాసిన యభిప్రాయమును సమంజసమనుచున్నవి. ఇందు "మహేశ్వరమ్" అని యున్నదే. ఇది శ్రీకృష్ణవాక్యమే కదా. ఇపుడు గోవిందరాజులు మహేశ్వర శబ్దము శివపరమని భ్రాంతినొందునా! ఇదియు శ్రీకృష్ణునకుఁగల దని యంగీకరించునా! మహాదేవుఁ డన్నపేరుకూడ నారాయణమూర్తికిఁ గలదన్న నింతచిక్కు లేకుండునే ? నిస్సారమగు నీమతాభిమానపిశాచ మెందఱినో బాధించుచున్నది. దేవతాదూషణ మొనరింప మార్గము చూపుచున్నది. ఈతుచ్ఛపిశాచ

మును బాఱఁదోలినఁగాని భగవంతుని జక్కఁగా నారాధింప నను వుపడదు. ఇందు శైవులు మహాదేవు నారాధించెనని యర్థము చెప్పినను శ్రీరాముఁడు శివునకంటెఁ దక్కువ యను నర్థము పొసఁగదు. శివుఁడుకూడ శ్రీరాముఁడే కాక మఱెవ్వఁడు? శివుఁడు శ్రీరాముఁడు నొక్కరూపము నంశములే కదా. వీరందఱి సమష్టిరూపమునే భగవంతుఁడని పిలుతుము. కార్యములంబట్టి రూపనామభేదము లేర్పడినవి. మతధర్మములు నశింపరాదు. మతధర్మములను పేరఁ జెలరేఁగుచున్న నీచాభిప్రాయములు నశింపవలయును.

“యం శైవాస్సముపాసతే శివ ఇతి బ్రహ్మేతి వేదాంతినో
బౌద్ధా బుద్ధ ఇతి ప్రమాణపటవః కర్మేతి మీమాంసకాః,
అర్హన్నిత్యథ జైనశాస్త్రనిరతాః కర్మేతి నైయాయికాః,
సోఽయం వో విదధాతు వాంఛితఫలం త్రైలోక్యనాథో హరిః.”

అను నీసూక్తి తాత్పర్య మేమి? సర్వమతోపాసకుఁడు భగవంతుఁడని కాదా. ఒక్క శ్రీహరినే యిందఱెన్ని పేరుల భజించుచున్నవారనియే యిందుఁగలసారము. ఇందుఁగాని మఱే శ్రుతియందుఁగాని వైష్ణవులను తెగవారికిందప్ప నితరుల ననుగ్రహింపఁడని కలదా! అట్లున్నదని యేదో యర్థము చెప్పుదు రేని పక్షపాతముకలవాఁడగుట నతఁడు పరాత్పరుఁడే కాక యొక క్షుద్ర దేవతయే యగును. భక్తులకర్మము ననుసరించి ఫలముల నొసంగుచుండువాఁడు భగవంతుఁడన్న భావము గలవారల కిట్టి భేదము లుండవు.

ఈదుర్మతధర్మముల ననుసరించియే దేవాలయములఁగల విగ్రహముల నితరులు స్పృశింపరాదు. పూజింపరాదు. అను

కట్టుబాటు లేర్పడినవి. వానిం గడుగుకొని జీవించువారల దుర్వ్యవస్థలివి. కాశ్యాదిదేశముల నీదుర్వ్యవస్థలు లేవు. జాతి శబ్దవాచ్యులెల్లరు నారాధింపఁదగుననియే యందు నాచారము నిర్ణయింపఁబడినది. ఈదుర్నియమముల ననుసరించువారే కొన్ని గుఱుతుల ధరించినఁగాని రామకృష్ణాదుల నారాధింప నర్హులు గాదనుచుందురు. ఎంత దురభిప్రాయ మిది! మహాద్దులిట్టిభావములుకలవారలుగ నుండిరనుట కెందును బ్రమాణములు కానరావు. శంకరుని గాంచినను శ్రీమహావిష్ణువును జూచినను వేదాంతవేద్యునిగా వినుతించిరి. అనఁగా నీమూర్తులెల్ల నతనిమూర్తులన్నభావమేకదా వారలకుం గలదనవలయును? అట్టివారలకేకదా పరమాత్మ ప్రత్యక్షమగుచుండును. ఇఁక నీతుచ్ఛమతాభిమానులకో శిలావిగ్రహములే కనఁబడుచుండును. ఇట్టి మతాభిమానరూపమగు దురాచారమును బాఱఁదోలి యాభగవంతు నెవ్వని కేనామమునఁ బిలువ నిష్టమో ఏరూపమున ధ్యానింప వాంఛయో వాఁడట్లే సంకీర్తనము చేయుచు ధ్యానించుట శ్రేయస్కరము. అప్పుడుకానియీదురభిమానము తొలఁగదు. అట్టి మంచిమార్గము కనఁబడకయుండ ధనార్జనమునకై భక్తి నభినయించుదాసులు సన్న్యాసులు యోగులు పండితులు లోనగువార లేవో ధర్మములను బోధించుచు, "సర్వస్వము భగవదర్పణము చేసితి" మని పలుకుచు, ధనము లాగుచు నుందురు. వారిమాయావాగురులకుం దగులుకొనక భక్తులు తొలఁగి యుండవలయును. భక్తిచేఁ దనకుఁ గలశక్తి ననుసరించి యారాధింపవలయును.

శ్రీరామమూర్తి సీతానామమునవెలసిన శ్రీయోగమాయంగూడి తాఁజేయఁదగుప్రార్థనాదికము లేకయున్నను లోకులకు సదాచారముల నేర్పంబూని యుపవాసవ్రత మాచరించెను. భగవంతుని ధ్యానించెను. అంతియకాని

"న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన"

అన్నట్లు పరమాత్మ చేయఁదగుకర్మ మేదియు లేదు. సదాచారములడుగంటఁగా వానిని మరల నుద్ధరింపఁబూని తా నీరామరూపమున వెలసినవాఁడు కావున నందఱు తన్నుఁగని నేర్చుకొనవలసినయట్లు పెద్దలు చెప్పినచొప్పున నన్నికర్మములను బామరునివలె నాచరించెనని మన మీభాగమునుండి చక్కఁగా గ్రహింపవలయు.

"ధ్వజాస్సముచ్ఛ్రితాశ్చిత్రాః పతాకాశ్చాభవంస్తదా"

ధ్వజములనఁగా రాజచిహ్నములుగలపటములు. పతాకలనఁగా విచిత్రవస్త్రబద్ధములు. దీనింబట్టిచూడఁగా నికాలమున రాజాగమనాదులయందు రాజచిహ్నములుగల ధ్వజములనెత్తు నాచారము క్రొత్తది కాదనియు నతిప్రాచీనమే యనియుఁ దేటపడుచున్నది. మంచియలవాటులన్నియుఁ బూర్వకాలమునసుండి నవియే యిప్పటికిఁ జెడకయున్నవి. క్రొత్తగావచ్చినవన్నియు దురాచారములే యనుట కెన్నియో యవకాశము లున్నవి. ఇఁకఁ దరువాతిదగు భగవచ్చరిత్రమును బఠింతము. దానికి ముందుగాఁ గర్మ మెంత బలవత్తరమో పరికింతము. కథను మాత్రమే చదివి యానందించిన నాయానందము క్షణమాత్రమున నంతరించును. కావున నట్లుగాక యందుఁగలసార మేదియని విమర్శింతము.

కైకకు మంథర దుర్బోధనము చేయుట

మహనీయులారా! శ్రీరామావతారఫల మిటఁ బూర్ణముగాఁ గానంబడును. కర్మము బలవత్తరమను విషయము ప్రత్యక్షమగును. ఎంతకాలమునుండియో రావణాదిదుష్టదానవ సంహారము దేవతలు మునులు కోరుచుండిరి. శ్రీరామమూర్తి యవతరింపఁగనే యింక సంతసించిరి. కాని యెపుడెడవులకు వచ్చునా యని వాంఛించుచుండిరి. ఆవాంఛ ఫలించునట్టితరుణ మాసన్నమయ్యెను. ఆవిషయమే యిందుఁ గలదు. చక్కఁగా నాలకింపుఁడు. ఇందు ముఖ్యముగాఁ గర్మసిద్ధాంతము కలదు. దాని నెఱుంగుట మంచిదికదా. ఎట్లనఁగా నాలకింపుఁడు.

ప్రాక్కర్మము శుభాశుభముల నొసంగుచుండును. కాని వదలదు. కర్మమునకుఁ బక్షపాతములేదు. ఈయఁదగుఫలముల నీయక వదలదు.

"స్వభావజేన కౌంతేయ నిబద్ధస్స్వేన కర్మణా,
కర్తుం నేచ్ఛసి యన్మోహాత్కరిష్యస్యవశోఽపి తత్. ౬౦
ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి,
భ్రామయన్ సర్వభూతాని యన్త్రారూఢాని మాయయా. ౬౧

అనియు,

"యద్యహంకారమాశ్రిత్య న యోత్స్య ఇతి మన్యసే,
మిథ్యైషవ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి." ౫౯

అనియు, గీతాశాస్త్రమునఁ బ్రమాణములు కలవు. ఇవన్నియుఁ గర్మము బలవత్తరమని తెలుపుచున్నవి. ఒకకార్యము చేయు

టకుఁగాని చేయననుటకుఁగాని పురుషుఁడు కర్త కాఁడనియు, నొకప్పు డట్టి మొండిపట్టుదల కలిగినేని వానిచే నా కార్యము నామహామాయయే చేయించుననియు సారము. అనఁగా మానవుఁడు తోలుబొమ్మవంటివాఁడే యనియు, నైనను దానే సర్వ కార్యములు చేయ సమర్థుఁడనని భావించుచుండుననియు, నంతియకాని తుదకు దేనిని జేయఁజాలఁ డనియుఁ దేలిన సారత రార్థము. ఈయర్థమును బ్రకృతకథ కన్వయింతము.

దశరథునకుఁ బుత్త్రవియోగమున మృతినొందవలసిన ట్లున్నది. కౌసల్యాదికాంతలు విధవలగుటయేగాక దుఃఖభార మగ్నలు కావలసినట్లున్నది. కైక యూరక లోకాపవాదము నొందవలసినట్లున్నది. పౌరులు జానపదులుకూడఁ దమ కే యప కారము చేయకయున్నను గైకను దూషింపవలసినట్లున్నది. ఈ మూలమున మహర్షులు సంతోషింపవలసినట్లున్నది. పదునాల్గు వత్సరములు నిద్రాహారములు మానిన సవ్యౌత్రిమూలమున మేఘనాథుఁడు మృతినొందవలసినట్లున్నది. విరాధాదులు మృతి నొంది యుత్తమలోకములకుఁ బోవుసమయము సమీపించి యున్నది. ఇండటికర్మము లీయీమార్గములఫలింపవలసియున్నవి. కావున నిన్నికర్మగతుల నెఱింగిన పరమేశ్వరుఁడు శ్రీరాముఁడు పరమేశ్వరి సీతయు నెట్టు లూరకుండ నేర్తురు? ఈ కార్యము లిట్లగు నని యితరు లెవ్వరు నెఱుంగరు. వసిష్ఠవామదేవాదిమహర్షులు జ్ఞాననిధులు కాన నెఱుంగుదురనవలయు కాని వారు బయ ల్పఱుపఁబూనరు. ఎఱుంగనట్లే యుందురు. లేక వారికిఁగూడఁ దెలియనియట్టు లాయోగమాయ యావరించెనో చెప్పఁ జాలము. కనుకనే శ్రీకృష్ణపరమాత్మ "గహనా కర్మణో గతిః"

అని స్పష్టముగాఁ దెలిపెను. దానికి దృష్టాంతమే యీభాగమని మన మూహింపవలయును.

"జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వన్నేతత్స్వమపి వపురీశ స్తిరయతి,
సదా పూర్వస్సర్వం తదిదమనుగృహ్ణాతి చ శివ
స్తవాజ్ఞామాలంబ్య క్షణచలితయోర్భ్రూలతికయోః."

అని శ్రీశంకరాచార్యులు దేటపఱచిరి. ఈకర్మగతులెల్ల నా మహాప్రకృతి కనుబొమలకదలిక ననుసరించి యుండునని దీని భావము. వీనినన్నింటిని గలిపి యిపుడు సమన్వయము చేయుదము.

ఆరాత్రి సీతారాము లుపవసించి స్వాభిన్నభగవంతు నారాధించిరి. అనఁగా మనయవతారఫలము నెట్లు నిర్వహింపనగునా యని యాలోచించిరని యర్థము. వారిరువురు తలంచి నట్లే పనిసాగుచుండునుగదా. వారితలంపులు కర్మానుసారములుగనే యుండును. కర్మము తదాజ్ఞయే యనవలయును. తద్విరుద్ధముగ వారియూహ లుండవనుట నిక్కము. వెంటనే దేవతలు హర్షింతురు. ఈకార్యములు మన మాచరింపఁదగునని వారల కత్తఱిం దోఁచును. అంతకుముం దీవిషయము వారెఱింగి యున్నను త్వరపడక యూరకయుందురు. సమయ మాసన్నముకాఁగా నప్రయత్నమున నాయూహలు ఫలోన్ముఖము లగును. ఈవిషయమే కర్మసిద్ధాంత మనఁబడును. ఈసిద్ధాంతమునే ఈ భాగము తెల్పుచున్నది.

"ఏతస్మిన్నంతరే దేవా దైవీం వాణీమచోదయన్,
గచ్ఛ దేవి భువో లోకమయోధ్యాయాం ప్రయత్నతః.

రామాభిషేకవిఘ్నార్థం యతస్వ బ్రహ్మవాక్యతః
మంథరాం ప్రవిశస్వాదౌ కైకేయీం చ తతః పరం
తతో విఘ్నే సముత్పన్నే పునరేహి దివం శుభే.
తథేత్యుక్త్వా తథా చక్రే ప్రవివేశాథ మంథరాం,
సాపి కుబ్జా త్రివక్రా తు ప్రాసాదాగ్రమథారుహత్."
(అధ్యాత్మరా. ౨ సర్గము.)

ఈవిషయమునే యీయధ్యాత్మ రామాయణభాగము తెల్పుచున్నది. దేవతలు సరస్వతిని బ్రార్థింపఁగా నామె మంథర యందుఁ బ్రవేశించి విఘ్నవాక్యములు పలుకునట్లును, గైక యందుఁ బ్రవేశించి యామాటల నాలకించునట్లును జేసెననియే యీవాక్యములసారాంశము. ఇది వాల్మీకిరామాయణమున లేదే ఏల యని ప్రశ్నింపరాదు. కథనుండి నేర్చుకొనఁదగినట్లు గూఢముగా నందును గలదు. ఇఁకఁ గథ వినుఁడు. లోపలికథ యంతయు నారాత్రి యుపవాసముతర్వాతఁ బ్రజలయుత్సాహము తెల్పెను. మంథరావృత్తాంతము తొలినాఁటిదాని నిటఁ బఠింపఁదగును.

*కైకవివాహకాలమునఁ గేకయరాజల్లునకు నరణమొసఁగుచు మంథర యనుదాసినిగూడ నొసంగెను. ఆదాసిపుట్టుక యెందో తెలియరాదు. పుట్టినింటివారిచ్చినదాసి కావునఁ గైకేయింగూడియే యది యుండును. ఆనాఁడాదాసి చంద్రుని వలెఁ దెల్లనై యుండుప్రాసాదముపైకిఁబోయి యయోధ్యానగరమును గలయంజూచెను. రాజవీథులయందలి శృంగారము విచి

* ఈభాగము సప్తమసర్గమునుండి గ్రహింపఁబడినది. అధ్యాత్మరామాయణకథయుం నిం దిమిడియుండును.

త్రముగా నుండెను. ధ్వజములు పతాకలు విశేషించి యగ పడెను. జను లెల్ల నలంకృతులై వచ్చుచుం బోవుచు నుండిరి. బ్రాహ్మణులు పూలమాలికలు చేతులంబట్టుకొని సంతోషమునం దిరుగుచుండిరి. దేవాలయములు చక్కగాం గైసేయంబడి యుండెను. వాద్యధ్వనులు వేదనాదములు వినంబడుచుండెను. ఏనుఁగులు గుఱ్ఱములుగూడ నలంకరింపంబడి యభిషేకోత్సవమునం బాల్గొన నువ్విళ్లూరుచున్నట్లుండెను. ఆఁబోతులఱంకెలు వినంబడుచుండెను. ఇట్టియలంకారముల నెన్నింటినో యామంథర చూచెను.

అత్తఱి శ్రీరాముని యుపమాత తెల్లనిచీర గట్టుకొని సంతోషాతిశయమున నేత్రములు వికసిల్ల సమీపమునం గనంబడెను. ఆమంథర యాదాదిం గాంచి రామునితల్లి ద్రవ్యము నేకరించు నాసక్తికలదికదా. ఎవ్వరికింగాని యిచ్చునలవాటు కలదికాదు. అట్టియామె యిపు డానందపారవశ్యమున నితరులకు సమృద్ధిగా ధనమిచ్చుచున్నదాయేమి? అట్లుచేయక యున్న యింతటియానందము జనులకుం గలుగఁ గారణమేమి? కాదేని మహారాజు పట్టరానిసంతోషమున నేదే నొక కార్యము చేయం బూనెనా? అని ప్రశ్నించెను. ఆదాదియు లోనిముడక సంతోషముప్పొంగఁగాం బరవశయై దానితోం జెప్పఁదగునా యని యూహింపక శ్రీరామచంద్రునకుం గలుగంబోవు రాజ్యసంపదను దెలుపంగోరి మహారాజు రేపు పుష్యనక్షత్రమునందే పాపరహితుండై జితక్రోధుండగు శ్రీరాముని యౌవరాజ్యమున నభిషేకముచేయనున్నాఁడని తెలియంజెప్పెను.

ఆగూని దాసి దాది చెప్పిన యీపలుకు లాలకించి యప్పుడే పట్టరాని కోపముగలదియై కైలాసశిఖరమువలె నెత్తుగానున్న యాసౌధమునుండి తొందరగా దిగెను. ఆమంథరదృష్టి పాపమునందే యాసక్తికలది. కనుక రామాభిషేకవార్త విని కోపముచే మండిపడుచు శయనించియున్న కైక చెంతకుంబోయి యిట్లు పలికెను. మూర్ఖురాలా! శయనించియున్న దానవే ఏమి? లెమ్ము. లెమ్ము. భయమొక్కఁడిప్పుడు నీపైఁబడనున్నది. ఒక్కటి యనుకొంటివా? అనేకదుఃఖములు నిన్ను ముట్టడించుచుండుట తెలియదా? నిశ్చయముగ నీవు రాజేంద్రునకుఁ బ్రియురాలవు కావుసుమీ. రాజు నన్నే ప్రేమించుసౌభాగ్యము గలదనుకొనుచున్న దానవు. నన్ను రాజు మిగులఁ బ్రేమించును. అదృష్టవంతురాలను నేనే. అని మిట్టిపడుచున్న దానవు. ఎక్కడి యదృష్టము? గ్రీష్మకాలమున నదీప్రవాహమువలె నీయదృష్టమంతయు నిపుడు క్షీణించినదని నొక్కిచెప్పెను.

ఆకుబ్జ పాపదృష్టిగలది. కాన రోషాతిరేకమున నీరీతి నతికఠినముగాఁ బలుక నాలకించి కేకయరాజపుత్త్రి మిక్కిలి విషాదమునొంది యాదాసింగని మంథరా! ఏమే యిది? నాకు క్షేమమే కదా. నీమోము విన్నఁదనమునఁ జిన్నఁబోయియున్నది. కావున నీకేదో పట్టరానిదుఃఖము సంభవించినదని తలంచుచున్నాను. అని పలికెను. కైక యిట్లు మధురవాక్కులఁ బల్కఁగా విని యామంథర అక్కటా! రామునిపట్టాభిషేకమును గణింపక మధురవాక్కులఁ బల్కుచున్నదే. ఏమి? అని కోపము పైకొనఁగాఁ దాను ఆరాణికి క్షేమమే కాంక్షించుచుండునది కావున రాజపత్నులలోఁ గౌసల్యకంటెఁ గైక హీన

మర్యాదయగుచున్నదికదా యన్నదుఃఖము మఱింత యతిశయింపఁగా రాజ్యలక్ష్మి సపత్నీవశగతమగునని యెఱిఁగించి యాబిడకు వగపుపుట్టింప నెంచి రామునియందుఁగల పుత్త్రప్రేమను భేదించి పగకల్గింపను దలంచి చమత్కృతి వెల్లివిరియు నట్లు మాటలాడఁగలది కావున నెంతో విచిత్రముగా నాకైకతో నిట్లు పలికెను.

దేవీ! నిన్ను నశింపఁజేయుట కొకప్రయత్నము సాగుచున్నది. బదులుచేయనది సాధ్యముకానిదే. నాశమేమందువా. మహారాజు రేపే రాముని యావరాజ్యమున నభిషేకింపనున్నాఁడు. నీమేలుకోరుదాననుగాన నాప్రయత్నము నాలకించి భయము పైకొనఁగా రామునకు రాజ్యము సంక్రమించునన్నదుఃఖము, భరతునకు రాజ్యము తప్పుచున్నదే యనుశోకము నొకదానిపై నొకటిగాఁ బైకొనఁగా నిప్పులం బొరలినట్టు లంగములు మండుచుండ నూరకయుండఁజాలక నీకు మేలుచేయఁగోరి యిచ్చటికివచ్చితిని. రాకయుండ నెట్లుండఁగలను? ఈదుఃఖము నాకుఁగదా. నీకేల? అందువేమో. నీకుఁగలిగినదుఃఖము నన్ను మఱింతగా బాధించును. నీకు నభివృద్ధి గలిగిన నది నాకు సుఖమును గల్గించును. ఇందులకు సందియము లేదు. అయ్యో! ఎంతటియవివేకురాలవు? మంచి రాజవంశమునఁ బుట్టినదానవు. దశరథునకుఁ బ్రియపత్నివి. ఇట్టులయ్యు రాజు చేయుక్రూరప్రయత్నము తెలిసికొనఁజాలకున్నావే. ఏల? ఏమి చిత్రమమ్మా! నీప్రాణనాథుఁడు ధర్మవాదివలెఁ గనంబడును. కాని రహస్యముగా నపకారముచేయువాఁడు. మాటలు ప్రియకరములుగా నుండును. కాని కార్యముపట్ల క్రూరుఁడు.

నీవో కపటములేనిస్వభావముకలదానవు. కావున నీవంటి మనస్సుకలవానినిగా భర్తను దలంతువు. అయ్యో! నిన్నిట్టి నిర్మలస్వభావముగలదానిని వంచింపక వదలలేదు. వినుము. నీపతి కాలోచితముగా నీకడ మాటలాడును. ఫలము నగపఱుపకయే నిన్ను మంచిమాటల నూఱడించుచు నిత్తఱిఁ గౌసల్యకు మహాలాభముఁ గల్పింపనున్నాఁడు. ఎట్లనఁగాఁ దెలిపెద. ఆలకింపుము.

దేవీ! నీపతి యెంత దుష్టాత్ముఁడో యెఱుఁగుదువా? నీ కొడుకును భరతుని నీపుట్టినింటికిఁ బంపెను. అతనికి భరతుఁడే కదా కంటకుఁడు. అదియెఱింగి వాని దేశాంతరమునకుఁ బంపి నిష్కంటకమైనరాజ్యమును రేపుదయమే రామునకు నీయఁ బూనియున్నాఁడు. నీవేమియు నెఱుఁగనిదానవు. పతి యను పేరుపెట్టుకొన్నవిరోధి నీమగఁడని యెఱుంగుము. సర్పమునకు లోపల విషముండునని యెఱుంగక బాలిక దానికి నుపకారము చేయఁగోరి తల్లివలెఁ బోషించుచుఁ దొడపై నునుచుకొని బుజ్జగించుచు నాడించుచందమున నీవు భర్తను అంతశ్శత్రుత్వముగలవాఁడని యెఱుంగఁజాలక లాలించుచున్నదానవు. ఉపలాలించినపాము ఎట్టియపకారముచేయునో చంపక వదలిన పగవాఁ డెట్టియపకారము చేకూర్చునో యట్లే దశరథుఁడిత్తఱి నీకు నీకుమారునకు నపకారముచేసినాఁడు. సర్వదా సుఖానుభవమునకుఁ దగినదానవు. అయ్యో! ఏమియుఁ దెలియని బేలవు. ఈరా జెంతదుష్టాత్ముఁడు? ఇన్నినాళ్లు నిన్ను మంచి మాటల ననునయించి యనునయించి యిపుడు రామునకు రాజ్యమర్పించి నిన్ను సమూలముగాఁ బాడుచేసినాఁడు. ఒక్క-

నిన్నే కాదు. నీకుమారుని బరిజనముంగూడ నాపదలపాలు చేసి నాఁడు. అక్కటా! నశించితివి. ఇట్టి మహాదుఃఖమునఁ జిక్కియున్నదానవు. కావున వెంటనే యీ కాలమునకు నుచితమగునట్లు నీకు మేలు దేననగునో చూచుకొనుము. ఎట్లు ప్రతీకారముఁ జేయనోపుదునని యనుమానింపకుము. నీజ్ఞానము విస్మయము గల్గించునదియని నే నెఱుంగుదును. ఆ తెలివి నుపయోగించి నిన్ను నీకుమారుని మిమ్ము నమ్ముకొన్న నన్నును గాపాడందగు.

ఇట్లు మంథర వచింపఁగా శుభముల వెదఁజల్లు మోము గల యా కైక శయనించి యుండియే యాలకించి సంతోషముప్పొంగుచుండఁగా శరత్కాలచంద్రరేఖవలెఁ బ్రకాశించుచు లేచి శుభతమమగు శ్రీరామాభిషేకవార్త మఱింత యానంద ముప్పొంగఁజేయఁగా నయ్యది యదృష్టవశమునఁ గలిగినందుల కచ్చెరువందుచు నామహామంగళవృత్తాంతమును వినిపించినందుల కాకుబ్జకుఁ బారితోషికముగా నమూల్యాభరణము నొసంగెను. అట్లు బహుమానపూర్వకముగా నాభరణ మొసంగి యాదరణమున దానింగని మంథరా! నాకు మిక్కిలి ప్రియమగు శ్రీరామాభిషేకవార్తను వినుపించితివి. ఇఁక నేనేమి బహుమాన మొనరింతును? నాకు భరతునియందును శ్రీరామునియందును భేదభావము కన్పట్టదు. నాకిరువురు నొక్కటియే. మహారాజు రామమూర్తికి రాజ్యాభిషేకము చేయఁబూనెనని విన్నయంతనే నాకు నిర్భరానందమే పొడమెను. మంథరా! నీవు ప్రియార్హవు. ఇవ్వార్తకంటె శుభవార్తను వేఱొకదానిని నాకుఁ జెప్పఁగలవని భావింపను.

ఎందులకందువో. ప్రియవార్తలలో నీ రామాభిషేకవార్తయే యత్యంత ప్రియమైనది. అట్టివార్తను వినిపించితివి. ఇందులకు మఱేది కోరఁదలఁతువో చెప్పుము. ఆకోరికం దీర్చెదనని కైక పలికెను.

ధీమంతులారా! ఇందు విమర్శింపఁదగినవిషయములు విశేషించి లేవు. కాని యధ్యాత్మరామాయణమునఁగలవార్త సత్యమే యని యీభాగము దృఢపఱచుచున్నది. కైకదాసి యానాఁడే ప్రాసాదాగ్రము నెక్కెను. నగరమునఁగల శృంగారమును దిలకించెను. అంతలో రామునకుఁ బాలిచ్చినయుపమాత తెల్లనిచీరకట్టుకొని దానిచెంతకుం బోయెను. అనఁగా నాసౌధము నెక్కెననియే యర్థము. దీనిమూలముం బరిశీలింతము. దాన నీశంకలు తొలఁగును.

"ప్రాసాదం చంద్రసంకాశమారురోహ యదృచ్ఛయా
ప్రహర్షోత్ఫుల్లనయనాం పాండురక్షౌమవాసినీం
అవిదూరే స్థితాం దృష్ట్వా ధాత్రీం పప్రచ్ఛ మంథరా
ధాత్ర్యాస్తు వచనం శ్రుత్వా కుబ్జా క్షిప్రమమర్షితా
కైలాసశిఖరాకారాత్ప్రాసాదాదవరోహత."

అను నీవాల్మీకివాక్యములఁ బఠించితిరికదా. మంథర మేడ నెక్కెను. సమీపమున నలంకరించికొని సంతోషమున నుబ్బుచున్న రాముని యుపమాత కనఁబడెను. అది తెల్పినమాటల విని క్రోధావేశమున మేడదిగెను. అనికదా యర్థము. రామునకుఁ బాలిచ్చినదాది సొగసుగా నలంకరించుకొని కైకమేడపైకిఁ బోవు టెందులకు? మహోత్సవములు తనయింట సాగుచుండఁగా వానిం జూచుచుండక కైకయింటికే పోవ నేదోకార

ణము కలుగవలయుఁగదా. అదేది? మహాప్రకృతియగు సీతాదేవితలంపే యని యెఱుంగవలయు. ఆమె కీయూహ కలుగఁగా దేవతలు వాగ్దేవిం బ్రార్థించి మంథరకుఁ గైకకు దురూహాలు కలుగఁజేయుమా యని వేఁడిరి. ఆమె యట్లే యగుఁగాక యని తలంచెను. వెంటనే గూనిదాసి మేడనెక్కెను. ఆసమయముననే రామునిదాడి యచ్చోటికిం బోయెను. అది రామాభిషేకవార్తఁ దెలిపెను. వెంటనే మంథర మేడదిగెను. వీనింబట్టి పరిశీలింపఁగా "గహనా కర్మణో గతిః" అన్న శ్రీకృష్ణవాక్యము తప్పదని కర్మగతుల మానవులు పరికింపఁజాలరని తేటపడియెడిని. అధ్యాత్మరామాయణమున స్పష్టముగాఁ జెప్పినభావము వాల్మీకిరామాయణమున గూఢముగా నున్నదనియే మన మూహింపవలయును.

"సాపి కుబ్జా త్రివక్రా తు ప్రాసాదాగ్రమథారుహత్
నగరం పరితో దృష్ట్వా సర్వతస్సమలంకృతమ్
నానాతోరణసంబాధం పతాకాభిరలంకృతం
సర్వోత్సవసమాయుక్తం విస్మితా పునరాగమత్
ధాత్రీం పప్రచ్ఛ మాతః కిం నగరం సమలంకృతమ్."

అధ్యాత్మరామాయణము. ౨ సర్గము.

మంథర మేడనెక్కి నగరశృంగారమును దిలకించి దిగివచ్చి యందొకచోఁ గనఁబడినరామునిదాదిం గని యడిగి రామాభిషేకవార్త నామె తెలుపఁగా

"తచ్ఛ్రుత్వా త్వరితం గత్వా కైకేయీం వాక్యమబ్రవీత్."

అధ్యా. ౨ సర్గము.

విని యీసుపూని కైకకడకుం బోయెనని యధ్యాత్మరామాయణమునఁ గలదు. సరస్వతి మంథర నావేశించెనని తెల్పినందున నీవిషయము నిట్టులే తెల్పఁబడినది. శ్రీమద్రామాయణమున దేవతలప్రోత్సాహమున శారద మంథర నావేశించెనని స్పష్టముగాఁ దెలుపనందున ధాత్రి మేడపైకిఁ బోయినట్లు తెలుపఁబడెను. ఈయర్థము నూహింప మఱొకకారణముకూడఁ గలదు.

"మంథరాయా వచశ్శ్రుత్వా శయానా సా శుభాననా
ఉత్తస్థౌ హర్షసంపూర్ణా చంద్రలేఖేవ శారదీ.
అతీవ సా తు సంహృష్టా కైకేయీ విస్మయాన్వితా,
ఏకమాభరణం తస్యై కుబ్జాయై ప్రదదౌ శుభం."

అను నీరామాయణవాక్యములం బరికింతము. రామాభిషేకవార్తను దాసి వినిపింపఁగనే యాశ్చర్యపడి లేచి పట్టరాని యానందమున నొకయాభరణము నిచ్చెను. దీనిభావమేమి? మంథర రాఁగలయనిష్టమునుగూడఁ దెలిపెనుగదా! దానిని లెక్కింపక (అనఁగాఁ దెలివితక్కువది దాసి యని భావించి యనికడ యర్థము) అశుభతమవార్తను దెలిపినందులకే యాభరణము నిచ్చెను.

"రామే వా భరతే వాహం విశేషం నోపలక్షయే"

అనికూడ ననెను. ఇంతదనుక కైకయాశయము రామునియందు భేదభావమును గాంచలేదనియు, భరతుఁడు రాముఁడు సములనియే యామె భావించెననియు మన మెఱుంగవలయు. దేవతలప్రోత్సాహమున సరస్వతి యామె నావేశించి బుద్ధియందొకవికారము గలిగింపఁగా నామెమాటలకు లోఁబడెననియు.

మన మూహించుట పొరపాటు కానేకాదు. కావునఁ గర్మ
సిద్ధాంత మిట స్పష్టముగాఁ గనంబడుచున్నది. కావున మన
మీభాగమునుండి కర్మము బలవత్తరమనియు, దానిమీఁఅ
నెవ్వారు శక్తులు కారనియు నెఱుంగందగు. మఱియు భగవ
త్సంకల్ప మన్నింటికి మూలమనియు, నన్నియు దాని ననుస
రించియుండుననియు, నయ్యదియుఁ గర్మము ననుసరించుననియు
మనము నిశ్చయించుకొనవలయును. మంథర కైక లోనగు
వారు నిమిత్తమాత్రమే యనియుఁ దెలిసికొనుట మంచిది.
ముఖ్యముగాఁ గైకభావ మెంతపరిశుద్ధమో యూహించి పిదపఁ
గర్మవశమున నది యెట్లు మార్పునొందెనో తర్కించిన నెయ్యది
యన్నింటికంటె బలవత్తరమో యెఱుంగుటయే సమంజసము.
ఇఁకఁ దరువాతిభగవత్ప్రవృత్తిని దెలిసికొందము.

కైకకు మంథర దుర్బోధము చేయుట.

* కైకేయి యీరీతిగాఁ బలుకఁగా మంథర యీసుపూని
యామె పారితోషికముగా నిచ్చినయాభరణమును విసరివైచి
తాఁజెప్పినహితము నంగీకరింపదయ్యెఁగదా యనుకోపమును,
మహానర్థము రానున్నదే యనుదుఃఖమును గలిసికొనఁగా,
నామెం గాంచి బాలిశురాలా! దుఃఖమునకుఁ దగినకాల మిది.
ఇట్టిసమయమున నీకు సంతోషము గలుగుచున్నదే. ఏల? నీ
విపుడు దుఃఖసముద్రమధ్యభాగమున నున్నదానవుసుమా. నీవు
తెలిసికొనఁజాలక సంతసించుచున్నావే. ఏది యాదుఃఖమని
యడుగుదువేమో. రామాభిషేకరూపమగు దుఃఖమునొంది

* ఈభాగము ఎనిమిదవ సర్గమునుండి గ్రహింపఁబడినది. అధ్యాత్మ
రామాయణసారముకూడ నిం దిమిడియుండును.

కృశింపవలసియుండఁగా సంతోషముతో నున్నదానవే. ఇట్టి నిన్నుఁ జూచినంతన నన్ను శోకము బాధించుచున్నది. నీవెఱ్ఱితనముచూడఁగా నాకు నవ్వువచ్చుచున్నది. కైకా! నీదుర్మతికి నాకు దుఃఖ ముప్పొంగుచున్నదిసుమీ. సపత్నీపుత్త్రుఁ డనఁగా శత్రువే. వానియభివృద్ధి మనకు మృత్యువువంటిది. అట్టిదానిని వారింపఁబూనక యెవ్వతెగాని యానందించునా? రామునకు వలె భరతునకుమాత్రమే రాజ్యముపొందునధికారము గలదు. అట్లగుటంజేసి భరతునిమూలమున రామునకు భయముగలుగు నవకాశమున్నది. మనలం గనినంతనే పాముబెబ్బులి భయం పడును. కాని వానివలననే మనకు భయముకలుగును. కనుక భరతునిం గాంచి భయపడురామునివలననే భరతునకు భయము కలుగును. ఈవిషయ మూహించియే విషాదముపాలగుచున్న దానను. సుమిత్రాపుత్త్రులకు రానిభయము రామునివలన భరతునకే కలుగునా యని తలపోయకుము. ధనుర్ధారులలో మేటి యగులక్ష్మణుఁడు సర్వప్రకారముల రామునే యాశ్రయించి యున్నవాఁడు. అట్లే భరతుని శత్రుఘ్నుఁ డాశ్రయించియున్న వాఁడు. కావున వారిరువురివలనను రామభరతులకు భయము కలుగదు.

రామునకు భరతునివంకనే భయముకలుగుననుట కింక నొక్కకారణ మున్నది. వినుము. జన్మక్రమమునుబట్టి యూహింపఁగా భరతుఁడే రామునకు విశేషించి సమీపముననున్న వాఁడు. రాజ్యప్రాప్తి రామునివెనుక భరతునకే యత్యంత సమీపముగ నుండును. లక్ష్మణశత్రుఘ్నులు వయసునఁజిన్న వారు కాన వారి కయ్యది దూరముకదా. నీవు చెప్పినపద్ధతిం

బట్టి యాలోచింపఁగా భరతునకు రాజ్యము రాఁదగదుకదా యందువేమో. ఆవరుసమాట యటుండనిమ్ము. ఒక్కరహస్యము వినుము. విద్వాంసుఁడై రాజనీతికోవిదుఁడై కర్తవ్యము నాలకింపక యొనరించుచుండువాఁడు రాముఁడు. నీకుమారుఁడనఁగా నంతటిసమర్థుఁడుకాఁడు. కావున నీవిషయము తలంపునకువచ్చి నపుడెల్లను రామునివలన భరతున కేమికీడుమూడునో యను భయము నన్నావరించుచుండును. ఇన్నియు నాలోచించిన నాపదలు రాకయుండఁగాపాడుకొనుటయే యుక్తమని తోఁచుచున్నది.

ఇఁక మీసపత్నులవిషయ మాలకింపుము. కౌసల్యకొడుకు రాముఁడు రేపే పుష్యనక్షత్రమున యౌవరాజ్యాభిషిక్తుఁడగును. అప్పటి కౌసల్యభాగ్య మెట్టిదగును? ఆమెయే భాగ్యవంతురాలు. పుత్త్రుఁడు యువరాజు కాఁగా నిర్భరానందపారవశ్యమున విఖ్యాతింగాంచి మీవంటిసపత్నుల పొగరడంచి చెలంగును. నీవపు డాకౌసల్యకు దాసివై దోసిలొగ్గి వర్తింపఁగలవు. నీ వాకౌసల్యకు దాసివి కాఁగా మేమెల్ల నీతోడ దాసిజనమే యగుదుము. నీకొడుకు రామునకు సేవకుఁడు కాఁగలఁడు. రాముఁడు యువరాజు కాఁగా నతనియుత్తమకాంతలానందపరవశలగుదురుకదా. ఇఁక భరతుఁడో దరిద్రుఁడై సేవచేయుచుండఁగా నీకోడండ్రు దుఃఖములపాలగుదురు.

అని యీరీతి నుచితముమాని దుర్బుద్ధులు చెప్పుచున్న గూనిదాసింగని కైక దానిమాటలు నిరాకరించి శ్రీరాముని గుణములనే ప్రశంసింపంబూనెను. మంథరా! ధర్మవేత్తయై, యంతరింద్రియనిగ్రహము కలిగి, కృతజ్ఞుఁడై యసత్యములే

పలుకక, నిర్మలుఁడైనవాఁడు రాముఁడని యెఱుంగుము. రాజచంద్రునకు జ్యేష్ఠపుత్త్రుఁడు. కావున నారాముఁడే యౌవ రాజ్యమున కర్హుఁడు. కనుక రాజ్యము భరతాదులకు నయ్యెది రాఁదగుననుట న్యాయ్యముకాదు. ఇఁక రామునిగుణముల నాలకింపుము. తమ్ముల నందఱను దండ్రివలెఁ గాపాడువాఁడు. భృత్యుల నాదరించును. ఆరాముఁడు దీర్ఘాయుష్మంతుఁడై యుండవలయును. అట్టిశ్రీరాముని యభిషేకవార్తనువిని మహా నందము నొందవలయుఁగదా. దానికి బదులుగా మంథరా! పరితపించుచున్నదానవే. ఏల?శతవత్సరములు రాముఁడు పాలిం పఁగా నవ్వల నాకొడుకుఁ దండ్రితాతలనుండి వచ్చురాజ్యమును బొందఁగలఁడు. సత్యము. ఇపు డీరామాభిషేకము సాగు టుచితము. ఆశుభసమయము చెంతనున్నది. భరతాభిషేక సమయము రాఁగలదు. నాకుఁ గష్టములువచ్చుననికదా నీవు పరితపించుచున్నదానవు? శ్రీరాముఁడు కౌసల్యకంటె నెక్కువ ప్రీతితో నాకు శుశ్రూషలు సలుపుచున్నవాఁడు. కనుక నాకు రాముఁడు భరతునకంటె నెక్కుఁడుగ మన్నింపఁదగినవాఁడు. సోదరులను దనవలె నారయువాఁడగు రామునకు రాజ్యము వచ్చిన భరతున కయ్యెది వచ్చినట్లే యని నమ్ముము. ఎప్పుడో వచ్చునని యెంచనేల? ఇపుడే వచ్చినదే యనుకొనవలయును.

అని యీరీతి నాకైక తనమాటలం బాటింపక పల్కఁగా నాలకించి మంథర మిక్కిలి దుఃఖించి నిట్టూర్పులుపుచ్చి కైకం బరికించి నీవు మూర్ఖురాలవుసుమా. ఏదిమేలు? అని యెఱుంగఁ జాలక యనర్థమును శుభముగా భావించుచున్నదానవు. ఏమందును? నీకొడుకు రాజ్యము లేక యడవిపాలగునన్న

శోకము, సుఖములు తొలఁగి కష్టములు రానున్నవే యన్న వ్యసనము కూడఁగా సవతికి సేవచేయుమహాదుఃఖము సాగరము వలెఁ బైకొని ముంచివేయుచుండఁగా నందు మునుఁగుచుఁ దేలుచునుండు నీవు నీయవస్థలఁ దెలియకయున్నావే? ఏమనం దగును? కైకా! నీవెంత వెఱ్ఱిదానవే? రాముఁడు పాలించిన పిదప భరతునకు రాజ్యము లభించునని యాశించుచున్నావే? ఎన్నటికిని రాదు. రాముఁ డిప్పుడు రాజగును. ఆతనివెనుక నతనికొడు కెవ్వఁడో యతఁడే రాజగును? కావున నీపుత్త్రపౌత్త్రు లేనాఁటికిని రాజులు కారు. రాజవంశమున మనభరతునకుఁ జేరే యుండఁబోదు. ఒక్కభూపాలునకుఁ బుట్టినకుమారులందఱును రాజ్యమునఁ బాలకులుగా నునుపఁబడుదురేని నీతిదూలి రాజ్యమునకే హాని సంభవించును. ఎందఱుకొడుకులు గుణవంతులుండినను వారిని మాని జ్యేష్ఠపుత్త్రునకే రాజ్యమును బ్రభువు లిత్తురు. ఇది నిజము. ఈనియమముచేత నీకొడుకున కేకాలమునకైన రాజ్యము రాదనుట స్పష్టము. నీకుమారుఁడు సకలవిధముల దుఃఖములపాలు కావలసియున్నవాఁడు. దిక్కులేనివాఁడే కానున్నాఁడు. సుఖహీనుఁడగుటయే కాక రాజవంశమునందు గణింపఁబడఁడు.

జ్యేష్ఠుఁడగు రాముఁ డుండఁగా భరతునకు రాజ్యము వచ్చుమార్గ మెట్లు? అని సంశయింతువేమో. ఆమార్గమెఱింగియే భరతునకు రాజ్యమిప్పించుటకుఁ దగినహేతువు నీకుఁ దెలుపుటకే యిచ్చటికి వచ్చితిని. ఇది నీవెఱుంగకయే యిట్లులాడితివి. సవతికి మేలు గలుగుచుండఁగా నాకుఁ బారితోషికమొక్కటియిచ్చి యంతతోఁ దృప్తినొందక యింకొక్కటికూడ

నీయఁగోరుచున్నదానవే. నారాకకుఁ గారణమేమని తెలియక యున్నావే. ఇంత యవివేకమా? చక్కఁగా వినుము. శత్రువులు నశింపఁగా శ్రీరాముఁడు నిష్కంటకమగు రాజ్యమునొంది భరతుని దేశాంతరమునకుఁగాని లోకాంతరమునకుఁగాని బంపును. నిశ్చయము. భరతుఁడు బాలుఁడుగానుండ నీవు వానిని మేనమామయింటికిం బంపితివి. వృక్షములులోనగు స్థావరములందును బరస్పరసాన్నిధ్యమువలన స్నేహము కలుగుచున్నది. మానవులయం దదియుండునని వేఱుగాఁ జెప్పవలయునా. అట్టిసాన్నిధ్యము లేకుండ భరతుని సాగనంపినదానవు నీవేకదా. భరతానువశుఁడగు శత్రుఘ్నుఁ డాతనివెంటఁ బోయెను. లక్ష్మణుఁడు రాము నెట్టు లాశ్రయించెనో శత్రుఘ్నుఁడు భరతు నాశ్రయించి యున్నవాఁడు. వాఁడైన నుండిన నించుక లాభముండెడిది. అదియు నిపుడు లేదు.

కైకా! ఒక్కవిషయము నాలకింపుము. వనమునమ్ముకొని జీవించువా రొకవృక్షమును సకాలమున ఛేదింపరాఁగా ముండ్లపొద లద్దాని నలముకొనియున్నందున నావృక్షము వాని సాన్నిధ్యమువలనఁ దనకుఁ గలుగుమహానర్థమునుండి తప్పించుకొనునని జనులవలన మనము వినుచున్నాముకదా. అట్లే దశరథునిచెంత భరతుఁ డుండినయెడలఁ బ్రేమమున నీకార్యము చేయకుండెడివాఁడు. రాముని లక్ష్మణుఁడు వానిని రాముఁడును రక్షించును. అశ్వి దేవతల కిరువురకుంబోలె రామలక్ష్మణుల కిద్దఱకును సోదరవాత్సల్య ముత్కృష్టమని లోకవిదితము కావున రామునివలన లక్ష్మణున కేకష్టము రాదు. భరతునకే రామునివలన భయము కలుగును. ఇది సత్యము. అట్టిభయము

రాకయుండ మాతులగృహమునుండియే భరతు నడవికింబోవ నిమ్ము. అట్లు లైనఁ బ్రాణహానియైనఁ గలుగకయుండు. కావున నాకార్యము చేయుటయే నాకు హితముగాఁ దోఁచుచున్నది. కొడుకునకుఁ బ్రాణములైన నిలుచునుగాన నీకునుగూడ నది హితమేయగు. భరతు నడవులకుంబంప నిష్టపడవేని రాజ్యము నిప్పింపుము. తండ్రియానతి ధర్మమునఁ దండ్రి రాజ్యము నొందు నేని నీకును బంధువర్గమునకును నిశ్చయముగ మేలగును. రాజ్యము లేక భరతుఁడు రాముని కడ నుండరాదు. సుఖార్హుఁడే కాని నీకొడుకు కష్టముల కర్హుఁడు కాఁడు. పరవశము దుఃఖ హేతువుకదా. భరతుఁడు రామునకు సహజశత్రువు. అట్టి వాఁడు రాజ్యము లేక యెట్లు రాముని కడనుండి జీవింపఁగలఁడు? కావున నెన్నిభంగుల నాలోచించినను భరతునకు రాముని మూలమున హాని తప్పదనియే తోఁచెడు. గహనమునందు సింహము తఱుమఁగా మృతినొందనున్న గజయూథపతివలె రామునకుఁ జిక్కి కష్టములపాలై మృతినొందనున్న భరతుని నీవు రక్షించు టుచితము. ఇంతకుమున్ను నీవు నాథునకుఁ గూర్చు దాన నన్నగర్వమున సపత్నియగు కౌసల్యను నిరాకరించియు న్నావు. ఇపు డాకౌసల్య కుమారుఁడు రాముఁడు రాజుకాఁగా నీపైఁ బగసాధింపక విడుచునా? దాసినిగాఁ జేసికొనినిన్ను శ్రమం పఱచును. సకలమణిగణములుగల యాకరములుగలిగిన పర్వత పత్తనాదులుగల యీభూమికి రాముఁ డెప్పు డధిపతియగునో అపుడే నీకొడుకు నీవు దారిద్ర్యమునఁ గూంది సకలదుఃఖాకర మగు నవమానమును బొందుదురు. రాముఁడు రాజుకాఁగానే భరతుఁడు నశించుననుట నిస్సంశయము. కావున భరతునకు

రాజ్యముగలుగుటకు, మఱొకని నగరమునుండి వెడలఁగొట్టు టకును దగినయుపాయము వేగంబ యాలోచించుకొనుమని నొక్కిచెప్పెను.

మహామతులారా! ఈభాగమున ననేకవిషయములు విమర్శింపఁదగియున్నవి. మంథరగాని కైకగాని స్వాయత్తచిత్తలు గారు. కర్మపాశములచేఁ గట్టఁబడియున్నవారు. ఆపాశము లెట్లు తిరుగునో యట్లే తిరుగువారు. ఇప్పుడు మంథర లోకోపకారమునకుఁ బ్రథమసోపాన మనవలయును. ఆమెయు శారద తన్నావేశించుటంజేసి యుక్తిప్రత్యుక్తులయందు నిపుణయై యున్నది. కైకయో దాసి తన్ను దూషించుచున్నను గోపమూనక సంతోషించుచు దాని నూఱడింపఁ జూచుచున్నది. రాజపత్నియయ్యు నొకదాసి తన్ను నోటికివచ్చినట్లు దూషింపఁగా నానందించుట యచ్చెరువుగొలుపకమానదు.

"కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః"

అన్నగీతావాక్యమున నీయర్థ మిమిడియున్నది. కావునఁ గర్మము త్రిప్పులకు లోఁబడనివాఁ డొక్కభగవంతుఁడు తప్ప మఱెవ్వరును లేరనుట సిద్ధాంతము. ప్రకృత మనుసరింతము.

కైక శుద్ధాంతఃకరణముకలదని పూర్వసర్గమునందే తేటపడియెను. కాని సరస్వతి యంతలోఁ దన్నావేశించినందున మంథరమాటలు హితోపదేశములని భావింపవలసినదయ్యెను. ఏల? పరమేశ్వరియై సర్వకర్త్రియై సీతానామమును దాల్చి యిల వెలసిన యోగమాయ సంకల్పించినది యంతరాయములపాలగునా? అది సాగక తప్పదు. రాఁగలయవస్థలకు జంకువారెవ్వరు? కర్మగతులఁదెలియని కౌసల్యాదులే. తొలుతఁ గొంద

లానందింతురు. కొందఱు దుఃఖింతురు. కర్మగతుల నెఱింగినవా రూరకయుందురు. సర్వకారణకారణుండగు శ్రీరామచంద్ర మూర్తి సాక్షిమాత్రుఁడై చూచుచుండెను. సర్వజ్ఞుఁడయ్యుఁ దనయోగమాయ నాశ్రయించి తాను నొకకార్యభారమున నిమగ్నుఁడై యున్నట్లున్నవాఁడు. తనప్రభావము తెలియనీయక జానకి సామాన్యస్త్రీవలె సుఖదుఃఖముల ననుభవించుచున్నట్లు నటింపఁగాఁ దాను నట్లే రామచంద్రుఁడు నటించుచున్న వాఁడు. వారిసంకల్పములు కర్మరూపపాశములై యందఱి నాడించుచున్నవి. కావున నీఘట్టమునుండి యెన్నియో నీతులు బయలువెడలును. వాని విమర్శించి యెఱింగి కృతార్థులమగు టయే యుత్తమము. ఆనీతు లెట్టివనఁగాఁ జిత్తగింపుఁడు.

"హర్షం కిమిదమస్థానే కృతవత్యసి బాలిశే,
శోకసాగరమధ్యస్థమాత్మానం నావబుద్ధ్యసే."

అని మూలము. ప్రాతీతికార్థము ముందే వ్రాసితిని. సారమే యిందు వ్రాయుదును. అనవసరసంతోషము పనికిరాదు. అనఁగా దుఃఖింపవలసినకాలమున సంతోషము నొందుట భావ్యనర్థ హేతువు. ఎవరు తన్నలముకొననున్న యాపదల నెఱుంగరో వారు శోకములపాలగుదురు. ఎవ్వారికిఁగాని ముందు సంభవింపఁబోవుసుఖదుఃఖముల ననుసరించి బుద్ధి మాఱుచుండును. ఇపుడు కైకకు రానున్నది కష్టముకాని సుఖముకాదని మంథర తలంచి యాక్షేపించుచున్నది. ఇపుడు మంథర కైక నాక్షేపించుట యామెమేలు కోరియే. తనకుఁ దెలియునని కైక కేమియుఁ దెలియదని యూహించియే దూషించుచున్నది. కావున మానవులబుద్ధులు రాఁగలశుభాశుభకర్మఫలముల కనురూపముగా

మాఱుచుండుననియు, నితరులు చెప్పుహితము వారి కహితముగాఁ దోఁచుననియు మనము గ్రహింపవలయును. ఎవ్వఁడు తనమేలు చెప్పువారిమాటల నాదరింపఁడో వాఁ డవశ్యము కీడునొందుననియే యిటఁగలసారము. ఈవిషయమునే పలుమాఱు లిందుఁ దెలుపుశ్లోకము లున్నవి.

ఈఘట్టమున శారదాదేవి యావేశించుటంజేసి మంథర భరతునకు రామునిమూలమున రాఁగలయాపత్తుల నెన్నింటినో వెలిఁబుచ్చెను. ముఖ్యముగా సవతిసిరిని బొగడి యసూయఁ గల్పింపఁ బ్రయత్నించెను. ఆమాట లసంగతములనికాని యా దాసి మేలమిాఱి పలుకుచున్నదనిగాని యారాణికిఁ దోఁప లేదు ఏల? సరస్వతి దేవతలప్రార్థనమున నావేశించినందుననే. కావున మానవుఁడు స్వతంత్రుఁడు కాఁడనియు దేవతలమాయల నెఱుంగఁజాలఁడనియు మన మెఱుంగవలయు. దీనిచేతఁ గర్మసిద్ధాంతము బలవత్తరమనియు, దానిని ద్రోసిపుచ్చ సాధ్యము గాదనియు, నయ్యది హరిహరవిధాతృలకుంగూడ శక్యము గానిపనియనియు నెఱుంగు టుత్తమము. ఇట్టులుండఁ గొందఱు కపటనాటకసూత్రధారులు కర్మమునకన్న భక్తియే ప్రధానమనియు, సర్వకర్మముల మాని విష్ణువు నారాధింపవలయునని బోధింతురు. భక్తియుఁ గర్మమున నంతర్భూతమని వా రెఱుంగరనుట నిక్కము. వారు భక్తియనఁగాఁ గైంకర్యమనియుఁ, బూవులు తెచ్చుట వింజామరలు విసరుట యాలోనగుసేవలు చేయుటయే యనియుఁ దలంచిరని మన మూహింపవలయు. అట్టి యూహకలవారు కనుకనే

"సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ

అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః"

అనునది చరమశ్లోకమని పలుకుచుఁ గర్మత్యాగమునే యిది బోధించునందురు. వారలే యిందు ధనదాసులని పేర్కొనం బడుదురు. భక్తిమార్గమే వారికిఁ దెలియదనియుఁ, బుష్పమాలికాదికృత్యములు ముక్తిప్రతిబంధకములేయనియు, నావిగ్రహపూజ వదలవలయుననియు, నయ్యది క్షుద్రఫలమునే యొసంగు ననియు నిశ్చయింపవలయును.

"తస్మాదసక్తస్సతతం కార్యం కర్మ సమాచర,
అసక్తో హ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః." ౧౯

అన్న గీతోక్తి కర్మము నాచరించుపద్ధతిని దెలియఁ జేయుచున్నది.

"న కర్మణామనారంభాన్నైష్కర్మ్యం పురుషోఽశ్నుతే,
న చ సన్న్యసనాదేవ సిద్ధిం సమధిగచ్ఛతి." ౪

అను శ్రీకృష్ణభగవదుపదేశమే కర్మప్రధానతను వెల్లడించుచున్నది.

"కర్మణైవ హి సంసిద్ధిమాస్థితా జనకాదయః,
లోకసంగ్రహమేవాపి సంపశ్యన్ కర్తుమర్హసి." ౨౦

అను శ్రీహరియుపదేశము కర్మరతులమార్గమును దెలియఁ జేయుచున్నది.

"మయి సర్వాణి కర్మాణి సన్న్యస్యాధ్యాత్మచేతసా,
నిరాశీర్నిర్మమో భూత్వా యుధ్యస్వ విగతజ్వరః. ౩౦
యే మే మతమిదం నిత్యమనుతిష్ఠంతి మానవాః,
శ్రద్ధావంతోఽనసూయంతో ముచ్యంతే తేఽపి కర్మభిః. ౩౧

అను శ్రీపరమేశ్వరోపదేశము కర్మఫలము లభించుపద్ధతిని దేట

పఱచుచున్నది. వీనినెల్లం బరికింపఁగాఁ గర్మము బలవత్తర మనియు, నయ్యది యెట్టివారినైనఁ బరవశులనుగాఁ జేయు ననియు మన మెఱుంగవలయును. భగవదనుగ్రహము వలయు నేని ఫలములంగోరక సత్కర్మములను భగవదర్పణబుద్ధిచే నాచ రింపవలయునని తేలెడిని. కర్మసిద్ధాంతమును దూషించి దాసులు యోగులు శిష్యులకు భక్తిమార్గ ముపదేశింతురుకదా. అది కేవల ధనాకర్షణార్థమే కాని వేఱు కాదని తెలిసికొని వారి మాటలం ద్రోసిపుచ్చి భగవంతు నారాధింపవలయుననియే యిటఁగలసారము.

"హృష్టాః ఖలు భవిష్యంతి రామస్య పరమాః స్త్రియః,
అప్రహృష్టా భవిష్యంతి స్నుషాస్తే భరతక్షయే,"

-ఈమూలము మంథరనోట వాల్మీకి పలికించెను.

"రామస్య పరమాః స్త్రియఇత్యనేన బహువచనేన సీతాసఖ్య ఉచ్యంతే. స్నుషా ఇత్యత్రాప్యేవమేవ జ్ఞేయం."

అని మహేశ్వరతీర్థులు వ్రాసిరి. గోవిందరాజులుగారు ఎన్నియో శంకలు సమాధానములు కనఁబఱచి పెంచి పెంచి తుద కేసమాధానము యుక్తియుక్తముగాఁ గుదురనందున

"పరమాః స్త్రియ ఇతి పరిచారికాంతర్భావేన స్త్రీభిశ్చ మన్యఇతి స్వవినాశే స్త్ర్యంతరసంభావనయా పరమనారీణామితి కవివచనత్వేన శ్రీభూ మ్యాద్యభిమన్యవిషయత్వాచ్చేతి దిక్."

అని ముగించిరి.

శ్రీరామమూర్తి కనేకభార్యలున్నట్లు రామాయణమున నందందుఁ గలబహువచనాంతపదములచేతఁ దెలియవచ్చెడిని.

ఏకపత్నీవ్రతుఁడు శ్రీరాముఁ డన్నందులకు బహుతరప్రమాణ ములు గలవు.

"పితుర్నిదేశం సమయేన కృత్వా వనాన్నివృత్తశ్చరితవ్రతశ్చ।
స్త్రీభిస్తు మన్యే విపులేక్షణాభిస్త్వం రంస్యసే వీతభయః కృతార్థః." ౧౮
సుందరకాం. ౨౮ సర్గము.

అను నీసీతావాక్యముంబట్టి కొందఱు నవనాగరికులు రాముని కనేకభార్యలున్నయట్లు సీతయే చెప్పెనని యాక్షేపింతురు. ఏక పత్నీవ్రతుఁడన్నమాట యెన్నితావులఁగన్పట్టినను వానినిద్రోసి పుత్తురు. కారణమేమనఁగా భగవత్తత్త్వము వారికిఁ దెలియక పోవుటయే యనవచ్చును.సీత రావణప్రోత్సాహమున రాక్షసాం గనలు తన్ను బాధపెట్టఁగా నాదుఃఖమున జీవితాశపోఁగా మరణ వ్యవసాయముననుండి యీమాట చెప్పినది. సమయ మట్టిది. కావునఁ దనకుఁ గలజీవితనిరాశ ననుసరించి చెప్పినమాటయం దెట్టియర్థముండునని గ్రహింపవలయునో పాఠకులే నిర్ణయింప వలసినవారు. ప్రకృతము "రామస్య పరమాః స్త్రియః" అను చోట "సీతాసఖ్యః" అనుమహేశ్వరతీర్థులు వ్రాసినయర్థము గోవిందరాజసమ్మతమే యనవచ్చును. శ్రీరామునంతఃపురమునఁ గల స్త్రీలందఱు సంతోషింతురు. అని మంథర కైకను మఱింత కోప ముద్దీపింపఁజేయఁ జెప్పినది. "తే స్నుషాః" నీకోడండ్రు దుఃఖింతురు. అనఁగా భరతుని కెందఱు భార్యలో కైక యెఱుంగదా. ఇందుఁగలబహువచనమున కేమియర్థమో "పర మాఃస్త్రియః" అన్నచోట నదియే యర్థము. ఇట్లు సులభ ముగా నర్థమగుచుండఁగా లేనిశంకలు గలిగించుకొని యాశం కలమూలమున నేకపత్నీవ్రతుఁడు రాముఁడు కాఁడని యాక్షే

పించిన వచ్చులాభమేదియుఁ గానరాదు. భరతునకు మరల వివాహమైనయట్లు లేదు. కావున నీకోడండ్రనుచోటఁ బూజ్యవాచకమునకు బహువచననిర్దేశము శాస్త్రసమ్మతముగావున రామునికాంత లన్నచోట నట్లే గ్రహింపందగు. సాధారణముగా నంతఃపురములఁ దిరుగువారు మర్యాదగనే మాటలాడుదురు. కావున నెంతయినాసున్నను మంథర వాడుకచొప్పున రామునిస్త్రీలని పలికెననుట స్పష్టము. ఇట్టి యసంగతప్రసంగములచేత సమయమువెళ్లించుట పాపహేతువు. రామమూర్తి ప్రభువైనయెడల నంతఃపురమునఁ గలవారెల్ల నానందించుచుండఁగా భరతు నంతఃపురస్త్రీలు దుఃఖింతురుకదా యని మంథర పలికెనని మనము గ్రహింపవలయు.

"రామస్యైవ గుణాన్ దేవీ కైకేయీ ప్రశశంస హ
ధర్మజ్ఞో గురుభిర్దాంతః కృతజ్ఞస్సత్యవాక్శుచిః,
రామో రాజ్ఞస్సుతో జ్యేష్ఠో యౌవరాజ్యమతోఽర్హతి.
భ్రాతౄన్ భృత్యాంశ్చ దీర్ఘాయుః పితృవత్పాలయిష్యతి,
సంతప్యసే కథం కుబ్జే శ్రుత్వా రామాభిషేచనం."

అను నీవాక్యములు మహర్షివాల్మీకి కైకనోటఁ బలికించెను.

"హర్షస్థానే కిమితి మే కథ్యతే భయమాగతం
భరతాదధికో రామః ప్రియకృన్మే ప్రియంవదః,
కౌసల్యాం మాం సమం పశ్యన్ సదా శుశ్రూషతే హి మాం
రామాద్భయం కిమాపన్నం తవ మూఢే వదస్వ మే."

అధ్యాత్మరామాయణము ౨ సర్గము.

అను నీభావము రామాయణమునఁ గలదానినే యనుకరించుచున్నది. భరతునకుఁ గీడుమూడనున్న దనుమంథరమాటలఁ

భాటింపక కైక యీరీతిం బలికెను. "గురుభిర్దాంతః" అన్న మాటలనుబట్టి రామమూర్తి భగవంతుఁడని కైక యెఱుంగదనిమాత్రము చెప్పవచ్చును. కాని గురువులకడ సుశిక్షితుం డైనవాఁడు. అనఁగా సకలధర్మముల నెపుడెపు డెట్లెట్లాచరింపఁదగునో యెఱింగినవాఁ డనుభావముచే నాతనిమూలమున నాకుఁగాని భరతునకుఁగాని యేయపకారము కలుగదని కైక యాశయమని గ్రహింపవలయు. శ్రీరామునియం దింతదనుకఁ గైక కేమాత్ర మేదురభిప్రాయము లేదనియే యిందుఁగల సారము. దేవతలు పురికొల్పవచ్చినశారదాదేవి కైకయం దింక నావహింపలేదని మన మెఱుంగవలయు. ఏల యావహింపలేదనఁగాఁ గైక సదభిప్రాయముగలదియే యనుభావము లోకులకుఁ దెలియవలయునని, దేవతలకార్యము సాగింప నా పిదప నాసరస్వతి యావహించెననియు నిందుఁ దాత్పర్యము.

"సన్నికర్షాచ్చ సౌహార్దం జాయతే స్థావరేష్వపి."

అనుమూలమున నొకనీతి గలదు. దగ్గరనున్నందున సద్భావము గలుగును. ఇది స్థావరములయందుఁగూడఁ గలదు. మానవులకుఁ గలుగునని యేల చెప్పవలయును. అని దీనియర్థము. అన్యోన్యాలాపాదులవలన మైత్రి వృద్ధియగును. ఆమైత్రి సజ్జనులమూలమునఁ గలుగునేని వృద్ధిహేతువగు. దుర్జనమూలమగునేని నాశనహేతువగు. మైత్రికుదురుటయుఁ గర్మవశమున నే యగు. అదియు భగవదనుగ్రహాలభ్య మగునేని సత్కర్మమగును. తన్మూలమున సకలసంపదలు గలుగును.

"సూనుస్సచ్చరితస్సతీ ప్రియతమా స్వామీ ప్రసాదోన్ముఖః
స్నిగ్ధం మిత్రమవంచకః పరిజనో నిఃక్లేశలేశం మనః,

ఆకారో రుచిరః స్థిరశ్చ విభవో విద్యావదాతం ముఖం
తుష్టేవిష్టపహారిణీష్టదహారా సంప్రాప్యతే దేహినా."

సాధుసంసర్గమునఁగాని మంచిమార్గము దొరకదని మన కీ రామాయణవాక్యము తెలుపుచున్నది. సాధువులచెంత నివసించినఁగాని సదాచారములు పట్టుపడవు. తరుగుల్మాదులుకూడ సమీపస్థితివలన నొండొంటిని గలియుచున్నది. సాధువులకు దూరమందుండినవారిని జూచి నేర్చుకొనవలసినభాగములు చొప్పడవు. శాస్త్రపఠనముమాత్రము చాలదు. బహుశ్రుతులతోడ నెల్లప్పుడు సాంగత్యము కలిగియుండదు. దానిచేతఁ గర్మవాసనలు తాఱుమాఱుకూడ నగును. క్రమముగా దుష్కర్మవాసనలు నశించి సత్కర్మవాసనలు వృద్ధినొందును. కావున సత్సన్నికర్షము ముఖ్యమని మన కీభాగము బోధించుచున్నది. అయ్యాదియు భగవదారాధనమూలముననే కలుగును. దానికి సత్కర్మము మూలము. కావున నన్నింటికిఁ గర్మమే మూలమని మన మెఱుంగవలయును.

"త్రాయతే హి ద్రుమః కశ్చిచ్ఛేత్తవ్యో వనజీవిభిః,
సన్నికర్షాదిషీకాభిర్మోచితః పరమాద్భయాత్."

అని మూలము. ఇది యొక్కచక్కనినీతిని బోధించుచున్నది. వనములఁగలచెట్లు నఱికి కట్టెలమ్ముకొని జీవించువారు సకాలమున నొకవృక్షమును ఛేదింపఁ బోవఁగా నాయాపదనుండి ముండ్లపొదలు తన్నులముకొని యున్నందున వానిసాయమున విముక్తిఁగాంచెనని ప్రాతీతికార్థము. లోకమున నెవ్వఁడు తానుత్కృష్టుఁడనని యూహించునో యతఁడు తనకుఁగల్గు నాపదలనుండి తనకంటె నల్పులసాయ మున్నఁగాని తప్పించుకొన

నేరఁడు. ఈభాగము మనకుఁ దెలుపునీతి యేది? అల్పులనునది కల్పితాహంకారము. భగవంతుఁ డద్దానిం దొలఁగించి యితరులకుఁ గుణపాఠము చెప్పఁగోరి యాపదలు వానికిం గర్మాను సారము కల్పించును. అత్తఱి నతఁ డల్పులసాయమునఁ దప్పించుకొన్నయట్లు చేయును ఉత్కృష్టుఁడ ననుకొన్నవాఁడు బుద్ధి నుపయోగించి యోజించినఁ దనయహంకారమే యిందులకుఁ గారణమని యద్దానిం దొలఁగింప నీయుపాయము భగవంతుఁ డొనరించెనని తెలిసికొనును. అజ్ఞానము పొడసూపఁగనే ముందున్నయహంకారము తుదముట్ట నశించును. మానవుని సర్వానర్థములకు నహంకారమే ప్రధానము. దాని నాధారము చేసికొని యన్నియవగుణములు నందుఁ జొరఁబడును. కావున నాయహంకారమును మానవలయును.

"అహంకారం బలం దర్పం కామం క్రోధం చ సంశ్రితాః,
మామాత్మపరదేహేషు ప్రద్విషంతోఽభ్యసూయకాః. ౧౮
తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్,
క్షిపామ్యజస్రమశుభానాసురీష్వేవ యోనిషు." ౧౯ గీత. ౧౬ అధ్యా

అను శ్రీకృష్ణవాక్యము పైభావమును దెలుపుచున్నది. ఈ యుదాహరణమూలమున మన మధికులము. ఇతరులతో నేమి పని? అనుదుర్భావము మాని యాయాయికార్యముల కాయామానవులతోడ్పాటు వలసియుండునుగాన వారియందున్న భగవదంశము పూజ్యమేయగుట నద్దాని నిందించుట దోషము గావునఁ దానుత్కృష్టుఁడ ననుభావము మానవలయునని యీ భాగమునుండి మనము నేర్చుకొనవలయును. ఎంతవారికిఁగాని యహంకారము పనికిరాదనుట యిటఁగలసారము.

మంథర చెప్పిన యీమాటలు తొలుతఁ గైకకుం గల భావమును మార్చఁజాలెను. ఏల? శారదాదేవి యంతలో నావహించెను. పరవశగ్గయై కైక మంథరమాటల నాలకించి యిం దేమో సత్యమున్నదనునభిప్రాయము గలదయ్యెను. దేవతల యాశయము మానవులయభిప్రాయమునకంటె నెంత యుత్కృష్టమో యెఱుంగనగు.

"ఏతస్మిన్నంతరే దేవా దైవీం వాణీమచోదయన్."

అని యధ్యాత్మరామాయణమునఁ గలదు. బ్రహ్మ, యింద్రుఁడు లోనగువా రుండఁగా వాగ్దేవి నేల ప్రార్థించిరి? అనువిషయ మించుక చర్చింపఁదగినది. ప్రకృతిని మార్చుటకుఁ బ్రకృతియే కావలయును. పురుషశక్తి నిరర్థకము.

"మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి."

అని యర్జునునకు శ్రీకృష్ణుఁ డేల తెలిపెను? నే నాజ్ఞాపించుచున్నవాఁడనని యేల తెలుపలేదు? తాను సాక్షిమాత్రుఁడు. ప్రకృతికార్యమే యది హరిహరబ్రహ్మాదులు ప్రకృతికల్పితులు. తదాజ్ఞాధారకులు. వారివలన నగుకార్యము లత్యల్పములు. భండాసురాదిమహాదానవులు చెలరేఁగినపు డీదేవాధీశు లెందుండిరి? దుర్ఘటకార్యము లన్నియుఁ బ్రకృతిమూలముననే కావలయును. అహంకారమునఁ దనయందే కర్తృత్వ మారోపించుకొనువారలను బ్రకృతి శాసించునని శ్రీహరియే బోధించెను. ఈవిషయ మెఱుంగక కొందఱు మధ్యవైష్ణవులు దుర్జ్ఞానమునఁ బ్రకృతిని దదారాధనమును దూషింతురు. వారెట్టి వారు? ధనముకొఱకు సన్న్యాసివేషమును దాల్చినవారు. లోక

వంచకులు.అట్టివారికే భగవంతుఁడు ప్రతిక్షణము ప్రత్యక్షమగు చుండునని పామరులు నమ్ముదురు. దేవుఁడు శిలారూపమునఁ బ్రత్యక్షమగుటమాత్ర మందు సత్యము. భక్తుఁడు దేవతాంతరదూషణము చేయునా? ఏనాఁటికిఁ జేయఁడు. భస్మధారణము చేసి మంత్రము జపించిన ఫలింపదని మతభ్రష్టులగు వైష్ణవులు కొందఱు పలుకుదురు. భస్మధారణము మాని జపించినందున నాపామరులయిష్టము ఫలించెననియుఁ దెలుపుదురు. కాని వారి యజ్ఞానమునుగుఱించియే మనము విచారింపవలయును. కర్మము ఫలము నిచ్చుకాలమురాఁగా మంత్రజపము ఫలించును. అంతదనుక నెన్నిజపములుచేసినను ఫలింపవు. భస్మధారణ మందులకుఁ బ్రతిబంధకముకాదని ప్రాజ్ఞు లెఱుంగుదురు. మతభ్రష్టుల కేమితెలియును ? ఒక్కమతమున నుండక క్రొత్తమతమున నేదోయున్నదనుకొనువాఁడు స్వమతతత్త్వ మెఱుంగఁ డనుట నిక్కము. ఈవిషయము శ్రీరామకృష్ణపరమహంసగారే చెప్పియున్నారు. ఒక్కవారే కాదు. ఎల్ల రంగీకరించిరి. మతధర్మములను జక్కఁగా నెఱింగిన నందు లోపములున్నవని తోఁపదు. అల్పజ్ఞులయార్భాటములఁ బాటింపక పామరులు తప్పించుకొనవలయును. భస్మధారణాదిచిహ్నములేవియుఁ గర్మఫలములను స్వతంత్రించి యీయఁజాలవు. ఒక్కచిహ్నమును మాని వేఱొక్కదాని నంగీకరించిన ఫలముగలుగునని చెప్పుట వారి యవివేకమహత్త్వముననే యని మన మెఱుంగవలయును. ఇట్లు లీభాగము మనకు ననేకవిషయముల బోధించుచున్నది. ఇఁకఁ దరువాతి భగవచ్చరిత్రమును బఠింతము.

కైక దుర్బోధములకు లొంగిపోవుట.

*తనదాసి యీరీతిగా నొక్కినొక్కి పలుకఁగా నాలకించి కౌసల్యకు నేను దాసినగుదునా యని కోపమూని మండి పడుచు దానఁ దనముఖము రక్తవర్ణముం దాల్పఁగా వేఁడి నిట్టూర్పులు పుచ్చుచు మంథరం గాంచి యిట్లు పలికెను. మంథరా! అతివేగముగా నీదినమునందే నేను రాము నడవికిం బంచుదాన. వేవేగ భరతుని యౌవరాజ్యమున నభిషిక్తునిగాఁ జేయించెద. కుబ్జా! ఏయుక్తిపన్నిన భరతుఁడు యువరాజగును? దేనిచే రాజ్యము రామునకు లేక యుండును? ఈవిషయములు మాత్రము చక్కఁగా నాలోచించి తెలుపుమని ప్రశ్నించెను. ఆప్రశ్నము నాలకించినంతనే మంథర తన పంతము నెఱవేఱునని సంతసించి పాపకార్యములయందే దృష్టి గలది యగుచు రామునకు రానున్న రాజ్యమునకు విఘ్నమాచరించు వేడుకతోఁ గైకతో నిట్లు పలికెను.

ఔరా! యిప్పుడడిగితివి. కైకా! నీకుమారునకే సర్వరాజ్య మేలాగు లభించునో తెలిపెదను. శ్రద్ధగా నాలకింపుము. నీకార్యములను నీవే నాకుఁ బలుమాఱు తెలుపుచుందువు. వానినెల్ల మరల నావలననే వినఁగోరుచున్నదానవు. ఎందులకు? వానిని మఱచితివా యేమి? కాదేని తెలిసియుండియు నాయంత నేను దెలుపఁగా వినవలయుననుకోర్కి దాని దాఁచిపెట్టుచున్నదానవా? విలాసములయం దిష్టముగలయో కైకా! నేను దెలుపఁగా వినవలయు ననునభిలాషము నీకుం గల్గియున్నచోఁ

* ఇది తొమ్మిదవ సర్గమునఁ గలదు. అధ్యాత్మరామాయణకథాసారమిం దిమిడియుండును.

దెలిపెద. ఆలకింపుము. విన్న పిదప నాహితము చక్కఁగా విమర్శించుకొనుము. అనఁగానే మెత్తగాఁ బఱచియున్న శయ్యనుండి యత్యంతాదరమున నించుక లేచి దానిం గాంచి మంథరా! ఏయుపాయము పన్నుదునే? భరతునకు రాజ్యమువచ్చును గదా. రామునకు రాజ్యము రాకయుండనెట్లు పోవును? ఆ విధము తెలుపుమని యొత్తియొత్తి ప్రశ్నించెను.

మంథరయుఁ బాపదృష్టిగలది కావున రామాభిషేక భంగమును జేయఁబూని కైకకిట్లు తెలిపెను. దేవీ! మున్నొక్క సారి దేవదానవసంగ్రామమందు దశరథుఁడు శతమఖునకు సాహాయ్యముచేయఁబూని సామంతరాజులతోడ నంతకించుక పూర్వమే వివాహమాడిన నిన్నుంగూడఁ దీసికొని దక్షిణదిక్కునంగల దండకారణ్యమునకుఁ బోయి యందుఁ దిమిధ్వజుఁ డున్న వైజయంతపురమునకుం బోయెను.

ఆతిమిధ్వజునకు శంబరుఁడను నామాంతరము కలదు. కడుబలశాలి శతవిధములగు మాయల నెఱింగినవాఁడు. దేవతలకుఁ జిక్కక వారినెల్లఁ జీకాకుపఱచి యింద్రునితోఁ బోరాడెను. ఆసంగరమున బాణాద్యాయుధప్రహారముల నవయవములు రక్తసిక్తములుగాఁ బండుకొని నిద్రించుపూరుషులను రాత్రియందు వచ్చి రక్కసులు చంపివైచిరి. ఆరేయి దశరథ మహారాజు మహాబలులగు నారాక్షసుల మార్కొని ఘోర యుద్ధముచేసెను. వారు ప్రయోగించుతీవ్రాయుధముల వ్రేటుల పాలయ్యెను. సారథి చావఁగా నీవే సారథ్యముచేయుచు బాణఘాతములచే సొమ్మసిల్లిన నీపతిని యాభూమినుండి దూరముగాఁ దీసికొనిపోయితివి. శీతలోపచారము లనేకము లొనర్చి

కాపాడితివి. ఆచోటికివచ్చి రక్కసులు నానావిధములగునాయు ధములం బ్రయోగింప నావ్రేటులకుంజిక్కిన నీమగని నచ్చటి నుండి వేఱొక్కతావునకుఁ గొనిపోయి యనేకభంగుల నుప చారములొనరించి రక్షించితివి. దేవీ! నీ వామహాపదనుండి రెండుమాఱులు రక్షించితివికాన నందులకు నానందించి రెండు వరములు నీకు నొసంగెను. నాథా! యీవరములు వలసినపుడు కోరుదునంటివి. అట్లే కానిమ్మని భర్త పలికెను. నా కావరముల నిచ్చుసమయము తెలియదు. నీవే యావిధమంతయు నాకుఁ దెలిపితివి. నీయందుఁ గలవాత్సల్యాతిశయమున నెప్పుడైన నుపయోగించు ననునాశయమున వానిని మఱువక మది నిల్పు కొన్నదానను.

ఇపుడు మహారాజు రామాభిషేకసంభారములఁ గూర్చు చున్నాఁడు. ఆప్రయత్నము నతఁడు నిలుపునట్లు నీవు చేయం దగు. ఆ రెండువరముల నడుగునపుడు భరతునకుఁ బట్టాభిషేక మొక్కఁడు;పదునాలుగుసంవత్సరములు రాము నడవిలోనుండు నట్లు చేయుట రెండవది. అని యడుగుము. రాము నడవులఁ బదునాల్గుసంవత్సరము లుండఁజేయుదువేని యంతకాలము భరతుఁడు ప్రజలం బాలించునుగాన నతనిపై వారనురాగము గలిగియుందురు. పిదప రాముఁ డరుదెంచి యెంత ప్రయత్నిం చిన నెంత శ్రమంపడినను రాజ్యము లభింపదు. అతఁడు విఫల మనోరథుఁడగును. నీకొడుకునకే రాజ్యము సుస్థిరమగును. ఇదియే యుపాయము. దీనిని సాగించువిధము నాలకింపుము.

కైకా! కోపగృహమునకుం బోయి మలినవస్త్రమును ధరించి కఠినభూమిపై శయనించియుండుము. పతి యాదర

మున నీకడ కరుదెంచును. ఆతనిం గాంచి నీవు దుఃఖము నటించి యేడ్చుచుఁ గన్నెత్తియైన నతనిం జూడకుండుము. ఒక్కపలుకైనఁ బలుకకుము. నీయందా మహారాజునకుఁ గడుంగడుం బ్రీతి. నిన్నుం దేహము. నీనిమిత్త మారా జగ్నిలోఁబడును. ఇట్టి ప్రాణాధికురాలవగు నీకాతఁడు కోపము కలిగింపఁజాలఁడు. నీకుఁ గోపముకలిగినచో నాతఁడు తలయెత్తి చూడఁజాలఁడు సుమీ. నీప్రియముకొఱ కాతఁడు ప్రాణములంగూడ వదలును. నీమాట మీఱఁజాలఁడనుట నిశ్చయము. మందమతివిగాన నీశక్తి నీవెఱుంగవు. నీసౌందర్యమహత్త్వ మెంతయో యిప్పుడైన నెఱుంగుము. రాజు రత్నాద్యమూల్యపదార్థముల నీకొసంగును. వానిపై మాత్రము మన స్సునుపఁగూడదు. అదృష్టనంతురాలవగు నోకైకా! ఆవరములను స్మరింపుము. నీవు పట్టిన పట్టును సడలనీయకుము. ఎన్నిభంగుల నతఁడు చెప్పిన నయ్యది సిద్ధించునట్లే ప్రయత్నపడుము. రాజు శయనించిన నిన్ను మహాదరణమున లేవనెత్తి కూరుచుండఁబెట్టుకొని వరమిచ్చునేని యపు డాతనిని సత్యముగా వరమిత్తునని పలికించి మెల్లఁగా "రాజా! పదునాలుగేండ్లు రాముఁడు వనవాసముచేయునట్లు, భరతుని రాజరాజునుగాఁ జేయునట్లు వరముల నిమ్మని యడుగుము. రాముని వనములఁ బదునాలుగువత్సరము లుండునట్లు చేసితివేని ప్రజానురాగమునకుఁ బాత్రుఁడై నీకొడుకు స్థిరరాజ్యపదుఁడగును. మరల రాముఁడువచ్చినను రాజ్య మాతనికి సంక్రమింపదు. నీకుమారుఁడే సర్వదా రాజగును.

కైకా! వరములనడుగుతఱి భరతునకు రాజ్యమిమ్మని మాత్రమే కోరక రామారణ్యవాసముంగూడఁ గోరుము.

అంత మన కెల్లయర్థములు సిద్ధించును. రాముఁ డొక్కఁడే యగును. ఆతనిపక్షమున నెవ్వరుండరు. నిష్కంటకమగు రాజ్యమును భరతుఁడు పాలించును. రామునవనవాసనియమకాలమంతయు బుద్ధిమంతుఁడగు భరతుఁడు ప్రజానురాగపాత్రుఁడై రూఢమూలమగు రాజ్యమేలును. కావున నీకోర్కె సిద్ధించు కాల మిదియే యని నాకుం దోఁచెడు దశరథు నేరీతినైన నిర్బంధించి రామాభిషేకమును నిలిపివేయుము. ఆపనికి నిదియే సుసమయమని మంథర చక్కఁగా బోధించెను.

దాసి యీరీతిగా బోధింపఁగా నాయుపదేశము ప్రతికూలమే యైనను ననుకూలమే యని గ్రహించెను. కైక మతిమంతురాలే యైనను మంథరాదుర్వాక్యములకు విస్మయమొంది భయపడిన యాఁడుగుఱ్ఱమువలెఁ బెడదారిం ద్రొక్కెను. ఆస్థితి యందుండిన యారాణి దాసితో నిట్లు సంభాషించెను. కుబ్జా! ఇంతదనుక నీవిట్లు మేలు తెలుపుదానవని యింతవిశ్వాసముగల దానవనియు నెఱుంగనైతిఁ జుమీ. గూనివారలు భూమియందు నందఱికన్న సూక్ష్మబుద్ధి గలవారలగుదురు. వారలలో నీవు మొదట లెక్కింపఁదగినదానవు. నీవు లేకయున్న నాభర్త రామునకు రాజ్యమిచ్చి నన్నుఁ బాడుచేయంగోరియుండును. నేనద్దాని నెఱుంగఁజాలననుట సత్యము. గూనివారలు వికృతావయవములుగలవారు భూమియం దనేకు లున్నారు. నీ వట్టివారిలోఁ జేర్పఁదగవు. గాలిచే వంగిన పద్మమురీతి వాతదోషమున నీగాత్రము వంగినను జూచుటకు నందముగనే యున్నదానవు. నీయవయవములు వర్ణనార్హములుగ నున్నవి. నీవు నామ్రోలఁ దిరుగుచు రాజహంసివలె నున్నదానవు. సకలమా

యలు నీమనమున నిమిడియున్నవి. బుద్ధివైభవము నీవభ్యసించిన రాజనీతులు నీగూనునందే కాఁపురము చేయుచున్నవి. భరతుఁడు రాజుకాఁగానే నీగూనుమీఁద బంగారుదండను వైచెదనుజుమీ. నాప్రయత్నము సఫలముకాఁగా మహాసంతోషమున మృదుహిరణ్యపంకమును నీగూనుపై నలందుదును. నీమోమున నలంకరింప రత్నములు చెక్కిన సొగసైనబంగారు తిలకమును జేయించెదను. ఎన్నియే నాభరణము లొసంగుదును. అప్పుడు నీవమూల్యవస్త్రమును ధరించి దేవతరీతిఁ దిరుగుదువులే. నాసపత్నులను లెక్కింపక యెల్లవారిని దృణీకరించుచు నొయ్యారమున నటునిటు సంచరింతువు. నీవు నాపాదములను సేవించునట్లు కుబ్జలెల్ల నీపాదముల సేవింపఁగలరు.

అని యిట్లనేకభంగులఁ దన్నుఁ బొగడుచు వేదికయందగ్నిజ్వాలతీరున శ్వేతశయ్యపై శయనించియున్న యాదేవిం గాంచి మంథర యిట్లు పలికెను. తల్లీ! గతజలసేతుబంధము పనికి రాదుగదా. రామున కభిషేకోత్సవముకాఁగా నీవు వరమడిగినను లాభమేమి? కనుక నిట్లూరక కాలముం ద్రోయక త్వరపడి లెమ్ము. కోపగృహమున కరిగి రాజెపుడువచ్చునా యని వేచియుండుము అని తన్నుఁ ద్వరపెట్టఁగాఁ గైక తానే రాజునకుఁ బ్రియురాలనని యందగత్తెనని గర్వించుచున్నది కాన యాకుబ్జోపదేశములకు లోఁబడి దానింగూడి కోపగృహమును బ్రవేశించి యమూల్యాభరణములం దీసివైచి భూమిపైఁ బండుకొని మంథరా! నామగఁ డరుదెంచి నావాంఛలఁదీర్పఁడేని నేనిందే ప్రాణముల వదలుదును. ఇది నిజము. అట్టులగునేని నీవు రాజు

నకు నామరణవార్తను దెల్పఁగలవు. అది కలుగదేని రాముఁ
డడవులపాలు కాఁగా భరతుఁ డీరాజ్యమును బాలింపఁగలఁడు.
ఈ రెండింటిలో నేదో యొకటిసాగును. నిశ్చయము. ఏవస్తువు
లతో నాకుం బనిలేదు. రామునిపట్టాభిషేకము సాగెనేని నాకు
నాయుస్సు తీఱినదియే. అని కైక పలుకఁగా నాలకించి క్రూర
భాషిణియగు నాదాసి కైకకు మిగుల హితము రామునకు
నపకారము గావింపఁ బూని యారాణిం జూచి భాగ్యవతీ!
రాముఁడే రాజగునేని నీవు నీకుమారుఁడు కష్టములకుంజిక్కి
దుఃఖించుట సత్యము. కాన భరతునకే రాజ్యము వచ్చునట్లు
చేయఁ బ్రయత్నింపుము. అని నారాచములవంటిమాటలచేతఁ
బలుసారులు పురికొలుపఁగా నామెయు దుఃఖించి అంత ప్రీతి
గనఁబఱచుచుండుప్రాణనాథుఁ డింతఘోరకార్యమున కొడి
గట్టునా యని వక్షమునఁ జేయియుంచుకొని యచ్చెరుపడుచు
రామాభిషేకమునకు నాగ్రహించుచు మంథరా! నే నిచటనే
యుండి యమలోకమునకుంబోవువార్త విని నీవు రాజునకుఁ
దెలియఁజేయుము లేదేని రాముఁ డడవులపాలు కాఁగా భర
తుఁడు రాజై సుఖములంబొందును. ఈ రెండింటిలో నేదో
యొక్కండు సిద్ధము. రాముఁ డడవులకుంబోవనిచో నేను
శయ్యపైఁ బండుకొనను. పూవులు ధరింపను. గంధాదుల
స్పృశింపను. అన్నముం దినను. నాకేదియు నెక్కఱలేదు. ఇఁకఁ
బ్రాణములనైన నిలుపుకొనను. అని యిట్లు పరుషభాషణములు
పలికి యాభరణములం బాఱవైచి యుత్తనేలపై పుణ్యమునశింప
నాకసంబునుండి పుడమింబడిన కిన్నరాంగనవలె శయనించెను.
కోపాంధకారము మోముపై వ్యాపింపఁగాఁ బుష్పహారములఁ

బాఱవైచి యేమగునో యని సంశయించుచు నా కేకయ రాజపుత్రి నక్షత్రములు పోవ గాఢాంధకారము క్రమ్ముకొన నగపడు నాకాశమువలెఁ గనంబడుచుండెను.

మహానుభావులారా! ఈభాగమును విమర్శించి నీతిరత్నములను సంగ్రహింతము. సరస్వతీదేవి మంథరనోట నెన్నియో న్యాయములు నిష్ఠురములు పలికించి కైకయం దావేశించి యామె యవ్వాని నన్నింటిని సత్యములే యని నమ్మునట్లు చేసెను. భరతునకంటె నెక్కుడుగా భావించురాముని వనవాసమునకుఁ బంపఁగడంగెను. రామభరతులకుం గలమైత్రిగాని, భరతునిస్వభావమునుగాని విమర్శింపకపోయెను. తన యీకపటోపాయమును గుమారుఁ డంగీకరించునా యనియైన నూహింపకపోయెను. ఈకార్యమున రాఁగల లోకాపవాదమును స్మరింపకయే పోయెను. కైక వాస్తవముగా నాలోచింప విదుషీమణి. అంతియగాక సంగ్రామనిపుణ. పతిభక్తిపరాయణురాలు. లోకజ్ఞానములేనిమూర్ఖురాలు కాదు. అట్టులయ్యు వానినెల్ల వీటిఁబుచ్చి మంథరపలుకులు తనచెవులకు నమృతోపమానములు కాఁగా వాని విశ్వసించి త్వరపడి యీకార్యమును సాధించినఁగాని కొడుకునకు జీవితములేదని నిశ్చయించెను. దీనింబట్టి మనము చక్కఁ బరికింపఁగాఁ గర్మపాశములనుండి విముక్తింగాంచు టెట్టివారికేఁ దరంబుగాదని తేలెడిని. మానవప్రయత్నమునకంటె దైవయత్నము బలవత్తమమనియుఁ బోడకట్టును. ఆవిషయమునే మనము విమర్శింతము.

"ఇదం త్విదానీం సంపశ్య కేనోపాయేన మంథరే,
భరతః ప్రాప్నుయాద్రాజ్యం నతు రామః కథంచన."

అని కైకనోట వాల్మీకి పలికించెను.

"ప్రాయస్సమాపన్నవిపత్తికాలే ధియోఽపి పుంసాం మలినా భవంతి."

అన్నప్రాక్తనసూక్తిని ముని యీయుదాహరణముచే సార్థకముగఁ జేయించెను. సకలవిషయముల నెఱింగినకైకకు నెప్పుడైన మఱవరానివరద్వయవిషయము స్మృతిగోచరము కాదయ్యెను. ఏల? దేవతలప్రయత్న మట్టిది. శారదాదేవి యావేశింపఁగా నెవ్వరేమి చేయఁగలరు? రామున కెంతకష్టముననైన రాజ్యము రాకయుండునట్లు భరతునకు నిప్పుడే రాజ్యము లభించునట్లు తగినయుపాయము చెప్పుమా యని ప్రశ్నించెను. ఆలసింపకుమా యని త్వరపెట్టెను. నిక్కముగా గైకేయియే లోకోపకారమునకుఁ దోడ్పడినపూజ్యమతి.

"మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్."

అని శ్రీకృష్ణమూర్తి యుపదేశించినచందమునఁ గైక నిమిత్తమాత్రమే యయ్యెను. కర్మసిద్ధాంతము నెఱుంగనిమూఢులే కైకను దూషింతురు. మంథరను నిందింతురు. అది చేయరాని కార్యము. కర్మబద్ధులగు మనమెల్ల స్వతంత్రించి యేకార్యమును జేయఁజాలము. దైవయత్నము ఫలించుచుండ నందులకుఁ బ్రధానులము మనమని గర్వించుచుందుము. మంథరయే లేకయున్న శ్రీరామునవతారప్రయోజన మేమగును? విశ్వామిత్రముని శ్రీరాముని మహాప్రకృతిని జేర్చుట కెట్లు కారణభూతుఁడయ్యెనో ఈదాసియు రాణియు నట్లే దుష్టసంహారమునకు మిగులఁ దోడ్పడిరని మన మెఱుంగవలయును.

"ఈశ్వరస్సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి,
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా."

అను గీతావాక్యముచొప్పున భగవద్ద్రూపమగుకర్మము మానవుల నాయాచందముల నాడించుచుండఁగా నెవ్వాఁడు స్వతంత్రుఁడు కలఁడు? లేఁడనుట సత్యము. కావునఁ గైక శారదాదేవి తన్నావేశించుటంజేసి మహోపకారకార్యపరాయణురాలయ్యెననియే మనము గ్రహింపవలయును. ఇదియే భగవత్సంకల్పము. దాని నెఱుంగఁజాలనివారే కైక నాక్షేపింతురు.

"తవ దైవాసురే యుద్ధే సహరాజర్షిభిః పతిః,
అగచ్ఛత్త్వాముపాదాయ దేవరాజస్య సాహ్యకృత్."

ఇది మంథరావాక్యము. సామాన్యార్థము సుగమము. దశరథుఁడు దేవరాజునకు సాహాయ్యమొనరింపఁబూని సేనలంగూడి పోవుచుఁ గైకనుగూడఁ దీసికొనిపోయెను. ఏల? "గహనా కర్మణో గతిః" అన్నమాట యిట సార్థకమగును. కైకవలన దేవతలకు మునులకుఁ గలుగఁబోవుమహోపకారమునకు హేతుభూతురాలగుటఁ గైకను బిలుచుకొనిపోఁదగు ననుబుద్ధి దశరథున కాకాలమునందే కలుగునట్లు భగవదిచ్ఛ యగుకర్మమే చేసెను. ఎందులకుఁ బిలుచుకొనిపోయెనని యెవ్వరెఱుఁగరు. కర్మగతులనరయుట శక్యమా? కైక రాఁగల రామావతారమున నింతటిమహోపకారము చేయఁగలదని సిద్ధాంతమే యయియుండెను. కావుననే దాని కనురూపముగా శారదాదేవి యామెయం దావహించెను. ధర్మసంరక్షణమున కెందఱు పాటుపడిరో పాటుపడనున్నారో మన మూహింపవచ్చును. ముఖ్యముగా మన మెఱుంగఁదగినవిషయ మిదియే. లోకమునకు మహోపకార మొనర్పఁదగినది కర్మమే. కావుననే

"ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే."

అని భగవంతుఁడు చెప్పెను. భగవంతుఁ డవతరించుట కర్మ ముల మానవులు విధివిహితములుగా నాచరించునట్లు చేయు టకే కాక యెల్లరను సన్న్యాసులుగాఁ జేయుటకుఁగాదు. కనుక భక్తియనునది కర్మమున నంతర్భూతమే యగును. కర్మమును, జ్ఞానవైరాగ్యములను వలదనువారు కలరుగాని భక్తి వలదను వారు కలరా యని కొందఱు మధ్వవైష్ణవులు ప్రశ్నింతురు. వారికి భుక్తియే భక్తి. మూఢులలో వారినిమించినవారు లే రనవలయు. భక్తి లేక యెవ్వఁడు నేకార్యము చేయఁజాలఁడు. జ్ఞానికాక యే కర్మ మొనరించినను లాభము లేదు. వైరాగ్యము లేక కర్మముల నాచరించిన నవి సత్ఫలముల నీయఁజాలవు. వీని నొక్కొక్కదానిని వేఱుచేయ సాధ్యముకాదు. సోమరిపోతులే కర్మము లేల? అనువారు. వా రలసులు. భుక్తితత్పరులు. కావునఁ గర్మములను వలదందురు.

"ఉత్సీదేయురిమే లోకా న కుర్యాం కర్మ చేదహం,
సంకరస్య చ కర్తా స్యాముపహన్యా మిమాః ప్రజాః."

అన్న శ్రీకృష్ణోపదేశమునఁగల సారమేమి? సత్కార్యము లన్నియుఁ గర్మాంతర్భూతములే. సర్వకర్మత్యాగము వినాశన హేతువగును. కావున గర్మసిద్ధాంతమే యన్నింటికంటె నుత్కృష్టము. దానిననుసరించి మనము ప్రవర్తించిననే భగవ దనుగ్రహమునకుఁ బాత్రులమగుదుము.

ఈ దేవాసురయుద్ధకథనమున శ్రీరామాయణమునకు నధ్యాత్మరామాయణమునకు నించుక భేదముకలదని యెఱుం గందగు.

"తత్రాకరోన్మహాయుద్ధం రాజా దశరథస్తదా,
అసురైశ్చ మహాబాహుశ్శస్త్రైశ్చ శకలీకృతః.
అపవాహ్య త్వయా దేవి సంగ్రామాన్నష్టచేతనః,
తత్రాపి విక్షితశ్శస్త్రైః పతిస్తే రక్షితస్త్వయా."

అని శ్రీమద్రామాయణము.

"యుద్ధం ప్రకుర్వతస్తస్య రాక్షసైస్సహ ధన్వినః,
తదాక్షకీలోఽన్యపతచ్ఛిన్నస్తస్యన వేదసః,
త్వంతు హస్తం సమావేశ్య కీలరంధ్రేఽతిధైర్యతః,
స్థితవత్యసితాపాంగి పతిప్రాణపరీప్సయా."

అధ్యాత్మరామాయణము.

ఈభేదమువలనఁ గథకుఁగాని యంతలిధర్మములకుఁగాని యే మాత్రము బాధ లేదు. కథవలన గ్రహింపఁదగునీతికిని బాధ లేదు. కైక చేసినమహాకార్యమున కానందించి దశరథుఁడు రెండువరము లిచ్చుటయే మనకుఁగావలసినది. రెండుసారులు రాక్షసులవలనఁ గలుగుబాధలనుండి తప్పించినందున రెండు వరము లడుగుమని దశరథుఁడు చెప్పినట్లు రామాయణమునఁ గలదు.

"తుష్టేన తేన దత్తౌ తే ద్వౌ వరౌ శుభదర్శనే."

రామాయణము.

"ఆశ్చర్యం పరమం లేభే త్వామాలింగ్య ముదాన్వితః,
వృణీష్వ యత్తే మనసి వాంఛితం వరదోఽస్మ్యహం,
వరద్వయం వృణీష్వ త్వమేవం రాజాఽవదత్స్వయం. ౨౦
యదా మేఽవసరో భూయాత్తదా దేహి వరద్వయం,

అధ్యాత్మరామాయణము.

ఇట్టిభేదములను ప్రధానములుగా భావింపరాదు. భగవత్తత్త్వ మునే తెలుపునది యధ్యాత్మరామాయణము. తత్త్వమును నిగూఢముగాఁ గథను ప్రధానముగా వెల్లడించునది శ్రీమద్రామాయణము. అని మనము గ్రహించినయెడల నెంతమాత్రము భేదము కనంబడదు.

"అనభిజ్ఞా హ్యహం దేవి త్వయైవ కథితా పురా,
కథైషా తవ తు స్నేహాన్మనసా ధార్యతే మయా."

అని మంథర పలికెను.

"ఇంద్రియాణి పరాణ్యాహురింద్రియేభ్యః పరం మనః,
మనసస్తు పరా బుద్ధిర్యో బుద్ధేః పరతస్తు సః." ౪౨

(సంకల్పవికల్పాత్మకము మనస్సు.) అను నీగీతాశాస్త్రము ననుసరించి యోజింతము. కైక మంథరకు మాత్రమే యీవిషయమును దెలిపెను. తక్కుంగల ప్రియసఖిజనమునకుఁ దెలుపలేదు. మంథరయు నింతదనుక దానిని స్మరింపలేదు. ఏల? భగవదిచ్ఛ యీవిషయ మితరులకుఁ దెలియరాదనియు నీవిషయమున నించుక లోకాపవాదమును, మహర్షి వినుతిని బొందఁదగినవారు మంథరయుఁ గైకయు నని యూహించి స్మృతికి రాకయుండ నొనరించెనని మన మెఱుంగందగు. సకాలమున నొకతుకకు స్మృతిగోచరమయ్యెను. దీనింబట్టి మనము నిష్పక్షపాతముగా నూహించిన మంథర కైక పామరులదూషణములకు గుఱి యైనను దేవతలయు, మునులయు సంస్తుతికిఁ బాత్రభూతురాండ్రే యైరని తేలకమానదు. కనుకఁ బ్రతివిషయమును విన్నంతమాత్రమున మంచిదని చెడ్డదని పలుకక సావధానముగాఁ బరిశీలించి దానఁ గలుగఁబోవుఫలమును దెలిసి యొక

భావమును దెలుపవలయు ననునీతిని మనము చక్కఁగా గ్రహింపవలయును.

“ప్రవ్రాజనం తు రామస్య త్వాం వర్షాణి చతుర్దశ.
చతుర్దశ హి వర్షాణి రామే ప్రవ్రాజితే వనం,
ప్రజాభావగతస్నేహస్థిరః పుత్రో భవిష్యతి.”

అను నీమంథరావాక్యములఁ బరికింతము. వనములఁ బదునాలు గేండ్లు రాముఁడుండఁ జేయుము. అంతలో భరతుఁడు ప్రజల యనురాగమునకుఁ బాత్రుఁడై స్థిరరాజ్యుఁడగును. శారదా దేవి మంథరనోట యీమాట చెప్పించినది. పదునాలుగువత్సర ములని యేల నియమము? అను ప్రశ్నము రావచ్చును. ఈ ప్రశ్నమునకు బదులువ్రాయుటకుఁదగినస్థలము లనేకములున్నవి. ఇందును వ్రాయుదును. విరాధాదిరాక్షసుల వధించుపని శ్రీ రామమూర్తికిం గలదు. ఒక్కొక్కనికిఁ బరిమితి రావలయును. విరాధునకు శాపాంతసమయము రావలయును. ఆసమయము నకుఁగాని ముందుగా నాకృత్యమునకుం బోరాదుగదా. శర భంగముని యగ్నిప్రవేశముచేసి పరమపదమునకుఁ బోవుసమ యమున నందు దర్శనమీవలయును. ఖరదూషణాదులకు సాంఘాతమరణము కావలయును. దానికిఁ దగుసమయము రావలయును. ఇట్లే వాలిప్రభృతులకు రామునివలనఁ బరమ పదము లభించుసమయములు గలవు. పదునాల్గవవత్సరము తుది భాగమున రావణసంహారము కావలయును. వారనుభవించు కర్మఫలము లుండఁగా ముందు వారిని వధింపరాదుకదా. ఎవ్వ రెవ్వరి కేయేకాలమున నెవ్వారినుండి శుభాశుభఫలములు గలుగఁదగునో యవి యట్లే సాగవలయును. కావుననే కర్మ

సిద్ధాంత మన్నింటఁ బ్రధానత వహించినది. దానిని భగవంతుఁడు మార్పఁబూనఁడు. సర్వశక్తుఁడగు నామహనీయమూర్తి మార్పఁజాలఁడా యని యడుగరాదు. స్వోక్తివ్యాఘాతముగ నాపరమేశ్వరుఁడు ప్రవర్తింపఁడు. "నిజాజ్ఞారూపనిగమా పుణ్యాపుణ్యఫలప్రదా" అనువాక్య మిందులకుఁ బ్రమాణము కాఁగలదు. భగవతియాజ్ఞయే వేదములని యర్థము. అట్టి మహామాయ తనయాజ్ఞను దానే దాఁటిన నింకఁ బాటించువారెవ్వరుందురు? అట్టిపని నాయాదిమదంపతులు చేయరు. కావుననే కర్మగతి యప్రతిహతమయ్యెను. ఇందఱికర్మము లీరీతి ఫలము నీయఁదగుకాలము రావలయునుగానఁ బదునాలుగు వత్సరములనునియమము మంథరాముఖమునుండి వెడలునట్లు వాగ్దేవి యొనరించెనని మన మెఱుంగందగు. "గహనా కర్మణో గతిః" అని యెన్నిసారులు పఠించినను దానిసిద్ధాంతము సరిగాఁ దెలియకుండును. పరమాత్మయే యామాటను జెప్పినప్పుడు తక్కినవారిమాట యిఁట నేటికి? మానవులకుఁ గర్మగతుల నరయఁ దరముకాదనుట సత్యము.

"క్రోధాగారం ప్రవిశ్యాద్య క్రుద్ధేవాశ్వపతేస్సుతే,
శేష్వానంతర్హితాయాం త్వం భూమౌ మలినవాసినీ."

రాజగృహనిర్మాణ మెంతవిచిత్రముగ నుండెనో యోజింపుఁడు. కోపమూనినతఱి నొకయింట నుండవలయును. అంతఃపురమున నొకభాగమునఁ గ్రోధాగారము కట్టఁబడియుండును. ఆసమయమున నాయింటనే యుండందగు. ఇట్లే మఱికొన్నికార్యములకు మఱికొన్నిగృహములు కట్టఁబడియుండును. తొలుదొలుత నీగృహనిర్మాణమపహాస్యభాజనముగా నుండును.

ఈగృహనిర్మాణమునకు ఫలమేమని విచారింతము. మహా యోగులమాటవదలి సాధారణమానవులవిషయ మిట గ్రహింతము. క్రోధము కలిగెననఁగా రజోగుణము విశేషించి వృద్ధి నొందెనని యర్థము. ఆస్థితియందుండుచోట నాతని తేజము వ్యాపించును. అయ్యది మలిన తేజస్సే యగు. ఆచోట భగవద్ధ్యానముచేయ నారంభించినచో నతనిమనస్సు మలినమే యగును. ఎందులకు? ఆ తేజ స్సతని వ్యాపించునుగదా. దానిం జయించునంతటి శక్తిగలయోగుల కీనియమములు చెల్లవు. దేవతాగృహమని వేఱుగ నుండుటయు నిందులకే. అందుఁ బ్రవేశించునపు డితరచింతలుండక యుండవలయు. ప్రతిదిన మందు దైవమునుగూర్చి పూజయో ధ్యానమో సల్పుచుండుటంజేసి యందుఁ బరిశుద్ధ తేజస్సు వ్యాపించియుండును. అందుఁ జొచ్చువారలయం దది వ్యాపించును. కావున నితరచింతలు మదిఁ జొరకయుండ నయ్యది చేయును. ఇట్టికారణము లనేకము లుండుటంబట్టి క్రీడాగృహము, సభామండపము, కోపాగారము లోనగునవి వేఱువేఱుగా నుండునట్లు కట్టుదురు. ఆయాగృహముల నుండునపుఁ డాకార్యముకొఱకని యితరు లెఱుంగుదురు.

"శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః,
నాత్యుచ్ఛ్రితం నాతినీచం చైలాజినకుశోత్తరం. ౧౧
తత్రైకాగ్రం మనః కృత్వా యతచిత్తేంద్రియక్రియః,
ఉపవిశ్యాసనే యుంజ్యాద్యోగమాత్మవిశుద్ధయే." ౧౨

గీత. ౬. అధ్యా.

అనుగీతా వాక్యము పై వ్రాసినయాశయమును దృఢపఱచెడిని.

"శుచౌ శుద్ధే వివిక్తే స్వభావతః సంస్కారతో వా దేశే స్థానే."

అని శంకరభాష్యము.

పరిశుద్ధస్థలమనఁగా మంత్రములచే నందుఁ గలభూత జాలములఁ బాఱఁద్రోలియున్న చోటని యర్థము. దేవాలయములు, తపోవనములు, నదీతీరములు పావనములని తెలియందగు. మహర్షులుకూడ నట్టితావులకే పోయి తపస్సు చేయుటెందులకు? మున్ను మహాత్ము లెందఱో యందు నియతులై తప మాచరించియుందురని, వారి తేజస్సందు వ్యాపించియుండునని, యాచోటఁ దపోవిఘ్నకరము లగుభూతము లుండవని, యందుఁ గూరుచున్న మంచియూహలు కలుగుననియే కదా. కనుకనే రాజగృహములయందేమి సామాన్యగృహములయందేమి యుచితరీతి నాయాయి కార్యముల కాయాయి తావులు నిర్ణయింపఁబడవలయును. విహారగృహము దైవప్రార్థనమున కుపయోగింపరాదు. ఊహలు మార్పునొందును. దేవాలయములు విశేషధనవ్యయ మొనరించి నిర్మించుట పామరులు మహారణ్యములకుఁ బోవఁజాలరనియు, దేవాలయములకుఁబోయినపుడైన నది పరిశుద్ధస్థలమన్న భావము కలుగుననియు, నందున్న కాలమునందైన దుర్వాసనలు నశించి మంచియూహలు కలుగుననియు, నీలాభములు గ్రామవాసులకుఁ గల్గించుటకే యని యెఱుంగందగు. దేవాలయములవలన నింతకంటె నెక్కుడు లాభము కానరాదు. ఆశిలావిగ్రహమే ముక్తినిచ్చునని నమ్మియుండరాదు. దానిని మదిఁ బదిలపఱచుకొని ధ్యానింపవలయును. దాననే లాభము కలుగును.

"దయితా త్వం సదా భర్తురత్ర మే నాస్తి సంశయః,
త్వత్కృతే స మహారాజో విశేదపి హుతాశనమ్.
న త్వాం క్రోధయితుం శక్తో న క్రుద్ధాం ప్రత్యుదీక్షితుం,
తవ ప్రియార్థం రాజా హి ప్రాణానపి పరిత్యజేత్."

అను నీమంథరావాక్యముల నించుకఁ బరిశీలించినఁ బ్రాచీనులు ప్రియపత్నుల నెట్లు బహూకరించిరో స్మృతు లెట్లు విధించెనో తేటపడఁగలదు.

"యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః,
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఫలాః క్రియాః. ౫౬
శోచంతి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులం,
న శోచంతి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా. ౫౭
జామయో యాని గేహాని శపంత్యప్రతిపూజితాః,
తాని కృత్యాహతానీవ వినశ్యంతి సమంతతః. ౫౮
తస్మాదేతాస్సదా పూజ్యా భూషణాచ్ఛాదనాశనైః,
భూతికామైర్నరైర్నిత్యం సత్కారేషూత్సవేషు చ. ౫౯
సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ,
యస్మిన్నేవ కులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువం. ౬౦
స్త్రియాం తు రోచమానాయాం సర్వం తద్రోచతే కులం,
తస్యాం త్వరోచమానాయాం సర్వమేవ న రోచతే." ౬౧

మనుస్మృతి. 3 అధ్యా.

"యోషాతిరూపసంపన్నా గర్వితా మదశాలినీ,
మమ రూపైవ సా జ్ఞేయా పుష్పేనాపి న తాడయేత్."

కాశీవాక్యము.

ఈవచనములం బరిశీలించినభర్త భార్యకు విశేషించి వస్త్రాలంకారాదుల నిచ్చి సంతోషము కలిగింపవలయుననియు, అట్లు చేయక వారిని దుఃఖములపాలు చేసిన నాకుల మేనశించుననియు, వారు దుఃఖపడ రాదనియుఁ దెలెడిని. ఈనియమములననుసరించి దశరథుఁడు కైకను విశేషించి సత్కరించుట న్యాయ్యమే కాని విరుద్ధము కాదు. భార్యకొఱకుఁ బ్రాణములర్పించుటయు నన్యాయ్యము కాదు. ఇకార్కారణములంబట్టి దశరథుఁడు కాముకుఁ డనుట విశేషదోషము. కైక పతిభక్తికలది కాదనుటయు నంత కంటెఁ దెలివితక్కువచేతనే. ఆమెమూలమునఁగాని శ్రీరామావతార ప్రయోజనము లోకులకు దేవతలకు సమకూడదు. ఆకారణమున దేవతలు ప్రార్థింప శారదాదేవి యావేశించెను. దాన నామె పరవశయై పలికెననియు, మంథరయు నట్లే పలుకుల నామెఁ బ్రోత్సహించెననియు మన మూహింపవలయును. ఈవిషయము రామాయణమునకు విరుద్ధము కాదా యనుటకు రేని కాదు. రామాభిషేకవార్తను దెలుపుచుఁ దొలుత మంథర తనభావమును వెలిఁబుచ్చెను. అపు డామె మెడలో నున్నహారము నొసంగి తెలిపినమాట లెట్టివి? ఆయభిప్రాయము మార్పునొంద హేతువేమి? శ్రీరామాయణమున నీవిషయము ధ్వనిరూపమునఁ గలదనియే గ్రహింపవచ్చును కర్మసిద్ధాంతము నిట నన్వయింతము. రావణాదిదుష్టరాక్షసుల దుష్కర్మము. మహర్షులయు దేవతలయు సత్కర్మము కైకను బ్రోత్సహించెను. ఇదియు నధ్యాత్మరామాయణభావము నొక్కవిధమే యని యెన్నఁదగు.

"కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః"

అన్న గీతావాక్యము కర్మము బలవత్తరమనియు, దానికి నెల్లరు లోఁబడుదురనియు బోధించుచున్నది. కావునఁ గైక శీలమున నించుకంతయు దూషింపఁదగినభాగమే లేదనియు, దేవకార్యార్థమే మహామాయ యారాణిని బ్రేరేపించెననియు,నామెశీలము స్తోత్రపాత్రమేకాని నిందార్హము కాదనియు మన మెఱుంగవలయును.

"ఏవం ప్రవ్రాజితశ్చైవ రామోరామో భవిష్యతి,
భరతశ్చ హతామిత్రస్తవ రాజా భవిష్యతి."

అనుమూలము విమర్శింపఁదగును.

"రామోరామ ఇత్యత్ర అరామ ఇతి పదచ్ఛేదః, అరామో భవిష్యతి. ఇదానీమేవ ప్రకృతిస్నేహపాత్రం న భవిష్యతీత్యర్థః. రామో భవిష్యతి ఏక ఏవ భవిష్యతీత్యర్థః."

అని గోవిందరాజులు.

"రామో రామో భవిష్యతీతి స్వయమేక ఏవ భవిష్యతి. రమయత్యానందయతీతి రామః, మునీనామితి శేషః."

అని మహేశ్వరతీర్థులు వ్రాసిరి.

ఈవాక్యమును మహాకవి వాల్మీకి మంథరనోటఁ బలికించెను. కైకా ! నీవడవులకు రామునిఁ బంపిన యెడలనే రామమూర్తి మునిజనమనోరంజకుండగు. అనఁగా నడవులకు శ్రీరామమూర్తి పోయి దుష్టదానవుల మడియించి వారలకు నుత్తమలోకములఁ గల్పించిననే మహర్షు లానందింతురు. భరతుఁడుకూడ నపుడు శ్రీరామపాదసేవాసక్తుఁడయి యరిషడ్వర్గమునోడించి విజితేంద్రియుఁడై శ్రీరామభక్తుఁడన్న ప్రఖ్యాతిం

గాంచి రాజు కాఁగలఁడు. అనఁగా భరతుఁడు రాజ్యము నాసించువాఁడు కాఁడు. రామభక్తుఁ డన్నభావము నెల్లరకుం గల్గించి వారలను రంజింపఁజేయఁగలఁడు. కైకా! నీ వీకార్యమున నౌదాసీన్యము పూనుదువేని లోకాపకారిణి వగుదువు సుమీ యని మంథరయాశయమను విశేషార్థమును దెలిసికొనవలయును. ఈయర్థమును గ్రహించినఁగాని

"హేమ్నస్సంలక్ష్యతే హ్యగ్నౌ విశుద్ధిశ్శ్యామికాపివా."

అను కాళిదాససూక్తి ననుసరించి రామాయణమునఁ గలనీతి తేటపడదు. మంథర దుర్మార్గురాలు. కైక పాపస్వాంత యను దుర్భావము వదలవలయు. నిజముగాఁ గైక పాపాత్మురాలే యైన యెడల శ్రీరాముఁ డామెను కౌసల్యంబోలె సేవించెననుట యసంగతప్రసంగ మగును. పూతచారిత్రులనే భగవంతుఁ డాదరించును. లోకులకు బుద్ధి సదాచారము ననువానిని నేర్ప సేవించును. అంతియకాని దుశ్చరిత్రుల నాదరింపఁడు. ఈవిషయము శ్రీరాముఁడు కైకతో సంభాషించుకాలమున మఱియుఁ జెక్కుటావుల స్పష్టమగును.

"అనర్థమర్థరూపేణ గ్రాహితా సా తతస్తయా,
హృష్టా ప్రతీతా కైకేయీ మంథరామిదమబ్రవీత్.
సా హి వాక్యేన కుబ్జాయాః కిశోరీవోత్పథం గతా"

అను నీమూలముం జూడుఁడు. సామాన్యార్థము వదలి విశేషార్థముల బరిశీలింతము. సామాన్యదృష్టి కనర్థముగాఁ (కీడుగా) గనంబడి పరమార్థదృష్టికి ననుకూలప్రయోజనముగాఁ గనంబడునట్లు తెల్పినమంథరావాక్యములను జక్కఁగా నెఱింగినదై అనఁగా గ్రహించినదియై కైక మహాహర్షమున మంథర తనకు

మేలుగలుగ బోధించెనని తానెఱింగినందునఁ గల్గిన పట్టరాని సంతోషమున నిట్లు పలికెను. దేవతలయు మునులయుఁ బ్రజలయుఁ గష్టములఁ దీర్చి సుఖమును ధర్మరక్షణము నొనరించు కార్యము నామూలమునంగానున్నదిగదా యన్న సంతోషమని గ్రహింపందగు. ఈయర్థము న్యాయ్యమాయందురేని

“కైకేయీ విస్మయం ప్రాప్తా పరం పరమదర్శనా”

అను దీనికిం దరువాతిదగుమూలముంగాంచుఁడు. పరమదర్శనా= మంచిని జూచునది యని యర్థము. ఆపదము వ్యర్థముకాదా. కావుననే యీయర్థమే మహాకవిభావమని మన మెఱుంగం దగు. ఈఘట్టమున నాంధ్రీకరణ మెట్టులున్నదో పరిశీలింతము. విమర్శకు లిచ్చో నాపద్యము లాకాశరామన్నపంచాంగమనిరి. మూలము మరల వ్రాయను. ముందున్నదానిని జదివితిరికదా.

సీ. ప్రతికూలమైన యర్థంబుల ననుకూల
 ములుగ నమ్మంథర బోధసేయ
నారీతి గ్రహియించి యాకైక మును సద్వి
 షయములఁ జూచు నైజంబుగలది
యయ్యును గుబ్జవాక్యముల కచ్చెరువంది
 భ్రాంతినొందిన బడబావిధమున
నపమార్గమును ద్రొక్కె నంత నాబోధకు
 సంతసమంది కుబ్జ నటఁ గాంచి
తే. పలికె నీవింత మేలైన పలుకు చెప్ప
 దాన వనియును మేలైన దానవనియు

నింతకాలమునుండి నే నెఱుఁగనైతిఁ
దెలిసె నిప్పుడు నీవగు తీరు లెల్ల.

(ఆంధ్రశ్రీమద్రామాయణము.)

తేటగీతమునకు మూలము పైనవ్రాయలేదని గ్రహింపవలయు.

క. కావున రాముని రాజుగఁ
గావింపఁగనీకుమన్నఁ గైకయు భృశహ
ర్షావిష్టచిత్త యగుచుం
దావిషమగునర్థ మెంచెఁ దనహిత మనుచున్.

క. కారాని తెరువులం జనఁ
గోరినగోఁడిగవిధానఁ గొని విస్మయముల్
జారువిలోచన తమిపెం
పారఁగ నిట్లనియెఁ గుబ్జ కతిమోదమునన్.

(వావిలికొలనువారి రామాయణము.)

ఒకానొకవిమర్శకాగ్రేసరుఁడు నాపద్యములు మూలార్థమును బోషింపలేదనియె. వావిలికొలనువారిపద్యములు మూలార్థపోషకములనియె. పాఠకమహాశయులే యావిమర్శకు నభిప్రాయమెట్టిదో పరికింతురుగాక. మహాశయులమదులయం దుండినం జాలు. వారు వెలిఁబుచ్చునక్కఱ లేదు.

కొందఱు కైక మంథరకు మరల నెన్నియోయలంకారములనిత్తునని పల్కెనుగదా. కైక దుశ్శీలముకలదికాదని యెట్లులనందగునందురు. వారిప్రశ్నమును విన్నంతనే నవ్వురాక మానదు. తనవలన నింతమహోపకారము దేవర్షులకుఁ గలుగ నుండఁగా ధర్మమునకు నిలువ నీడ దొరకనుండఁగాఁ దెలియక

రామాభిషేకమువార్త విని యానందించిన తనకు మేలుగలుగు మార్గమును వినిపించినమంథరకు బహుమానము చేయుదునని కైక పలికెను. ఇదియే సమాధానము. ఈభావమును మది నిడుకొనియే రామాయణమును బఠింపవలయు. అపుడే ధర్మరక్షణమున కెవరెవ రెట్లు తోడ్పడి భగవంతునియనుగ్రహమునకుఁ బాత్రులైరో తేటపడఁగలదు. లేకున్న సత్యము బయల్పడదు.

"నరేంద్రపత్నీ విమనా బభూవ సా తమోవృతా ద్యౌరివ మగ్నతారకా"

అని మూలము. క్రోధాగారమున శయనించియున్నకైక యంధకారావృతాకాశమువలె నున్నదని మహాకవి తెల్పెను. ఏల? వాగ్దేవి యావేశించినందునఁ దనయూహాలు మాటుపడఁగా నేమియుఁ దోఁపక నవ్యాభిప్రాయములుగలదై యుండెనని భావము.

ఈభాగమును బరిశీలించినం దేలెడుసార మేమి? లోకోపకారమే భగవత్సేవ యనుకొనువారు స్వసుఖమును బాఱఁదోలి సకలశ్రమములకు నోర్చి పరమార్థ మదియే యని పాటుపడవలయుననున దొకనీతి. మంథరయుఁ గైకయు శ్రీరామవర్తనము నెఱింగినవారలే. మహాప్రీతి యతనిపైఁగలవారలే. ఐనను సకలజగదుపకారమునకై యవతరించిన ప్రకృతి పురుషుల యాశయము ననుసరించి రాముని వనవాసమునకుం బంపుటకుఁ బూనిరి. దేవతలయుద్దేశము మహర్షులవాంఛయు నెఱవేర్పఁ బూని రనునది యొకనీతి. ఈవిషయములం బరికించి వారిని దూషింపరాదనియు, నయోధ్యాపురమునఁ గలవార లెవ్వరు నింతటి మహోపకారము లోకమునకుఁ జేయఁబూనినవారు లేరనియు నెఱుంగవలయును. స్వల్పలాభమునకు నాశపడక

మహాలాభకార్య మేదియో దాని నెఱవేర్పఁ బ్రయత్నింపవల యును. ఇఁకఁ బ్రకృతివిలాసము లెట్లు చెలరేఁగునో పరికింతము.

దశరథుఁడు కైకను జూడ నరుదెంచుట.

* పాపకార్యదృష్టిగలమంథర న్యాయము తాఱుమాఱగు నట్లు చెప్పినమాటలు విని కేకయరాజపుత్త్రి విషముపూసిన బాణము నాటుకొనఁగా భూమింబడినకిన్నరాంగనంబోలి క్రిందఁ బండుకొనియుండెను. తానేమి చేయవలయునో చక్కఁగా నిశ్చ యించుకొని మెల్లగా గూనిదానికిం దెలిపెను. తనపూనినపని యెట్లు నిర్వహింపఁబడునో యనునను మానమున వగలు పైకొనఁగా దాసిమాటల కులికిపడి యాఁడుఁబాము వలె నిట్టూర్పులుపుచ్చుచు ముహూర్తకాలము తనకు సుఖము గలుగుమార్గ మేదియని యాలోచించి కర్తవ్య మిదికదా యని తీర్మానించుకొని మంథరతో నీవు చెప్పినది న్యాయ్యమే యను కొందునని పల్కెను. తనదేవియందు విశేషాదరముగలదాసి యామెనిశ్చయము నెఱింగి పరమసంతోషమును బొందెను.

కైక యంతట తనపూన్కి నెఱవేర్ప నిశ్చయించి కోప మునఁ గనుబొమలు ముడివడుచుండఁగా నేలపైఁ బండుకొని యుండెను. కార్య మెట్టులైన నగుఁగాక యని యారాణి తా ధరించినపూలదండల విసరివైచి రత్నహారములఁ బాఱవైచి పండుకొనఁగా నవి యందందుఁ బడియుండెను. అవి నక్షత్రము లాకాశమునుబలె నాభూమిని బ్రకాశింపఁజేసెను. ఏవిధమగు

*ఇది పదియవ సర్గమునుండి గ్రహింపఁబడినది. అధ్యాత్మరామాయణ కథాసార మిం దిమిడియే యుండును.

నలంకారములఁ జేసికొనక కోమలములగు వెండ్రుకల నొక్క ముడివేసికొని మలినాంబరమును గట్టుకొని ప్రాణములు వదలి పడియున్న కిన్నరస్త్రీవలె నుండెను.

మహారాజు శ్రీరామునకుఁ బట్టాభిషేకము చేయ నిశ్చయించి యందులకు వలయుపరికరములఁ గూర్ప నేర్పఱచి సభాసదులయనుమతిం గొని తనమనస్సునందు నాముద్దులమూటయగు రామచంద్రునకుఁ బట్టాభిషేకోత్సవము చేయఁబూనుట యందఱకుఁ దెలిసిన దిప్పుడే. ఈవార్త కైకకుఁ దెలియ నవకాశ మెక్కడిది? అని తలంచి యీశుభవార్త నెఱింగింపఁ గైక మిక్కిలి యర్హురాలు. అనుకొని యామె యంతఃపురమునకుం బోయెను. తన్ను గ్రింగఁబూను రాహువుం గూడి తెల్లని మేఘము వ్యాపింపఁగా నున్న యాకాశమును జంద్రుఁడు ప్రవేశించు చందమున నారాజు తనకంతమును గల్పింపఁబూనియున్న కైక వసించియున్న సౌధముం జొచ్చెను. అందు శుకములు లోనగు పక్షులు శృంగారమునకై పెంచఁబడి మనోహరముగాఁ గూయు చుండెను. వాద్యధ్వను లెల్లయెడలఁ జెలరేఁగుచుండెను. ప్రియముగా మాటలాడువా రనేకు లందుండిరి. సొగసుగాఁ బూలతీఁగలుగల పొదరుటిండ్లందందుఁ గనఁబడుచుండెను. విచిత్ర గృహము లాసౌధమునకు నలుదిక్కులఁ గట్టఁబడియుండెను. మంచిదంతములతో రజతకాంచనములతో నలంకరింపఁబడిన యరుఁగులు కనంబడుచుండెను. అకాలమునఁగూడఁ బూలు కాయలు కనంబడ ననేకదోహదక్రియలు చేయంబడుటచేఁ బుష్పములు ఫలములు వృక్షములఁ గనంబడుచుండెను. వాపికలు సరస్సు లాయాయితావుల సొంపుగా నుండెను. ఇంక

నెన్నియో శృంగారవస్తువు లం దమర్పఁబడియుండెను. సకలాభరణభూషితలగు కాంతామణులు తిరుగుచుండుటంజేసి యప్సరస్సమావృతమగు నాకలోకమువలె నానగరు వెలయుచుండెను.

రాజేంద్రుఁ డెంతయు మరులుగొలుపువస్తువుల నలరారు నానగరుఁ బ్రవేశించి యందుఁ దల్పమునఁ దనప్రేయసిం గాంచక యందుఁగలవస్తువులు తనకు నిర్భరానందపారవశ్యమును గల్పింపఁగాఁ బ్రాణనాయికం గాంచక వేడుకకొలఁదు వచ్చినవాఁడగుటఁ గేకయాత్మజా యని పిలిచి యో యను బదులు వినరామికి విషాదమునొందుచు మున్ను తానరుదెంచుతఱికి సకలశృంగారముల నలరుచు నాలేమ సుస్మితముమోముఁ దమ్మిఁ జిందులాడ నెదురుగా వచ్చునదికాన నాఁ డట్లు రాకుండుటకుం గారణ మెఱుంగఁజాలక పరితపించెను. మున్నెన్నఁడు నట్టు లాసౌధము శూన్యముగాఁ గనంబడినదే లేదు. నాఁ డట్లుండుట కతఁడు దుఃఖించెను. కైక తనపనియందే యాసక్తికలదనిగాని భావ్యనర్థముల నెఱుఁగనిదని కాని యతఁ డెఱుంగఁడు. ఎన్నఁడేని కార్యాంతరనిమగ్నయై తన కెదురు రాకయుండ నడుగునట్లే ద్వారపాలకుం గని కేకయరాజకుమారి యెందున్నదని యడిగెను. వాఁడు భయంపడి సంభ్రమమున నంజలింగీలించి మహాప్రభూ! దేవిగారు మిగులఁ గోపించి కోపగృహమునకుం బోయిరని విన్నవించెను.

ముందే కలిగినదుఃఖమునకుఁ దోడు కోపమూనియున్నదని తెలియఁగనే మఱింత విచారముపైకొన నారాజచంద్రుఁడు నిశ్చేష్టుఁడై యప్పుడే కోపగృహంబునకుంబోయి కటికనేలపైఁ బరుండఁదగని కోమలాంగముకల యాప్రేయసి నేలఁ బండు

కొని యుండంగాంచి వగలంబొగిలెను. కపటమున నెట్టిదో యెఱుంగనియారాజు పాపసంకల్పముగల యాకైకం గనెను. వృద్ధుండు తానగుట నవయువతి కైకయగుట కారణములుగాఁ దనప్రాణములకంటె మిన్నగా నామెం దలంచుకొను నారాజు కైకదురూహను దెలిసికొనంజాలకపోయెను. ఛేదింపఁబడిన తీఁగవలె, భూమిపయిం ద్రోయఁబడిన కిన్నరాంగనరీతి పుడమిం ద్రెళ్లిన దేవతచందమున స్వర్గమునుండి భూలోకమునకు జాఱి పడినయచ్చరమిన్నకరణి, నొరుల మోహింపఁజేయఁబూని రూపము తీరుతప్పఁగా నున్నమాయభంగి, వాగురులం జిక్కిన జింకయట్లు, వనమున మృగయుఁడు విషమువూసినబాణమును వైవ నయ్యది మేన నాటుకొనఁగా పడినగజస్త్రీవడువునఁ గైక నేలఁ బండుకొనియుండఁగాఁ గన్నులారఁ గాంచి బాణహతిం బడిన స్త్రీగజమును మగగజమువచ్చి స్పృశించులాగున స్నేహము వృద్ధినొందఁ స్పృశించెను.

తాను గాముకుండగుట నన్నులమిన్నను దామరసాక్షి నాకైకను దడవుచు నిట్లు ప్రశ్నించెను. ప్రాణనాయికా! నీకుఁ గోపము రాఁగతమేమో తెలియఁజాలకయున్నాఁడను. ఎవ్వరే నిన్ను నిందించిరా? అవమానించిరా? తెలుపుమా. శుభాంగీ! భూరజమున శయనించి నీవుండ నాకు దుఃఖము కలుగకయుండునా? నాకు మేలుగోరుచుందువుకదా. ఇది యమంగళకార్యము కదా. నీపై నాకుఁ బ్రేమ మపారము. ఇట్టి నేను బ్రదికియుండఁగా దయ్యముసోఁకినట్లు నీవు క్రిందఁ బండుకొనియుండఁగా నాచిత్తము దుఃఖమున మునుంగకయుండునా? హృదయేశ్వరీ! నీకు వ్యాధి కల్గెనా? దేవవైద్యులవంటి భిషగ్వరులు కలరు. నా

వలనఁ దృప్తులై వారున్న వారు. వారు నీరోగమును దొలఁగించి సుఖము చేకూర్తురు. నీకు మేలు చేసినవాఁడెవఁడు? కీఁడు చేసిన వాఁడెవ్వఁడు? వారికి బదు లేమేమి చేయవలయునని కోరెదవు? తెలుపుమా. నీకోర్కు లందీర్తును. ఏడువనేల? నీవు చెప్పినట్లు నేను జేయకయున్నఁగదా నీ కీదుఃఖము కలుగవలయు? కోమల శరీరము నలయింపకుము. ఎవరినే వధింపఁగోరుదువా? వాని నెఱిఁగింపుము. వాఁడవధ్యుఁడేయైన వధించెదను. నీవెవనినైన రక్షింపఁదలంచితివా? వాఁడు నిక్కముగా వధింప నర్హుఁడే యైన వదలిపెట్టుదును. దరిద్రుని ధనవంతునిగా ధనవంతుని దరిద్రునిగాఁ జేయఁదలంచితివే నట్లు చేసెదను. నేను నాసేవకులు నీవశమునన్నున్న వారమే. ఎట్లు పంచిన నట్టు లొనరింతుము. నీయభీష్టమును దీర్పుపనికై నాప్రాణములు పోయిన నంగీకరించి దానిని సాధింతును. నీయందు నాకుఁ గలప్రేమ మపారమని యెఱుంగుదువుకదా. అట్టులెఱింగియు నాయందేల సంశయము నీకుంగలిగెను? నీవు చెప్పినదాని ఫలింపఁజేసి నీకానందమును గల్గింతును. నిస్సందేహము. అని నాపుణ్యము సాక్షికమని శపథము చేయుదును.

కైకా! మఱొక్కమాట వినుము. సూర్యకిరణములు వ్యాపించునంతదనుక నాయాజ్ఞను శిరసావహించురాజ్యము నాకుంగలదు. అందు నాలుగుదిక్కులయందును సింధు, సౌవీర, సౌరాష్ట్ర, దక్షిణాపథ, దేశములు, అంగ, వంగ, మగధ, మత్స్యదేశములు, కాశీకోసలాదులు నింకను బహుదేశములు గలవు. వానియందు ధనధాన్యకంబలాది బహువిధామూల్య ద్రవ్యములు గలవు. అందేది కావలయునో తెల్పుము. ఇప్పుడే

యితును. నీవు భీరువవు. ఇట్లు నేలంబరుండి యలసటలఁ గుందిన మే లేమి? శుభాంగీ! నేల శయనింప నేటికి? ఇది తగదు సుమీ. లెమ్ము. లెమ్ము. నీకు భయ మేల కలిగెను? నాకుం జెల్పిన సూర్యుఁడు మంచును విరియించురీతి నాభీతిని దొలఁగింతును. అని యిట్టు లనేకరీతుల రాజూఱడింపఁగాఁ గైక తనయప్పటి స్థితికే దుఃఖపడుభర్తను ఇంకను నిర్బంధించి శపథములు చేయించి విశేషించి బాధింపందలంచెను.

మహాశయులారా! మంథరోపదేశము శారద యావేశించినందున ఫలించినట్లే భావింపవలయును. ఈఘుట్టమునుండి మన మెఱుంగఁదగిననీతి యొక్కఁడు కలదు. దానిని మన మెఱుంగవలయును.

"ధీరోఽత్యంతదయాన్వితోఽపి సుగుణాచారాన్వితో వాథవా
నీతిజ్ఞో విధివాదిదేశికపరో విద్యావివేకోఽథవా,
దుష్టానామతిపాపభావితధియాం సంగం సదా చేద్భజే
త్తద్బుద్ధ్యా పరిభావితో వ్రజతి తత్సామ్యం క్రమేణ స్ఫుటం. ౭౨
అతస్సంగః పరిత్యాజ్యో దుష్టానాం సర్వదైవ హి,
దుస్సంగీ చ్యవతే స్వార్థాద్యథేయం రాజకన్యకా." ౭౩
అధ్యాత్మరామాయణము ౨ సర్గము.

ఎంతటివాఁడుకాని దుస్సంగమువలన భ్రష్టుఁడగును. వాని యోగ్యత యెంత మంచిదిగానున్నను దుస్సాంగత్యబలమున నయ్యది వ్యత్యయమగును. కైకవంటి యుత్తమకాంత మంథరావాక్యములకు లొంగిపోయెను. అను నీవిషయము అధ్యాత్మ రామాయణమునఁ గలదు. దానిని మనము చక్కఁగా మది నిల్పుకొనవలయును. కైకయు మంథరయు మహోపకారమును

జేసిరనునది రహస్యార్థము. సామాన్యార్థము పరిశీలింపఁగా మంథర దుర్బోధము చేయఁగాఁ గైక దానికి లొంగెననికదా తేలెడిని. ఎన్ని విధముల చేతను దుస్సహవాసము పనికిరాదనియు, సత్సహవాసము శ్రమించియైనఁ జేయవలయుననియు సారము దీనినుండి మనము గ్రహింపవలయును.

“ప్రియార్హాం ప్రియమాఖ్యాతుం వివేశాంతఃపురం వశీ.”

అని మూలము. పెద్దలసహవాసమున జితేంద్రియుఁడగు దశరథుఁడు ప్రీతికే తగినదనఁగా దనమనస్సునకు ననుకూలించునది యగుకైకనుగూర్చి రామాభిషేకవృత్తాంతమును దెలుపఁగోరి యంతఃపురమును బ్రవేశించెను. “ఉదర్కస్య కాలో బలీ” అన్న న్యాయము ననుసరించి దశరథుని మృత్యువుప్రేరేపించెననియు, నెంతవాఁడైనను గర్మముత్రిప్పులకు లోఁబడక తప్పించుకొనఁ జాలఁడనియు నెఱుంగందగు. ప్రకృతియిష్టము ననుసరించి యాకాలమే దశరథున కాబుద్ధిగలిగించెననియే యిట సిద్ధాంతము.

“అవధ్యో వధ్యతాం కో వా కో వా వధ్యో విముచ్యతాం,
దరిద్రః కో భవత్వాఢ్యో ద్రవ్యవాన్ వాప్యకించనః.”

అను నీమొదలగు దశరథునివాగ్దానములు తెలివితక్కువ కాఁగా వచించినట్లగపడును. కాని యట్లుగాదు. నీవాంఛితము నెంత దుర్లభమైనను దీర్తునని రాజు కైకకుఁ దెలిపెనని యిందలి సారము. కాని మహాపరాధుని వదలి నిరపరాధుని వధింతునని రాజుభావము కాదు.

“అదండ్యాన్ దండయన్ రాజా దండ్యాంశ్చైవాప్యదండయన్,
అయశో మహదాప్నోతి నరకం చైవ గచ్ఛతి.”

అన్న మనుస్మృతి న్యాయము లాదశరథునకుం దెలియనివికావు. తటాలున నిట్టియాగ్రహము రాఁగతంబేమి యని చింతించి యెన్నియోరీతుల నాసపెట్టి యాకోపకారణ మడుగవలయు ననియే రాజుభావము. అవధ్యుని వధింపఁదగునని యామె కోరదని యారాజెఱుంగును. ఎన్నఁడు నట్లు కోరలేదు. అంతియకాక యాకైక విదుషీమణి. దేవాసురసంగ్రామమునఁ దన ప్రాణము కాపాడినప్రియురాలు. ఇన్నియేండ్లనుండి యొక దుష్కార్యమైన నొనరింపని యీపురంధ్రి యిపుడు కుమార్గమునఁ బ్రవర్తించునని యతఁ డెట్లు సంశయింపఁగలఁడు? కనుక నేదియో యొకయమూల్యపదార్థమునో మఱేదియో కోరునని యతఁ డూహించి యిట్టివాగ్దానము లొసంగెనని మనమూహింపవలయు. దశరథుఁడు జల్పములే యాడువాఁడందు రేని రామవియోగరూపసత్యపాశబద్ధుఁ డేల యగును? దశరథునకు శ్రీరామవియోగమునకంటె దుఃఖకర మేదియుండును? దానికిం గూడ నోర్చుకొనెఁగదా. దీనింబట్టియే యారాజేంద్రునకుఁ గల సత్యపరత్వము తేటపడలేదా. ఇన్ని కారణములను సమన్వయము చేసికొని యాలోచించిన నతఁడు ప్రేమాతిశయమునఁ గైకకుఁ గోపాటోపోపశమనము చేయఁబూనియే యిట్లు మాటలాడెనని మన మెఱుంగుట సముచితము. అంతియకాని దశరథుఁడు కాముకుఁడని దూషింపరాదు. "స కామబలసంయుక్తః" అని యున్నదికదా యందురేని ధర్మపత్నియం దనురాగము మిక్కిలి యుండుట న్యాయ్యమే. దానిచే నన్యాయమునఁ బ్రవర్తించునుగదా యని యూహాలపై నూహాలుచేయుట యసంగతమేకాని న్యాయసంగతము కాదు.

ఈవిషయమున నధ్యాత్మరామాయణముకూడ నీయభిప్రాయమునే తెలిపినది.

"తథోక్తా సా సమాశ్వస్తా వక్తుకామా తదప్రియం,
పరిపీడయితుం భూయో భర్తారముపచక్రమే."

అని మూలము. కైకభావ మీమూలమున వెల్లడియగును. ఆమాటలకే యూఁటడిల్లెను. ఆయప్రియవార్త ననఁగా రామ వనవాసమును దెలుపఁబూనెను. ఏల? బాధింపవలయునన్న కోర్కి చేఁగాదు. దశరథుఁడు చిన్నతనమునఁజేసిన మునికుమార వధరూపపాపకర్మ మాసన్నమై కైకను బ్రోత్సహించెను. పుత్త్ర శోకమునఁ దుదిఁగాంతువనికదా మునికుమారుని పెద్దలశాపము. అది ఫలించుకాల మాసన్నమయ్యెను. కైకమూలముననేకాని యాఫలము కలుగ వలనుపడదయ్యెను. కావున నాదుష్కర్మము మఱింత యాకైకను బురికొల్పసాగెను. దేవతలు మునులు మనశ్శక్తి నుపయోగించి వాగ్దేవి నభ్యర్థించిరి. ఆమె యావహించెను. మహామాయ తనకార్యక్రమమునఁ గైకను మంథరను బ్రధానముగాఁ జేసికొనియే యిట్టి లీకార్యము సాగవలయు నని తలంచెను. ఆదేవితలంపు వ్యర్థముకాదుకదా. హరిహర బ్రహ్మాదు లుత్తమాంగములఁ దదాజ్ఞను ధరింతురన నిఁకఁ గైకమాట యిటఁ జెప్పనేటికి? ఇన్నియు నొక్కసారి యాకైకను వశపఱచుకొని తమతలంపుల నామెమోమునుండి తెలుపవలయునని యెంచెను. కనుక

"పరిపీడయితుం భూయో భర్తారముపచక్రమే."

అన్న మహాకవివాక్కు ననుసరించి యీావఱకే తననిమిత్తము దుఃఖించుచున్నాఁడని యెఱింగియు నింకను సంతాపములు

పాలు చేయఁబూనెనని మనము గ్రహింపవలయును. ఇట్లు లీఘట్టమునఁ గైకయాశయమును గ్రహించినఁగాని యాయాదిమ దంపతుల యుదారాశయములు మనబోంట్లకుఁ దేటగ బోధపడవు. పక్షపాతము దుర్మతాభిమానము వదలి శ్రద్ధాభక్తులు వెలయ నీచరిత్రమును బఠింపవలయును. ఇఁకఁ దరువాతి వృత్తాంతమును జక్కఁగాఁ బరిశీలింతము.

కైక దశరథుని వరముల నడుగుట.

* కామబాణములచేఁ గొట్టఁబడి దానివేగమును నెదుర్కొనఁజాలక లోఁబడి దానిమార్గమునే యనుసరించుచుండు నాదశరథునిం బరికించి దారుణవాక్కును జెప్పందలంచి యిట్లు పలికెను. ప్రాణేశ్వరా! వ్యాధి నన్నంటలేదు. ధనము నాకక్కఱలేదు. ఎవ్వనిమూలమునను నాకవమానము సంభవింపలేదు. నాకొకకోరిక గలదు. దానిని సఫలముగాఁ జేయుదువనియే కోరుచున్నాను. అందులకు నీవిష్టపడుదువేని యాడినమాట తప్పనని శపథము చేయుము. తరువాత నావాంఛితమును దెలుపుదును. అని కైక పలుకఁగా నారాజు నీవు చెప్పినట్లు చేయ సిద్ధముగా నుండఁగా శపథము గోరుటేల? ఎంత పిఱికిదానవు? అనుకొనుచు నించుక దరహాసము మోమునఁ గన్పడఁగా శుచిస్మితయగు నాకైకముఖమును దనవంకకుఁ ద్రిప్పుకొని మృదుతమ కేశపాశము నిమురుచు నిట్లు పలికెను.

లోకజ్ఞానము చక్కఁగాలేని యోప్రేయసీ! ప్రియురాండ్రలో నీకంటె నెక్కుడుప్రేయసి నాకు లేదని నీవెఱుం

---

* ఇది పదునొకండవ సర్గమునఁ గలదు. అధ్యాత్మరామాయణమున మూఁడవ సర్గమునఁగల కథాసారముకూడ నిందు నుండును.

గదా? పురుషులలోఁ బురుషోత్తముఁడగు రామునికంటెఁ బ్రేమాస్పదుఁడు నాకు లేఁడు. శత్రువుల కెవ్వరికి గెలువఁదరము గాక నాకత్యంతప్రీతిపాత్రుఁడై ప్రాణములకంటె నధికుఁడై మహాత్ముఁడై నాజీవితమునకు నాధారభూతుఁడు నగువాఁడు రామచంద్రుఁడు. అట్టి రామునిపై బాస చేసెదను. నీవేమికోరుదువో తెల్పుము. నెఱవేర్తును. ఆరాముని జూడకయున్న ముహూర్తమైన బ్రదుకంజాలను. అట్టి రామునిసాక్షిగాఁ బలికెదను. నీమదిఁ గలకోర్కి తెలుపుము. తప్పక నెఱవేర్తును. నా దేహమునకంటెఁ దక్కినకొడుకులకంటెఁ బ్రియబంధువులకంటె నేనెవ్వని నెక్కుడుగఁ బ్రేమింతునో యారామభద్రునిపై నొట్టుపెట్టి పలికెద. నీవాంఛయేది? సౌభాగ్యవతీ! ప్రాణాధికుఁడగు శ్రీరామమూర్తిపై నొట్టుపెట్టి నీకు మాటయిచ్చునంతటిప్రీతి నీయందుఁగల నాహృదయము నెఱింగియు నాడిన మాటఁ దప్పక తీర్తునని దృఢవిశ్వాసముకలదానవై నీకోరికఁ దెలిపి నన్నీశోకమునుండి యుద్ధరింపుము. జీవించునట్లు చేయుంమా. నామనోవాక్కు లేకరీతిగా నుండుట గాంచియైన నేది మంచిదని నీవు తలంచితివో దానిం దెలుపుము. నాప్రేమము నీయం దెంతయో నీవే యెఱుంగుదువుకదా. ఏల సంశయించెదవు? దానిని వదలిపెట్టుము. నీవాంఛితము నెఱవేర్చి యానందమును గల్గింతును. ఇట్లు సేయుదునని నాసుకృతరాశిపై నొట్టుపెట్టి చెప్పుచున్నాను.

ఇట్లు ప్రాణనాథుఁడు ప్రతిజ్ఞ లెన్నియో చేయఁగా విని యాకైక తనపట్టినకార్యము నెఱవేర్ప బద్ధకంకణురాలుగావున నతనిశపథములను విని సంతోషమున భరతునియందుఁ గల

యభిమానము పెంపున మోమోటమి మాని శత్రువైనఁ జెప్ప జంకునట్టి దారుణవార్తను దెలుపంబూనెను. ఆవాక్యము మృత్యుదేవతకంటెఁ గ్రూరమైనది. మరణభీతిని గల్గించునది. దానిని దెలుపఁబూని యిట్లు పలికెను. మహారాజా! నీవు వరుసఁగా జేసినశపథములు నాకిచ్చినవరములు నగ్నిప్రముఖులగు ముప్పదిమూఁడుకోట్ల దేవతలు విందురుగాక. చంద్రుఁడు, సూర్యుఁడు, కుజాదిగ్రహములు, నాకాశము, దివారాత్రములు, దిక్కులు, స్వర్గమర్త్యములు, గంధర్వులు, రాక్షసులు, నక్తంచరములగుభూతజాలములు, గృహముల నాశ్రయించి యుండుకులదేవతలుఁ, దక్కఁగలవివిధభూతములు నీ యీ సత్యవాక్యములను సాక్షిభూతులై యాలకింతురుగాక. ఓసర్వగీర్వాణులారా! సత్యసంధుఁడు, శౌర్యధుర్యుఁడు, ధర్మవేత్త, సుసమాహితుఁడు నగునీరాజు వరమిచ్చినవిధమును మీరాలకింతురుగాక. ఇట్లు లాదేవి చాపధారులలో మేటియైనయా రాజును దనవశముచేసికొని శపథములు చేయించి దేవతలనెల్ల సాక్షులుగా నుండునట్లు ప్రకటించి కామవశంగతుండగు మగనితో నిట్లు పలికెను.

మహారాజా! తొల్లి దేవదానవసంగ్రామమునందు నడచినవార్తను స్మరింపుము. అందు నడుమ శత్రువగు శంబరాసురుఁడు నీప్రాణములు తీయకపోయిన నంతటిపనిచేసి నిన్ను మూర్ఛపుచ్చెఁగదా. ఏమఱుపాటులేక నేను నిన్ను సంరక్షించితిని. అందులకు సంతోషించి నాకు రెండువరము లిచ్చితివి. ఆవరముల నీకడనే యుండనిచ్చితిని. దాఁచిపెట్టియున్న యా వరముల నిప్పుడడుగుచున్నాను. రాజేంద్రుఁడు; సత్యరక్షకుఁ

డవు. కాన వానిని నాకు నిత్తువని యాచించుచున్నదానను. వాని నీయవేని యిపుడే ప్రాణముల వదలుదును. ధర్మమును గాపాడని నీకడ బ్రదికియుండుటకంటె మరణమే నాకు శ్రేయస్కరంబగు. ఆమాట చెవుల సోఁకినంతనే విభ్రాంతుఁడై వేఁటకానిమోసపుఁగూఁత విని నమ్మి వలలోఁ దగులుకొనిన జింకరీతిగా స్వవినాశార్థము వరముల నిత్తునని యంగీకరించి ధర్మపాశమునం జిక్కుపడెను.

కైకయు నికామకామమోహితుఁడై వరముల నీయఁ బూనియున్న రాజుం దిలకించి ప్రాణనాథా! పూర్వము నాకిచ్చిన వరము లిట్టివని తెలిపి వాని నిచ్చువిధమును దెలిపెదను. ఆలకింపుము. శ్రీరాము నభిషేకింప సమకట్టినవస్తువులచేతనే నా కుమారుఁడు భరతున కభిషేకము జరపవలయును. ఒకవరమిది. ఆనాఁడు ప్రాణమును రక్షించితినన్న సంతోషమున నాకిచ్చిన వర మడుగుసమయ మిదియే. రామమూర్తి పదునాలుగు సంవత్సరములు దండకారణ్యమున వసియించి వల్కలములఁ దాల్చి జింకచర్మములను జడలను ధరించి తాపసుఁడుగ నుండవలయు. రాముఁ డడవుల కిపుడే పోఁగా శత్రువులులేని యీరాజ్యమును భరతుఁడు యువరాజుగనుండి రక్షింపవలయు. ఆలసింపరాదు. ఇదియే రెండవవరము. క్రొత్తవరముల నడుగలేదు. మున్నిచ్చినవానినే యిపుడడుగుచున్నాను. న్యాయవిరుద్ధముగా నిన్నడిగి నిర్బంధింపలేదు. రాముఁ డడవులకుంబోవఁగా నిపుడే చూడఁగోరుచున్నదానను. నీవు రాజరాజని, సత్యసంధుఁడని ప్రఖ్యాతిం గాంచితివి. ప్రతిన సత్యముగాఁ జేసి కులమును, శీలమును, జన్మమును రక్షించుకొనుము. ఊర్ధ్వలోకమున నివ

సింపఁగోరినయెడల సత్యమునకంటె హితమగు నుత్తమసాధనము లేదని తపోధనులు చాటుట యెల్లరెఱుంగుదురుకదా. అని పలికి యూరకుండెను.

మహామతులారా! కైకచేయఁదగినపని నెఱవేర్చెను. దేవతలు లోనగువా రానందింతు రనవలసినదే. ఇదియే మూల ప్రకృతియగు సీతాదేవితలంపు. శ్రీరామమూర్తి యీవిధ మంతయుంగాంచుచు నూరకుండును. ఒక్కమాటనైన ననఁడు. కదలఁడు. ప్రకృతి యాడించినట్లు లాడుచుండును. అట్టులని యాప్రకృతి స్వతంత్రురాలు గాదు. భగవదిచ్ఛానుసారము మెలఁగును. ఆమహనీయునితలంపు నెఱింగి యించుకంతయుఁ దప్పకయుండ నెఱవేర్చును. ఆమెప్రయత్నమును హరిహర విరించిప్రభృతు లెఱుంగఁజాలరనక తప్పదుగదా. ఇట్టులుండ మంథరగాని కైకేయిగాని యేమి చేయఁగలరు? లోకులు కొందఱు వారిరువురను దూషింతురు. కాని యది యాలోచించి చేయనిపని. వారిరువురిమూలమున లోకమునకు మహోపకారము కలిగినదని వారిని వినుతింపవలయునుగదా.

"తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధం,
మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్."

అను శ్రీకృష్ణోపదేశము ననుసరించి మంథరయుఁ గైకయు నిమిత్తమాత్రముగా నున్నవారలేకదా. విరాధాదులు శాపాంతమునఁ జావవలసినవారు. కర్మవశమునఁ జచ్చినవారు నగుదురు. శ్రీరామవనవాసయాత్ర యెట్టులైనను సాగవలసినదే. అవతారఫల మదియే. రామచంద్రవనవాసకాలమున నుండువారలలోఁ గొందఱుపామరులు వారిని దూషించినను సకారణముగనే

యుండును. ఈకాలమున రామాయణమును జదివినవారు వారి దూషించుటయే చమత్కారముగ నుండును. ప్రకృత మనుసరింతము.

కైక దశరథుని గామవశంగతునిగ భావించి మెల్లఁగా శపథము చేయింప నెంచి నామనోరథమును దీర్తునని శపథము చేసినఁ జెప్పెదుననెను. అంతమాత్రము మాటలాడినదే చాలునని కాలము పురికొల్పుచుండఁగా నతఁడు శపథములఁ గొన్నింటిం జేసెను. దైవవశమున నవి రామావతారఫలమును దశరథునిమరణమును దెలియఁజేయునవిగ నయ్యెను. ఆవిధ మెఱుంగుదము.

"తేనాజయ్యేన ముఖ్యేన రాఘవేణ మహాత్మనా,
శపే తే జీవనార్హేణ బ్రూహి యన్మనసేచ్ఛసి."

ఇది తొలిశపథము. విశ్వామిత్రుఁడు వచ్చి యడిగినపుడు రాముఁడేమియు నెఱుంగఁడని చెప్పినదశరథుఁ డిపుడు రామునిం బొగడుచున్నవాఁడు. దానియర్థమును బరిశీలింతము. "మహాత్మనా"అనునది కొడుకుంగూర్చి చెప్పఁదగినది కాదు. మహాత్ముఁడనఁగాఁ బక్షపాతరహితమతిగదా యర్థము. అట్టివాఁడు భగవంతుఁ డొక్కఁడే. "జీవనార్హేణ" ప్రాణములకంటెఁ బూజ్యుఁడని యర్థము. అనఁగాఁ బ్రాణములకంటె నెక్కుడుగా భావింపఁదగినవాఁడని భావము. అట్టి రామమూర్తి సాక్షియై యుండుఁగాక. నా ప్రతిన చెల్లింతును. కైకా! నాకుంగల ప్రియతమవస్తువులలోనెల్ల శ్రీరామచంద్రుఁడనుపమవస్తువు. దానినే ప్రేమించుచున్నాఁడను. నేను బ్రేమింపఁదగినవస్తు వీలోకమున లేదు. ఒక్క శ్రీరామమూర్తినే ప్రేమింతును. అనువాక్యమునందు

నిహాసుఖములు తీఱినవి. పరసుఖమునే కోరుచున్నాఁడను. అందుల కాధార మాశ్రీరామమూర్తియే యనునభిప్రాయ మిమిడియున్నదని యెఱుంగవలయు.

"యం ముహూర్తమపశ్యంస్తు న జీవేయమహం ధ్రువం,
తేన రామేణ కైకేయి శపే తే వచనక్రియాం."

అనునది రెండవ శపథవాక్యము. రాముని జూడక ముహూర్త కాలమైన జీవింపననుట సత్యము. అట్టిరామునితోడుగాఁ జెప్పుచున్నాను. అనఁగా రాముఁడు వెళ్లినపిదప బ్రదుకననుట సత్యమని దశరథుఁడే తెల్పుకొన్నాఁడు. అంతటిప్రేమాస్పదుఁడనికదా యర్థమని కొందఱందురేమో. యది నిజమే. కాని యీప్రతిజ్ఞలధోరణింబట్టి యాలోచించిన నతఁ డెఱుంగక యుండ నాయర్థముగలమాటలు వెడలివచ్చినవని యూహించుట పొరపాటుగాదు.

"ఆత్మనా వాత్మజైశ్చాన్యైర్వృణేయం మనుజర్షభం,
తేన రామేణ కైకేయి శపే తే వచనక్రియాం."

అనునది మూఁడవ శపథము.

"సర్వాన్ పరిత్యజ్యాపి రామమేవ పరిగృహ్ణామీత్యర్థః."

అని గోవిందరాజులు.

"ఆత్మానమితరానాత్మజాంశ్చ విహాయాపి యో వరణీయ స్తేన రామేణేత్యన్వయః."

అని మహేశ్వరతీర్థులు. ఈదేహమును భరతాదిపుత్త్రులను ఇతరబంధువులనుగూడ వదలి రామునే ప్రేమింతుననఁగా నిఁక నీలోకములోనివారితోడి సంబంధము చాలును. శ్రీరామునే

విశ్వసింతును. అని ప్రయత్నము లేకయే దశరథునినోటనుండి వచనములు ఆగామిఫలమును దెలుపుచు వెడలెననియే యుండలిసారము. ఈయర్థమును దృఢపఱచు వేఱొకశ్లోకముం బరికింపుఁడు.

"భద్రే హృదయమప్యేతదనుమృశ్యోద్ధరస్వ మే,
ఏతత్సమీక్ష్య కైకేయి బ్రూహి యత్సాధు మన్యసే."

అని మూలము. భద్రే యనుసంబుద్ధి కర్థమేమి? మేలుకోరు దానా. లోకక్షేమము కోరుదానా యని భావము. నాచెప్పిన యభిప్రాయమును విమర్శించి నాచేసినప్రతిజ్ఞల నాలోచించి నన్నుద్ధరింపుము. ఏది మంచిదని నీకుఁ దోఁచునో దానిం దెల్పుము. అనఁగా నాజీవితమున నీకుఁ గల్గులాభము గొప్ప యనుకొందువో, లోకక్షేమమును గొప్పగా భావింతువో యాలోచించి పలుకుము. ఎట్టులైన నన్నుద్ధరింపుము. అనఁగా నన్నుద్ధరించుభారము నీపై నాధారపడియున్నది. నాకుఁగల శాపము బలవత్తరము. దానిని దీర్చుపనికి నీవే యాధార భూతురాలవు. కావున నీకోరికను దెలిపి నన్నుద్ధరింపుమా యని దశరథునిభావమని ప్రతిజ్ఞలధోరణింబట్టి మన మూహింప వచ్చును.

"ఉద్ధరేదాత్మనాత్మానం నాత్మానమవసాదయేత్,
ఆత్మైవ హ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః. ౫
బంధురాత్మాత్మనస్తస్య యేనాత్మైవాత్మనా జితః,
అనాత్మనస్తు శత్రుత్వే వర్తేతాత్మైవ శత్రువత్." ౬
(గీత ౬ అధ్యా.)

అను గీతావాక్యముల ననుసరించి యోజించిన నిది విరుద్ధము

కాదా యందురేని దశరథునకుఁ బుత్త్రదుఃఖముననే మృతి గలుగవలసినట్లు శాపము కలదు. అయ్యది కైకమూలమున ఫలింపవలయును. ఆకర్మము బలవత్తరము. ఫలము నీయక మానదు. కావున నీవుద్ధరింపుమా యని కైకను రాజు కోరుట సుసంగతమే కాని యసంగతము కాదని యెఱుంగవలయు. ఈ భావమును సమర్థించుపై శ్లోకమును బరిశీలింపుఁడు.

"బలమాత్మని జానంతీ న మాం శంకితుమర్హసి,
కరిష్యామి తవ ప్రీతిం సుకృతేనాపి తే శపే."

అని మూలము. నీయందు నాకుఁ గలప్రేమాతిశయము నెఱింగియు నేల యనుమానించు చున్నదానవో తెలియఁజాల కున్నాను. నీకు దేనఁ బ్రీతి కలుగునో యద్దాని నొనరింతును. అని నాసుకృతము సాక్షిగాఁ జెప్పుచున్నాఁడను. అని దశరథుఁడు పలికెను. మనమెవ్వరిని ప్రేమింతుమో వారు మనలఁ బ్రేమింపవలయును. అనఁగా మనకుపకారము చేయవలయునని భావము. అట్లుగాదేని ప్రేమమునకు ఫలమేమి? మాటలలాభమే లాభమా. కాదుకదా. ఇంతకాలము నిన్నుఁ బ్రేమించి నీ యిష్టానుకూలముగాఁ బ్రవర్తించితిని. కైకా యిప్పుడు నాకు మహోపకారము చేయుమా. నీకుఁ బ్రీతిని గల్పింతును. అనఁగా నీవు కోరుకార్యమును నాపుణ్యములసాక్షిగాఁ జేయుదును జుమీ యని రాజు పలికెను.

కైకా! చిరకాలము జీవించితిని. నీవలన సకలసుఖములనుభవించితిని. శ్రీరామమూర్తి మహాత్ముఁడని యెఱింగితిని. జరాభారము దుర్భరమైనది. తనుధారణము బరువుగాఁ దోఁచుచున్నది. శాపము ఫలింప సిద్ధముగా నున్నది. నిమిత్తమేదియే

నుండవలయును. నీమేలుమాత్రమే చూచుకొనక జగత్కల్యాణమే స్వమంగళమని భావించి నన్నుద్ధరింపుమా యని దశరథుని వాక్యములయందు సార మిమిడియున్నది. బుద్ధిపూర్వకముగా నతఁడు పలికినట్లు భావింపకయున్నను కర్మము ఫలమునీయ నెదురుచూచుచున్నది. కావున దాని కనురూపముగా బుద్ధి మాఱుచుండునని నీతిశాస్త్రము తెలుపుచున్నందున నీభావము గలమాట లాతనినోటనుండి వెడలెనని మన మెఱుంగుటయే న్యాయ్యము. కర్మసిద్ధాంత మిట్టిదియే. అట్లు భావింపక కైక పతివ్రత కాదు. క్రూరమతి. దుశ్శీలముకలది యని దూషించిన నది క్రమముగా శ్రీరామమూర్తికిం జెందఁగలదు. అట్టిపాప కార్యము మనము చేయరాదు. కావునఁ గర్మమే యాతని నట్లు పలుకఁజేసినదని కైక నట్లు పురికొల్పినదని మంథర నా రీతిగాఁ బ్రోత్సహించెనని మనము నిశ్చయించుకొనుట సముచితము.

శ్రీరామమూర్తి యేకార్యము లొనరింప నవతరించెనో దాని కనుకూలముగాఁ గైక వరముల నడిగెను. దశరథుని మాట లనఁగా శపథవాక్కులు అగ్నిలోనగు దేవతలు విందురు గాక యని ప్రార్థించెను. ఈప్రార్థనము మనకొక్కనీతివిశేషమును బోధించును. మానవుఁడు చేయుపాపములను గొందఱు మానవులే యెఱుంగుదురు. కొన్నింటి నెఱుంగఁజాలరు. అగ్ని మొదలగు దేవతలు మనోదోషములంగూడ నెఱుంగుదురు. కొందఱు మనముచేయుమోసము నితరు లెఱుంగఁజాలరని యానందించి గర్వింతురు. ఆగర్వము తమకే హానికరమని యెఱుంగరు. ఇతరుల వంచించితినిగదా యని యానందించుట

యనఁగాఁ దన్నుఁ దానే వంచించుకొంట ననుకొనుటయే కదా.

"అంతఃప్రచ్ఛన్నపాపానాం శాస్తా వైవస్వతో యమః."

అన్నసూక్తి న్యాయ్యమేకదా. కావున సూర్యచంద్రాదులు సాక్షిభూతులన్నమాట నమ్మి మనస్సున దుష్టాలోచనములు చేయరాదని మనము తెలిసికొనవలయును. ఈనీతిని వాల్మీకి మహర్షి లోకులకుం గైకమాటలమూలమునఁ దెలియఁజేసిరని మన మూహింపవలయును. మనము చమత్కృతిగా లోకులను మోసపుచ్చితి మనుకొనువారు తమనాశనమునఁ బ్రవర్తించితి మని యెఱుఁగనంతమూఢులని తలంపందగును.

"అద్యచైవ హి పశ్యేయం ప్రయాంతం రాఘవం వనం."

అను కైకవాక్యమును గనుంగొనుఁడు. ఇపుడే రాముఁ డడవికింబోవుచుండఁగాఁ జూడఁగోరుచున్నదాన ననికదా యర్థము. దశరథునిశాపఫల మగుమృత్యువు కైకను మఱింత ప్రోత్సహించుచున్నది. రెండుదినములలోఁగా నతఁడు మృతుఁడగును. ఆదుఃఖము ననుభవింపవలయును. కాన నాలసింప రాదని యామెకుం దోఁచునట్లు కర్మమే యొనరించెను. దీనిం బరికించినయెడఁ గర్మసిద్ధాంతమహత్త్వము నెఱింగి యంతతోఁ దృప్తినొందక సత్కర్మములను ఫలముఁ గోరక యాచరించి భగవదర్పణము చేయవలయునని నిర్ణయించుకొనందగు.

"స రాజరాజో భవ సత్యసంగరః కులం చ శీలం చ హి రక్ష జన్మ చ,
పరత్ర వాసే హి వదంత్యనుత్తమం తపోధనాస్సత్యవచో హితం నృణాం."

అని కైక పలికెను. కైకవాక్యములమూలమున వాల్మీకిమహర్షి

సత్యపరత్వము ప్రధానమని మనకు బోధించెను. అసత్యము సర్వధర్మనాశనము చేయంజాలును.

"న విస్మయేత తపసా వదేదిష్ట్వా చ నానృతం,
నార్తోఽప్యపవదేద్విప్రాన్న దత్వా పరికీర్తయేత్. ౨౩౬
యజ్ఞోఽనృతేన క్షరతి తపః క్షరతి విస్మయాత్,
ఆయుర్విప్రాపవాదేన దానం చ పరికీర్తనాత్. ౨౩౭
ధర్మం శనైస్సంచినుయాద్వల్మీకమివ పుత్తికాః,
పరలోకసహాయార్థం సర్వభూతాన్యపీడయన్. ౨౩౮
(మను. ౪ అధ్యా.)

అను స్మృత్యర్థమే రామాయణము తెలుపుచున్నది. రాజా! సత్యప్రతిజ్ఞుఁడవు కమ్ము. దానిచే నీకులమును, శీలమును, జన్మమును గాపాడుకొనుము. పరలోకమునకు సత్యమునుమించి నది సహాయపడునది లేదనికదా యర్థము. ఒక్కసత్యమును గాపాడుకొనినఁ గులమును గాపాడుకొనిన ట్లగును. శీలమును రక్షించుకొన్న ట్లగును. జన్మమునుగూడఁ గాపాడుకొనిన ట్లగును. కావున సత్యమును పచించితివి. దానిని గాపాడుకొమ్మా యని కైక రాజును హెచ్చరించెను. దీనిచే నాకాలమున సత్యముపై నెంతయాదరము కలదో యెట్టివిపత్తులందును దాని నెట్టు లాదరించిరో దీనిమూలమునఁ దెలిసికొనవచ్చును. మహాశయులారా! ఈభాగము మనకు సత్యాదరమును బోధించుచున్నది. కర్మము బలవత్తరమని సూచించుచున్నది. భగవంతునాశయము తప్పక ఫలించునన్నవిషయమును దృఢపఱచుచున్నది. కావున మన మీభాగమును జక్కఁగాఁ బఠించి విశేషార్థములను గ్రహించి వ్యర్థముగఁ గైకను మంథరను

దూషింపక వారిమూలమున దేవతలకు, మునులకు, జనులకు ధర్మమునకుఁ గలుగఁబోవుమహోపకారమును స్మరించి వారిని గీర్తింపవలయును. ఇఁకఁ దరువాతిభగవచ్చరిత్రమును బరికింతము.

దశరథుఁడు దుఃఖించుట.

* దశరథుఁడు కైకమాట విన్నంతనే పిడుగుపడిన యట్లు భావించి చింతాసాగరమున మునిఁగి ముహూర్తకాలము మూర్ఛిల్లి తనలో నక్కటా ! కైకవంటిసాధ్వి యిట్టిపరుష వాక్యములాడునా. ఇదేమి స్వప్నమా. నిద్రపోనందున దాని కవకాశమేది? చిత్తవిభ్రాంతినొందితినా? నిష్కారణముగా నది యేల కలుగును? జన్మాంతరానుభవ మిత్తఱి స్మృతిగోచరమగుచున్నదా? ఇంతటిఘోరమగు ననుభవము జన్మాంతరమందును గలుగఁగలదా? రోగవికారము మనస్సునఁ గలిగెనా? వీనిలో నేదియుండును? అని తలఁచి నిశ్చయింపఁజాలక సుఖము నొందఁ జాలకయుండెను. కొంతసేపటికి తెలివిరాఁగా వ్యాఘ్రినిగన్న జింకవలె దుఃఖమున నవయవములు పరితపింపఁగా వట్టినేలఁ గూరుచుండి పాములవానిమంత్రమండలమునఁ గట్టఁబడిన విషసర్పమువలెఁ గదలఁజాలక వేఁడినిశ్వాసవాయువుల వదలుచు నిర్భరకోపము ప్రజ్వరిల్లఁగా నిస్సీ! యని పలికి మరల మూర్ఛిల్లెను.

మరలఁ దెలివిరాఁగాఁ గోపము దావాగ్నివలెఁ జెలరేఁగఁగా దానఁ గన్ను లరుణవర్ణములై యొప్ప నాకన్నులచే

---

* ఇది పండ్రెండవ సర్గమునఁ గలదు. అధ్యాత్మరామాయణవిషయసార మిందుండును.

దహింప నెంచునట్లు చుఱుకుఁజూపులఁ బర్వఁజేయుచుఁ గైక తో నిట్లనియెను. క్రూరురాలా! దుశ్శీలవుకదా. కులపాంసను రాలా! పాపమతీ! రామచంద్రుఁ డేయపరాధము నీకు నొన ర్చెనే? నేనేమి పాపము నీకుఁ గల్పించితిని? తల్లికి శుశ్రూషలు చేయునట్లు రాముఁడు నీకు సేవలు చేయుచున్నాఁడుకదా. అట్టి వాని కీయపకారము చేయఁబూనితివికదా. ఏటి కీపాపము చేయఁబూనుట? రాజకుమారివని భావించి క్రూరవిషభుజంగిని వలె వివేకముచాలమి వినాశార్థమే యింటిలోనికిఁ బ్రవేశపెట్టి తిని. తిర్యగ్జంతువులుకూడ శ్రీరామునిగుణములఁ బొగడు చుండఁగా నాముద్దులకుమారు నేమితప్పుచేసెనని పొగనంపు దును? కౌసల్యాసుమిత్రలను, రాజ్యలక్ష్మిని దుదకు నాప్రాణ ములనైన వదలుదునుగాని పితృవత్సలత విలసిల్లు నాప్రియ పుత్త్రుని రామమూర్తిని విడువను. నిజము. జ్యేష్ఠకుమారసంద ర్శనమున నాతనువెల్ల నుప్పొంగును. రాముని జూడకయున్నఁ బ్రాణములు నిలువవు. సూర్యుని వదలి లోకముండునుగాక. సస్యము జలమువదలి యుండుఁగాక. రాముని వదలి నాప్రాణ ములు క్షణమైన నిలువవు. ఎంతపాపమునకు నంగీకరించితివి? పాపమతీ! నీవు నిశ్చయించినభావము నాప్రాణములఁ దీయును. కనుక నింతదనుకఁ జాలుచాలు. వదలుము. నీకు నేను భర్తనన్న కారణమున సంశయించుచున్నాను. నీపాదములను నాశిరము సోఁక నమస్కరింపుమనియెదవా? తెలుపుము. అప్పుడైన నీ దుర్వృత్తిమాని కరుణంజూపుమా. దుష్టచిత్తురాలా! ఇట్టిఘోర తరమగు నభిప్రాయమేల నీకుంగలిగెనో. భరతునియందుఁ బ్రీతి గలదా లేదాయని తెలిసికొనఁగోరెదవా? అదినిజమైన నీవాంఛ

మంచిదేయగుంగాక. అట్టులేయైనను నీకు రామభద్రునందుఁ బ్రీతితగ్గుట కేమియు హేతువగపడదు. నన్నుఁ బరీక్షించుటకే నీవిట్లడిగియున్న రాజ్యము భరతున కిమ్మని యడుగవచ్చును. అంతియగాని శ్రీరాము నరణ్యములకుంబంపుమని యడుగ నవకాశమేది?

కైకా! నీవింతకుముందు నాతో నెన్నియోపర్యాయములు "శ్రీరాముఁడు నాకుం దొలికుమారుఁడు. శ్రీమంతుఁడు. ధర్మశ్రేష్ఠుఁడు" అని చెప్పితివికదా. ఆమాటలన్నియు నిజములు కావని యిపుడు తలంతును. నేవార్థము రామునిపైఁ బ్రీతియున్నట్లు పలికితివని యూహింపఁదగియున్నది. రామాభిషేకవార్త నాలకించి దుఃఖమొంది నన్నును శోకసంతప్తునిగ నొనరించి బాధించుచున్నావే? కనుకనే యొరులమాటలకు లోఁబడి శూన్యమగు కోపగృహమును బ్రవేశించితివి. అదృశ్యరూపములుగల పిశాచములు నిన్నావేశించియుండును. కనుకనే యిట్లు త్వరపడి మాటలాడితివి. నీవింతకాలము నీతిమంతురాలవుగ నుంటివి. ఇట్టి నీవిక్ష్వాకువంశమునకు వచ్చియు నిట్టివిపరీతబుద్ధి పుట్టుటంజేసి యీవంశమునకే మహానర్థము గల్గినది. నీవెప్పుడు గాని యయుక్తము నప్రియము నగుకార్యమును జేయలేదు. కనుక నిపుడిట్టికార్యమును జేయుచున్నదానవని నమ్మఁజాలకున్నాను. బుద్ధిమంతుఁడగుభరతునితో రాముఁడు నీకు సమానుఁడేకదా. ఇట్లే నీవు నాకుఁ దెలుపుచుంటివి. నీవు చిన్నతనమునఁ గృత్రిమబుద్ధితో నిట్టులంటివని యూహింపఁ గారణము లేదు. పెక్కుసారు లీయభిప్రాయమునే తెలిపితివిగాన బుద్ధి

పూర్వకము గాదని యనుకొనఁ గారణము లేదు. ఈపాడుమాట నీవు వచింపఁదగినది కాదు.

దేవీ! ధర్మమువిూఱ జంకుదానవు. ఆభయ మిపు డెందుఁ బోయెనో. సత్కీర్తి సంపాదించి నీకృపకుఁ బాత్రుఁడై ధర్మాత్ముఁడయియున్న శ్రీరాముని బదునాల్గుసంవత్సరము లడవుల నుండఁ బంపుమని యడుగుట ధర్మము నెఱింగిన నీకు నెట్లు బాగని తోఁచినది? రాముఁడు సుకుమారుఁడు. ధర్మమార్గమున దృఢనిశ్చయముకలవాఁడు. అట్టి రామచంద్రుఁడు ఘోరారణ్యముల వసింపఁదగునని నీకెట్లు హితముగాఁ దోఁచెనో! రాముని సౌకుమార్యాదులంబట్టి నీమనస్సు కరఁగకున్న మానె. ఆతఁడు నీకుఁ గావించినశుశ్రూషలంబట్టియైన నాసుందరాకారుని దేశమునుండి తఱిమివేయవలయునని నీవు కోరుటకుఁ గలహేతువు లేదే. భరతునికంటె రాముఁడు మిక్కిలి నిన్ను సేవించువాఁడుకదా. రామునికంటె భరతునందుఁగల విశేషమేమో నాకుఁ దోఁపకున్నది. రాముఁడు నిన్ను శుశ్రూషించును. గొప్పగా సంభావించును. పూజించును. నీమాట శిరసావహించును. ఇవన్నియు రామునికంటె నెక్కుడుగాఁ జేయువాఁడింకెవ్వఁడు గలఁడు?

నీకడ ననేకసహస్రములు స్త్రీలు సేవచేయుచున్నారు. భృత్యగణము గలదు. వీరియం దెవ్వారికైన రామునియందు దప్పున్నదని తోఁచినదా. అడుగుము. ఏయపరాధము లేని రాము నడవులుపా లెట్లుచేయుదును? రామచంద్రుఁడు నిర్మలచిత్తుఁడు. సర్వప్రాణులను హితభాషణముల నాదరించును. ఎల్లరకుఁ బ్రియముకల్గించుకార్యములనే చేయువాఁడు. గారవించును. కావు,

వనే సర్వజనప్రియకరుఁడు రాముఁడయ్యెను. రామభద్రుఁడు దయాదానపరాక్రమవీరుఁడు. భూతహితమగు సత్యముచే స్వర్గాదిలోకముల వశములుగఁ జేసికొనుచున్నాఁడు. దానములచే దరిద్రులను, శుశ్రూషలచే గురువులను, వశముచేసికొని రహస్యార్థములఁ దెలిసికొనుచున్నాఁడు. ధనుర్ధారియై నిలిచి శత్రువులు లోఁబడునట్లు చేసికొనును. సత్యము, దానములు, తపస్సు ఈలోకమునఁగల ప్రయోజనమును గోరి దేవతల నుద్దేశించి చేయు త్యాగము, మైత్రియు, బాహ్యాభ్యంతరశుద్ధియు, కపటము లేకుండుటయు, విద్యయు, గురుశుశ్రూషయునను నీసద్గుణములు రామునియందు సర్వదా నెలకొనియుండును. కపటము లేకుండుట యెట్టివారికేఁ గలుగుట యరుదు. ఇన్నిగుణములు గలిగి దేవసమానుఁడై మహర్షి తేజస్సు గలిగియుండు నాకుమారుని సుకుమారుని శ్రీరాముని మహారణ్యములకు నంపుపాపము చేయ మనస్సెట్టు లొప్పినది? ఎవరికైన నప్రియమగుమాట రామునినోట వెడలునా? అట్టి రామచంద్రున కప్రియమును మదినైనఁ దలంపను జుమీ. ఇఁక నీకొఱకు రామభద్రున కప్రియము చేయఁదలంతునా? అడవికిఁ బొమ్మని యెట్లు వచింపఁగల్గుదును? క్షమాదమములు, సత్యధర్మములు, కృతజ్ఞతయు, సకలప్రాణిహింసాశూన్యతయు ననునీయుత్తమగుణము లెవ్వాని యందు నెలకొనియున్నవో యట్టి రామచంద్రుఁడు తప్ప నాకు గతి యింకెవ్వఁడు కలఁడు? రామచంద్రుఁడే నాకు గతియని సత్యముగా నెన్నిసారులైనఁ జెప్పుదును. కైకేయీ! నామాట వినుము. వృద్ధుఁడనైతిని. ఆయురంతము చెంత నున్నది. కనుక నా యీదశకు విచారపడవలయును. దీనుఁడనై పలుమాఱులు

ప్రార్థించి విలపించుచున్న నాపై దయ యునుపుము. సముద్ర ములు పొలిమేరగాఁగల భూమండలమునందు వచ్చుద్రవ్య జాతమునంతయు నీకిత్తును. రామునియందుఁ గలకోపమును మాత్రము వదలివేయుము. చాలును. దోసిలొగ్గి వేఁడుదును. నీపాదములు పట్టుకొందును. నారామమూర్తిని గాపాడుము. ప్రతిజ్ఞ దప్పినందున నధర్మమునకు లోఁబడినవానిగా నన్నుఁ జేయకుము.

దశరథుఁ డీరీతిగాఁ బలవించుచుఁ దపించుచు మూర్ఛ మునుఁగుచు నేలంబడి పొరలాడుచు రాము నెడఁబాయఁ జాలక దుఃఖించుచు నన్నీకష్టములనుండి యుద్ధరింపుమా యని కైకను బెక్కురీతుల బతిమాలుచుండఁగాఁ గాంచి కైక దారు ణాకారము కనంబడుచుండ మిక్కిలి క్రూరముగా నిట్లు పలి కెను. రాజా! వరములిచ్చితివి. తరువాతఁ బరితపింతువేని భూ మండలమున నీవుఁడవై ధార్మికుఁడనని యెట్లు చెప్పుకొనఁ జాలుదువు? రాజర్షు లెందఱో గలరు. వా రెప్పుడైన నిన్నుఁ గలిసికొని ధర్మమువిషయము మాటలాడుచు రాజా! నీకుఁ బ్రాణావసానసమయమున నుపకారము చేసినకైకకు రెండు వరములిచ్చితివే ఆమె యేమడిగినది? ఏమియిచ్చితివి? అని ప్ర శ్నించినయెడల ధర్మవేత్తవగు నీవేమి యుత్తరమిత్తువు? నేనురణా రంగమున స్మృతిలేక పడియుండఁగాఁ బ్రయత్నపూర్వకముగా దూరమునకుఁ దీసికొనిపోయి యుపచారములు పెక్కులొన రించి కాపాడినది. అట్టి నాభార్యయగు కైకయనుగ్రహముననే నింతదాఁక జీవించియున్నాఁడను. అట్టికైకకు నిచ్చినవరముల నసత్యములు గావించితినని వారలకుం దెలుపుదువేమో? రాజా!

శపథము తప్పకుమా. ఇపుడే వరములిచ్చితివి. ఇంతలో నూహాలు మాఱఁగా నింకేవో మాటలాడుచున్నాఁడవు. ప్రజాపాలకుఁడవు సుమీ. ఇట్టిరాజే యిట్టులు దబ్బఱలాడునేని యిఁక రాజులెల్ల దశరథునివలెఁ గల్లలాడువారని లోకమునఁ గల రాజులకందఱకుఁ గళంకము కలిగింతువుకదా.

ఒక్కదృష్టాంతము నాలకింపుము. మున్ను శైబ్యుఁడను భూతలపతి సత్యమున నాదరణముగలవాఁడుగ నుండెను. ఒక్క డేగయుఁ బావురమును గలహించెను. అందుఁ బావురము రాజును శరణువేఁడెను. డేగ యరుదెంచి పావురము నిమ్మని బతిమాలెను. రాజు తనశరీరమాంసమునుగోసియిచ్చి డేగనుదృప్తిపఱచి పావురమును గాపాడెను. అలర్కుఁడనురాజర్షి తననేత్రము లొక విప్రునకిచ్చి యుత్తమలోకమునుజూఱఁగొనియెను. సముద్రునంతవాఁడు తాఁజేసినప్రతిజ్ఞరీతిగా నేఁటిదనుకఁ జెలియలికట్టను దాఁటకయున్నాఁడుకదా. శైబ్యుఁడు లోనగు పూర్వకాలపుమహాత్ములవృత్తాంతమును స్మరించియైన నీవు చేసినశపథమును దబ్బఱ చేయక నెఱవేర్పుము. రాజా! దుర్మతివై ధర్మమును బాడు చేయుతలంపున రాముని యువరాజు నొనరించి కౌసల్యం గూడి సంతతము సుఖింపఁ గోరుచున్నాఁడవు. మఱొక్కమాట నేనడిగినది ధర్మమో యధర్మమో మంచియో చెడుదో యేమైన నగుంగాక. నీ వడిగినదాని నిత్తునన్నమాట నిర్వహింపక మానరాదు. శపథమును దిగనాడి రాము నభిషేకింతువేని ఆలస్యముచేయక నీయెదుటనే విషపానముచేసి ప్రాణత్యాగము చేయుదును. రాజమాత యని కౌసల్యకెల్లవారు చేతులు జోడించి సేవచేయుచుండఁగా నొక్కదినమైనఁ జూడఁగల్గుదు

నేని బ్రదుకుటకంటె మరణమే నాకు శ్రేయస్సని తలంతును. రాము నిప్పుడే వనములకుఁ బంపుటకంటె మఱొక్కదాన మెట్టి దాని నేఁజేసినను నామదికి సంతృప్తికలుగదు. ఈమాట నిజమని నాకుమారునిసాక్షిగా నాప్రాణములసాక్షిగాఁ బ్రమాణము చేయుచున్నాను. అని ఘోరముగాఁ బలికి యూరకుండెను. రాజెంతగా విలపించుచున్నను బదులు చెప్పఁ బూనకుండెను.

రాజు కైకయడిగిన యమంగళమునుగల్గించు నా రెండు వరములవలన నింద్రియములు కలంగఁగా ముహూర్తమాత్రము కైకతో నేమియు భాషింపక యప్రియవాదినియగు నాభార్య ననిమేషదృష్టిం జూచుచుండెను. న్యాయవిరుద్ధముగా భరతుని యువరాజునుగఁ జేయుమనుట, యోర్వలేక రాముని వనములకు మునివృత్తినుండఁ బంపుమనుట యను నీ రెండును దుఃఖమును శోకమును గలిగింపఁగా నందులకుఁ గారణభూతురాలై పిడుగువలెఁ గఠినమై యప్రియముగ మదికిందోఁచుచున్న యాకైక చెప్పినమాటల స్మరించి రాజించుకయైన శాంతి నొందఁజాలఁడయ్యెను. కైకనిశ్చయము భయంకరమని యెఱింగి తనశపథమును దలంచి బదులు చేయుట కేదియుఁ దోఁపమి "రామభద్రా" యని పలికి నిట్టూర్పులువదలి హతమూలవృక్షమువలె భూమిపయిఁబడి యున్మత్తునిచందమున సన్నిపాతవ్యాధిచే మనస్సు తాఱుమాఱు కాఁగా వెతలంబడురోగివలె మంత్రహృతవీర్యమగుపామువలె నపుఁ డారాజు కనంబడుచుండెను.

పిదప రాజు దీనాలాపముల నాకైకేయిం గాంచి మహానర్థము నొడఁగూర్చు నీకోరిక మంచిదిగాఁ దోఁచునట్లు నీకెవ్వరు బోధించిరి? పిశాచగ్రస్తురాలివలె యుక్తాయుక్తములఁ బాటిం

పక నాముండదట భాషించుచున్నదానవు? నీకించుకయే లజ్జ లేదా? నీచిన్నతనమునాఁడు స్వభావ మిప్పటివలె దుష్టము కాఁగా నేనెఱుంగను. వయస్సురాఁగా నది విపరీతమైన ట్లగపడు చున్నది. నీవడిగినవరము లతిక్రూరములు. ఏకారణమున నీకింత భయముగల్గెను ? భర్తయగు నాకుఁ బ్రపంచమునకు నీకుమా రునకుఁ బ్రియమొనర్ప వాంఛింతువేని భరతునకు రాజ్య మిమ్మను నభిప్రాయమునుబాఱఁదోలి శ్రీరాముని వనముల కిపుడే పంపుమనుపాపాశయమును బరిత్యజించి నెమ్మదినుండుము. నిర్దయురాలా! రాము నడవులకుఁ బంపునూహ మహాపాప ఫలముగా నెట్లు కలిగెను? తొలిపుట్టువునందు మహాపాపము చేసితివి. దానికిఫలమే యీనీచబుద్ధియని యెఱుంగుము. నేను గాని రామమూర్తిగాని నీకేమేని యప్రియమొనరించి యెఱుం గుదుమా. ఏయపరాధము మాయిరువురియందు నీకుం గనం బడినది? నీవనుకొన్న యట్లే నీకుమారుఁడు రాజ్యము పాలింపఁ దలంచునా? వాఁడు ధర్మమున రామునికన్న మిన్నయని యెన్నువాఁడ. పరమధార్మికుఁడగు భరతుఁడు రామునివదలి రాజ్యము నాశించునా? నీప్రయత్నము వ్యర్థమేకాని భరతుఁడు రాజ్యమును గ్రహింపఁడు. వత్సా! నీవడవులకుఁ బదునాలు గేండ్లు మునివృత్తినుండఁ బొమ్మని నేను జెప్పఁగా దీనాననుఁడై నిలుచున్న రామచంద్రునిమోము నేనెట్లు చూడఁగలను?

మంత్రులతో నాలోచించి కార్యము నిశ్చయించి మిత్రుల నడిగి స్థిరముగాఁజేయ నిర్ణయించి రాముని యువ రాజునుజేయ నెంచితిని. వ్యూహముగా నునిచిన తనసైన్యమును శత్రువులు కొట్టుచుండఁగాఁ జూచునట్టులు నిర్ణయించిన

మాయభిప్రాయము తాఱుమాఱు కాఁగా నెట్లు చూచు చుండఁగలను? రాము నభిషేకింతునని నాల్గుదిక్కులనుండి రాజులను రావించితిని. వారిపుడు నన్నేమందురు? ఇక్ష్వాకు వంశమున జన్మించిన యీబాలుఁడు రాజ్యపాలనము చాల కాలము సాగించెనా? అడవికేలపోవు చున్నాఁడు? ఈదశరథుఁడు తెలివితక్కువవాఁడు. అదృష్టవశమున నింతకాలము రాజ్య మును బాలించెనుగాని బుద్ధియున్న రామచంద్రు నిట్లు వన ములపాలు చేయునా! యని పరిపరివిధముల నన్నుఁ బరిహాస భాజనముగఁ జేయకవిడుతురా? ఇంక వృద్ధులు గుణవంతులు విద్వాంసులునగువారు పెక్కండ్రు వచ్చి రామభద్రుఁ డెందున్న వాఁడని నన్నడుగ వారి కేమని బదులిత్తును? కైకకు వరద్వయ మెన్నఁడో యిచ్చియుంటిని. రామున కరణ్యవాసము భరతునకు రాజ్యలాభము గల్గింపుమని కోరఁగా నడవులకు రాముని బంపి నాఁడను. అని సత్యముపల్కిన నింతకుఁ గొంతముందు వసిష్ఠాది మహర్షులు విను చుండఁగా మహాసభలో రామునకు రేపు పట్టాభి షేకోత్సవము జరపుదునని నేను జెప్పినమాట యసత్యమగును.

దుర్మతీ! నిర్దయచే నేను రాము నడవికిం బంపఁగాఁ గౌసల్య నన్నేమే నడిగిన దానికి బదు లేమని చెప్పుదు? అప కారము చేసినందున సమాధానము చెప్పు నవకాశము నాకేది యుండును? కౌసల్య నాయం దెక్కువమక్కువగలది. రాము నందు వాత్సల్యముకలది. దాసికన్న మిన్నగ నాకయ్యది సేవలు చేయును జుమీ. సఖివలె ద్యూతక్రీడాదుల వినోదించును. ధర్మాచరణమునందు భార్య యెట్లు సాయపడవలెనని విధిగలదో యట్లు తోడ్పడును. నేను వేఱొకతుకఁ బెండ్లియాడఁగోరఁగాఁ

దోడఁబుట్టువురీతి నాకార్యమునఁ బ్రయత్నించును. శరీర పోషణకార్యమునఁ దల్లివలెఁ బ్రవర్తించును. పట్టపుదేవి నన్ను గరువ మాకౌసల్య కిసుమంతయు లేదు. ఆయాకాలములయం దయ్యైరీతుల నాకుఁ దోడ్పడునపుడు నేనును దగినయుపకారము చేయుట నాకు ధర్మముకదా. అట్లుండియు నేను నీయందుఁగల ప్రేమమున నీకేమి కోపమువచ్చునో యన్నశంకచే దాని నించుకంతయు గారవించినవాఁడను గాను. వ్యాధిబాధితుఁ డపథ్యవస్తువులఁ దిన నవి యవ్వల బాధించుచందమున నెఱుం గక పూర్వము నీకొనరించిన యుపకారమంతయు నిపుడు నీ దౌర్జన్యము ప్రత్యక్షముకాఁగా నింతటిపాపాత్మురాలి కొన రించితినే యని యది నన్నుఁ బీడించెడిని. అట్లుపకారము నీకుఁ జేయకయే యుండిన నింతటి ప్రీతియు నాకుండదు. ఈసంతా పముకలుగు నవకాశము నాకు లేకపోవును.

సుమిత్ర నిన్నటి నానిర్ణయము. దానిని మార్చుటయు నంతియేగాక రాము నడవులకుంబంపుటయుఁ గాంచి ప్రాణ ములకంటె నధికుఁడగు రామచంద్రునినే యిట్టియన్యాయమున నడవులపాలు చేసినాఁడుకదా. ఈరాజు స్థిరబుద్ధికలవాఁడు కాఁడు. మిక్కిలి క్రూరుఁడు. నాకుమారు నేమిచేయునోకదా యని భయంపడి నన్ను నమ్మునా? అక్కటా! జానకియు నా మృతికి రాము నరణ్యావాసమునకు నత్యంతము దీనురాలై యీ రెండువార్తల నొక్కకాలముననే వినఁగలదు. అయ్యో! హిమాలయముచేరువఁ గిన్నరుంబాసిన కిన్నరాంగనవలె రాము నడవులకు నేఁబంపఁగా సీత వగచుచుఁ బ్రాణములంబాయును. రాముఁ డడవులకుంబోవుచుండఁగా దానిం గాంచి సీత విల

పించుచుండఁగాఁ జూచుచున్న నేనుమాత్రము చిరకాలము జీవింపఁగలుగుదునా? నామృతికింబిదప నీవు విధవవై కుమారుం గూడి రాజ్యము పాలింపుము. నాప్రియపుత్త్రుఁడు వనవాసము చేయఁబోవఁగా నాకుఁ బ్రాణము లేల? క్షణమేని బ్రదుకఁగలనా? నీసౌందర్యమును మాత్రమే చూచి పూర్వము సాధుచిత్తవని నిన్నెంచితిని. ఇపుడు నీశీలము బయల్పడఁగా మహాపాపాత్మురాలవని తేలుచున్నది. నేత్రపర్వముగ నున్నదని చూచి విష మిళితమగుమద్యము త్రాగి యవ్వల దానిదుర్గుణములు బయలు పడఁగా దానిఫల మనుభవించువానియవస్థ నాకుంబట్టెను.

కైకా! ఇంతదనుక నన్నృతములగుసాంత్వనోక్తుల నన్ను పలావించుచుంటివి. వేఁటకాఁడు సుస్వరమున జింకను జెంతకుఁ దీసికొని వధించునట్లు నన్నిపుడు వధించితివి. భార్యాసుఖము నకై కొడుకును విక్రయించిననన్నుఁ బూజ్యమానవులు సురాపానము చేసిన బ్రాహ్మణుని దూఱునట్లు రాజవీథులయందు దూషింపక వదలరు. అక్కటా! ఎంత దుఃఖము సంభవించెను! ఎంతటికష్ట మిది! ఇట్టివానిని మున్నెఱుంగను. నారచీరలుగట్టి యడవులనుండునట్లు రామునిం బంపుమని నీవడిగినమాటలను గూడ విని యోర్చుకొనుచున్నానుగదా. ఈవిధములగుదుఃఖములు పురాకృతదుష్కృతఫలములరీతి బదులుచేయ శక్యము గాక నాకిపుడు కలిగినవి. పాపమతీ! నీవిట్టిదానవని తెలిసికొనక గొంతున కురిత్రాఁడు తగిలించుకొని దానిని రక్షించుచున్నట్లు దురాత్ముఁడనై చాలకాలము రక్షించినాఁడను గదా. నీవురిత్రాఁడుచంపునట్లు నన్నుఁ జంపనెంచితివి. ఇట్టిదానవని యెఱుంగనైతిని. అజ్ఞానమున బాలుఁ డొంటరిపాటున నాగుఁబామును

జేతులంబట్టుకొనునట్లు నిన్నుఁ బెండ్లియాడితిని. ఆనాగుఁబాము బాలునింజంపునట్లే నామరణమునకు నీవు హేతువవైతివికదా! మహాత్ముఁడు రామునకు దుర్మతినగు నేను దండ్రి యయ్యు సుఖము గల్గింపఁజాలకపోతిని. రాముఁడు తండ్రిలేనివాఁడే యయ్యెను. ఇంతటిపాపాత్ముని నన్నుం గాంచి జనులందఱు మనప్రభువు కాముకుఁడు. మూర్ఖుఁడు. భార్యకొఱకు రాము నడవులపాలు చేయుచున్నవాఁడు. అని పలుభంగుల నాక్రోశింతురు.

దుర్మతీ ! రామచంద్రుఁ డింతకాలము వ్రతములు, బ్రహ్మచర్యనియమము, గురుశిక్ష యనువానివలన విశేషించి శ్రమములపాలయ్యెను సుఖముల ననుభవించినవాఁడే కాఁడు. సుఖమనుభవించుకాలమున నిపుడు మహాకష్టములు గలిగినవి. నా ప్రియపుత్త్రుఁ డడవికిఁబొమ్మని నేఁ జెప్పఁగా బదులు పలుకఁ నేరఁడు. శిరసావహించి పోవును. ఈమాట నిశ్చయము. రాముఁడు వనమునకుఁ బొమ్మను నామాటకుఁ బ్రతికూలముగాఁ బ్రవర్తించునేని నాకది మిక్కిలి ప్రియముగనుండును. కాని యతఁ డట్లు చేయునా? రామమూర్తి కపటమెఱుంగని విమలాంతఃకరణుఁడు. కనుక నే నన్నును దనవంటివానిగా భావించును. అభిప్రాయము వేఱొకరీతిగా నామాటయందుండునని తలంపఁడు. అట్టివాఁడు కనుకఁ బొమ్మనఁగానే పోవుదునను. వనగమనము నాకిష్టముకాదనియు, నదియే నామనోభావమనియు నెఱుంగఁడు.

శ్రీరామమూర్తి వనములకుఁ బోవఁగా లోకులెల్ల నన్ను ధిక్కరింతురు. అది సహింప శక్యమగునా? తుదకు మృత్యువు.

యమునింటికి నన్నుఁ గొనిపోవును. నేను యమపురికి రాముఁ డడవులకుఁ బోవఁగా మిగిలియున్న కౌసల్యాదులకు నే మపకార ము చేయఁదలంతువో. కౌసల్యయుఁ గొడుకడవులకుఁబోవఁగా మృతినొందక యుండఁజాలునా? సౌమిత్రి యన్న నెడఁబాయఁ జాలఁడు కాన నతఁడును వానింగూడియే వనులకుంబోవును. శత్రుఘ్నుఁడు దైవవశమున భరతునివెంటఁ బోయెను. కాన నిట వాఁడును లేఁడు. నీవు కౌసల్యను నన్ను రామలక్ష్మణశత్రు ఘ్నులను వదలుదువేని సుమిత్రయు నీశోకమును భరింపఁ జాలక నన్ననుగమించి మృతినొందు. మమ్మెల్లర ఘోరనరక ప్రాయమగు నీదుఃఖమునఁ బడఁద్రోసి నీవుమాత్రము సుఖ ముగా నుండుము. ఈయిక్ష్వాకువంశము శాశ్వతముగా నుండు నది. సద్గుణములఁ బూజ్యమైనది. ఇట్టి పవిత్రవంశమును గలంపఁ దలంపకుము. దీనిని రాముఁడు నేను వదలిపోవఁగా నీవు రాణివై బీభత్సముగాఁ బాలింపఁగలవు.

రాముఁ డడవికేగుట భరతునకుం బ్రియమేని నాకా భరతుఁ డూర్ధ్వలోకక్రియలు చేయఁగూడదు. అక్కటా! దుష్టాత్మకురాలా! నాకు నీవు శత్రువవు. ఇంతటిఘోరకార్యము చేసి నీవాంఛలను దీర్చుకొనుము. రామునిపైఁ బ్రీతినుంపుము. నేను మృతినొంద రాముఁ డడవులకుంబోవ నిపుడు పరమ కల్యాణివై యుండు నీవు విధవవై భరతునింగూడి రాజ్యమును బాలింపఁగలవు. నాకు నీవే మహాపకీర్తివి. మహాజనులయెదుట నాకుఁ గలిగెడుతిరస్కారము నీవే. ఎల్లభూతములదృష్టికి నీచ ముగాఁ దోఁచునవమానమే నీవు నాకగుదువు. రాజకుమారి యనుపేర నాయింట నివసించినందుననే యింతటియపయశస్సు

పరాభవము నవమానము నాకుఁగల్గినవి. పాపాత్ములకుం గల్గు నవియెల్ల నాకుఁ గలిగినవి. నాకుఁ బ్రియపుత్త్రుఁడగు రాముఁడు కోరినపుడెల్ల గజతురగరథాదులనెక్కి తిరుగుచుండి యిపుడు మహాటవులలో నెట్లు తిరుగఁగలఁడు? కుండలముల బహుమానముగాఁ బొంది వాని ధరించియున్నవంటవాండ్రు రాముఁడు భుజించుతఱి నేను ముందు నేను ముందని మంచియన్నము లోనగువస్తువులను వడ్డింతురు. అట్టిసుకుమారుఁడు వనముల నొగరు కారము చేఁదు నగుకందమూలాదుల నెట్లు తిని బ్రదుకఁ గలఁడు?

నాచిన్నారికుమారుఁడు రామచంద్రుఁ డమూల్యవస్త్రములధరించి చిరకాలము సుఖశయ్యలశయనించియుండి యిపుడు మహారణ్యములయందుఁ గాషాయవస్త్రములంగట్టుకొని కఠిన భూతలముల నెట్లు శయనింపఁగలఁడు? ఛీ! ఛీ! కైకా! రామమూర్తి నడవులకుంబంపి భరతునకు రాజ్యమిమ్మని యించుకైన ముందువెనుక లాలోచింపని భయంకరవాక్యము నీవెవ్వరియుపదేశమునఁ బలికితివి? సాధారణముగా స్త్రీలెల్ల కపటవ్యాపారముకలవారు. వారిస్వభావము సర్వదా రహస్యముగా నొరులకు నపకారముచేయుటయే. వారిదృష్టి స్వకార్యమునందే. పరులకష్టములను బాటింపరు. వారు నిందలపాలై నశింతురు గాక. ఆలోచింపఁగా స్త్రీలలోఁ బుణ్యాత్మురాండ్రును గలరు. కావున నెల్లవారలను నేను దూషింపఁదలంపను. భరతునితల్లిని గూర్చియే ముఖ్యముగా నీమాటచెప్పెదను. కైకా! ఇప్పటి నీభావము నీకు నితరులకు ననర్థావహమే. నీపనియే నీకు ముఖ్యముగ నున్నదే. ఏల? కొంచెమైనఁ గరుణలేక నన్ను దుఃఖ

ములపాలుచేయ నిట్టిదుర్భావము నేలపూనితివి? నావలన నీకేమి యపకారముకలిగెను? సర్వప్రపంచమునకు హితము రాముఁడు చేయును. నీకుమాత్ర మహితము గావించునా? ఈవఱ కేయప కారము చేసెను?

లోకమునఁ దండ్రులు తమప్రియపుత్త్రులవదలినను వదల వచ్చును. పురుషులు తమరు ప్రేమించుభార్యల వదలిన వదల వచ్చును. భార్యలు తమప్రియభర్తలను విడిచినను విడువ వచ్చును. ఈజోలికి లోకులు రారు. దీనిచే నాకు నీకు నేమియు బాధలేదు. నేనిపు డడవికి రామునిం బంపఁగా నతఁడు దుఃఖ మున మునిఁగియుండఁగా లోకముఁ గాంచెనా యిన్నికష్ట ములు రామునకుఁ గల్గించిన నిన్నుమాత్రను స్థావరజంగమ ములుకూడఁ గోపగించును ఇది తప్పదు. ప్రపంచమునఁ దండ్రులకుఁ గుమారులయందుఁ బ్రీతియుండుట సామాన్యము. నాకన్ననో కుమారునియందుఁ గలప్రీతి లోకసాధారణమగు నదికాదు. లోకాతిశయమైనది. కావున దేవపుత్త్రుఁడువలె సహజ సుందరుఁడై సకలభూషణభూషితుఁడై గంధగజగమనమున వచ్చు నాచిన్నారికొడుకును మనస్సునఁ జూచినను దూరమునఁ జూచినను మిక్కిలి సంతోషముగల్గును. సమీపమునకు రాఁగాఁ గాంచినచో దేహ ముప్పొంగి బల మతిశయింపఁగాఁ గ్రొత్త వయస్సు వచ్చినట్లే యుండును. సూర్యుఁడు లేకపోవుఁగాక. పర్జన్యుఁడు వర్షింపకయుండుఁగాక. లోకులకు గమనాగమన ములు బ్రదుకును గలుగును. కాని శ్రీరాముఁ డిటనుండి యడ వికిఁ బోవుచుండఁ జూచినయెడల నొక్కజంతువుకూడ బ్రదుక దని నాకుం దోఁచెడిని. నావినాశముంగోరి యహితురాలవై

నాకపకారము చేయఁగోరుచున్న నిన్ను మృత్యువుంబోలె నింత కాలము నాయింట నుంచుకొంటిని. క్రూరవిషసర్పమవగు నిన్నుఁ దెలియక చాలకాలము తొడపై నిడుకొంటిని. కనుకనే నన్నిపుడు కఱచి చంపితివి. నన్ను రామలక్ష్మణులనువదలి భరతుఁడు నిన్నుఁగూడి పురమును రాజ్యము బంధువులనువధించి చక్కఁగా బరిపాలనము సాగించుఁగాక. ఈరీతిగా నొనరించి నీవుకూడ సంతోషమును గూర్చుచుండుము.

క్రూరప్రవృత్తిగల యోకైకా! దెబ్బపై దెబ్బగా శ్రీరాము నెడఁబాటు నొర్వనివ్యసన మొకవంక బాధించుచుండఁగా రాము నడవులకుం బంపుము. పంపుము అని మరల మరల నన్ను బాధించుచున్న దానవే. ఆపత్కాలమున నే బాధించు దానవుకదా. భార్య చూపఁదగుమర్యాద వదలి నాయెదుట నీవిపుడు స్వాతంత్ర్యము వహించి యిట్టిక్రూర వాక్యములు పలుకుచున్నావుకదా. ఇట్టి నీనోటినుండి దంతము లన్నియు వేయిశకలములై పగిలి భూమింబడకయున్నవే. ఏల? శ్రీరామమూర్తి నీకహితముఁగాని యప్రియముఁగాని యొక్క మాట చెప్పినాఁడా? పరుషోక్తులాడ నతఁ డెఱుఁగనే యెఱుఁగఁడు. సర్వజనులకుఁ బ్రియముగా మాటలాడుచు సద్గుణాకరుఁడై జనస్తుతులకుం బాత్రుఁడైయుండు నాకుమారవర్యుని యందు దోషములు గలవని యెట్లు చెప్పఁగలవే? కేకయ రాట్కులపాంసనీ! పరితపింపుము క్రోధాగ్ని మండిపొమ్ము. నశింపుము. పైనుండి క్రిందఁబడి వేయితునుకలుగా నగుము. ఇందు నీవెట్టులైన నగుదువుగాక. నాకత్యంతాహితము దారుణము నగుమాటను నేను జేయనుజుమీ.

కైకా! నీవు మంగలకత్తిరీతి క్రూరమయినదానవు. అసత్యమును బ్రియముగాఁ బలుకుదానవు. దుస్స్వభావురాలవు. కులపాంసనురాలవు. నాహృదయమును బ్రాణములతోడఁ గాల్పఁ గోరుచున్నదానవు. కనుక నీవు జీవించియుండ నేఁజూడఁ జాలను. నేనును బ్రదికియుండఁజాలను. ఇఁక నాకు సుఖ మెక్కడనుండివచ్చును? బ్రదికియున్నను రామమూర్తిలేక సుఖ మెట్లు కల్గును? నీతోడంగూడిన సుఖమెక్కడిది? ఇవి లేకుండుఁ గాన, నీవు నాకు భార్యవుగాన నాకు నపకారము నీవు చేయ రాదు. నీపాదములపైఁబడి ప్రార్థింతును. నాయం దనుగ్రహము కనఁబఱపుము. అని వేఁడెను.

ఈరీతిగా దశరథుఁడు స్త్రీమర్యాద నతిక్రమించిపోవు చున్న యాకైకకుఁ దనహృదయము చిక్కిపోవఁగా రాజయ్యుఁ దనమనస్సును మరలించుకొననేరక యనాథునివలె నేడ్చుచు రోగి బలముదూలి పడిపోవునట్లా మెపాదములపైఁ బడియెను. కాని యామె దానిం బాటింపక పాదములను వేఱొకప్రక్కకుఁ జాఁపెను. కావున నా రాజు వట్టినేలపైఁ బడియెను. అంతియ కాని యామెపాదములనుమాత్రము స్పృశించినవాఁడు కాఁడు.

మహాశయులారా! ఈభాగమున నత్యంతదుఃఖవిష యము కలదు: కాన నిది విమర్శనార్హమా యని భావింపక విమర్శింతము. అనేకవిషయము లిందు విమర్శనార్హములు కలవు. నేర్చుకొనఁదగిననీతు లెన్నియో యిందుండి గ్రహింప వలయును.

“ఇత్యాలోక్య పురః పత్నీం వ్యాఘ్రీమివ పురస్థితాం,
కిమిదం భావసే భద్రే మమ ప్రాణహారం వచః

రామః క్షమపరాధం తే కృతవాన్ కమలేక్షణః.''

అధ్యాత్మరామాయణము 3 సర్గము.

అనుమూలములం బరికింతము. కైకవరములను విన్నయంతనే రాజుచెంతకు మృత్యు వరుదెంచెను. మృత్యువు సమీపింపఁగా భయముం గలుగునుగదా. ఆభయమే యతనికిం గలుగఁగా ఆఁడుబెబ్బులివలెఁ గైక యెదుటఁ దోఁచెను. కాని కర్మవాసనంబట్టి భార్యయన్నబుద్ధి యాతని వదలలేదు. మృత్యుప్రోత్సాహితుఁడు కావున నా ప్రాణములఁదీయుమాట నేల భాషించుచున్నదానవని ప్రశ్నించెను. సత్కర్మవాసన లలము కొన్నందున శ్రీరాముని భగవంతుఁడనియే తలంచెను. ''కమలేక్షణః'' అన్నపదమే యిందులకు దృష్టాంతమని యెఱుంగవలయును. అట్టి దుఃఖసమయమున రాముని సౌందర్యమును దెలుపు పదములు స్మృతికి రాఁజాలవు.

''హారామ పుత్ర హాసీతే హాలక్ష్మణ గుణాకర,

వదన్నేవం దశరథః ప్రాణాంస్త్యక్త్వా దివం గతః.''

అని యున్నది. రాముని స్మరించుచునే ప్రాణములను వదలెను. కావున దశరథునిభావ మపుడు కర్మప్రోత్సాహమున రాముని భగవంతుఁడనియే నమ్మెను. తనకుఁ బ్రాణహాని కలుగుననియు రాజూహించెను. కావునఁ దొలిమేన సత్కర్మము లాచరించిన వారల కంత్యకాలమున నేవిధముననైన భగవంతునియందు నాసక్తి కలుగును. దాన నామహాత్ముని యనుగ్రహమునకుఁ బాత్రుఁడగును.

''అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం,

యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః. ౫

యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరం,
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః. ౬
తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుధ్య చ,
మయ్యర్పితమనోబుద్ధిర్మామేవైష్యస్యసంశయః. ౭
అభ్యాసయోగయుక్తేన చేతసా నాన్యగామినా,
పరమం పురుషం దివ్యం యాతి పార్థానుచింతయన్." ౮

గీత. ౮ అధ్యా.

అను నీభగవద్వాక్యములు సత్యములు కాకపోవుగదా. కొందఱిప్పట్టున నిట్లు ప్రశ్నింతురు. అనేకపాపములు విసుగులేక యొనరించి తుదకు భగవంతుని ధ్యానించుచుఁ బ్రాణములు వదలిన ముక్తి కల్గునా? అనునదియే వారి ప్రశ్నసారము. వీరికి సమాధానము చెప్పుట సులభకార్యము కాదు. అనేకపాపము లొనరించువారు మరణకాలమున భగవంతుని దలంచుచుఁ బ్రాణములవదలుభాగ్యము కలవారు కాఁజాలరు ప్రాణములవదలు కాలమున వారిచిత్తవృత్తి యెట్లుండునో తెలియఁదరము కాదు. కొంతముందు భగవంతుని ధ్యానించినను దత్కాలమున వారి చిత్తము పరమేశ్వరునిచరణారవిందములయందు లగ్నమై యుండునని సాధారణముగా నమ్మ వలనుపడదు.

"అనేకజన్మసంసిద్ధస్తతో యాంతి పరాం గతిం"

అనియే భగవద్వాక్యము కలదు. భగవంతుని బెక్కుజన్మముల నారాధించినవారికింగాని యట్టిస్మృతి యంత్యకాలమునం గలుగదు. అనేకపాపకార్యము లొనరించినవా రేదోయొకనెపమున భగవన్నామ ముచ్చరించి ముక్తినొందినట్లు కథలుకలవుకదా యందురేని తఱచుగా నట్టికథలనుండి భగవన్నామ మనంత

ఫలదమనునీతిని గ్రహింపవలయునే కాని మనమట్లే దుష్కా ర్యము లొనరించి యెపుడో యొక్కసారి నారాయణా యని స్మరించి గుబీలున ముక్తిమండపమున దుముకఁగలమని గ్రహింపరాదు. సాధారణముగాఁ బురాణములయం దట్టికథ లగపడుచుండును. అవి పామరులహృదయక్షేత్రములందు భక్తి బీజమును నాటుటకై యతిశయముగఁ జెప్పఁబడినవి. అట్లు చెప్పుట లోకోపకారమే యగు. ఆకథలవలనిసార మెద్దియని విమర్శింపక యెన్నిపాపములుచేసిన నొక్కసారి రామ! కృష్ణ మహాదేవ! యనుమొదలగుభగవన్నామము లుచ్చరించిన సకల పాపములు తొలఁగునన్న ఫలస్తుతుల నమ్మి దుష్కార్యములు చేయరాదు. తలుచుగా ఫలస్తుతుల నమ్మరాదు. అసత్యము లేల చెప్పిరని వారి నాక్షేపింపరాదు. పామరు లాఫలములంగోరి యైన భగవంతు నారాధింతురనియే మహర్షులయాశయము.

"శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే,
సహస్రనామతస్తుల్యం రామనామ వరాననే."

అనువాక్యముల నుదాహరించి కొందఱు మధ్యవైష్ణవులు,

"కోటయో బ్రహ్మహత్యానామగమ్యాగమకోటయః,
సద్యః ప్రళయమాయాంతి మహాదేవేతి కీర్తనాత్."

అనువాక్యముల నుదహరించి మధ్యశైవులు. ఇంకనుంగల మహానీయులు కొందఱు పామరుల మోసపుచ్చి వారిపాపములు తొలఁగిపోవునని నమ్మించి ధనము సంపాదింతురు. కాని యీపామరులపాపములన్నియు వారలనే పొందును. కావున మన మట్టి భగవంతు నారాధించుచు శ్రద్ధాభక్తులు గలిగి తన్నామసంకీర్తనము చేయవలయును. కపటవేషధారులమాటలకుఁ జోటి

యున్న రాదు. పాపకార్యనిరతుల కంత్యకాలమున భగవంతునిపై ధ్యానము కుదురదు. ప్రాక్తనసుకృతపుంజఫలమే యది యగును. ఈసిద్ధాంతము మార్పఁదరముకానిది.

"జితాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః
శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానావమానయోః" ౭. (గీ. ౬.)

అన్న శ్రీకృష్ణోపదేశమే పై విషయమును సిద్ధాంతముచేయుచున్నది. చిత్తశుద్ధిగలవారికే భగవదనుగ్రహము కలుగుఁగాని ధనాశాపీడితాంతఃకరణులై కాషాయవస్త్రములు దాల్చి సర్వసంగపరిత్యాగులమని చెప్పుకొనుచు ధనములాగుమూఢులకా భగవదనుగ్రహము శశవిషాణమే. వారిమాటలు తుచ్ఛములని భావించి పరమేశ్వరు నిష్కపుభక్తితో నారాధించుచు సత్కర్మముల నాచరించుచు దుష్కర్మములకు దూరమున నుండుచు వర్తించువార లెవ్వరో వారలే భగవదనుగ్రహముఁబడయఁగలరు. ఇది యధ్యాత్మరామాయణమునఁ గలప్రస్తుత విషయసారము. ఇఁక శ్రీమద్రామాయణమును బరికింతము.

"మండలే పన్నగో రుద్ధో మంత్రైరివ మహావిషః"

అని మూలము. దశరథుఁడు కైకవాక్కులను పాశములకుం జిక్కెను. క్రూరసర్పము సర్పములబట్టుకొనువానిమంత్రమండలమునఁ జిక్కుపడినరీతిగా నని ప్రతీతికార్థము. పాములవాఁడు సర్పము వెడలుమార్గమునఁ గొన్నిగీఁతలుగీచి మంత్రబీజాక్షరముల లిఖించి యక్షతలు చల్లును. కొన్ని ద్వారములుగా నవి యుండును. ఆవిధ మెఱుంగక యాక్రూరభుజంగము వల్మీకము నుండి వెలువడి యామండలమునఁ బ్రవేశించును. ప్రథమ ద్వారభూతరేఖామధ్యభాగమునఁ గొంతబలము తగ్గును.

ఎంతోకష్టముపై నవ్వలం బ్రవేశించును. ద్వితీయమండలమునఁ మఱెంతలోఁబడును. దానిని దాఁటు ననుకొందము. ఆవలనున్న రేఖామండలమునఁ జిక్కుపడి నిట్టూర్పులుకూడ వదలఁజాలక యుండును. దానినపుడు వాఁడు పట్టుకొనును. ఈవిషయము సర్వజనులకుఁ బ్రత్యక్షముకావున విశేషించి పెంచి వ్రాయ నక్కఱలేదు. మంత్రశక్తి యిందుమూలమునఁ దేటపడును. మంత్రదేవతలుకూడఁ గర్మవశంగతులు. కర్మదేవతలకు మంత్రాధిదేవలకు భేదములేదన్నను బ్రమాద మేదియులేదు.

మంత్రపాశబద్ధుఁడగుసర్పరాజువలె దశరథుఁడు మృత్యు పాశబద్ధుఁడయ్యెను. కైకవరము నిమిత్తమాత్రమే. మున్ను చేసినపాపము ఫలమీయ సిద్ధముగా నుండెను. అదుష్కర్మమే మృత్యువును బ్రోత్సహించెను. తత్పాశములే దశరథుని నిర్బంధించెను. లోకదృష్టికిఁ గైక హేతువుగాఁ గనంబడును. అంతియగాని కైక కిందు నేయధికారము లేదు. ఇందలిరహస్య మెఱుంగనివారే కైకను దూషింతురు. ఇందలిరహస్యము పరిశీలించినఁ గర్మసిద్ధాంతతత్త్వము తేటపడును. కనుకనే మానవులు సత్కర్మముల నాచరించి ఫలములను భగవదర్పణము చేసిన నయ్యవి యనంతఫలము నొసంగును. భగవదనుగ్రహమట్టివారికే కలుగును.

"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన,
మా కర్మఫలహేతుర్భూర్మా తే సంగోఽస్త్వకర్మణి." ౪౭
(గీత. ౨. అధ్యా.)

అను నీగీతావాక్యము కర్మపద్ధతిని బోధించుచున్నది. దీనింబట్టి మానవు లేకార్యము నొనరింప నశక్తులనియు, నట్టులని ప్రయ

త్నము మానరాదనియు, ఫలముల నాశింపరాదనియు, స్వప్రయత్నము ఫలించినను ఫలింపకయున్నను మోదఖేదముల నొందరాదనియుఁ దేటపడుచున్నది.

"కౌసల్యాం వా సుమిత్రాం వా త్యజేయమపి వా శ్రియం
జీవితం వాత్మనో రామం న త్వేవ పితృవత్సలం
పరా భవతి మే ప్రీతిర్దృష్ట్వా తనయమగ్రజం
అపశ్యతస్తు మే రామం నష్టా భవతి చేతనా"

అనుమూలము పరిశీలింపఁదగినది. సర్వమును త్యజింతును. నాయందు ప్రీతిగలరామచంద్రుని వదలఁజాలను. రాముని జూచినంతన నా ప్రీతి వృద్ధియగును. ఆతనింజూడకయున్న జీవితము నష్టమగును. అని దశరథుఁడు పల్కెను. మున్ను చేసిన మునికుమారవధరూపదుష్కర్మ మాతని నిట్లు పల్కించెను. భార్యలను భాగ్యమును గూడ వదలఁగలను. రాముని వదలఁజాలను. అనఁగా భావమేమి? కైకా! మీకు నాకును ఋణరూపమగు ననుబంధము వదలినది. రాముఁ డడవులకుఁ బోవుట నేను దేహమునువదలుట ఈరెండుకార్యముల వ్యవధిగా సాగును. అని దశరథుఁడు పల్కెననియేకదా. దీనినుండి మనము గ్రహింపఁదగినదేమి? మానవులబుద్ధులు రాఁగలఫలముల ననుసరించి మాఱుచుండును. దుష్ఫలము లనుభవించుతఱి రానున్నచో దురూహలు కలుగును. సత్ఫలానుభవకాలము రానుండఁగా సదుద్దేశములు పొడసూపును. బుద్ధిమంతు లీవిషయము నెఱుంగఁగలరు. సామాన్యుల కిది పొడకట్టదు. కావుననే తమ లాభనష్టములఁ దామే యెఱుంగఁజాలక పాటుపడుచుందురు.

ఆయూహలను మరల్ప శక్యము కాక యుండును. అట్టితఱిఁ జేయ వలసిన దేది?

"అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం"

అన్న శ్రీకృష్ణపరమాత్మయుపదేశమును సర్వదా స్మరించుచు సర్వము నతనిపై వైచి తదారాధనము చేయుచుండుట మంచిది. దాన భావిఫలానుభవము సుగమమగును. దుఃఖము తగ్గును. ఈమాత్ర మాలోచింపక పోయినచో నాఫలానుభవమున మోదమో ఖేదమో పొడసూపక మానవు. ఇవి రెండును దుదకు దుఃఖమునే కల్గించునని వలయును. మోదము మంచిది కాదా యని కొందఱందురు. అయ్యది పొరపాటు. ఏలన? ఆమోదము స్వార్థలాభమున నాసక్తిని బెంపొందించును. అయ్యది యనర్థముగాక మఱేమగును! కావున బుద్ధిమంతులు మోదమును ఖేదమును సమానముగా భావింతురు.

"సుఖదుఃఖే సమే కృత్వా లాభాలాభౌ జయాజయౌ,
తతో యుద్ధాయ యుజ్యస్వ నైవం పాపమవాప్స్యసి." 38
(గీ. ౨. అ.)

అన్నగీతావాక్యము పైవిషయమును దృఢపఱచుచున్నది.

"తిష్ఠేల్లోకో వినా సూర్యం సస్యం వా సలిలం వినా,
న తు రామం వినా దేహే తిష్ఠేత్తు మమ జీవితం
తదలం త్యజ్యతామేష నిశ్చయః పాపనిశ్చయే,
అపి తే చరణౌ మూర్ధ్నా స్పృశామ్యేష ప్రసీద మే"

అని మూలము. ఇందుఁ గల దశరథునూహ పైవిషయమునే దృఢపఱచుచున్నది. తనకు మృతి దప్పదని చాటెను. తనకుఁ

ప్రాణములపైఁ గలయాశచేఁ గైకపాదములపైఁ బడుదును. దయ యనుపుమా యనియుఁ బలికెను. దీనింబట్టి పామరులన్నింటికంటెఁ బ్రాణరక్షణమునే ప్రధానముగా భావించువారని తెలియనయ్యెడిని. ఇపుడు దశరథునకు జ్ఞానము నశించినది. దానిచే యుక్తాయుక్తకార్యము లేవియో తెలియకున్నది. భార్యకు నమస్కరించుట యసమంజసమని తోఁపలేదు. ఈర్ష్యాకలహాకోపములయందు భార్యకు నమస్కరింపవచ్చు నను పురాణవచనము కలదు.

"మమ కో వా నమస్కార్యో విద్యతే భువనత్రయే. 33
ఈర్ష్యాకలహాకోపేషు త్వయి మే పరమా నతిః
అతః పుమంతరే క్వాపి న నమస్కారవానహం 34
అతః ప్రణయకాలేషు తుభ్యమేవ నమస్కృతిః"
(లలితోపాఖ్యానము. ౧౧. అధ్యా.)

అని శంకరవాక్యము. ఇదియుఁ గామవ్యవహారమున నిర్దేశింపఁబడినది. అంతియగాని భార్యకు నీర్ష్యాకలహాకోపములయందు నమస్కరింపవలయునని కాదు. దశరథునిచిత్తము స్వాయత్తముగా లేదు. కనుక నసంగతప్రసంగముల నెన్నియో చేసెను. కాని శ్రీరామునియందుమాత్రము చిత్తము చేర్చెను. అదియే సత్కర్మఫలమని మన మూహింపవలయును.

"బహూనాం స్త్రీసహస్రాణాం బహూనాం చోపజీవినాం,
పరివాదోపవాదో వా రాఘవే నోపదృశ్యతే.
సాంత్వయన్ సర్వభూతాని రామశ్శుద్ధేన చేతసా,
గృహ్ణాతి మనుజవ్యాఘ్రః ప్రియైర్విషయవాసినః.
సత్యేన లోకాన్ జయతి దీనాన్ దానేన రాఘవః,

గురూన్ శుశ్రూషయా వీరో ధనుషా యుధి శాత్రవాన్.
సత్యం దానం తపస్త్యాగో మిత్రతా శౌచమార్జవం,
విద్యా చ గురుశుశ్రూషా ధ్రువాణ్యేతాని రాఘవే.
తస్మిన్నార్జవసంపన్నే దేవి దేవోపమే కథం,
పాపమాశంససే రామే మహర్షిసమతేజసి"

అని మూలము. వీనిసార మెద్దియని పరికింతము. సామాన్యార్థము స్పష్టముకదా.

ఎవ్వాఁడు తనసేవకులవలనను, దనసేవకురాండ్రవలన నొక్కపరిభవముగాని, అపవాదారోపణముగాని పొందఁడో యాతఁడు శుద్ధచరిత్రుఁడని మన మూహింపవలయును. ఏల యనఁగా సర్వకాలము వారు సేవించుచుందురు. మానవుని యందుఁ గలలోపములు వారెఱింగినన్నింటి నితరు లెఱుంగఁ జాలరనుట సత్యము. ఏకాలముననో ప్రమాదము లుండవచ్చు. అవి వారికిఁ దెలియకయుండకమానవు. కావున నట్టివారించుకయు దూషింపకయున్నచో నతఁడు పరిశుద్ధాచారసంపన్నుఁ డనియే గ్రహింపవలయును. అట్టి యదృష్ట మెవ్వానికి లేదో యతఁడు మలినాచారవంతుఁడే యనవలయును. శ్రీరామ చంద్రుఁడు సదాచారమున నెవ్వరివలనంగూడ నించుకయే నిందనొందినవాఁడు కాఁడు. ఏల? పరమాత్మకదా. ఏదోషము నెవ్వారు కనిపెట్టఁగలరు? సర్వభూతములహృదయదేశముల నుండి వారిని దోలుబొమ్మలవలె నాడించుభగవంతు నెవ్వరు పరిభవింపఁగలరు? ఈయుదాహరణముచేత శ్రీరాముఁడు భగవంతుఁడే యని తేటపడుచున్నది.

సర్వభూతములను మంచిమాటల నుపలాలించును. అనఁ

గా సర్వభూతములయందు దయగలవాఁడని భావము. ఆయుప లాలనము పరిశుద్ధమనస్సునఁ జేయును. అనఁగా లోకులను మోస పుచ్చుటకుఁగాక నిర్మలస్వాంతమునఁ జేయువాఁడని భావము. భూతదయగలిగినట్లు నటించుచు నంతరంగమునఁ గాఠిన్యము వహించుట పాపమని యట్టివారు జగద్వంచకు లనఁబడుదురని సారము. రాజ్యమునఁ గలమనుజులనందఱను వారివారికోర్కులఁ దీర్చుటచే లోఁబఱచుకొనుచున్నవాఁడు. అనఁగా వారివారి కష్టసుఖములఁ బరిశీలించి తోడ్పడువాఁడనియే భావము. ఇదియే రాజనీతి. ఇదియే పూజ్యులలక్షణము.

"నమ్రత్వేనోన్నమంతః పరగుణకథనైస్స్వాన్ గుణాన్ ఖ్యాపయంతః
స్వార్థాన్ సంపాదయంతో వితతపృథుతరారంభయత్నాః పరార్థే,
క్షాంత్యైవాక్షేపరూక్షాక్షరముఖరముఖాన్ దుర్ముఖాన్ దూషయంతః
సంతస్సాశ్చర్యచర్యా జగతి బహుమతాః కస్య నాభ్యర్చనీయాః. ౭౦
(నీతిశతకము.)

అని భర్తృహరి వచించెను. శ్రీరామునిచర్యయే యిందుల కాధారము. సత్యమున లోకముల జయించును. అనఁగా లోఁబఱచుకొనునని భావము

"సత్యేన పూయతే సాక్షీ ధర్మస్సత్యేన వర్ధతే
తస్మాత్సత్యం హి వక్తవ్యం సర్వవర్ణేషు సాక్షిభిః" ౭౩
(మను. ౮. అధ్యా.)

అనుస్మృతి రామచంద్రునాచారమునే ప్రమాణముగాఁ గై కొనియె ననవచ్చును. దీనులను దానమున సుఖపెట్టుచున్నాఁ డను. దీనులనఁగా దారిద్ర్యసాగరనిమగ్నులని యర్థము.

"దరిద్రే దీయతే దానం సఫలం పాండునందన"

అని నీతిశాస్త్రము రామునిచర్యను శరణముగాఁ గొనియె నన వచ్చును. గురువులను సేవాధర్మమున సంతోషపఱచును.

"వృద్ధాంశ్చ నిత్యం సేవేత విప్రాన్ వేదవిదశ్శుచీన్
వృద్ధసేవీ హి సతతం రక్షోభిరపి పూజ్యతే 3౭
తేభ్యోఽధిగచ్ఛేద్వినయం వినీతాత్మాపి నిత్యశః
వినీతాత్మా హి నృపతిర్న వినశ్యతి కర్హిచిత్" 3౯

అన్న మనుస్మృతి రామచంద్రునాచారమునే ప్రశంసించుచున్నది. ధనుస్సుచే యుద్ధరంగమున శత్రువుల నోడించుచున్నవాఁడు. అనఁగాఁ బౌరుషము నుచితకాలమున నుపయోగించునని భావము. ఇన్నిగుణములుగలవాఁడు రామమూర్తియని దశరథుఁడు వర్ణించెను.

దీనినుండి గ్రహింపఁదగువిషయములేవి? మానవుఁడు భూతదయగలిగి యుండవలెనని తొలుత నేర్చుకొనవలెను. దానిచే నహింసావ్రతమున నాసక్తి గలుగును. అహింసయందు సకలధర్మములు నెలకొనియున్నవి. దానిని మించినధర్మములు లేవని మహాభారతము స్పష్టపఱచుచున్నది. అట్టి యహింసావ్రతము శ్రీరామమూర్తిప్రవృత్తియందుఁ గనందగు. ఆశ్రితరక్షణ మాపురుషోత్తముని స్వభావమనవలయు. సత్యసమాదరణము ప్రధానము. శ్రీమద్రామాయణమునందు రామచంద్రుఁడు తెలిపినవానిలో "అనృతంనోక్తపూర్వమ్మే" అనునదియే ప్రధానము. కావున నట్టిభగవంతుఁ డాచరించి తేటపఱచిన సద్గుణములలోనే యొక్కదానినైన మన మలవఱచుకొనఁ బ్రయత్నింపవలయును. కేవల రామచరితమును బఠించి ధనము సంపాదించుట లాభకరముకాదు. దాన విశేషించి మేలు లేదు.

దానిసారమేమని విమర్శించి యందొక్కమంచియలవాటునైన మనకు లభించునట్లు చేసికొనకయున్న నారామాయణఫల మల్పమే యగును. యథాశక్తి న్యాయమననుసరించి యీపర మేశ్వరునియందుఁ గలసద్గుణవ్రాతమున నేయొక్కదానినైన నభ్యసింప యత్నింపవలయును. అదియే యిందుఁగలసారము.

"అంజలిం కుర్మి కైకేయి పాదౌ చాపి స్పృశామి తే
శరణం భవ రామస్య మాఽధర్మో మామిహ స్పృశేత్"

అని మూలము. "శరణం భవరామస్య" రాముని రక్షింపుమా యనికదా భావము. ఇది సామాన్యార్థమునుండి తేలినది. శరణ మనఁగా గృహము. రామునకు గృహము కమ్మా. అనఁగా రాముఁడు నివసింప నవకాశము కల్పింపుమా యని యర్థము. శ్రీరామునిచరిత్రము నీమూలమున నిలుచునట్లు చేయుమా యని భావము. నీ వీవరము లడుగకయున్న శ్రీరామునిచరిత్రము లోకపావనమై దేవతలకు లాభము నొసంగుచు, దుష్ట నిర్మూలనముచేయుచు, ధర్మమును శాశ్వతముగా నెలకొల్పఁ జాలదనియే సారము. దశరథుఁ డీయభిప్రాయముకలవాఁడా యని ప్రశ్నింపకుఁడు. దశరథునకుఁ దెలియక వాక్కులు వెడలుచున్నవి. దుఃఖాక్రాంతుఁడు. పరవశుఁడునై యున్నవాఁడు. భావికాలము పురికొల్పఁ దానేమనుచున్నాఁడో యాతఁ డెఱుంగఁడు. కాని దైవికముగా నీభావమే వెలువడవలెను. అట్లే వెడలెనని మనము గ్రహింపందగు. దీనివలనిలాభమేమి? అని యడుగవచ్చును. కైకలోకమునకు మహోపకారమొనర్చె నని యెఱుంగుటయే లాభము. కైకేయి దుష్టురాలన్నభావము మనమనస్సులనుండి తొలంగెనేని భగవంతునకు సాయపడిన

వారలలోనొకతుక కైకయగునని మనము గ్రహింతుము. అపుఁడామెను మనము దూషింపక భూషింతుము. ఇంతకన్న లాభము వేఱేది కావలయును?

"యది దత్త్వా వరౌ రాజన్ పునః ప్రత్యనుతప్యసే,
ధార్మికత్వం కథం వీర పృథివ్యాం కథయిష్యసి. ౩౯
యదా సమేతా బహవ స్త్వయా రాజర్షయ స్తదా,
కథయిష్యంతి ధర్మజ్ఞ తత్ర కిం ప్రతివక్ష్యసి. ౪౦
యస్యాః ప్రసాదే జీవామి యా చ మామభ్యపాలయత్,
తస్యాః కృతం మయా మిథ్యా కైకేయ్యా ఇతి వక్ష్యసి. ౪౧
కిల్బిషత్వం నరేంద్రాణాం కరిష్యసి నరాధిప,
యో దత్త్వా వరమద్యైవ పునరన్యాని భాషసే." ౪౨

అని మూలము. దీనఁగలుగువిశేషముల నెఱుఁగుదము. ఆడిన మాటతప్పినయెడల ధార్మికత్వము చెల్లదు. అనఁగా సత్యము ధర్మాశ్రయము, ధర్మము సత్యమూలము. పరస్పరసంబంధము వదలదని భావము.

"యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ,
హన్యతే ప్రేక్షమాణానాం హతా స్తత్ర సభాసదః. ౧౪
ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః,
తస్మాద్ధర్మో న హంతవ్యో మా నో ధర్మో హతోఽవధీత్. ౧౫
వృషో హి భగవాన్ ధర్మ స్తస్య యః కురుతే హ్యలం,
వృషలం తం విదుర్దేవా స్తస్మాద్ధర్మం న లోపయేత్. ౧౬
ఏకఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతి యః,
శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి." ౧౭

(మను. ౮. అధ్యా.)

అనుమనుస్మృతివాక్కులనే కైక యిటుఁ దెల్పెను. సత్యము వదలిన ధార్మికుఁ డనఁబడఁడు. ధర్మమునుమించినమిత్రము లోకమున లేదు. జనాపవాదము భరింపరానిది. వీనినెల్ల నెట్లు భరింతువని దశరథుని కైక ప్రశ్నించెను? 'లోకాపవాదాద్భయ'మ్మను భర్తృహరినీతివాక్య మాకాలమున నెంతప్రాముఖ్యమును వహించియుండెనో యిందుమూలమునఁ దేటపడియెడు. ఎవరు సత్యమును దప్పుదురో ధర్మమును దాఁటుదురో వారినెల్ల రాజర్షులు చేరి యాక్షేపింతురనియు, దాన వారల కపవాదము వ్యాపించి యపకీర్తిని దెచ్చుననియు మన మెఱుంగవలయు. ఇది యాకాలమునఁ గలయాచారము. సత్యధర్మములను భగవద్రూపములుగా భావించుచున్నందుననే వాని వదలినవారు పాతకులని పరిగణింపఁబడుచుండిరి. ఈకాలమున నయ్యవి ప్రాధాన్యమును గోలుపోయినవి. కావుననే వానిని వదలుట కష్టముగాఁ దోఁచుట లేదు. దేశారిష్టముల కిదియే కారణమని మన మెఱుంగవలయును. సత్యధర్మములు భగవత్స్వరూపములగుట వాని నాదరింపకయున్న భగవంతు నాదరింపనట్లే. నాస్తికాభాసులన్న నింకెవ్వరు? భగవదనుగ్రహము కలుగవనువారు కొందఱు గలరు. భగవంతు నాదరింపనపు డది యెట్లు కలుగును? ఎన్నితపస్సులుచేసినను, ఎన్నివేషములువేసినను, ఎన్నివిధముల భగవంతు నారాధించునట్లు నటించినను, ఎవ్వారి మనస్సు సత్యధర్మముల నాదరింపదో వారియారాధనములు నిష్ఫలములని యీరామాయణవాక్యములు మనుస్మృతివాక్యములు తేటపఱచుచున్నవి. "అంతఃప్రచ్ఛన్నపాపానాం శాస్తా వైవస్వతో యమః" అన్నసూక్తి తప్పదుకదా. పైవేషములు

పామరులనుమాత్రమే మోసపుచ్చఁజాలుననియు, స్వనాశన హేతువులగుననియుఁ దెలియక లోకులను మోసగింప యతి వేషములుదాల్చువారు దుర్గతిపాలగుదురనియు, బహువిధ వేషధారులు చెలరేఁగుకొలఁదిని సత్యధర్మములు నశించి భగవంతునిదయను వ్యాపింపకయుండఁజేయుననియుఁ, గావుననట్టి వారిని దూరముగాఁ బాఱఁదోలి యథాశక్తిన్యాయము ననుసరించి సత్యధర్మములు భగవంతునియాకారములే యని నమ్మి వాని నారాధించిన నాపరమేశ్వరుఁడు, సంతృప్తుఁడగుననియు మనకీభాగము బోధించుచున్నది.

ఎవతుకయనుగ్రహమున బ్రదికితినో ఎవ్వతుక నన్నుఁ బ్రాణముపోవునట్టి కట్టడికాలమునఁ గాపాడెనో యట్టికైకకు నేనిచ్చినవరముల నీయక వృథనేసితినని పెద్దలయెదుటఁ జెప్పఁ గలవా? అని కైక రాజును బ్రశ్నించెను.

"పాపానామధికం పాపం హననం జీవజాతినాం
ఏతస్మాదధికం పాపం విశ్వస్తే శరణం గతే
విశ్వస్య హత్వా పాపం తం శూద్రం వా ప్యంత్యజాతికం
బ్రహ్మహత్యాధికం పాపం తస్మాన్నాస్త్యస్య నిష్కృతిః"

అని పురాణవాక్యము కనంబడియెడి. కృతఘ్నుఁడగుట మహాపాపమని దీనినుండి గ్రహింపందగు. ఆపత్కాలమున మహోపకారమొనరించిన నాకు నీవిట్లు మాటతప్పుట న్యాయముకాదని కైక తెలుపుచున్నది. ఒకరివలన నుపకారమునొందినపుడు వారికిఁ బ్రత్యుపకారము చేయవలయునని, బదులుచేయఁజాలఁడేని ఆయుపకారమును స్మరించుచుండవలయునని మనము గ్రహింపవలయును. అట్టివాఁడే కృతజ్ఞుఁ డనంబడును. అట్లుగాక బదులు

చేయఁజాలక యుపకారమును స్మరింపక మీఁదు మిక్కిలి యప కారము చేయునేని కృతఘ్నుఁడగును. కృతఘ్నతకంటె మహా పాపము లేదని మహాభారతము చాటుచున్నది. బ్రహ్మఘ్నునకుం గూడఁ బ్రాయశ్చిత్తము కలదుకాని కృతఘ్నునకు లేదనియే మహాభారతాభిప్రాయము. ఈనీతిని వాల్మీకిమహాముని కైక వాక్కులమూలమున మనకుఁ దెలిపెనని మన మెఱుంగందగు.

"సమయం మానృతం కార్షీః పూర్వవృత్తమనుస్మరన్
స త్వం ధర్మం పరిత్యజ్య రామం రాజ్యేఽభిషిచ్య చ
సహ కౌసల్యయా నిత్యం రంతుమిచ్ఛసి దుర్మతే
భవత్వధర్మో ధర్మో వా సత్యం వా యది వానృతం
యత్త్వయా సంశ్రుతం మహ్యం తస్య నాస్తి వ్యతిక్రమః" ४८

అని మూలము. దీనిసారమేమి?

చెప్పినమాటను దప్పరాదు. పెద్దలప్రవర్తనమును స్మరింపవలయును. అది మంచినడవడికను గలుగునట్లు లోనర్చును. కావున ధర్మమును బరిత్యజింపరాదు. ముందువెనుకలాలోచించి మాట చెప్పవలయును. ఒకప్పు డాలోచించియో యాలోచింపకయో ప్రతినచేసినయెడల దానిని దీర్పవలయును. దాని నతిక్రమింపరాదు. అను నీతులే యీభాగమునుండి మనచే గ్రహింపఁబడఁదగినవి. తాఁజెప్పినమాట తప్పువాఁ డసత్యవాది యగును. సత్యము భగవత్స్వరూపము. "తస్మాత్సత్యం పరమం వదంతి"అని మహనీయు లుపదేశించిరి. సత్యమును విడనాడుట భగవంతు నాదరింపని యట్లే. కావున ఎట్టులైన ధర్మము నిర్వహించుటయే యుత్తమకార్యమనునీతిని మన కీభాగము బోధించుచున్నది.

"శ్రుత్వా తు రాజా కైకేయ్యా వృతం పరమశోభనం
రామస్య చ వనే వాసమైశ్వర్యం భరతస్య చ
నాభ్యభాషత కైకేయీం ముహూర్తం వ్యాకులేంద్రియః."

అని మూలము. ఇది విమర్శింపఁదగినది. 'కైకేయ్యావృతం పరం అశోభనమ్' అని పదవిభాగము. మిక్కిలి యమంగళకరమగు వరమును విని యని సామాన్యార్థము. కైక యడిగినవరము (అనఁగా శ్రీరామవనవాసము. భరతాభిషేకము ననుభావము గలది.) పరమశోభనము అనఁగా స్వర్గమర్త్యపాతాళములను మూఁడులోకములకు మిక్కిలి మంగళకరమైనదని విశేషార్థము. ఎట్లు? రామచంద్రుఁ డడవుల నివసించి దుష్టరాక్షసుల సంహరించి సాధువుల రక్షించి ధర్మమునిలుపుటకే యవతరించెను. అది కైకవరములపై నాధారపడియున్నది. కావున నామె యావరముల నడుగుట జగత్కల్యాణహేతువుగాక మఱేమగును? భరతునకు రాజ్యప్రాప్తివలన లాభమేమని యడుగువా రుండక పోరు.

"హేమ్నస్సంలక్ష్యతే హ్యగ్నౌ విశుద్ధిశ్శ్యామికాపి వా"

అన్నయట్లు రాజ్యము లభించినపుడుగాని భరతునకుఁ గల భ్రాతృవాత్సల్యము, నీతి, ధర్మము ననునవి బయల్పడవు. దాననే యాతనిప్రవృత్తి లోకమున కుదాహరణభూతము కాఁగలదు. కావున నీరెండును జగన్మంగళకరములే యని వాల్మీకి యిందుమూలమున మనకుఁ దెలిపెనని గ్రహింపఁదగు. ఒకనికహితమైనను బ్రపంచమునకు హితమగునేని యదియే పరమమంగళమని యెఱుంగవలయు. ఎందఱికో యహితమై యొక్కనికిమాత్రమే హితమగునది యమంగళమనియే యెఱుంగ

వలయు. భగవంతునాశయ మిదియేకదా. తనయవతారఫల మును దానెఱింగియే కైక నట్లడుగఁజేసెను. సంకల్పమాత్ర మున సకలకార్యములు సిద్ధింపఁజేయు పరమేశ్వరునకు నీకా ర్యము స్వల్పము గాకమానదు. ఇట్టిఘట్టముల నిట్టియర్థములను మన మంగీకరింపకపోరాదు. అంగీకరించిననే తత్త్వము బయ ల్పడును. తత్త్వ మెఱుంగుటయే గ్రంథపారాయణమునకు ఫలము.

"ప్రైక్షతానిమిషా దేవీం ప్రియామప్రియవాదినీం"

అనుమూలము పైనవ్రాసినభావమును దృఢపఱచుచున్నది. ఇందు మహాకవి వాల్మీకిముని 'దేవీం' అని ప్రయోగించెను. పూజ్యురాలనికదా దానియర్థము. కైక బాహ్యదృష్టికి దుష్టు రాలుగాఁ గనంబడినను జ్ఞానదృష్టికి లోకోపకారధర్మరక్షణ కార్యములకు మహోపకార మొనరించినదని తోఁచును. కావున "అప్రియవాదినీమివ స్థితాం ప్రియాం దేవీం" అని యన్వ యింపవలయును. పైకి నప్రియములు పలుకుచున్నయట్లు తోఁపఁ జేయుచున్న పూజ్యురాలగుభార్యను అని దానియర్థము. అట్టి కైకను నిమేషములులేనిదృష్టిం గాంచెనని సాధారణార్థము. ఈఘట్టమున నీయర్థము గ్రహించుట న్యాయ్యము. కూడ దందురేని మహాకవి పదప్రయోగములు సార్థకములు కావన వలసివచ్చును. జ్ఞానధనుఁడగు మహాకవి కైకవలనఁ గలుగు లోకోపకారము నెఱింగియే యట్టిగూఢార్థగుంభితపదములం బ్రయోగించెను. "దుష్టచారిణీమ్" అను మొదలగుపదములు మృత్యువశంగతుఁడగు దశరథునినోటం బలికించెను. ఈవిష యమును మనమెఱింగి కైకను దూషించుటకు బదులుగా

భూషింపవలయును. ఈఘట్టమున నాంధ్రీకరించినవా రెంత దనుక మూలార్థమును బోధించిరో కనుఁగొందము. మూలమునుగాంచిన పెద్దలీపద్యములం బరికింతురుగాక.

"నాభ్యభాషత కైకేయీం మహార్తం వ్యాకులేంద్రియః
ప్రైక్షతానిమిషో దేవీం ప్రియామప్రియవాదినీం" గ.౭

... ... వరము
లడుగఁగా విని యింద్రియంబులు వ్యాకుల
ములయి మార్గముతప్పఁ బలుకకొక్క
గడియ కాలంబుండి కడున ప్రియములాడి
నట్టిప్రేయసిఁ గేకయాత్మజఁగను
తే. తెప్పవేయక కాంచుచు ... ...

(ఆంధ్ర శ్రీమద్రామాయణము.)

తలఁచి మనంబు విహ్వలతఁ దత్తఱమంద మహార్త
మాత్రదా, నలుకను బల్కమాని సతి నట్టె కనుంగొని
దుఃఖతప్తుఁడై. (వావిలికొలనురామాయణము.)

వావిలికొలను రామాయణము మూలార్థమును బోధించు ననియు,నావ్రాసినది యాకాశ రామన్న పంచాంగమనియు వ్రాసిన పెద్దలయభిప్రాయము సత్యసమ్మతమా కాదా యని సాధుమతులు పరీక్షింతురుగాక. 'వ్యాకులేంద్రియః' అని మూలమున నుండఁగా మనమ్మని తెనిఁగింపఁబడినది. అలుకను అనునది ప్రాసముకొఱకుఁ దేఁబడినది. ఇట్టివాని నాక్షేపింపరాదని నే నెఱుంగుదును.నాపద్యముల నిండవ్యర్థపదములున్నవని యాక్షేపించు పెద్దల కీమాటలు వ్రాయఁబడినవి. గ్రంథకర్త నాక్షేపింపఁ గోరికాదు. ఎవరికిఁ దోఁచినట్లు వారు వ్రాయుదురు. పక్షపాత

మున లేనిగుణములను గల్పించి యున్నవానిం దీసివైచి ప్రాయ రాదని విమర్శకులం బ్రార్థించుచున్నవాఁడను.

"తాం హి మే సుకృతాం బుద్ధిం సుహృద్భిస్సహ నిశ్చితాం
కథం ద్రక్ష్యామ్యపావృత్తాం పరైరివ హతాం చమూం
కిం మాం వక్ష్యంతి రాజానో నానాదిగ్భ్యస్సమాగతాః
బాలో బతాయమైక్ష్వాకశ్చిరం రాజ్యమపాలయత్"

అనుమూలము విమర్శింపఁదగినది.

ఇప్పుడే మంత్రులు సుహృదయులు నగువారింగూడి యాలోచించి నిండుసభలో శ్రీరాముని యువరాజుగా రేపే యభిషేకింతునని పలికితిని. ఆమాట నెట్లు తప్పుదునని దశరథు నాశయము. ఎటులైన నాకనృతదోషము గల్గును గదా యని దశరథుఁడు పరితపించుచున్నవాఁడు. వరములిచ్చిన రామాభిషేకవాగ్దానము వ్యర్థమగును. అభిషేకము జరపిన వరదానము వ్యర్థమగును అసత్యపాశబద్ధుఁడ నగుదుగదా యన్నభయ మారాజునకుం గల్గెను. ఇందేది వదలఁదగినది? అనునదియే యిటఁ బ్రశ్నము. దేనిని మానినను బాపము రాక తప్పదు. ఇపుడు దశరథునకుం గర్తవ్యమేది? అని విచారింతము.

పాపద్వయసమాగమమున గురుత్వలఘుత్వవిచార మావశ్యకమగు. ఇది యట్టిది కాదు. అనృతపాపమునకు గురుత్వలఘుత్వములు స్మృతికర్తలు తెలుపలేదు. కావున నీరెండును మానరానివి. సమానఫలదము లనవలయును. కాని సూక్ష్మదృష్టిం బరిశీలించిన మొదటిదే ప్రధాన మనవలయునని తోఁచెడిని. తాను మృతినొందునంతవిపత్కాలమునఁ గైక రక్షించెను. రెండుసారు లట్టివిపత్తు తనకుఁ (దశరథునకుఁ) గలుగ

నామె రక్షించెను. దానికిఁ బ్రతిఫలముగా నామె వరముల నడుగలేదు. కృతజ్ఞతంగొని తానే రెండువరము లడుగుమని కోరెను. నాకు వలసినపు డడుగుదునని కైక పలికెను. కృతఘ్నతకుఁ బాలుపడకయుండుట రాజునకు విధి. వలసినపు డడుగుదు నన్నమాటప్రకారమే యామె యడిగెను. రాజు వరముల నీయవలసినదే. రెండవదానిం బరిశీలింతము. రామచంద్రునకు రాజు కైక కొసంగినట్లు వరముల నీయలేదు. యువరాజుగా నభిషేకింతమని యాలోచింప మంత్రులు లోనగువా రంగికరించిరి. ప్రయత్నము సాగింప నెంచెను. ఇది మాటయిచ్చితప్పుట యెట్టిదో యట్టిది కానేరదు. ఉత్సవాదులు కాలాంతరమున సాగవచ్చును. కైకకు వరములనడిగినపు డిత్తు నన్నందున రాజధర్మజ్ఞుఁడయ్యెను. ఆయప్పుతీర్పవలసినదే కాని మానరాదు. శ్రీరాముఁ డొనరించిన యుపకారమునకుఁ దృప్తుఁడై రాజు వరము లీయలేదు. కనుక నీయుత్సవము నిలిపినంతమాత్రమున నసత్యఫలము రా జనుభవింపవలయునని శాస్త్రమురీతి మనము విధింప నవకాశములేదు. వరప్రదాన కాలమునఁ గోరరానివి కోరఁగూడదన్ననియమమును రాజు విధింపలేదు. కనుక దానిని దీర్పవలసినవాఁడయ్యెను. దాని మాని రెండవకార్యమగు పట్టాభిషేకముచేయుట ధర్మము నెఱవేర్చుట యనరాదు. దీని నొనరించినంతన యాపాపము తొలంగదు. ఈవిషయమెఱింగియే దశరథుఁ డూరకయుండెను. కనుక నీరెండింటిలో మొదటివరదానమును సఫలముచేయుటయే రాజునకు న్యాయ్యమని తేటపడియెడిని. ఈవిషయమున దశరథునిభావ మిదియే యని నిర్ణయించుట కాతనికి మనస్సు

స్థిరతం గాంచకుండెను. కాన నాతనిపలుకులంబట్టి నిర్ణయింప వలనుపడదు.

"యదాయదా హి కౌసల్యా దాసీవచ్చ సఖీవ చ,
భార్యావద్భగినీవచ్చ మాతృవచ్చోపతిష్ఠతి.
సతతం ప్రియకామా మే ప్రియపుత్రా ప్రియంవదా,
న మయా సత్కృతా దేవీ సత్కారార్హా కృతే తవ." ఉ౧.

అనునివి దశరథునివాక్యములు. సామాన్యార్థము స్పష్టము. ఇందు గ్రహింపఁదగినవిషయములు కొన్ని గలవు. భర్తకు భార్య యెట్లెట్లుపకారము చేయునో యిందు నావిషయము కలదు.

"ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ."

అని సీతావివాహకాలమున జనకమహారాజు తెలిపెనుగదా. ధర్మము అనఁగాఁ బరోపకారము అని కొందఱర్థముచెప్పి తదితరకార్యములయందు భార్యసాయమును భర్త కోరరాదని పలుకుదురు. అయ్యది ధర్మవిరుద్ధమని యీరామాయణమే తెలుపుచున్నది. సేవించుతఱి దాసివలె, పరమరహస్యము దెలుపునపుడు సఖివలె, ధర్మాచరణమున భార్యవలె, హితము తెలుపునపుడు తోఁబుట్టువువలె, మృష్టాన్నముపెట్టుసమయమునఁ దల్లివలె ధర్మపత్ని నటింపవలెనని దీనిభావము. ఈయుపచారము చేయవచ్చును. ఈయుపచారము చేయరాదు. అనువిచారముచేయక దాసి యెట్లు మర్యాదఁ బాటింపక చేయునో యట్లు సేవచేయవలయును. పరమరహస్యములగు విషయములు తెలుపునపుడు సఖి యెట్లు దాఁపక తెలుపునో యట్లు తెలుపవలయును. ధర్మము నాచరించునపుడు భార్యవలె

నన్గానందు సగము పుణ్యము పంచుకొనుటంబట్టి యత్యంతా సక్తితో నాచరించునది భార్యయే కాన నట్టిపనియం దెక్కువగఁ దోడ్పడవలయును. ఇట్లే తక్కినవియు నూహింపవలయును. ఇట్లు కౌసల్య నాకుఁ దోడుపడుచుండ నట్టిసాధ్విని నీకుఁ గోపము వచ్చునన్న భయమున గారవింపనైతినని దశరథుఁడు పశ్చాత్తాపతప్తుఁడయ్యెను.

"పతిర్భార్యాం సంప్రవిశ్య గర్భో భూత్వేహ జాయతే,
జాయాయా స్తద్ధి జాయాత్వం యదస్యాం జాయతే పునః. ౮
అర్థస్య సంగ్రహే చైనాం వ్యయే చైవ నియోజయేత్,
శౌచే ధర్మే ఽన్నపంక్త్యాం చ పారిణాహ్యస్య రక్షణే." ౧౧

మను. ౯ అధ్యా.

"మనోవాక్కర్మభిశ్శుద్ధా పతిదేశానువర్తినీ,
ఛాయేవానుగతా స్వచ్ఛా సఖీవ హితకర్మసు. ౨౬
దాసీవ దిష్టకార్యేషు భార్యా భర్తుస్సదా భవేత్."

వ్యాసస్మృతి. ౨ అధ్యా.

ఇట్లు స్మృతులు భార్యాధర్మములు తెలుపుచున్నవి. ఈనీతులనే శ్రీరామాయణమున వాల్మీకి తెలిపెను. దంపతిధర్మము లిట్లుండఁగా భరతఖండవాసులు స్త్రీల మిక్కిలి శ్రమముల పాలు చేయుచున్నవారని యాక్షేపించువారు విమర్శకులు కారని తోఁచెడిని. అనుకూలవతియగు తనయువతిని సత్కారములచే నన్గా వస్త్రాలంకారాదిదానముల నలరింపవలయు ననియే స్మృతులు ఘోషించుచున్నవి. ఈ రామాయణభాగము కూడ దశరథపశ్చాత్తాపరూపమున నావిషయమునే తెలుపు చున్నది. కావున సాధుశీలముగలయువతిని సత్కరింపవలయు

నని భర్తకు హితమును స్మృతులే తెలుపుచున్నవికదా యని యెఱింగినవా రెవ్వరు భరతఖండవాసుల నాక్షేపింపఁబూనరని తలంచుచున్నాఁడను.

"యోషాతిరూపసంపన్నా గర్వితా మదశాలినీ,
మమ రూపైవ సా జ్ఞేయా పుష్పేనాపి న తాడయేత్."

అనుకాళీవాక్యమును బరికింపుఁడు. గర్వితా=సౌందర్యగర్వము గలది. మదశాలినీ=భర్తను సంతోషింపఁజేయుటలో నేనే యందఱికన్న మిన్న ననునభిప్రాయముగలది. అట్టియువతి నన్నుగా భావింపవలయును. పుష్పముచేతను బ్రహరింపరా దనఁగా నించుకయు నొప్పింపరాదని సారము. ఇట్లుండఁగా మనల నాక్షేపించు టెంత యసంగతమో యూహింపుఁడు. ఇట్టి నీతిబోధకము గు నీశ్లోకములను దెనిఁగించువా రెంతమాత్రము గాపాడి దానినీతి లోకులకుఁ దెలిపిరో యించుక పరిశీలింతము.

సీ. సతతంబు నాకుఁ గౌసల్య ప్రియంబునే
కోరుచుండును దనకొడుకునందుఁ
బ్రీతియుఁ గలయది ప్రియభాషిణియుఁ గానఁ
బరిచర్య లొనరించుఁ బరమనియతి
దాసిగా మఱియు దుష్కృత్యము లొనగువినో
దమ్ముల సఖివలెఁ దానొనర్చు
ధర్మములను జేయుతఱి భార్యవలె సహా
యముచేయు నాకు హితమును దెలుపు

తే. కాలమునఁ దోడఁబుట్టువు లీల నలరుఁ
దనువు పోషించుతఱిని దా జననిరీతి

[library stamp]

నాదరము సూపుc బట్టింపుటతివ ననుచు
గర్వమును బూనియుండ దెక్కాలమునను.

(ఆంధ్ర శ్రీమద్రామాయణము.)

సీ. సమయోచితంబుగా సఖివలె దాసి నా
భార్యయట్టుల సొంతభగినిరీతిc
దల్లిమాడ్కిc జరించుc దగ సుప్రియంవద
ప్రియకామప్రియపుత్రప్రేమ కెంతొ

(వావిలికొలనురామాయణము.)

పెద్దల కీవిషయమున విశేషించి చెప్పcదలంపను. మూలార్థమును దెలుపునట్టిపద్ధతిలో నిందేది యుత్తమమో సాధువులు నిర్ణయించుకొనవలయు. నారామాయణమును దెగడి వావిలికొలను రామాయణమును బొగడినవారుమాత్రము "సొంతభగినిరీతి" అన్నచోటc గలచమత్కారమును మఱొకసారియుc బొగడి తృప్తినొందుదురుగాక.

"సతీం త్వామహామత్యంతం వ్యవస్యామ్యసతీం సతీం,
రూపిణీం విషసంయుక్తాం పీత్వేవ మదిరాం నరః." ౭౬

అని మూలము. ఇందొకవిశేషము కలదు. భరతఖండమునందు సురాపానము మహాపాతకపంచకమునc బరిగణింపcబడును. దానికిం బ్రాయశ్చిత్త మనేకప్రకారముల విధింపcబడినది. ఖండాంతరములయం దిద్ది పాపమునొసంగునదిగాc బరిగణింపc బడదని నావినికి. ఔషధముల నది విశేషించి యుపయోగింపc బడుననియు విన్నవాcడను. కాని సురాపానము నింద్యమని యెల్లవారు నంగీకరింతురని నాయభిప్రాయము. దానివిషయమును సుంత వ్రాయుదును. సురాపానము సర్వజాతులకు సర్వ

డా నిషేధమా? అదెందులకు వాడుకలోనికివచ్చెను? తలఁచుగా సురాభేదములన్నియుఁ బాపము నొసంగునవియా? భేదము గలదా యనువిషయములు విమర్శించుట యధికప్రసంగము నకు నుదాహరణము కాదు.

"బ్రహ్మహత్యా సురాపానం స్తేయం గుర్వంగనాగమః,
మహాంతి పాతకాన్యాహుస్సంసర్గశ్చాపి తైస్సహ. ౫౪

బ్రహ్మోజ్ఝితా వేదనిందా కౌటసాక్ష్యం సుహృద్వధః,
గర్హితానాద్యయోర్జగ్ధిస్సురాపానసమాని షట్." ౫౬

సురాపానము మహాపాతకమని వేదనిందాదులు సురాపాన సమానపాపము నిచ్చునవియని తాత్పర్యము.

"సురాం పీత్వా ద్విజో మోహాదగ్నివర్ణాం సురాం పిబేత్,
తయా సకాయే నిర్దగ్ధే ముచ్యతే కిల్బిషాత్తతః."

బ్రాహ్మణులు సురాపానముచేయరాదనియే దీనిసారము.

"సురాం వై మలమన్నానాం పాప్మా చ మలముచ్యతే,
తస్మాద్బ్రాహ్మణరాజన్యౌ వైశ్యశ్చ న సురాం పిబేత్." ౯౪

బ్రహ్మక్షత్రియవైశ్యులు సురాపానము చేయరాదనియే దీని సారము.

"గౌడీ పైష్టీ చ మాధ్వీ చ విజ్ఞేయా త్రివిధా సురా,
యథైవైకా తథా సర్వా న పాతవ్యా ద్విజోత్తమైః." ౯౪

బెల్లము కలిపిచేసిన సుర గౌడి యనంబడును. పిండిచేఁ జేయఁబడినది పైష్టియనంబడు. (గారపిండి యని కొందఱిమతము) ఇప్ప చెట్టుపూవులనుండి వచ్చినది మాధ్వి యనంబడు. ఈమూఁడు

విధములగు మద్యములను ద్విజులు (బ్రహ్మక్షత్రియవైశ్యులు) త్రాగరాదు. అను నీమనుస్మృతివాక్యముల ననుసరించి సురాపానము శూద్రజాతికి నిషేధింపఁబడలేదని యూహింపవచ్చును.

"నిషిద్ధభక్షణం జైహ్మ్యముత్కర్షే చ వచోఽనృతం,
రజస్వలాముఖాస్వాదస్సురాపానసమాని తు. ౨౨౯

సురాంబుఘృతగోమూత్రపయసామగ్నిసన్నిభమ్,
సురాపోఽన్యతమం పీత్వా మరణాచ్ఛుద్ధిమృచ్ఛతి. ౨౫౩

వాలవాసా జటీ వాపి బ్రహ్మహత్యావ్రతం చరేత్,
పిణ్యాకం వా కణాన్వాపి భక్షయేత్త్రిసమా నిశి." ౨౫౪

మనుస్మృత్యర్థమే యిందును గలదు.

"అజ్ఞానాత్తు సురాం పీత్వా రేతోవిణ్మూత్రమేవ చ,
పునస్సంస్కారమర్హంతి త్రయో వర్ణా ద్విజాతయః. ౨౫౫

పతిలోకం న సా యాతి బ్రాహ్మణీ యా సురాం పిబేత్,
ఇహైవ సా శునీ గృధ్రీ సూకరీ చోపజాయతే." ౨౫౬

అను నీయాజ్ఞవల్క్యస్మృతి ననుసరించి యాలోచింపఁగా ద్విజులనంబడు బ్రహ్మక్షత్రియవైశ్యులు సురాపానము చేయరాదనియు, బ్రాహ్మణస్త్రీయును త్రాగరాదనియుఁ దేలెడిని. శూద్రులకిది నిషేధము కాదనియు, స్త్రీజాతియందు బ్రాహ్మణస్త్రీ త్రాగరాదనియు నీస్మృతి యభిప్రాయము.

"మాధూకమైక్షవం సైరం తాళం ఖార్జూరపానసమ్,
మధూత్థం చైవ మార్ద్వీకం మైరేయం నాలికేరజం
అమేధ్యాని దశైతాని మద్యాని బ్రాహ్మణస్య తు."

అను నీబృహద్విష్ణుస్మృతివాక్యము బ్రాహ్మణునకు మాత్రమే సురాపానము నిషేధించుచున్నది.

"పానసం ద్రాక్షమాధూకం ఖార్జూరం తాళమైక్షవం,
మధూత్థం సైరిమారిష్టమైరేయం నారికేళజం
సమానాని విజానీయాన్మద్యాన్యేకాదశైవ తు." పులస్త్యస్మృతి.
"పీత్వా ప్రమాదతో మద్యమతికృచ్ఛ్రం చరేద్ద్విజః,
కారయేత్తస్య సంస్కారం శక్త్యా విప్రాంశ్చ భోజయేత్."
బృహస్పతిస్మృతి.

దీనింబట్టి బ్రాహ్మణుఁడుతప్పఁ దక్కినవారికి నిషేధము కానరాదని యూహింపవచ్చును.

"మద్యపశ్చ ద్విజః కుర్యాన్నదీం గత్వా సముద్రగామ్,
చాంద్రాయణే తతశ్చీర్ణే కుర్యాద్బ్రాహ్మణభోజనమ్
అనడుత్సహితాం గాం చ దద్యాద్విప్రేషు దక్షిణామ్. ౨౪
సురాపానం సకృత్కృత్వా అగ్నివర్ణాం సురాం పిబేత్,
స పాతయేదథాత్మానమిహ లోకే పరత్ర చ." ౨౫
పరాశరస్మృతి. ౧౨ అధ్యా.

పరాశరస్మృతిప్రకారము మద్యము సుర యొకటి కాదని తేలెడిని.

"పనసాదిజన్యం మదకారణద్రవ్యమ్ మద్యమ్,
పిష్టాదిజన్యో ద్రవద్రవ్యవిశేషస్సురా."

అని మాధవాచార్యులు వ్రాసిరి. పులస్త్యస్మృతిలోఁ జెప్పఁబడిన పదునొకండువస్తువులు మద్యములని, తక్కినవి సురాభేదములనియు నెఱుంగందగు. ఈస్మృతులసారము శూద్రులకు క్షత్రి

యాదిజాతిస్త్రీలకు సురాపానము నిషేధముకాదని తేలెడిని.

ఇంద్రః—

“ఆసవస్య తు కిం రూపం కో దోషః కశ్చ వా గుణః,
అన్నదోషకరం కిం తు తన్మే విస్తరతో వద.”

బృహస్పతిః—

“పైష్టికం తాళజం క్షైరం మాధూకం గుడసంభవం. ౧౩౩
క్రమాన్న్యూనతరం పాపం తదర్ధార్ధార్ధతస్తదా,
వర్జ్యమాద్యం సదా సర్వై ర్వరాద్యయుగ్మం నృపస్త్యజేత్. ౧౩౪
తృతీయమపి వైశ్యస్తు శూద్రోఽప్యాద్యద్వయం తథా,
తృతీయాది త్రివర్ణానామాసవం పేయముచ్యతే. ౧౩౫
స్త్రీణామపి తృతీయాది పేయం స్యాద్బ్రాహ్మణీం వినా,
పతిహీనా చ కన్యా చ త్యజేదృతుమతీ తథా. ౧౩౬
అభర్తృసన్నిధౌ నారీ మద్యం పిబతి లోలుపా,
ఉన్మాదినీతి సా ఖ్యాతా తాం త్యజేదంత్యజామివ. ౧౩౭
దశాష్టషట్చతస్రస్తు ద్విజాదీనామఘం భవేత్,
స్త్రీణామఘం తదర్ధం స్యాత్పాదం స్యాద్భర్తృసంగమే. ౧౩౮
మద్యం పీత్వా ద్విజో మోహాత్కృచ్ఛ్రం చాంద్రాయణం చరేత్,
జపేచ్చాయుతగాయత్రీం జాతవేదసమేవ వా. ౧౩౯
అంబికాహృదయం వాపి జపేచ్ఛుద్ధో భవేన్నరః,
క్షత్రియాది త్రివర్ణానాం ద్విజాదర్ధార్ధతః క్రమాత్. ౧౪౦
స్త్రీణామర్ధార్ధకష్టిస్స్యాత్కారయేద్వా ద్విజైరపి,
అంతర్జలే సహస్రం వా జపేచ్ఛుద్ధిమవాప్నుయాత్. ౧౪౧
లక్ష్మీస్సరస్వతీ గౌరీ చండికా త్రిపురాంబికా,
భైరవో భైరవీ కాళీ మహాశాస్తా చ మాతరః. ౧౪౨
అన్యాశ్చ శక్తయస్తాసాం పూజనే మధు శస్యతే,

బ్రాహ్మణస్తు వినా లేన యజేద్వేదాంతపారగః. ౧౪౩
ఇతరే మధునా దేవీమర్చయేయుః ఫలార్థినః,
తన్నివేదితమశ్నంత స్తదనన్యా స్తదాత్మకాః. ౧౪౪
తాసాం ప్రభావాద్గచ్ఛంతి నిర్లేపాస్తే పరాం గతిం,
కృతస్యాఖిలపాపస్య జ్ఞానతోఽజ్ఞానతోఽపి వా. ౧౪౫
ప్రాయశ్చిత్తమిదం ప్రోక్తం పరాశక్తేః పదస్మృతిః,
అనభ్యర్చ్య పరాం శక్తిం పిబేన్మద్యం తు యోఽధమః. ౧౪౬
రౌరవే నరకేఽబ్దాంస్తు నివసేద్బిందుసంఖ్యయా,
భోగేచ్ఛయాపి యో మద్యం పిబతే బ్రాహ్మణాధమః. ౧౪౭
ప్రాయశ్చిత్తం న వై వాచ్యం శిలాగ్నిపతనాదృతే,
ద్విజో మోహాన్న తు పిబేత్స్నేహాద్వా కామతోఽపివా.'' ౧౪౮
లలితోపాఖ్యానము. ౨ అధ్యా.

ఈపురాణము ననుసరించి యోజింతము. ఆసవము, మద్యము, సుర అనువానికి భేదము కానరాదు. గారపిండినుండితీసినది, తాటిచెట్టునుండితీసినది, నారికేళమువలనఁ గలిగినది, యిప్పపూవులనుండితీసినది, బెల్లముకలిపితీసినది అనునవి యైదువిధములగుమద్యములు ప్రసిద్ధములు. ఇవి వరుసగా సగము పాపమొకదానికంటె నొకటి తక్కువగాఁగలవి. నాలుగుజాతులవారును పైష్టికమును త్రాగరాదు. పైష్టికతాళజమద్యముల రాజులు త్రాగరాదు. పైష్టికతాళజకైరములను మద్యముల మూఁడింటిని వైశ్యులు త్రాగరాదు. శూద్రులు పైష్టికతాళజములఁ ద్రాగరాదు. అనఁగా క్షత్రియులు లోనగువారు తక్కినవానిని ద్రాగవచ్చును. బ్రాహ్మణస్త్రీతప్పఁ దక్కినమూఁడుజాతులస్త్రీలు మొదటిరెండుతప్పఁ దక్కినవానిని ద్రాగవచ్చును.

విధవయుఁ గన్యకయు ఋతుమతియైనస్త్రీయుఁ ద్రాగరాదు. ఎప్పుడు? అను ప్రశ్నము వచ్చెను. స్త్రీ భర్తృసన్నిధానమునం గాక వేఱొకచో నాశచేతఁ ద్రాగిన నది యున్నాదిని యనఁ బడు. దానిని వదలవలయును. పది, ఎనిమిది, ఆఱు, నాలుగు భాగములు బ్రాహ్మణాదిస్త్రీలకుఁ బాపము. భర్తచెంతఁ ద్రాగిన నందు సగముపాపము గల్గును. బ్రాహ్మణుఁ డజ్ఞానమున మద్య పానముచేసినఁ జాంద్రాయణవ్రత మాచరింపందగు. తక్కిన ప్రాయశ్చిత్తములు చేయందగు.

ఇంతదనుక మనము పరిశీలించితి మేని బ్రాహ్మణుఁడుతప్పఁ దక్కినమూఁడుజాతులవారు నేవో కొన్ని విధములగుమద్య ములఁ ద్రాగవచ్చునని తేలెడిని. విషయమును జక్కఁగా విమ ర్శింపవలయును. కొంద ఱంతమాత్రమే గ్రహించి శాక్త గ్రంథములన్నియు సురాపానమునే యనుగ్రహించుచున్న వందురు. స్మృతులకంటె నీగ్రంథములయందు సురాపానము నిషేధింపఁబడినది. చూడుఁడు. లక్ష్మి మొదలగుదేవతల నారా ధించునపుడు మద్యము ప్రశస్తము. బ్రాహ్మణుఁ డాదేవతల నారాధించునపుడుకూడ మద్యమును గ్రహింపరాదు. తక్కిన జాతులవారు తమజాతి కుచితమగుమద్యము నివేదింపవచ్చును. ఇష్టదేవత కర్పించియే త్రాగవలయును. ఆదేవతయందే భక్తి యునుపవలయు. అట్టివా రాదేవతయనుగ్రహమునఁ బరమ పదము నొందుదురు. తెలిసియుండె తెలియకయుండె పాపము లొనరించిన పరదేవతాపాదస్మరణమున నయ్యది నశించును. ఇష్టదేవత నర్చింపక యేనీచుఁడు సురాపానము చేయునో వాఁడు బిందుసంఖ్యల ననుసరించి యన్నివత్సరములు రౌరవ

నరకమునంబడును. ఏబ్రాహ్మణాధముఁడు భోగేచ్ఛచే సురా పానము చేయునో వానికిఁ బ్రాయశ్చిత్తము లేదు. ఎందుండియో పడి చావవలసిన దే. అజ్ఞానముననొండె కామముననొండె ద్విజుఁడు మద్యపానము చేయరాదు. అనియే యీపురాణమునఁ గలభావము. దీనిసారమేమి?

సురాపానము నిషేధమే. ఎవరైన దానియం దాసక్తి గలవారలుండినఁ దమజాతికి నిషేధింపఁబడనిమద్యమును దైవ తారాధనమున నుపయోగించి త్రాగవలయు. క్షత్రియాది జాతులస్త్రీలు సంభోగాంగముగా జాత్యుచితమద్యము త్రాగ వచ్చును. భగవదారాధనము చేయక సురాపాన మెవ్వారును జేయరాదు. అనునదియే సారము. దీనినుండి మనము గ్రహింపఁ దగు నర్థమేది?

శాస్త్రము సురాపానము నంగీకరింపదు. ఏల విధించెనని ప్రశ్నించువారు దానిహృదయ మెఱుంగఁజాల రనవచ్చును. దురాచారము దుష్కర్మమూలమున నలవడును. దాని నొక్క సారి తొలఁగింప శక్యము కాదు. క్రమముగాఁదొలఁగింపవలయు. సురాభేదములయందు నల్పదోషముగలదానిని నిషేధింపక యధికదోషముగలదానిని నిషేధించిన దాని మానుదురని శాస్త్రములహృదయము. అదియుఁగూడ స్వేచ్ఛగాఁ ద్రాగరా దని నిషేధించి దేవతారాధనకాలమున నివేదించి యుపయో గింపవలయునని యనుజ్ఞ యిచ్చినందున నిరంతరాభ్యాసమునకు విచ్ఛేదముగలిగించిన ట్లగును. దాన నలవాటు తగ్గును. దేవ తారాధనమునఁ గొంతకాలమునకైన జ్ఞాన మంకురించును. దాన నిది దుష్కార్యమని తోఁచును అట్టిసమయమున దానిని

వదలుదురు. ఈభావమే పురాణములు స్మృతులు వెల్లడించును. అంతియకాని సురాపానము చేయుమని ప్రోత్సహింపవు.

"న మాంసభక్షణే దోషో న మద్యే న చ మైథునే,
ప్రవృత్తిరేషా భూతానాం నివృత్తిస్తు మహాఫలా."

అన్న మనుస్మృతివచనమున కర్థమేమి? నిరంతరాభ్యాసమునకు భంగముకలిగించుటయేగాక మఱేమగును?

యజ్ఞములయందు జంతుహింస విధించుట కిదియే కారణము. ఆయాచారమే సర్వదా పరిగ్రహింపఁదగినదని కాదు. కొందఱిపుడుకూడ యజ్ఞములయందు ఛాగవధము చేయుచునే యున్నవారు. పనికిరాదన్న వారు స్మృతివాక్యములం బఠింతురు. కాని యాస్మృతితాత్పర్యమేమని గ్రహింపరు. దుష్కార్యముల నెన్నింటినో స్మృతు లంగీకరించెను. ఏల? క్రమముగా దాని నడఁగించుసాధనములు తెల్పి తన్మూలమున నాదుష్కార్యము వరుసగా నశించుననియే. అంతియకాని యవి దుష్కార్యములు కావనియుఁ, బెద్దలందఱు నంగీకరింపఁదగినవనియు, వానివలన ముక్తి లభించుననియుఁ గాదు. ఈవిషయమును గ్రహింపకయున్నచో స్మృతిపురాణాదిపాఠము వ్యర్థమే యనవలయును. ఏమతముకూడ దురాచారముల నంగీకరింపదు. ఆయాకాలము ననుసరించి దేశము ననుసరించియు, నాయాయియాచారముల నిషేధించినచో ఫలింపదని కొన్నింటి నంగీకరించును. అంతియకాని యవి దురాచారములు కావని యామతహృదయము గాదు.

కొందఱు మతాంతరప్రవిష్టులు భగవతి నారాధించుట నీచమని దూఱుదురు. వారిదుష్కర్మము వారి నట్టు లాడించు

చున్నదని మన మూహింపవలసినదే. ఒక్కమతమువా రింకొక్కమతమువారి నాక్షేపించుట యలవాటుగా నున్నది. మధ్వవైష్ణవులు విశేషించి శక్తి నారాధించువారిని దిట్టుదురు. వివస్త్రయగునవయువతి నెట్లో యారాధింతురందురు. కాని తమ కూటములయందుఁ గంచుకోత్సవములందు సాగునాచారములు వారికిఁ దలంపునకు రావు కాఁబోలు. మతివిహీనులై యట్టులాక్షేపింతురు. అంతియకాని దేవతారాధనము నెవ్వారు విధించినను దానిమూలమున భక్తులు తరింతురనియే కాని చెడవలయునని కాదు. కావున మతస్థాపకుల మన మేమాత్రమాక్షేపింపరాదు. వారియభిప్రాయము లివి యని యెఱుంగఁజాలమైతిమని దుఃఖింపవలయును. ప్రాయశః పరమతముల నాక్షేపించువారు సద్గురువులకడఁ జక్కఁగఁ జదువుకొన్నవారు కారు. నాలుగుమాటలు నేర్చుకొని యత్యాచారముల నవలంబించి, కొందఱు యోగులమని, కొందఱు ధనార్జనలంపటులై, పరమతధర్మముల నాక్షేపించుచుఁ దిరుగుచుందురు. ఒక్కతావున నట్టివారు చాలకాల ముండఁజాలరు. అందుఁ గొన్ని దినములకు లోగుట్టు బయల్పడును. కావున నంతకుముందే స్థలాంతరమున కరుగుదురు. అందు నిట్లే ధనము చిక్కినంతకాలముండి యింకొక్కతావునకుఁ బోవుదురు. జ్ఞానియగువాఁ డెవ్వఁడుగాని విధివిహితమతముల నాక్షేపింపఁడని నాయాశయము. ధనార్జనోపాయములలో నిక్కాలమున వేదాంతప్రవచన మగ్రస్థానమును వహించినది. మతస్థాపనము ద్వితీయస్థాన మలంకరించినది. విగ్రహస్థాపనము వీనికిం దీసిపోవక సమానస్థానము కావలయునని చేతులు చాఁపుచున్నది. సోమరు లిట్టికార్యముల

మూలమున లోకుల మోసపుచ్చుచుండఁగాఁ బామరులు వారు ముక్తిస్థానమునకుఁ దీసికొనిపోవుదురని యాశించి యున్న నాలుగు డబ్బుల నాకపటనాటకసూత్రధారులకిచ్చి సేవించుచున్నారు. వారికి ధనవిముక్తియే ముక్తి. ఇట్టివారిపాలఁ బడకుండ సన్మతములబోధించువా రరుదుగనున్నారు. వారిమాటలు పామరుల కంతమధురములుగా నుండుటలేదు. పరమేశ్వరుఁడే యట్టివంచకులపాలఁబడకయుండఁ బామరులఁ గాపాడవలయును.

"అనార్య ఇతి మామార్యాః పుత్త్రవిక్రాయికం ధ్రువం,
ధిక్కరిష్యంతి రథ్యాసు సురాపం బ్రాహ్మణం యథా." ౭౮

అను నీమూలముకూడఁ బైవ్రాసినట్లు సురాపానము బ్రాహ్మణునకేసమయమునందును దగదని తెలుపుచున్నది. వాల్మీకిమహర్షి స్మృతులభావమునే యాయాయిసమయములయందు సంభాషణరూపమున వెల్లడించును. రామాయణము సదాచారములను దెలుపునదియే యని స్పష్టము.

"బాలిశో బత కామాత్మా రాజా దశరథో భృశం,
యస్త్రీకృతే ప్రియం పుత్త్రం వనం ప్రస్థాపయిష్యతి." ౮౩

అని మూలము. రాజు మూర్ఖుఁడు. కామాసక్తుఁడు. కనుకనే స్త్రీకొఱకుఁ బ్రియపుత్త్రకు నరణ్యములకుఁ బంపనున్నాఁడని తన్ను లోకులు దూషింతురని కైకకుం దెలుపుచున్నాఁడు. రాజులకు లోకమును రంజింపఁజేయుటయే ప్రధానమనియు, లోకాపవాదము రాకయుండఁ బ్రవర్తింపవలయుననియు, నందను గామాతురుఁ డనుపేరు రాఁగూడదనియు, స్త్రీని సంతోషింపఁజేయుటకై సత్కార్యమును వదలరాదనియు వాల్మీకి

మునివర్యుఁడు దశరథునివాక్యమూలమున లోకులకు నీతిని బోధించెను.

దశరథుని యీమాట న్యాయ్యమా కాదా యని పరికింతము. స్త్రీని వలచి తన్నిమిత్తమై రాముని నడవులకుం బంపలేదు. తానిచ్చినవరములమూలమునఁ దనసత్యము నిలుపుకొనఁ బంపెను. ఇపుడు పరితపింపనేల? తానిన్నిరీతుల న్యాయమును బోధించినఁ గైక తనపట్టుదలను మానుకొనునని యతనిభావమై యుండనోపు. కైకయుఁ బతివ్రతయగుట నీమాటల కంగీకరింపవలసినదియే. కాని భగవంతునియభిప్రాయము వేఱురీతిగానున్నపుడు కైక యేమిచేయఁగలదు? ఇట్టితావులఁ గైక దుర్వృత్తయని తేటపడియెడిని. ఐనను దీర్ఘదృష్టిం బరికించినఁ గైక యేమియుఁ జేయఁజాలదు. ఆమెకరుణ లోకోపకారక్షమమైనది. కాన రాజుమాటలకుఁ జెవియొగ్గ నుంకింపదు. దీనింబట్టి యెట్టిస్నేహముకాని భావిఫలము ననుసరించి మార్పునొందునని మన మెఱుంగవలయును.

యది మే రాఘవః కుర్యాద్వనం గచ్ఛేతి చోదితః,
ప్రతికూలం ప్రియం మే స్యాన్న తు వత్సః కరిష్యతి." రా.

అను నీమూలము పరిశీలింపుఁడు. ఇందు సత్పుత్త్రునిధర్మములు తెలుపఁబడియున్నవి. తండ్రి సర్వసుఖములను వదలి యడవులకుఁ బొమ్మన్నను బితృశాసనముఁ దలందాల్చి యేకుమారుఁడు పోవునో యాతఁడే కీర్తిమంతుఁడని యీభాగము మనకు బోధించుచున్నది. "పుత్త్రః పితృవశానుగః" అన్నసూక్తి యీయర్థమునే తెలుపునుగదా.

శ్రీరామావతారమున భగవంతుఁడు ప్రధానముగా లోకమునకు వెల్లడించినది పితృపాలనము, సత్యనిరతి లోనగు నాచారములనే. ఆవిషయము ముందు వ్రాయఁబడును. ఇచ్చట దశరథుఁడే తనమాటకు వ్యతిరేకముగా శ్రీరామమూర్తి ప్రవర్తించెనేని తనకిష్టమే యనియుఁ, గాని యతఁ డట్లు ప్రవర్తింపఁడనియుఁ జెప్పుటచే, శ్రీరామమూర్తి తండ్రియానతి నించుకయు మీఱఁడని సూచితము. శ్రీరామునియాచారము నుదాహరణముగాఁ గైకొని యెవరు తండ్రియానతి మీఱరో వారెల్ల లోకవిఖ్యాతింగాంతురనుట నిస్సందేహము.

"శుద్ధభావో హి భావం మే న తు జ్ఞాస్యతి రాఘవః,
స వనం ప్రవ్రజేత్యుక్తో బాఢమిత్యేవ వక్ష్యతి." రా౽౩౪

అని మూలము. నిర్మలహృదయుఁడు రాముఁడు. కావున నా హృదయ మెట్టిదో యెఱుంగఁడు. తనవలెనే నన్నును శుద్ధభావముగలవానినిగా నెఱింగి వనమునకుఁ బొమ్మని నేను జెప్పినంతనే యట్లే యని పలుకును. అని దశరథు నాశయము. అనఁగా రామవనవాసగమనము నామనస్సున కిష్టముకాదని యెఱుంగఁడని తాత్పర్యము. వరపాశబద్ధుఁడనై యుండుటం జేసి మాటాడకయున్న నామాటనే విశ్వసించును. కాని నాహృదయము నెఱుంగఁడు. ఎఱింగి నేను బోనొల్లనని పలుకునేని నాకిష్టమే. ఐన నారామచంద్రుఁ డట్లనువాఁడు కాఁడని సారము. దశరథునిభావ మేమని విచారింతము. నేఁజెప్పినమాటప్రకార మభిషేకము సాగవలయునని పట్టుపట్టి రాముఁ డడవులకుఁ బోనొల్లనని పలికినఁ జాలమేలు. కైక వరములమాట యేమన్న నాయాజ్ఞను రాముఁ డతిక్రమించెనని బదులు చెప్పవచ్చును.

అసత్యదోషము రాదు. అనియేకదా. ఈయూహ న్యాయసమ్మతమా. కాదా. అని విమర్శింతము. దుఃఖసాగరనిమగ్నుఁడై యున్న రాజు తగినట్లాలోచించుశక్తిలేమి నిట్లనియెనన్న దోషము లేదు. మనసార నీమాటయే చెప్పియున్న దోషమనుభవింపఁ దగినవాఁడే యగును. ఇది రామచంద్రసద్గుణకీర్తనము గావచ్చును. నామాట నతిక్రమింపక రాముఁ డడవులకుఁ బోవునని తాననఁగా నామాటలకుఁ గైకహృదయము కరఁగుననియే దశరథునిభావమని మన మూహించిన నది యంతగా నసత్యము కాదనవలయు. విచారముచేతఁ దపించుచున్న రాజు దీర్ఘమాలోచించి యన్నమాట కాదని యూహింతుమేని దోషియే యనవలయును. కైకయు దశరథుఁడును భవిష్యత్కాలపాశబద్ధులుగాన దానికిం దగినట్లే మాటలాడుచుందురనియు, నస్వతంత్రులనియు నూహించుటయే మంచిదని నాయాశయము. ఇందలివిశేషార్థ మేమి?

రాఘవుఁడు శుద్ధస్వభావుఁడు. అనఁగాఁ గృత్రిమగుణము లేనివాఁడని భావము. నాయానతి నిమిత్తమాత్రమే. వనమున కరుగుమా యన్నంతనే శిరసావహించి వెడలును. కాని నా భావము నెఱుఁగఁడు. అనఁగా నంగీకరింపఁడు. వనగమనమే రామావతారప్రయోజనమని యెఱుఁగకయున్నను దశరథుని నోట నీమాటలు వెడలెననియే మన మెఱుంగవలయును. ఈ యర్థమును

"రాఘవే హి వనం ప్రాప్తే సర్వలోకస్య ధిక్కృతం,
మృత్యురక్షమణీయం మాం నయిష్యతి యమక్షయం." ౮౮

అని నీమూలము సూచించుచున్నది. రాముఁ డడవులకుఁ బోవఁగా సర్వజనతిరస్కార మోర్వఁజాలనినన్ను మృత్యువు యము నింటికిఁ దీసికొనిపోవుననియే దీనిభావము. ఇంతటిజ్ఞానము దశరథునకుఁ గలదా యని ప్రశ్నింపరాదు. తనకుఁ గలిగినశాపము నతఁ డెఱుంగును. పుత్త్రశోకమున మరణము కలుగుననియే యతఁ డూహించెను. అది తప్పునది కాదనియే యతనివిశ్వాసము. కావున దశరథుఁ డిట్లు జరగఁగలదని యూహించెనని మనము నిశ్చయించుట పొరపాటు గాదు.

"ప్రియం చేద్భరతస్యైతద్రామప్రవ్రాజనం భవేత్,
మాస్మ మే భరతః కార్షీత్ప్రేతకృత్యం గతాయుషః." ౯౩

అనుమూలము విమర్శనార్హము. రాముఁ డడవులకేగుట భరతునకు సమ్మతమగునేని, మృతినొందిన నాకుఁ జేయఁదగుకర్మము లాతఁడు చేయరాదు. అనఁగాఁ దండ్రిమాట మీఱునతఁ డనిష్టుఁడు. కాన నతఁడు చేయుప్రేతకృత్యములు తండ్రికిం జేరవు. అతఁడు కుపుత్త్రుఁ డనంబడును. అట్టివాఁడు కర్మముల నాచరింప నర్హుఁడు కాఁడని దశరథునభిప్రాయము. ఇందలిసార మేది? మృతినొందినవారల నూత్నశరీరము ప్రేతత్వవిముక్తికొఱకుఁ జేయుకర్మములు ముగియుదనుక నిందే యుండును. మనకు వినఁబడునట్టికంఠస్వరము లేనందున వారిభావము మన మెఱుంగఁజాలము. పాంచభౌతికశరీరమునఁ గలయభిమానాదు లపుడుండుటంబట్టి యెవరు తమప్రీతికిం బాత్రులో వారు చేయుకర్మములఫలములే వారలకుం జెందు. కర్మముల నొనరించువాఁడు పరిశుద్ధభావము కలిగిననే యాభావనచే నాతనికర్మములు వారలకుఁ జెందును. నిర్మలాంతఃకరణులు కానివారు

చేయు కార్యములు నిష్ఫలములగును. బంధువులుకూడ దుఃఖింపక ప్రేతత్వవిముక్తికొఱకు సత్కర్మములు చేయవలయునని స్మృతి దెలుపుచున్నది.

"శ్లేష్మాశ్రు బాంధవైర్ముక్తం ప్రేతో భుంక్తే యతోఽవశః,
అతో న రోదితవ్యం హి క్రియాః కార్యాస్స్వశక్తితః." ౧౧.

యాజ్ఞవల్క్యము.

దుఃఖము మనశ్శాంతిభంగకరము. మనోనిర్మలత్వము భావనకు ముఖ్యము. అట్టివాఁడు కానిచో నాతఁ డొనరించుకర్మములు ఫలము నీఁజాలవు. ఈవిషయమును మహర్షి వాల్మీకి దశరథవాక్యరూపమున మనకుఁ దెలిపెనని యెఱుంగందగును. ఏ సత్కర్మములు చేయుచున్నను మనస్సు నిర్మలముగా నుండవలయునని దీనిసారము. తండ్రియాజ్ఞ మీఱరాదనియు, నట్లుగాక దానిం బాటింపనివాఁడు తండ్రికిఁ జేయునౌర్ధ్వదైహికక్రియలు ఫలింపవనియు దీనివలన మనము గ్రహింపఁదగువిషయము.

"ధిగస్తు యోషితో నామ శఠాస్స్వార్థపరాస్సదా,
న బ్రవీమి స్త్రియస్సర్వా భరతస్యైవ మాతరం." ౧౦౨

అని మూలము. శఠాః = కపటముగలవారు. ఆలంకారికులు "గూఢవిప్రియకృచ్ఛఠః" అందురు. స్వార్థపరాః=స్వప్రయోజనమందే యాసక్తిగలవారు. కావున నిందింపఁదగుదురు. ఈనింద స్త్రీలకందఱకు నన్వయింపదు. భరతునితల్లినిగుఱించియే చెప్పుచున్నవాఁడనని దశరథుఁడు పలికెను.

"సురాపీ వ్యాధితా ధూర్తా వంధ్యార్థఘ్న్యప్రియంవదా,
స్త్రీప్రసూశ్చాధివేత్తవ్యా పురుషద్వేషిణీ తథా." ౭౩

యాజ్ఞవల్క్యస్మృతి. ఆచారకాండము.

పౌంశ్చల్యాచ్చలచిత్తాచ్చ నైస్నేహాచ్చ స్వభావతః,
రక్షితా యత్నతోఽపీహ భర్తృష్వేతా వికుర్వతే. ౧౫
ఏవం స్వభావం జ్ఞాత్వాసాం ప్రజాపతినిసర్గజం,
పరమం యత్నమాతిష్ఠేత్పురుషో రక్షణం ప్రతి." ౧౬

మనుస్మృతి. ౯ అధ్యా.

అన్నస్మృతుల ననుసరించి దశరథుఁడు స్త్రీజాతినే దూషించెను. పతివ్రతాశిరోమణులగు ననసూయారుంధతులు లోనగు వారిం దలంచుకొని భరతునితల్లి యగుకైకనే దూషింతు ననెను. దీనిభావమేమి ? స్త్రీస్వభావము సాధారణముగా గూఢము. నిర్మలము కాదని భావము. రహస్యముగా నపకారము చేయ నుంకించునదియని భావము. తనలాభమునే కోరునది. ఇది స్మృతిసిద్ధము. కాని యట్టిజాతియం దుత్తమోత్తమస్వభావముగలవా రుదయించిరి. వారలకీర్తి లోకోత్తరముగ నున్నది. కాని భరతునితల్లి యాసాధ్వులలోఁ జేరదని దశరథు నాశయము. ఇది న్యాయ్యము కాదు. స్త్రీపురుషులస్వభావము ప్రాక్కర్మాధీనము. దానిననుసరించియే చిత్తవృత్తులు మాఱుచుండును. స్త్రీలకందఱ కొక్కరీతిగ నభిప్రాయముండదు. తఱచుగా నట్లే యుండుననవచ్చును. కైకచిత్త మేల యట్లు మార్పునొందెనో రాజెఱుంగఁడు. అసాధ్వి యనియే యాతఁ డూహించెను. అంతియ కాని తనశాప మామెవాగ్రూపముగా ఫలము నీయఁబూనెనని యెఱుంగఁజాలకపోయెను. ఎఱింగియు మరలమరలఁ బుత్రవాత్సల్యమను తెఱ తన్నుం గప్పఁగా మఱచిపోవఁజొచ్చెను. దీనింబట్టి కర్మ మెంతబలవత్తరమో యెఱుంగవచ్చును. "గహనా కర్మణో గతిః" అన్నమాట యెన్నిసారులు

స్మరించినను విసుగు రాదు. కావున సర్వము కర్మాధీనమని యెఱింగి యొకరిపై నాగ్రహ మునిచి వారిని దూషింపరాదు. ఏజాతినిగాని దూషింపరాదనియు, నొక్కనియందుఁగలయప రాధము జాతిని బాధుచేయఁజాలదనియు, నెవరికర్మము నను సరించి వారు వర్తింతురనియు మన మెఱుంగవలయును.

"వినాపి సూర్యేణ భవేత్ప్రవృత్తిరవర్ష తా వజ్రధరేణ వాపి,
రామం తు గచ్ఛంతమితస్సమీక్ష్య జీవేన్న కశ్చిత్త్వితి చేతనా మే. ౧౦౬

అని మూలము. దీనియర్థము స్పష్టము. ఎట్టి యశక్యకార్య మైనను శక్యము కావచ్చునుగాని రాముఁ డడవికింబోవఁ జూచువారిలో నొక్కఁడైన జీవింపఁడని నాయభిప్రాయమని దశరథుఁడు తెలిపెను. ఇదియే దీనితాత్పర్యము. వర్షము కురి పించువాఁ డింద్రుఁడని యార్యులు వ్యవహరింతురు. దీనినే యీ కాలమున నుండువారిలోఁ గొంద రాక్షేపింతురు. మన పూర్వులకు వర్షమన నెట్టిదో తెలియదనియే వారిభావము.

"యాభిరాదిత్యస్తపతి రశ్మిభిస్తాభిః పర్జన్యో వర్షతి."

అని శ్రుతి తెలుపుచున్నది. భూమిని సూర్యుఁ డేకిరణములచేఁ దపింపఁజేయుచున్నాఁడో యాకిరణములచేతనే పర్జన్యుఁడు వర్షించుచున్నాఁడని శ్రుతి తాత్పర్యము. భూగతజలమును గిరణములవలని యుష్ణగుణమునఁ బీల్చి సూర్యుఁడు మరల వానిరూపముననే వర్షించుననియేకదా యిందుఁ గలసారము. ఇంద్రునిప్రస్తావ మేలయనఁగా వర్షాధిదేవతగా నింద్రుని బలు కుదురు. దాన నపగాధమేమి? పూర్వులహృదయ మెఱుంగక యాక్షేపించువారల తెలివితక్కువయే యిటఁ దెల్లమగు చున్నది. విజ్ఞానసంపద్విషయమున మనయార్యుల కెవ్వరు సరి

పోలరని యెఱుంగుటయే యిప్పటిబుద్ధిమంతులకుఁ దగిన కార్యము.

"న కించిదాహాహితమప్రియం వచో
న వేత్తి రామః పరుషాణి భాషితుం,
కథన్ను రామే హ్యభిరామవాదిని
బ్రవీషి దోషాన్ గుణనిత్యసమ్మతే." ౧౧౦.

అని మూలము. ఈభాగము శ్రీరామచంద్రునికళ్యాణగుణములను దెలుపుచున్నది. హితముగానిది ప్రియముగానిది యొక్కమాటయైనం బలుకఁడు.

"సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయాన్న బ్రూయాత్సత్యమప్రియం,
ప్రియం చ నానృతం బ్రూయాదేష ధర్మస్సనాతనః."

అన్నమనుస్మృతివాక్యము స్మరింపఁదగినది. "అనృతం నోక్తపూర్వం" అను శ్రీరామవాక్యము నిట స్మరింపందగు. కఠినముగ మాటలాడ నెఱుంగఁడు.

"భద్రం భద్రమితి బ్రూయాద్భద్రమిత్యేవ వా వదేత్,
శుష్కవైరం వివాదం చ న కుర్యాత్కేనచిత్సహ."

అన్నమనుస్మృతివాక్య మిట నుదాహార్యము. సర్వజనులకుఁ బ్రియముగలుగఁ బలుకువాఁడు. నిరంతరసద్గుణపూర్ణుఁడు. అట్టి రామునియందు దోషములున్నవని యెట్లు చెప్పఁగలవు? అని దశరథుఁడు కైకను బ్రశ్నించుచున్నాఁడు? ఇపుడు దశరథుఁడు స్మృతిలేక పలుకుచున్నవాఁడనవలయును. శ్రీరాముఁడు దుర్గుణుఁడని, అసత్యవాదియని, పరుషభాషణుఁడని, ద్రోహియని కైక పలుకలేదు. రామమూర్తియందు దోష మారోపింపలేదు. వరముల నడిగి రాము నిపుడే యడవులకుం బంపు

మన్నది. "బ్రవీషి దోషాన్" అని రాజడుగుచుండుట విరుద్ధము కాదా. యని ప్రశ్నింతురు. అడవులకుఁ బంపుమన్నంతనే నగరమున నుండఁదగనివాఁడని కైక యూహించి యీవరములడిగెనని రాజు తలంచెను. రాముఁడు నిర్దోషియని కైక యెఱుంగదనియే దశరథునియభిప్రాయమని మన మూహించిన దశరథుఁ డవివేకియన్న దురూహ తొలంగును. అదియే మనము చేయఁదగుసత్కార్యము. శ్రీరామచంద్రుఁడు లోకాతీతుఁడగుపురుషోత్తముఁడని యీభాగము మనకు బోధించుచున్నది. రామమూర్తి భగవంతుఁడని వాల్మీకి యీఘట్టమున స్పష్టముగా నుత్తరకాండమునఁ దెలిపినట్లు తెలుపకయున్నను దదభిప్రాయము నే వెల్లడించెనని మన మెంచఁదగు. సకలకల్యాణగుణములు భగవంతునియందుఁ దప్ప నితరులయందు నెలకొనియుండవనుట సిద్ధాంతముకదా. పక్షపాతశూన్యత్వమే పరమేశ్వరలక్షణమని పెద్ద లంగీకరించిరి. అట్టిలక్షణము లన్నియు శ్రీరామచంద్రునియందు నెలకొనియున్నవి. ఈవిషయమును మన మెఱింగి శ్రీరామచరితమును బఠించిననే దానిసారము తెలియును. లేకున్నఁ గొన్నిభాగములు విపరీతములుగాఁ దోఁచును. మనకుఁ గల్గుశంకలే మనపురోవృద్ధి నడ్డగించును. కావునఁ దొలుత సదభిప్రాయముకలిగి గ్రంథము పఠింపవలయును.

"ప్రతాప్య వా ప్రజ్వల వా ప్రణశ్య వా
సహస్రశో వా స్ఫుటితా మహీం వ్రజ,
న తే కరిష్యామి వచస్సుదారుణం
మమాహితం కేకయరాజపాంసని!" ౧౧౧

అని మూలము. నీవెట్టైన నశింతువుగాక. దారుణమగు నీమాటను సఫలముచేయను. ఓకేకయవంశచ్ఛేదనకారిణీ! అని రాజు పలికెను. దీనింబట్టి సత్యప్రతిజ్ఞుఁడు రాజు కాఁడని యూహింపవచ్చును. వరముల నిపుడీయననికదా రాజుభావమని కొందఱందురు. ముందువెనుక లాలోచింపక యొకయభిప్రాయము నొందరాదు. ఇట్టి క్రూరవాక్కుపలికిన విని యించుక జ్ఞానము కలిగి భర్తకాగ్రహమును గలిగించితినే యనుపశ్చాత్తాపమున సన్మార్గమునకు వచ్చునేమో కైక యని రాజాలోచించియే యీమాట పలికెను. "కేకయరాజపాంసని" అనువాక్య మీయర్థమును సూచించెడిని. పితృకులమునకు నీవలన మహాపయశస్సు ప్రాప్తించును జుమీ. అన్నవాక్యమునందు నీవిట్టిదుష్ప్రియత్నమును మానకయున్న మీజనకవంశమునకు నీమూలమున దుర్యశముకలుగు ననునర్థ మిమిడియున్నది. దానికి జంకియైనఁ గైక మంచిదారిం ద్రొక్కునని యే రాజు నాశయము. ఈ భావము పూర్వాపరగ్రంథమును విమర్శించినఁ బోడసూపును. కావునఁ జక్కఁగా విమర్శింపకయే భావమును వెలిఁబుచ్చరాదని విమర్శకులఁ బ్రార్థింతును. ఈభావము నీక్రిందిశ్లోకమే తెలుపుచున్నది.

"మమాహితం దేవి న కర్తుమర్హసి
స్పృశామి పాదావపి తే ప్రసీద మే." ౧౧౩

తనవరమునీయ నిష్టపడనివాఁడైనచో నీనమస్కారములేల? ఈదీనవాక్కులేల? సత్యపాశబద్ధుఁడై యేమియు ననఁజాలక కైక కెట్టులైన బుద్ధివచ్చుననియే యెన్నియుపాయములైనఁ జేయఁబూనెనని మనము గ్రహింపవలయును.

మహాశయులారా! ఇట్టు లీసర్గము కైకయొక్కయు దశరథునియొక్కయు నాశయముల వెలిఁబుచ్చుచు ననేకధర్మవిశేషముల మనకు బోధించుచున్నది. భగవతి యగుసీతాదేవి సంకల్పము ఫలించుచున్నజాడను విశదముచేయుచున్నది. రామాయణము కేవలకావ్యము కాదు. స్మృతిపురాణోక్తధర్మవిశేషములనిధియని తేటపఱచుచున్నది. కర్మము బలవత్తరమనియు, దాని నెఱుంగఁదరముకాదనియు సిద్ధాంతముచేయుచున్నది. శ్రీరాముని పరమేశ్వరత్వమును స్పష్టీకరించుచున్నది. సత్యము భగవత్స్వరూపమే యని యుపదేశించుచున్నది. కావున నిందలి విశేషముల నాకుఁ దోఁచినయంతవట్టు వ్రాసితిని. ఇది చాలఁ దక్కువయని నే నెఱుంగుదును. మఱికొన్నిభాగము లిందు విమర్శింపఁదగినవి కలవు. గ్రంథవిస్తరభీతిచే వాని వదలితిని. విష్ణుభక్తిని దూషించువాఁడనని కొందఱు పలుకుదురు. ఆ వాక్కులయం దెంతసత్యముకలదో నాయీవ్రాఁతలంబట్టి నిర్ణయింప వలంతులు మీరే. విశేషించి పెంచి వ్రాయఁబూనక పైకథను వ్రాయుదును.

దశరథుఁడు కైకను మరల వేఁడుట

* దశరథుఁడు నేలపైఁ బరుండఁగాని భార్యపాదముల కడ వ్రాలియుండుటకుఁగాని తగినవాఁడు కాకుండియు నా రెండు కార్యము లొనరించెను. అంతియ కాక విలపించుచుఁ బుణ్యము భోగానుభవమున నశింపఁగా భూమికి దిగినయయాతివలె నుండెను. ఆతనిం గని కేకయరాజదుహిత యనర్థరూపిణి

* ఈభాగము పదమూఁడవ సర్గమునఁ గలదు. అధ్యాత్మరామాయణవిశేషవిషయము లిందుఁ గలిసియే యుండును.

కావునఁ దన ప్రయత్నము నెఱవేఱమికి వగచుచు లోకనింద కలుగుననియైన జంకక దానిని సాధింపఁగోరి దశరథుని మన స్సుననున్నభయము సుంతయైన లెక్కింపక యతనికిఁ బూర్వ మునకన్న నెక్కుడుభయము గలిగించుచుఁ బూర్వవరములనే కావలయునని మరల గట్టిగా నడుగంబూని యిట్లు పలికెను.

రాజశేఖరా! అసత్యములాడనని దృఢవ్రతుఁడనని ప్రల్లదములాడుచుందువు. అట్టి నీవు నాకు నిత్తునని శపథము లెన్నియో పల్కినయవ్వరముల నీఁదలంపక ఋణముగా నింకను బెట్టుకొనియున్నాఁడవే. ఏల? అని గట్టిగాఁ బ్రశ్నించెను. ఆ మాటలు చెవులసోఁకినంతనే పట్టరానికోపమొంది ముహూర్త కాలము స్మృతిలేకయుండి యంతట స్మృతికలుగఁగా యిట్లు పలికెను. అనార్యురాలా! ఇంతటి క్రూరురాలవటే. నాయందు విరోధముగల యోకైకా! నే నీతనువును వదలఁగా శ్రీరాముఁ డడవులకుఁ బోవఁగా నీమనసునఁగల వాంఛలు దీఱ సుఖము లనుభవింపుమా. మృతినొందియు నేను సుఖపడను జుమీ. నాప్రియపుత్త్రునియభ్యుదయమును బరికింపక స్వర్గమునకు నేఁబోయినను దేవతలందఱు నన్నుం గాంచి రాజా! మూర్ఖురా లగుస్త్రీనిమిత్తమై సుగుణాకరుండగుకుమారు నడవులకుం బంపు దువా. యని తిరస్కరించుచు నడుగ నక్కటా! నేనెట్లు సహిం తును? అందుఁగూడ నాకు సుఖము శూన్యమే. దేవత లట్లు ప్రశ్నింపఁగాఁ గైకకు మున్ను వరము లిచ్చితిని. కావున నా వరదానమునఁ గైకకు మేలుచేయఁగోరి రాముని వనములకుం బంపితిని. అని యీసత్యమును బదులుగాఁ బలుకుదు నేని రేపు

పట్టాభిషిక్తుని జేయుదునని రామునకుం జెప్పినది యనృత మగును.

కైకా! చాలకాల మపుత్త్రకుఁడనై యుండి యనేక శ్రమములకు నోర్చి సుగుణాభిరాముఁ డగు రామునిం బడయంజాలితిని. ఎట్లు వానిని వదలుదును? రామునియందుఁ గలసద్గుణము లిన్నియని వినుతింప నలవికాదు. అన్ని సుగుణములు గలవనియే నమ్ముము. అట్టి ప్రియపుత్త్రుని ఘోరాటవులకు నెట్లు పంపుదును? సుందరాంగుఁడు సుకుమారుఁడగు నా రాముని దండకారణ్యములకుం బొమ్మని యెట్లు పలుకుదును? సుఖార్హుఁడై దుఃఖము లెఱుంగకయుండు నాకుమారుఁడు కష్టముల పాలుగా నుండ నెట్లు చూతును? సుఖార్హుఁడగు రామునకు దుఃఖముగలిగింపక యిపుడే ప్రాణములం బాయుదునేని నాకప్పటికి సుఖములు గలుగును. క్రూరచిత్తురాలా! పాపమతీ! శత్రువులయందుఁ బౌరుషమును మనయందఱియందుఁ బ్రీతి వెలయించు నా రామచంద్రు నడవులకుఁ బంపుమని యేల దుఃఖమును గలిగించుచున్నావు? నీ యీ ప్రయత్నమూలమున నాకు మిక్కిలి దుర్యశము త్యజింప నసువుకాని యవమానము కలుగకమానవు.

అని పలికి మనస్సు వికలతంగాంచఁగా నయ్యో యని యేడ్చుచుండఁగాఁ బ్రొద్దు గ్రుంకెను. రాత్రియుఁ జక్కఁగాఁ బ్రవేశించెను. ఆ రేయి యమృతకరమండలమున నెంతో హాయి గూర్చునదియేయైన దుఃఖించుచున్న యాదశరథునకు హాయి నీయఁజాలదయ్యెను. దుఃఖయోగమున నామూఁడుజాములు గడచెను. అంత నా రాజు నిట్టూర్పులుపుచ్చుచు నాకాశమున

దృష్టిఁబరఁగించి పెనురోగము పీడింపఁ బడలినవానిరీతి విను వారలకుంగూడ జాలికలుగులాగున నక్షత్రప్రకాశముగల యో త్రియామా! నీవు తెల్లవాఱకుమా. అయ్యది నాకు సరి పడదు. దయ నాపై నుంపుము. అంజలింబట్టి ప్రార్థించుచున్నాఁ డను. నాప్రార్థనము నీకిష్టముకాదేని త్వరగాఁబొమ్ము. ఎవ తుకమూలమున నా కీమహాదుఃఖము కలిగెనో యాక్రూరాత్మురాలిని దయారహితను జూడనొల్లను. అని గట్టిగా విలపించెను.

మరల నారాజు దోసిలొగ్గి కైకను వేఁడుచుఁ బట్టువదలు నట్లుచేయఁ బ్రయత్నించి యామె కిట్లనియె. దేవీ! మంగళము లకుం దగినదానవు. నాకు ధర్మపత్నివి. నేనుగూడ సాధువృత్త ముగలవాఁడను. దుఃఖములఁ బొగులుచు నిన్నిపుడు శరణు వేఁడితిని. ఆయుశ్శేష మెంతయో లేక చావునకు సిద్ధపడి యుండువాఁడను. ప్రభువుగా నున్నాఁడను. ఇట్టి నాయం దను గ్రహ మునుపందగుదువు. సుందరీ! నిర్జనప్రదేశమున రాము నభిషేకింతునని నేఁ జెప్పలేదుగదా. ఎల్లరు వినఁగాఁ బలికితిని గదే. తెలిసియో తెలియకయో యామాటఁ బలికితిని. నీవు సుహృదయముకలదానవు. నన్నింకనైన దుఃఖపెట్టక దయచేఁ జూడుము. శుభవీక్షణముల నలరారునోకైకా! ప్రసన్నహృద యవు కమ్మా. వరములమూలమున నీవే యీరాజ్యమునెల్లఁ బడసి రామునకు దాని నొసంగి సాధుకీర్తింబడయుమా. చారు ముఖి! శుభవీక్షణా! నీవిట్టులాచరించినచో నాకు, రామునకుఁ, బ్రపంచమునకు, గురువర్యులకు, భరతునకు నీకార్యము మిక్కిలి ప్రియమగుఁజుమ్మీ! నామాట పెడచెవింబెట్టక యీ రీతిఁ జేయుమా యని ప్రార్థించెను.

కైక క్రూరమతికలది. విశేషించి యపుడు దుష్టస్వభావు రాలుగాఁ జూపట్టెను. కావున నిర్మలాత్ముఁడగు రా జెంత ప్రార్థించి నను విలపించినను మగనిమాట నంగీకరింపదయ్యెను. ఆసాయం కాలముదనుకఁ దన కనుకూలవతియై ప్రియములంగూర్చునదియై యున్నయాకైక రాత్రి రాఁగానే ప్రతికూలముగా మాట లాడం గాంచి చిరకాలమైత్రిం జేసి యామెపలుకులఁ దిరస్క రింపఁజాలక శ్రీరాము నడవులకుం బోమ్మనలేక యితికర్త వ్యతామూఢుఁడై దుఃఖసాగరమున మునింగి స్మృతి తప్పి పడి పోయెను. సన్మతియగు నా దశరథుఁడు దుఃఖావేశమునఁ జూచు వారలకుంగూడ భీతిజనింప నిశ్వాసవాయువులం బుచ్చుచుం డఁగా నారాత్రియంతయుఁ గడచెను. తెల్లవాఱుజామున వైతాళికప్రముఖులు రాజును మేల్కొలుపఁ బ్రయత్నింపఁగా వలదని యతఁ డాజ్ఞాపించెను.

మహాత్ములారా! ఈభాగమునఁ గల విశేషములఁ దిలకిం తము. అధ్యాత్మరామాయణమునందు విశేషమేమియు నీభాగ మునఁ గానరాదు. కాని

“అరుణోదయకాలే తు వందినో గాయకా జగుః,
నివారయిత్వా తాన్ సర్వాన్ కైకేయీ రోషమాస్థితా.”

అని యున్నది.

“విబోధ్యమానః ప్రతిబోధనం తదా నివారయామాస సరాజసత్తమః.”

అని యున్నది. స్తుతిపాఠకులు మర్యాద ననుసరించి మేలు కొలుపరాఁగా రోషమున వలదని కైక వారించెనని యధ్యా త్మరామాయణమునందును, రాజే వలదనె నని శ్రీమద్రామా యణమునందును గలదు. ఈభేదము కథకుఁగాని నీతికిఁగాని

బాధను గల్గించునది కాదు. కావునఁ గుణిమర్శకు లీభేదముం బాటించి యాక్షేపించుచు దంతములఁ గనఁబఱుపక యుందురు గాక.

"అతదర్శ్వాం మహారాజం శయానమతథోచితం,
యయాతిమివ పుణ్యాంతే దేవలోకాత్పరిచ్యుతమ్." ౧

అని మూలము. యయాతిమహారాజు పెక్కుసుకృతకార్యము లొనరించి పుణ్యలోకములం గ్రుమ్మరి పుణ్యము నశింపఁగా స్వర్గమునుండి చ్యుతిం గాంచెను. అట్లే దశరథుఁడు భూమిపై శయనించియుండెనని సామాన్యార్థము. భూలోకమునఁ జేసిన సుకృతములకు ఫలము స్వర్గాదిలోకముల నివసించుట. అందలి సుఖములనుభవించుట. ఆపుణ్యము నశింపఁగా మరల భూలోకమున కరుదెంచుట యని యర్థమగును.

"క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి."

అని శ్రుతి చాటుచున్నది. స్మృతులు పురాణములు నీయర్థమునే సహస్రధా బోధించెడిని. పునర్జన్మము నంగీకరింపనిమతములకు సంబంధించినవారీమార్గము నంగీకరింపకయే యుండిరి. కాని యందుఁ గొంద ఱిపుడిపుడు పునర్జన్మమును విధిలేక యంగీకరించుచున్నవారని వినఁబడియెడిని.

"తేనానుభూయతా యామీశ్శరీరేణేహ యాతనాః,
తాస్వేహ భూతమాత్రాసు ప్రలీయంతే విభాగశః. ౧౨
తేఽనుభూయ సుఖోదర్కాన్ దోషాన్ విషయసంగజాన్,
వ్యపేతకల్మషోఽభ్యేతి తావేవోభౌ మహౌజసౌ. ౧౩
తౌ ధర్మం పశ్యతస్తస్య పాపం చాతంద్రితౌ సహ,
యాభ్యాం ప్రాప్నోతి సంపృక్తః ప్రేత్యేహ చ సుఖాసుఖం. ౧౪

యద్యాచరతి ధర్మం స ప్రాయశోఽధర్మమల్పశః,
తైరేవ చావృతో భూతైః స్వర్గే సుఖముపాశ్నుతే. ౨౦
యది తు ప్రాయశోఽధర్మం సేవతే ధర్మమల్పశః,
తైర్భూతైస్స పరిత్యక్తో యామీః ప్రాప్నోతి యాతనాః. ౨౧
యామీస్తా యాతనాః ప్రాప్య స జీవో వీతకల్మషః,
తాన్యేవ పంచభూతాని పునరప్యేతి భాగశః. ౨౨
ఏతా దృష్ట్వాస్య జీవస్య గతీస్స్వేనైవ చేతసా,
ధర్మతోఽధర్మతశ్చైవ ధర్మే దధ్యాత్సదా మనః." ౨౩

మనుస్మృతి ౧౨ అధ్యా.

"అనంతాశ్చ యథాభావాశ్శరీరేషు శరీరిణాం,
రూపాణ్యపి తథైవేహ సర్వయోనిషు దేహినాం. ౧౩౨
విపాకః కర్మణాం ప్రేత్య కేషాంచిదిహ జాయతే,
ఇహ వాముత్ర వైకేషాం భావస్తస్య ప్రయోజనం. ౧౩౩
పితృయానోఽజవీథ్యాశ్చ యదగస్త్యస్య చాంతరం,
తేనాగ్నిహోత్రిణో యాంతి స్వర్గకామా దివం ప్రతి. ౧౮౪
యే చ దానపరాస్సమ్యగష్టాభిశ్చ గుణైర్యుతాః,
తేఽపి తేనైవ మార్గేణ సత్యవ్రతపరాయణాః. ౧౮౫
తత్రాష్టాశీతిసాహస్రా మునయో గృహమేధినః,
పునరావృత్తినో బీజభూతా ధర్మప్రవర్తకాః." ౧౮౬

యాజ్ఞవల్క్యస్మృతి, ప్రాయశ్చిత్తకాండము.

అను నీస్మృతులు స్వర్గాదిలోకప్రాప్తిహేతువులగు సుకృతకర్మములను, సుఖానుభవానంతరము పునర్జన్మమును దెలుపుచున్నవి.

"పార్థ! నైవేహ నాముత్ర వినాశస్తస్య విద్యతే,
న హి కల్యాణకృత్కశ్చిద్దుర్గతిం తాత గచ్ఛతి. ౪౦

ప్రాప్య పుణ్యకృతాన్ లోకానుషిత్వా శాశ్వతీస్సమాః,
శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోఽభిజాయతే. ౪౧
అథ వా యోగినామేవ కులే భవతి ధీమతాం,
ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మ యదీదృశమ్. ౪౨
తత్ర తం బుద్ధిసంయోగం లభతే పౌర్వదైహికం,
యతతే చ తతో భూయస్సంసిద్ధౌ కురునందన. ౪౩
పూర్వాభ్యాసేన తేనైవ హ్రియతే హ్యవశోఽపి సః,
జిజ్ఞాసురపి యోగస్య శబ్దబ్రహ్మాతివర్తతే. ౪౪
ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః,
అనేకజన్మసంసిద్ధస్తతో యాతి పరాం గతిం." ౪౫

భగవద్గీత ౬ అధ్యా.

అను నీభగవదుపదేశ మూర్ధ్వలోకసుఖానుభవమును, మరల భూలోకమున జన్మమును దెలుపుచున్నది. ఇట్లే ప్రమాణములం జూపఁబూనిన స్కాందపురాణమంతే యగును. ఈ రామాయణ భాగము మన కేనీతిఁ దెల్పుచున్నది? పుణ్యకర్మములు స్వర్గ సుఖానుభవహేతువులని, పాపకర్మములు నరకకష్టానుభవ హేతువులని, యీవిషయము నెఱింగి మానవుఁడు సత్కర్మ ముల నాచరింపఁ బ్రయత్నింపవలయును. పునరావృత్తిరహిత పదప్రాప్తిం గోరువారు ఫలాభిసంధిరహితముగా సత్కర్మముల నాచరింపవలయును. ఫలములఁగోరి చేయుకర్మము లెంతకాల మునకైన మరల జన్మము ననుగ్రహించుననియు, నట్టిది లేక యుండ ముక్తిని గోరువారు భగవదర్పణముగా సత్కర్మముల నాచరింపవలయు నను నీనీతులను యయాతిదృష్టాంతమునుండి తేలెడినని యెఱుంగవలయును.

"త్వం కత్థసే మహావీర సత్యవాదీ దృఢవ్రతః,

మమ చేమం వరం కస్మాద్విధారయితుమిచ్ఛసి.” 3

అని మూలము. కైక దశరథు నాక్షేపించుచున్నది. సత్యవాది నని, దృఢవ్రతుఁడనని నిన్ను నీవే పొగడుకొనుచుందువు అని. దీనిసారమేమి?

“న విస్మయేత తపసా వదేదిష్ట్వా చ నానృతం,
నార్తోఽప్యపవదేద్విప్రాన్న దత్వా పరికీర్తయేత్. ౨౩౬
యజ్ఞోఽనృతేన క్షరతి తపః క్షరతి విస్మయాత్,
ఆయుర్విప్రాపవాదేన దానం చ పరికీర్తనాత్.” ౨౩౭

మను ౪ అధ్యా.

అను నీమనుస్మృతిధర్మమునే రామాయణము బోధించుచున్నది. ఆత్మస్తుతి మంచిదికాదు. ఇంత తపస్సుచేసితినికదా యని యబ్బురంపడిన నాతపస్సు నశించును. దానముచేసి నలుగురిలోఁ జెప్పుకొనిన నయ్యది నశించుననియే స్మృతిభావము. ఈస్మృతిసారము డంబములు పలుకరాదనియేకదా. తాను జేసినకార్యమునఁ గీర్తిరావలయు నన్నభావమే యాత్మస్తుతి కర్థము.

“ప్రదానం ప్రచ్ఛన్నం గృహాముపగతే సంభ్రమవిధిః
ప్రియం కృత్వా మౌనం సదసి కథనం నాప్యుపకృతేః,
అనుత్సేకో లక్ష్మ్యా నిరభిభవసారాః పరకథా
స్సతాం కేనోద్దిష్టం విషమమసిధారావ్రతమిదమ్.” ౬౪

అని భర్తృహరి హితముపదేశించెను. “దానం చ పరికీర్తనా” త్తనుస్మృతిసారమే యిందుఁగలదు. తన్నుఁ దాఁ బొగడుకొనరాదనియే యిందుండి మనము గ్రహింపఁదగునీతి.

“అపుత్రేణ మయా పుత్త్రశ్శ్రమేణ మహాతా మహాన్,

రామో లబ్ధో మహాబాహుస్స కథం త్యజ్యతే మయా. ౮
శూరశ్చ కృతవిద్యశ్చ జితక్రోధః క్షమాపరః,
కథం కమలపత్త్రాక్షో మయా రామో వివాస్యతే. ౯
కథమిందీవరశ్యామం దీర్ఘబాహుం మహాబలం,
అభిరామమహం రామం ప్రేషయిష్యామి దండకాన్. ౧౦
సుఖానాముచితస్యైవ దుఃఖైరనుచితస్య చ,
దుఃఖం నామానుపశ్యేయం కథం రామస్య ధీమతః.'' ౧౧

అను నీమూలములం గనుఁడు. దైవికముగా దశరథునినోట రాముఁడు భగవంతుఁ డనునర్థము నిచ్చుమాటలే వెలువడి యెను. "మహతా శ్రమేణ మయా అపుత్త్రేణ మహాన్ పుత్త్రః రామో లబ్ధః, మహాబాహు స్స మయా కథం త్యజ్యతే." అను నన్వయక్రమము భగవంతుఁడే యని తెలిపెడిని. మహత్తర శ్రమములచేత నీమహాపుత్త్రునిం గాంచితినని రాజనియెఁగదా. ఇత్తఱి దశరథుఁడు నల్వురుకొడుకులనుమాటనే మఱచెను. నాలుగురూపముల నొక్క భగవంతుఁడే యుదయించెనని తలంచెను. రామునే ధ్యానించుచు నాతనివిషయమున దుఃఖించుచున్నవాఁడుగాన సర్వము రామమయముగనే రాజు చూచుచున్నాఁడని తోఁచెడిని. "మహాబాహుః కమలపత్త్రాక్షః ఇందీవరశ్యామః అభిరామః" అను మొదలగువిశేషణములు రాముని సర్వేశ్వరత్వమును దెలిపెడిని. "అహం రామం కథం దండకాన్ ప్రేషయిష్యామి" అనువాగ్ధోరణింబట్టి యాలోచింపఁగా గతాయుస్సుగల నే నిపు డెట్లు దండకారణ్యభాగములకుఁ బంపఁగలనని యడుగుచున్నవాఁడని తోఁచెడు.

"అంత్యకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కళేబరం,

యః ప్రయాతి స మద్భావం యాతి నాస్త్యత్ర సంశయః. ౫
యం యం వాపి స్మరన్ భావం త్యజత్యంతే కళేబరం,
తం తమేవైతి కౌంతేయ సదా తద్భావభావితః. ౬
తస్మాత్సర్వేషు కాలేషు మామనుస్మర యుద్ధ్య చ,
మయ్యర్పితమనోబుద్ధిర్మామేవైష్యస్యసంశయః." ౭

భగవద్గీత ౮ అధ్యా.

అను నీభగవదుపదేశము దశరథునకు మహామునులసావాసమున నెఱుకపడియే యుండుననియు, దాననే సారెసారెకు శ్రీరామగుణవర్ణనము చేయుచున్నవాఁడనియుఁ, బూర్వపుణ్యమున నారామపరబ్రహ్మము సగుణరూపమే యాతనికన్నులం గట్టినట్లుండెననియు

"యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి."

అన్నభావ మాతనిమది దృఢముగా నెలకొనియున్నదనియు మన మూహింపవలయును. నిరంతరాభ్యాసబలమున రామమూర్తియం దత్యంతప్రేమమే యోగికి ధ్యేయమునందుబలె దృఢపడినది. నడుమనడుమఁ బలుకుమాట లభ్యాసవశమున వచ్చునవియే కాని తెలిసి పలుకునవి కావు. మృత్యువాసన్నమగుచున్నది. చిరకాలము రామదర్శనస్పర్శనసంభాషణములు వ్యర్థములు కావుకదా. దానికి ఫలమే యక్కాలమున రామచింతన మనందగు. కృతకృత్యులు కాఁదగువారిస్థితి యిట్లుండుననియే మన మూహింపవలయు.

ఉపాసకుఁ డభీష్టదేవతారూపమును ధ్యానించుచుఁ దొలుత మంత్రమును జపించును. ధ్యానము దృఢము కాదేని మంత్రజపము సత్ఫలము నీయఁజాలదు. ధ్యేయమూర్తి మనః

పీఠమున నెలకొనియున్నఁగాని ధ్యానము సార్థకము కాదు. కొంతకాల మట్టియభ్యాసము కాఁగాఁ బిదప జప మక్కఱ లేదని తోఁచును. ఇష్టదేవతామూర్తియే కన్నులఁ గట్టినట్లగును.

"నైవ కించిత్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్,
పశ్యన్ శృణ్వన్ స్పృశన్ జిఘ్రన్నశ్నన్ గచ్ఛన్ స్వపన్ శ్వసన్,
ప్రలపన్ విసృజన్ గృహ్ణన్నున్మిషన్ నిమిషన్నపి,
ఇంద్రియాణీంద్రియార్థేషు వర్తంత ఇతి ధారయన్." గీ

అన్న గీతాభావము స్వానుభవమునఁ గాంచును. ఆస్థితివచ్చుటకే మంత్రజపము కాని యవ్వల నక్కఱ లేదు. నిరంతర ధ్యానమే యవ్వలికృత్యము. మంత్రసిద్ధి యనఁగా నిదియే యని యెఱుంగవలయు. దేవత యెదుట సాక్షాత్కరించు ననఁగా ధ్యానము ఫలించెనని భావము. ఒక్కసారి కనంబడి యదృశ్యమైన నది తపఃఫలము కానేరదు. ఇష్టదేవతాభిన్నముగ నేదియు నుండునట్లు చూడరాదు. అదియే యోగఫలమని సారము. ఎవ్వారి కాస్థితి రాదో వారి కయ్యది ఫలింపలేదని యెఱుంగవలయును.

"సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ,
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః." ౫౨. గీత. ౧౧ అ.

అన్న శ్రీకృష్ణోపదేశము కలదుకదా. నిత్యసాక్షాత్కారమే తపఃఫలమని దీనినుండి మన మూహింపవచ్చును. ఇట్లుగాక యుపాసకులు స్వప్నమున నేదో కనఁబడినదని పలుకుచుండు వారు కొందఱు గలరు. వారికి జపసిద్ధిస్వరూపమే తెలియదనవచ్చును.

"భక్త్యా త్వనన్యయా శక్య అహమేవంవిధోఽర్జున,

జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప." ౫౪ గీ. ౧౧ అ.
అన్న భగవదుపదేశానుసారము సర్వదేవతాస్వరూపముగ నిష్టదేవతను భావించుట సంపూర్ణభక్తిసాయముననే యని యెఱుంగవలయును.

కొందఱు కపటభక్తులు

"సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని,
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్రసమదర్శనః."

అన్న గీతాశాస్త్రమందలి శ్రీకృష్ణోపదేశము వదలి 'విష్ణువధికుఁడు. శివుఁడు తక్కువ. బ్రహ్మయు నంతకంటెఁ దక్కువ' అను నీ మొదలగు నశాస్త్రవాక్కులచేతఁ బామరుల వంచించుచు భక్తి నభినయింతురు. అదిగో నిన్న రాత్రి నాతండ్రినలెఁ గనంబడె ననియు, మొన్న ధనమెట్లు వచ్చునాయని చింతించుచుండఁగాఁ గోటీశ్వరుఁడగు వైశ్యునివలె నగపడియెననియు, నేమిచేయుదునాయని చింతించునంతలో నిద్దఱు యాచకులవలె నగపడి పాడు దేవాలయము బాగుచేయుమని తెల్పి యంతలోఁ గనఁబడకపోయిరనియు, లోకులను మోసపుచ్చుటెట్లని యూహించుచుండఁగా నీవేషమును వదలి యతివేషము వేసికొమ్మని చెప్పిరనియు, జ్ఞానులమనిపించుటెట్టులని విచారించుచుండ సర్వసంగపరిత్యాగము చేసినట్లు నటింపుమని యాకాశవాణి వినఁబడియెననియుఁ బలుకుదురు. వీరు భక్తులా? లోకవంచనాసక్తులా? రెండవవారనుట కావంతయు శంకలేదు.

"పశ్య మే పార్థ రూపాణి శతశోఽథ సహస్రశః,
నానావిధాని దివ్యాని నానావర్ణాకృతీని చ." ౫

అన్న గీతావాక్యార్థము వారికిం గొఱగాదు.

"త్వం యజ్ఞస్త్వం వషట్కారస్త్వమింద్రస్త్వగ్ం రుద్రస్త్వం విష్ణుస్త్వం బ్రహ్మ త్వం ప్రజాపతిః, త్వం తదాప ఆపో జ్యోతీరసో మృతం బ్రహ్మ భూర్భువస్సువరోమ్."

అన్న శ్రుతియుఁ బనికిరాదు.

"ఈశానస్సర్వవిద్యానామీశ్వరస్సర్వభూతానాం బ్రహ్మాధిపతిర్బ్రహ్మణోఽధిపతిర్బ్రహ్మా శివో మే అస్తు సదాశివోమ్."

అన్న శ్రుతియు వారికి సమ్మతముకాదు. కావున వారికి శ్రీకృష్ణమూర్తి తెల్పిన 'సమదర్శనత్వము' సరిపడదు. ఇంక నేమనఁగాఁ దమవాక్యమే వేదవాక్యమని నమ్మవలయు ననునదియే సరిపడును. భక్తునిలక్షణములలో నొకటియు వారియందుండదు గాని వేషము పరుల మోసపుచ్చుఁజాలునదిమాత్రముండును. వారిమాటలకు మోసపోవరాదు. బకవ్రతులు కొందఱు, బైడాలవ్రతులు కొందఱు లోకమున విచ్చలవిడిగాఁ దిరుగుదురు.

"ధర్మధ్వజీ సదా లుబ్ధశ్ఛాద్మికో లోకదంభకః,
బైడాలవ్రతికో జ్ఞేయో హింస్రస్సర్వాభిసంధకః. ౧౯౫
అధోదృష్టిర్నైష్కృతికస్స్వార్థసాధనతత్పరః,
శఠో మిథ్యావినీతశ్చ బకవ్రతచరో ద్విజః. ౧౯౬
యే బకవ్రతినో విప్రా యే చ మార్జారలింగినః,
తే పతంత్యంధతామిస్రే తేన పాపేన కర్మణా. ౧౯౭
న ధర్మస్యాపదేశేన పాపం కృత్వా వ్రతం చరేత్,
వ్రతేన పాపం ప్రచ్ఛాద్య కుర్వన్ స్త్రీశూద్రదంభనమ్. ౧౯౮
ప్రేత్యే నచేదృశా విప్రా గర్హ్యంతే బ్రహ్మవాదిభిః,
ఛద్మనా చరితం యచ్చ వ్రతం రక్షాంసి గచ్ఛతి." ౧౯౯

మనుస్మృతి ౪ అధ్యా.

ఎల్లరకుఁ దెలియవలయునని ధర్మమాచరించువాఁడు ధర్మధ్వజి యనంబడును. పరధనములంగోరి యొకనెపముచేతఁ జరించుచు జనులవంచించువాఁడు బైడాలవ్రతికుఁ డనంబడును. వినయ మగపఱచుచుఁ గ్రిందుగాఁ జూచుచుఁ గఠినప్రవృత్తిగలిగి స్వప్రయోజనము నభిలషించుచుఁ గుటిలవ్యాపారము గలిగి కపటవినయము నభినయించువాఁడు బకవ్రతుఁడనంబడును. వారిరువురు స్వపాపములచేతనే యధోలోకములఁ బడుదురు. ధర్మకార్యముల నెపమునఁ బాపముచేసి వ్రతముచేయరాదు. దానిచేఁ బాపమే లభించును. వ్రతమునాచరించి పాపమును గప్పి స్త్రీశూద్రమూర్ఖాదుల మోసపుచ్చరాదు. ఇట్టిరీతిగాఁ బ్రవర్తించు బ్రాహ్మణులను బ్రహ్మవాదులు తిరస్కరింతురు. ఒకనెపముచేఁ జేయుధర్మవ్రతఫలము రాక్షసులకుఁ బ్రీతిని గలిగించును.

మనుస్మృతికాలమున నిట్టివారు బ్రాహ్మణులు మాత్రమే యుండిరని స్పష్టముకదా. ఆకాలము ధర్మకాలమని మనమూహింతుము. అట్టి కాలముననే బ్రాహ్మణులలోఁ గొందఱుండిరి. ఇఁక నీకాలమున బ్రాహ్మణులేకాక యన్ని జాతులలోనుండవచ్చును. వారెవ్వరనిమాత్రము నిర్ణయించుట కష్టము. వీరిమూలమున సత్యముగా ధర్మముల నాచరించువారిని నమ్మరానియవస్థ వచ్చుచున్నది. వీరు మోసగాండ్రని, వీరు నిష్కపటులని కనుఁగొనుటయే కష్టము కాని కొంతకాలమునకు వారి ధనసంగ్రహము ననుసరించి జనసామాన్యము తెలిసికొనకపోదని నాయాశయము. ఇట్టిమోసమున వారే చెడుదురుగాని యితరులకు నష్టములేదు. స్వాత్మవినాశనకార్యమునఁ బ్రవర్తింప నేటికో-

తెలియఁజాలను. ధనమెందఱి నెన్నిపాట్లుపడునట్లుగాఁ జేయు చున్నది!!

''అర్థమనర్థం భావయ నిత్యం నాస్తి తతస్సుఖలేశస్సత్యం,
పుత్త్రాదపి ధనభాజాం భీతిస్సర్వత్రైషా విహితా రీతిః. ౯
మా కురు ధనజనయౌవనగర్వం హరతి నిమేషాత్కాలస్సర్వం,
మాయామయ మిదమఖిలం హిత్వా బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా.
దినయామిన్యౌ సాయంప్రాతశ్శిశిరవసంతౌ పునరాయాతః,
కాలః క్రీడతి గచ్ఛత్యాయుస్తదపి న ముంచత్యాశావాయుః.'' ౧౨

అని శ్రీశంకరాచార్యులుగారును,

''జటిలో ముండీ లుంఛితకేశః కాషాయాంబరబహుకృతవేషః,
పశ్యన్నపి చ న పశ్యతి మూఢో హ్యుదరనిమిత్తో బహుకృతవేషః.'' ౨
''అంగం గళితం పలితం ముండం దశనవిహీనం జాతం తుండం,
వృద్ధో యాతి గృహీత్వా దండం తదపి న ముంచత్యాశాపిండం.'' 3

అని శంకరభగవత్పాదశిష్యులు హస్తామలకాచార్యులును స్పష్టపఱిచిరి.

''భ్రాంతం దేశమనేకదుర్గవిషమం ప్రాప్తం న కించిత్ఫలం
త్యక్త్వా జాతికులాభిమానముచితం సేవా కృతా నిష్ఫలా,
భుక్తం మానవివర్జితం పరగృహేష్వాశంకయా కాకవ
త్తృష్ణే జృంభసి పాపకర్మనిరతే నాద్యాపి సంతుష్యసి.'' ౫
(వైరాగ్యశతకము.)

అని భర్తృహరియుఁ దేటపఱిచెను. ఇన్నివేషములు వేయుటకు స్వకీయజన్మలాభమునైనఁ బోఁగొట్టుకొనుటకు నాధారము దురాశయేకదా. దానిం దొలఁగించుకొనఁ బ్రయత్నించువారు తొలుత భగవంతు నారాధించుమార్గ మెఱుంగవలయు. దాని

మూలమునఁగాని యిట్టి దుర్గుణములు తొలంగవు. అందును దేవతాదూషణము సర్వానర్థమూలము కాన దాని మానినఁ గాని దేవతానుగ్రహము కలుగదనుట నిక్కము.

"సాధువృత్తస్య దీనస్య త్వద్గతస్య గతాయుషః,
ప్రసాదః క్రియతాం దేవి భద్రే రాజ్ఞో విశేషతః. ౨౦
శూన్యే న ఖలు సుశ్రోణి మయేదం సముదాహృతం,
కురు సాధు ప్రసాదం మే బాలే సహృదయా హ్యసి. ౨౧
ప్రసీద దేవి రామో మే త్వద్దత్తం రాజ్యమవ్యయం,
లభతామసితాపాంగే యశః పరమవాప్నుహి." ౨౨

అనునివి దశరథునివాక్యములు. కైకను బ్రసన్నురాలినిగాఁ జేయఁ బ్రయత్నించు రాజువాక్యము లివి. ఇందొక్కొక్క కారణము క్షమింపఁదగిన దనునర్థము నిచ్చును. "కైకా! మంచి నడవడికగలవాఁడను. రామవియోగము దుస్సహదుఃఖహేతువు గాన దాన బాధితుఁడను. నీయధీనమున నున్నాఁడను. ఆయుశ్శేష మించుకంతయే కలదు. నీవు భార్యవు. శుభమునే కోరుదానవు. కావున నిందుఁగల యేకారణముచేతనైన క్షమింపఁ దగుదువు. ఇన్నికారణములు త్రోసివేసినను రాజు నన్నకారణము ప్రధానముకాన దానిని బురస్కరించుకొనియైన నాయందు దయఁ గనఁబఱుపుమా" యని ప్రార్థించెను. సద్వర్తనమునకుఁ బూర్వకాలమున మనవా రెంతమర్యాద నొసంగిరో తేటపడును. రాజు ప్రధానకారణముగాఁ దొలుత దానినే తెలిపెను. దీనిచేఁ బాండిత్యము ప్రధానము కాదనియుఁ, జెప్పిన చొప్పున నడుచుకొనుటయే ప్రధానమనియుఁ దేటపడియెడిని.

"పరోపదేశే పాండిత్యం సర్వేషాం సుకరం నృణాం,

ధర్మే స్వయమనుష్ఠానం కస్యచిత్తు మహాత్మనః."

అన్న నీతిశాస్త్రము పైయభిప్రాయమునే తెలుపుచున్నది.

"అజ్ఞేభ్యో గ్రంథినశ్శ్రేష్ఠా గ్రంథిభ్యో ధారిణో వరాః,
ధారిభ్యో జ్ఞానినశ్శ్రేష్ఠా జ్ఞానిభ్యో వ్యవసాయినః." ౧౦౩
వ్యవసాయినః అనుష్ఠాతారః, అనివ్యాఖ్యా. మను. ౧౨ అధ్యా.

అనుమనుస్మృతియుఁ బైనవ్రాసినభావమునే దృఢపఱచుచున్నది. కావున శాస్త్రమునేర్చుకొని దానిరీతి నడుచుకొనువారిమాట చెప్పనేల? శాస్త్రముమాత్రము చదివి దానిప్రకార మాచరింపనివారికంటెఁ బెద్దలవలన విన్నయట్లు లాచరించువారే యుత్తములగుదురు. కావుననే ప్రవర్తనము సాధువయ్యేనేని యుత్తమమని పూర్వమహర్షులయాశయము.

పదుగురుగలసభలో రేపే రామునిపట్టాభిషేకమని పలికితిని. నిర్జనస్థలమునఁ జెప్పియుండలేదు. భద్రే! కల్యాణీ! యని కైకను సంబోధించుచున్నవాఁడు. సహృదయా హ్యసి=మంచి మనస్సుకలదానవని స్తుతించుచున్నవాఁడు. ఇందు దశరథుని భావమేమి? తానిచ్చియున్న వరముల నీయక తప్పించుకొనవలయునని కాదు. నిన్న నలువురిలోఁ జెప్పినమాటయు నీవరములవంటిదే యన్నమాట విని నిరాశురాలై యీమాట కంగీకరించునేమో యనియే రాజుభావము. అంతియకాని యసత్యమునకుఁ బాలుపడవలయునని కాదు. ఈయర్థ మెట్టు లూహింపవచ్చునని శంకనొందరాదు. ఈక్రిందిభావము దీనిని సూచించుచున్నది. వరములకుగా రాజ్యమును దీసికొనుము. దయచేత రాముని కొసంగుము. దాన నీకీర్తి లోకముల వర్ధిల్లును. అనఁగా భావమేమి? కైక దుష్టురాలు గాదు. వరముల

నడిగి రాజ్యముగ్రహించి రామచంద్రునకే యిచ్చెను. భరతుని కన్న శ్యామమూర్తినే ప్రీతిపాత్రునిగా నెన్నినది. న్యాయదృష్టి కలది. అన్నవిఖ్యాతి లోకమున వ్యాపింపఁగలదని తాఁజెప్పిన నంగీకరించునేమో యనునాస రాజునకుఁగలదని యూహింప వచ్చును. దీనిచేత వరములనీయక తప్పించుకొనుభావమే రాజునకులేదని యెఱుంగవచ్చును. దీనింబట్టి మన మాలోచింపఁగా నాకాలమున సత్యమునఁగలయాదరణ మింతయని వర్ణింప నలవి కాదని తేలెడిని. ఎన్నికష్టములు వచ్చినను దుదకుఁ బ్రాణములు పోయినను దామన్నమాట తప్పరాదన్నసద్భావ మాకాలమునఁ బ్రజలహృదయముల నాటుకొన్నదని స్పష్టముకదా! అట్టియభిప్రాయము మరల నెల్లరయుల్లముల నెలకొని యుల్లసిల్లు కాల మెప్పుడగు నెంచునో తెలియఁజాలకున్నారము. ధర్మమును గాపాడిన నది వారిని గాపాడును. దానిని వదలినవారి కాయుఃకీర్తి సుఖము లెట్లు కల్గును?

“ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః,
తస్మాద్ధర్మో న హంతవ్యో మానో ధర్మో హతోఽవధత్. ౧౫
వృషో హి భగవాన్ ధర్మస్తస్య యః కురుతే హ్యలం,
వృషలం తం విదుర్దేవాస్తస్మాద్ధర్మం న లోపయేత్. ౧౬
ఏక ఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతి యః,
శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధిగచ్ఛతి.” మను ౮ అధ్యా. ౧౭

అని స్మృతి యుపదేశించుచున్నది. కావున నెల్లరు ధర్మమును రక్షించినచోఁ దమ్ము రక్షించుకొన్నయట్లే యగును. దానిని గాపాడకయున్న స్వసంరక్షణమున నిష్టములేనివారే యగుదురు. పూర్వకాలమునకు నిప్పటికిఁగలభేద మిదియే యని యేర్ప

డుచున్నది. దీనివిశేషార్థ మేమని విచారింతము. దీని తరువాతి శ్లోకముం బరికింపుఁడు. అపు డావిశేషార్థము స్పష్టమగును.

"ప్రసీద దేవి రామో మే త్వద్దత్తం రాజ్యమవ్యయం,
లభతామసితాపాంగే యశః పరమవాప్నుహి. ౨౨
మమ రామస్య లోకస్య గురూణాం భరతస్య చ,
ప్రియమేతద్గురుశ్రోణి కురు చారుముఖేక్షణే." ౨౩

కైకా! నాయందనుగ్రహ ముంచుము. నీచే నీయఁబడినట్టి అవ్యయమగు రాజ్యమును రాముఁడు పొందుఁగాక. దాన నీవు నిరుపమానయశస్సు నొందుము. ఇపుడు నీవు పరబలమున నావలన గ్రహించినను రామునకే యీవలసియుండును. అది యవ్యయమగును. అనఁగా రాజ్యము నీకు దక్కునది కాదు. అది రామునకే దక్కును. నావలన రాజ్యము నీవు గ్రహించినందున రాముఁ డడవులకుంబోవును. దాన దేవకార్యము సిద్ధించును. నీమూలమున నింతటిమహోపకారము కలిగినందున దేవతలు నిన్ను గౌరవింతురు. దానఁ ద్రిలోకములయందు నీయశస్సు వ్యాపించును. ఇయ్యది నాకును రామునకు లోకమునకు గురువర్యులగు వసిష్ఠాదిమునులకు భరతునకు మిక్కిలి ప్రియమగును. అనునది విశేషార్థము. నాకును బ్రియమనఁగా నాయుశ్శేషము రవంతగలిగిన నాకు శాపఫలానుభవము తప్పదుగాన రామచంద్రునినే తలంచుచు ముక్తిపదమున కేగుదును. అవ్యయానందము కలుగును. అదియే నాకుఁ బ్రియమగునది. ఈయర్థము దశరథుఁడు తెలిసిచెప్పినదే యగునా యనవచ్చును. దైవికముగా నాతనిమాటలకూర్పువలన నీయర్థము తోఁచెడు ననవచ్చును. భరతునకుఁ బ్రియ మెట్లగును? అనునదియే

ప్రశ్నము. ఏతన్మూలమున భరతుఁడు రామపాదారవిందభజనాసక్తుఁడన్న యశస్సు శాశ్వతముగా నెలకొనఁగలదు. కొలఁది కాలము దుఃఖము భ్రాతృవియోగమునఁ గలిగినను దరువాత సుస్థిరయశస్సు కలుగుటయే భరతున కానందమని గ్రహింపవలయు. మానవు లెన్ని ప్రయత్నములు చేసినను యశస్సుంగోరియే కదా. అట్టియశస్సు నీమూలమున శ్రమములేక లభించుచుండఁగా నద్దానిం గోరువారుండుట యరుదా.

నిక్కముగా నీయర్థము చెప్ప ననువగునా యని కొందఱు ప్రశ్నింపవచ్చును. "భావిభాగ్యప్రచోదనాత్" అన్న ప్రాచీనసూక్తి ననుసరించి భావములు మార్పునొందును. సత్యముగా నివియన్నియు సాగినవికదా. కాన వాగ్ధోరణింబట్టి యాలోచింపఁగా నీయర్థము సుసంగతమనియే తోఁచును. శ్రీరామవనవాసముననే దశరథాదులకు నిరుపమానవిఖ్యాతి కల్గినది. లేకయున్న రామచరిత్ర మెవరు పఠింతురు? వనగమనమే త్రిలోకములకు మహోపకార మొనరించినది. శ్రీరామచంద్రు నవతారఫలము నదియేకాక మఱి యేమున్నది? కావున నిట్టి యర్థము మన మాలోచించుట సుసంగతమే.

"తతస్స రాజా పునరేవ మూర్ఛితః ప్రియామదుష్టాం ప్రతికూలభాషిణీం,
సమీక్ష్య పుత్రస్య వివాసనం ప్రతి క్షితౌ విసంజ్ఞో నిపపాత దుఃఖితః."

అను నీమూలము పైనవ్రాసినయర్థమును దృఢపఱచుచున్నది. ఎట్లన "ప్రియామదుష్టామ్" సర్వదా ప్రియురాలును బతివ్రతయు నైనది. ప్రతికూలభాషిణీం. ఆకాలమున విధివశమున విరుద్ధముగా మాటలాడినది. ఈయర్థము సరియేనా అందులేమో. "తత్కాలే దైవాత్ప్రతికూలభాషిణీమ్" అని మహే

శ్వరతీర్థులు వ్రాసిరి. అనఁగా భగవతి ప్రేరేపింపఁగా లోకోప కారములను రామునిమూలమునఁ జేయింపఁబూని పరవశయై పతికి మాటాడెననికదా యర్థము. ప్రతికూలభాషిణి యగునది అదుష్టురాలగునా? ఈ రెండుపదములలో నొకఁడు సార్థకము కావలసివచ్చును. అధ్యాత్మ రామాయణమునఁగల

"రామాభిషేకవిఘ్నార్థం యతస్వ బ్రహ్మవాక్యతః."

అనుభావము సార్థకము కదా. ఈభావము మనస్సున నుంచుకొనియే వాల్మీకిమహర్షి "ప్రియామదుష్టాం ప్రతికూలభాషిణీమ్" అని వచించెను. విధివశమున నెట్టివారును మార్పు నొందుదురనుట దీనిచే స్పష్టమయ్యెను. జగజ్జనని యగుసీతాదేవి సర్వకారణభూతురాలగు మహాప్రకృతిగాన నేరీతిగాఁ దలంచునో యక్లేశైక పట్టుపట్టెను. దశరథుఁ డీవిషయము నెఱుంగక దుఃఖసాగరమున మునింగెను. ఇట్టిఘట్టముల నిట్టి యర్థవిశేషములు గ్రహించినఁగాని సీతారాములు ప్రకృతి పూరుషులని తేటపడదు. అది విస్పష్టమైనఁగాని భక్తి తదారాధనతత్పరము కాదు. అదిగ్గాయెనఁగాని తరించుమార్గము లేదు. కేవల మతాభిమానమున నేవో యర్థములు చెప్పఁబూనక వానికంటె వీఁడెక్కుడు. వీనికంటె వాఁడెక్కుడు. అని యల్పబుద్ధిప్రలాపములఁ గాలముపుచ్చక సర్వరూపముల సర్వనామముల సర్వస్థలముల వెలయుపరమాత్మ శ్రీరామరూపమున జగత్కల్యాణకరధర్మమును నిలుపఁబూని యవతరించె నని గ్రహించి యభేదబుద్ధిచేత నారాధించి కృతకృత్యులము కావలయును. వేషధారులమాటలఁ జెవియొగ్గి యాలకించి చెడరాదు. ఇట్టిసద్భావములఁ దెలుపుఘట్టమునఁ దెనిఁగించినవా

రెంతమాత్ర మందలివిశేషముల గ్రహించిరో నెఱుకుదము. మూలమును బైనఁ బఠించితిరికదా.

నంత నజ్జనపతి యంతదాఁకఁ దన
స్వాంతమురీతి మెలంగుచుం బ్రియాం
గనయుఁ బతివ్రతానియతిఁ
గాంచియు నుండినకైక యప్డు రా
ముని వనికంపు మంచుఁ గడు
మూర్ఖతచే వచియింపఁ జూచుచున్

క. చిరపరిచితమగు ప్రియమునఁ
దరుణీమణి ధిక్కరింపఁ దనప్రియసుతుని
మ్కరుణన్ విడువన్నేరక
ధరణింబడె మూర్ఛ మరలఁ దనుముంచుటచేన్.

(ఆంధ్రశ్రీమద్రామాయణము.)

ఆ. ప్రియ నదుష్టభావఁ బెంకెను బ్రతికూల
వచనఁ జూచి సుతునివననివాస
మందు బుద్ధినిలిపి యన నేర కేమియు
శోకమునను బడియె శోష మొంది.

(వావిలికొలనురామాయణము.)

విశేషించి వ్రాయనక్కఱలేదు. సుహృదయులు రస మిందు గ్రహింపఁగలరు. విమర్శకులపాగడ్త లిం దెంతమాత్రము సఫల ములో రసికులే యూహింపఁగలరు. ఇట్టు లీసర్గము మన కనేక నీతుల బోధించుచున్నది. కావున దీనింబఠించి యందలిసార మెఱింగి దైవ మెంతబలవత్తరమో యెఱింగి మెలంగుట శ్రేయము. తరువాతికథఁ బఠింతము.

దశరథునిఁ జూడ సుమంత్రుఁడు వచ్చుట.

* శ్రీరాము నడవులకుఁ బంపుమన్నందులకుఁ బెనుశోకమంది యవయవములు వివశములుకాఁగా నేలంబడియున్న రాజుం జూచి యాపాపమతి రాజా! నాకు వరమిచ్చి భూమిం బడియున్నవాఁడవే. ఏల? అనృతముపలుకనినియతి నుండుటయే న్యాయసమ్మతము. ధర్మజ్ఞులగుమునులు సత్యమే పరమధర్మమని పలుకుదురు గాదే. నేను సత్యరూపధర్మము నాశ్రయించియే వర మనుగ్రహింపఁ బ్రోత్సహించితినిగాని యించుకయు నధర్మము చేయలేదు. మహీపాలకా! పూర్వము శైబ్యుఁడనుభూమిపతి మాటయిచ్చి పక్షిమాత్రమగుదేగకు శరీరమును గోసి యొసంగి సద్గతినొందెను. అలర్కుఁడు వేదవేత్తయగు నొక విప్రుఁడు తననేత్రముల నిమ్మని యర్థింపఁగా రవంతయు విచారింపక లాగియిచ్చెను. సాగరుఁడు చెలియలికట్టను సులభముగా దాఁటఁగలిగియు దానిమీఱనని చేసినసత్యమురీతిగా సంకల్పించి నంతకాల ముప్పొంగినను గూడ దానిని మించిపోవకయున్నాఁడే. సత్యమే యేకరూపమగుపరబ్రహ్మము. సత్యమునందే ధర్మము సంపూర్ణముగా సుప్రతిష్ఠితమై యున్నది. సత్యమే ధర్మమునకుఁ బరమావధి. శాశ్వతములగుశ్రుతులు సత్యమునే ప్రధానమని బోధించుచున్నవి. అట్టిసత్యముచేతనే ముక్తి లభించుచున్నది. కావున రాజా! ధర్మమునందు నీకు స్థిరముగా బుద్ధి నిలుచునేని సత్యము ననుసరింపుము. సత్యమును మించఁజాలు ధర్మము లేదుకదా. నావాంఛించినవరము ఫలింపఁజేయుదువు గాక.

---

*ఇయ్యది పదునాల్గవ సర్గమునఁ గలదు. అధ్యాత్మరామాయణ మిందుఁ గలిసియుండును.

మహీపాలకా! యాచించువారికి లేదనక వరము లొసంగు ప్రోడవు. ఉత్తముఁ డనంబడువాఁడవు కదా. ధర్మపాలనము, దానియభివృద్ధి యనువానికొఱకుఁ, బ్రేయసినగు నేను బ్రోత్స హించుటచే నీకుమారుని శ్రీరాముని వనములకుఁ బనుపుము. త్రివారము లీమాటఁ జెప్పుచున్నాను. పూజ్యమతి నీవు ప్రతిన తప్పరాదు సుమీ. నాకుఁ జెప్పినమాట సార్థకముగా నొనరింప వేని, రామమూర్తిని వనములకుఁ బంపకపోవుదువేని, నన్నిట్లు గారవింపక త్రోసిపుచ్చుదువేని, నేనేల బ్రదుకవలయును? నీవు చూచుచుండఁగా నిందే ప్రాణత్యాగ మొనరింతును.

ఈవిధముగాఁ గైక సంశయమునునది యించుకంతయు లేక మఱిమఱి యడుగఁగాఁ బూర్వము బలిచక్రవర్తి యింద్రా నుజుఁడగువామనమూర్తి తన్నుఁ గట్టివేయఁగా దానిని విడి పించుకొనఁజాలనిచందమున మునుపు తాను గైకకు మాట చెప్పియున్నవాఁడు కనుక సత్యపాశములు తన్ను బంధింపఁగా వానిని వదలించుకొనఁజాలకుండెను. మఱియుఁ బత్నికిచ్చిన వరము లేదనుటకుంగాని, ప్రియకుమారు నడవులకుఁ బంపు టకుఁగాని వలనుపడమి బండికాఁడికిఁ జక్రమునకు నడుమఁ జిక్కినవృషభమువలెఁ జిత్తము త్తలంపడఁగా మోము కాంతి హీనము కాఁగా నొకించుకసే పూరకయుండి పట్టరానిదుఃఖముచే దృష్టి చెదఱఁగా నంధునిబోలి యేమియుఁ గనఁబడకపోవఁగాఁ దుదకు నెట్లో ధైర్యము తెచ్చుకొని మనస్సు దుఃఖసాగరమున మునుఁగకయుండ నిలిపి కైకం గాంచి పాపచిత్తురాలా! అగ్ని సాక్షికముగా విధిమంతముగాఁ జేసికొన్న పాణిగ్రహణమును వదలితిని. ఇంక నీవు నాకు భార్యవు కావు. నేను భర్తనుగాను.

భరతునింగూడ నీతోఁ గూడ వదలితిని. రాత్రి ముగిసినది. సూర్యోదయమయింపఁగా గురువులు లోనగు వారు వచ్చి రామాభిషేకసంభారములు సిద్ధపడినవి. శ్రీరాము నభిషేకింపుమా యని నన్నుఁ ద్వర పెట్టుదురు. ఈమాట తప్పదు. చేసిన ప్రయత్నము భగ్నమగునేని నే జీవింపను. కనుక నాపదార్థములచే రాముని చేత నాకుఁ బారలౌకిక క్రియలు చేయింపవలసి యుండును. దుష్టాత్మురాలా! అమంగళాచారసంపన్నురాలవుగావున రామాభిషేకమునకు నడ్డపడుదువు. అది నాకనిష్టము. కాఁబట్టి నీవు నీకుమారుఁడును నాకు నుదకక్రియలు చేయరాదు. సర్వథా చేయరాదు. నిండుసభలో శ్రీరాముని యువరాజుగా నభిషేకింతునని చెప్పఁగా జనులెల్ల రానంద మతిశయించుచుండఁ జూచిన నేత్రములతో నిపుడు శ్రీరాముఁ డడవులకుఁ బోవునన్న దుర్వార్త నాలకించి యుత్సాహము నశింప నానంద మంతరింప దుఃఖావేశమునఁ దలలు వంచియుండఁగాఁ జూడఁజాలను.

ఈరీతి రాజు భార్యకుం జెప్పుచుండఁగాఁ జంద్రునితోను నక్షత్రములతోను బ్రకాశించుచున్నయారాత్రి యుఁగడచెను. ఆరాత్రి విరామములేక శ్రీరామప్రస్తావముతో సాగనందునఁ బరమపవిత్రమయ్యెను. అంతట దుష్టాచారవతియగునాకైక నిర్భరరోషమునఁ బరవశయైయుండుటంజేసి మండిపడుచు సమయోచితముగా మాటలాడుశక్తికల దాట రాజుం గాంచి మరలఁ గఠినముగా నిట్లు చెప్పెను. భూపాలా! మహావ్యాధి దేహమంతట వ్యాపించి బాధించునట్లున్న యిట్టిమాట చెప్పుచున్నావే. ఏల? శ్రమములేక రాము నిటకుఁ బిలుపింపందగుదువు. నాకుమారునకు రాజ్యమిచ్చి రాము నడవులఁ జరియింపఁ

జేసి శత్రురహితనుగా నన్నుం గావించి నీప్రతిజ్ఞను బరిపాలించినయెడల నీవు కృతకృత్యుఁడవగుదువు. అని మోమోటమి లేక పలికెను.

వాడియగుమునికోలవ్రేటులచే నొచ్చియున్నయాజానేయమువలెఁ బలుసారులు పలుకుచున్నయాకైకమాటలకు మిక్కిలి నొప్పిపడి దశరథుఁ డిట్లు పలికెను. ఓసీ! దుర్బుద్ధీ! నేనిపుడు సత్యపాశబద్ధుఁడను. నావివేకము నశించినది. ధర్మాత్ముఁడగు నాప్రియకుమారు శ్రీరాముఁ జూడఁగోరెద ననిపలికి యూరకుండెను. తెల్లవారె సూర్యుఁ డుదయించెను. పట్టాభిషేకనిమిత్తము నిశ్చయించియున్న పుష్యనక్షత్రయోగసుముహూర్తము సమీపించెను. గుణవద్వరిష్ఠుఁడగు వసిష్ఠముని శిష్యగణములు సేవించుచుండఁగాఁ బురబహిర్భాగముననున్న సరయూనదికింబోయి స్నానముచేసి సత్వరముగా నభిషేకవస్తువులం గైకొని పురమును బ్రవేశించెను. అమ్మునివరుఁడు పురిఁ జొచ్చునవసరమునందు జను లానందపరవశులై మార్గములయందు జలము చల్లి పరిశుద్ధములుగాఁ జేయించి యుంచిరి. ధ్వజోత్తమములు విలసిల్లుచుండెను. ఎల్లతావులఁ బూవులు చల్లఁబడి యందముగా నుండెను. పూలహారములు వ్రేలుచు నెంతయో శృంగారము నానగరమునకుఁ గూర్చుచుండెను. జను లానందపారవశ్యమునఁ జెలరేఁగుచుండిరి. ఎన్ని వేడుకలు గలవో యందు నవు డన్నియు నుండెను. ఆముని యెల్లభంగుల నమరావతింబోలు నానగరమును జొచ్చి యంతఃపురమునకుం బోయెను.

అందు శుభపక్షినినాదములు చెలరేఁగుచుండెను. పౌరజానపదభూసురప్రముఖుల నాపురము నిండియుండెను. ఋత్విక్కులు సదస్యులు నిండియుండిరి. వసిష్ఠముని యాయంతఃపురము చెంతకుంబోయి యందుఁ గ్రిక్కిరిసియున్న పౌరజానపదులం జూచుచు ద్వారముంజొచ్చెను. రాజునకు మంత్రియు సారథియు నగుసుమంత్రుఁ డభిషేకమహోత్సవముకొఱకు నలంకృతుఁడై లోనికింబోయియుండి యపుడే వెడలివచ్చి ద్వారముకడ నుండఁగా వసిష్ఠముని చూచి యతని కిట్లనియె. మంత్రివరా! నారాక రాజశేఖరునకు నెఱిఁగింపుము. అభిషేకమునిమిత్తము గంగాజలసంభృతస్వర్ణఘటములు, సముద్రోదకపూరితసువర్ణకలశములు నివిగో సిద్ధముగ నున్నవి. మేఁడిమ్రానిదగు రాజపీఠము సిద్ధమైనది. నవధాన్యములు బహువిధపరిమళవస్తువులు నవరత్నములు దెప్పించితిని. తేనె పెరుఁగు లోనగునివి తెప్పించితిని. అందగత్తెలగుకన్యక లెనమండుగురు మేటిదంతావళము సిద్ధముగనున్నవి నాల్గుతురంగంబులం బూన్చినరథవర్యము, ఖడ్గము, ధనుర్వరము, మోయఁదగువారితోడఁ బల్లకియు, శ్వేతచ్ఛత్రచామరాదులు సంసిద్ధములు. కనకకలశము, శ్వేతవృషభములును, నిండుప్రాయమున నలరునుత్తమాశ్వములు సంసిద్ధములై యున్నవి. సింహాసనవ్యాఘ్రచర్మములు నగ్నిహోత్రము నాయత్తపఱుపఁబడినవి. సమస్తవాద్యవిశేషములొప్పుచున్నవి. వేశ్యలు సర్వాలంకృతుల నలరు నితరస్త్రీలు రప్పింపఁబడిరి. ఆచార్యులు బ్రాహ్మణులు వచ్చియున్నవారు. గోవులు, మఱియుఁ బవిత్రమృగములు, పక్షులు తెప్పింపఁబడినవి. పౌరజానపదప్రవరులు, వణిజులు, నధ్యాపకులు తమతమ

వీథులం గలవారలంగూడి వచ్చియున్నారు. ప్రియంవదులై పూఁచే నాహూతులై వచ్చియున్న పెద్దలు రాజులును శ్రీరామునభిషేకోత్సవమును జూడ నిరీక్షించియున్నవారు. మంగళకరమగు నీపగటియందుఁ బుష్యనక్షత్రమున రామచంద్రుఁడు రాజ్యాభిషిక్తుఁడగునట్లు చేయ మహారాజును వేగిరింపుము.

అని వసిష్ఠమహాముని పలుకఁగా విని సుమంత్రుఁడు రాజశేఖరుని వినుతించుచు నంతఃపురమును జొచ్చెను. అంతకు మున్నే దశరథుఁడు సుమంత్రుఁడు వచ్చిన నాలసింపక రానిండని ద్వారపాలకులకుం జెప్పియున్నాఁడు కాన సుమంత్రుఁడు లోపలికిఁబోవుచుండ వారెవ్వరు నడ్డగింపఁజాలరైరి. రాజునకు మేలుకోరు నాద్వారపాలకులు సుమంత్రుఁడు లోనికరుగ నానందించిరి. సుమంత్రుఁ డంత రాజుచెంతకుంబోయి యాతని యప్పటి దురవస్థ నెఱుంగనివాఁడౌట సంతోషజనకములగు వాక్కుల రాజు వినుతింప నెంచి తత్కాలోచితముగా నంజలింబట్టి యిట్లు స్తుతించెను. తేజోవంతుఁడగు సాగరుఁడు నిండుచందురుని యుదయమున నెట్టులుప్పొంగునో మహనీయుఁడవగు నీవు నట్లే యానందింపుము. ఇపుడే మాతలి దేవరాజు నుతించెను. ఆతఁడు సర్వదా నవవీరుల జయించెను. ఆలాటి కాలమిది. నేనును మాతలివలె నిన్నుఁ బొగడుచు మేలుకొలుపుదును. నీవు కూడ దేవరాజువలె శత్రువుల నోడింతువు. అంగషట్కముతోఁ గూడిన వేదములు సర్వనాథుఁడగు బ్రహ్మదేవునకు సృష్టినిమిత్తములగు నర్థముల బోధించువిధమున నేనుగూడఁ జేయఁదగు దానిం జేయుటకై నిన్ను మేలుకొలుపుచున్నాఁడను. రవిచంద్రులు విశ్వమును ధరించియుండుభూదేవిని శుభాత్మురాలి

నుదయాస్తమయముల మేలుకొలుపురీతి నిపుడు నే నిన్ను మేలుకొలుపుచున్నాఁడను. మహారాజా! అభిషేకమహోత్సవార్థము సర్వజననేత్రోత్సవముగా నలంకృతుఁడవై సహజసుందరమగు నీశరీరమును మఱింతగాఁ బ్రకాశించునట్లు మేరువునుండి రవి యుదయించునట్లు లెమ్ము. కకుత్స్థకులదీపకా! సూర్యుఁడు, చంద్రుఁడు, శ్రీవిష్ణువు, పార్వతీరమణుఁడు, నలుమోముల వేలుపు, కుబేరవరుణులు, నగ్నిదేవుఁడు, శతమఖుఁడు, విజయము నీకుం గూర్తురుగాక. శ్రీరామచంద్రు నభిషేకింప నుపయుక్తముగానఁ బవిత్రమగు నీ రేయియుఁ గడచెను. నీవానతింపఁదగిన కార్యములన్నియు మేము సిద్ధము చేసియున్నాము. రాజసింహా! మేల్కొని తరువాతి కార్యముల నిర్వహింపుము. అభిషేకసంభారములు సిద్ధమైనవి. మహర్షి వసిష్ఠుఁడు పౌరులు జానపదులు వర్తకులు లోనగువారు చేతులు జోడించుకొని తన్నుఁ గొలువ బ్రాహ్మణులంగూడి నీరాకకై వేచియున్నవాఁడు. కావున శ్రీరామాభిషేకము త్వరగా సాగునట్టు లాజ్ఞాపింపుము. పాలకుఁడు లేని పశువులచందమున, అధిపతి లేనిసేనలరీతి, శశాంకుఁడు లేనిరాత్రికరణి, వృషభము లేనిగోవుపగిది రాజు దర్శనమీయని రాజ్యము మర్యాదలేక నశించును. కాన సత్వరమ ప్రజలకు దర్శన మొసంగుము.

ఈకరణి సుమంత్రుఁడు మనస్సునకు సమ్మతమగునట్లు సాంత్వనోక్తుల మేలుకొలుపుట జయప్రదమాట వచింపఁగా నాపలుకులు చెవులంబడినంతనే రాజునకు శోకము నిర్భరమయ్యెను. అంతటఁ బ్రియకుమారునకుఁ గలుగనున్న దురవస్థకు సంతోషము నశించి ధర్మజ్ఞుఁడు కావున సూనృతము మీఱఁ

జాలక పొక్కుచు శోకాతిశయమున నెఱ్ఱగానున్న కన్నులతో నాసారథివంకఁ దలయెత్తి చూచి యో సుమంత్రా! ఇప్పటికే నామర్మములు ఛేదింపఁబడినవి. ఈస్తుతివాక్కులచే నింకను వానిని ఛేదించుచున్నవాఁడవు సుమీ. అని యూరకుండెను. సారథి వినినంతనే జాలిగలిగించు నావాక్కుల విని దీనుఁడై యున్నభూపాలుం గాంచి భీతిల్లి యంజలింబట్టి కొంతదూరముగాఁ దొలఁగి యుండెను. దశరథుఁడు దుఃఖావేశమునఁ దానుగా మాటలాడఁజాలక యుండఁగాఁ జక్కనియాలోచన మెఱింగినకైక సుమంత్రునితో సారథీ! రాజు రామాభిషేక మహోత్సవోత్సాహముచే రాత్రియంతయు మేల్కొనియుండి యాయాసపడి యిపుడు నిద్రపోవుచున్నాఁడు. కాన నీవిపుడే పోయి యశోవిశాలుఁడగురాముని దోడ్కొనిరమ్ము. నీకు భద్రమగుంగాక. ఈవిషయమై యాలోచింపక పొమ్ము. అనఁగానే యాసుమంత్రుఁడు రాజు పలుకులచేతనే యేమో యనర్థముగలిగినదే యని సందేహించుచున్నవాఁడు కావున నాకైకపలుకులు విని విశేష మేమియు లేదు. ఇఁక శుభమే. యని మనంబున నూహించుచు సంతసించుచు రాజుననుమతినొందియే దేవి యీరీతిఁ బలికెనని యెంచుచుఁ బోయెను. పోవుచుఁ గైక తన్ను రాముని దోడ్కొనిరమ్మని పురికొలిపినందులకు మనస్సున నిప్పటికిఁ దెలిసెను. శ్రీరాముఁడు పట్టాభిషేకమునిమిత్తమే రాఁగలఁడని యెంచుచు శ్రీరాముని దర్శింపఁగోరి పురమధ్యభాగమున నున్నందున సాగరాంతరమందున్న హ్రదముఁరీతి నలరారు నంతఃపురమునుండి వెడలి చని జనులునిండియున్న దాని ద్వారమును గాంచి యచటఁ జేరి ముందున్న రాజులను బరికించి కానుకలుగొని గుంపులుగా నున్న జనులను గాంచెను.

మహామతులారా! ఈభాగమునఁ గొన్ని భాగములు విమర్శింపఁదగినవి కలవు. వానినుండి నేర్చుకొనఁదగిననీతులు గలవు. అధ్యాత్మరామాయణమున సుమంత్రుఁ డరిగి రాజు చింతఁ బూనినట్లుండఁగాఁ గైక నడిగెననియు, నామె చెప్పినకారణము తృప్తికరముగా లేనందున రాజాజ్ఞ లేకయుండ నే నెట్లు రాముని దోడ్కొనివత్తునని యడిగెననియు, రాజు రాముని జూడఁ గోరుచున్నాఁడనని పలికెననియు, దాని విని యతఁ డరిగెననియు నున్నది. ఇదియే భేదము.

"తమాహ కైకయీ రాజా రాత్రౌ నిద్రాం న లబ్ధవాన్,
రామ రామేతి రామేతి రామమేవానుచింతయన్.
ప్రజాగరేణ వై రాజా హ్యస్వస్థ ఇవ లక్ష్యతే,
రామమానయ శీఘ్రం త్వం రాజా ద్రష్టుమిహేచ్ఛతి,

సుమంత్రః—

అశ్రుత్వా రాజవచనం కథం గచ్ఛామి భామిని,
తచ్ఛ్రుత్వా మంత్రిణో వాక్యం రాజా మంత్రిణమబ్రవీత్.
సుమంత్ర రామం ద్రక్ష్యామి శీఘ్రమానయ సుందరమ్."

(అధ్యాత్మరామాయణము 3 సర్గము.)

ఈపాటిభేదము పాటింపరాదనియుఁ గథాసారమునకు దాన బాధలేదనియుఁ బెద్ద లెఱుంగుదురు.

"పాపం కృత్వైవ కిమిదం మమ సంశ్రుత్య సంశ్రవం,
శేషే క్షితితలే సన్నస్థిత్యాం స్థాతుం త్వమర్హసి. ౨
ఆహుస్సత్యం హి పరమం ధర్మం ధర్మవిదో జనాః,
సత్యమాశ్రిత్య హి మయా త్వం చ ధర్మం ప్రచోదితః." 3

అని మూలము. కైక దశరథున కిందు సత్యమును దెలుపుచు దాని వదలకుమని బోధించుచున్నది. శ్రీరామచంద్రుఁడు సత్య నిరతుఁడు. లోకమునకుఁ దాను సత్యపద్ధతికి నుదాహరణ భూతుఁడు. ఏల? సత్యమే భగవత్స్వరూపము. సత్యముననే ప్రపంచము నిలిచియున్నది. సత్యముగలచోట భగవంతుఁడు నివసించును. రామమూర్తి పరమాత్మ. ఆతఁడుండుచోట సత్యమునకు లోపము రారాదు. కావున నీవు సత్యమనేమర్యాద యందు నిలువఁబడుమా యని తెలిపెను. "యథా రాజా తథా ప్రజాః" అన్నయట్లు రాజే యసత్య మాడినఁ బ్రజలాడక యుండరు. వారికి నసత్యము నేర్పినవాఁడు రాజగును. కావున నెన్నికష్టములు గలిగినను రాజు సూనృతము మానరాదు. లోకమున నీకీర్తి శాశ్వతము కావలయును. కనుక నామూలమున నీవు యశస్సు నార్జింపుమని దేవి హెచ్చరించుచున్నది. భార్య భర్తకు నీతిని దెలుపవచ్చునా యని కొందఱందురు. తెలుపవచ్చునని స్మృతి బోధించుచున్నది. "అంత్యాదపి పరం ధర్మమ్" అని నీతి బోధించుటకుఁ బెద్ద యని యెన్నవక్కఱ లేదు. "బాలాదపి సుభాషితం" అని స్మృతివాక్యము కలదు కదా. ఈయర్థమే రామాయణము తెలిపెడిని.

ధర్మజ్ఞులగుమహాత్ములు సత్యమును బరమధర్మమని చెప్పుదురు. ధర్మమనఁగా నెట్టిది? అని విచారింతము. "ధరతి లోకానితి ధర్మః" అనువ్యుత్పత్తిప్రకారము ధర్మమే భగవత్స్వరూపమని తేలెడిని.

"ఏకఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతి యః,
శరీరేణ సమం నాశం సర్వమన్యత్తు గచ్ఛతి."

(అని హితోపదేశము.)

ఈమతమునందు శుభాదృష్టము ధర్మశబ్దమున కర్థము.

"శ్రద్ధా కామం చ శ్రీర్దర్పం నియమం ధృతిరాత్మజం,
సంతోషం చ తథా తుష్టిర్లోభం పుష్టిరసూయత.
మేధా శ్రుతం క్రియా దండం నయం వినయమేవ చ,
బోధం బుద్ధిస్తథా లజ్జా వినయం వపురాత్మజం.
వ్యవసాయం ప్రజజ్ఞే వై క్షేమం శాంతిరసూయత,
సుఖం సిద్ధిర్యశః కీర్తిరిత్యేతే ధర్మసూనవః." (పురాణవచనము.)

ధర్మోత్పత్తి వరాహాపురాణమున నిట్లు చెప్పఁబడినది.

"అథోత్పత్తిం ప్రవక్ష్యామి ధర్మస్య మహాత్మో నృప,
మాహాత్మ్యం చ తిథిం చైవ తన్నిబోధ నరాధిప.
సర్వం బ్రహ్మోవ్యయః శుద్ధపరాదపరసంజ్ఞితః,
స సిసృక్షుః ప్రజాస్త్వాదౌ పాలనం చ వ్యచింతయత్.
తస్య చింతయతస్త్వంగాద్దక్షిణాచ్ఛ్వేతకుండలః,
ప్రాదుర్బభూవ పురుషశ్శ్వేతమాల్యానులేపనః.
తం దృష్ట్వోవాచ భగవాంశ్చతుష్పాత్సత్యకృ(ౢ)తే యుగే,
త్రేతాయాం త్రిపదశ్చాసౌ ద్విపదో ద్వాపరేఽభవత్,
కలావేకేన పాదేన ప్రజాః పాలయతే ప్రభుః.
షడ్గేహో బ్రాహ్మణానాం స త్రిధా క్షత్రే వ్యవస్థితః,
త్రిధా విశ్యేకధా శూద్రే స్థితస్సర్వగతః ప్రభుః.
గుణద్రవ్యక్రియాజాతిచతుష్పాదః ప్రకీర్తితః,
త్రిశృంగోఽసౌ స్మృతో వేదే ససంహితపదక్రమః.
తథా ఆద్యంతఓంకార ద్విశిరాస్సప్తహస్తవాన్,
ఉదాత్తాదిత్రిభిర్బద్ధ ఏవం ధర్మో వ్యవస్థితః.

బ్రహ్మోవాచ—

అద్యప్రభృతి తే ధర్మ! తిథిరస్తు త్రయోదశీ,

యస్త్వాముపోష్య పురుషో భవంతం సముపార్చయేత్,
కృత్వా పాపసమాచారం తస్మాన్ముంచతి మానవః."

బ్రహ్మాండపురాణమునందు ౨౭ అధ్యాయమునందు.

"ధర్మో నారాయణో నామ వ్యాసస్తు భవితా యదా,
తదాప్యహం భవిష్యామి భవిష్యామి మహామునిః,
వాలఖిల్యాశ్రమే పుణ్యేపర్వతే గంధమాదనే,
తత్రాపి మమ తే పుత్రా భవిష్యంతి తపోధనాః,
సుధామా కశ్యపశ్చైవ కనిష్ఠావిరజా స్తథా,
మమ యోగబలోపేతా విమనా హ్యూర్ధ్వరేతసః,
ప్రాప్య మాహేశ్వరం తేజో రుద్రలోకాయ సంస్థితాః."

ధర్మలక్షణము పద్మపురాణోత్తరఖండమునందు(గలదు.

"పాత్రే దానం మతిః కృష్ణే మాతాపిత్రోశ్చ పూజనం,
శ్రద్ధాబలిర్గవాంగ్రాసః షడ్విధం ధర్మలక్షణం."

అందే భూమిఖండమునందు ధర్మాంగములు చెప్ప(బడినవి.

"బ్రహ్మచర్యేణ సత్యేన తపసా చ ప్రవర్తతే,
దానేన నియమేనాపి క్షమా శౌచేన వల్లభ,
అహింసయా సుశాంత్యా చ అస్తేయేనాపి వర్తతే,
ఏతైర్దశభిరంగైస్తు ధర్మమేవ ప్రసూచయేత్."

ధర్మమూలమేది యనునది మత్స్యపురాణమునం గలదు.

"అద్రోహశ్చాప్యలోభశ్చ దమో భూతదయాతపః,
బ్రహ్మచర్యం తతస్సత్యమనుక్రోశః క్షమా ధృతిః,
సనాతనస్య ధర్మస్య మూలమేతద్దురాసదం."

కలియుగమునఁ బదివేలయేండ్లు నిండఁగా ధర్మాంగములన్నియు భగవంతునికడం జేరును. ఈవిషయము బ్రహ్మవైవర్తపురాణమునఁ బ్రకృతిఖండమునఁ గలదు.

"సాలగ్రామో హరేర్మూర్తిర్జగన్నాథశ్చ భారతం,
కలేర్దశసహస్రాంతే యయౌ త్యక్త్వా హరేః పదం.
సత్త్వం చ ధర్మం సత్యం చ వేదాశ్చ గ్రామదేవతాః,
వ్రతం తపశ్చానశనం యయుస్తైస్సార్ధమేవ చ."

ధర్మమునకు స్థానములు వామనపురాణమునందుఁ గలవు.

"యత్ర స్థానం తవాధారో వదామి శ్రూయతాం విభో,
వైష్ణవేషు చ సర్వేషు యతిషు బ్రహ్మచారిషు,
పతివ్రతాసు ప్రాజ్ఞేషు వానప్రస్థేషు భిక్షుషు.
నృపేషు ధర్మశీలేషు సత్సు సద్వైశ్యజాతిషు,
ద్విజసేవిషు శూద్రేషు సత్సంసర్గస్థితేషు చ.
ఏషు త్వం సతతం పూర్ణో ధర్మరాజ! విరాజసే,
యుగే యుగే తవాధారా ఏతే పుణ్యతమా జనాః."

ఇంకను వ్రాయఁబూనిన స్కాందపురాణమంత యగును. భగవంతుఁడే యుగానురూపముగా ధర్మరూపమున వెలయుననియు, నట్టిధర్మస్థానము లివియనియు, వాని నారాధింపఁదగుననియు, నందు సత్యము ప్రధానమనియు దీనిసారము. "వైష్ణవేషు చ సర్వేషు" అనుచోట నిలువుగా నామమును గుఱుతు పెట్టువారు కారనియు, విష్ణుభక్తు లేజాతియందున్నను వారియందు ధర్మము నిలుచుననియు భావము. ఇందు శివభక్తులకుఁ జోటు లేదే యని కొందఱు శంకింపవచ్చు. విష్ణువనఁగా సర్వవ్యాపకుఁ

డగు భగవంతుఁడేకాని వైకుంఠమున కధిపతియయి త్రిమూర్తులలో గణింపఁబడునతఁడు కాఁడనియు నెఱుంగందగు. ఆ నారాయణమూర్తి భగవదవతారము కాదా యన్న నతఁడొక్కఁడే కాదు. శంకరాదులు భగవదవతారములే యనునది సమాధానమగును. విష్ణుభక్తులకే ముక్తి దొరకునుగాని శివభక్తులు లోనగువారికి ముక్తిలేదను మధ్వవైష్ణవులవాదము దుర్వాదమనియు, నజ్ఞానఫల మదియనియుఁ దెలియందగువిషయము. భగవంతు నేరూపమున నారాధించినను భక్తి నిశ్చలతంగాంచిన నతఁడు ముక్తి కర్హుఁడగుననునదియే యుపనిషన్మతము. సర్వమతసార మిదియే. అట్లుగాక నిలువు నామములే పెట్టుకొని చక్రాంకితు లైనఁగాని ముక్తి లేదన్నచో నయ్యది వారికే సిద్ధాంతమగును. ఇతరులకుఁ గాదు. వేదసమ్మతముకాదు. జ్ఞానిసమ్మతముకాదు. ఏజాతియందుఁగాని సర్వేశ్వరుని నమ్మినవారికెల్ల ముక్తి కలదనుటయే తత్త్వము. సకలశ్రుతిస్మృతిపురాణేతిహాససమ్మతమగున దిదియేకాని వేఱొకఁడు కానేరదు. ముమ్మాటికిఁ గానేరదు. వైష్ణవులకే ముక్తియనునది యాహారరూపమగు శిలావిగ్రహప్రసాదమే యనుట సర్వసాధుసమ్మతము. పాంచరాత్రాద్యాగమములయం దిట్లు లేదే యని కొందఱు భక్తినాటకులు పలుకుదురు. శైవశాక్తాద్యాగమములుకూడ నట్లే తెలుపును. అవి యప్రమాణములు కావుకాని తొలుదొలుత భక్తి కుదురుటకుగాఁ జెప్పఁబడినవనియు, భక్తి కుదురుకొనఁగా శిలావిగ్రహపూజ మాని భగవంతుని యోగమతము ననుసరించి ధ్యానింపవలయుననియు నుపనిషత్తులు బోధించును. ఆగమములే ప్రమాణములన్న వేదము లెగిరి

పోవును. ఆగమములు ప్రాయశః కుక్షింభరులగువారిని భక్తులుగాఁ జేయునెపమున వ్రాయఁబడినవనుట శిరోధార్యమగు మాటయే యగును.

ఈరీతిగాఁ గైకేయి రాజునకు ధర్మమును సత్యరూపముగ నుండుదానిని బోధించెను. స్వకార్యసిద్ధికేకదా యని కొందఱందురు. కైక పతివ్రతయే యని వాల్మీకి తెల్పెను. భగవదిచ్ఛవలన నామె లోకోపకారపరాయణురాలయ్యెనని మన మెన్నవలయును. దుష్టురాలే యైన శ్రీరామమూర్తి యామెను గారవింపఁడుగదా. దుష్టురాండ్రనుగూడ గారవించునేని శ్రీరాముని ప్రవర్తనము స్తుత్యమెట్లగును? కైక ధర్మపరాయణురాలు గనుకనే రాజా! ధర్మమార్గమున నడువ నిన్నుఁ బురికొలుపుచున్నదాన ననియె. సత్యమును బరమధర్మమని పెద్దలు పలుకుదురుకదా. దానిని వదలఁగూడదని హెచ్చరించెను.

"సత్యమేకపదం బ్రహ్మ సత్యే ధర్మః ప్రతిష్ఠితః,
సత్యమేవాక్షయా వేదాస్సత్యేనైవాప్యతే పరం.
సత్యం సమనువర్తస్వ యది ధర్మే ధృతా మతిః
సఫలస్స వరో మేఽస్తు వరదో హ్యసి సత్తమ."

అని మూలము మరల నారాజునకు సత్యరూపమును దెల్పుచున్నది. సత్యమే యేకరూపమగు బ్రహ్మము. అనఁగా నిర్వికారుఁడగు పరమాత్మ యని యర్థము. సత్యమే యాధారముగా ధర్మమున్నది సత్యము ప్రధానముగాఁ దెలుపుటంబట్టి వేదము లక్షయములైనవి. సత్యము నారాధించిన ముక్తి లభించును. అనఁగా సత్యము పరమాత్మస్వరూప మనియుఁ, దదారాధన

మునఁగాని ముక్తి లభింపఁదనియు నిందుండి మనము గ్రహింప వచ్చును.

కొన్నియెడల నసత్యము సత్యముగాఁ జెప్పఁబడినదికదా యని కొందఱు శంకింతురు. కాని వారు దూరమాలోచించినవారు కారని తోఁచెడు. ఎట్టిసంకటములందు నసత్యమాడరాదనువారే యుత్తములు. ఆమార్గమున నడువఁజాలనివారలకుంగూడ సత్యమున నడువ నేర్పుటకే కొన్నియవకాశము లొసంగిరి అట్టివిషయములందప్పఁ దక్కినసమయములయందైన వారసత్యమాడకయుందురుగాక యనియే స్మృతులతాత్పర్యము. "వారిజాక్షులందు వైవాహికములందు" అనుపద్యమునఁ గలకాలముల నసత్యముపలుకువారు వారిశ్చంద్రునిచెంత నిలువఁబడఁదగరు. సర్వకార్యములయం దసత్యము పలుకువారలకంటె వీరుత్తము లనవచ్చును. అంతియ కాని యెట్టియాపదలయందు నసత్యముపలుకనివారివలె నుత్తములు కారని నిశ్చయించుట మంచిది. లోకమున నన్నింటికి నుదాహరణభూతు లుండవలయుఁగదా.

"సత్యం బ్రూయాత్ప్రియం బ్రూయాన్న బ్రూయాత్సత్యమప్రియం,
ప్రియం చ నానృతం బ్రూయాదేష ధర్మస్సనాతనః."

అన్న మనుస్మృతివాక్యము గోడపైనుంచినదీపమువలె నున్నదే యందురేని అది సామాన్యధర్మములలోఁ జెప్పఁబడినది.

"దృష్టిపూతం న్యసేత్పాదం వస్త్రపూతం జలం పిబేత్,
సత్యపూతాం వదేద్వాచం మనః పూతం సమాచరేత్." ౪౬

(మను. ౬. అధ్యా.)

అని సన్న్యాసులవిషయమున మనుస్మృతి యాజ్ఞాపించుచున్నది. సత్యేతరవాక్కు వారు పలుకరాదని విధించుచున్నది. కావున సామాన్యులధర్మముల నుదాహరించి మనుస్మృతి యసత్యమున కవకాశమిచ్చెనని మనము వాదింపరాదు. దానిహృదయ మెట్టి దని విచారింపవలయును.

"ధర్మస్యేహాభికామార్థం మమ చైవాభిచోదనాత్,
ప్రవ్రాజయ సుతం రామం త్రిః ఖలు త్వాం బ్రవీమ్యహం."

అని మూలము. సామాన్యార్థము సుగమము. విశేషార్థ మేమ నఁగా నీకుఁ బ్రియురాలనగు నాప్రోత్సాహమువలనను ధర్మ రక్షణముకొఱకును సుతుఁడనుప్రీతిచే మానక శ్రీరాము నడ వులకుం బంపుము. మాఁటికి ముమ్మాటికిఁ జెప్పుచున్నాను. అనఁగా ధర్మసంరక్షణము ముఖ్యకార్యము. దానికొఱకు నేనుఁ బురికొల్పుచున్నాను. కావునఁ ద్రికరణశుద్ధిగా నామాట నమ్ముము. మహోపకారము కలుగును. రామచంద్రు నడవులకుఁ బంపు మని కైకభావము. ఎట్టులైన రాము నడవులకుంబంపినఁగాని ధర్మరక్షణము కాదనియే దీనిసారము. దీనిచేత విధివశమునఁ గైక లోకముల కుపకారము చేయఁబూనెనని మన మెఱుంగ వలయు. నాప్రోత్సాహమునఁ బంపినట్లుండినఁగాని నాకీర్తి లోక ముల వ్యాపింపదని కైక యడుగుచున్నది. అపకీర్తికూడ రాదాయన్నఁ దొలుత నలుగురు దూషించినను దేవతలు మహ ర్షులు పొగడుదురు. అదియే యశస్సు. లోకమునకు మహోప కారము కైకమూలమునఁ గలిగినదని భగవంతుఁ డెఱింగినం జాలుననుమాట భగవంతునిప్రేరణమున నామెకుం గల్గినదని మన మెఱుంగుట న్యాయ్యము.

"యస్తే మంత్రకృతః పాణిరగ్నౌ పాపే మయా ధృతః,
తం త్యజామి స్వజం చైవ తవ పుత్త్రం త్వయా సహ." ౧౪

అని మూలము. కైకయాశయ మెద్దియని రా జెఱుంగఁడు. తానేల యిట్లు పట్టుపట్టియడుగుచున్నాననియామెయే యెఱుంగదు. భగవత్సంకల్ప మిట్టిదని మన మెఱుంగవలయును. అంతఃపురమునఁ గూరుచుండి దుష్టరాక్షసులం బొలియింప సంకల్పించి మహామాయ సీతాదేవి సంకల్పించెను. ఆసంకల్పమే యెవ్వారిచేత మరల్పరానిదై పనిచేయుచున్నది. శ్రీరామమూర్తియో తనసర్వసాక్షిత్వమును వెలయించుచు నూరక యున్నవాఁడు. ప్రకృతివశంవదుఁడు. స్వాత్మానందము ననుభవించుచు నిర్వికారుఁడై యున్నవాఁడు. అనువిషయమును మనము చక్కఁగా నెఱింగినఁగాని రామాయణతత్త్వము తెలిసికొనఁజాలము. ఏవేవో యర్థములుచెప్పి గురువునకు శరణాగతి సమర్పింపవలయునని బోధించిన లాభము లేదు. ఈకాలమునఁ బ్రపత్తి యనునది విపరీతముగాఁ బరిణమించుచున్నది. గురువులు వేషధారులు. వంచకులు. స్వానుభవములేనిజ్ఞానమును వెదఁజల్లువారు. కేవల నామధారులు. అట్టివారు తెలుపు ప్రపత్తియు నట్టిదే యగును. ప్రపత్తి యనుమాటలు చాలవు. దాని ననుభవమునకుఁ దెచ్చుకొనుట మహాకార్యమే యగును. కాని యది యిపుడు గగనారవిందమే. ఇప్పటిమాటలప్రపత్తి ధనవిముక్తి కారణమగును. అంతియగాక భగవదుపాసనమునకు భంగమును గల్గించును. ఆచార్యోపాసనమున నాసక్తికలిగించి సంసారమున ముంచును. కావున నద్దాని మాని భగవంతు నారాధించుపనికిం గడంగవలయును. ప్రపత్తియని, శరణాగతి

యని, భక్తియని మార్చిమార్చి పేరు లేవేవో పలుకుచు నుందురు. వానిని త్యజించి శాస్త్రమురీతిగా నుపాసింపవల యును. అంతియగాని ప్రపత్తి ప్రపత్తియని యూరకుండుట నిరర్థకము.

“జీవాత్మనః ప్రశాంతస్య పరమాత్మా సమాహితః,
శీతోష్ణసుఖదుఃఖేషు తథా మానావమానయోః. ౭
జ్ఞానవిజ్ఞానతృప్తాత్మా కూటస్థో విజితేంద్రియః,
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మకాంచనః.” ౮

అన్న గీతాశాస్త్రమురీతిగాఁ దపోనిరతికిం గల్గులక్షణముల సంపాదించుకొని మంత్రవిక్రయముచేయని (ధనముకొఱకు మంత్రముపదేశింపని) గురువుల నాశ్రయించి యోగప్రకారము భగవంతు నారాధింపవలయును.

“ద్వాసప్తతిసహస్రాణి హృదయాదభినిస్సృతాః,
హితాహితా నామ నాడ్యస్తాసాం మధ్యే శశిప్రభం. ౧౦౮
మండలం తస్య మధ్యస్థ ఆత్మా దీప ఇవాచలః,
స జ్ఞేయస్తం విదిత్వేహ పునరాజాయతే న తు.” ౧౦౯

యాజ్ఞవల్క్యస్మృతి.

ఈయదియే యోగిధ్యేయమగు నాత్మస్వరూపము.

“తస్య మధ్యే వహ్నిశిఖా అణీయోర్ధ్వా వ్యవస్థితః,
నీలతోయదమధ్యస్థాద్విద్యుల్లేఖేవ భాస్వరా,
నీవారశూకవత్తన్వీ పీతా భాస్వత్యణూపమా,
తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః,
సబ్రహ్మా సశివస్సహరిస్సేంద్రస్సోఽక్షరః పరమస్స్వరాట్.”

అనుశ్రుతియు నుపాస్యమూర్తిని దేటపఱచును. బ్రహ్మ,శివుఁడు, విష్ణువు మొదలగువారుగాఁ బరిణమించువాఁడు భగవంతుఁడు ధ్యేయమూర్తి యని తేటపఱచెడు. ఈ త్రిమూర్తులు భగవదంశము లేకాని పరమాత్మ యనఁబడు సర్వభూతాంతర్యామి కారని స్పష్టపఱచుచున్నది. కావున ధనముంగోరు నాచార్యులు లోనగుగురువుల మోసపుమాటలఁ బాటింపక శ్రుతిస్మృతిపురాణేతిహాసాదిప్రతిపాద్యమగు నాత్మస్వరూపము నెఱింగి సేవింపవలయును. ప్రకృత మనుసరింతును. దశరథుఁడు కైక దుష్టురాలని యాగ్రహించుచు నీవు నాకు భార్యవు గావు. వివాహసంస్కారమును వదలుచున్నాఁడ ననుచున్నాఁడు. నీతోడ నీకుమారుని భరతునింగూడ వదలుచున్నాఁడ ననియెను. ఈ మాటలంబట్టి దశరథునకుఁ జిత్తశుద్ధి కలదనవచ్చునా? వివాహసంస్కారము నశించు టెట్లు? జీడిమచ్చవలెనగ్నిసాక్షికముగాఁ జేసికొన్న భార్యను దగినకారణములు లేక వదలుట న్యాయ్యమా? భార్యాత్యాగకారణములు స్మృతిప్రతిపాదితములైనవి కైకయెడఁ గానంబడుచున్నవియా? అట్టివి లేనితఱి వదలుకొనుట యెట్లు? దీనిభావమేమి? మృత్యుగ్రస్తుఁడగుట మతి తప్పియున్నవాఁడు. రామచంద్రాసక్తచేతస్కుఁడై సర్వము మఱచెను.

"ప్రాయస్సమాపన్నవిపత్తికాలే ధియోఽపి పుంసాం మలినా భవంతి"

అన్నసూక్తి న్యాయ్యమే కదా. దీనినెల్లఁ బరికించి చూడఁగాఁ గర్మము బలవత్తరమని తేలెడిని. దానిపోకడ లెంతవారలే నెఱుంగరు. మానవులే కాక త్రిమూర్తులును గర్మబద్ధులే.

కర్మమే బ్రహ్మస్వరూపమని నమ్మినవారు తరింతురు. దశరథుని సంభాషణమునుండి నేర్చుకొనవలసిననీతులు కొన్ని కలవు.

"పాణిగ్రాహస్య సాధ్వీ స్త్రీ జీవతో వా మృతస్య వా,
పతిలోకమభీప్సంతీ నాచరేత్కించిదప్రియమ్."

అన్నమనుస్మృతివచనముప్రకారము పతికిఁ గొంచెమే నప్రియమాచరింపరాదు. ఇది సాధ్వీధర్మము. అప్రియవాదిని యగు భార్యను వదలవలయునని మనువే తెల్పెను.

"వంధ్యాష్టమేఽధివేద్యాబ్దే దశమే తు మృతప్రజా,
ఏకాదశే స్త్రీజననీ సద్యస్త్వప్రియవాదినీ. ౮౧
యా రోగిణీ సా తు హితా సంపన్నా చైవ శీలతః,
సానుజ్ఞాప్యాధివేత్తవ్యా నావమాన్యా కదాచన." ౮౨

మను. ౯ అధ్యా.

ఈనియమము ననుసరించి కైక వదలఁదగునుగదా యనువారుందురు. కైక యప్రియవాదిని కాదు. దశరథుఁడు కృతజ్ఞుఁడై వరములు తానే యిత్తునని యెను. వలసినపు డడుగుదునని యామె బదులిచ్చెను. నాకు మనఃకష్టము కలుగునట్లు లడుగకుమా యని సమయము రాజు చేయలేదు. అడిగినపు డప్రియవాదిని యగునందుమేని సత్యస్వరూపము మనకుఁ దెలియదనియే సిద్ధాంతమగును. దశరథునకు శాపఫలానుభవకాలము సమీపించినది. కైక నాశాపమే పురికొల్పినది. కావున మనుస్మృతి తెల్పినదోష మామెయందుఁ గానరాదు.

"కిమిదం భాషసే రాజన్ వాక్యమంగరుజోపమం,
ఆనాయయితుమక్లిష్టం పుత్త్రం రామమిహార్హసి." ౨౧

అని మూలము. ఏకష్టములు లేకుండునట్లుగా రాముని బిలి పింపఁదగుదువని రాజుతోఁ గైక తెల్పెను. అనఁగా నీకేల యింత కష్టము! కష్టములు లేకుండునట్టు లనఁగాఁ గష్టములన్నియుఁ దొలఁగిపోవునట్లనికదా తాత్పర్యము. రాముని బిలిపింపఁగా నీకష్టములు తొలఁగునని సారము. శ్రీరామదర్శనమున నన్ని కార్యములు ఫలించును. కావునఁ ద్వరగాఁ బిలువఁబంపుమనియే యిటఁగలవిశేషము. ఈయర్థ మెఱిఁగి కైక తెల్పెనా యనరాదు. భగవతి సీతాదేవి స్మరించినంతన దేవతలప్రార్థనము ఫలించు నట్లు కైక యవశయై పల్కెనని మన మూహింపవలయును.

"స్థాప్య రాజ్యే మమ సుతం రామం కృత్వా వనేచరం,
నిస్సపత్నాం చ మాం కృత్వా కృతకృత్యో భవిష్యసి." ౨౨

అని మూలము. ఇందు విశేషార్థము కలదు. రాజా! సత్పుత్త్రులం గంటివి. చిరకాలము రాజ్యమేలితివి. సుఖము లనుభవించితివి. ఇఁక భరతుని రాజ్యమున నిలుపుము. రాము నడవుల కనుపుము. శత్రువులు లేనిదానినిగా న న్నొనరింపుము. ఈకార్యముల నొనరించిన సఫలమనోరథుఁడవు కాఁగలవు. అనఁగా విశేషమేమి? భరతుని రాజ్యమున నిలిపినఁగాని యాతని యవ్యాజభ్రాతృవాత్సల్యము వెల్లడికాదు. రామమూర్తి నడవులకుఁ బంపినఁగాని యవతారఫలము కనఁబడదు. ఈరెండు కార్యములు నెఱవేఱినపిదపఁగాని నేను శత్రువులు లేనిదానను గాను. అనఁగా రామావతారఫలము కనఁబడఁగా నన్ను దూషించినయెల్లరు వినుతింతురు. ఏల? రామావతారఫలము కైక కారణమునఁ గనఁబడియెనని. ఇట్లు చేసి కృతకృత్యుఁడ వగుదువనఁగా నీకార్యములు నెఱవేర్చినవాఁడవగుదువు. ఈ

శరీరభారము వదలఁగా ధన్యుఁడవగుదువని భావము. మఱి యొకయర్థ మిటనున్నది. మాం ప్రకృతిరూపిణియగుసీతాదేవిని నిస్సపత్నాం కృత్వా = శత్రువులగురాక్షసులు లేనిదానినిగా నఁగా రాక్షససంహారము నొనరించునట్లుచేసి కృతకృత్యుఁడవు కమ్మని తాత్పర్యము. ఈపక్షమున మూలప్రకృతియే సర్వకార్యములు భగవదిచ్ఛ ననుసరించి చేయుననియుఁ, బరాత్పరుఁడు సాక్షిమాత్రుఁడై యుండుననియు సారము. రాము నడవులకుం బంపినఁగాని రాక్షససంహారము కాదు. అందులకు సీతయే కారణము కాఁగలదు. తన్మూలముననే యెల్లకార్యములు నెఱవేఱును. ఇట్టికృత్యము నొనరించి నీవు ధన్యుఁడవు కమ్మని తెలిపినదని గ్రహింపందగు.

"హరిస్త్వామారాధ్య ప్రణతజనసౌభాగ్యజననీం,
పురా నారీ భూత్వా పురరిపుమపి క్షోభమనయత్,
స్మరోఽపి త్వాం నత్వా రతినయనలేహ్యేన వపుషా
కవీనామప్యంతఃకరణమపి మోహాయ మహతామ్."

అన్న శంకరభగవత్పాదాచార్యోక్తి యిందులకుఁ బ్రమాణము. జగదంబ యగుసీతం గాంచి భ్రాంతిపడి రావణాదిరాక్షస ప్రముఖులు నశింతురని దీనినుండి తేలెడిని.

"మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరమ్"

అనుగీతావాక్యము మాయయే చరాచరనిర్మాణ మొనరించునని తేటపఱచుచున్నది. నిర్మించుటకు హేతువైనపుడు చంపుటకును బాలించుటకును హేతువగును. కాదనుట కెవ్వరికి నధికారములేదు. ఈయర్థముననే శంకరాచార్యులుగారు

"విరించిః పంచత్వం వ్రజతి హరిరాప్నోతి విరతిం
వినాశం కీనాశో భజతి ధనదో యాతి నిధనం,
వితంద్రీమాహేంద్రీ వితతిరపి సమ్మీలితదృశా
మహాసంహారేఽస్మిన్విహరతి సతి త్వత్పతిరసౌ." ౨౬

అనునది "మయాధ్యక్షేణ" అనువాక్యమునఁ గలయర్థమునే తెలిపెడిని. అనఁగాఁ బరమపురుషుఁడనగు నేను శాశ్వతుఁడనై యధిపతినై యుండఁగా ననికదా భగవంతుఁడు తెలిపెను. ఇందుఁగూడ నోభగవతీ నీభర్త ప్రళయకాలమందు నిన్నుఁ గూడి విహరించుచున్నాఁడు. అనునర్థమే కలదు.

"జగత్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వన్నేతత్స్వమపి వపురీశస్తిరయతి,
సదా పూర్వస్సర్వం తదిదమనుగృహ్ణాతి చ శివ
స్తవాజ్ఞామాలంబ్య క్షణచలితయోర్భ్రూలతికయోః." ౨౭

అన్న శ్రీశంకరభగవత్పాదోక్తి "సూయతే సచరాచరమ్" అన్నభావమునే తెలుపుచున్నది. వైష్ణవులు ప్రకృతి యనఁగా లక్ష్మి యనుకొననిండు. బాధయేమియు లేదు. ఎవ్వరెట్లు భావించినను దదాకారమునఁ బరిణమించు నాదిశక్తికి లక్ష్మీప్రభృతి నామములు తద్రూపములు లేవనరాదు. భక్తులయిచ్ఛానుసారముగా రూపనామములఁ దాల్చు పరమేశ్వరిగదా ప్రకృతి. ఇట్లు భగవద్గీతావాక్యము శంకరభగవత్పాదోక్తియు నేకరీతిగాఁ బ్రకృతికిం గలమహాద్భుతశక్తిని భగవంతుని నిరంజనత్వసర్వసాక్షిత్వములను దేటపఱచుచున్నవి.

మధ్యవైష్ణవులు కొందఱు శిష్యబోధమునకుఁ బాటు పడునట్లు నటించుచుఁ బ్రకృతి యనఁగాఁ బార్వతియనియు,

నామె క్షుద్ర దేవతయనియు బోధించుచు, భగవంతుఁడగు రామ మూర్తి నైవేద్యప్రియుఁడనియు, ఘృతము స్రవించుచుండఁ బరమాన్నము చేసి నైవేద్య మర్పించి దానిని గురువున కర్పించినఁ గరుణించి ముక్తి నొసంగుననియుఁ బ్రేలుచుందురు. వారి తత్త్వోపదేశములు రహస్యభోజనమునకే యుపకరించును. శిలావిగ్రహముల నారాధించువారి కంతకంటెను మతేమగును? ధనము దొరకును. చక్కనిభోజనము దొరకును. రెండుపూట లుపవాసమే. రాత్రిభోజనము. ఇట్టిదాసులు, పరమహంసలు, యతులు భిక్షువులు పలుకుతత్త్వము

"హతే రామే హతే కృష్ణే హతే చ శివశంకరే,
అహో పేరూరుదౌర్భాగ్యం వ్యాఖ్యాతా సూపశంకరః."

అన్నట్లుండుననుట నిస్సంశయము. విష్ణుభక్తులు శ్రీకృష్ణోపదేశముం దెగడుదురా. ఆమహామాయ నెవ్వరేయేపేరులం బిల్చిననేమి? భక్తిగ నారాధించినం జాలును. వరముల నొసంగును. కావున నీఘట్టమున నీయర్థ మసంగతము కానేరదు.

"ధర్మబంధేన బద్ధోఽస్మి నష్టా చ మమ చేతనా,
జ్యేష్ఠం పుత్త్రం ప్రియం రామం ద్రష్టుమిచ్ఛామి ధార్మికమ్." ౨౮

అని దశరథుఁడు పల్కెను. దశరథునియాశయ మిందు సువ్యక్తము. క్షైక ధర్మమును మరలమరల బోధించెను. రాజు క్షైక బుద్ధిని మరల్ప నెన్నియోవిధములఁ బ్రయత్నించెను. కాని దైవవశమున నామెచిత్తము మార్పునొందినదికాదు. తుదకు దశరథుఁడు రాము నడవులకుఁబంపవలయుననియే తీర్మానించుకొనియే యీమాట చెప్పుచున్నాఁడు. ధర్మపాశమునకుఁ జిక్కితిని. నాబుద్ధి నశించినది. అనుటచేతనే వరద్వయమును సఫలము

గావింతు నన్న భావము కైక గ్రహించెను. ధార్మికుఁడగు రాముని జూడఁగోరుచున్నానని రాజు పల్కెను. ఇందలిచమత్కార మేమనఁగా ధర్మపాశబద్ధుఁడను నేను. ధార్మికుఁడు రాముఁడు. నాధర్మము నెఱవేర్పవలసినవాఁడను నేను. తన ధర్మము నెఱవేర్పవలసినవాఁడు రాముఁడు. కావున నామాట మీఱఁడని రాజు నభిప్రాయము. కొందఱిందొకయర్థమును దెల్పుదురు. నాధర్మమును నేను నెఱవేర్చినట్లే తనధర్మమును యువరాజయి ప్రజలఁ బాలించుకార్యమును నెఱవేర్చును. అన్న భావమే దశరథునకుఁ గలదనియే యందురు. కాని యది న్యాయ్యము కాదు. ఏలయనఁగా శ్రీరాముఁడు పితృవాక్య పాలకుఁడే యని రాజే తొలుతఁ గైకకుఁ దెలిపెను.

"యది మే రాఘవః కుర్యాద్వనం గచ్ఛేతి చోదితః,
ప్రతికూలం ప్రియం మే స్యాన్నతు వత్సః కరిష్యతి."

అను నీదశరథవాక్యమునకు నీయర్థము విరుద్ధమే యగును. కావున నిట నీయర్థము పొసఁగదు. ధర్మజ్ఞుఁడు కావున నాశాసనరూప ధర్మము నెఱవేర్చుననియే దశరథుఁడు భావించెనని మనము నిశ్చయింపవలయును.

"వసిష్ఠో గుణసంపన్నశ్శిష్యైః పరివృతస్తదా,
ఉపగృహ్యాశు సంభారాన్ ప్రవివేశ పురోత్తమం." ౨౬

అని మూలము. వసిష్ఠముని యయోధ్యలో నివసించువాఁడు కాఁడని సరయూతీరమున నొకయాశ్రమమున నుండువాఁడని తోఁచెడిని. మహర్షులు నగరములనుండినఁ దపోవిఘ్నము కలుగు నన్న భయమున నాశ్రమములయందే నివసింతురు. కనుకనే తెల్ల వాఱఁగనే పట్టాభిషేకసంభారములను దాను సంగ్రహింపఁదగిన

వానిని శిష్యులచేఁ బట్టించుకొని నగరమును బ్రవేశించెను. కొంద ఱిచ్చోట నొక్క ప్రశ్నము చేయుదురు. వసిష్ఠుఁడు త్రికాలజ్ఞుఁడుకదా. అప్పుడు జరగనున్నపట్టాభిషేకము సాగక పోవునని యెఱుంగఁడా? ఎఱింగిన సంభారములతో నేల నగరమును బ్రవేశించును? కావున యోగదృష్టి యనునదియే మునులకు లేదు. కలదనుట స్తోత్రమే. అని. దీనికి సమాధానము చెప్పుట సులభమనరాదు. మహర్షులు యోగదృష్టిగలవారనుట నిస్సంశయము. యోగశాస్త్రము దానిమార్గముం దెల్పును. రామాభిషేకము సాగదని, శ్రీరామమూర్తి భగవంతుఁడే యని వసిష్ఠునకుఁ దెలిసియేయున్నది. కర్మగతుల నివారింపఁ దరము కాదు. ఏది యెట్లు సాగవలయునో దానిని బరికించుచుందురు. సామాన్యుల కది తెలియక దుఃఖింతురు. మహనీయులు ముందే యెఱింగినవిషయమౌట నద్దానికి దుఃఖింపకయుందురు. ఇదియే ప్రాజ్ఞులకుఁ బామరులకుం గల ప్రధానభేదము. తెలిసినవిషయము దశరథునకు వసిష్ఠుఁడు తెలిపియున్నఁ గర్మగతికి నంతరాయము కల్గించిన వాఁ డగును. భగవదాజ్ఞను మీఱి ప్రవర్తించిన వాఁడగును. జ్ఞానులు ఖేదమోదములయందు సమముగా వర్తించువారుకదా. తమకు నేవిషయము తెలిసినట్లు నటింపక యుందురు. మాకుఁ దెలియునని వారు పలుకుదురేని లోకులెల్లఁ దమకు రాఁగలవిపత్తుల నడుగుచుందురు. అప్పు డద్దానికి ఫలము తుచ్ఛతమలోకప్రతిష్ఠయే యగును. ఎప్పుడు జ్ఞానులట్టిప్రతిష్ఠం గోరుదురో వారితపస్సు ఫలింపదు. ఫలాభిసంధి రహితముగా వారితపస్సుండవలయుఁగదా. తమకుగా దేనిని వారు కోరరు. కోరుదురేని నిస్సంగులు కాఁజాలరు. నిస్సంగులు

కానివారలకు భగవత్ప్రసాదము లభింపదు. ప్రసాదమనఁగా భోజనప్రియులగు మధ్యవైష్ణవులు చెప్పునట్టియర్థము కాదు. ప్రసాదమనఁగా దయ యనియే యర్థము.

"యస్య ప్రసాదే పద్మా శ్రీర్విజయశ్చ పరాక్రమే,
మృత్యుశ్చ వసతి క్రోధే సర్వతేజోమయో హి సః."

అన్నమనుస్మృతి ప్రసాదశబ్దార్థమును బ్రాతీతికమును వెల్లడించుచున్నది. శిష్యులను జేర్చుకొను దాసులకు, నాచార్యులకు, లంబచిబుకులకుఁ, గపటయోగులకుఁ, గపటనాటకసూత్రధారులకుఁ బ్రసాదశబ్దమున కర్థము వేఱుగ నుండును. ఔషధము వేసికొని తూఁగుచునుండు భగవద్భక్తులకుంగూడ వేఱుగ నర్థము తోఁచును.

ఎవ్వరు ఫలాపేక్షలేక భగవంతు నారాధింతురో వారిపైఁ బరమేశ్వరుకరుణ యపారముగాఁ బ్రవహించును. అట్టివారేయేమానవుల కేయేవిపత్తులు రానున్నవో ముందుగాఁ దమతపస్సు వినియోగించియైన నెఱింగి తెలుపుచుండరు. అది యొకవిధముగా ఫలాపేక్షగలదియే యగును.

"సంకల్పప్రభవాన్ కామాం స్త్యక్త్వా సర్వానశేషతః,
మనసైవేంద్రియగ్రామం వినియమ్య సమంతతః. ౨౪
శనైశ్శనైరుపరమేద్బుద్ధ్యా ధృతిగృహీతయా,
ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్." ౨౫
(గీ. ౬. అ.)

అనుభగవదుక్తి పై విషయమునే తెలుపుచున్నది.

"యుక్తః కర్మఫలం త్యక్త్వా శాంతిమాప్నోతి నైష్ఠికీం,

అయుక్తః కామకారేణ ఫలే సక్తో నిబధ్యతే." ౧౨

(గీత. ౫. అధ్యా.)

అను నీశ్రీకృష్ణబోధము పై విషయమును దృఢపఱచుచున్నది. కావున వసిష్ఠమహర్షి లోనగుమునివర్యులకు నీవిషయము తెలిసి యుండదనుకొనుట పొరపాటు.

"అష్టౌ చ కన్యా రుచిరాః మత్తశ్చ వరవారణః,
సర్వవాదిత్రసంఘాశ్చ వేశ్యాశ్చాలంకృతాః స్త్రియః,
ఆచార్యా బ్రాహ్మణా గావః పుణ్యాశ్చ మృగపక్షిణః
పౌరజానపదశ్రేష్ఠాః నైగమాశ్చ గణైస్సహ.
ఏతే చాన్యే చ బహవః ప్రీయమాణాః ప్రియంవదాః,
అభిషేకాయ రామస్య సహ తిష్ఠంతి పార్థివైః." ౪౧

అని మూలము. అందగత్తెలగు నెనమండ్రుకన్యకలు వచ్చి యున్నవారని వసిష్ఠముని తెలిపెను. కన్యకలనఁగా నవివాహితలగుస్త్రీలు. వయస్సురానివారనియే యర్థము. ఏలయనఁగా మరల స్త్రీలువచ్చినట్లున్నది. వీరేల? అని యడుగువారు కొంద ఱున్నవారు. వివాహము కానికన్యలనఁగాఁ బదియేండ్లకు మించనివారనియే యర్థము. ఎనిమిదవయేఁడువచ్చినది కన్యయని యొకమతము, పదియవసంవత్సరమునఁ గన్య యనఁబడునని యొకమతము స్మృతులయందుఁ గలదు. కన్యక యనఁబడఁదగిన స్త్రీకి మనోవ్యాపారము నిర్మలమై యుండును. అంతకుమించిన యీడుగలవారిమనస్థితి వేఱు.

"నైతా రూపం పరీక్షంతే నాసాం వయసి సంస్థితిః,
సురూపం వా విరూపం వా పుమానిత్యే చ భుంజతే. ౧౪
పాంశ్చల్యాచ్చలచిత్తాచ్చ నైస్నేహాచ్చ స్వభావతః,

రక్షితా యత్నతోఽపీహ భర్తృష్వేతా వికుర్వతే. ౧౫

ఏవం స్వభావం జ్ఞాత్వాసాం ప్రజాపతినిసర్గజం,
పరమం యత్నమాతిష్ఠేత్పురుషో రక్షణం ప్రతి." ౧౬

(మను. ౯. అధ్యా.)

అన్నమనుస్మృతిప్రకార మాలోచించిన వయస్సురాఁగాఁ జిత్త వృత్తి మాఱునని తేలుచున్నది. కన్యకలు లోకవ్యాపారముల నెఱుంగనివారుగా నుందురు. కనుక నట్టివా రభిషేకించిన మేలు కలుగునని భావము. వేశ్య లెందులకని ప్రశ్నింపవచ్చును. వేశ్యలనఁగా వ్యభిచారవృత్తిగలవారు గారు. నాట్యకళాధురీణలే యని ప్రాచీనులభావము. వివాహముకూడ మాని యింద్రియములఁ జిక్కఁబట్టి నాట్యాధిదేవత నుపాసించువారే యా కాలమున వేశ్య లనంబడుచుండిరి. బ్రహ్మచారిణులని యర్థము. నాట్యకళకు భరతముని ఋషి. లోకుల నానందింపఁ జేయుటయే వినియోగము. అనఁగా ఫలము. నాట్యకళ నీచవిద్య యని కొందఱందురు. కాని యది పాటింపఁదగనిమాట. మహాత్ములగు కాళిదాసభవభూతిప్రభృతి కవితల్లజులు నాటకము లేల వ్రాయుదురు? అభినయము మనస్సును రంజింపఁజేయునది. మనోరంజనమే దుఃఖాంతము. మానవులకుఁ గావలసిన దదియేకదా! సామాన్యులకు సదాచారములను నీతుల నేర్పుటకు నాటకములకంటె నుత్తమములు వేఱుమార్గములు లేవనుట సర్వసమ్మతము. నాట్యము పవిత్రమైనది. దాని నారాధించువారు పవిత్రహృదయులు. నాట్యమే యపవిత్రమై సద్వృత్తి నశింపఁజేయునదియే యయ్యోనేని పూర్వరాజగృహములయందు స్త్రీలకు నాట్యము నేర్పుపద్ధతి యేటికి నుండును?

"దేవానామిదమామనంతి మునయః కాంతం క్రతుం చాక్షుషం
రుద్రేణేదముమాకృతవ్యతికరే స్వాంగే విభక్తం ద్విధా,
త్రైగుణ్యోద్భవమత్ర లోకచరితం నానారసం దృశ్యతే
నాట్యం భిన్నరుచేర్జనస్య బహుధాప్యేకం సమారాధనమ్.
యద్యత్ప్రయోగవిషయే భావికముపదిశ్యతే మయా తస్యై,
తత్తద్విశేషకరణాత్ప్రత్యుపదిశతీవ మే బాలా.
పాత్రవిశేషే న్యస్తం గుణాంతరం వ్రజతి శిల్పమాధాతుః,
జలమివ సముద్రశుక్తౌ ముక్తాఫలతాం పయోదస్య.
జనమిమమనురక్తం విద్ధి నాథేతి గేయే
వచనమభినయంత్యా స్వాంగనిర్దేశపూర్వం,
ప్రణయగతిమదృష్ట్వా ధారిణీసన్నికర్షా
దహమివ సుకుమారప్రార్థనావ్యాజముక్తః.
అంగైరంతర్నిహితవచనైః సూచితస్సమ్యగర్థః
పాదన్యాసో లయమనుగతస్తన్మయత్వం రసేషు
శాఖాయోనిర్మృదురభినయస్తద్వికల్పానువృత్తౌ
భావో భావం నుదతి విషయాద్రాగబంధస్స ఏవ."

(అని కాళిదాసకవివరుఁడు.)

విరాటభూపాలునంతఃపురమున రాజకన్యకలకు నర్జునుఁడు నాట్యము నేర్పుట ప్రసిద్ధమే కదా. నాట్యకళ మర్యాదగలవారంగీకరింపనిచో రాజాంతఃపురములయం దది నేర్పఁబడుట యేటికో? అట్టి పరమపవిత్రమగు నాట్యకళ నారాధించుచు రసికుల నానందవార్ధి నోలలాడించువారు కనుకనే వేశ్యలు మహర్షిచేఁ బిలిపింపఁబడిరని యెఱుంగవలయును. ఇప్పటివారల వృత్తింబట్టి పూర్వకాలమున నిట్టివారుగనే వారుందురనియు,

నట్టిదుష్ప్రవర్తనముకలవారిని దేవాలయములయందు భగవ త్సేవార్థము నియమించుట తెలివితక్కువయనియు నాక్షేపింప రాదు. అట్టివారుగాక సత్ప్రవృత్తిగలిగి నాట్యకళాధిదైవత మగు శారదాదేవి నుపాసించువారే వేశ్య లనఁబడుదురనియు, నట్టివారినే పూర్వులు భగవత్సేవార్థ మంగీకరించిరనియు మన మెఱుంగుట మంచిది. వసిష్ఠమునివంటిజ్ఞాననిధి వేశ్యలఁ బిలి పించుట యందును బట్టాభిషేకమహాసభకు రాననుమతించు టయే పైవిషయమును దృఢపఱచెడిని.

"అలంకృతాస్త్రియః" సర్వాలంకారములుగల యితర స్త్రీలు. అనఁగా నామహోత్సవమునఁ బాల్గొనుటకుఁ బిలిపిం చెను. పతివ్రతలుకూడ వరుసప్రకారము శ్రీరాము నభిషే కింపఁదగువారనికదా భావము.

"ఆచార్యాః బ్రాహ్మణాః" అనుమూలమునకుఁ గొంద ఱాచార్యు లనఁగా శ్రీవైష్ణవులని, బ్రాహ్మణాః అనఁగా స్మార్త లని పిలువంబడునద్వైతులని యర్థము చెప్పిరి. బ్రాహ్మణశబ్ద వాచ్యు లాచార్యులు కారని యేర్పడును. అది యసంగతము కదా.

"ఉపనీయ తు యశ్శిష్యం వేదమధ్యాపయేద్ద్విజః,
సకల్పం సరహస్యం చ తమాచార్యం ప్రచక్షతే. ౧౪౦
(మను. ౨ అధ్యా.)

"స గురుర్యః క్రియాః కృత్వా వేదమస్మై ప్రయచ్ఛతి,
ఉపనీయ దదద్వేదమాచార్యస్స ఉదాహృతః." ३४
యాజ్ఞ. ఆచారకాండము.

అని స్మృతులు బోధించెడిని. ఇప్పటియాచార్యశబ్దము జాతి వాచకము. పూర్వమునఁగల యాచార్యశబ్దము పూజ్యవాచకము. వేదము తద్విహితకర్మముల నొనరించుమార్గముల నుపదేశించువారే యాచార్యులని చెప్పఁబడుదురు. ద్వైతాది భేదము లిటీవల మార్పునొంది వాని నాదరించువా రొక్కతెగగా మాఱిరి. పూర్వకాలమున నిట్టిభేదములు లేవు. శాస్త్రకర్తలకు శాస్త్రోక్తపద్ధతులను దామవలంబించి యితరు లవలంబించునట్లు చేయువారలకు నాచార్యశబ్దము చెల్లుచుండును. శ్రీశంకరాచార్యులు. అనఁగా నర్థమేమి? ఈకాలమునఁ గల మార్పుల ననుసరించి యిట్టితావుల విపరీతార్థములు చెప్పరాదు. అది మూలచ్ఛేదహేతువగును.

పౌరజానపదశ్రేష్ఠాః. అయోధ్యాపురవాసులలోఁ బెద్దలగువారు పల్లెలనుండి యరుదెంచినవారిలోఁ బెద్దలు అనఁగా గుణవృద్ధులు అని యర్థము. ఇందు నాల్గుజాతులవార లుందురు. వృద్ధత్వమున భేదము కలదు.

"న హాయనైర్న పలితైర్న విత్తేన న బంధుభిః,
ఋషయశ్చక్రిరే ధర్మం యోఽనూచానస్సనో మహాన్. ౧౫౪
విప్రాణాం జ్ఞానతో జ్యైష్ఠ్యం క్షత్రియాణాం తు వీర్యతః,
వైశ్యానాం ధాన్యధనతశ్శూద్రాణామేవ జన్మతః. ౧౫౫
న తేన వృద్ధో భవతి యేనాస్య పలితం శిరః,
యో వై యువాప్యధీయానస్తం దేవాస్స్థవిరం విదుః." ౧౫౬

(మను. ౨ అధ్యా)

అన్నరీతిగా నాయాయికులములలో జ్యేష్ఠత్వకనిష్ఠత్వములెఱుంగందగు. మొత్తముమీఁద విద్యావంతుఁడే వృద్ధుఁడగుట సర్వసాధారణవిషయము.

నైగమాశ్చ గణైస్సహ=నైగము లనఁగా వైశ్యులు. ధనవంతులబుద్ధి తఱచుగా నీచత్వము నాశ్రయింపదు. లక్ష్మీ సంపన్నులుకాన వారిమనస్సు నిర్వికారముగా (దుఃఖబహుళముగా) నుండదని భావము. అట్టివా రందఱభిషేకించిన వృద్ధికరమనియే యిందుఁగలసారము.

"పుణ్యే నక్షత్రయోగే చ రామో రాజ్యమవాప్నుయాత్." ౪౨

అని మూలము. ఇందు వసిష్ఠముని మహాయోగిగానఁ దనభావమును వ్యక్తీకరించెను. న క్షరతీతి నక్షత్రం క్షరసంచలనే. అను వ్యుత్పత్తి ననుసరించి క్షితిలేనియోగము గలపుణ్యకాలమునందని యర్థము. ఇచ్చట యోగశబ్దమునకు ధ్యానమని యర్థము. ధ్యానమనఁగాఁ జిత్తవ్యాపారముల నిరోధించుట యని యర్థము. అనఁగా విషయసుఖములయందలి యభిలాషముల చేతఁ దిరుగుచుండుదురాత్మలు నశింపఁగాఁ బవిత్రవాంఛలు చిత్తములయందు నెలకొనఁగా నట్టికాలమునందని యర్థము. రావణాదిదుష్టదానవసంహారానంతర మట్టికాలము వచ్చును గావున నప్పుడు రామచంద్రుఁడు తనయవతారఫలమున నొక్కభాగమగు దుష్టపరిపాలనము కాఁగా మానవులకు సదాచారములఁ దనయాచారములచే నేర్పఁదగినకాలము రానున్నయపుడు రాజ్యమును వహించి పరిపాలించునని సారము. నిర్వికల్పున కీపని యెట్లు సరిపడును? అని ప్రశ్నింపరాదు. సాక్షిమాత్రుఁడై యోగమాయ యగుసీతాదేవి సర్వకార్యముల నొనరించుచుండఁగా (ఎల్లరఁ బ్రోత్సహించుచుండఁగా) నిస్సంగుఁడై సంగముకలవానివలె నటించుచు నిత్యానందము ననుభవించుచుండుననియే తాత్పర్యము. ఇట్లు వాల్మీకిమహర్షి యాయాయి

తాత్పర్య విశేషార్థముల నిమిడించియే రామాయణమును రచించె నని పెద్దలు నిర్ణయించిరి. పెద్దలనఁగా బృహచ్ఛిఖులు గారనియు జ్ఞానులనియు నెఱుంగవలయును. గడ్డము పెంచినవారెల్లఁ బెద్దలైన వంగదేశమున నసంఖ్యాకులు గలరు. వారెల్లఁ బెద్దలే కావచ్చును. మనుస్మృతిప్రకారము జ్ఞానధనులనియే మనము తెలిసికొనవలయును. "విప్రాణాం జ్ఞానతో జ్యైష్ఠ్యమ్" అని కదా స్మృతి. జటిలో ముండీలుంఛితకేశః కాషాయాంబరబహుకృతవేషః, పశ్యన్నపి చ న పశ్యతి మూఢో హ్యుదరనిమిత్తో బహుకృతవేషః" అని శంకరభగవత్పాదశిష్యతోటకాచార్యులుగారు నిర్వచించినది తెల్లమే కదా. జ్ఞానధను లెల్లరు వాల్మీకి మహర్షి యథార్థతత్త్వవిషయముల నిముడించి వ్రాసిరనియే యంగీకరించిరను నానుడి యిప్పటిది కాదు.

"యథా నందతి తేజస్వీ సాగరో భాస్కరోదయే,
ప్రీతః ప్రీతేన మనసా తథానందమనస్వ్వతః." ౪౭

అని మూలము. ఇందు భాస్కరోదయే = అనుచోట భాస్కర శబ్దమునకు సూర్యుఁడని యర్థము చెప్పరాదనియుఁ జంద్రుఁడనియే నిర్ణయింపవలయుననియు వ్యాఖ్యాతలు వ్రాసిరి. చంద్రోదయకాలమున సముద్ర ముప్పొంగుననుట కవిసమయము. దానిని బోషించుటకై యౌగికార్థమును గ్రహించిరని తోఁచెడు. అమవసయందుఁగూడ సముద్ర ముప్పొంగుననుట వారికిఁ దెలిసినదియే కాని క్రొత్తది కాదు. అయినను లోకోక్తి ననుసరించిరని మన మెన్నుకొనవలయును. "తేజస్వీ" అనఁగా నిందుఁ దేజశ్శబ్దమునకు సారమని యర్థము.

"రసాదీనాం శుక్రాంతానాం ధాతూనాం యత్పరం తేజ స్తత్ ఖలు ఓజః తదేవ బలమిత్యుచ్యతే. స్వశాస్త్రసిద్ధాంతాత్" సుశ్రుతము ౧. ౧౫.

దీప్తియుఁ బౌరుషము లనునర్థములు సహజములేకదా. ఓజ స్థానమగుసాగరుఁడు చంద్రోదయకాలమున ననఁగా నిండు చందురునియుదయమున నెట్టు లానందపారవశ్యమున నుప్పొంగునో యట్లే నీవు నానందపూర్ణుఁడవు కమ్ము. 'ప్రీతేన మనసా' అని మూలమునఁ గలదు. సంతోషముతోఁగూడిన మనస్సుతోడ నని యర్థము. మహత్తరదుఃఖకాలమునందు సత్యము ననుష్ఠించి దశరథుఁడు కృతకృత్యుఁడయ్యె నను ప్రఖ్యాతిఁ గాంచఁ గల్గితి నన్నదే యిట సంతోషము. ఈయర్థము సుమంత్రుఁ డెఱిఁగి చెప్పినది కాదు. దైవికము. సుమంత్రునిభావము సాధారణార్థముననే స్పష్టము. రామాభిషేకనిర్వహణమే యానంద మని యప్పటియర్థము. మహాద్భుతకార్యము సాగునెడ నెల్లరి మనస్సులు దైవవశమున మార్పునొందును. విపత్తునందు నట్లే. ఆమానసములు భావ్యర్థమును సూచించునట్టియూహలు గల వగును. లోకముల కానందజనకమగుకాలముగదా యిది. దశరథా! మహానందము నొందఁదగుకాల మిదియని సుమంత్రుఁడు సూచించెను. సత్యపాలనమునకంటె సంతోషమును గల్గించునది యేది? తత్కాలజనితమగుదుఃఖము భావ్యానందమున నడంగును. తుదకు మహానందమే. కావున నదియే కోరఁదగినది.

ఈభాగమునుండి గ్రహింపఁదగునట్టివిషయమేది? కష్టములను బాటింపక మానవులు నిత్యమగునానందమును గోరవలయును. అట్టికోరికగలుగునట్లు పెద్దలు వారలఁ బురికొల్పవలయును. స్వల్పసుఖము గొప్పకష్టము కలుగునపు డది సుఖముగా

లెక్కింపఁబడదు. స్వల్పకష్టము గొప్పసుఖము కలుగుతఱిఁ గష్టము సుఖముగనే తలంపవలయును. దూరదృష్టియుండుటే. ప్రధానముకాని కాళ్లముందఱిచూపు ప్రధానముకాదు. అను నీతులఁ బరిగ్రహింపవలయును.

"ఇంద్రమస్యాం తు వేళాయామభితుష్టావ మాతలిః,
సోఽజయద్దానవాన్ సర్వాంస్తథా త్వాం బోధయామ్యహం." ౪౭

అని మూలము. సుమంత్రునివాక్యములే యిందుండునవి. ఉదయకాలమున మాతలియనుసారథి యింద్రుని బొగడెను. అతఁడసురుల నోడించెను. అట్లే నిన్ను బోధింతును. అనఁగా విశేషమేమి? దేవతాప్రార్థనాదులకు నుదయకాల మత్యుత్తమము. సూర్యునింబొగడుట యందులకే. తేజోగోళముకదా సూర్యమండలము. "తేజసాం గోళకస్సూర్యః" అని సిద్ధాంతము.

"ధ్యేయస్సదా సవితృమండలమధ్యవర్తీ నారాయణస్సరసిజాసనసన్నివిష్టః" అనునది యిందులకే. అనఁగాఁ దేజోరూపముగా భగవంతుని ధ్యానింపవలయును. అదియే చక్రనిధ్యానము.

"ప్రాదుర్బభూవ పరమం తేజఃపుంజమనూపమం,
కోటిసూర్యప్రతీకాశం చంద్రకోటిసుశీతలం,
తన్మధ్యమే సముదభూచ్చక్రాకారమనుత్తమం,
తన్మధ్యమే మహాదేవీముదయార్కసమప్రభామ్,
జగదుజ్జీవనాకారాం బ్రహ్మవిష్ణుశివాత్మికామ్,
సౌందర్యసారసీమాన్తామానందరససాగరామ్." ౭౫

(లలితోపాఖ్యానము. ౧ అధ్యా.)

భగవద్రూపము సాక్షాత్కరించునపుడు తేజోమండలముగాఁ దొలుతఁ గనంబడి యది దుర్నిరీక్ష్యమనుతలంపున దానిమధ్య

భాగమున సౌమ్యరూపముగాఁగనంబడును. ఇది లలితారూపము కదాయందు రేని భగవంతుఁడు భక్తులవాంఛల ననుసరించి రూపము కల్పించుకొనుననియు, స్త్రీపున్నపుంసకభేదము లావ్యక్తికి లేవనియు నెఱుంగవలయును.

"దివి సూర్యసహస్రస్య భవేద్యుగపదుత్థితా,
యది భాస్సదృశీ సా స్యాద్భాసస్తస్య మహాత్మనః.   ౧౨
మయా ప్రసన్నేన తవార్జునేదం రూపం పరం దర్శితమాత్మయోగాత్,
తేజోమయం విశ్వమనంతమాద్యం యన్మే త్వదన్యేన న దృష్టపూర్వమ్.
సుదుర్దర్శమిదం రూపం దృష్టవానసి యన్మమ,
దేవా అప్యస్య రూపస్య నిత్యం దర్శనకాంక్షిణః.   ౫౨
నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా,
శక్య ఏవంవిధో ద్రష్టుం దృష్టవానసి మాం యథా."   ౫౩
(గీత. ౧౧ అధ్యా.)

అన్న యీభగవద్వాక్యములు పైనవ్రాసినభావమును సిద్ధాంతము చేయుచున్నవి. కావున నుదయకాలమున భగవంతుని తేజోరూపునిగా ధ్యానింపవలయునని మన మెఱుంగందగు. ఉదయకాలమున మనస్సు ప్రాయశః ఎట్టివారికిని సుంతయైన నిర్మలముగా నుండును. సంసారయాత్రాభిముఖమగుకాల మది యే. స్నానముకూడ మాని తెల్లవాఱుజామునఁ బూర్వులు శిష్యుల కాసమయముననే వేదము చెప్పుదురు. కాఁబట్టి యుదయకాలమున లేచి తొలుదొలుత భగవంతుని బరాత్పరుని తేజోరూపునిగా ధ్యానింపవలయుననియే యీభాగమునుండి మన మెఱుంగవలయును. అట్టిసుసమయము కావున నిన్ను మేలుకొలుపుచున్నాఁడనని ప్రకృతకథావిషయము.

"వేదాస్సహాంగవిద్యాశ్చ యథా హ్యాత్మభువం విభుం,
బ్రహ్మాణం బోధయంత్యద్య తథా త్వాం బోధయామ్యహం." ౪౯

అని మూలము. ఇందు సామాన్యార్థము స్పష్టము. "ధాతా యథా పూర్వమసృజత్" అను శ్రుత్యర్థమే యిది యగు. విశేషార్థమేమి? వేదాదిసమస్తవిద్యలు ప్రవృత్తిమార్గమును బోధించును. అనఁగా సగుణబ్రహ్మమును బోధించును. ఎట్లు? జగత్సృష్టిపరిపాలనసంహారాది కార్యముల నొనరింపుమని. ఈ మూఁడురూపము లొక్క రూపమునుండి వెలువడియెనని భావము. అనఁగా భగవదంశములనియే సారము. మాయాతీతులుగారు కావున నీపని యిట్లు చేయందగునని వేదాదివిద్యలెల్ల బోధింపవలసివచ్చెను. "మమమాయాదురత్యయా" అన్న శ్రీకృష్ణోక్తి యిట స్మర్తవ్యము. ప్రకృత్యతీతునను వేదాదివిద్యలు తెలుపఁజాలవు. వేదాంతములు తత్స్వరూపము నిర్ణయింపఁజాలమని తమయశక్తత్వమును విన్నవించుకొని యూరకుండెను. ఆరీతిగా నిన్ను బోధించుచున్నవాఁడనని సుమంత్రుఁడు తెలిపెను. అనఁగాఁ బ్రకృతిపురుషులగు సీతారామచంద్రుల నవతారఫలమగు కార్యముల నొనరింపఁ బురికొల్పు లెమ్మని సారము. వేదాదులు ప్రవృత్తిమార్గబోధకములనఁగాఁ బ్రకృతిమహత్త్వమును దెలుపునవియే. ఉపనిషత్తులు ప్రకృత్యతీతుఁడగు నిర్గుణు బోధింపఁబూనును. ఈవిషయము నెఱింగిన వారికిఁ బ్రకృతిద్వేషము గలుగఁజాలదు.

"అంధం తమః ప్రవిశంతి యేఽవిద్యాముపాసతే"

అన్న శ్రుతి ప్రసిద్ధమేకదా. అవిద్య యనఁగాఁ బ్రకృతివిశిష్టులగు త్రిమూర్తులు లోనగువారి నుపాసించుపద్ధతియని భావము.

"విద్యాముపాసతే" అనఁగాఁ బ్రకృతివిశిష్టుఁడగుభగవంతుని నని యర్థము. ప్రకృత్యతీతుననికదా యర్థమని కొందఱార్థ్య టింతురు. ప్రకృత్యతీతు నుపాసించు టెట్లు? రూపకల్పనమున నని సమాధానము చెప్పుదు రేని యదియే ప్రకృతివిశిష్టరూప మందుము. ఉపాసించుట యంతయు దానివలనకే. అరూపము నుపాసింప నవకాశమే లేదని యెఱింగి బాగుపడవలయును.

"ఆదిత్యస్సహ చంద్రేణ యథా భూతధరాం శుభాం
బోధయత్యద్య పృథివీం తథా త్వాం బోధయామ్యహం." ౫౦

అన్న మూలమున విశేషమేమి? ఆదిత్యశబ్దము భగవత్పరము. చంద్రశబ్దము ప్రకృతిపరము. చంద్రశబ్దము ఆహ్లాదమును దెలుపును. ఆహ్లాదము రూపదర్శనజనితము. రంజింపఁజేయునదియే ప్రకృతి. తేజస్స్వరూపుఁడే భగవంతుఁడు. తేజస్సు నొక వ్యక్తిగా మార్చునదియే భగవదిచ్ఛయగు ప్రకృతి. అనఁగాఁ బ్రకృతిపూరుషులు సీతారాములుగా నవతరించిరి. కావున సకలభూతముల ధరించిన శుభముల నొసంగుపృథివి నుద్ధరింపఁ బయనముచేయింపుమని బోధించుచున్నాఁడను. ఈయర్థము సుమంత్రుఁడు తెలిసి యనకయున్నను ధోరణిం బట్టి గ్రహింప వలయు.

"గతా భగవతీ రాత్రిః కృతం కృత్యమిదం తవ,
బుద్ధ్యస్వ నృపశార్దూల కురు కార్యమనంతరం." ౫౩౫

అని మూలమునఁ గలవిశేషము పరికింతము.

"ఇదం తవ యత్కృత్యమస్మాభిః కృతం తత్ బుద్ధ్యస్వ అనంతరం కార్యం కురు."

నీవు చేయందగుపని మేము చేసితిమని యెఱింగి తరువాతిపని ననంగా మేము చేయంజాలని రామగమనకార్యమును నీవొనరింపుమని సారము. భావిఫలములను గాలము తెలుపునని మనము గ్రహింపవలయును. "భగవతీ రాత్రిర్గతా" అని రాత్రిస్తుతి.

"సర్వానందకరరామాభిషేకమహోత్సవోపయుక్తత్వాద్రాత్రిర్భగవతీతి స్తూయతే"

అని గోవిందరాజులు వ్రాసిరి. దీనిని విమర్శింపంబనిలేదు.

"ధూమోరాత్రిస్తథా కృష్ణష్షణ్మాసా దక్షిణాయనం,
తత్ర చాంద్రమసం జ్యోతిర్యోగీ ప్రాప్య నివర్తతే." ౨౫
"శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతశ్శాశ్వతే మతే,
ఏకయా యాత్యనావృత్తిమన్యయా వర్తతే పునః." ౨౬

(గీత. ౮. అధ్యా.)

"ధూమోరాత్రిః ధూమాభిమానినీ రాత్ర్యభిమానినీ చ దేవతా. తథా కృష్ణః కృష్ణపక్షదేవతా. షణ్మాసా దక్షిణాయనమితి చ పూర్వవద్దేవతైవ. తత్ర చంద్రమసి భవం చాంద్రమసం జ్యోతిః ఫలం ఇష్టాదికారీ యోగీ కర్మీ ప్రాప్య భుక్త్వా తత్క్షయాదిహ పునః నివర్తతే. శుక్లకృష్ణే శుక్లా చ కృష్ణా చ శుక్లకృష్ణే జ్ఞానప్రకాశకత్వాచ్ఛుక్లా. తదభావాత్ కృష్ణా. ఏతే శుక్లకృష్ణే హి గతీ జగతః ఇత్యధికృతానాం జ్ఞానకర్మణోః న జగతః సర్వస్యైవ ఏతే గతీ సంభవతః. శాశ్వతే నిత్యే సంసారస్య నిత్యత్వాత్ మతే అభిప్రేతే తత్రైకయా శుక్లయా యాత్యనావృత్తిం అన్యయా ఇతరయా ఆవర్తతే పునః భూయః."

(శంకరభాష్యము.)

ఈవిషయమున నితరభాష్యములకుంగూడ మిక్కిలి భేదాభిప్రాయము గలుగ నవకాశమే లేదు.

భగవతి యనఁగా షడ్గుణైశ్వర్యసంపన్నురాలని యర్థము. భగవంతుఁడన్న నదియే యర్థము. లింగభేదమేకాని యర్థభేదము లేదు. 'భగవతీ రాత్రిర్గతా' అనఁగా రాత్ర్యభిమానదేవతయు భగవతియు నగుమహాప్రకృతి సీత గతా=కార్యము నిర్వహింపఁబోయెను. అనఁగా సర్వకార్యములు తాను నిర్వహించుచు భగవంతునినామమాత్రము కారణభూతునిగా నునుచుకొనునదియే మహాప్రకృతి. ప్రకృతవిషయమున భూతలమున నవతరించినజానకి యని యర్థము. ఆమె ముందే పోయినది ఆమహాప్రకృతిసంకల్పము నీవొనరింపఁదగు కార్యమునకు ముందే దండకారణ్యములకుం బోయినదని భావము. ఆమె సంకల్పానుసారము మంత్రులు చేయఁదగు కార్య మొనరించిరి. కైకయుఁ దనపనిని దాను జక్కఁగా నిర్వహించెను. బుధ్యస్వ నృపశార్దూల = రాజేంద్రా! ఈవిషయ మెఱుంగుము. ఇఁక మేలుకొనుము. అనఁగా నేను నిమిత్తమాత్రుఁడనని తెలిసికొని జాగరూకుఁడవు కమ్మని భావము. కురు కార్యమనంతరమ్=అంతరము లేనిపని నొనరింపుము. ఆలసింపక నీవు చేయవలసిన కార్యము నన౯గా 'శ్రీరామచంద్రా! యడవులకుఁబొమ్ము.' అను మాటను బలుకుమని భావము. అవకాశ మిఁక లేదు. త్వరపడుమనియే సారము. ఇందు రాముఁడే చంద్రుఁడు. ఆజ్యోతియే రాత్రిప్రకాశకము. అనఁగాఁ బ్రకృత్యుద్బోధకము. భగవత్సాన్నిధ్యమే ప్రకృతికిం గావలయును. అనఁగా భగవంతుఁడు సంకల్పించినంతనే ప్రకృతి సర్వకార్యముల నొనరించునని భావము.

రాజా! పరమేశ్వరి మహామాయ సీత దుష్టసంహారమును సంకల్పించెను. యోగిధ్యేయమగు శ్రీరామచంద్రుని చల్లనితేజస్సు సాయపడును. ఆసంకల్పమప్రతిహతము. ఫలింపకమానదు. మాపనులను మేము నిర్వహించితిమి. కైకయుం దనపనిని దా నిర్వహించెను. ఇఁకఁ దెలివినొంది నీకార్య మాలసింపక నిర్వహింపుము. లెమ్ము. అనునదియే యీశ్లోకసారము. ఈవిషయమును గ్రహించుటంజేసి దశరథాదులు నిమిత్తమాత్రమేగాని దైవసంకల్పమప్రతిహతముగా సాగుననియుఁ, గర్మగతుల నెఱుంగఁదరముకాదనియుఁ, గర్మానుసారమే భగవంతుఁడు సంకల్పించుననియు, నాసంకల్పమును మహామాయ నిర్వహించుననియు, నీసిద్ధాంత మెఱింగినంగాని మతభేదములు దేవతాంతరదూషణములు తొలంగవనియు మన మెఱుంగవలయును. సమదర్శిత్వముకదా ప్రధానమని భగవంతుఁడు శ్రీకృష్ణమూర్తి బోధించెను. సమబుద్ధి దేవతలయందుండుటయే భగవంతునిశక్తి నెఱుంగుట అదిగ్గైన లేనివారికి మానవులయందు సమభావ మెట్లు గలుగును? అది లేనివారికి భగవదనుగ్రహ మెట్లు కలుగును?

"విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని,
శుని చైవ శ్వపాకే చ పండితాస్సమదర్శినః."

అనికదా భగవదుపదేశము. దేవతలయందే సమత్వముగనలేనివారికీభావ మేలాగు కలుగును? కలుగకున్న నిష్ఫలముగదా. కాఁబట్టి యిట్టిఘట్టములయం దిట్టియభిప్రాయములను జక్కఁగా భావింపవలయును. దుర్మతాభిమానముచేత భేదబుద్ధిని వృద్ధిచేసికొనరాదు. అది మంచిమార్గము కాదు.

"ఇతి తస్య వచశ్శ్రుత్వా సాంత్వపూర్వమివార్థవత్,
అభ్యకీర్యత శోకేన భూయ ఏవ మహీపతిః." ౧౪

అని మూలము. పైనవ్రాసినయర్థము నీమూలము సూచించుచున్నది. సాంత్వపూర్వమ్ = సామవచనప్రధానమై, అర్థవదివ = గూఢార్థముగలదివలెనున్న, తస్య వచశ్శ్రుత్వా=ఆసుమంత్రుని మాట నాలకించి రాజు శోకించెను. అనఁగా సుమంత్రునిమాటలలో గూఢార్థ మిమిడియుండెనని తేలెడింగదా.

"వాక్యైస్తు ఖలు మర్మాణి భూయ ఏవ నికృంతసి." ౧౯

అని దశరథుఁడు పలికెను. సుమంత్రా! మాటలచేతనే మరల నామర్మముల ఛేదించుచున్నాఁడవు? మరల ననుటచే నీవఱకే యవి తెగినవని యర్థము. విప్రశాపము కైక వరములడుగుట యనువానిచేతనే నామర్మములు తెగియున్నవి. మరల నన్ను మహారాజా! యని రాజేంద్రా! యని యేల స్తుతించుచున్నాఁడవని భావము. ఇఁక నావలన నేకార్యము సాగదని తాత్పర్యము. "మర్మాణి భూయ ఏవ నికృంతసి" వయోధర్మమును గర్మము ననుసరించి మర్మములు తమయంతన తామే వ్యాపారముల మానుకొనుచున్నవి. నీవేల మరల వానిని ద్రెంచుచున్నాఁడ వనుట గ్రహింపఁదగువిషయము.

"తస్మాత్త్వముత్తిష్ఠ యశో లభస్వ జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధం,
మయైవైతే నిహతాః పూర్వమేవ నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్." 33
(గీ. ౧౧. అ.)

అను శ్రీకృష్ణోక్తి యిట స్మరింపఁదగును. ప్రాణికోటులు స్వస్వ కర్మములచేతనే సత్ఫలదుష్ఫలముల ననుభవింతురు. ఇతరులు కారకు లనఁబడుట కర్మసిద్ధాంతము నెఱుంగకపోవుటచేతనే

యని యూహింపవలయును. ఈసిద్ధాంతమును మనము చక్కఁగాఁ దెలిసికొనిన నితరుల నాక్షేపింప రాదనుట స్పష్టమగును. కర్మగతులఁ జక్కఁగా నెఱుంగవలయును. లేకున్న నవకతవక సిద్ధాంతములు తోఁచుచుండును. వానిమూలముననే మత సిద్ధాంతములు తాఱుమాఱగుచుండును. కర్మమార్గముల తెఱంగు పరిశీలింపవలయును.

"తదా సుమన్త్రం మన్త్రజ్ఞా కైకేయీ ప్రత్యువాచ హ"

అనిమూలము. మంత్రజ్ఞా=ఆలోచనము నెఱిఁగినదని సామాన్యార్థము. కర్మమార్గము నెఱింగినదని భావము.

"కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవమ్"

అన్నగీతావాక్యము ననుసరించి మంత్రమనఁగాఁ గర్మమని యర్థము గ్రహింపవలయును. వేదజనితముకదా కర్మము. కర్మము తనకెట్టిబుద్ధి పుట్టించెనో యద్దానితత్త్వము నెఱింగినదనియే సారము. అనఁగాఁ గర్మము కైకను బురికొల్పఁగా దానికి లోఁబడి పలుకుచున్న దేకాని స్వతంత్రురాలు గాదని మన మెఱుంగఁదగువిషయము. సత్యపాశబద్ధుఁడు దశరథుఁడు; కర్మపాశబద్ధురాలు కైక. వీరిమార్గముల నరయునది మహామాయ సీత. సాక్షిమాత్రుఁడు భగవంతుఁడు రాముఁడు. ఈ విషయము నెఱుంగఁజాలనివారు నగరవాసులు. ఇంతకంటెఁ జమత్కార మేమికావలయును? ఎఱుంగక పరితపించువారు కొందఱు. ఎఱింగియు నెఱుంగనట్టు లుండువారు కొందఱున్నవారు. వీరియందఱచరిత్రములను జదివి మనము కొంతసేపానందించుచుఁ గొంతకాలము వగచుచున్నవారము.

"సుమంత్ర రాజా రజనీం రామహర్షసముత్సుకః
ప్రజాగరపరిశ్రాంతో నిద్రావశముపేయివాన్.
తద్గచ్ఛ త్వరితం సూత రాజపుత్రం యశస్వినం
రామమానయ భద్రం తే నాత్ర కార్యా విచారణా." ౬౩

అని మూలము. "రంజంతి కామినోఽత్ర రజనీ" కాముకు లిందు ననురాగవంతులగుదురు. ఇది సామాన్యార్థము. 'రంజంతి యోగినోఽత్ర రజని' యోగు లిందుపాస్యదేవతయందు నత్యంత ప్రీతి (భక్తి) గలవార లగుదురు. యోగాభ్యాసమునకు రాత్రి ముఖ్యము. నిశ్శబ్దముగనుండుకాలము యోగులకు మిగుల మంచిది. అక్కాలమున మనస్సు నిర్వ్యాపారస్థితిం గాంచును. నివాతదీపనిష్కంపముగ మనస్సుండుకాలమే ధ్యానమునకుఁ బ్రశస్తము. ప్రజారంజనతత్పరుఁడగుట దశరథుఁడు రాత్రియందు రామహర్షసముత్సుకుఁడై నిదురింపక యలసియున్నాఁడు. కాన నిపుడు నిదురించుచున్నవాఁడు. అని సామాన్యార్థము. 'నియతం ద్రాంతీంద్రియాణ్యత్రేతినిద్రా' ఇంద్రియము లే యవస్థయందు నియతముగాఁ దమతమవ్యాపారముల మానుకొనును.

"నింద్యతేఽఇతినిద్రా. నిది కుత్సితాయామ్. మేధ్యామనస్సంయోగః ఇతి జగదీశః "సుషుప్త్యవస్థాస్వాప్యావస్థా" ఇతి చండీటీకాయాం నాగభట్టః" (పరిశుద్ధమనస్సంయోగము లేని యవస్థ.) శబ్దకల్పద్రుమము. చక్కనిమనస్సు దశరథునకు లేదని భావము. రామునకుఁ బట్టాభిషేక మొనరించి హర్షింపవలయునని యున్నవాఁడే కాని యింతకంటె మిక్కిలి యానందకార్యముకలదని యెఱుంగఁడని తాత్పర్యము. దశరథునిమనస్సు చక్కనిస్థితియం దిపుడు లేదని

కైక భావము. కనుకఁ ద్వరితముగఁ బోయి యశస్వియగు రాజపుత్త్రునిం దోడ్కొనిరమ్మని కైక పలికెను. వాల్మీకి మహాకవి యగుట "యశస్వినమ్" అనువిశేషణమును బ్రయోగించెను. "యాతి దేశాంతరమితి యశః" అయోధ్యనుమాని దేశాంతరమున కరుగు రాజపుత్త్రుని రాముని దోడితెమ్మని వాక్యహృదయము. "రామమానయ" అనఁగా రామమూర్తి నిటఁ జేర్పుము. "భద్రం తే" నీకు మేలు. ఆలసింపకుము. అని కైక పలికెను. సుమంత్రా! నీవు సారథివి. త్వరగా రామచంద్రుని బిలుచుకొనిరమ్ము. జగత్కల్యాణకరకార్యమునకుఁ దోడుపడు నీకు మంగళములు గలుగుననుట నిస్సంశయము. ఆలోచింపకుము. పొమ్ము. అనువిశేషార్థమును గ్రహింపవలయును. పదముల కూర్పు విశేషార్థమును బోధించును. లేకున్న "యశస్వినమ్ భద్రం తే" అనుపదములు వ్యర్థములగును. కైక కింతజ్ఞానము కలదా యని ప్రశ్నింపవచ్చును. ఇంతటి తెలివి లేకున్నను గర్మవశమున మాటలు దొరలవచ్చును. ఈమాట నంగీకరింపనివా రుండరు. కావున రామాయణమునందు విశేషించి కర్మసిద్ధాంతమే ప్రతిపాదింపఁబడినది. "ప్రపత్తి, శరణాగతి" అనునవియే ప్రధానములు కావు. ప్రప్రధానము కర్మసిద్ధాంతము. భగవచ్చరిత్రమునం దెల్ల శరణ్యుఁడు భగవంతుఁడన్న భావ మిమిడియే యుండును. అది రామాయణమే ప్రధానముగాఁ దెలుపునని యననేల? కర్మసిద్ధాంత మెట్లుకదా యందురేమో. విశేషించి శ్రీరామమూర్తి యేవిషయమును బోధించువాఁడు కాఁడు. తా నాచరించి యితరుల కుదాహరణభూతుఁ డగును. ఆచరణము

సత్కర్మసిద్ధాంతము ననుసరించియేయుండును. కావున మనము చక్కనికర్మమార్గము నెఱుంగవలయును.

మహాశయులారా! ఈరీతిగా నీభాగము భగవదవతార ప్రయోజనమును బోధించుచుఁ, గర్మమార్గ మగమ్యమని తెలుపుచు, నెన్ని యోనీతులఁ దేటపఱచును. రామాయణమును బఠించుటచేతఁ దృప్తిచెందక యేయేవ్యక్తి యెట్లెట్లు శ్రీరామ కార్యమునకుఁ దోడ్పడెననియుఁ, గర్మము లెన్నిరీతుల మానవులచేఁ గార్యములు చేయించునో యనియు నెఱుంగవలయును. దాన మనకెంతో లాభము చేకూరును. మనోగర్వము నశించును. వినయము పాదుకొనును. భక్తి నెలకొనును. లోకమున నెట్లు ప్రవర్తించిన నితరులకు మార్గదర్శకుల మగుదుమనువిషయము స్ఫురించును. మనుష్యప్రయత్నము దైవసహాయము లేక ఫలింపదన్నసిద్ధాంతము దృఢపడును. మఱియు జాల్ములగువారియుపదేశములు వ్యర్థములనుట తేటపడును. కావున రామాయణమునఁగల మహార్థమును జక్కఁగా విమర్శించి తెలిసికొనవలయును. ఇఁకఁ దరువాతికథను బరిశీలింతము.

పట్టాభిషేకోత్సవవర్ణనము.

*వేదములఁ జదివినబ్రాహ్మణులెల్లరు తెల్లవాఱఁగనే వసిష్ఠునింగూడి సభ కేతెంచిరి. మంత్రులు, పౌరులు, జానపదులును వేడుకమెయి వారిని గలిసికొనిరి. శ్రీరాముని జన్మలగ్నమగు కర్కాటకము రాఁగాఁ బుష్యనక్షత్రమున నభిషేకింప

*ఇది పదునైదవ సర్గమునుండి గ్రహింపఁబడినది. అధ్యాత్మరామాయణకథాసార మిందుఁ గలదని యెఱుంగవలయును.

వలయునని వలయుపరికరములం గూర్చుకొనియుండిరి. బంగారు కలశములనిండఁ బావననదీజలముల నింపి రాజయోగ్యపీఠము లోనగువస్తువుల నాయత్తముచేసి మuహూర్తమునకు వేచి యుండిరి. పావననదీహ్రదప్రముఖస్థలములనుండి జలము తేఁబడి యెను. తూర్పుదిక్కుగాఁ బ్రవహించు గంగాగౌతమీప్రముఖ నదులనుండియు, నూర్ధ్వముగాఁ బ్రవహించుబ్రహ్మావర్తరుద్రావర్తప్రముఖసరిద్వరములనుండియు, దక్షిణో త్తరముఖములుగా నడ్డముగాఁ బాఱుచుండు గండకీ శోణభద్రాదినదులనుండియుఁ బ్రవహింపకయుండు పావనసరస్సులనుండియు, సమస్తసాగరములనుండియు జలములు తెప్పింపఁబడియెను. రావియాకులు కప్పి, పేలాలు చల్లి, పద్మములు లోనగుపుష్పములఁ గైసేసి జలములనిండియుండు బంగరువెండికలశములు సొంపారుచుండెను. తేనె మొదలగువస్తువులు సిద్ధముగ నుండెను. సకలవిధాలంకారముల నలరారువేశ్యలు సభనుండిరి. శ్వేతచ్ఛత్రచామరములు సిద్ధముచేయఁబడియుండెను. శ్వేతవర్ణముగలవృషభము హయగజములు సిద్ధముగ నుండెను. మంగళార్థము నియమింపఁబడి యలంకృతగాత్రలగుకన్యలెనమండ్రు సభయందుఁ గాచుకొని యుండిరి. అవి యివి యననేల? అభిషేకార్థ ముఖ్యవస్తువులు సంసిద్ధముచేయఁబడియే యుండెను.

జనులందఱు గుంపులుగూడి రాజేంద్రుఁ డంతఃపురము నుండి వెడలిరాలేదనుకొనుచుఁ దమరాకను బ్రభుమణికిఁ దెలుపువా రెవ్వరో యని కాచియుండిరి. అంతలో సుమంత్రుఁ డరుదెంచి యందుఁగలరాజులం గని రాజాజ్ఞచే శ్రీరామచంద్రుని బిలుచుకొనిరాఁబోవుచున్నాఁడను. పూజ్యులరగు

మీమాటలుగా రాజుతో సుఖప్రశ్నముచేసి మీరాక నెఱింగింతునని పలికి రాజాంతఃపురమునకుం బోయి శయనగృహంబు కడ నిలిచి జవనికకీవల నిలుచుండి మంగళాచారయుక్తముగా మేలుకొలిపి రాత్రి గడచెను. చేయఁదగుపనులు చేసితిమి. మేలుకని మీరొనర్పఁదగుపనులనొనరింపుఁడని విన్నవించెను. మహారాజా! బ్రాహ్మణోత్తములు లోనగువారు మీదర్శనమును గోరుచున్నారు. కనుక మేలుకొనుఁడు. అని వినుతించెను.

దశరథుఁడు మేలుకని తన్ను వినుతించు సుమంత్రుని గాంచెను. అంతలోఁ గైక సుమంత్రా! రాముని దోడ్కొని రమ్ము. అని యాజ్ఞాపించెను. ఆమాటకు నేనంగీకరించితిని. కాన నదియు నాయానతియే. దాని నుల్లంఘింపరాదు. అది నాయానతియా కాదా యని సంశయింతువా? నా కిపుడు నిద్ర లేదు. కాన రామునిం దోడ్కొనిరమ్మని మరల రాజు సుమంత్రున కాజ్ఞాపించెను. రాజాజ్ఞను విని యతనికి నమస్కరించి యిఁక రామాభిషేకము తప్పక సాగునని తనలో ననుకొనుచు రాజగృహమును వెడలి నిష్కపటచిత్తుఁడు కావున మోసమేమోకలదని యూహింపకపోయెను. మార్గమున జనులనుకొనుశుభవాక్కుల కానందించెను. అంత శ్వేతవర్ణమున నలరు రామచంద్రునిసౌధమును జూచెను. ఆసౌధకవాటములు విశాలములు. వానికడ వేదికలు శతసంఖ్య వెలయుచుండెను. అందందు బంగరుబొమ్మలుండుశిఖరములు సొంపుగ నుండెను. బహిర్ద్వారము మణిచిత్రితము. శరత్కాలచంద్రికంబోలి దానికాంతి తగియుండెను. మేరుకందరమువలెఁ గంభీరమై పూలదండలు వ్రేలాడుచుండఁగా నెంతయో వింతగ నది యుండెను. సువాస

నలుగలధూపములు వేయఁబడుచుండెను. పక్షులశుభరవములు వినఁబడుచుండెను. గోడలయందు మృగములయాకృతులు చిత్రింపఁబడియుండెను. శిల్పచాతుర్యము మెచ్చఁదగి కుబేర నిర్జరేంద్రులభవనరాజములఁ దిరస్కరించుచుండెను.

ఆసౌధము దానిచెంత జనులు గుంపులుగా నుండిరి. జానపదులు మహోత్సాహములతోఁ గానికలంబట్టుకొనియుండిరి. ఆ గృహావర్యమున గుజ్జువాంద్రు, స్వల్పదేహులు మెండుగ నుండిరి. దానిం దిలకించి సుమంత్రుఁడు రథము దానిచెంతకుం బోనిచ్చి జనుల నానందింపఁజేసెను. దానిం బ్రవేశించి యందు వినోదముం గలిగించుమృగపక్షులం గాంచుచు గగుర్పాటొంది కక్ష్యాంతరము దాఁటి రామచంద్రప్రియజనులం గాంచుచు లోపలికిం బోయెను. అందుఁగలవారు చెప్పుకొనుశుభతమ వాక్కులకు మిక్కిలి యానందించెను. అందును శ్రీరామమూర్తి యుండుభాగమును గని సంకులముగానున్న జనులంజూచుచు శత్రుంజయనామక దంతావళేంద్రమును గని సేవార్థ మరుదెంచినరాజులం గడచి లోపలఁ బ్రవేశించెను. అతని నెవ్వరు నడ్డునట్టి యాచారములేదు. కావున సించుకయు నాలస్యము లేక లోనఁ జొచ్చెను.

మహాశయులారా! ఈభాగము చదువునపుడు పాఠకులకుఁ గొన్నిసందేహములు తోఁచును. పూర్వసర్గమున సుమంత్రుఁడు దశరథు నానతింగొని రాముని దోడ్కొనిరాఁబోయె నని యున్నది. మరల నిందుఁగూడ నాయర్థమే కొంత గలదు. ఏల? అని సంశయము కలుగును. అభిషేకసంభారములవిషయము మున్ను వర్ణింపఁబడలేదు. విశేషించి యావిషయమే

యుండుఁగలదు. పూర్వసర్గమున నిదియు నంతర్భూతము కాఁద గును. ఇట్లు విషయమును వర్ణించుట ప్రాచీనులయాచారము. కానఁ గథాభాగమున కిది బాధకము కాదు. ఇందు విమర్శించి గ్రహింపఁదగిన క్రొత్తవిషయములు లేవు. ఒకటిరెండువిషయ ములఁ బరికింతము.

"వేశ్యాశ్చైవ శుభాచారాస్సర్వాభరణభూషితాః"

అను నీమూలము మున్ను వ్రాసిన నాయాశయమును సిద్ధాం తమే చేయుచున్నది. "శుభాచారాః అంజనస్రగలంకరణాది మంగళవేషయుక్తాః" అని గోవిందరాజులు వ్రాసిరి. 'సర్వాభరణ భూషితాః' అనుపదము వ్యర్థ మనవలయు. సదాచారముగల వారని యర్థము చెప్పవలయు. అపుడే వేశ్యలను బిలుపించుట మహర్షి కార్యములయందుఁ జక్కనిదిగా నిదియొకటి యన వచ్చును. నియతవ్రతలగువా రాకాలమునఁ గలరని వ్రాసిన నా వ్రాఁతఁ దిలకింపుఁడు.

"రామమానయ సూతేతి యదస్యభిహితోఽనయా,
కిమిదం కారణం యేన మమాజ్ఞా ప్రతిహన్యతే. ౨౬
న చైవ సంప్రసుప్తోఽహమానయేహాశు రాఘవం,
ఇతి రాజా దశరథస్సూతం తత్రాన్వశాత్పునః." ౨౭

అని మూలము. ఈవిషయము తెల్పుటకే యీసర్గ మారంభింపఁ బడినదనవచ్చును. పూర్వసర్గమునఁ గైకయే యాజ్ఞాపించినట్లు న్నది. ఆయానతికి సుమంత్రుఁ డించుక సంశయించినట్లు రాజు సంశయింపకుము. కైకయాజ్ఞయు నాయాజ్ఞయే యనుకొను మని రాజు పలికినట్లు మన మూహింప నీభాగ మవకాశమిచ్చు చున్నది. నేను నిద్రింపలేదని రాజు పలికెను. ఇందుఁ గ్రహింపఁ దగినదేది?

కైకపట్టుదలకు రాజు లోఁబడెను. ఎన్నివిధములనో యామె చిత్తమును మార్పఁజూచెను. కాని యది మార్పునొందదయ్యెను. సత్యపాశబద్ధుఁడయ్యెను. రాము నడవులకుం బంపక తప్పదనియే తీర్మానించుకొనెను. సుమంత్రుఁడు కైక చెప్పుచున్నదే యని యనుమానించెను. ఆసంశయము రాజే తొలఁగించెను. కానఁ గైకవాక్యములు ధర్మయుక్తములే యని యంగీకరించెననియే యనవలయు. కాని రామచంద్రవియోగముమాత్ర మాదశరథునకు మహార్తిని గలిగించుచుండెను. సత్యము తప్పఁజాలక రాము నెడఁబాయఁజాలక తొట్రుపడుచుండెను. రామదర్శనమునఁ గైకచిత్తము మాఱునేమో యని రాజూహించియే రాముని దోడ్కొనిరమ్మని సుమంత్రునకుఁ దెలిపెనని కొందఱందురు. ఆయూహ కవకాశము కల్గించు భాగము రామాయణమునఁ గానరాదు. ఆవిషయమును రాజీవలకే కైకకుఁ దెలిపెను. కాని యామె యంగీకరించినది కాదు. అవ్వల నిరాశుఁడయ్యెను. ఏది యెట్లున్నను రాజు సత్యముతప్పరాదనునూహ కలవాఁడయ్యెననుట నిస్సంశయము.

“మహేంద్రధామప్రతిమం నానాపక్షిసమాకులం”

అని మూలము. ఇది శ్రీరామచంద్రగృహవర్ణనమునఁ గలదు. నానావిధములగుపక్షులు గలవనికదా దీనియర్థము. కొందఱు పక్షులఁ బెంచరాదనియు, వాని నిర్బంధించినట్లగును గాన మహాపాపమనియు, నట్లు పెంచినవారు పైజన్మమునఁ గారాగారమునఁ బడుదురనియుఁ బలుకుదురు. సామాన్యముగ నిర్బంధించుట పాపకార్యమే యనవలయును. కాని రాజగృహములయందుఁ బక్షులఁ బెంచుట ప్రాచీనాచారముగ నున్నయట్లు వినఁబడి

రొడిని. మహాకవివాల్మీకి శ్రీరామగృహావర్ణనమున నీవిషయము పేర్కొనెను. దీనింబట్టి యూహింపఁగాఁ బక్షులఁ బెంచుట పాపకార్యము కాదని తేలెడిని. పంజరములలో నునిచి తిరుగు నవకాశము లేకయుండఁజేయుట పాపహేతువనఁదగు. రాజ హార్మ్యముల నట్లుగాదు. అంతఃపురము చెంత నొకగృహముం డును. అందు వివిధజాతులపక్షు లుండును. కొన్ని తిరిగితిరిగి మరల వచ్చునవియు నుండును. చిలుకలు వదలిన మరల రావు. అట్టివాని నాగృహమున నొకభాగమున వదలుదురు. తంత్రీ బద్ధమగుట నందుండి పోవఁజాలవు. అవి తిరుగఁ జోటుండును. విశాలగృహముగాని యది యల్పగృహము కాదు. వానికి నాహారాదులు కాలానుసారముగా నీయఁబడుచుండును. వాని రుతములు (పలుకులు) శ్రుతిహితములు. మనోరోగములు కొన్ని తొలఁగును. పక్షులపక్షముల కదలికంగలుగుగాలి పక్ష పాతాదిరోగముల నడంచునని ప్రాచీనులందురు. కావునఁ బక్షులఁ జక్కఁగా రామచంద్రునిసౌధమునఁ బోషించుచుండి రని మన మెఱుంగవలయును. సామాన్యజను లనుకొనునట్లు పక్షుల రక్షించుట పాపహేతువు కాదని యీవచనము ననుస రించి యూహింపవచ్చును. విశేషించి విమర్శింపఁదగువిషయము లిందుఁ గలుగమి శ్రీరామునవంతరచరిత్రమును బఠింతము.

శ్రీరాముఁడు దశరథునికడ కరుగుట.

* సుమంత్రుఁడు జనులు నిండియుండు తొలికక్ష్యదాఁటి యంత జనసమ్మర్దములేని రెండవకక్ష్యకుం బోయెను. అందు

---

*ఇది పదునాఱవ సర్గమునఁ గలదు. అధ్యాత్మరామాయణకథయం దిం దిమిడియే యుండును.

ధనుర్ధారులగు వయసుకాండ్రుండిరి. వివిధాయుధములధరించిన యోధులు నుండిరి. వారెల్లరు కుండలములఁదాల్చి సకలాభరణ భూషితులై రామునియందు విశేషించి ప్రీతిగలవారలై యుండిరి. అచ్చట శ్రీరామచంద్రునకు సంతోషముకలిగింప నలంకారార్థము కావిదోవతులంగట్టుకొని చక్కఁగా నలంక రించుకొని యంతఃపురచారిణుల కధిపతులై ద్వారపాలకులై ముదుసలులగు వేత్రహస్తు లుండిరి. వారు సుమంత్రుని గాంచి రామునకుఁ బ్రియముచేయఁగోరువారు కావునఁ ద్వరపడి తమ యాసనములనుండి లేచి గౌరవించిరి. రాజమర్యాదల నెఱింగిన వాఁడు కావున సుమంత్రుఁ డడ్డులేకయే లోనికింబోవఁగల వాఁడయ్యు ద్వారపాలకులం గాంచి నారాక నెఱిఁగించి దర్శన మునకుఁ గాచియున్నానని తెల్పుఁడని పలికెను. వారట్లే యని శ్రీరామునకు సారథిరాక నెఱింగించిరి.

సుమంత్రుఁడు తండ్రి కంతరంగభూతుఁడని రామ మూర్తి యెఱుంగును. కాన సీతంగూడి తానున్న యంతరంగ స్థలమునకే రప్పించెను. రక్తచందనచర్చ యలరారఁగాఁ గుబే రునివలె మెఱయుచు శత్రువుల రూపుమాపుపరాక్రమము విలసిల్లఁగా సువర్ణపర్యంకమునందుఁ గూరుచుండి రామమూర్తి కన్నులపండువు చేయుచుండెను. జానకి పార్శ్వమున నిలిచి చామరముగైకొని వీచుచుండెను. జానకీరామచంద్రులు చిత్రానక్షత్రయుత శీతాంశునిం బోలి ప్రకాశించుచుండిరి. వారిం గాంచి సుమంత్రుఁడు వినయజ్ఞుఁడు స్తుతిపాఠకుఁడు నౌటఁ దనుకాంతిచే భాస్కరునివలెఁ గనంబడు సీతాప్రాణ నాయకు నల్లంతచూచి సాష్టాంగనమస్కారము చేసెను. దశర

థుఁడు తానెప్పుడే నేకాంతమున నున్నపుడుగాని శయన గృహమున నున్నపుడుగాని కూరుచున్నపుడుగాని సుమంత్రుని గోరమునఁ జెంతనుండనిచ్చువాఁడు. అట్టియాంతరంగికసేవకుఁడు గాన నామంత్రి రామమూర్తితో "విహారశయ్యాసనములయందు సుఖమేకదా" అని కుశలప్రశ్నము గావించి మఱియు నిట్లు ప్రశ్నించెను.

కౌసల్యాసుపుత్త్రరత్నమా! నిన్నుఁ గుమారునిగాఁ బడసి కౌసల్య సత్పుత్రవతియయ్యెను. ఇపుడు కైకయు దశరథుఁడు నిన్నుఁ జూడఁగోరుచున్నవారు. అచ్చటికి దయచేయఁదగు జాగు చేయవలదని విన్నవించెను. ఆమాటల నాలకించి తేజంబువెంపున నుల్లసిల్లు నారామమూర్తి సారథిం గారవించి ప్రియపత్నిం దిలకించి దేవీ! తల్లిదండ్రులు నావిషయమునఁ బట్టాభిషేకమును గూర్చి యేమో యాలోచించుచున్నవారు. నిశ్చయము. కైక నాప్రియమును గోరునది. మిక్కిలి సమర్థురాలు. కనుక రాజు వృద్ధువగుటం జేసి భరతాగమనమువఱకు నీయుత్సవము నాపరాదని యెంచి నానిమిత్తము రాజేంద్రుని బ్రోత్సహించుచున్నది. ఆమెకు నాపై మిక్కిలి ప్రీతికలదు. రాజు ననువర్తించుచుండును. లోకమునకు మేలే కోరునది. కావున నీమహోత్సవము సాగింపఁగోరియే రాజును బ్రోత్సహించుచున్నదని నాతలంపు. తండ్రి ప్రేయసియగు కైకంగూడి నామేలే ముఖ్యముగాఁ గోరునట్టి సుమంత్రుని నాకడకుం బంపినాఁడు. ఇది భాగ్యవిశేషము కదా. అంతెట్టిసభ చేరినదో అట్టిదూతయే వచ్చినాఁడు. నాహితమునే గోరువారందుఁ జేరినారుకాన నట్టిదూతనే పంపినారు సుమీ. ఇప్పుడే నాకుఁ బట్టాభిషేకము రాజు చేయంగలఁడనుట

నిజము. సంతోషింపదగువిషయ మిది. నేనిప్పుడే పోయి కైకను రాజును దర్శింతును. నేను జెంతనుండనని చింతింపకుము. పరిజనులున్నవారు. వారితో సంతోషముగ నుండుము. ఏవో వినోదములఁ గాలము వారింగూడి గడపుము.

శ్రీరామచంద్రుఁ డిట్లు ప్రియతమోక్తుల గారవింపఁగా నాకువలయాంక్షి ప్రాణనాథునకు నిరంతరమంగళములు కోరుచుండునదిగావున నిట్లుపలికెను. రామచంద్రా! మున్ను బ్రహ్మదేవుఁడు దేవరాజునకు నభిషేకముసాగించినట్లు దశరథమహారాజు రాజసూయయాగమునకు మహారాజవై ముందభిషిక్తుఁడగుచందమున నిత్తరుణమున నీకు యౌవరాజ్యమును బ్రాహ్మణులసాహాయ్యమునఁ దత్ప్రియుక్తవిధానమున నీయఁదగును. అంతట నీవు రాజసూయాధ్వరదీక్షవహింపఁగా వ్రతసంపన్నుఁడవై వరకృష్ణాజినమును దాల్చి జింకకొమ్మును జేఁదాల్చియుండఁగా నేత్రోత్సవముగా నిన్నుం దిలకించుచు నేను సేవింతును.

రామా! తూర్పున నింద్రుఁడు, దక్షిణమున యముఁడు' పడమటిదెస వరుణుఁడు, ఉత్తరదిక్కునఁ గుబేరుఁడు నిన్నురక్షింతురుగాక. అని మంగళకరవాక్యములు పలుకుచు ద్వారముదనుక రాముని వెంబడించెను. అవ్వలఁ బట్టాభిషేకమునకుఁ దగినమంగళాచారములఁ గైకొని మఱింత ప్రకాశించుచున్న రామమూర్తి జానికికడఁ బోయిరమ్మనుమాటను దీసికొని సారథింగూడి గిరికందరమునఁ గాఁపురముండుసింహ మాశైలమునుండి పయనముచేయునట్లు గృహావర్యమునుండి వెడలి ద్వారముకడ నంజలింబట్టి వినయముననున్న లక్ష్మణుని గాంచెను. పురుషోత్తముఁడగు రామమూర్తి మధ్యకక్ష్యయందుఁ

ప్రియమిత్రులంగూడి యున్న జనులం గాంచి వారిం జేరంబోయి సాధుభాషణముల నాశ్వాసించి మెఱయుచు వ్యాఘ్రచర్మము పఱవఁబడియున్న రథవర్యము నెక్కెను. ఆరథము మేఘమురీతి శబ్దముగలుగ మణిఖచితమగుట సూర్యునివలె మెఱయుచుండెను. అయ్యది వేగముగాఁ బోవుచుండఁగా లక్ష్మణుఁ డొకచేత ఛత్రమును మఱొకచేతఁ జామరమును దాల్చి వెనుకనిల్చి సేవించుచుండ రాముఁ డరిగెను. జనులంద ఱొక్కపెట్టున జయజయనినాదములఁ గావించిరి. ఆశ్వికులు గజారూఢులు వీరభటులు వేలకొలఁది రామమూర్తి ననుసరించిపోయిరి. ముందుగా శూరులుకొందఱు పోవుచుండిరి. వాద్యధ్వనులు లోనగునవి యెల్లతావుల నిండెను. పురంధ్రీమణులు భూషణములఁ దాల్చి జాలమార్గములనుండి రామచంద్రునిపైఁ బూలవర్షముం గురియించిరి. వాని గ్రహించుచు రాముఁ డరిగెను. సర్వాంగసుందరులగుస్త్రీలు కొందఱు హర్మ్యాగ్రముల నుండియుఁ గొందఱందు భూమిపై నుండియు రామునకుఁ బ్రీతింగలిగింపఁగోరి మంగళవాక్కుల నాతనిం గాంచి రామభద్రా! తల్లికి సహజముగా సంతోషమును గల్గించువాఁడవు. అట్టి నిన్నిపుడు కౌసల్య గాంచి యానందించుననుట సంశయమా. నీప్రయాణము సఫలమై పిదపఁ దండ్రిరాజ్యము నొందియున్న నిన్ను జనులు చూడఁగలరు. అని వినుతించిరి. పురంధ్రీమణులు రామునిమనస్సునకు మిక్కిలి ప్రీతింగూర్చుసీతాదేవిని స్త్రీజనంబుల నుత్తమురాలిగా భావించిరి. కాఁబట్టి యామానినులాజానకింగుఱించి రోహిణీకాంత శీతాంశుని బొందినట్లుగా నీకల్యాణి రామునిం జేపట్టినది. కనుకఁ దొలిజన్మమున భూరి

తపస్సు విధియుతముగాఁ జేసియుండుననుట నిస్సంశయమని స్తుతించిరి. వారిప్రియాలాపముల నాలకించి శ్రీరామభద్రుఁడు సంతోషించుచుఁ బోయెను.

జానపదులును పౌరులును దన్నుంగూర్చి యీ రామమూర్తి రాజానుగ్రహమువలన మహారాజ్యలక్ష్మిని బడయం బోవుచున్నాఁడు. ఇట్టి రామమూర్తి మనకుఁ బరిపాలకుఁడగుట మనవాంఛలు ఫలించును. ఈ శ్రీరాముఁడు చాలకాలము రాజ్యమేలును గాన నదియే మనభాగ్యము. ఏలయన నెవ్వరికైన నీతనిపాలనమున నప్రియముగాని యనిష్టముగాని కలుగదు. అనునిట్టివాక్కుల నాలకించుచు జయజయనాదము లాలకించుచు రామమూర్తి యరిగెను. సకలవిధశృంగారముల విలసిల్లు రాజమార్గము కన్నులపండువు చేయుచుండఁగా దాని నా రామభద్రుఁడు చూచెను.

మహాత్ములారా! ఈభాగమున ననేకవిషయములు గ్రహింపఁదగినవి కలవు, పరిశీలింతము.

"తత్ర కాషాయిణో వృద్ధాన్ వేత్రపాణీన్ స్వలంకృతాన్
దదర్శ విష్ఠితాన్ ద్వారి స్త్ర్యధ్యక్షాన్ సుసమాహితాన్." 3

అని మూలము. రామచంద్రునంతఃపురద్వారమున నున్నవారి వృత్తాంత మిందుఁ గలదు. ఇందుఁ గలవిశేషార్థమే పరిశీలింపఁ దగును. అందుఁగలవారే వచ్చినవారివృత్తాంతమును రామమూర్తికిం దెలుపఁగలవారు. కావున వారు రామభద్రునకుఁ బ్రియసేవకులై యుందురు. భగవంతుని సేవింపఁగోరి యతివేషధారులై అనఁగా రక్తవర్ణము మిక్కిలిగలిగి శ్వేతవర్ణము స్వల్పముగా గలవస్త్రముల ధరించినవారని యర్థము. స్వలంకృతులై

యనఁగా నుపాసనార్థమాలికాధరులై యని యర్థము. సుస మాహితులై యనఁగా స్వాధీనాంతఃకరణులై (జితేంద్రియులని సారము) స్త్ర్యధ్యక్షులై అనఁగా భార్యగలవారలై (అపత్నీకులుగారని భావము) వృద్ధులుండఁగాఁ జూచెనని కథాంశము. వృద్ధులనఁగాఁ దొంబదియైదేండ్లయీడుగలవారలని వ్రాసినది సామాన్యార్థము. ఇచట జ్ఞానులని గ్రహింపవలయు.

"న తేన వృద్ధో భవతి యేనాస్య పలితం శిరః
యో వై యువాప్యధీయానస్తం దేవాస్థవిరం విదుః." ౧౫౬
(మను. ౨. అధ్యా.)

అనుమనువాక్యము ననుసరించి యేండ్లుమించినబాలిశులు కారనియు జ్ఞానులనియు భావము.

ఉపాసకుఁడు స్నానముచేసి ధౌతవస్త్రములధరించియలంకారవిశేషములధరించి (దరిద్రుఁడైనచో సర్వార్థాలంకారవంతునిగాఁ దన్ను భావించుకొనవలయునని విధి.) నిర్మలనియతాంతఃకరణుఁడై భార్య చెంతనుండఁగా నుపాస్యదైవతము నారాధింపవలయును ప్రస్తుతము సీతారాములు ప్రకృతిపురుషులు గావున సదారులై జ్ఞానవంతులగువారు ద్వారసీమయందుండి సేవించుచున్నవారని భావము. ఉపాసకులవాఙ్మనస్సులు పరిశుద్ధములుగ నుండవలయును.

"యస్య వాఙ్మనసీ శుద్ధే సమ్యగుప్తే చ సర్వదా
స వై సర్వమవాప్నోతి వేదాంతోపగతం ఫలం." ౧౬౦
(మను. ౨. అధ్యా.)

అను నీస్మృతివాక్యము ననుసరించి వాక్కు మనస్సు ననునీరెండును భావనములుగ నుండవయునని తేలెడిని. అట్టివారే భగ

వత్సేవాఫలము నొందుదురనియు, నవి పరిశుద్ధములుగాక వేష మువమాత్రము పరిశుద్ధముగా నున్నవారికి భగవత్సేవాఫలము భక్ష్యభోజ్యాకారమునఁ గలుగుననియు సారము. అట్టివారు గాక వ్యాఙ్మానసములు పావనములుకాఁగా జ్ఞానులగువారు ద్వారమున వేత్రపాణులై అనఁగాఁ బరభయంకరఖడ్గపాణులు కాకయని భావము. పరమేశ్వరీపరమేశ్వరులగు సీతారాములను సేవించుచున్నవారని తాత్పర్యము.

"సహభార్యాయ రామాయ క్షిప్రమేవాచచక్షిరే." ౬

అనుమూలమును బరికింపుఁడు. సుమంత్రుని రాకను భక్తులగు నాసేవకులు సీతతో మాటలాడుచున్న రామునకుం దెల్పిరి. భక్తుల కుపాస్యదైవతముకడ సర్వస్వాతంత్ర్యములు కలవని యెఱుంగవలయు. ఇది రహస్యసమయమని వారు తలంపరు. భేదబుద్ధి వారలకు లేదు. తల్లిదండ్రులుకదా సీతారాములు. ఆభావము లేకయున్న స్త్రీలే సీతాదేవికడకుంబోయి చెప్పవలసి యుండును. అట్లు కాలేదు కనుక మనము పైఁదెల్పినయర్థ మునే గ్రహింపందగు.

"దదర్శ సూతః పర్యంకే సౌవర్ణే సోత్తరచ్ఛదే
వరాహరుధిరాభేణ శుచినా చ సుగంధినా
అనులిప్తం పరార్థ్యేన చందనేన పరంతపం
స్థితయా పార్శ్వతశ్చాపి వాలవ్యజనహస్తయా
ఉపేతం సీతయా భూయశ్చిత్రయా శశినం యథా." ౧౦

అని మూలము. సుమంత్రుఁడు రాముని దర్శించెనని కథా విషయము. విశేషార్థములం బరిశీలింతము. మెత్తనియాస్తర ణముగల బంగారుపీఠమునఁ గూరుచున్నవాఁడని యర్థము.

పట్టాభిషేకము సాగనున్నది. తొలిరాత్రి యుపవాసము. ఈ స్థితియందేమాత్రము మనస్సునఁ దొందఱపాటు లేక నెమ్మదిఁ గూరుచుండియున్నవాఁడనఁగాఁ దననిర్లిప్తత్వము లోకులకు వెల్లడిచేయుచున్నవాఁడని భావము. సకలకార్యము లామహా ప్రకృతి సీతారూపిణి యొనరించుచుండ నాత్మానందార్ణవ నిమగ్నుఁడై యున్నవాఁడని గ్రహింపవలయును.

"మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరమ్."

అనుగీతోక్తి యిందులకుఁ బ్రమాణమగును. పందిర క్తమువలె నెఱ్ఱనై పరిశుద్ధమై పరిమళమిళితమగు శ్రీచందనమును బూసి కొన్న పరంతపుని గాంచెను. అని యున్నదికదా. ఈభాగము నుండి మనమేమి గ్రహింపవలయును? వరాహము నుపమాన ముగా సజ్జులవిషయమునఁ జెప్పుట స్వభావము. దుష్టులు నజ్జులు క్రూరులునగు దానవులఁ బొలియించి తద్రక్తమున భూమిని దడుపఁబూనె ననుభావము నిది సూచించుచున్నది. శుచినా అన్న పదమున కర్థమేమనఁగా రావణుఁడు మహాభక్తుఁడు. శాప వశమున రాక్షసయోనిం బుట్టెను. కాన నాతనిరక్తము పరి శుద్ధమే యని ధ్వని. ఈయర్థమును "పరంతపమ్" అనుపదము సార్థకము చేయుచున్నది. పార్శ్వమునందు సీత నిలుచుండి చామరమును వీచుచుండెను. అనఁగాఁ బ్రకృతి ప్రోత్సహించు చున్నదని భావము. సకలకార్యములు ప్రకృతి భగవంతుఁడు రూపాంతరము నొందఁగా నాతనిమూలమున సాగించునని తాత్పర్యము.

"ప్రకృతిం స్వామవష్టభ్య విసృజామి పునఃపునః
భూతగ్రామమిమం కృత్స్నమవశం ప్రకృతేర్వశాత్."

"న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ
ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు." ౯ గీత ౯ అధ్యా.

అను నీశ్రీకృష్ణోపదేశము పైదానిని సిద్ధాంతము చేయుచున్నది కదా. ఈయర్థమునే శ్రీశంకరభగవత్పాదులు సౌందర్యలహరి యందు,

"శివశ్శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చేదేవం దేవో న ఖలు కుశలస్స్పందితుమపి."

అని బోధించిరి. దీని నంగీకరింపనివారున్నచో వారికి భగవద్గీతయుఁ బ్రమాణము కాదనియే సిద్ధాంతముకదా. కావునఁ బ్రకృతి నిర్లిప్తుఁడగుపరాత్పరుని భావికార్యమునకుఁ బురికొల్పుచున్నదనియుఁ దదనుగుణముగా రామమూర్తి యలంకారము లొప్పియుండెననియు గ్రహించుటయే సమంజసము.

"చిత్రయా శశినం యథా"

అనునది యీపైవ్రాసినయర్థమును దృఢపఱచుచున్నది. చిత్రానక్షత్రముంగూడినచంద్రునివలె సీతంగూడి రాముఁడుండెనని సామాన్యార్థము. విశేషార్థమేదనఁగా, చిత్రానక్షత్రము నక్షత్రవీథియందు దక్షిణభాగమున నుండును. చంద్రుఁడు సమీపింపఁగా దానిప్రకాశము తగ్గును. అనఁగా నయ్యది చక్కఁగా నగపడకయుండును. లోఁబడియుండునని భావము. విచిత్రాకృతులందాల్చు మహామాయ సీతాదేవి దక్షిణదిక్కునందు నగపడకయున్నయట్లుండును. అనఁగా శ్రీరాముని చెంత లేనట్లుగా లోకుల భ్రమింపఁజేయునని దీనిసారము. రామచంద్రుఁ డొక్కఁడే యున్నయట్లు నటించునని మన మెఱుంగవలయు. చిత్రానక్షత్రము మధ్యవీథియందుండునుగాన నీయర్థ

మిటఁ బోసఁగదందురు. కాని వారిమాటలు పాటింపఁదగినవి కావు. ప్రాగ్దిక్కు నిర్ణయించు టెట్లన్న ప్రశ్నమునకు సమాధానము "చిత్రాస్వాత్యంతరం ప్రాచీ" అని చెప్పఁబడినది. కావునఁ జిత్రానక్షత్రము దక్షిణభాగమున నున్నదని యెఱుంగవలయు. ఈయర్థమునే యధ్యాత్మరామాయణము కూడఁ దెల్పెను. ప్రకృతిపూరుషుల కవినాభావసంబంధము ప్రతిపాదింపఁబడఁగాఁ గొంతకాలము లేకుండు టెట్లు? రాక్షససంహారార్థము తాను వారికి లోఁబడినట్లు నటించుననియే భావము. తానై వధింపక నిర్లిప్తుఁడగు శ్రీరామునిచే నేల చంపింపవలెనని కొందఱు పండితమ్మన్యులు ప్రశ్నింతురు. మూఁడుజన్మములు విరోధించి భగవంతునిచే మృతింగాంచవలసినట్లు వరము గొన్నవారు కనుక నావరమును వ్యర్థము చేయరాదనియే రాముఁడు వధించినట్లు లోకులకుఁ గనంబఱచెనని భావము.

"తం తపంతమివాదిత్యముపపన్నం స్వతేజసా,
వవందే వరదం వందీ వినయజ్ఞో వినీతవత్." ౧౧

అను నీమూలము విమర్శనార్హము. "స్వతేజసా ఉపపన్నమ్" తన తేజస్సుతోఁ గూడినవాఁడని ప్రాతీతికార్థము. కార్యభారనిర్వహణమునకుం దగిన స్వకీయతేజస్సుతోఁ గూడినవాఁడనియే భావము. భగవత్తేజస్సు సమగ్రముగా నిపుడామూర్తియం దావిర్భవించెను. ఇంతకుముందున్న తేజ స్సిట్టిది కాదు. క్రూరదానవసంహారోచితమగు సాటిలేని తేజస్సు రామమూర్తియందు వెలయుచుండెనని తాత్పర్యము.

"తస్యాశ్శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః."

అని శ్రుతి తెల్పుచున్నది. భగవద్రూపము తేజోమయమని భావము.

"ఉద్యంతమస్తంయంతమాదిత్యమభిధ్యాయన్కుర్వన్ బ్రాహ్మణోవిద్వాన్ త్సకలంభద్రమశ్నుతేఽసావాదిత్యో బ్రహ్మేతి బ్రహ్మైవ సన్ బ్రహ్మాప్యేతి యఏవం వేద."

అనియు శ్రుతి బోధించెడిని.

"ధ్యాయేత్సదాసవితృమండలమధ్యవర్తీ నారాయణస్సరసిజాసనసన్నివిష్టః."

అని ప్రాచీనోక్తియు వేదాభిప్రాయమునే తెలుపుచున్నది. వరదం అను విశేషణము భగవంతుఁడని సూచించుచున్నది. రాజపుత్త్రులవిషయమై వరదులని చెప్పుటకలదా. ఈభాగమును బరికించిన శ్రీరామమూర్తి నిర్లిప్తుఁడనియు, భగవంతుఁడే యనియు, సీత మహామాయ యనియు, సర్వకారణభూతులురా లనియు స్పష్టము.

"కౌసల్యాసుప్రజా రామ పితా త్వాం ద్రష్టుమిచ్ఛతి,
మహిష్యా సహ కైకేయ్యా గమ్యతాం తత్ర మాచిరం." ౧౩
"ఏవముక్తస్తు సంహృష్టో నరసింహో మహాద్యుతిః,
తతస్సమ్మానయామాస సీతామిదమువాచ హ." ౧౪

అని మూలము. సుమంత్రుఁడు రామమూర్తికిఁ దండ్రివాక్యమును దెలుపుచున్నాఁడు. "కౌసల్యాసుప్రజా రామ" అను వాక్య మసంగతముగా నిటుఁ దోఁచును. ప్రస్తుతవిషయమున నిది పొసఁగదు. కాని యిందొక గూఢార్థము కలదు. సుమంత్రుఁడు భావికార్యప్రచోదితుఁడై యీవాక్యమును దెలిపె ననియే నిర్ణయింపవలయును. రామా! కౌసల్యాదేవి సుప్రజ.

సత్పుత్త్రుఁడుకలది. నిన్నుఁ గని యందఱిలోఁ బ్రఖ్యాతిగాంచినది. ధన్యురాలయ్యెనని తాత్పర్యము. ఎవ్వనిమూలమునఁ దల్లిదండ్రులకు విఖ్యాతి యతిశయించునో యతఁడే సత్పుత్త్రుఁడగును. వారే సత్పుత్త్రులుకలవారని తాత్పర్యము. భగవంతుఁడు కుమారుఁ డగుటకంటె నదృష్టము వేఱుగ లేదుకదా. 'పితా త్వాం ద్రష్టుమిచ్ఛతి' తల్లి ధన్యురాలయ్యెను. తండ్రియు ధన్యుఁడు కాఁగోరి నిన్నుఁ జూడఁగోరుచున్నవాఁడని భావము. ఒక్కఁడే కాఁడు. 'మహిష్యా కైకేయ్యాసహ' రాణియగు కైకతోఁ గూడి నిన్నుఁ జూడఁగోరుచున్నవాఁడు. 'కృతాభిషేకామహిషీ' అని యమరము. కౌసల్యకే యీపేరు చెల్లును. కైకకుఁ జెల్లదనవచ్చును. ఇది సామాన్యవిషయము. కశ్యపముని దశరథుఁడనియుఁ, గౌసల్య యదితియనియుఁ బ్రమాణములు కలవని పెద్దలందురు. అదితి మూఁడురూపములఁ గైకొనెననవలయు. భగవంతుఁడు నాలుగువిధములుగాఁ దన మూర్తిని భాగించి మువ్వురియందును జనించెనని యర్థము. కావున 'మహిషీ' అనునది కైకకుంగూడఁ జెల్లునని సమాధానము చెప్పవచ్చును. రాజపత్నులయందు సమానభక్తి సేవకులకు నుండఁదగును. కావున సుమంత్రుఁ డాకైకనుగూడఁ బట్టపురాణియని పలికెననియుఁ జెప్పవచ్చును. ఇందుఁ గలవిశేషమేమనఁగా రామా! కౌసల్య నిన్ను గని సత్పుత్త్రవతి యయ్యెను. నీయవతారఫలమునకు హేతుభూతురాలు కైకేయియే. కావునఁ నాకైకంగూడి తండ్రి నిన్నుఁ జూడఁగోరుచున్నవాఁడు. నీయవతారఫలమును లోకులకుఁ గల్పింపఁబూనినది కైక. కనుక నామెయుఁ దండ్రియు నిన్నుఁ జూడఁగోరుచున్నారు. "గమ్య

తాం తత్ర మాచిరం" అక్కడికిఁ బోఁదగును. ఆలసింపఁదగదు.
అనఁగా నీవలనఁ గాఁదగుకార్యము లనేకము లున్నవి. ఇందు
నిలువ నవకాశము లేదు. భక్తత్రాణము ముఖ్యము. కాన
నిందుఁ గాలముం బుచ్చక త్వరగా నచటికిం బొమ్ము. అను
నదియే విశేషాంశము. పట్టాభిషేకసంరంభమున సుమంత్రుఁ
డాలసింపక పొమ్మని చెప్పె ననునది సామాన్యార్థము. దైవిక
ముగా నీవిశేషార్థమును దెలుపుపదములకూర్పు కలిగినది. ఈ
యర్థమును సార్థకము చేయు పైశ్లోకమును బరికింపుఁడు. "మహా
ద్యుతిః నరసింహః ఏవముక్తస్తు సంహృష్టః" అనుపదముల
కూర్పును బరిశీలింపుఁడు. మహత్తరతేజస్సుగల మానవశ్రేష్ఠుఁ
డగు రాముఁ డానందించి యనునది సామాన్యార్థము. అది
యిచ్చోట సార్థకము కాదు. "నరసింహః. సింహశార్దూల
నాగాద్యాః పుంసి శ్రేష్ఠార్థగోచరాః" అని యమరము. దీని నను
సరించి నరోత్తముఁడని పలుకరాదు. దుర్నిరీక్ష్యతేజోరాశి
యగు నరసింహమూర్తివలె నుండెనని గ్రహింపవలయును. ఎల?
అనఁగా రాక్షససంహారమునకుఁ బోవవలసినసమయ మొదవెను.
తదనుగుణముగాఁ బ్రయత్నము సాగుచున్నది. ఈమహాదీక్షకుఁ
బ్రథమాంగముగ నుపవాసదీక్ష గడచెను. శత్రుధ్వంసన మహా
హవదీక్షం బూనుచున్నాఁడను. అనుమాహాతో నారామమూర్తి
యాకారము శత్రుభయదమగు నృసింహమూర్తివలెఁ గనఁబడి
యెనని యెఱుంగవలయు. 'తతస్సమ్మానయామాస' అనఁగా
హిరణ్యకశిపువధకుఁ బ్రధానుఁడగు ప్రహ్లాదు ననుయించిన
చందమున నట్టి శుభవార్తను గొనివచ్చినసుమంత్రుని గౌర
వించెనని యర్థము. "సీతామిదమువాచహ" తనపూనినపనికిఁ

గరణభూతురాలగు మహాప్రకృతిం గని యిట్లు పలికెను. అనునీ విశేషార్థమును గ్రహింపవలయును.

"దేవి! దేవశ్చ దేవీ చ సమాగమ్య మదంతరే,
మంత్రయేతే ధ్రువం కించిదభిషేచనసంహితం. ౧౪
లక్షయిత్వా హ్యభిప్రాయం ప్రియకామా సుదక్షిణా,
సంచోదయతి రాజానం మదర్థం మదిరేక్షణే." ౧౫

అనుమూలము పరిశీలింపందగు. సామాన్యార్థము సులభము. దేవి! ప్రకాశస్వరూపిణియగు నో ప్రకృతీ! రాజును దేవియగు కైకేయియు నించుక యభిషేకవిషయమును నాకొఱకు నాలోచించుచున్నారు. ఇది నిశ్చయము. నన్ను మహాదీక్షకుంబూన్ప నాలోచించుచున్నవారని భావము. నా కవకాశము కల్పించు విషయమున నించుక యాలోచించుచున్నవారని రాముఁడు స్వాభిప్రాయమును బ్రకటించెను. నీయభిప్రాయమును గనుఁగొని మంచినేర్పఱితనముగలది కావున లోకములకుఁ బ్రియమగు వాంఛకలదియై నావిషయమై రాజును బురికొల్పుచున్నది. అనఁగాఁ గైకయూహ లోకమున కుపకారకము. కార్యనిర్వాహణశక్తి కలది కైక. కావున నాకొఱకు భర్తను బ్రోత్సహించుచున్నది. 'మదిరేక్షణే' అని రాముఁడు సీతను సంబోధించెను. మదముగప్పిన కన్నులుకలదానా! అనఁగా మహాహవమున వీరపానము చేసినచందమున నీకన్నులున్నవని యర్థము. అనఁగా నీదృష్టి యుద్ధమునే సూచించుచున్నది. అని రాముని హృదయము.

"సా ప్రహృష్టా మహారాజం హితకామానువర్తినీ,
జననీ చార్థకామా మే కేకయాధిపతేస్సుతా. ౧౬

దిష్ట్యా ఖలు మహారాజో మహిష్యా ప్రియయా సహ,
సుమన్త్రం ప్రాహిణోద్దూతమర్థకామకరం మమ." ౧౮

అని మూలము. ఇదియు రామవాక్యమే. తనప్రయత్నమును దెలుపుచున్నాఁడు. కైక లోకహితవాంఛగలది. అందులకే మహారాజు ననువర్తించుచున్నది. నిరంతరసంతోషముగలది. విశేషించి నాకుఁదల్లి. నాప్రయోజనమునే కోరునది. నాయదృష్టముననే రాజు ప్రియురాలింగూడి నాకు వలయుప్రయోజనము నొనరించుసుమంత్రుని దూతగా నంపెనుగదా. అని రాముఁడు సీతకుం జెల్పెను. సారమేమి? కైక నాకోఱికే రాజు ననుసరించి లోఁబఱచుకొని లోకక్షేమముగోరు నాకోఱికఁ బురికొల్పుచున్నది. అదృష్టవశమున మహారాజు దేవింగూడి యున్నాఁడు. ఆలోచించియే సుమంత్రుని దూతగాఁ బంపినాఁడు. వీఁడు నాప్రయోజనమును నావాంఛితము ననుసరించి సలుంగు వాఁడు కావున నివన్నియు నాయవతారఫలమును సార్థకము చేయుచున్నవని శ్రీరాముఁడు మహామాయకుం దెలిపెనని మనము గ్రహింపవలయును.

"యాదృశీ పరిషత్తత్ర తాదృశో దూత ఆగతః,
ధ్రువమద్యైవ మాం రాజా యౌవరాజ్యేఽభిషేక్ష్యతి. ౧౯
హన్త శీఘ్రమితో గత్వా ద్రక్ష్యామి చ మహీపతిం,
సహ త్వం పరివారేణ సుఖమాస్వ రమస్వ చ." ౨౦
సఖి త్వం పరివారేణ=అని పాఠాంతరము.

అన్న నీమూలము పైనవ్రాసినయభిప్రాయమును దృఢపఱచెడిని. అందెట్టిసభ కూడినదో యట్టిదూతయే వచ్చినాఁడు. అనఁగా నాకార్యము ఫలింపఁజేయుటకుఁ గంకణముకట్టుకొన్నవారే

యందుఁ జేరిరి. వారివలె నాకార్యమునకుఁ దోడుపడుసుమం త్రుఁడే దూతగా వచ్చినాఁడు. నిశ్చయముగా నిపుడే యావ రాజ్యమున కభిషేకము చేయఁగలఁడు. సీతాదేవీ! ఈదేశ పాలకుఁడుగా నింకొకఁడు రాఁగలఁడు. నేను యువరాజుగా నుండియే నాయభిమతములు సాధింపవలయును. అనఁగా నేను రాజుగా నుండనని భావము. ఈవిషయమును వాలివధకాల మున రామమూర్తి తెలుపును. ఆభావమును జక్కఁ బరికించిన నీయర్థము సమంచితమనియే తోఁచును. ఈపని తప్పక సాగునని రామమూర్తి సీతకుం దెల్పెనని గ్రహింపఁదగును. 'హంత' అని రామమూర్తి యనియెను. ఇంతకన్న హర్షకారణమగున దేదికలదు? సకలలోకరక్షణమే యుత్తమకార్యము; ధర్మసంస్థా పనమే మనకు విధి. కాన శీఘ్రముగా నిందుండి బయలువెడలి రాజును దర్శింతును. అనఁగా నిఁక నేమాత్రము కాలవిలంబము చేయరాదు. మనము చేయఁదగుమహాకార్యమునకుఁ ద్వరపడ వలయు. సఖి! అని భార్యను సంబోధించుచున్నాఁడు. 'సమాన ఖ్యాతిః' అని సఖశబ్దార్థము. సమానత్వము కలవాఁడనియే సారము. కావున నిట రామమూర్తి గూఢార్థము గలుగునట్లే సఖి! అని పిలిచెను. నాచేయునంతపని నీవుకూడఁ జేయవలయు నని భావము. "పరివారేణ సుఖమాస్వ రమస్వ చ" నావచ్చునంత దనుక నీపరివారముం గూడియుండుము. విహరింపుము. వారి తోటిసల్లాపములం గ్రీడింపుమని భావము. ఈపరివారము నానం దింపఁజేయుట నావచ్చునంతవఱకే. ఆవల వీరి నానందింపఁజేయు నవకాశము మనకు లేదనియే రాముని యాశయము. నీవు నీయంతి పురమున వీరింగూడి యానందించుకాల మీకొలఁదిఘటికలే.

ఆవల వేఱువిధమగు నానందము కలుగును. ఈపరివారముతో నన్నమాటనుబట్టి యల్పానందమే మహానంద మనుకొను బాలిశులగు వీరితో నీరవంతకాల మానందించినట్లు నటింపుమని భావమని గ్రహింపందగును. నీవులేక నే నేకార్యము చేయఁజాలనని రాముఁడు పలికెననియే యిటఁగలసారము. ఈయర్థమే గీతాశాస్త్రమునందు శ్రీకృష్ణభగవానులు

"న చ మాం తాని కర్మాణి నిబధ్నంతి ధనంజయ,
ఉదాసీనవదాసీనమసక్తం తేషు కర్మసు. ౯
మయాధ్యక్షేణ ప్రకృతిస్సూయతే సచరాచరం
హేతునానేన కౌంతేయ జగద్విపరివర్తతే." ౧౦

అని తేటపఱచిరి. ఈవిషయమునే శ్రీశంకరభగవత్పాదులు

"త్వదన్యః పాణిభ్యామభయవరదో దైవతగణ
స్త్వమేకా నైవాసి ప్రకటితవరా భీత్యభినయా
భయాత్త్రాతుం దాతుం ఫలమపి చ వాంఛాసమధికం
శరణ్యే లోకానాం తవ హి చరణావేవ నిపుణౌ." ౪

అని సౌందర్యలహరియందు వెల్లడించిరి. 'సహ త్వం పరివారేణ' అనుపాఠమున నీయర్థము లేదే యందురేని యందునుగూడ నిదియు నిమిడియే యున్నదని యెఱుంగవలయు.

"పతిసమ్మానితా సీతా భర్తారమసితేక్షణా,
ఆద్వారమనువవ్రాజ మంగళాన్యభిదధ్యుషీ." ౨౧

అనుమూలమును బరిశీలింపుఁడు. దీని కాకాశ రామన్నపంచాంగమువంటి యర్థముగలదు. నిస్సారము. విశేషార్థముకలదా యని గ్రహింతము. 'పతిసమ్మానితా అసితేక్షణా సీతా' నిందుజవ్వ

నముగలదనుట 'అసితేక్షణా' అనునది సూచించును. 'సీతా' అనునది యామె యయోనిజత్వమును దెలుపును. అట్టిమహామాయ జానకి భర్తచే నిట్లు మన్నింపఁబడినదియై అనఁగా భావి కార్యమున బద్ధకంకణురాలవై యుండుమా యని పురికొల్పఁబడినదై అని యర్థము. నీవు లేకున్న నే నశక్తుఁడ నగుదు నను భావము తెలుపఁబడినదై యని భావము. నేను నిర్లిప్తుఁడను. (ఉదాసీనుఁడను) నాసమక్షమున నీవే యన్ని కార్యములు నిర్వహింపవలసియుండుననియే యిటఁగలవిశేషము. ఈమాట భగవంతుఁడు పలుకఁగా శ్రీపరమేశ్వరునకు మంగళములను ధ్యానించుచున్నదియై, అనఁగా వేవేగ మాయవతార ప్రయోజనము సమకూడవలయునని కోరుచున్నదియై ద్వారముదనుక వెంబడించెను. అనఁగా మీరు వెడలి వారిమాటలను విని రండు. తమయిచ్ఛ ననుసరించి సర్వకార్యములు నిర్వహింతునని పలుకుచున్నదియై యని భావము. జగన్మంగళములను గోరుచు భర్తను ద్వారముదనుకఁ బోయి సాగనంపెను. అనఁగాఁ ద్వార పెట్టెనని సారము. తమయవతారఫలము లోకములకు సమకూర్ప నాయాదిమదంపతు లాతురంపడుచుండిరనునదియే యిటఁగలవిశేషమని మన మెఱుంగవలయును.

కొందఱు 'మంగళాన్యభిదధ్యుషీ' అనుదానికి మంగళములుగలుగ నాశీర్వదించెనని యర్థము చెప్పి పతిని భార్య నాశీర్వదించెననుట సమంజసముకాదని యాక్షేపింతురు. ఏమి సాహసము! వాల్మీకిమహర్షి నాక్షేపించుటకంటె విశేషపాండిత్యమింకేమిగలదు? 'అభిదధ్యుషీ' అనఁగా ధ్యానించుచున్నదనియే యర్థము. కాని దీవించెననికాదు. 'భర్తుః ప్రియహితే రతా'

అన్న సూక్తి స్మృతిసమ్మతమే. కావునఁ బతికి మేలుగలుగవలయు నని ధ్యానించెనని తాత్పర్యము.

“రాజ్యం ద్విజాతిభిర్జుష్టం రాజసూయాభిషేచనం,
కర్తుమర్హతి తే రాజా వాసవస్యేవ లోకకృత్. ౨౨
దీక్షితం వ్రతసంపన్నం వరాజినధరం శుచిం,
కురంగశృంగపాణిం చ పశ్యంతీ త్వాం భజామ్యహం. ౨౩
పూర్వాం దిశం వజ్రధరో దక్షిణాం పాతు తే యమః,
వరుణః పశ్చిమామాశాం ధనేశస్తూత్తరాం దిశం.” ౨౪

అని మూలము. సామాన్యార్థ మిటఁ జర్చింప నక్కఱలేదు. రాజసూయ మనఁగా ఎల్లరాజులను జయించి రాజు చేయు యజ్ఞవిశేషము. బ్రహ్మ ఇంద్రు నభిషేకించినట్లు దశరథమహారాజు యువరాజుగా నిన్నిపు డభిషేకించుచు రాజసూయము ముందు నీవు చేయున ట్లభిషేకింపఁగలఁడని భావము. అనఁగా శ్రీరామా! ఇపుడు రాజు నిన్నుం బిలిపించి నీవు ముం దెల్ల రాజుల జయించి ద్విజాతిసమృద్ధమగు రాజ్యమునుబొందున ట్లభిషేకింపందగును. నీవు లోఁబడక యనఁగా నధర్మతత్పరు లగుభూపాలకుల జయించియే రాజ్యమును బాలింపవలయునని సీత యాశయము. తొలుత దుష్టసంహారము పిదప శిష్టపరిపాల నము చేయఁదగునను భావ మిట సూచింపఁబడియెను. జగదీశా! దుష్టసంహారదీక్షంబూని వ్రతసంపన్నుఁడవై శ్రేష్ఠమగుజింక చర్మమును దాల్చి దుష్టసంహారరూపమహత్తరకార్యమునఁబరి శుద్ధుఁడవై కురంగశృంగమును హస్తముచే ధరించియున్న నిన్ను భజింతునని సీత పలికెను. దండకారణ్యమున దుష్టసంహారము చేయఁబూని క్రొత్తజింకచర్మమును దాల్చి (అనఁగా మాయా

కురంగరూపుఁడగు మారీచునిం బొలియించి) క్రూరరాక్షస సంహారమునఁ బరిశుద్ధుఁడవై కురంగశృంగపాణివై (భూమిఁ దిరుగుమృగప్రాయుని శృంగముఁ దాల్చి అనఁగాఁ జంపి) వచ్చుచున్న నిన్ను నేను సేవింతును. అనఁగా మారీచుని వధించి నీవు వచ్చుచుండఁగా సంతోషమునఁ గొల్తునని ధ్వని. రావణాసురుఁ డపహరించినసీత మహాప్రకృతి కాదనియు, సీతాప్రతికృతియనియు నిట సూచితము. రామచంద్రపత్నిని స్పృశింపఁ ద్రిమూర్తులకేఁ దరమా! మోసపుసీత నెత్తుకొనిపోయి మూర్ఖుఁడు గావున సీతయే యని భ్రమించెననియే యిటఁగలవిశేషము. భగవత్సాన్నిధ్యమున సకలకార్యముల నిర్వహించునట్టిచోట నిర్లిప్తుఁడగుపరమేశ్వరునకుఁ బ్రోత్సాహమును గల్గించెననియే యిట మనము గ్రహింపఁదగినవిషయము. ఇట్లు భావికార్యభారమును సూచించి పరిచారకులకుఁ దెలియునట్లు లోకాచారము ననుసరించి నాల్గుదిక్కుల కధిపతులగు నింద్రయమవరుణకుబేరులు రక్షింతురుగాక యని శుభవాక్కులు పలుకుచున్నది. దీనినుండి గ్రహింపఁదగున దెద్ది? మానవుఁడు గృహమువదలి యేదిక్కునకుం బోవ నెంచునో యాదిగధిపతిం బ్రార్థింపవలయును. సర్వవ్యాపి యగుభగవంతుఁడు స్వాంశమున దిగధిపతిని నిర్మించును. కావున నాదిక్పాలకుని భక్తుఁడు భగవంతునిగా భావించి నీచెంతకు వచ్చుచున్నవాఁడను. అపమృత్యుప్రముఖమహార్తులు లేకయుండఁ గాపాడుమా యని ప్రార్థింపవలయుననియు, నాప్రార్థనము భగవంతుఁ డంగీకరించుననియు నీభాగమునుండి గ్రహింపవలయును. దీనికే యపరిచ్ఛిన్నభక్తి యని పేరు. ఇట్లు ప్రార్థించుటం జేసి భగవదంశ

ములుకాని ప్రాణికోటులు లేవనుభావము దృఢపడును. దాన దేవతాంతరదూషణమునకుఁ గలయవకాశము దూరమగును. అదియేకదా కావలసినది. కావునఁ బరమేశ్వరుని సర్వాకార ముల విలసిల్లువానిగా నెఱింగిన మేలు కలుగును.

"యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి,
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి. ३०
సర్వభూతస్థితం యో మాం భజత్యేకత్వమాస్థితః
సర్వథా వర్తమానోఽపి స యోగీ మయి వర్తతే." ३१

గీత. ౬ అధ్యా.

అన్న శ్రీకృష్ణోపదేశము నెఱుంగనివా రుండరు.

"తతః పావకసంకాశమారురోహ రథోత్తమం,
వైయాఘ్రం పురుషవ్యాఘ్రో రాజితం రాజనందనః. ౨౭
మేఘనాదమసంబాధం మణిహేమవిభూషితం,
ముష్ణంతమివ చక్షూంషి ప్రభయా సూర్యవర్చసం." ౨౮

అని మూలము. రామచంద్రునిగమనము భయంకరమనియు, శాంతమును దెలుపలేదనియు నీభాగము తెలిపెడిని. 'పావక సంకాశమ్' అగ్నివలె వెలుంగుచున్నది. 'వైయాఘ్రం' పెద్ద పులిచర్మము పఱవఁబడియుండెను. దానిపైఁ గూరుచుండెననఁగా దుష్టప్రాణులం బొలియించి వారికంటె మిన్నగనుండునని తెలి యందగు. 'చక్షూంషి ముష్ణంతమివ' అనుటంజేసి చూచువారి కన్నులకు మిఱుమిట్లు గొలుపునదియై యనఁగా జూడఁదరము గానిదై యుండెననిభావము. మహాసంగ్రామమున రాక్షసవీరులం బొలియించు కార్యమునకుం బ్రయాణమగుచున్నవాఁడని

సూచింపఁబడియె. 'సూర్యవర్చసమ్' అనఁగా భీషణమని భావము.

"యాదృశీ భావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ."

అన్నయట్లు భగవంతుఁ డేకార్యమునకై యవతరించెనో దానికిం దగినపరికరము లొప్పెనని మనము తెలిసికొనవలయును.

"స పర్జన్య ఇవాకాశే స్వనవానభివాదయన్,
నికేతాన్నిర్యయౌ శ్రీమాన్మహేంద్రాదివ చంద్రమాః." ౩౧

అని మూలము. "ఆకాశే నాదవాన్ పర్జన్య ఇవ సదిశః అభినాదయన్" అనఁగా మేఘుఁ డొక్కయాకాశమునందే ధ్వనించును. శ్రీరాముఁ డెల్లతావులను ధ్వనింపఁజేయుచు ననఁగాఁ దనకార్య మెల్లరకుఁ దేటపడఁ జేయుచు నెల్లరకు నానందమును గల్గించుచుఁ బోయెనని భావము. అనఁగా శ్రీరాముని యత్నము సర్వదిక్కులనుండువారు పొగడఁదగినదికాని కొందఱకే యుపకరించునదికాదని సారము. దీనిచేత సర్వసముఁడు భగవంతుఁడగుట తెల్లమగుచున్నది.

"సమోఽహం సర్వలోకేషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః
యే భజంతి తు మాం భక్త్యా మయితే తేషు చాప్యహం." ౨౯
(గీత. ౯. అధ్యా.)

అన్నశ్రీకృష్ణోపదేశము స్మర్తవ్యము. పర్జన్యునుపమానముగాఁ జెప్పుటచేత శ్రీరామమూర్తి యితరులమెప్పుకొఱకుఁగాని, స్వార్థమును గోరికాని యేకార్యము చేయువాఁడు కాఁడని, సర్వోపకారకరణము తనపనియే యని భావించి యొనరించువాఁడనియు స్పష్టము.

"హర్మ్యవాతాయనస్థాభిర్భూషితాభిస్సమంతతః,
కీర్యమాణస్సుపుష్పౌఘైర్యయౌ స్త్రీభిరరిందమః." ౩౭

అని మూలము. సౌధములయందలి గవాక్షములకడనుండి పురంధ్రీమణులు పూవులుచల్లుచుండఁగా శత్రుధ్వంసకుఁడగు రాముఁ డరిగెను. అనఁగా శత్రువుల రూపుమాపుటకొఱకు నూర్ధ్వలోకవాసులు ప్రార్థింపఁ బ్రయాణము చేసెనని సూచింపఁబడినది. ఈభావముననే మహాకవి యిందు నరిందమశబ్దమును బ్రయోగించెను. ఈయర్థము నీక్రిందిశ్లోకము దృఢపఱచుచున్నది. చూడుఁడు.

"నూనం నందతి తే మాతా కౌసల్యా మాతృనందన,
పశ్యంతీ సిద్ధయాత్రం త్వాం పిత్ర్యం రాజ్యమవస్థితం." ౩౮

అని మూలము. సామాన్యార్థము స్పష్టము. నీతల్లి వీరమాత యగును. కావున నీవీప్రయాణము సఫలముగాఁ గావించుకొని రాక్షససంహారరూపభూభారహరణమహాకార్యమును దీర్చి ధర్మమును స్థాపించి పిదపఁ దండ్రివంకనుండివచ్చిన రాజ్యము నొందఁగా నీ తల్లి కౌసల్యచూచి యానందించును. క్షత్రియకాంతలు పుత్త్రులు జైత్రయాత్రల కరుగుచుండ నానందింతురనుట స్పష్టముకదా. 'సిద్ధయాత్రం త్వామ్' అన్నందున నీప్రయాణము శీఘ్రముననే సాగుననియు సూచింపఁబడియె. 'పిత్ర్యం రాజ్యమవస్థితమ్' అనుటచేత రాజ్యకాంక్షచేత దండయాత్ర చేయకయుండు వాఁడనుట సూచింపఁబడియె. అనఁగా ధర్మసంస్థాపననిమిత్తమే దుష్టరాక్షససంహారము చేయువాఁడని భావము.

"సర్వసీమంతినీభ్యశ్చ సీతాం సీమంతినీ వరాం,
అమన్యంత హి తా నార్యో రామస్య హృదయప్రియాం.

తయా సుచరితం దేవ్యా పురా నూనం మహత్తపః,
రోహిణీవ శశాంకేన రామసంయోగమాప యా.
ఇతి ప్రాసాదశృంగేషు ప్రమదాభిర్నరోత్తమః,
శుశ్రావ రాజమార్గస్థః ప్రియా వాచ ఉదాహృతాః." ౪౨

అని మూలము. విశేషార్థ మేమనఁగా 'రామస్య హృదయప్రియామ్' యోగిధ్యేయుఁ డగుభగవంతునకు హృదయానంద కారిణి. అనఁగా భగవంతు నిచ్ఛాశక్తిని. అని యర్థము. మహా మాయ యనఁగా భగవంతు నిచ్ఛయేకదా. 'సీతాంహి తా నార్యః అమన్యంత' భగవంతునిహృదయానందకారిణిగా సీతను బతివ్రతలు తలంచిరి. అనఁగా భగవంతునిహృదయ మెఱింగి సర్వకార్యముల నిర్వహించుమహామాయగా నెఱింగిరనియే కదా భావము. సీత నాఁగటిచాలునఁ బుట్టినది. అయోనిజ యని యెఱుంగుదురు. కావున నీమె సామాన్యరాజపుత్త్రిక కాదనియు మూలప్రకృతియనియు భావించిరని తాత్పర్యము. 'రోహిణీవ శశాంకేన' శశము గుఱుతుగాఁగలవాఁడు చంద్రుఁడని ప్రసిద్ధము. ఆయర్థము వాస్తవము కాదుగదా. అట్లే మానుష వేషము కార్యార్థమే యనియు, నట్టిపరమేశ్వరుఁడగు రాముని తోడ సంబంధమునుబొందినదని యెఱింగిరి. చంద్రునకుఁ బ్రియ పత్ని రోహిణియని ప్రసిద్ధము. అట్లే రామునకు హృదయప్రియ సీతయగును. ఈమాటలు రాజమార్గమునఁ బోవుచున్న రాముఁ డాలకించెను. ఆవాక్కులు "ప్రియాః" ప్రియములైనవి. అనఁగా రామునిహృదయానందకారిణి సీత యన్నమాటలు రామునకు హృదయప్రియములయ్యెనని భావము. లోకము నందుఁ బతివ్రత యనుఖ్యాతిఁ గాంచినభార్యయందు భర్తకు

మహాప్రీతి గలుగుట కనంబడును. ఆయాచారము ననుసరించియే రామమూర్తి యానందించునని తాత్పర్యము.

"ఏష శ్రియం గచ్ఛతి రాఘవోఽద్య రాజప్రసాదాద్విపులాం గమిష్యన్
ఏతే వయం సర్వసమృద్ధకామా యేషామయం నో భవితా ప్రశాస్తా.
లాభో జనస్యాస్య యదేష సర్వం ప్రపత్స్యతే రాష్ట్రమిదం చిరాయ
న హ్యప్రియం కించన జాతు కశ్చిత్పశ్యేన్న దుఃఖం మనుజాధిపేఽస్మిన్."

అని మూలము. సామాన్యార్థముగాక విశేషార్థముఁ బరికింతము. రాముఁ డరుగుచుండఁ జను లాడుకొనుమాటలే యిందుఁ గలవు. "ఏష రాఘవః అద్య రాజప్రసాదాత్ శ్రియం గమిష్యన్ విపులాం ప్రతి గచ్ఛతి" ఈ రామమూర్తి దశరథుని యనుగ్రహము వలన శ్రీదేవిని బడయుటకుఁగోరి భూమినిగూర్చి పోవుచున్నవాఁడు. అనఁగా భూమిని దిరుగఁ బోవుచున్నాఁడు. మహాలక్ష్మి యగు సీతను లోకదృష్టిచే రావణునింట నున్నయట్లుండఁగా వానిని జయించి తేఁబూని యరుగుచున్నాఁడని భావము. ఇప్పుడే పోవుచున్నాఁడు. అనుటంజేసి సత్వరమే యీయాత్ర సాగునని రహస్యము. దశరథునను గ్రహము లేకయున్న నీపని సాగదు కదా. లోకోపకారమునకై యెంతయు నెన్ని దుఃఖము లనుభవించినను దుదకు సుఖము చేకూరును. కాన నయ్యది ప్రసాదమే యగును. దశరథుఁ డిష్టములేక పలికినను రామున కయ్యది యనుగ్రహమే యగును. తండ్రియానతి లేకపోఁగూడదు. కానఁ దనయవతారఫలము రాజానుగ్రహమూలము కానవలెనని కాంక్షింపవలసివచ్చెనని భావము. ఈయాశయము దృఢపఱచుటకే మహాకవివాల్మీకి "అయం నో భవితా ప్రశాస్తా" యని ప్రయోగించెను. ఈరామమూర్తి మనకు రాజు కాఁగలఁడు. రాక్షస

సంహారము ధర్మసంస్థాపనము నను రెండుమహాకార్యము లొనరించి పిదప మనకుఁ బాలకుఁడగు ననునదియే యిటఁగలవిశేషము. పట్టాభిషేకము నాఁడే సాగునట్టిలక్షణములు కనఁబడలేదు. కాన నీయూహా వారికింగల్గుట యసమంజసము కాదు. ఈయర్థము. 'చిరాయ' అనుపదము సార్థకముచేయుచున్నది. చాలకాలమునకని యర్థము చెప్పవలయును. పెక్కువత్సరములకు రాముఁడు రాజ్యమును బొందును. మనకు సర్వలాభములు చేకూరును. ఎవ్వనికి నప్రియము కలుగదు. అనిష్టము సంభవింపదు. అనఁగా ధర్మసంస్థాపనానంతరము అకాలమరణాదులు క్షామాదిబాధలు కలుగవు. కావుననే రామరాజ్యమని జగద్విఖ్యాతి గల్గెను. సర్వజనానందకరుఁడగుట నాకాలమున నెవ్వరికి నేబాధలు కలుగవు. ఈవిశ్వాస మాప్రజలకుం గల్గెను. ఏల? భగవత్సంకల్పము సర్వభూతసంకల్పమే యగును. సకలభూతాంతర్యామికదా పరమేశ్వరుఁడు. కావున నామహానీయునిసంకల్పమే యెల్లరసంకల్పముగాఁ బరిణమించును. ఇట్టు లీభాగము భగవత్తత్త్వమును బ్రతిపాదించుచున్నది. దీనిం జక్కఁగాఁ బరిశీలించితిమేని సీతారాములసంకల్పము లెట్టివో తెలియఁగలవు. కైంకర్యోనగువారి కెట్టియధికారము గలదో తేటపడును. ఇఁకఁ దరువాతికథను బరిశీలింతము.

రామచంద్రుఁడు తండ్రిని దర్శించుట.

శ్రీరామచంద్రుఁడు రాజమార్గమునఁ బోవుచుఁ బట్టాభిషేకమహోత్సవములఁ దగియున్న యయోధ్యాపురమునుగాంచెను. అందు జనులసందడి వచింపనలవిగాకుండెను. అలంకారములు

* ఇది పదునేడవ సర్గమునఁ గలదు.

కన్నులపండువు చేయుచుండెను. రాజమార్గమున రాసులుగాఁ బోసియున్న యమూల్యవస్తువులం గాంచి జనము హర్షించెను. ప్రతిగృహముముంగిలియుఁ జక్కఁగా నలంకరింపఁబడి పూవులు పేలాలు లోనగుశుభద్రవ్యములు చల్లఁబడి ప్రకాశించుచుండెను. తన్నుం గాంచి సుహృజ్జనులు పలుకు నాశీర్వచనవాక్యముల నాలకించుచు వారివారిం దగినరీతి గౌరవించుచు రామమూర్తి తండ్రిని జూచుకౌతుకమునఁ బోయెను. మిత్రులు రాముంగని నీవిపు డభిషిక్తుఁడవై పూర్వులు పాలించుచుండినవిధమున మనుష్యుల రక్షింపుము. నీరాజ్యమున మేమెల్ల నీపూర్వులయేలుబడి యందుఁ గాంచుసుఖమును మించినసుఖమును గాంతుము. అను మాటలను రాముఁ డాలకించెను. మఱియుఁ గొందఱుమిత్రులు భోజన మిపుడేల? భోగములు జపహోమాదిపురుషార్థములు నిపుడు చాలును. రామచంద్రుఁడు రాజ్యాభిషిక్తుఁడై మరల సౌధమున కరుగునపుడు కన్నులపండువుగాఁ జూతము. పట్టాభిషిక్తుఁడు రాముఁడగుట మాకెంత ప్రియమో యంత ప్రియమగునది మఱొక్కటియు లేదు. అని తమలోఁ దాము చెప్పుకొను చుండఁగా నాలకించుచు ననుత్సుకుఁడై పోయెను. పురజనులలో నొక్కఁడైనను రామమూర్తి యనుగుమోఁ గనుచుఁ గాలము మీఱఁ గడచిపోయినను దదీయజగన్మంగళకరరూపమున నాసక్తమై యుండుమనస్సును నేత్రములను మరలించుకొన శక్తుఁడుగాక యుండెను. రామునిసన్నిధి నున్నవారేమని పలుకుదురో వచియింపనేల? ఇంకఁ గాంతామణులమాట యిటఁ బలుకనేటికి? ఎవ్వాఁడు రామచంద్రుని దర్శింపకుండునో రామమూర్తి యెవ్వనిఁ జూడకయుండునో వాఁడు సర్వజననిందితుఁడై య

గును. వానియాత్మయు నతనిదూషించును. రామమూర్తి ధర్మాత్ముఁడు. కనుక నాల్గువర్ణములవారలయందు వారివారియోగ్యతకుఁ దగినట్లు కృపచూపుచుండును. వారెల్ల నారాము నను సరించియే యుందురు.

అంత నారామమూర్తి దేవాలయములు లోనగువానికిఁ బ్రదక్షిణముగాఁబోయి యంతఃపురముం జేరి యందు దశరథుఁడు నివసించుమందిరమును బ్రవేశించెను. ఆగృహవరము కైలాసపర్వతముతో సమానమై వివిధవిచిత్రముల నలరారుచుండెను. అనల్పశిల్పముల నలరారుగృహములు నందుఁ గనుపట్టుచుండెను. అమరేంద్రునిసౌధముభంగిఁ జెలువారు జనకునిగృహవర్యమును శ్రీరామమూర్తి ప్రవేశించెను. మూఁడు కక్ష్యలు రథముమీఁదఁ గూరుచుండియే దాఁటి యవ్వల రథము దిగి తరువాతికక్ష్యాద్వయము కాలినడకతోఁ బోయి కక్ష్యాంతరములెల్ల దాఁటి తనవెంటనున్న వారల మరలించి యంతఃపురమునకుఁ దాఁ బోయెను. రామునివెంటఁ బోయినవారెల్లరు మరలి రామమూర్తి యెపుడరుదెంచునో యని సాగరము చంద్రోదయమును గోరుచందమున నెదురుచూచుచుండిరి.

మహాత్ములారా! ఈభాగమునఁ గొన్నివిశేషములు గలవు. వానిం బరిశీలింతము.

"ఆశీర్వాదాన్ బహూన్ శృణ్వన్ సుహృద్భిస్సముదీరితాన్,
యథార్హాం చాపి సంపూజ్య సర్వానేవ నరాన్ యయౌ." ౭

అని మూలము. సన్మతులు తనకు మేలుగలుగ నాశీర్వదించుచుండఁగా వినుచుఁ దగినరీతి వారల గారవించుచు రామమూర్తి యరిగెను. అనఁగా వారియూహలు మంచివియే యై

నను దనకార్యము నెఱుంగఁజాలక పలుకుచున్నారే యని తలంచి వారివారిని దగినయట్లు సత్కరించి అనఁగాఁ గొందఱ నంగని శిరఃకంపనముగావించి, కొందఱ దోసిలొగ్గి ప్రార్థించి, కొందఱఁ గనుసన్నలచే గారవించి, యందఱ కన్ని రూపుల సమాధానమగునట్లుచేసి యరిగెను. దీనింబట్టి యాలోచింపఁగా నొకవిధమగు కర్మముకాని, యొకవిధమగునాచారముగాని, యొకవిధమగుమర్యాదగాని యందఱకుం బనికిరాదని యేర్పడుచున్నది.

"చతుర్విధా భజంతే మాం జనాస్సుకృతినోఽర్జున,
ఆర్తో జిజ్ఞాసురర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ. ౧౬
తేషాం జ్ఞానీ నిత్యయుక్త ఏకభక్తిర్విశిష్యతే,
ప్రియోహి జ్ఞానినోఽత్యర్థమహం సచ మమ ప్రియః." ౧౭
(గీత. ౭. అధ్యా.)

అను నీగీతాశాస్త్రము ననుసరించి పక్షపాతశూన్యుఁడగుటచే, భగవంతుఁడు కర్మానుసార న్యాయాయుపాయల కాయాయిఫలముల నిచ్చుననియు, నొకరీతిగా నేల యీయఁడను ప్రశ్న మసంగతమనియు నెఱుంగవలయు. దీనింబట్టి కర్మసిద్ధాంత మప్రతిహతమని యేర్పడియెడు. కర్మముల మానితిమనువారెంత జ్ఞానులో యెఱుంగవలయును.

"పితామహైరాచరితం తథైవ ప్రపితామహైః,
అద్యోపాదాయ తం మార్గమభిషిక్తోఽనుపాలయ. ౧
యథాస్మ లాలితాః పిత్రా యథా పూర్వైః పితామహైః,
తతస్సుఖతరం రామే వత్స్యామస్సతి రాజని. ౯
... ...
పితాశ్చాస్యాశ్చ సుహృదాముదాసీనః కథాశ్శుభాః

ఆత్మసంపూజనీశ్శృణ్వ౯ యయౌ రామో మహాపథం.'' ౧౩
అని మూలము. పెద్దలు త్రొక్కినమార్గమునే యాశ్రయించి యభిషిక్తుఁడవై మమ్ముఁ బాలింపుమా. తాతలు ముత్తాతలు నాచరించినమార్గము నిపుడు గ్రహింపుము. "అద్యోపాదాయ" అని మూలము. అనఁగా మీపెద్దలు పట్టాభిషిక్తులై దిగ్విజయము చేసి యశస్సు నార్జించిరి. ఆమార్గము నీవిపుడే యాశ్రయింపుము. తర్వాతఁ బట్టాభిషిక్తుఁడవై మమ్ముం బాలింపుము. అని వారిమాటలు రామమూర్తి ప్రయాణమునకుఁ దోడ్పడెనని యెఱుంగందగు. రాముఁడు రాజు కాఁగా దశరథాదులచే లాలింపఁబడుటకంటె మిక్కిలి సుఖము గాంతుము. అనఁగా నిపుడు వగలఁబొగిలినను ముందు రామమూర్తి పాలకుఁడు కాఁగా సుఖపడుదుమని వారినోట వాల్మీకిమహర్షి పలికించెనని యెఱుంగందగు. ఈలోనగుశుభకరములుఁ దన్ను గారవించునవియు నగుకథల నాలకించుచు నుదాసీనుఁడై రాముఁడరిగెను.

''న మాం కర్మాణి లింపంతి న మే కర్మఫలే స్పృహా,
ఇతి మాం యోఽభిజానాతి కర్మభిర్న స బధ్యతే.'' ౧౪
(గీత. ౪ అధ్యా.)

అన్నభగవద్గీతావాక్యము ననుసరించి నిర్లిప్తుఁడుకాన నాత్మప్రశంసాగాథల నాలకించుచు నించుకంతయు మార్పునొందక యరిగెను. ఈమాటలు ఫలించుకాల మిది కాదని యెఱింగిన ప్రోడ గావున నిర్వికారుఁడై యరిగెనని యర్థము. రావణాది దుష్టరాక్షసవధ మామహాత్మునకుం గ్రొత్తది కాదనియు నెఱుంగందగు.

"యశ్చ రామం న పశ్యేత్తు యం చ రామో న పశ్యతి,
నిందితస్స వసేల్లోకే స్వాత్మాప్యేనం విగర్హతే."

అని మూలము. ఇందు విశేషార్థ మరయుదము. భూభారహారణార్థ మవతరించినభగవంతుఁడు తనపూన్కి నెఱవేఱుసమయము వచ్చినదనుమహాహర్షమునఁ బొంగుచుండఁగా నాపరమాత్మ నేవాఁడపుడా రాజమార్గమునఁ జూడలేదో, ఆపరమేశ్వరుఁ డేవానిపై దృష్టి నిగుడింపలేదో (అనఁగాఁ దనకరుణకుఁ బాత్రునిగా భావింపలేదో యని యర్థము) అతఁడు సుజనులచే నిందింపంబడును ఆతనిమనస్సే యతని నిందించును. ప్రకృత్యతీతుఁడగుపరమేశ్వరునిం జూడఁగనము కాదు. కాన నాతని నేవాఁడును రూపవంతునిగాఁ జూడఁజాలఁడు. ప్రకృతిం గూడి ధర్మరక్షణార్థము సగుణబ్రహ్మముగా నవతరించెను. అట్టి రామచంద్రుఁ డెల్లరకు దర్శనమియ్యఁగోరి రాజమార్గమున నరుగుచుండఁగాఁ గన్నులారఁ గాంచఁజాలనివాఁడు సుకృతాత్ముఁడు కాఁడు. అట్టివాఁడే పాపాత్ముఁడు. వానిదృష్టి భగవంతుని గాంచఁజాలదు. భగవంతుఁడుసూడ నాపాపుని జూడఁ దమకింపఁడు. అట్టివాని సాధుజనులు నిందింపకయుందురా.

"అవజానంతి మాం మూఢా మానుషీం తనుమాశ్రితం,
పరం భావమజానంతో మమ భూతమహేశ్వరం. ౧౧
మోఘాశా మోఘకర్మాణో మోఘజ్ఞానా విచేతసః,
రాక్షసీమాసురీం చైవ ప్రకృతిం మోహినీం శ్రితాః. ౧౨
మహాత్మానస్తు మాం పార్థ దైవీం ప్రకృతిమాశ్రితాః,
భజంత్యనన్యమనసో భూత్వా భూతాదిమవ్యయం. ౧౩
సతతం కీర్తయంతో మాం యతంతశ్చ దృఢవ్రతాః,

నమస్యంతశ్చ మాం భక్త్యా నిత్యయుక్తా ఉపాసతే. ౧౪
జ్ఞానయజ్ఞేన చాప్యన్యే యజంతో మాముపాసతే
ఏకత్వేన పృథక్త్వేన బహుధా విశ్వతోముఖమ్.” ౧౫

(గీత. ౯ అధ్యా)

అనుగీతావాక్యముల ననుసరించి పరికింపఁగా నీమూలమునఁ గలసార మెఱుంగంబడు. భగవద్రూపమని కాక యగ్నిహోత్రముల నారాధించువారు నిష్ఫలకర్ము లనఁబడుదురు. లోకమున నెవ్వారు భగవద్రూపమని కాక యగ్ని నారాధింతురో వారు రాక్షసీప్రకృతినాసురీప్రకృతి నాశ్రయించినవారు. అనఁగా నట్టివారల నామహాప్రకృతి దుర్మతులనుగా నొనరించును. భగవద్రూపముగ దేని నారాధించినను వారు మహాత్ములనంబడుదురు. వారిని మహామాయ మహాత్ములనుగా నొనరించును. అట్టివా రేకమనస్కులై యవ్యయుండగు భగవంతు నారాధింతురు. అనఁగా వారు నిరంతరము తదారాధనకుతూహలు లగుదురని భావము. జ్ఞానయజ్ఞమునఁ గొంద ఱాపరమాత్మ నారాధింతురు. ఏకత్వమునఁ గొందఱు,పృథక్త్వమునఁగొందఱు ననఁగా సర్వభూతాంతర్యామియగువానిని గొంద ఱుపాసింతురు. సూర్యాదిదేవతాభేదమున నాభగవంతునే గొంద ఱుపాసింతురు. సూర్యరూపమున భగవంతుఁడే వెలసెనని యారాధింతురని భావము. దీనఁగలసార మేమి?

సత్కర్మముల నాచరించువారి నామూలప్రకృతి భగవంతుని జక్కనిమార్గమున నారాధింపఁజేయును. ఫలాభిసంధిని గర్మముల నాచరించువారి నాప్రకృతియే భగవంతు నెఱుంగకయుండఁజేయును. అనఁగా నవిధిగా వారిని భగవంతుని బూ

జించువారినిగాఁ జేయును. భగవత్తత్త్వము నెఱుంగనివారినిగాఁ జేయునని భావము. ఎవ్వరుగాని ప్రకృతిని మీఱితే భగవంతు నారాధింపఁజాలరనియేకదా గీతాశాస్త్రాశయము. దీనింబట్టి యూహింపఁగాఁ బ్రకృతికృపకుఁ బాత్రుఁడు కానివాఁడు భగవంతు నెఱుంగంజాలఁడనియే తేలెడిని. ఈయర్థమునే శంకర భగవత్పాదులు సౌందర్యలహరియందు,

"హరిస్త్వామారాధ్య ప్రణతజనసౌభాగ్యజననీం
పురా నారీభూత్వా పురరిపుమపి క్షోభమనయత్,
స్మరోఽపి త్వాం నత్వా రతినయనలేహ్యేన వపుషా
కవీనామప్యంతఃకరణమపి మోహాయ మహతాం."

అని తేటపఱచిరి. గీతాశాస్త్రము నమ్మినవారు దీని నేల నమ్మరో తెలియఁజాలకున్నాను. వారు రాక్షసీప్రకృతియు నాసురీప్రకృతియుఁగలవారలై యుండవలయుఁగదా. త్రిమూర్తులు ప్రకృతిబద్ధులై యుండఁ దక్కినక్షుద్రదేవతలు లోనగువారిమాట యిటఁ జెప్పనేటికి? తొలుత నామహామాయ నారాధించి తదనుగ్రహపాత్రులై భగవంతు నారాధింపవలయును. అట్టివారలకే చక్కనిమార్గము దొరకును. లేనిచో నేదో యొకమార్గము దొరకును. అది యధఃపతితునిగాఁ జేయుననిసారము. శ్రీరామమూర్తి రాజమార్గమున నరుగుచుండఁగాఁ గన్నులుండియుఁ జూడనివాఁ డాసురీప్రకృతియు రాక్షసీప్రకృతియుఁగలవాఁడు. వానినెల్లరు దూషింపకపోరు. వానియాత్మయే వాని నాక్షేపించును. రామునిదృష్టి యెవనిపై వ్యాపింపలేదో వాఁడు దుష్కృతియేయగునని మన మెఱుంగవలయును. సత్కర్మముల నాచరించినవారు పరమేశ్వరుం జూతురు. వారి నాపరమాత్మయుం జూచు

ననియే యీభాగమున మన మెఱుంగవలయును. నేత్రసాఫల్యము భగవద్దర్శనమనియుఁ బుణ్యకర్మఫలము భగవత్కరుణాపాత్రుఁడగుటయే యనియు నీభాగము మనకుఁ దెల్పుచున్నది.

"సర్వేషాం హి స ధర్మాత్మా వర్ణానాం కురుతే దయాం,
చతుర్ణాం హి వయస్థానాం తేన తే తమనువ్రతాః." ౧౫

అని మూలము. నాల్గువర్ణములవారికిని వయోభేదముల ననుసరించి ధర్మాత్ముఁడుగాన నారామమూర్తి దయఁజూపును. కాన వారెల్లరు నాతని ననుసరించిరి. అనునది సామాన్యార్థము. వాల్మీకిమహర్షి భగవత్ప్రసాదము నీశ్లోకరూపమున మనకెల్లరకు బోధించెను. ఇందు "చతుర్ణాం వర్ణానామ్" అనువాక్యమున సంఖ్యాబోధకపదమునకు నుపలక్షణవిధి ననుసరించి తదితరమానవులకునని యర్థము చెప్పవలయును. ఏలయనఁగా

"సమోఽహం సర్వభూతేఽషు న మే ద్వేష్యోఽస్తి న ప్రియః,
యే భజంతి తు మాం భక్త్యా మయి తే తేషు చాప్యహం. ౨౯

అపి చేత్సుదురాచారో భజతే మామనన్యభాక్,
సాధురేవ స మంతవ్యస్సమ్యగ్వ్యవసితో హి సః. ౩౦

క్షిప్రం భజతి ధర్మాత్మా శశ్వచ్ఛాంతిం నిగచ్ఛతి,
కౌంతేయ ప్రతిజానీహి న మే భక్తః ప్రణశ్యతి. ౩౧

మాం హి పార్థ వ్యపాశ్రిత్య యేఽపి స్యుః పాపయోనయః,
స్త్రియో వైశ్యాస్తథా శూద్రాస్తేఽపి యాంతి పరాం గతిం. ౩౨

కిం పునర్బ్రాహ్మణాః పుణ్యా భక్తా రాజర్షయస్తథా,
అనిత్యమసుఖం లోకమిమం ప్రాప్య భజస్వ మాం." ౩౩

(గీత ౯ అధ్యా.)

అను నీభగవద్గీతావాక్యము లీవిషయమునే తెలుపుచున్నవి. విమర్శింపుఁడు.

భగవంతుఁడు సర్వభూతసముఁడు. ఆమహాత్మున కొకఁడు మిత్త్రుఁడని, యొకఁడు శత్త్రుఁడని చెప్ప నలవిపడదు. భక్తితో నెవరు సేవింతురో వారి నాతఁ డుద్ధరించును. దురాచారుఁడైనను బూర్వకర్మవశమున నాతనియందే భక్తిగలిగి పరమేశ్వరు సేవించిన నాతఁడు సజ్జనుఁడే యగును. అనఁగా భగవంతుని యందు భక్తిలేనివాఁడే దురాచారుఁడని, అదిగలవాఁడే సాధుజనుఁడని భావము. ఏజాతియందైన నీచగుణము నుండ వచ్చునుగదా. నాభక్తున కపాయములేదనఁగా నానాగనరక ప్రాప్తిలేదనికదా భావము. వాఁడు మృతినొందఁడని కాదుగదా. పాపయోనులుకూడ నన్నాశ్రయించి ముక్తినొందుదురనఁగా భావమేమి? ఒక్కవర్ణమువారికే ముక్తిగలదని వేఱొకవర్ణము వారికి ముక్తిలేదని కాదు. పరమేశ్వరు నారాధించువారి కెల్ల ముక్తికలదనియే సారము. జ్ఞానులగువారలకు ముక్తిదొరకు టబ్బురమా యనఁగా వారి కది కరతలామలకమే యని భావము. అను నీగీతావాక్యసారమే రామాయణమున నీశ్లోకమునఁ గలదు.

శ్రీరామమూర్తి యెల్లజాతులవారలకు వయోధర్మము ననుసరించి దయ నెఱపును. కాననే వార లాతని ననుసరించి యుందురు. అనఁగా భావమేమి? వారువారు చేసినకర్మములు వయోధర్మము ననుసరించి ఫలమొసంగును. అదియే భగవంతుని దయ. ఎట్లనఁగా సర్వసాక్షి, నిర్లిప్తుఁడు నగుభగవంతుఁడు సత్కర్మముల నాచరించినవారలకు భక్తి లోనగు మంచిఫలముల నొసంగును. వయోధర్మము ననుసరించి సుఖాదుల నొసంగును. అయ్యవి విధివిహితముగ వార లనుభవింతురు.

దుష్కర్మముల నాచరించినవారలకు నాస్తికత్వము లోనగు నశుభ ఫలముల నొసంగును సుఖాదులను వారు విధివిరహిత ముగా ననుభవింతురు. అనఁగాఁ గర్మమే ఫలము నిచ్చును. సత్కర్మాచరణపరాయణులపై భగవత్కరుణ వ్యాపించును. భగవద్దృష్టిచే నందఱు సమానులే. కాని ఫలానుభవ మొక్క రీతిగాదు. దీనింబట్టి భగవంతునకుఁ బక్షపాతముకలదనరాదు. సూర్యకిరణములు సర్వత్ర యొక్కరీతిగా వ్యాపించును. స్థలభేదము ననుసరించి నిర్మలముగాను, మలినముగను గనం బడురీతి, సత్కర్మరతులయందు సత్ఫలరూపముగను, దుష్కర్మా చరణపరాయణులయందు దుష్ఫలరూపముగను భగవద్దయ వెలయుననని భావము. కర్మము ఫలము నొసంగునదియనియు, సర్వద్రష్ట భగవంతుఁడనియు నెఱుంగుట మంచిది.

"చతుష్పథాన్ దేవపథాంశ్చైత్యాన్యాయతనాని చ,
ప్రదక్షిణం పరిహారన్ జగామ నృపతేస్సుతః." ౧౬

అని మూలము.

"యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః,
స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే."

అన్నగీతాశాస్త్రము ననుసరించి శ్రీరామమూర్తి సదాచార మును మానవులకు నేర్పెనని మన మెఱుంగవలయును. నాల్గు త్రోవలుకలిసిన చోటులు లోనగువానికిఁ బ్రదక్షిణముగా రథమును బోనిచ్చెననఁగా నాచోటులయందు మానవులు నిలు వఁబడు నవకాశము లేర్పడియుండుననియుఁ, బదుగు రుండు తావులు పవిత్రములనియు, వానికిఁ బ్రదక్షిణము చేయుట యనఁగాఁ బవిత్రస్థానములు భగవత్స్వరూపములుగా భావింప

వలయుననియు లోకులకు నేర్ప శ్రీరాముఁ డట్లు ఆచరించెను. లేకున్న

"న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన."

అనుగీతయందుఁ గలభగవదుక్తి వ్యర్థమగును. ఈరీతిగనే శ్రీరామమూర్తి సదాచారములను మనకు నేర్పెనని యెఱింగి మనము భగవదుపదేశముగా భావించి యట్లు ఆచరింపవలయును. ఇట్టివిషయములు తెలిసికొన్నంతమాత్రమునఁ జాలవనియు, వానిని జక్కఁగా నాచరింపవలయుననియు నిశ్చయించి, యవకాశమున్నంతవఱకు వాని నభ్యసింపవలయును. ఈభాగ మీరీతిగా మన కనేకనీతులను బోధించుచున్నది. కావున మన మీభాగమును బఠించి రామచంద్రుని యనుపమానసదాచారముల నెఱింగి వాని నిరంతరము తలంచుచు నవకాశము గలిగినంతవఱకు నభ్యసింపవలయును. ఇఁకఁ బరువాతికథను బఠింతము.

కైక రామునకుఁ దానడిగినవరములఁ దెల్పుట.

* శ్రీరామచంద్రుఁ డంతఃపురమున కరిగి తండ్రిని దర్శించెను. అపుడు దశరథుఁడు మోము వెలవెలపోవఁగాఁ గరము దీనుఁడై మంచిమంచముపైఁ గూరుచుండి యుండెను. కైకయు నతనిచెంతనే యుండెను. దశరథుం గాంచి భక్తిశ్రద్ధలు వెలయ నతనిపాదములు విధిగా నమస్కరించి వెంటనే తల్లిపాదములకు నమస్కరించెను. ఆమహారాజు దుఃఖముప్పొంగుచుండ శ్రీరామా! యనిమాత్రము పలికి యశ్రుజలములు

* ఇది పదునెనిమిదవ సర్గమునఁ గలదు. అధ్యాత్మరామాయణసారమిందుఁ జేరియుండును.

కన్నులంగ్రమ్మఁగా దుఃఖము భరింపరామిఁ గొడుకుంజూడఁ గాని మాటలాడఁగాని శక్తుఁడుగాక యుండెను. తండ్రికిఁ దానెఱింగినంతవఱకు నెట్టిదంపుదుఃఖ మింతవఱకు నిట్టిది రామి దానిం గాంచి రాముఁ డెట్టిభయమునకు లొంగనివాఁడయ్యు సర్పమును బాదమున స్పృశించినట్లే భయంపడియెను. అట్టితఱి దశరథుఁడు దుఃఖసంతాప మింద్రియములఁ గుదియింప వేఁడి నిట్టూర్పులు పుచ్చుచు, మనోదార్ఢ్యము తప్పిపోఁగాఁ దరంగ ములు చెలరేఁగనున్న సాగరమువలె, మహాతేజస్సుగలవాఁ డయ్యు రాహుగ్రస్తదివాకరునివలె, నిర్మలాంతఃకరణుఁడయ్యు ననృతములుపలికిన మహర్షిభంగి నుండఁగా రాముఁడు భయ పడియెను. అప్పుడు తండ్రి కట్టిదారుణదుఃఖము కలుగుటకు విచారించి పూర్ణిమయందు సాగరమురీతిఁ గలఁతనొందెను. పితృభక్తిపరాయణుఁడు కావున రాముఁడు తనలో నాతండ్రి కోపముతోనున్నపుడు నన్నుం గాంచినంతనే ప్రసన్నుఁడగును. నేఁడేటికో నన్నుంజూచియు సంతుష్టుఁడుగాకయున్నవాఁడు. అంతియగాక వగచుచున్నాఁడు. అని యూహించి వగపున మోము వెలవెలపోవఁగాఁ గైకకు వందనమిడి అమ్మా! ప్రమాద మున నేనేయపరాధము చేయలేదుకదా. నాతండ్రి యేల కోప గించియున్నాఁడో దానికిం గలకారణము నాకెఱిఁగింపుము. తల్లీ! నీవే యీనాతండ్రివిచారముం దీర్పుము. తండ్రి నాయందు నిరంతరము వాత్సల్యముగలిగియే యుండును. అట్టిరాజిత్తరుణ మున మనస్సుకలఁగఁ బ్రసన్నుఁడుగాక మోముకాంతి క్షీణింప నాతో మాటలాడకున్నాఁడే. ఏల? శరీరవ్యాధిగాని మనశ్చిం తగాని లేదుగదా! మానవులకు సర్వదా సుఖమే కలుగుట

యరుడుసుమా. కావున ననుమానించెదను. నాసోదరుఁడు భరతుఁడు దర్శనీయాకృతిగలవాఁడు అనుమానమునకు నమంగళ మేదియు లేదుకదా. బలవంతుఁడగుశత్రుఘ్నునకుఁగాని, నామాతలలో నెవరికిఁగాని యశుభ మొక్కండును లేదుకదా. నాతండ్రికి సంతోషమును గల్గించుకార్యము చేయక, యాతని యాజ్ఞ చేయక యొకఘటికమాత్రమైన జీవింపనొల్లను నాతండ్రియే కోపమొందిన నావ్యథ వచింపఁదగునా.

మానవుఁ డీజగమున జన్మించుట కెవ్వాఁడు హేతువని తెలియునో యట్టిసాక్షాద్దైవమై యుండునాతండ్రికి నేరీతి వశుఁడై వర్తింపక యుండును? తల్లీ! నీవు ప్రియురాలనని గర్వించి కాని కోపమొందిగాని నాతండ్రితో నతినిచిత్తము కుందునొందునట్లు పరుషోక్తులు పలికియుందువా?. ఎన్నఁడు లేని యీవికార మీరాజునకు నేఁడేల కల్గినది? ఎఱుంగఁగోరుచున్నాఁడను. ఉన్నదున్నయట్లు వచింపుమా. అని ప్రశ్నించెను. మహాత్ముఁడు రాముఁ డీరీతిఁ బ్రశ్నింపఁగాఁ గైక విని భర్తను దుఃఖము నిడఁజాలుపలు కెట్లు చెప్పవచ్చునని కొంచెమైన సిగ్గుపడక నీవడవులకుం బొమ్మని యెట్లు చెప్పుదునా యని సంశయింపక తనవాంఛిత మెట్టులైన నెఱవేర్చుకొనంబూని రామునితో నిట్లు పలికెను. శ్రీరామా! రాజున కిపుడు కోపము లేదు. వ్యసనముకూడ లేదు. మనస్సున నీతండ్రి కొక్కకోరిక కలదు. ఆకోరికం దెల్పిన నీవేమని తలంతువో యనుభీతిని దానిం జెప్పకయున్నాఁడు. నీయందు మిక్కిలి ప్రీతికలదు. కాఁబట్టి యప్రియవార్తం దెల్పుటకు రాజు జంకుచున్నాఁడు నీతండ్రి యేకార్యము చేయఁ బ్రతినచేసెనో యాకార్యము నీవు తప్పక

చేయవలయును. నీతండ్రి సత్యవ్రతపరాయణుఁడు. అట్టివాఁ డౌట నీరాజు పూర్వము నన్నుఁ గృతజ్ఞతంగొని వరమొసఁగి గారవించెను. ఇపుడు వరమడుగ నన్నృతవాదియగుపామరుని వలె వగచుచున్నాఁడు. వరమిత్తునని శపథముచేసి జలము పోయినవెనుక కట్టనుగట్టఁగోరుచందమున నిపుడేల శపథము చేసితినని నిరర్థకముగా వగచుచున్నాఁడు. రామచంద్రా! సత్యము ధర్మమే మూలమని పూజ్యులందఱు పలుకుదురు. కాఁబట్టి యీరాజు నీకొఱకు నాపైఁ గోపమూని సత్యరూప ధర్మమును విడువకుండునట్లు చేయుము. రాజవాక్యము నీకు మేలుగాని కీడుగాని నీవుమాత్రము చేయనొప్పినచో నేను దానింజెప్పెదను. రాజుపలుకు నీయందు నిష్ఫలముగాక సార్థక మగునేని దాని నేను జేయుదునని నీవు ప్రతినచేయుదువేని రాజునకుమాఱుగ దాని నేనే తెలుపుదును. రాజేల పలుక రాదని యూహింపకుము. నీమోము చూచి యామాటఁ జెప్ప జంకుచున్నాఁడనియెను.

కైకపలికినవిషయము నాలకించి రామచంద్రుఁడునాయం దిట్టిసంశయము మీమెకుఁ గలిగెనే యని దుఃఖించి రాజసన్నిధి నాకైకం గాంచి యక్కటా! నాజీవితమేల? తల్లీ! నన్నిట్లన రాదు. రాజాజ్ఞయే యైన నగ్నిలోఁ బడుదును. తీవ్రవిషముం ద్రాగుదు. సాగరమునఁ బడుదును. ఈతఁడు నాకు గురువు. తండ్రి. అంతియకాక ప్రభువు. నాహితమును గోరువాఁడు. ఇట్టి యీమాన్యుఁ డాజ్ఞాపించిన దేనినైనఁ జేయఁజాలనందునా! కావున జననీ! రాజవాంఛితము నెఱిఁగింపుము. దాని నొన రింతును. చేయువాఁడనని శపథముచేయుదును. రాముఁడు

ద్విజిహ్వుఁడు కాఁడని నమ్ముము. మొదటఁ జెప్ప మరలఁ జెప్ప లేదనఁడని పల్కెను.

కైక పూజ్యురాలు కాదు. కావున నించుకయుఁ గపటము లేక సత్యవాది యగు రామునిం గని కరము భయంకరముగా నిట్లు పలికెను. రామభద్రా! తొల్లి దేవాసురసంగ్రామము సాగుచుండ నాతరుణమున మీతండ్రి యొడలెల్లఁ దీవ్రనారాచసాంద్రమై సొమ్మసిల్లఁగా నాబాణములఁ దొలఁగించి యుపచారము లొనరించి కాపాడితిని. అందులకై నా కీరాజు రెండువరము లొసంగెను. ఆవరములకు భరతునకుఁ బట్టాభిషేకము కావలయుననియు, నిన్నిపుడే దండకారణ్యములకుఁ బంపవలయుననియు రాజును గోరితిని. నరశ్రేష్ఠా! నిన్ను నీజనకుని సత్యప్రతిజ్ఞులనుగాఁ జేసికొన నూహింతువేని నామాట నాలకింపుము. నీవు పిత్రాజ్ఞయందు స్థిరుఁడవు కమ్ము. నాకతఁడు ప్రతిన చేసినట్లు పదునాలుగువత్సరములు దండకారణ్యముల నుండవలయును. రామా! నీయభిషేకమునకై రాజు సేకరించినపదార్థములంగొని భరతునకే పట్టాభిషేకము చేయవలయు. నీ వీమహోత్సవము వదలి దండకాటవిని జడలు కృష్ణాజినమును దాల్చి నివసింపుము. భరతుఁ డీనగరమున నుండి ప్రాజ్యమగు రాజ్యమును బాలించుచుండుఁగాక. ఈవరద్వయ మొసఁగు హేతువునుబట్టి నీపై మిక్కిలి దయయుంచినందునఁ బ్రియపుత్రకుని నిన్ను వనములకుఁ బంపవలసివచ్చెనే యని దుఃఖమున మొగము వేలవైచుకొని నిన్నుఁ గననైనఁ జాలకున్నవాఁడు. రఘుకులమున జనించినవాఁడవు. రాజువాక్పూర్తి నొనరింపుము. సత్యవాక్పరతుఁడవై రాజు నసత్యదోష

రహితునిగా నుద్ధరింపుమని కఠినముగాఁ బలికెను. ఈరీతిగా నా నారీమణి కఠినవాక్కులు పలుకుచుండఁగా రామునకు శోక వికారచిహ్నములు గలుగకయుండెను. అంతరంగమునందును దుఃఖము పొడసూపకుండెను. దశరథుఁడు లోకానుభవము మిక్కిలి కలవాఁడయ్యును బుత్త్రునెడఁబాటు తప్పదన్న దుఃఖముచేఁ దపించెను.

మహామతులారా! ఈభాగమునఁ గొన్ని విశేషములు గలవు. వానిం దడవుదము.

"స పితుశ్చరణౌ పూర్వమభివాద్య వినీతవత్,
తతో వవందే చరణౌ కైకేయ్యాస్సుసమాహితః." ౨

అని మూలము.

"అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః,
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యా యశో బలం. ౧౨౧
అభివాదాత్పరం విప్రో జ్యాయాంసమభివాదయన్,
అసౌ నామాహమస్మీతి స్వం నామ పరికీర్తయేత్." ౧౨౨
(మను. ౨ అధ్యా)

అను నీస్మృతిని రామమూర్తి లోకులకు బోధించెను. తండ్రికి నమస్కరించి తరువాతఁ దల్లికి నమస్కరించెను. ఇదియే సనాతనాచారమని యెఱుంగవలయు.

"ఉపప్లుతమివాదిత్యముక్తానృతమృషిం యథా." ౬

అని మూలము. అసత్యవాది యగుఋషివలెఁ దేజోహీనుఁడయి యున్నతండ్రిని రాముఁడు చూచెను.

"న విస్మయేత తపసా వదేదిష్ట్వా చ నానృతం,
నార్తోఽప్యపవదేద్విప్రాన్న దత్వా పరికీర్తయేత్." ౨౩౬
(మను. ౪ అధ్యా.)

అను నీస్మృత్యర్థము రామాయణమునందును గలదు. సకల స్మృతులవిశేషము రామాయణమునఁ గలదనియు, శ్రీరాము నాచరణమే స్మృతివితతియనియు గ్రహింపవలయును.

"కచ్చిన్మయా నాపరాద్ధమజ్ఞానాద్యేన మే పితా,
కుపితస్తన్మమాచక్ష్వ త్వం చైవైనం ప్రసాదయ." ౧౧

అని మూలము. ప్రమాదవశమున నేనేమి నపరాధము తండ్రి కొనరించితినా? దానిం దెలుపుము. నీవు గూడ నాతండ్రి కలుకఁ దేర్పుము. ఈకోపమునకుఁ గారణమేమని రాముఁడు ప్రశ్నించెను. అనఁగాఁ దెలియక తండ్రి కపరాధము చేసినను దూష్యమే యని స్పష్టము. నీవును బ్రసన్నునిగాఁ జేయుమని స్వకరుం దెల్పెను. దీనింబట్టి రామునిమనోభావము స్వైకయుం డీనస్త్వన నసూయ పొరయదనియే స్పష్టముగదా. "న మే ద్వేష్యోఽస్తి న ప్రియః" అన్నగీతోక్తి రాముని ప్రవర్తనమువలన నేర్పడినదని తెలియందగు.

"శారీరో మానసో వాపి కశ్చిదేనం న బాధతే,
సంతాపో వాభితాపో వా దుర్లభం హి సదా సుఖం." ౧౩

అని మూలము. మానవులకు సదా సుఖమే కలుగుట యసంభవము. అని రామమూర్తి మనకుఁ దెలుపును. దుఃఖములు గూడఁ గలుగును. వాని కోర్చుకొనవలయుననికదా రామమూర్తి యాశయము. అనఁగా సుఖానుభవము ముగిసినదని దుఃఖానుభవకాలము వచ్చినదనియు సూచింపఁబడినది.

"అతోఽషయన్మహారాజమకుర్వన్ వా పితుర్వచః,
ముహూర్తమపి నేచ్ఛేయం జీవితం కుపితే నృపే." ౧౫

ఇదియే రామునియుపదేశము. జనకుని సంతోషపెట్టకకాని, తండ్రిమాట యొనరింపకకాని క్షణకాలమైన బ్రదుకనొల్లను. నీకిచ్చినవరములను సాగించి సత్యప్రతిజ్ఞునింజేయక తండ్రిమాట సార్థకము చేయక యనఁగా దండకాటవుల మునివేషమున నుండక యని యర్థము. క్షణకాలమైన నిట జీవింపనొల్లను. అనఁగా నీపురమున నిఁక ముహూర్తమాత్రముకూడ నివసింప నని రాము నాశయమనియే యిటఁగలవిశేషము. పితృవాక్య పరిపాలనమే కుమారునకుఁ గర్తవ్యమని రాముఁ డుపదేశించిన నీతి యని మన మూహింపవలయును. పితృవాక్యమును బాలింపక జీవించుట భూమికి భారమే యని యిందుఁగలనీతి.

"యతో మూలం నరః పశ్యేత్ప్రాదుర్భావమిహాత్మనః,
కథం తస్మిన్న వర్తేత ప్రత్యక్షే సతి దైవతే." ౧౬

ఇదియు నొకయుపదేశమే యనవలయును.

"పతిర్భార్యాం సంప్రవిశ్య గర్భో భూత్వేహ జాయతే,
జాయాయాస్తద్ధి జాయాత్వం యదస్యాం జాయతే పునః." ౮

(మను. ౯ అధ్యా)

అను నీస్మృతివాక్యము ననుసరించి తండ్రియే కుమారుఁడుగాఁ బుట్టుచున్నాఁడు. కావునఁ గుమారుఁడు తండ్రికి విరుద్ధముగాఁ బ్రవర్తింపరాదు. అన్నస్మృత్యర్థమునే శ్రీరామమూర్తి తేట పఱచెను. తనమాటను మీఱి తాఁబ్రవర్తింపఁజాలనిరీతిఁ దండ్రియే కుమారుఁడుగాఁ బుట్టుచున్నవాఁడు గావున నెట్టు లాతని మీఱఁజాలునని రామమూర్తి యడుగుచున్నాఁడు.

తండ్రిమాట మీఱుట యనఁగా నాత్మద్రోహమునంటి దన వలయు. ఆత్మద్రోహ మెట్లు మహాపాపకార్యమో పితృవాక్య నిరాకరణముకూడ నట్టిదే యనినీతి. రామోపదేశములయం దిద్ది ప్రధానమని మనము తెలిసికొనవలెను.

"న రాజా కుపితో రామ వ్యసనం నాస్య కించన,
కించిన్మనోగతం త్వన్యత్త్వద్భయాన్నాభిభాషతే. ౨౦
ప్రియం త్వామప్రియం వక్తుం వాణీ నాస్యోపవర్తతే,
తదవశ్యం త్వయా కార్యం యదనేనాశ్రుతం మమ." ౨౧

అని మూలము. కైక రామునకుం జెల్పువచన మిది. నీభయమువలన మాటలాడకున్నాఁడు. సామాన్యార్థమిది. విశేషార్థ మేమనఁగా. నీమూలమునఁ గలుగఁబోవు భయమువలన ననఁగాఁ బుత్రమూలమున మృతిగల్గు నన్నశాపభయమువలన మాటలాడకున్నాఁడని కైకనోట మహాకవివాల్మీకి పలికించెను.

"లౌకికానాం హి సాధూనామర్థం వాగనువర్తతే
ఋషీణాం పునరాద్యానాం వాచమర్థోఽనుధావతి."

అన్నభవభూతివాక్కు తప్పదుగదా. రామా! అత్యంతప్రీతికిఁ బాత్రుఁడవగునిన్ను గుఱించి యప్రియముపలుక నీతని నోరాడకున్నది. ఏకార్య మొనరింపఁ బ్రతినచేసెనో యద్దాని నీవొనరింపవలయును. అనఁగాఁ దండ్రికిం బ్రియముచేయ జన్మించినవాఁడవు. కాన నిన్నుం జూడఁగనే యీతనివిషయమున వాణి స్తంభించినది. అనఁగా నిఁక నీతఁడు మాటలాడవలసిన కాలము చాల లేదని భావము. కావునఁ బితృవాక్యమును సార్థకము చేయవలసినవాఁడవు నీవు. ఆపని నిర్వహింపుము. మరణ మాసన్నమైనవారలకు వాక్కు స్తంభించును. అనఁగా వికృతిం

బోరయును. దాని నెఱిఁగి మానవుఁడు కృత్యముల నొనరింప వలయును ఆతఁ డొనరింపఁజాలనిపనులను బితృప్రీతిగాఁ గుమారుఁ డొనరింపవలయు ననునీతి మనము గ్రహింపవలయును. "ప్రియం త్వా మప్రియం వక్తుం వాణీ నాస్యోపవర్తతే" సర్వలోకప్రియుఁడవగు నిన్నుఁగూర్చి యొకయప్రియవాక్యమైనఁ బలుక వాగ్దేవి జంకుచు నీతని నో రరికట్టెను. భగవద్దర్శనమున నప్రియుఁడు ప్రియుండగును. పుణ్యము చేసిన వానికే భగవంతుఁ డగపడును. తద్దర్శనమునఁ జిత్తము పరిపక్వమగును. పాపములు నశించును. అట్టిస్థితియందు వాఁడప్రియము లెట్టులు పలుకఁగలఁడు? ఇందు రామశబ్దార్థము మహాకవి వివరించెను. సర్వలోకప్రియుఁడు రాముఁడు. కైకకు మాత్రము ప్రియముంగూర్చువాఁడు కాకపోవునా? ఎంతక్రోధమున్నను ఎవ్వానిదర్శనమున మనస్సు మాఱునో యట్టివాఁడు మానవుఁడైన నాతనియందు భగవత్కళ విశేషించియుండునని మన మెఱుంగవలయును. మృగములు క్రూరములైనను భగవత్కళ విశేషించియుండువానింగాంచి తమదౌష్ట్యమును మానుకొనును. ఏల?

"సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని
ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః." ౬-౨౯

అన్నభగవదుక్తి ప్రసిద్ధమేకదా. క్రూరమృగమునందును భగవంతుఁడు కలఁడు. కాన నాతనిం గాంచువాని నది యేమి చేయఁగలదు? అట్టివాఁడే యోగి. పరులం గాంచి యోర్వఁజాలక దూషించుచు, గడ్డము పెంచుకొన్నంతమాత్రమున యోగి యగునా? అట్టివాఁడు కపటయోగి యనంబడును.

వానిం గాంచి యెవ్వారును స్నేహింపరు. ఇట్టులుండఁ బ్రత్యక్షముగా భగవంతుఁడు కనఁబడిన నెవ్వాఁడు ప్రేమింపక యుండును? అను నీవిశేషవిషయ మీభాగమునుండి మన మెఱుంగవలయును.

"అతిసృజ్య దదానీతి వరం మమ విశాం పతిః
స నిరర్థం గతజలే సేతుం బంధితుమిచ్ఛతి." ౨౩

అనుమూలమున నొక్కవిశేషము కలదు. మానసపుత్ర వరమిత్తు నని ప్రతినసేసెను. వెనుకఁ జింతించుచున్నాఁడు. అది నిరర్థకము. గతజలసేతుబంధమనఁగా నిదియే. కర్తవ్యమును సకాలమునఁ జేయఁజాలక వృథగాఁ గాలముం బుత్తురో వారే నిరర్థకులని భావము.

"దినయామిన్యౌ సాయంప్రాతశ్శిశిరవసంతౌ పునరాయాతః,
కాలః క్రీడతి గచ్ఛత్యాయు స్తదపి న ముంచత్యాశావాయుః." ౧౨. భజ.

అన్న శంకరభగవత్పాదాచార్యోపదేశము.

"ఆదానస్య ప్రదానస్య కర్తవ్యస్య చ కర్మణః,
క్షిప్రమక్రియమాణస్య కాలః పిబతి సంపదః.

అన్నసూక్తియు నిట స్మర్తవ్యములు. గతజలమగువానికిఁ గట్టఁ గట్టఁ బ్రయత్నించినవానిపగిది సకాలమునఁ గర్మముల నాచరించి భగవంతునికరుణకుం బాత్రులుగానివారు పశ్చాత్తాపతప్తులై చెడుదురనిభావము.

"ధర్మమూలమిదం రామ విదితం చ సతామపి,
తత్సత్యం న త్యజేద్రాజా కుపిత స్త్వత్కృతే యథా." ౨౪

అను నీభాగమున నొక్కవిశేషము కలదు. ధర్మమనఁగా "ధరతి విశ్వమితి ధర్మః" అనువ్యుత్పత్తి ననుసరించి ప్రపంచమును ధరించునది ధర్మ మనంబడును.

"ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః,
తస్మాద్ధర్మో న హంతవ్యో మానో ధర్మో హతోఽవధీత్. ౧౫
వృషో హి భగవాన్ ధర్మస్తస్య యః కురుతే హ్యాలం,
వృషలం తం విదుర్దేవా స్తస్మాద్ధర్మం న లోపయేత్. ౧౬
ఏకఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతి యః,
శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి." ౧౭
(మను. ౮ అధ్యా.)

స్మృతి యిట్లు తెల్పుచున్నది. సత్యమునకు మూలమనఁగా నాధారము ధర్మము. 'ధ్రియతే ఇతి ధర్మః' అను వ్యుత్పత్త ననుసరించి శ్రుతివిహితకర్మమని యర్థము. సత్యమునకు శ్రుతివిహితకర్మమే మూలము. ఇది సజ్జనుల కెఱుకపడినదే. రాజు నీభయమున నాపైఁ గోపించి కర్మమూలసత్యమును వదలకుండఁజేయుము. అని కైక తెలిపెను. "యజ్ఞోఽనృతేన క్షరతి" అన్నమనుస్మృతి వాక్యము ననుసరించి శ్రుతిహితకర్మ మనృతము పలికిన నశించును. కాన నీమూలమున నిది నశింపకయుండఁజేయుము. అనఁగా రామా! నీరూపము సత్యము. అయ్యది వేదమూలము. అట్టిదాని నీకొఱకే యీరాజు వదలునేమో యట్లుగాకయుండఁజేయుభారము నీదే యని తాత్పర్యము. నీయవతారఫలము ఈభూపతి సత్యవాక్కుపై నాధారపడియున్నది. అట్టి సత్యమునకు నీవే యాధారము. ఎట్లు? కర్మము భగవత్స్వరూపము.

"కర్మ బ్రహ్మోద్భవం విద్ధి బ్రహ్మాక్షరసముద్భవం,
తస్మాత్సర్వగతం బ్రహ్మ నిత్యం యజ్ఞే ప్రతిష్ఠితం. ౧౫
ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః,
అఘాయురింద్రియారామో మోఘం పార్థ స జీవతి." ౧౬

(గీత. 3 అధ్యా.)

అనుభగవదుక్తి కలదుగదా. అనఁగా నీవాచరింపఁదగు సకల కర్మములకు సీతనిమాట యాధారము. దానిని గాపాడుము. ఈరాజునోట సత్యమాడించి నీయవతారఫలము దుష్టసంహార శిష్టపాలనధర్మసంస్థాపనరూపకార్యముల సాగింపుమని కైకపలికెననియే యిటఁగలసారము. ఇట్టిజ్ఞానము కైకకుఁగలదా యన్న సందియ మక్కఱలేదు.

"కార్యతే హ్యవశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః." అనియుం,
"మిథ్యైష వ్యవసాయస్తే ప్రకృతిస్త్వాం నియోక్ష్యతి." అనియుం

కృష్ణోపదేశములు కలవుకదా. మహర్షి వాల్మీకిమహాకవి కైక నోట గూఢార్థభూయిష్ఠములగుపదముల నీయర్థముం బలికించె నని మన మెన్నవలయును. లేకయున్న భగవత్సందర్శనము వ్యర్థమగునుగదా. రామచంద్రసందర్శనము మహాప్రకృతియగు సీతాదేవి సంకల్పము ప్రోత్సహింపఁ గైక యేమి చేయఁగలదు? హరిహరబ్రహ్మాదులే యవశులై చెప్పినయట్లు ప్రవర్తింతురన నిఁకఁ గైకమాట యిటనేటికి? ధర్మము సత్యము కలిసియుండు నుగాన నొకదానికొకటి యాధారముగాన నీరెండింటిననఁగా సత్కర్మమును సత్యమును భగవంతునియాకృతులుగ భావించి వాని నారాధింపవలయుననియు, ఫలాభిసంధిరహితములుగా

నవి యుండవలయుననియు నీభాగమునుండి మన మెఱుంగఁదగు విషయములు.

"యది తద్వక్ష్యతే రాజా శుభం వా యదివాశుభం,
కరిష్యసి తతస్సర్వమాఖ్యాస్యామి పునస్త్వహం." ౨౫

సామాన్యార్థము విమర్శింపమాని విశేష మెఱుంగందగుంగదా·
ఏకార్యమువలనఁగాని కొందఱకు మేలు, కొందఱకుఁ గీడును
గలుగును. కాని యాకార్యము ధర్మప్రధానమయ్యెనేని యా
చరింపఁదగినదే. సకలప్రజారంజకుఁడవగు నీకు ధర్మమే యాచ
రింపఁదగును. కావునఁ దప్పక యొనరింతునని నాకుఁ దెల్పిన
నేనే యవ్విషయమును రాజు పలుకఁదగుదానిని బలుకుదును.
ఆనఁగాఁ బితృవాక్యపరిపాలనము ముఖ్యమని తలంపకుము.
ఇదియుఁ బితృవాక్యమే. వారిమాటనే నేను జెప్పుచున్న
దానను. అని కైకభావము. లోకమున నొక్కమహాకార్యము
చేయఁబూనినపుడు కొందఱకుఁ గీడుగలుగును. అంతమాత్ర
మున వారికొఱకుగా నద్దానిని మానరాదు. ధర్మమున కయ్యది
హితమైనఁ జాలును. నాకిపు డేయపకారముతలంపని రాక్షస
వధార్థము సంకల్పముచేయ నేల యని యూహింపకుము.
వారికి నీవలన మేలే కలుగును. ప్రపంచహిత మొనర్ప నవత
రించితివి. కాన నాకార్యమున నప్రమత్తుఁడవుకమ్మని కైకయభి
ప్రాయమని యూహింపందగు. మానవులు ధర్మకార్యము నొన
రింపఁబూనినపు డద్దానివలన నేస్వల్పమో కొందఱ కపకారము
కల్గునేని యది సరకుగొనరాదనునదియే యీభాగమునుండి మన
మెఱుంగందగినది.

"అహో ధిఙ్నార్హసే దేవి వక్తుం మామీదృశం వచః,
అహం హి వచనాద్రాజ్ఞః పతేయమపి పావకే. ౨౮
భక్షయేయం విషం తీక్ష్ణం మజ్జేయమపి చార్ణవే,
నియుక్తో గురుణా పిత్రా నృపేణ చ హితేన చ." ౨౯

అనునది శ్రీరామవాక్యము. నే నీకార్యము చేయనేమోయని సందియమొందుట మంచిదిగాదు. ఈ రాజాజ్ఞ ననుసరించి యగ్నియందును బడుదును. అనఁగా నాతేజస్సు నగ్నియందుం తునని తాత్పర్యము. నాతేజస్సు ననఁగా నామాయను (సీతను) హుతవహునియందుంతుననియే యర్థము. అనఁగా నగ్నియే నారూపము. యోగు లద్దానినే ధ్యానింతురు. అందుఁ బడుదు ననఁగా దేజోరూపమున నుందును. నే నే కార్యము చేయువాఁ డనుగాను. ప్రకృతియే యన్ని కార్యముల నాయానతిం బూని యొనరించును. నేను సాక్షిమాత్రుఁడను. అని సారము. విష మనఁగా నధర్మము. దానిని భక్షింతును. అనఁగా మాయింతును. సముద్రమున మునుంగుదు. సాగరమును బ్రార్థింపఁదగు కాలమువచ్చును. అపుడు స్నానముచేసి దానిచెంత శయనింతు నను నర్థ మిందు సూచింపఁబడియెను. తాను ముందుఁ బ్రకృతి విశిష్టుఁడై సీత నగ్నియందునిచి మాయాసీత రావణునియిల్లు చేరునట్లుచేసి యేయే కార్యములు తాఁజేసినట్లు లోకు లెన్న నటించునో వాని నిట గూఢముగాఁ దెలిపెనని మనము భావింపవలయు. దీన లాభమేమని ప్రశ్నింతురేమో. శ్రీరాముఁడు భగవంతుఁడనుభావము చక్కఁగాఁ దెల్పుటయే దీనికిం దగు ఫలము.

"తద్బ్రూహి వచనం దేవి రాజ్ఞో యదభికాంక్షితం,
కరిష్యే ప్రతిజానే చ రామో ద్విర్నాభిభాషతే." ౩౦

అనునిదియే శ్రీరాముని ప్రతిజ్ఞ. రాముఁడు తొలుత నొక్క విధముగాఁ బలికి దానికి భంగముకలిగించుపద్ధతిని రెండవతడవ పలుకఁడని భావము. చెప్పినమాట తప్పఁడని సారము. ఇదియే యీయవతారమునఁ జేయుమహాకార్యము. తొలుత నొక్క రీతిగాఁ బలికి దానివలనఁ గొన్నిబాధలుకలుగ నుండఁగా వానిని దప్పించుకొన నింకొక్కవిధముగాఁ జెప్పు నాచార మీరామునకు లేదని శ్రీరాముఁడు పలికెను. సత్యమును గాపాడనే యవతరించితిని. ధర్మమును నెలకొల్పఁ బ్రతినచేసితిని. కావున నీయవతారమున సత్యధర్మములకు బాధకలుగకయుండఁ గాపాడుదునని శ్రీరామమూర్తి తేటపఱచెను. "అనృతం నోక్తపూర్వమ్మే" అనియుఁ జెప్పఁబోవును. ఈయవతారమున సత్యవాక్కునకు నేకాలమునను భంగము కలుగనీయక రామమూర్తి ప్రవర్తించెనని మనము తెలిసికొనవలయు. ఒక్కొక్కయవతారమున నొక్కధర్మమునే స్థిరపఱచును. సకలధర్మముల నిలుప నవకాశము దొరకదు. ప్రజలయందుఁ గొన్నిధర్మములుండును. క్షీణించినవానిని క్షీణింపనున్నవానిని గాపాడ భగవంతుఁ డవతరించునని సారము. మానవులుకూడ నన్నిధర్మముల నాచరింపఁబూని కృతకృత్యులు కాఁజాలక మిన్నకుండక తమకు శక్యమగునొక్కధర్మము నవలంబించి దానిని జక్కఁగా సాధింపవలయును. దాననే యాపరమేశ్వరుఁడు సంతృప్తుండగును. అనఁగాఁ బూర్వకర్మము ననుసరించి తనకు నుత్తమమని తోఁచినధర్మమును భగవత్స్వరూపముగా భావించి యారాధింపవలయును. లోకుల వంచించి ధనమార్జింప నేధర్మముం

బూనరాదు. దానఁ దనపురుషార్థమునే పోఁగొట్టుకొనును. కాని వేఱుకార్యము సాధింపఁజాలఁడు.

"తమార్జవసమాయుక్తమనార్యా సత్యవాదినం,
ఉవాచ రామం కైకేయీ వచనం భృశదారుణమ్." 3౧

సామాన్యార్థము. అనార్య యనఁగా నపూజ్యురాలని. "నవిద్యతే ఆర్యా యస్యాస్సా అనార్యా" అతిపూజ్యురాలని విశేషార్థము చెప్పవలయును. ఏలయనఁగా కైకయానతినే తండ్రియానతిగా రామమూర్తి భావించి యడవుల కరుగును. దుష్టురాలివచనమును బాటించుటంజేసి శ్రీరామునిచరిత్రమునకుఁ గళంకము కల్గును. కావున నీయర్థము సముచితమే. భగవత్కార్యమున కెల్లరు సాయపడువారే. కర్మప్రేరణమున నామె యాకార్యమునకుం దోడుపడి లోకములకు మహోపకార మొనరించెను. కాన ననార్య యని చెప్పుట మంచిదిగాదు. సామాన్యజనులదృష్టి కనార్య యని తోఁచినను మహర్షులదృష్టికి నార్య యనియే కైక తోఁచును. కైకయే లేకున్న రామావతారమే లేదు కావున నీయర్థ మసంగతము కాదని యూహించుటొప్పు.

"త్వయారణ్యం ప్రవేష్టవ్యం వర్షాణి నవ పంచ చ." 3౨

అని కైకనోట వాల్మీకి పలికించెను. ఇందుఁగలవిశేష మేమనఁగా "వత్సరాణిచతుర్దశ" అనిపలికిన వ్యర్థపదము లేకుండును. అట్లుండినంగూడ మహాకవి వాల్మీకి "వర్షాణి నవ పంచ చ" అని పలికెను. ఏల? తొలుతటితొమ్మిదివర్షములు లోకమున కంతయుపయోగమును గల్గించునవి కావు. కడపటియైదువర్షములే జగత్త్రయోపకారకములు. తొలుత సామాన్యరాక్షసులఁ జంపి మునుల కభయ మొసంగుము. తక్కుంగలయైదేండ్లలో ధర్మసంస్థాపన

మునకుఁ బ్రథమసోపానమగు శూర్పణఖ శ్రుతినాసికాచ్ఛేదాది దుష్టరాక్షససంహారము, స్వాశ్రితసంరక్షణము లోనగుమహా కార్యములు నిర్వహింపుము. అనునర్థము గూఢముగా నుంచు టకై యట్లు పలికి తనసర్వతోముఖపాండిత్యమును వెల్లడించి యాదికవి ఖ్యాతిమించెనని మన మెఱుంగందగు.

"భరత స్త్వభిషేత్ష్యేత యదేతదభిషేచనం,
త్వదర్థే విహితం రాజ్ఞా తేన సర్వేణ రాఘవ." 36

దీన నొకవిశేషము గలదు.

"యస్మాదేతదభిషేచనం విహితం తథాపీత్యధ్యాహారః. భరతస్తు త్వదర్థే అభిషేత్ష్యేత రాజ్ఞా. కేన? తేన సర్వేణ వస్తువ్రాతేన. రాఘవేతి సంబోధనం."

ఏకారణమున నీయభిషేకవస్తువ్రాతము విహితమో అనఁగా నీయభిషేకపదార్థములు గూర్పఁబడినవో, ఆప్రయత్నము విహితమే ఐన నిప్పు డది విహితముకాదని భావము. నాకొఱకు భరతుఁడైతే నీకొఱకు రాజుచే నభిషేకింపఁబడుంగాక.అనఁగా నీకుఁ బ్రతినిధిగా భరతుఁడు రాజుగా నుండును. నీకార్యముల నిర్వహించుటకేకాని భోగానుభవముకొఱకుఁ గాదు. అని కైకనోటినుండి వెడలెనని యెఱుంగవలయు.

"అభిషేకమిమం త్యక్త్వా జటాజినధరో వస."

జటాజినధరుఁడవై యుండుము. లయకర్తయగు నీశ్వరునిరూప మును ధరింపుమా యని యర్థము. శాంతరూపమున నుండ రాదు. దుష్టరాక్షససంహారదీక్షం బూనవలయుఁగాన నధర్మ్న యాద్యాదిరూపమగు దీక్షాధర్మముల నవలంబించి లయమొనరింప వలయునని భావము. లోకమున నుపాసకుఁడు శత్రుక్షయా

ర్థము దీక్షంబూనెనేని యుపాస్య దేవతను శాంతరూపముగలిగి నట్లుగాక రూపాంతరమున ధ్యానించి హోమములుగూడ దానను గుణములగు వస్తువులచేఁ జేయవలయును. అట్లులనఁగాని యా కార్యము సిద్ధింపదు. అట్లే నీవును సర్వసన్న్యాసాపేక్షకుడవుగు నీరూపమును జటాదిధారణమున మార్పుగావింపుమా యని సారము.

"ఏతత్కురు నరేంద్రస్య వచనం రఘునందన,
సత్యేన మహతా రామ తారయస్వ నరేశ్వరం." ౪౦

అని మూలము. ఇదియే రాజునాశయము. దీనిని పాటింపుము. అనఁగా నీరీతిగాఁ బ్రవర్తింపుము. లోకోత్తరమగు సత్యమున దశరథు నుద్ధరింపుము. రామచంద్రా! మంచి కాలమున దర్శన మిచ్చితివి. సత్యము నాశ్రయించి దశరథుఁడు భగవత్కృపకుఁ బాత్రుఁడై పుణ్యలోకముల కరిగెనని విఖ్యాతి వెలయింపుము. అనఁగా సత్యవాక్యపాలనమున దశరథుని రాజలోకములకు నుదాహరణభూతునిగా నొనరింపుమా యనియే యిటఁగలవిశే షమని మనము గ్రహింపవలయును. 'తారయస్వ' అనుట ప్రార్థ నార్థకమని మన మెఱుంగవలయును. సర్వేశ్వరుఁడవు నీవు కుమారుఁడవైతివి. ఇంతకంటె నైహికభాగ్యము లేదు. పునరా వృత్తిరహితశాశ్వతపద మనుగ్రహింపుము. అదియే భగవం తుని గోరఁదగినదని మనము దెలిసికొనందగు. అంత్యకాల మున భగవద్దర్శనమగుటయేకదా సకలసత్కర్మములఫలము. అట్టితఱిఁ గోరఁదగిన దొక్కపరమపురుషార్థము గాక మఱే ముండును.? కావున నదియే కైక కోరెను. ఇట్లు ఈభాగము శ్రీరామమూర్తి సుస్వభావమును, కైక లోకోపకార మను

మహాకార్యమున నాసక్తింబూని తాత్కాలికమగునపయశస్సును లెక్కింపక తనపట్టినపట్టు వదలక భగవంతునిం బ్రోత్సహించునేర్పును మనకుఁ దెలుపుచున్నది. కావున దీనింబఠించునపుడు శ్రీరామమూర్తి మనకు బోధించినపితృభక్తిని లోకోద్ధరణనియతిని మన మెఱుంగవలయు. కైకయాశయము మూఁడులోకములయం దెందఱకు సమ్మతమో యనియు నూహింపవలయును. అపుడుగాని మనకు రామాయణపారాయణఫలము చేకూరదు. ఇఁకఁ దరువాతిదగుభగవచ్చరిత్రమును బఠింతము.

శ్రీరాముఁ డడవికింబోవ నంగీకరించుట.

* కైకవచించిన యావార్త సామాన్యమానవులకు మరణతుల్యమైనది. శ్రీరామమూర్తి యమిత్రుల రూపడంచువాఁడు. అట్టులయ్యు నావాక్యను విని యించుకంతయు విచారంపడక కైకం గాంచి యిట్లు పలికెను. తల్లీ! అట్లే యగుఁగాక. నీ వానతిచ్చినచందమున భరతునకుఁ బట్టాభిషేకోత్సవము సాగుఁగాక. నేను దండ్రియొనరించినప్రతినరీతిగా జడలను కృష్ణాజినమును ధరించి యిటనుండి కదలి యడవినుండఁబోయెదను. శత్రుహంతయగుదశరథుఁడు మునుపటిరీతి నన్నేల మన్నింపకున్నవాఁడు? కరుణచేతనా? నా నైజము తండ్రికిం దెలియుంగదా. ఏల మాటలాడఁడు? తల్లీ! నీవు దీనురాలవు కావలదు. నేను నీమ్రోల వచియింతును. నీవు చూచుచుండఁగా వల్కలములు గట్టుకొని జడలుధరించి యడవులకుంబోయె

* ఇది పందొమ్మిదవ సర్గమునఁ గలదు. అధ్యాత్మరామాయణకథయుం నిందే కలిసియుండును.

దను. నీవు సంతుష్టురాలవై యుండుము. రాజు నాకు నెంతయు హితుఁడు. ఆచార్యుఁడు. జనకుఁడు. అనుసరించిన వరదానము సార్థకము చేయువాఁడు. అట్టి యా రాజేంద్రుఁడు నియోగించినంతనే యనుమానింపక తత్ప్రియకార్యమును దేనినేఁ జేయకుందునా? రాజు తానుగా భరతాభిషేకము తెల్పలేదే యను నప్రియము విశేషించి నామనస్సును బాధించుచున్నది. ఇతరుల ప్రోత్సాహము లేకయే భరతుఁడు కోరినచో శివశరాసనభంగకాలముననే సీతను గాని నాకుఁ గల రాజ్యమును, ప్రియమైన ప్రాణమును, ధనరాశి నిచ్చియుందును. అట్టి నేను జనకుఁడగు దశరథమహారాజు తానుగ నానతిచ్చినచో దాన నీకు సంతోషము కలుగు నేని చెప్పినయట్లే చేయుదునన్న నా ప్రతిన ఫలించుచుండ రాజ్యము నొసంగుదునని వేఱుగాఁ జెప్పవలయునా? దీన నాకించుకంతయు నప్రియము కలుగదు. కావున నో తల్లీ! నీవు సంకోచింపనేల యని రాజు నాశ్వాసింపుము. రాజు భూమిం గనుచు మెల్లమెల్లగాఁ గన్నీరు విడుచుచున్నాఁడే, ఏల? ఇప్పుడే దూతలు రాజాజ్ఞం గొని వేగముగాఁ బోవు నైజముగల గుఱ్ఱముల నెక్కి మేనమామయింట నున్న భరతునిం బిలుచుకొని రావలయును. నేను నిర్విచారముగాఁ బదునాలుగు వత్సరములు దండకారణ్యమున నివసింప నిదిగో ప్రయాణము చేయుదును.

అని రామచంద్రుఁడు పలుకఁగా విని కైక యానందించి రాముని సాగనంపు కార్యమున జాగ్రత్త కలదియై పొమ్మని తొందరించుచు రామునితో అట్లే చేయుము. దూతలరుగుదురు. భరతుని దోడ్కొనివత్తురు. అని పలికి యంతరంగమున

నిట్లు తలంచెను. నాకుమారుఁడు రామునియందు మిక్కిలి భక్తిగలవాఁడు. అతఁడు వచ్చునంతదనుక రాముఁ డిందుండు నేని వాఁ డీతని నడవికింబోనిచ్చునా? అపుడు నాప్రయత్నము నిష్ఫలమగును. అని తలపోసి రామునిం గని మరల నిట్లు పలికెను. రామా! నీవు దండకాటవికింబోవ నుత్సుకుఁడవై యున్నాఁడవు. కావున నీవు జాగు చేయరాదని తోఁచెడిని. కావున సత్వరముగా నడవికిం జనుటయే లెస్స. పురుషశ్రేష్ఠా! ఈరాజు తనప్రతినను రామమూర్తి సార్థకముచేయునో చేయఁడో యని లజ్జనొంది నీతో నించుకంతయు మాటాడకున్నాఁడు. ఇతర కారణ మేమియు లేదు. కనుక రాజుమాటాడకుండ నేల యని విచారింపకుము. నీవిపుడే పయనముచేసి యాతనిలజ్జను దైన్యమును బోఁగొట్టందగు. నీ వయోధ్యనుండి వేవేగ పయనము చేసి యడవికిం బోవునంతదనుక నీతండ్రి స్నానముగాని, భోజనముగాని చేయఁడు.

అని యిట్లు కైక పలుకఁగా నాలకించి యట్టియనృతములు పలుకుచున్నందులకుఁ జింతనొంది చీ! చీ! ఏటిబ్రదుకిది? ఇదేమికష్టము? అనుచు వేఁడినిట్టూర్పులు నిగుడించి శోకసాగరనిమగ్నుఁడై యామంచముపైఁ దటాలునఁ బడియెను. మూర్ఛమునింగెను. రాముఁ డంతట రాజును లేవనెత్తి కైక ప్రయాణము చేయఁ దొందఱించుచున్నందునఁ గశాఘాతమునఁ బరుగిడుగుఱ్ఱమువలెఁ ద్వరపడసాగెను. అంతియకాక పాపమతి చేఁ దన్నామె యడవులకుం బొమ్మన్న ఘోరము నప్రియము నగు నావృత్తాంతమునకు దుఃఖపడక యామెతోఁ దల్లీ! నాకు ధనాశలేదు. ఈలోకమున నుండవలయుననియేని, జగము

నాక్రమించుకొనవలయుననియేని కోరిక లేదు. నేను ఋషితుల్యుఁడను. ధర్మమును మాత్రమే యాశ్రయించినవాఁడను. ఇవితప్ప మఱేవియు నాకిష్టములు కావు. పితృప్రీతికార్య మదియైనఁ జేయుదును. దాన నాకుఁ బ్రాణాపాయము కల్గినను వదలక చేయువాఁడనని నమ్ముము. జనకునకు శుశ్రూష చేయుటయు, నాతనిమాట జవదాఁటక చేయుటయు ననువానికంటె శ్రేష్ఠమగుధర్మానుష్ఠాన మొక్కటియు లేదు. తండ్రి తానుగ నడవికింబొమ్మని పలుకకున్నను నీవుచెప్పినం జాలును. నీవాక్యము ననుసరించి యిపుడే నేను నిర్జనారణ్యమునకుంబోయి పదునాల్గుసంవత్సరములు నివసింతును. కేకయరాజపుత్రి ! తల్లి ! నీవే యొకరికంటె నధికముగా నాకు నాజ్ఞనీయ శక్తిగలదానవుకదా. అట్టి నీవాక్యమును దప్పక చేయ సిద్ధముగ నేనుండఁగా భరతాభిషేకము, నాయరణ్యగమనము మనోభీష్టమని నీవు నాతోఁ బలుకక రాజును వరరూపమున నడిగితివే, ఏల? దీనిచే నాయందుఁ గొంచెమైన గుణమున్నదని విచారింపవైతివి. ఇపుడే పొమ్మంటివికదా. తల్లియగు కౌసల్యయొద్ద సెలవు తీసికొని జానకి నాశ్వాసించి వచ్చునంతదనుక నిందుండ ననుమతియిమ్ము. ఆవల క్షణమైన నిందుండక యీదినమే యడవికిం బోయెదను. భరతుఁడు రాజ్యమునుబాలించుచుఁ బితృశుశ్రూష యేమఱక చేయుచుండునట్లు నీవు పరికించుచుండవలయును. పితృసేవ యెంతోకాలమునుండి వచ్చుచున్నధర్మము. కావున నేను జెప్పితిని.

ఈరీతిగా శ్రీరాముఁడు పలుకఁగా నాలకించి దుఃఖము క్రమ్మఁగాఁ గన్నీరు నాపుకొనఁజాలక పెద్దగా నేడ్చెను.

రాముఁడు నబ్బంగి నెలుకమాలియున్న జనకునకు నమస్కరించి కైకకు నభివాదన మాచరించి ఘోరతరమగు నాకష్టమునకు వగవక పితృవాక్పాలనరూపసుకృతము లభించెనన్న సంతోషమున మిగులఁ దేజస్సుపొదల నందుండి వెడలెను. ఆయంతఃపురము వెడలి తనస్నిగ్ధులం గాంచెను. సుమిత్రానందవర్ధనుఁడగు లక్ష్మణుఁడు సమీపమున నున్నందున నచ్చటివృత్తాంత మెఱింగి దుఃఖాశ్రువులు కన్నులం గ్రమ్మ భరింపరానికోపముగలుగ నా రామునివెంబడి పోయెను. దేవాలయాదులకుఁ బ్రదక్షిణముగఁ బోవలయునన్న శాస్త్రము ననుసరించి రామమూర్తి యందునిచి యున్న యభిషేకవస్తుజాతమునకుఁ బ్రదక్షిణ మాచరించి యద్దాని యం దపేక్ష లేకున్నను భరతున కభిషేకము గావలయునని వాంఛించుచు మెల్ల మెల్లగాఁ బోయెను. నిరుపమాననిజముఖతేజస్సుగల యా రామమూర్తి రాజ్యముపోయెనన్న కష్ట మెంత యుండిన నద్దానిచే ముఖకాంతి యించుకయైన క్షీణింపక యుండఁగా మానావమానముల లెక్కింపనియోగివర్యుఁడువలె మనస్సు వికారమునొందనీయక యరిగెను. మహాధీరుఁడగు నా రాముఁడు మంగళకరమగు శ్వేతాతపత్త్రమును జామరములను మాని పరిజనమును బౌరులనుగూడ వదలి రథమునెక్కక తనకు దుఃఖము లేకున్న నితరులకు నయ్యది కలుగుచున్న దన్న దుఃఖమునుగూడ మదిలోనే యణఁచివైచి వెలుపల నించుకంతయుఁ గానరానీయక జితేంద్రియుఁడై యాయప్రియవార్తఁ దెల్పఁగోరి తల్లియింటికిఁ బోయెను.

రామాభిషేకదర్శనోత్సుకులగు పరిజనులు రాముని మోమునం దెట్టిమార్పును బరికింపఁజాలకుండిరి. శరత్కాల

శీతాంశుఁడు తనప్రకాశమును వదలకుండునట్లు మహాబాహుఁడగు నారాముఁడు నైజమగుసంతోషమును రవంతయైనను వదలకయుండెను. తా వ్యథనొందక పరిజనుల నితరులంగూడి మంచి మాటల గౌరవించుచు లక్ష్మణునిదగ్గరకు వచ్చి కలిసికొనెను. ఆతఁడు తనయన్నతోఁడ సమానములగుసుఖదుఃఖములు కలవాఁడు. కాన రామునకు దుఃఖము కలుగఁ దాను దుఃఖించుచు దాని మదినే యడంచుకొని రాముని వెంటనే పోయెను. రామమూర్తి సౌధముం బ్రవేశించి తనయభిషేకమున కానందించుచుఁ జేరియున్న జనులం దిలకించి తనస్థితిని దలంచుకొని దానిచే దుఃఖము తప్పక కలుగవలసియున్నను దా దుఃఖించినం దనమేలుగోరువారు ప్రాణత్యాగము చేయుదురన్న సంశయమున దాని లోపలనే యడంచుకొని వెలుపల నేమియు నగపడక యుండు నట్లుండెను.

మహాశయులారా! ఈభాగమున ననేకవిశేషములు గలవు. అందుఁ గొన్నింటిం బరికింతము.

> "తదప్రియమమిత్రఘ్నో వచనం మరణోపమం,
> శ్రుత్వా న వివ్యథే రామః కైకేయీం చేదమబ్రవీత్. ౧
> ఏవమస్తు గమిష్యామి వనం వస్తుమహం త్వితః,
> జటాజినధరో రాజ్ఞః ప్రతిజ్ఞామనుపాలయన్." ౨

అని మూలము. "అప్రియం మరణోపమం వచనం తత్ శ్రుత్వా" అని యన్వయము. దేనికన్నఁ బ్రియములేదో యది యప్రియము. అపూర్వము. అనాది యనువాని కిట్లే యర్థములు పెద్దలే తెల్పియున్నారు. మరణమే యుపమగాఁగలది. అనఁగా

దుష్టరాక్షసవధమే దానికి సాటియని భావము. లోకదృష్టిచేఁ బ్రియముగానున్నను జ్ఞానదృష్టిగలవారల కది మహాప్రియమైనది. అనఁగా ధర్మవృద్ధిని గలిగించునది యని భావము. కనుకనే రామమూర్తి వగవలేదు. రాజుప్రతినను సార్థకము చేయుచు నిపుడే వనవాసమునకై వెడలెదనని రామచంద్రుఁడు తెలిపెను. తనయవతారఫలమున కయ్యదియే ప్రధానసాధనమగుట నయ్యది మహాప్రియముం గూర్చునదియయ్యెనని సారము.

"అహం హి సీతాం రాజ్యం చ ప్రాణానిష్టాన్ ధనాని చ,
హృష్టో భ్రాత్రే స్వయం దద్యాం భరతాయాప్రచోదితః. ౭
కింపునర్మనుజేంద్రేణ స్వయం పిత్రా ప్రచోదితః,
తవ చ ప్రియకామార్థం ప్రతిజ్ఞామనుపాలయన్." ౮

అని మూలము. సామాన్యదృష్టి నీశ్లోకముం గాంచి పఠించిన విరుద్ధముగం దోఁచును. భరతుఁడు కోరిన నేనేమైన నీయకుందునా. ఆతఁడు ప్రియసోదరుఁడుకదా యనియే యిందుఁగల సారము. "సీతాం రాజ్యం చ" అనుట విరుద్ధముగా నుండక తప్పదు. వివాహకాలమున నన్నా! నాకు సీతఁ బెండ్లియాడు కోర్కికలదని యడిగియుండిన నిచ్చియుందునే యని రాముని యాశయము. మహాభక్తుఁడగుభరతుఁ డట్లడుగునా యని ప్రశ్నింపవలదు. కైకకుఁగల కోర్కిఁ దీర్ప సిద్ధముగానున్నాఁడ నన్నభావమును దెల్పుటకే యీమాటలు రామునిచేఁ జెప్పఁబడినవి. ఇచ్చోట శివధనుర్భంగకాలమునందే యని యర్థము పలుకవలయును. లేకయున్న ధర్మసంస్థాపనార్థ మవతరించినభగవంతుఁడే యిట్లు చెప్పెనన్నఁ దక్కినవారిమాట లిఁక నేటికి? "వ్యాకరణోపమానకోశాప్తవాక్యాద్వ్యవహారతశ్చ" అన్న

సూక్తి ననుసరించి యర్థము పలుకవలయును. ప్రాణములను వానికంటెఁ బ్రియవస్తువగుసీతనుగూడ నిచ్చియుందునే. ఇంత ప్రయత్న మేలచేసితివి? అని భరతునియందుఁ దనకుఁ గల వాత్సల్యమును దేటపఱచిన నామె సంతోషించు ననియే రామునియభిప్రాయము. ఇదియే మనము గ్రహింపఁదగినయర్థము. ఈఘట్టమునఁ దెనిఁగించినవా రెట్లు ప్రవర్తించిరో పరికింతము.

ఆ. "ఆప్రచోదితుండ నయ్యును భరతున
కఖిలరాజ్య మిచ్చునట్టివాఁడ
జనకుచేత నిట్లు సంప్రచోదితుఁడనై
యిచ్చుటకు విచార మేల కలుగు?"

(గోపీనాథ రామాయణము.)

తే. "ఒకరిప్రేరణమే లేక యకలుషమతి
నైన నాసోదరునకు రాజ్యంబు ధనముఁ
బ్రియములౌ ప్రాణములనైన వేడ్క నిత్తుఁ
గాంత యుండినఁ జాపభంగంబునందె."

క. జానకి నొసంగియుందును;"

(ఆంధ్ర శ్రీమద్రామాయణము.)

చ. భరతున కిమ్మటన్న బహుభాషల వేఁటికి మున్నె జానకిన్
ధరణిని బ్రాణముల్ ధనవితానము నీయఁగలేనె నేను గా;

(వావిలికొలనువారి రామాయణము.)

మొదటివారు చల్లఁగా దాఁటిరి. తక్కిన రెండింటిలో నీ శ్లోకార్థము నేదిపోషించె ననువిషయము పెద్దలే నిర్ణయించు

కొందురుగాక. విమర్శకులు కొందఱు పక్షపాతమున నన్నాక్షే పించిరి. వావిలికొలనువారిరామాయణముం బొగడిరి. అదెంత న్యాయమో పెద్దలే యెఱుంగఁదగుదురు. గ్రంథకర్తలను గుఱించి నేను వ్రాయను. ఎవరియిష్టము వారిదని నేనెఱుంగనా?

"నాహమర్థపరో దేవి లోకమావస్తుముత్సహే,
విద్ధి మామృషిభిస్తుల్యం కేవలం ధర్మమాస్థితం." ౨౦
యదత్ర భవతః కించిచ్ఛక్యం కర్తుం ప్రియం మయా,
ప్రాణానపి పరిత్యజ్య సర్వథా కృతమేవ తత్. ౨౧
న హ్యతో ధర్మచరణం కించిదస్తి మహత్తరం,
యథా పితరి శుశ్రూషా తస్య వా వచనక్రియా." ౨౨

అని మూలము. శ్రీరామమూర్తి స్వావతారఫలమును దెలుపుచున్నాఁడు. ధనమునందుఁ బ్రీతిగాని, జనుల లోఁబఱచుకొను కుతూహలముగాని నాకు నుత్సాహము లేదు. ఋషులతో సమానునిగాను ధర్మమునే యాశ్రయించినవానిగ నన్నెఱుంగుము. ఋషి యనఁగా

"జ్ఞానసంసారయోః పారగంతా ఋషిరితిప్రాప్నోతిసర్వాన్ మంత్రాన్
జ్ఞానేన పశ్యతి సంసారపారం వా"

అని జ్ఞానముయొక్కసారమును గాంచినవాఁడు. సంసారపారము నెఱింగినవాఁడు. అని యర్థము. జ్ఞానపారంగతుఁడు రాముఁడు సంసారపారమును గాంచినది ప్రకృతి. అనఁగా నన్ను మాయామయునిగా సగుణబ్రహ్మముగా నెఱుంగుము. ధర్మమునే యాశ్రయించియుందును. నేనుండుతావున నధర్మమే నిలువఁజాలును. అధర్మమునకుఁ దావేయుండదని భావము.పితృ

సేవకంటెఁ బితృవచనప్రకారము నడచుకొనుటకంటె గొప్పదనంబడు ధర్మాచరణమే లేదు. ఈ రెండు నొనరింపక శాస్త్రముం గలధర్మముల నాచరించిన నయ్యవి ధర్మములే కావని భావము. లోకమున సత్పుత్రుఁడు తండ్రికి శుశ్రూష చేయుచుఁ దదాజ్ఞ శిరసావహించి యొనరించువాఁడే ధర్మాచరణుఁడు. ఈనియమమును స్థాపించుటకే రాముఁ డవతరించెనని తేటపఱచెను. ఈ రెండు నొనరించువాఁ డన్నిధర్మముల నాచరించినట్లె యని సారము. ఇదియే శ్రీరామచంద్రుని సదుపదేశమని మన మెఱుంగవలయును.

"అభిషేచనికం భాండం కృత్వా రామః ప్రదక్షిణం,
శనైర్జగామ సాపేక్షో దృష్టిం తత్రావిచాలయన్. ౩౧
న చాస్య మహతీం లక్ష్మీం రాజ్యనాశోఽపకర్షతి,
లోకకాంతస్య కాంతత్వాచ్ఛీతరశ్మేరివ క్షపా." ౩౨

అని మూలము. పట్టాభిషేకమనఁగా ధర్మపాలనరూపమహోత్సవవిశేషము. కాన నయ్యవి మహాదీక్ష. దానికింపగుసాధనములు పరమపవిత్రములు. కావున వానికిఁ బ్రదక్షిణముచేసి రాముఁ డరిగెను. భరతాభిషేకముగూడఁ దనదే యగునన్న భావమే యపేక్షకుం గారణము. భరతుని నభిషేకము కాఁగా నది తనకే యన్వయించును. అనఁగాఁ దనపాదుకలకే యగు నన్నభావమున వానిని ప్రీతితో రామమూర్తి చూచెనని గ్రహింపందగు. రాజ్యనాశ మనఁగా రాజ్యభ్రంశము రామచంద్రుని పూజ్యురాలగులక్ష్మి నాకర్షింపఁజాలకపోయెను. అనఁగా నీరాజ్యప్రాప్తి గొప్పదిగా భావించినవాఁడు కాఁడు. అతితుచ్ఛమైనదని భావము. కావున నిది రాకపోయినందునఁ దనసంపదకు

భంగమని తలంచువాఁడు కాఁడయ్యెను. ఆమహనీయుని లక్ష్మి యనఁగా మహామాయ మహత్తరమైనది. ఇట్టి రాజ్య కోటులనుగాక యనేక బ్రహ్మాండములను గల్పించునది. కావున నిది యొకకొలంతగా శ్రీరాముఁడు భావింపలేదనియే యిందు గ్రహింపఁదగువిషయము.

"వాచా మధురయా రామస్సర్వం సమ్మానయన్ జనం,
మాతుస్సమీపం ధీరాత్మా ప్రవివేశ మహాయశాః."

అని మూలము. మనోహరములనఁగాఁ జెవులకుఁ బండువు చేయునవి. అట్టిమాటలచే నెల్లవారిని గారవించుచు ధీరాత్ముఁడు మహాయశుఁడు గావునఁ దల్లియింటికిఁ బోయెను తన యవతారఫలము లోకములకు సమకూర్ప సమయ మరుదెంచె నన్నసంతోషమున నెల్లవారల నుమ్మలికము గ్రమ్మకయుండ నాశ్వాసించుచుఁ దల్లి చెంతకుం బోయెను. సామాన్యులకుఁ గలుగుదుఃఖము మోమువనే తాండవమాడుచుండును. ఆస్థితి యందు వారు సరసవాక్కులు పలుకఁజాలరు. భగవంతున కట్టి దుఃఖము లంటవుగదా. కనుకనే శ్రుతిహితములగువాక్కుల చేత నెల్లర నూఱడించుచుఁ బోయెనని మన మెఱుంగవలయు. "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అను శ్రుతివాక్య ననుస రించి యానందమే పరమేశ్వరస్వరూపము. కావున నాలక్ష ణము కనంబడఁజేసెనని యీభాగము మనకుఁ దెలుపుచున్నది. ఇట్లు గ్రహించి సదానందరూపమును ధ్యానింపవలయును. అట్లు ధ్యానము చేయువారలకు సంసారతాపత్రయములు బాధింపఁజాలవని యోగులు పలుకుదురు.

"యాదృశీ భావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ"

అన్న లోకోక్తియు,

"యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్"

అన్న భగవద్గీతోక్తియుఁ బ్రమాణములు కాకపోవు కదా. కావునఁ బరమేశ్వరుని నానందబ్రహ్మమును సర్వకారణుని జక్కనిభక్తిమై నారాధింపవలయును. ఆరాధించుమార్గములలో ధ్యానమార్గ ముత్తమము మనోవీథి నెలకొల్పఁబడిన తేజోరూపమును ధ్యానించుచు నిరతిశయానందము ననుభవించుచుండుటయే జన్మసాఫల్యము. విగ్రహారాధనము చిరకాలము చేసినను ఫల మత్యల్పము. భగవంతునిరూపము భక్తులచే నిచ్ఛానురూపముగాఁ గల్పింపఁబడును. అయ్యవి [illegible]లు దాలుత మనోవీథి నెలకొనఁజాలదు. కావున విగ్రహములను నిర్మించుకొని పూజించు టవసరమయ్యెను. పాషాణాదులయందు భగవద్బుద్ధి పామరులకు ధ్యానము కుదురుటకుగా నుపకరించును. ఆవెనుక నయ్యది నిరర్థకమగును. నిర్జనస్థలమునే యోగులు కోరుదురు. ధ్యానమునకు వస్తుప్రాప్తి మక్కఱలేదు. నిశ్చలమనస్సుమాత్రమే యుండవలయు. అయ్యది పూర్వకర్మానుసారముగా లభించినయోగనిరతి ననుసరించియుండును. ఎప్పుడాసిద్ధి చేకూరునో ముక్తి యప్పుడు కరతలామలకము. ముక్తిస్థానమనఁగా నొకలోకము కాదు. అందు దివ్యహార్మ్యము లుండవు. అందు విహరించుటయు ముక్తి కానేరదు. అవ్యయానంద మనుభవించుమార్గము దొరకుటయే ముక్తి. ఆస్థితియందుండువాఁడు సమదర్శనుఁడై యుండును. పాంచభౌతికశరీరముతో నుండవచ్చును. వేఱొకరూపమున నుండవచ్చును.

ముక్తిస్థానము వైకుంఠమని కొందఱు, కైలాసమని కొందఱు, సత్యలోకమని కొందఱు, ఈమూఁడును గావు. ఇంకొక్కలోకమని మఱియుఁ గొందఱు చేతులం ద్రిప్పుచుఁ బలుకుదురు. అది యొకలోకమైనచో నాముక్తి యెవ్వరికిని వలదు. లోకము శాశ్వతమనుట వెఱ్ఱిమాట. ఆనమ్మకముకలవారల కదియు నొకవిధమగుముక్తియే కావచ్చును. కాని వారికిఁ బునరావృత్తి కలదు. ఇదియే యుపనిషన్మతము. యోగమత మిదియే. భగవదుపదేశ మిదియే. ఇంకొక్కటి కాదు.

ప్రకృత మనుసరింతును. మహానందసాగరమున నోలలాడుచు నితరులకు దారుణవృత్తాంతముగనున్నను శ్రీరామున కయ్యది శుభోదంతముగాఁ దోఁచెను. తనయవతారమునకు ఫలములు దుష్టసంహారశిష్టపాలనధర్మసంస్థాపనము లేకదా. వానికిఁ బ్రయత్నమే ముఖ్యసాధనము. తనయిచ్ఛాశక్తియగు సీతాసంకల్పమే కైక నట్లు ప్రోత్సహించెను. అసంగుఁడయ్యు శ్రీరాముఁడు సంగిభంగిఁ బ్రవర్తింపఁబూనెను. ఆమహాపురుషునిమనోవీథియం దానందము తాండవమాడుచున్నది. సుస్మితము మోమునఁ జెలరేఁగుచున్నది. ధర్మసంస్థాపనము చేయవలయునన్న సత్సంకల్పము బుద్ధియందుఁ దాండవము సల్పుచున్నది. తనకుఁ గష్టము గలిగెనే యని వగచుమిత్రులం గాంచిన వీరెంతపామరులా యన్నజాలి యుదయించుచున్నది. దండకారణ్యవాసుల రక్షించుకార్యమున నుత్సాహము పెరుగుచున్నది. అయోధ్యానివాసమున క్షణముగూడఁ గడపరాదన్న యాశయ మంకురించి పురికొల్పుచున్నది. తల్లికిం దెల్పఁబోవునపు డిట్టి లాభగవంతుఁడు పెక్కుముఖముల పంతో

షము వెల్లివిరియఁగా నొప్పుచున్నాఁడు. అష్టవిధ స్వగుణసంవృతుం
గాంచి మహానందమున నొప్పు నా శ్రీరామచంద్రుని రూపము
ధ్యేయమనుట యతిశయోక్తి కానేరదు. యోగులా రూపమునే
ధ్యానింతురు. కన్నులకు ఫలమన నదియే. అనేకజన్మార్జితసత్కర్మ
ఫల మదియే. యోగాభ్యాసజనితమహానందఫల మదియే.
కావున నట్టి ధర్మసంస్థాపనిరతచిత్తుఁడై మహాప్రసన్నవదనుం
గతుఁడై ప్రవృత్తిమార్గమునఁ బ్రవర్తించు నా దేవదేవుని
గరుణాశరధిని దాశరథిని నిర్మలమనస్సున ధ్యానించుటయే
యిక్కలికాలమున విశేషించి యుత్తమకార్యము. శ్రీరామ
భక్తులమనువా రెందఱో కలరు. దేవాలయములు కట్టఁబడు
చున్నవి. తరణోపాయమగు ధ్యానమార్గమును బోధించువా
రరుదుగ నుండుటనవచ్చును. ధనమునేకరించుట కిక్కాలమున
వేదాంతశాస్త్రము, భక్తిమార్గము, మంత్రోపదేశము నను నీ
మూఁడును ముఖ్యములుగ నున్నవి. పామరులు భగన్నామ
సంకీర్తనము చేయుచు, దానికి ఫలముగా మనస్సున నొక్క
గడియనేపయిన నాభగవత్కల్పితమూర్తిని ధ్యానించునభ్యా
సము చేయవలయును. దాననే యాపరమేశ్వరుఁ డానందిం
చును. భక్తులని వారల సంభావించును. కృతార్థులనుగా నొన
రింప నూహించును కావున విగ్రహారాధనము చేయువారుం
గూడ నామూర్తినే మనస్సున నొక్కక్షణకాలమైన నిలుపు
కొనఁ బ్రయత్నింతురుగాక. కపటనాటకసూత్రధారుల మోస
మునకు లోఁబడి ధనము పోఁగొట్టుకొనక యుందురుగాక. కట్టి
యున్న దేవాలయములే చాలును. అవి మానవుల నుద్ధరింపఁ
జాలవు. మహనీయధ్యాన ముద్ధరింపఁగలదు. కావునఁ దదభ్యాస

మునకై ప్రయత్నము చేయవలయు. ఇది కలియుగము. సనాతనాచారములు తాఱుమాఱగును. ధర్మపద్ధతులు తలక్రిందులగును. వానిని సరకుచేయక ప్రతిమానవుఁడు తనతరణోపాయమును జూచుకొనవలయును. దానికిందగుమార్గ మేదియని పరికింపవలయు. శ్రీపరమేశ్వరు నామసంకీర్తనము సర్వదా చేయుచుఁ, దచ్చరిత్రామృతమును గ్రోలుచుఁ, దుచ్ఛలయుపదేశముల నాసక్తిఁగొనక, యితరు లారాధించు దేవతల దూషింపక, సర్వమతము లాపరమేశ్వరునే మార్గభేదముల నాయాయి మానవులకుం దగినయట్లు దేశకాలముల నెఱింగి బోధించును గాన వానియాశయ మెఱుంగకయే వానిదూషింపక, పరమతములయందు నోర్పుగలిగి తమకు నభ్యాసమునఁ దెలిసినవాని నితరులకు మంచిమాటలచేఁ దెల్పుచు, వార లాదరింపనిచో దూషింపక శాంతము వహించుచు, ధర్మమార్గమును బెంపొందఁ జేయుచు భగవంతుని సేవింపవలయును. ఇంతకంటె నుత్తమము సులభమునగుమార్గము కానరాదు. కావున మానవులు భక్తిశ్రద్ధలతో శ్రీరామచంద్రుని సేవించి కృతార్థులు కావలయును.

"రామం రాజశిఖామణిం రఘుపతిం దేవారిదర్పాపహం
లోకానాం హితకారిణం గుణనిధిం కారుణ్యపుణ్యోదయం,
ముక్తావిద్రుమరత్నశోభితతనుం సౌందర్యహస్తాంబుజం
కౌసల్యాతనయం భజామి సతతం శ్రీజానకీనాయకం. ౧౮
రామం వీరాసనస్థం హృదయగతకరోదంచితజ్ఞానముద్రం
జానున్యాసక్తహస్తం క్షితివరతనయాభూషితం వామభాగే,
షట్కోణే వ్యాహరంతం పవనసుతయుతం మానసే మానయంతం
సుగ్రీవే సేవమానే దృఢశరధనుషా దక్షిణే లక్ష్మణేన. ౧౯

రామం సౌమిత్రిమిత్రం రఘుపతిమమలం రామచంద్రం రమేశం
రమ్యం శ్రీరాఘవేశం శుభలలితముఖం శుద్ధసత్వం సువీరం,
సీతాసౌందర్యపాత్రం సురమునివినుతం నీరదేందీవరాభం
వందే వందారుపాలం రజనిచరహరం రమ్యకోదండరామమ్."

ఈరీతిగా శ్రీరామచంద్రు నాకారమును మనస్సున నెలకొలిపి ధ్యానింపవలయును. మానసపూజానిరతులము కావలయును. అదియే యుత్తమోత్తమమార్గము. ఓం శాంతిః శాంతిః శాంతిః.

ధర్మరక్షణప్రయత్నమను మూడవప్రకరణము

సంపూర్ణము.

శ్రీ. శ్రీ. శ్రీ.

చెన్నపురి : వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్సు వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1932.